# పిల్లల కోసం
# ఆర్థిక శాస్త్రం

[ మార్క్స్ 'కాపిటల్'ని
ఆధారం చేసుకుని రాసిన పాఠాలు ]

రంగనాయకమ్మ

స్వీట్ హోమ్ పబ్లికేషన్స్
76, లేక్-సైడ్ కాలనీ
( దుర్గం చెరువు దగ్గిర )
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

పిల్లల కోసం

# అర్థిక శాస్త్రం

(పాఠాలు)

పేజీలు : 384

[ రాయల్ సైజులో
హార్డ్ బౌండ్ తో ]

ధర : 120 రూ.లు

**రచనా కాలం :**
2008 మే నించీ
2009 నవంబరు వరకూ

2009 డిసెంబరు నించీ,
2016 మార్చి వరకూ
**5** ముద్రణలు వచ్చాయి.
ఇది, **6**వ ముద్రణ : 2018 నవంబరు

**బొమ్మలు :**
**చింతాడ అప్పల రాజు**
( డ్రాయింగ్ టీచర్, విజయనగరం )

**కంపోజింగ్ & పేజ్ మేకప్ :**
**ఎమ్. శారద**

ముద్రణ :
చరితా ఇంప్రెషన్స్
1-19-1126/బి,
అజామాబాదు ఇండస్ట్రియల్ ఏరియా,
హైదరాబాదు - 520 020.

బైండింగ్:
**వై.వి.రెడ్డి బైండింగ్ వర్క్స్**
మూసారాంబాగ్, హైదరాబాదు - 36

ప్రతులకు :
అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ - 520 002
(ఫోన్ : 9440630378)

రంగనాయకమ్మ అడ్రస్ :
76, లేక్ సైడ్ కాలనీ,
(దుర్గం చెరువు దగ్గిర)
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033.

# విషయ సూచిక

ముందు మాట 6

1. 'డబ్బు' అంటే ఏమిటి'..... 8
2. 'వస్తువులు' అంటే ఏమిటి? 10
3. 'వస్తువుల్ని' ఎలా తయారు చేస్తారు? 12
4. చొక్కాని ఎవరు కుట్టారు? 15
5. ముడి పదార్థానికి, ముడి పదార్థం! 17
6. 'చెట్టు'కి ముడి పదార్థం ఏది? 21
7. సహాయక పదార్థాలు ........ 24
8. 'శ్రమ' అంటే ఏమిటి? ..... 28
9. వస్తువుల్ని తయారు చెయ్యని శ్రమలు 31
10. 'శ్రమ' అంటే - పనే, కానీ, ప్రతీ పనీ శ్రమ కాదు! 34
11. 'మారకాలు' అంటే ఏమిటి? 38
12. వస్తువు 'ఉపయోగపు ....... విలువ' 41
13. వస్తువుకి 'మారకం విలువ' 44
14. వస్తువుని తొందరగా చేస్తే? ఆలస్యంగా చేస్తే? 47
15. పాత శ్రమా, కొత్త శ్రమా .... 50
16. 'విలువ'ని ఎలా చూడగలం?53
17. వస్తువు విలువ, వస్తువుకి బైట ఎందుకు ఉంటుంది? 55
18. విలువ అసహజమైనది!.... 58
19. విలువ అంతా శ్రమదే! అది, ఏ పదార్థానికీ కాదు! 60
20. సహజ పదార్థమూ + శ్రమ = వస్తువు .. 63
21. బార్టర్ మారకాల సమస్య! 66
22. డబ్బు వచ్చేసింది!............ 69
23. 'డబ్బు'తో ఏం చేస్తారు? .. 72
24. 'ఉపయోగపు విలువ లేని, 'విలువ' మాత్రమే వున్న విచిత్ర వస్తువే - డబ్బు! 75
25. డబ్బు, మారకాలకు మధ్యవర్తా? 78
26. డబ్బు, సమస్త వస్తువులకూ 'విలువ రూపం!' 82
27. 'ఉపయోగపు విలువ' లేని 'విలువ' కూడా లేని మరింత వింత వస్తువు కాయితం డబ్బు! 85
28. డబ్బు స్థానంలోకి, బంగారం పోయి, కాయితం వచ్చిందా? 89
29. శ్రమలు చెయ్యడం ఎందుకు? 93
30. శ్రమల్లో తేడాలు............... 96
31. 'విలువ' అంటే శ్రమ; 'శ్రమ' అంటే విలువ కాదు 99

**32.** శ్రమ, 'విలువ'గా, మారడం, ఎలా జరుగుతుంది? 101

**33.** డబ్బు అనేది 'రూపం లేని శ్రమ!' 106

**34.** మానవ సంబంధాలు అంటే, శ్రమ సంబంధాలే! 110

**35.** 'శ్రమని దోచడం' మొదలైంది! 113

**36.** బానిస యజమానుల వికృత సంస్కృతి 116

**37.** పేద-ధనిక తేడాల కారణం 120

**38.** శత్రు వర్గాలు .................... 123

**39.** 'ఆస్తి' గురించి రావలసిన ప్రశ్న! 125

**40.** బానిసయజమానుల సమాజంలోనే వర్తకమూ - వర్తక లాభమూ అప్పులూ - వడ్డీలూ!......... 128

**41.** బానిస యజమానుల సమాజంలోనే 'రాజ్యపాలన' ప్రారంభం!. 132

**42.** బానిసలకు, మత గ్రంథాలు బోధించిన పాప పుణ్యాలూ, స్వర్గ నరకాలూ!134

**43.** యజమానీ శ్రామిక సంబంధాలు! 136

**44.** భూస్వాముల సమాజం .... 140

**45.** 'భూమి కౌలు' అంటే, శ్రమ దోపిడీ! 142

**46.** పెట్టుబడిదారీ విధానం ప్రారంభం! 148

**47.** పెట్టుబడి లక్ష్యం - లాభం! 151

**48.** పాత శ్రమా + కొత్త శ్రమా = ఉత్పత్తికి మొత్తం శ్రమ 155

**49.** 'ధర' గురించి కొన్ని అంశాలు 158

**50.** 'అదనపు శ్రమ' ఎలా జరుగుతుంది? 164

**51.** 'అదనపు విలువ'ని ఎవరెవరు తింటారు? 168

**52.** అదనపు శ్రమ అదనపు విలువ అదనపు ఉత్పత్తి.............. 173

**53.** 'పెట్టుబడి' బ్రహ్మాండమైన అబద్ధం! 179

**54.** లాభం వచ్చేది, పెట్టుబడికా, పెట్టుబడిదారుడికా? 185

**55.** భూస్వామ్య కౌలు, 2 భాగాలైంది! 189

**56.** శ్రమ ఎరగని కౌలు రైతు! 194

**57.** శ్రమ దోపిడీ, ఈ నాటికీ ప్రపంచమంతటా సాగుతూనే వుంది! 198

**58.** బూర్జువా మాంత్రికుడు! ... 200

**59.** 'ధర' గురించి ప్రధాన సందేహం! 204

**60.** 'విలువ' గురించి పరిశోధన 2 వేల సంవత్సరాల కిందట ప్రారంభమైంది! 211

**61.** మేధావుల అజ్ఞానాలు!...... 214

**62.** శ్రమ దోపిడీ జరుగుతుందనే రహస్యాన్ని కనిపెట్టింది ఎవరు? 217

**63.** ఉత్పాదక శ్రమలూ, అనుత్పాదక శ్రమలూ! ..... 220
**64.** అనుత్పాదక శ్రామికులు అదనపు విలువని ఇస్తారా? 223
**65.** పెట్టుబడిదారుడి పని స్తలంలో అనుత్పాదక శ్రమలు ... 229
**66.** 'ఉత్పత్తి సాధనాల విలువ' బదిలీ 232
**67.** వర్తక కార్మికులు అనుత్పాదక కార్మికులే! 237
**68.** దేశంలో వున్న డబ్బు అంతా ఉత్పాదక కార్మికుల శ్రమలదే! 242
**69.** ఉత్పత్తి తయారైన తర్వాత కూడా చేరే విలువలు 249
**70.** ఉత్పత్తి తయారైన తర్వాత 252
**71.** మారకం శ్రమలు విలువలుగా మారవు 256
**72.** కుటుంబ శ్రమలు!........... 261
**73.** పోటీ! అసహ్యమైన మాట! 267
**74.** ఉత్పత్తి శక్తి! .................... 269
**75.** పాలించే వర్గ భావాలే ప్రజల భావాలు! 274
**76.** భారీ యంత్రాలూ, విమానాలూ, కంప్యూటర్లూ, అన్నీ పనిముట్లే! సూది లాంటివే!...... 281
**77.** నిరుద్యోగం, పెట్టుబడిదారీ విధానం సృష్టి! 287
**78.** ప్రతీ జీతమూ 'శ్రమ శక్తి విలువ' కాదు! 294
**79.** పెట్టుబడిదార్ల ఆదాయాల్ని చూపించే కొన్ని మచ్చు తునకలు!.... 299
**80.** భారత దేశపు కులాలు 'దోపిడీ శ్రమ విభజన' ఫలితాలు! 307
**81.** పెట్టుబడిదారీ ధర!.......... 312
**82.** పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు 'లాభం' గురించి ఏం చెపుతారు? 315
**83.** పెట్టుబడిదారీ సృష్టి సంక్షోభాలు .................... 321
**84.** సంక్షోభాల గురించి మరికొంత 324
**85.** సంక్షోభాల వార్తలు కొన్ని .. 328
**86.** మానవులందరూ వర్గ మానవులే 'వర్గం' అనేది ఏక శిల కాదు! . 337
**87.** యుగ యుగాల మకిలితో వున్న కార్మిక వర్గం ........ 339
**88.** ఈ దోపిడీ ప్రపంచం మారదా?343
**89.** వర్గాల మధ్య సామరస్యంతో ఐక్యత ఏర్పడదా? .... 348
**90.** తల - ఆలోచించడానికి! .. 350
**91.** స్వర్ణ యుగం, వెనక కాదు, ముందు ఉంది 353
**92.** సమ సమాజం ప్రారంభం! 356
**93.** కమ్యూనిజం తర్వాత కమ్యూనిజమే! 362
**94.** కార్మిక వర్గం, సాధించ వలసిందేమిటి? . 366
**95.** భ్రమల్ని, వాస్తవాలు ఓడించి తీరుతాయి!......... 371

చివరి మాట 373. ఈ పుస్తకం ధర గురించి 378. పదాల పట్టిక 382.

# ముందు మాట

ఈ పుస్తకం పిల్లల కోసమే మొదలుపెట్టాను. ఈ పిల్లలు, 7, 8 తరగతుల నించీ 10 వ తరగతి వరకూ వున్న పిల్లలు.

పిల్లలకు, చిన్న తనం నించీ ఆటలూ పాటలూ కథలూ చాలా కావాలి. ఆ కథలు, మాయలతో మంత్రాలతో వున్నా, వాటితో పాటే పిల్లలకు సైన్సు విషయాలు కూడా అందుతూ వుండాలి. సైన్సు అంటే, మనం నివసించే ప్రకృతి గురించీ, మనం జీవించే సమాజం గురించీ, నిజమైన విషయాల్ని రుజువులతో సహా వివరించే జ్ఞానం.

పిల్లలు అమాయకులు. వాళ్ళు, ఇళ్ళల్లోనూ, స్కూళ్ళల్లోనూ, పెద్ద వాళ్ళు ఏది చెప్తే అదే నమ్ముతారు; అదే నేర్చుకుంటారు. పెద్ద వాళ్ళు, తమ పెద్ద వాళ్ళ నించి విన్నదే తమ పిల్లలకు చెపుతారు. తాము నేర్చుకున్నదే పిల్లలకు నేర్పుతారు. కానీ, పిల్లలకైనా, పెద్దలకైనా, సైన్సు విషయాలు అందినప్పుడే ఆలోచించడం మొదలవుతుంది.

ప్రకృతి విషయాల్లో, ప్రతీ సైన్సునీ నేర్చుకోనక్కర లేదు. వైద్య శాస్త్రం ప్రతీ మనిషికీ క్షుణ్ణంగా అక్కర లేదు. రోజువారీగా పాటించ వలసిన ఆరోగ్య సూత్రాలు తెలిస్తే చాలు. అనారోగ్యాలు మీద పడ్డప్పుడు, వాటి సంగతి వైద్యులు చూసుకుంటారు. వైద్యులకు తెలిసినంత శాస్త్రం, ప్రతీ మనిషికీ అక్కర లేదు. ఇతర ప్రకృతి శాస్త్రాల సంగతి కూడా అంతే.

కానీ, మనం జీవించే సమాజం గురించి చెప్పే శాస్త్రం సంగతి అలా కాదు. మనం మనుషులం; జంతువులం కాదు. జంతువులైతే పుట్టినవి పుట్టినట్టే జీవించి మరణిస్తాయి. వాటికి ఏ శాస్త్రాలూ, ఏ జ్ఞానాలూ, అక్కర లేదు. కానీ, మనుషులకు, మనుషుల సంబంధాల గురించి తెలియాలి. ఆర్థిక శాస్త్రమే, మనుషుల సంబంధాల్నీ, వారి జీవిత విధానాల్నీ వివరిస్తుంది. ఈ శాస్త్రమే, నిన్నటి - ఇవ్వాల్టి - రేపటి జీవితాల్ని చూపిస్తుంది. ఇది ప్రతి మనిషికీ తెలిసివుండాలి.

విజయనగరం నించి 'నానీ' అనే పిల్లల మాస పత్రిక ఒకటి వస్తూ వుండేది. ( ఎడిటర్: ఎన్.కె. బాబు. ) ఆ పత్రిక కోసమే, మొదట ఈ పాఠాలు ప్రారంభించాను. అప్పుడు, 'డబ్బు' వరకే చెపుదా

మనుకున్నాను. ఈ పుస్తకంలో వున్న 8 వ పాఠం వరకే ఆ పత్రికలో వచ్చింది. తర్వాత, ఆ పత్రిక ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆగిపోయింది. పిల్లల కోసం, మిగతా పాఠాలు కూడా చెప్పాలని దీన్ని పూర్తి చేశాను.

అయితే, పిల్లల కోసం ఇంత పుస్తకమా? ఇందులో వున్న చివరి పాఠాలు పిల్లలకు అర్థమవుతాయా? - అని, నాకే కొన్ని సార్లు సందేహాలు వచ్చాయి. 'పిల్లల కోసం' అనే దృష్టి తోనే పాఠాల్ని ఎక్కువ వివరాలతో చెప్పవలసి వచ్చింది. ఇది పిల్లల కోసం కాబట్టి, పుస్తకంలో అక్షరాల సైజు చాలా పెద్దది. చాలా చోట్ల బొమ్మలు. ప్రశ్నలూ - జవాబులూ. చివరి పాఠాల్లో పత్రికల వార్తలు కూడా. ఈ కారణాల వల్ల, పుస్తకం పెద్దది అయింది. కానీ, పాఠాలన్నీ చిన్నవే. ఈ మాత్రం పాఠాలు లేకపోతే, ఈ సైన్సుని కనీసంగా అయినా తెలుసుకోవడం సాధ్యం కాదు.

పిల్లల్లో అనేక స్థాయిల వాళ్ళు వుంటారు. పుస్తకాలు చదివే అలవాటూ, నేర్చుకోవాలనే ఆసక్తీ వున్న పిల్లలకు ఇది సమస్య కాదు. తర్కంతో సాగే విషయాల్ని అర్థం చేసుకోవడంలో సమస్య రాదు.

ఈ పాఠాల పేర్లూ, వాటిల్లో మాటలూ, వాటిల్లో పాత్రలూ, పిల్లల చెవుల్లో, మనసుల్లో, పడితే చాలు. అసలు ఇలాంటి శాస్త్రం ఒకటి వుందని పిల్లలకు తెలిస్తే చాలు. ఒక సారి చదివితే అర్థం కాని పాఠాన్ని ఇంకో సారి చదువుకుంటారు. ఇక అదంతా వాళ్ళ ఆసక్తి. పిల్లలకు ఎక్కడైనా అవసరమైతే, పెద్ద వాళ్ళు కొంచెం సహాయం చేస్తే, అసలు సమస్యే వుండదు.


అయితే, తెలియని ఏ శాస్త్రం నేర్చుకునేటప్పుడైనా, పెద్దలు కూడా పిల్లలతో సమానులే. పెద్దల్లో కూడా నూటికి 99 మందికి, సమాజం గురించి చెప్పే శాస్త్రం తెలీదు. దీని కోసం మార్క్స్ **'కాపిటల్'** చదవాలి. కానీ, అది మొదట్లో అసాధ్యం. అందుకే 'కాపిటల్'కి 'పరిచయం' గతంలోనే రాశాను. దాన్ని పెద్దలు తేలిగ్గానే చదువుకోవచ్చు. అయినా, దాని కన్నా ముందు ఈ పుస్తకం, ప్రారంభ పాఠాలుగా ఉపయోగ పడుతుంది. 'కాపిటల్' అంటే భయపడే, బద్ధకించే పెద్దల కోసం కూడా దీన్ని దృష్టిలో పెట్టుకున్నాను. పిల్లల పుస్తకాలు పెద్దలు కూడా చదవాలి; నేర్చుకోవాలి. పిల్లలకు నేర్పాలి.

**రంగనాయకమ్మ**

17-11-2009



# 1. 'డబ్బు' అంటే ఏమిటి?



## పిల్లలూ!

అమ్మాయిలూ, అబ్బాయిలూ!

మీకు, 'డబ్బు' అంటే ఏమిటో తెలుసా? అది తెలుసుకొనే పనే ఇప్పుడు చేద్దాం. - 'డబ్బు'గా మనకు కనపడేది చిన్న గుండ్రటి బిళ్ళ. లేకపోతే, చిన్న కాయితం ముక్క. అది ఇచ్చి పెన్సిళ్ళు కొంటాం, పెన్నులు కొంటాం, బిస్కట్లు కొంటాం, పుస్తకాలు కొంటాం. ఎన్నో వస్తువులు కొంటాం. డబ్బు ఇస్తే, ఏ వస్తువు అయినా వస్తుంది కదా? అయితే, "డబ్బు ఇస్తే వస్తువులు ఎందుకు వస్తాయి? డబ్బు అంటే ఏమిటి?" అనే సందేహాలు మీకు ఎప్పుడన్నా వచ్చాయా? ఎప్పుడూ వచ్చి ఉండవు. ఇలాంటి ప్రశ్నలు పెద్ద వాళ్ళకే రావు. ఇక పిల్లలకేం వస్తాయి?

"డబ్బు అంటే ఏమిటి?" అని, మీ ఇంట్లో పెద్ద వాళ్ళనో, మీ బళ్ళో టీచర్లనో, అడగండి! వాళ్ళేం చెపుతారో వినండి!



వాళ్ళేం చెపుతారంటే, "డబ్బు అంటే, దానితో మనం వస్తువులు కొనుక్కుంటాం కదా? అదే డబ్బు. వస్తువులు కొనుక్కోవటానికి ఉపయోగపడేదే డబ్బు!" అని చెపుతారు. అంతే చెపుతారు. ఆ జవాబుతోటే మీకు డబ్బు అంటే ఏమిటో తెలిసిపోతుందా? ఆ జవాబు సరిపోదు.

మళ్ళీ అడగండి! "డబ్బు ఇస్తే వస్తువులు ఎందుకు వస్తాయి? డబ్బు అంటే చిన్న బిళ్ళే కదా? లేకపోతే చిన్న కాయితం ముక్కే కదా? అందులో ఏం ఉంటుంది? ఆ కాగితం ముక్క ఇవ్వకుండా వస్తువులు తీసుకోకూడదా? మొన్న అత్తయ్య అరిసెలు తీసుకొచ్చింది. మనం డబ్బు ఇవ్వకుండానే తీసుకున్నాం కదా? డబ్బుతో వస్తువుల్ని కొనాలంటే, మనకు అసలు డబ్బు ఎలా వస్తుంది? అందరికీ డబ్బు ఎలా వస్తుంది? ఎందుకు వస్తుంది? ఎక్కడ నుంచి వస్తుంది?" - ఇలాగ ఇంకా కొన్ని ప్రశ్నలు అడగండి!.

కానీ, మీ అమ్మలూ, నాన్నలూ, ఒక్క ప్రశ్నకి కూడా సరిగా జవాబు చెప్పలేరు.



బళ్ళో టీచర్లు కూడా చెప్పలేరు. ఎందుకు చెప్పలేరంటే, వాళ్ళకి ఆ విషయాలు తెలీవు. తెలిస్తే చెప్పకుండా దాచుకోరు కదా? తెలీదు కాబట్టే చెప్పలేరు. కానీ ఆ మాట వాళ్ళు ఒప్పుకోరు. "మాకు తెలీదర్రా" అనరు. అంతా తెలిసినట్టే, మొదట చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెప్పుకొస్తారు. "డబ్బు ఇవ్వకపోతే వస్తువులెలా వస్తాయర్రా? ఊరికే వస్తాయా? ఆ మాత్రం తెలీదా? భలే అడుగుతున్నారే!" అని దబాయించి, మీ ప్రశ్నలన్నీ ఎగర గొడతారు.


అసలు నిజానికి పిల్లలు అలాంటి ప్రశ్నలు అడిగితే, పెద్ద వాళ్ళు చాలా ఆశ్చర్యపడాలి. “ అవును కదా? ఇన్నాళ్ళూ మనం ఆలోచించలేదు. డబ్బు అంటే చిన్న కాయితం ముక్కేగా? అది ఇస్తే వస్తువులు ఎందుకు రావాలి?” అని వాళ్ళు మళ్ళీ మళ్ళీ ఆశ్చర్యపోవాలి. డబ్బు అంటే ఏమిటో తెలుసు కోవాలని వాళ్ళకి కూడా ఆసక్తి కలగాలి.

కానీ, వాళ్ళకి ఏ ఆశ్చర్యాలూ వుండవు. అన్నిటికీ బద్ధకం! ఆశ్చర్యపోవడానికి కూడా బద్ధకం! ఆలోచించడానికి బద్ధకం! బుర్రలు ఉపయోగించడానికి బద్ధకం!

నిజానికి, డబ్బు గురించి ఇప్పుడు మనం కొత్తగా ఆలోచించ వలసిందేమీ లేదు. వెనకటి వాళ్ళే ఆలోచించి చెప్పేశారు. మనం అది తెలుసుకుంటే చాలు! డబ్బు అంటే ఏమిటో తెలుసుకోవాలంటే, ‘ వస్తువుల్ని కొనే గుణం’ డబ్బుకి ఎలా వచ్చిందో తెలుసుకోవాలి. అంత కన్నా ముందు, ‘ వస్తువులు’ అంటే ఏమిటో తెలుసు కోవాలి. డబ్బు కూడా ఒక వస్తువే. అందుకే ‘ వస్తువుల’ గురించి మొదట తెలుసు కోవాలి. ‘డబ్బు’ గురించి తెలుసు కోవడానికి మనం చాలా పాఠాలు చూడ వలసి వస్తుంది.



# ప్రశ్నలు




[ ప్రతీ పాఠం చివరా, ‘ ప్రశ్నలూ - వాటి జవాబులూ’ కూడా ఉంటాయి. కానీ ఈ మొట్ట మొదటి పాఠంలో, ప్రశ్నలే గానీ జవాబులు ఉండవు. ఈ ప్రశ్నలకు, ‘ జవాబులు’ మీరే చెప్పుకోండి! కొంచెం ఆలోచించి, చెప్పుకోవాలి. నోటి కొచ్చినట్టు చెప్పుకోకూడదు.]


1. ‘ డబ్బు అంటే ఏమిటి?’ అనే ప్రశ్న మీకు ఎప్పుడైనా వచ్చిందా? వస్తే, దాన్ని గురించి ఎవరిని అయినా అడిగారా?



2. డబ్బు అంటే ఏమిటో తెలుసుకోవాలని, ఈ పాఠం చదివినప్పుడైనా అనిపించిందా? అప్పుడైనా పెద్ద వాళ్ళని అడిగారా?



3. మీరు అడిగి వుంటే, వాళ్ళు ఏం చెప్పారు?
4. మీ దగ్గిర ఎప్పుడూ కొంచెం డబ్బు వుంటుందా? డబ్బుతో ఏం కొంటూ వుంటారు?
5. మీ జేబు లోనో, బాక్సు లోనో వుండే డబ్బు, ఎప్పుడన్నా పోయిందా? పోయిందని ఇంట్లో చెప్పారా?



★

# 2. ‘వస్తువులు’ అంటే ఏమిటి?

‘డబ్బు’ కూడా ఒక వస్తువే - అని చెప్పుకున్నాం. అయినా, డబ్బు అంటే అప్పుడే తెలిసినట్టు కాదు. మొదట ‘వస్తువులు’ అంటే ఏమిటో చూడాలి.

మనుషులు తయారుచేసేవే - వస్తువులు. మనుషులు తయారు చెయ్యకుండానే దొరికేవి - వస్తువులు కావు.

‘గాలి’ - వస్తువా? కాదు. అది మనుషులు తయారు చెయ్యకుండా ప్రకృతిలోనే సహజంగా ఉంది. దాన్ని, ‘ప్రకృతి సహజ పదార్థం’ అనాలి.



‘భూమి’ - వస్తువా? కాదు. దాన్ని మనుషులు చెయ్యలేదు. భూమి మీద - అడవులూ కొండలూ, నదులూ సముద్రాలూ, వుంటాయి. అవన్నీ ప్రకృతి సహజ పదార్థాలే. అడవిలో చెట్లకి కాయలూ పళ్ళూ ఉంటే, వాటిని మనుషులు చేశారా? లేదు కదా? కాబట్టి అలాంటి వన్నీ ప్రకృతి సహజ పదార్థాలే.

మనుషులు తయారుచేసే వాటినే ‘వస్తువులు’ అనాలి. మనం చదువుకుంటున్న ఈ పుస్తకం, ఒక వస్తువు. దీన్ని మనుషులే తయారు చేశారు కదా? మన శరీరాల మీద వున్న బట్టలన్నీ వస్తువులే. మనం కూర్చునే కుర్చీలూ బల్లలూ, పడుకునే మంచాలూ, దుప్పట్లూ, రాసుకునే పెన్నులూ పెన్సిళ్ళూ, మనం తినే అన్నాలూ కూరలూ, మనం నివసించే ఇళ్ళూ, చదువుకునే స్కూళ్ళూ, మనం ప్రయాణాలు చేసే బళ్ళూ సైకిళ్ళూ బస్సులూ రైళ్ళూ విమానాలూ, ఇదీ అదీ అని కాదు, ఇలాంటి వన్నీ మనుషులు తయారు చేసేవే కాబట్టి, ఇవన్నీ వస్తువులే.

రోజూ మనం ఎన్నెన్నో వస్తువుల్ని తయారు చేసుకుంటూ, వాటిని వాడుకుంటూ జీవిస్తున్నాం. ఈ వస్తువులేవీ లేని కాలం ఒకటి ఉండేది. అప్పుడు కూడా మనుషులు ఉండేవారు గానీ, వాళ్ళకి వస్తువులు తయారు చేసుకోవటం ఇంకా తెలిసేది కాదు. అప్పుడు ఏ వస్తువులూ లేవు.

భూమి మీద పచ్చ గడ్డీ, అనేక రకాల చెట్లూ, వాటికవే మొలిచి ఎదుగుతూ ఉంటాయి. ఆ చెట్లకి కాయలూ, పళ్ళూ ఉంటాయి. నీళ్ళ మడుగుల్లో, నదుల్లో, చేపలు ఉంటాయి. అడవుల నిండా కోళ్ళూ, కుందేళ్ళూ, లేళ్ళూ, దుప్పులూ వంటి జంతువులు ఉంటాయి.

వస్తువులు చేసుకోవడం తెలియని కాలంలో మనుషులు ఉంటే, వాళ్ళకి బట్టలు ఉండవు. వాళ్ళు జంతువుల్లాగానే బోసిగానే తిరిగేవారు. ఇళ్ళు లేవు కాబట్టి చెట్ల కిందా, కొండల్లో అక్కడక్కడా ఉండే గుహల్లోనూ, ఉండేవారు. తినడానికి



అన్నాలూ కూరలూ ఉండవు కాబట్టి, చెట్ల మీద దొరికే కాయలూ పళ్ళూ కోసుకుని తినేవారు. నీళ్ళ మడుగుల్లో దొరికే చేపల్ని చేతులతోనే పట్టుకుని, ఆ పచ్చి వాటినే తినేవారు. చేపల్ని పట్టడానికి అప్పుడు ‘వలలు’ లాంటి వస్తువులేవీ లేవు

కదా? అప్పటికి ‘ నిప్పు’ని రాజేసుకోవడం కూడా ఇంకా తెలీదు. కాబట్టి చేపల్నీ దుంపల్నీ నిప్పులో కాల్చుకోవడం తెలీదు. అప్పటి మనుషులు జంతువుల్లాగే గడ్డీ గాదం తింటూ ఉండే వారు. అలాగే ఎంతో కాలం జంతువుల్లాగ జీవిస్తూనే, క్రమంగా జంతువుల్ని వేటాడడం నేర్చుకున్నారు. ‘ నిప్పు’ని తెలుసు కున్నారు. దుంపల్నీ, చేపల్నీ, మాంసాన్నీ కాల్చుకోవడం నేర్చు కున్నారు. అవసరాలకు తగ్గట్టుగా మట్టితో కుండలు చేసుకోవడం లాంటి పనులతో ప్రారంభించి, రక రకాల వస్తువులు తయారు చేసుకోవడం సాగించారు. అలా చేసుకోవడం వల్లనే, శరీరాల మీదకు బట్టలు వచ్చాయి. నివసించడానికి ఇళ్ళు వచ్చాయి. తినడానికి బోలెడు వండుకునే పదార్థాలు వచ్చాయి. కాళ్ళకు చెప్పులు వచ్చాయి. చదువుకోవడానికి పుస్తకాలు వచ్చాయి. ఇదీ అదీ అని కాదు. ఇప్పుడు మనం వాడుకునే వస్తువులన్నీ వచ్చాయి.

అయితే, వస్తువుల్ని ఎలా తయారు చేస్తారో తెలుసా? అదే ఇప్పుడు చూడాలి.

# ప్రశ్నలూ - జవాబులూ

[ ఇక్కడి నించీ ప్రశ్నల కింద జవాబులు కూడా ఉంటాయి. ప్రశ్న చదివిన తర్వాత, దాని కింద వున్న జవాబుని వెంటనే చూడకండి! మొదట, మీరే జవాబు ఆలోచించండి! ఆ తర్వాతే, ప్రశ్న కింద వున్న జవాబుని చూడండి. మీ జవాబులో ఏదైనా పొరపాటు వుంటే, దాన్ని సరిచేసుకోండి! తర్వాత పాఠాల్లో కూడా ఇలాగే చెయ్యండి! ]

**1**. ‘ వస్తువు’ అంటే?

**జ**: మనుషులు తయారుచేసేది ఏదైనా వస్తువే.

**2**. ‘ భూమి’ ఏమిటి? వస్తువేనా?

**జ**: వస్తువు కాదు. అది మనుషులు తయారు చేసింది కాదు. భూమి ‘ ప్రకృతి సహ జంగా’ వున్నది.

**3**. ‘ ప్రకృతి’ అంటే?

**జ**: మనుషులు చెయ్యకుండానే వున్నది.

**4**. భూమీ, గాలీ - కాకుండా, ఇంకా కొన్ని సహజ పదార్థాల్ని చెప్పండి!

**జ**: అడవిలో చెట్లూ, జంతువులూ ; సము ద్రాల్లో చేపలు ; ఆకాశంలో మేఘాలు ; భూమిలో లోహాలు.

**5**. సూర్యుడూ, చంద్రుడూ, నక్షత్రాలూ, ఏమిటి?

**జ**: ప్రకృతి సహజ పదార్థాలే.

**6**.‘ మనుషులు’ ఏమిటి?


**జ**: మనుషులూ ప్రకృతిలో భాగమే.

**7**. కొన్ని వస్తువుల్ని చెప్పండి!

**జ**: పుస్తకం, పెన్ను, బట్టలు, చెప్పులు, ఇళ్ళు, అన్నం, దుప్పటి.

**8**. ‘ వస్తువు’ కీ, ‘ భూమి’ కీ వుండే తేడా ఏమిటో ఆలోచించండి!

**జ**: వస్తువు కొంత కాలానికి పనికి రాకుండా పోతుంది. భూమి ఎప్పుడూ ఉంటుంది.




★

# 3. 'వస్తువుల్ని' ఎలా తయారుచేస్తారు?

ఏదో ఒక ' వస్తువు' ని తీసుకోవాలి. ' చొక్కా' ని చూద్దామా? అది ఒక వస్తువే కదా? చొక్కాని ఎలా తయారుచేస్తారు?

మొదట ' బట్ట ' కావాలి. అంతేనా? బట్ట ఉంటే చాలా? దానితో చొక్కా తయారై పోతుందా? అవదు. ఇంకా 'సూది' కావాలి, 'దారం' కావాలి, 'గుండీలు' కూడా కావాలి. బట్టని కత్తిరించడానికి ' కత్తెర ' కావాలి.



సరే, బట్టా, సూదీ, దారం, కత్తెరా - వీటిని ఒక చోట పెడదాం. మనం దూరంగా కూర్చుందాం. కాస్సేపు అటు చూడకుండా ఊరుకుందాం. తర్వాత అటు చూస్తే, చొక్కా తయారైపోయి ఉంటుందా? అలా జరగదు. అక్కడ పెట్టిన వస్తువులన్నీ అలాగే చెక్కు చెదరకుండా వుంటాయి. ఎక్కడివి అక్కడే పడి వుంటాయి.

మరి చొక్కా తయారవ్వాలంటే, ఇంకేం కావాలి? - ఒక ' మనిషి' కూడా కావాలి. ఆ మనిషికి బట్టని కత్తిరించే పనీ, కుట్టే పనీ, తెలిసి ఉండాలి.

పార్వతికి ఆ పనులు చక్కగా తెలుసు ననుకుందాం. చొక్కా కుట్టమంటే, ఆ అమ్మాయి ఏం చేస్తుంది? చొక్కా కొలతలు ఎలా వుండాలో ఆ ప్రకారం, ఆ బట్టని, ఆ కత్తెరతో మొదట కత్తిరిస్తుంది. కత్తెర లేకపోతే, ఆ పని జరుగుతుందా? జరగదు. కత్తెర, ఉండి తీరాలి. బట్టని కత్తిరించిన తర్వాత, ఇక దాన్ని కుట్టాలి. మొదట సూది లోకి దారం ఎక్కించుకోవాలి. కుట్టు పని రాని వాళ్ళకి సూదిలోకి దారం ఎక్కించడం రాదు. అది వస్తేనే కుట్టు పని వస్తుంది. ఆ కుట్టే పని, చేతి కుట్టుతో అయినా చెయ్యవచ్చు, కుట్టు మిషను మీద అయినా చెయ్యవచ్చు. మిషను మీద చెయ్యాలంటే, అక్కడ కుట్టు మిషను కూడా కావాలి.

కానీ పార్వతికి చేతి కుట్టే వచ్చు నను కుందాం. ఆ బట్టని చేతి కుట్టుతోనే చొక్కాగా కుట్టేసింది. ఆ చొక్కాకి గుండీలు కూడా కుట్టింది. పని అంతా అయ్యాక, చొక్కాని గట్టిగా దులిపి చక్కగా మడతలు పెట్టి అక్కడ పెట్టింది. ఆ రకంగా, కొత్త చొక్కా తయారైంది. అది, కొత్తగా తయారైన వస్తువు. అది, ' పూర్తి అయిన వస్తువు'. ఇక దాన్ని వాడుకోవచ్చు.



ఇప్పుడు చెప్పండి! చొక్కా ఎలా తయారైంది? దాని కోసం బట్టా, సూదీ, దారం, గుండీలూ, కత్తెరా, కావాలి కదా? ఇవన్నీ ఏమిటి? - ఇవి కూడా వస్తువులే. ఇవన్నీ చొక్కా కన్నా ముందే తయారై వున్నాయి. ఇప్పుడు చొక్కా ఎలా తయారైందో అవీ


అలాగే తయారయ్యాయి. అవి లేకపోతే చొక్కా తయారయ్యేదా? బట్ట లేకపోతే, సూదీ దారాలూ లేకపోతే, కత్తెర లేకపోతే, చొక్కా తయారవుతుందా? కొత్త వస్తువు కోసం కావలసిన పాత వస్తువులు సిద్ధంగా వుంటేనే, కొత్త వస్తువు తయారవుతుంది.

అయితే, ఆ పాత వస్తువులకు, వాటితో వుండే అవసరాన్ని బట్టి, వాటికి వేరు వేరు పేర్లు వుంటాయి. చొక్కా కోసం మొదట ‘ బట్ట’ కావాలి కదా? ఆ బట్ట, చొక్కాకి ముడి వస్తువు. లేదా, ముడి పదార్థం. బట్టకి ఆ పేరు ఎందుకు ఉంటుందంటే, బట్టనే ఒంటి మీద కప్పుకుంటామా? అలా చెయ్యం. అది ఇంకా చొక్కా లాగ తయారవ్వాలి. అప్పటికి గానీ అది ఒంటి మీదకి రాదు. కాబట్టి ‘ బట్ట’గా ఉన్నంతసేపూ అది ముడి పదార్థమే. అది ఒక్కటే కాదు, చొక్కాలో ఇంకా ఏ యే వస్తువులు వున్నాయో అవన్నీ ముడి పదార్థాలే. దారం చొక్కాలోనే అక్కడక్కడా దూరిపోయి వుంది. గుండీలు కూడా చొక్కాకి అంటుకుపోయి వున్నాయి. అవన్నీ కలిసే చొక్కా అయింది కదా? కొత్త వస్తువులోకి చేరిన పాత వస్తువులన్నీ, కొత్త వస్తువుకి ముడి పదార్థాలే.



ముడి పదార్థాలు

మరి, ‘ కత్తెర ’ సంగతి ఏమిటి? ‘ సూది’ సంగతి ఏమిటి? ఇవి కూడా చొక్కాకి అంటుకుపోయి ఉన్నాయా? అలా ఉండవు. బట్టని కత్తిరించే పని అయిపోయాక, ఇక కత్తెర, బట్ట దగ్గిర్నించి దూరంగా వెళ్ళిపోతుంది. అలాగే, చొక్కాని కుట్టే పని అయిపోయాక, సూది, చొక్కాలో నించి బైటికి వచ్చేస్తుంది. కత్తెర గానీ, సూది గానీ, చొక్కాలో వుండవు. కాబట్టి ఇవి, ముడి పదార్థాలు అవవు. ఇలాంటి వాటికి, ఇంకో పేరు వుంది. ‘ పనిముట్లు’ అనే పేరు.



పనిముట్లు

పనులు చెయ్యడానికి కావలసిన పనిముట్లు ఇవి. కత్తెర - కత్తిరించే పనిముట్టు. సూది - కుట్టు పని కోసం పనిముట్టు. వీటికి ‘ పరికరాలు’ అనీ, ‘ సాధనాలు’ అనీ, వేరే వేరే పేర్లు కూడా ఉన్నాయి. ఏ పేరుతో చెప్పుకున్నా ఒకటే.

ఇప్పటికి ఏం తెలిసింది? కొత్త చొక్కా తయారవ్వాలంటే, ఏమేమి కావాలని తెలిసింది? 3 రకాల విషయాలు కావాలి.

(1) ముడి పదార్థాలు.
( బట్టా, దారం, గుండీలూ ).
(2) పనిముట్లు ( కత్తెరా, సూదీ ).
(3) కుట్టు పని చేసే మనిషి. (అంటే, పార్వతి కావాలా? పార్వతి అని కాదు. ఆ పని చేసే వాళ్ళు ఎవరో ఒకరు).

తయారైన చొక్కాని చూస్తే, అందులో ముడి పదార్థాలు కనపడతాయి గానీ, పనిముట్లు కనపడవు. పనిముట్లు చొక్కాలో ఉండవు కాబట్టి అవి కనపడవు. చొక్కా కోసం ఎలాంటి పనులు జరిగాయో

ఆ పనులు కూడా కనపడతాయి. బట్టని కత్తిరించినట్టూ, కుట్టినట్టూ, కనపడు తుంది. అయితే ఆ పనులు ఎవరు చేశారో, ఆ మనిషి కనపడదు.

కత్తిరించే పని ఎవరు చేశారు? పార్వతి చేసిందా, కత్తెర చేసిందా? కుట్టే పని ఎవరు చేశారు? పార్వతి చేసిందా, సూది చేసిందా? ఆలోచించండి!

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. 'చొక్కా' ఏమిటి?
**జ**: ఒక వస్తువు.

**2**. 'వస్తువు'కి ఇంకో మాట ఉందా?
**జ**: ఉంది. దాన్ని, 'ఉత్పత్తి' అని కూడా అనవచ్చు.

**3**. చొక్కా తయారవడానికి ఏమేమి కావాలి? అవి ఏమిటి?
**జ**: బట్టా, కత్తెరా, సూదీ, దారం, గుండీలూ, కావాలి. అవి కూడా వస్తువులే. అవి, చొక్కా కన్నా ముందే తయారై వున్న వస్తువులు. ఒక వస్తువుని (ఒక ఉత్పత్తిని) తయారు చెయ్యడానికి ఏ యే వస్తువులు కావాలో వాటిని, 'ఉత్పత్తి సాధనాలు' అనాలి.


**4**. ఆ వస్తువుల్ని ఎవరు, తయారుచేశారు?
**జ**: అది మనకు తెలియదు.

**5**. చొక్కాని తయారుచెయ్యడానికి బట్ట కావాలి. బట్ట - ముడి పదార్థం. కానీ, బట్ట తయారైనప్పుడు, అది, 'పూర్తి అయిన' వస్తువే కదా? అది, ముడి పదార్థం ఎలా అవుతుంది?
**జ**: బట్టని తయారుచేసినప్పుడు, అది 'పూర్తి అయిన' వస్తువే. కానీ, బట్టనే మనం ఒంటి మీద చుట్టుకుంటామా? అది ఇంకా దుస్తులుగా మారాలి కదా? బట్ట, చొక్కాగా మారడం అంటే, అంతకు ముందు తయారైవున్న వస్తువు, ఇప్పుడు ఇంకో వస్తువుగా మారుతోందన్నమాట! ఇంకో రకంగా మారవలసిన వస్తువు, ముడి పదార్థమే.

**6**. చొక్కాకి ముడి పదార్థం - బట్టా, దారమా, పత్తా?
**జ**: చొక్కా, బట్ట తోనే తయారవుతుంది కాబట్టి, బట్టే చొక్కాకి ముడి పదార్థం. ఆ బట్ట, దేనితో తయారైందో, అది చొక్కాకి అనవసరం. చొక్కాని తయారుచేసే ఉత్పత్తి క్రమంలో ముడి పదార్థం - బట్టే. బట్టకి ముడి పదార్థం - దారం. దారానికి ముడి పదార్థం - పత్తి.


**7**. 'కత్తెర' ఏమిటి? అది పూర్తి అయిన వస్తువా కాదా?
**జ**: కత్తెర - ఒక పనిముట్టు. ఇది, పూర్తి అయిన వస్తువే. ఇది ఇంకో వస్తువుగా మారదు. ప్రతీ పనిముట్టూ పూర్తి అయిపోయిన వస్తువే.

**8**. ఒక కొత్త వస్తువు తయారవడానికి 3 రకాల విషయాలు కావాలి. అవి ఏమిటి?
**జ**: (1) ముడి పదార్థాలు. (2) పని ముట్లు. (3)ఆ పని చేసే మనుషులు.


ముడి పదార్థాలు

ముడి పదార్థాలూ, పనిముట్లూ, కలిసి, 'ఉత్పత్తి సాధనాలు' అవుతాయి.

పనిముట్లు ★



# 4. చొక్కాని ఎవరు కుట్టారు?

బట్టని, పార్వతి కత్తిరించిందా, కత్తెర కత్తిరించిందా?

చొక్కాని, పార్వతి కుట్టిందా, సూది కుట్టిందా? ఆలోచించారా?

"ఇవేం ప్రశ్నలు? ఇంత చిన్న ప్రశ్నలా?" అనుకుంటున్నారా?

నిజమే, ఇవి చాలా చిన్న ప్రశ్నలే. కానీ, వీటి జవాబులు ఎంతో పెద్ద వాళ్ళకి కూడా తెలియవు. మహా మహా మేధావులకు కూడా తెలియవు. వెనకటి కాలంలో అయితే, అసలే తెలియవు. ఇప్పటి రోజుల్లో అయితే, కొందరికే తెలుసు గానీ, అందరికీ తెలియవు.

బట్టని కత్తిరించే పని చేసింది పార్వతే, కత్తెర కాదు. అలాగే, చొక్కాని కుట్టే పని చేసింది కూడా పార్వతే, సూది కాదు. పార్వతి, తన పనుల్లో, కత్తెరనీ, సూదినీ, తన పనిముట్లుగా వాడుకుంది. <u>పని చేసింది మాత్రం పార్వతే.</u>

కానీ తెలివి తక్కువ వాళ్ళు ఏమంటారంటే: "పనిముట్లు కూడా పని చేస్తాయి. ఏ పని అయినా మనుషులతో పాటు పనిముట్లు కూడా చేస్తాయి" అంటారు. అంటే, దీన్ని బట్టి చొక్కా సంగతి మనం ఎలా అర్థం చేసుకోవాలని వాళ్ళు అంటారు? "బట్టని కత్తిరించే పని, పార్వతీ కత్తెరా కలిసి చేశాయి. చొక్కాని కుట్టే పని కూడా పార్వతీ సూదీ కలిసి చేశాయి. ఇలా అర్థం చేసుకోవాలి" అంటారు వాళ్ళు. కానీ, అలా అర్థం చేసుకుంటే, అది పూర్తిగా తప్పు.

<u>ఏ పని అయినా జరిగిందంటే, దాన్ని చేసేది మనుషులే.</u> దాన్ని చెయ్యడానికి పనిముట్లు కావాలి. పనిముట్లు అనేవి, పని చేసే మనుషుల చేతుల్లో, ఆ పని జరగడానికి ఉపయోగపడతాయి. అవి, అవసరం అవుతాయి. కానీ అలా అవసరమవడం అంటే, ఆ పనిముట్లు కూడా మనుషుల్లాగే పనిచేస్తాయని కాదు. కత్తెరని, కింద పెట్టేసి దూరంగా కూర్చుంటే, కత్తెరే లేచి బట్టని కత్తిరిస్తుందా? మనిషి పట్టుకుంటే గానీ కత్తెర కదలదు. మనిషి కదిలిస్తేనే కత్తెర కదులుతుంది. అంటే, పని చేసేది మనిషే, కత్తెర కాదు.

అయితే, ఒక ప్రశ్న : కత్తెర లేకుండానే బట్టని కత్తిరించే పని పార్వతి తన చేతులతోనే చెయ్యగలదా? చెయ్యలేదు. పని జరగాలంటే పనిముట్లు కూడా వుండాలని చెప్పుకున్నాం కదా?

<u>ఏ పని జరగాలన్నా, పని చేసే మనిషీ ఉండాలి, ఆ పని కోసం అవసరమయ్యే పనిముట్లూ వుండాలి. రెండూ వుండాలి.</u> రెండూ వుండాలి కదా అని, రెండూ పని చేస్తాయి అనుకోకూడదు. పని చేసేది మనుషులే. పనిముట్లు కాదు.


కత్తిరించే పనే కాదు, కుట్టు పని అయినా అంతే. చొక్కాని కుట్టింది పార్వతే గానీ, సూది కాదు. సూదిని ఒక చోట పడేస్తే, అదే లేచి, దారాన్ని ఎక్కించుకుని చొక్కాని కుడుతుందా? అలా జరగదు కదా? మనిషి తీసుకుంటేనే సూది మనిషి చేతిలోకి వస్తుంది. సూది లోకి దారం

ఎక్కించడమూ, దానితో చొక్కాని కుట్ట డమూ, ఆ పనులన్నీ మనిషి చేసేవే గానీ, సూదీ దారం చేసేవి కాదు.

అయితే, సూది లేకుండానే పార్వతే తన చేతులతో, దారాన్ని బట్టలోకి ఎక్కించదు. సూది లేకపోయినా, ఒక తుమ్మ ముల్లో, చిన్న చీపురు పుల్లో అయినా వుండాలి. ఒక ముల్లు తోనే బట్టని కుడితే, అప్పుడు ఆ ముల్లే పనిముట్టు అవుతుంది. అలాంటి ఏ పనిముట్టూ లేకుండా పార్వతే, తన చేతులతోనే, చొక్కాని కుట్టలేదు. అంటే, ఆ పని జరగాలంటే, దానికి అవసరమయ్యే ఏదో ఒక పనిముట్టు వుండి తీరాలన్న మాట.

పనిచేసే మనిషి లేకపోయినా పని జర గదు, పనిముట్లు లేకపోయినా పని జర గదు. కానీ, ఏ పని జరగాలన్నా, ఆ పని చేసేది మనుషులే గానీ, పనిముట్లు కాదు. అంటే, 'పనిముట్లు కూడా పని చేస్తాయి' అనే మాట తప్పున్నమాట. ఈ విషయం సరిగా అర్థం చేసుకుంటేనే, తర్వాత చూడ బోయే విషయాలు సరిగా అర్థమవుతాయి.

ఇప్పటి వరకూ చొక్కా సంగతే చూశాం. ఇంకో వస్తువు సంగతి కూడా చూద్దామా? 'కుర్చీ' సంగతి చూద్దాం. కుర్చీ కూడా ఒక వస్తువే కదా? దాన్ని మనుషులే చేస్తారు గానీ, వాన చినుకు ల్లాగ కుర్చీలు ఆకాశం లోనించి వూడిపడవు కదా? కాబట్టి, ఇంకో వస్తువుగా కుర్చీ సంగతి చూద్దాం.



కుర్చీని చెయ్యాలంటే, దాని కోసం ఏం కావాలి? కుర్చీకి ముడి పదార్థం ఏమిటి? కుర్చీని దేనితో చేస్తారో అదే దానికి ముడి పదార్థం. అదే కుర్చీగా మారుతుంది. కుర్చీని చెక్కతో చెయ్యవచ్చు, రేకుతో చెయ్యవచ్చు. వెదురుతో చెయ్యవచ్చు, ప్లాస్టిక్‌తో చెయ్యవచ్చు, ఇంకా ఎన్ని రకా లుగా అయినా చెయ్యవచ్చు.

మనం, చెక్క కుర్చీ సంగతే చూద్దాం. చెక్కే, కుర్చీగా మారితే, అప్పుడు చెక్కే ముడి పదార్థం. అంతే కదా? ముడి పదార్థా లుగా ఇంకా కొన్ని కావాలి. మేకులూ, జిగురూ కూడా కావాలి. మేకులు, చెక్క ముక్కల్లోకి దిగిపోయి, ఆ ముక్కల్ని బిగించి వుంచుతాయి. జిగురు, చెక్క ముక్కల్ని గట్టిగా అంటించి వుంచుతుంది. ఆ మేకులూ, ఆ జిగురూ కూడా, కుర్చీలోనే వుండిపోతాయి. కాబట్టి, అవి కూడా ముడి పదార్థాలే. అవన్నీ కలిసే కుర్చీ అవుతాయి. కుర్చీకి రంగు కూడా వేస్తే, అది కూడా కుర్చీకి అంటుకుని వుండిపోతుంది కాబట్టి, అది కూడా ముడి పదార్థమే. రంగు వెయ్యని కుర్చీ అయితే, రంగు సంగతి అనవసరం. అది అక్కర లేదు.

సరే, కుర్చీకి ముడి పదార్థాల్ని చూశాం. మరి, ఆ పని చెయ్యడానికి కావలసిన పని ముట్లు ఏమిటి? మొదట, చెక్కల్ని ముక్క లుగా చెయ్యడానికి రంపం కావాలి. తర్వాత చెక్క ముక్కల్ని నున్నగా గీకడానికి గీకే గుల్ల కావాలి. చెక్క ముక్కల్లోకి మేకుల్ని

కొట్టడానికి సుత్తి కావాలి. ఇలాగ, కుర్చీ కోసం కొన్ని రకాల పనిముట్లు కావాలి.

అయితే, కుర్చీని తయారుచేసే పని పేరు ఏమిటి?

## ప్రశ్నలూ - జవాబులూ

**1**. ఇక్కడ 3 వాక్యాలు ఉన్నాయి. వాటిలో ఏది సరైనది?
(1) బట్టని, కత్తెర కత్తిరించింది.
(2) బట్టని, పార్వతీ, కత్తెరా కలిసి కత్తిరించారు.
(3) బట్టని, పార్వతి కత్తిరించింది.

**జ** : ఆఖరి వాక్యం సరైనది.



**2**. కత్తెర చేసే పని ఏమిటి?


**జ** : కత్తెర ఏ పనీ చెయ్యదు. పని చేసేది పనిముట్టు కాదు.

**3**. పనిముట్లు ఎందుకు?


**జ** : మనుషులు పనులు చేసేటప్పుడు, ఉపయోగపడడానికి.

**4**. ఏ పని జరగాలన్నా, 2 విషయాలు కావాలి. అవి ఏమిటి?

**జ** : (1) ఆ పని చేసే మనుషులు.
(2) ఆ పని కోసం అవసరమైన ముడి పదార్థాలూ, పనిముట్లూ.



**5**.



ఇవి, ముడి పదార్థాలా, పనిముట్లా?

**జ**: మేకులు ముడి పదార్థం. సుత్తీ, రంపమూ, పనిముట్లు.

★

# 5. ముడి పదార్థానికి, ముడి పదార్థం!

కుర్చీని తయారుచేసే పని పేరు ఏమిటి? చొక్కాని తయారు చేసే పనులైతే, కత్తిరింపూ, కుట్టూ, కదా? అలాగే, చెక్కతో వస్తువుల్ని తయారు చేసే పనికి కూడా ఒక పేరు వుంది. అది, ' వడ్రంగం.'




శివయ్య అనే ఆయన, చెక్క ముక్కల్ని చేతుల్లోకి తీసుకుని, బోలెడు పనిముట్లని ఉపయోగిస్తూ పని చేస్తే, కుర్చీ తయారైందనుకుందాం. ఇంతకు ముందు చొక్కా విషయంలో, ఒక ప్రశ్న వేసుకున్నాము, చొక్కాని పార్వతి కుట్టిందా - సూది కుట్టిందా - అని. అలాగే ఇప్పుడు కుర్చీ విషయంలో కూడా అలాంటి ప్రశ్న వేసుకుని జవాబు చెప్పుకోవాలి. కుర్చీని శివయ్య చేశాడా ; రంపం, సుత్తీ చేశాయా? లేకపోతే, ఆ పనిముట్లూ శివయ్యా కలిసి ఆ పనులన్నీ చేసినట్టా? - కుర్చీ పనులన్నీ శివయ్యే చేశాడు. పనిముట్లు, శివయ్య కదిపినట్టు కదులుతాయి గానీ, అవి స్వయంగా ఏమీ చెయ్యవు. కుర్చీని చేసింది శివయ్యే. రంపమూ కాదు, సుత్తీ కాదు.

సరే, ఇప్పుడు ఇంకో సంగతి. శివయ్య చేసిన కుర్చీకి ప్రధానమైన ముడి పదార్థం ' చెక్క ' కదా? మరి, ఆ చెక్క ఎలా తయారైంది? దాన్ని ఎవరు చేశారు? దాన్ని ఏ పదార్థంతో చేశారు? ఆ చెక్కకి, ముడి పదార్థం ఏమిటి?



' చెక్క ' ఎలా వస్తుందో మీకు తెలుసా, లేదా? ఏదైనా చెట్టుని నరికితే, చెక్క ముక్కలు వస్తాయి. అయితే, ఆ చెక్క ముక్కలకు ముడి పదార్థం, ఆ చెట్టు అవుతుందా? - అలా అవుతుందో లేదో తెలియాలంటే, ఆ చెట్టు ఎలా పెరిగిందో, దాన్ని ఎవరైనా పెంచారో లేదో తెలియాలి. అంటే, ఆ చెట్టు, మనుషులతో సంబంధం లేకుండా దానికదే అడవిలో పెరిగిన చెట్టా? లేకపోతే, మనుషులే బోలెడు పనులు చేసి పెంచిన చెట్టా? - ఆ సంగతి మొదట తెలియాలి. దాన్నిబట్టే ముడి పదార్థం సంగతి తెలుస్తుంది.



అడవిలో, దాని కదే పెరిగిన చెట్టు అయితే, అది ముడి పదార్థంగా లెక్కకు రాదు. ఆ చెట్టు, ప్రకృతి సహజ పదార్థం. 'ముడి పదార్థం' అంటే, అది, మనుషులు చేసిన పనుల వల్ల తయారైనదై వుండాలి. అడవి చెట్టు మనుషులు చేసేది కాదు. అది, ప్రకృతి సహజంగా, భూమిలో పడి వున్న విత్తనాల వల్ల, దానికై అదే మొలకెత్తి పెరుగుతుంది. అలాంటి ఒక చెట్టుని, వెంకన్న అనే మనిషి, చెక్క ముక్కలుగా చేశాడంటే, ఆ పనులు, ప్రకృతి సహజ పదార్థం మీద చేశాడని అర్థమే గానీ, ముడి పదార్థం మీద చేశాడని కాదు.

కానీ, తోటలో చెట్టుని చూడండి! ఆ చెట్టుని పెంచాలంటే, మనుషులు బోలెడు పనులు చెయ్యాలి. నాగళ్ళూ, పారలూ, గునపాలూ ఉపయోగిస్తూ మొదట భూమిని గుల్లగా చెయ్యాలి. తర్వాత విత్తనాలు పాతి, అప్పుడప్పుడూ నీళ్ళు పోస్తూ, కలుపు మొక్కల్ని తీసివేస్తూ, ఎరువులు జిమ్ముతూ, పురుగుల్నీ పుట్రల్నీ ఏరేస్తూ, అలా కొన్ని సంవత్సరాల పాటు ఎన్నో పనులు చేస్తేనే, తోటలో చెట్లు పెరుగుతాయి. అలా, మనుషులు పెంచిన చెట్టుని చెక్క ముక్కలుగా చేస్తే, ఆ చెక్క ముక్కలకు ఆ చెట్టు, ముడి పదార్థమే. ఎందుకంటే, ఆ చెట్టు, మనుషులు ఎన్నో పనులు చేసి పెంచినదే గానీ, సహజ పదార్థం కాదు కాబట్టి.

చెక్క ముక్కల్ని కొట్టే పనులు, అడవి చెట్టు మీద జరిగితే, ఆ చెట్టుని ముడి పదార్థం అనకూడదు. అది ప్రకృతి సహజ పదార్థం. ఆ పనులు, తోటలో చెట్టు మీద జరిగితే, ఆ చెట్టుని ముడి పదార్థం అనవచ్చు.

కుర్చీకి ముడి పదార్థం- చెక్క ముక్కలు కదా? ఆ చెక్క ముక్కలకు ఆధారం, ' తోట చెట్టు' అనే ముడి పదార్థమూ కావచ్చు. లేదా, ' అడవి చెట్టు' అనే సహజ పదార్థమూ కావచ్చు. ఆధారం లేకుండా చెక్కలు రావు. ఏదో ఒక చెట్టుని నరికితేనే చెక్కలు వస్తాయి.

అడవిలో చెట్టుని చూద్దాం. అది ఎలా వచ్చింది? - అది భూమిలో పెరిగింది.

ఆ ' భూమి' ఏమిటి? అది, ముడి పదార్థమా? - కాదు. ముడి పదార్థం అంటే, అది మనుషులు తయారు చేసినదై వుండాలన్న మాట మర్చిపోకూడదు. అడవిని ఏ మనుషులైనా తయారు చేశారా? ఆ భూమిని ఎవరైనా తయారు చేశారా? ఎవ్వరూ చెయ్యలేదు. కాబట్టి, ఆ భూమి, దాని మీద పెరిగిన ఏ చెట్టుకీ ముడి పదార్థం అవదు. ఆ చెట్లూ, ఆ భూమీ, అక్కడ కొండలూ కోనలూ వుంటే అవి అన్నీ, సహజ పదార్థాలే. వాటిని ఎవ్వరూ చెయ్యలేదు.

తోటలో చెట్టుని చూద్దాం. ఈ చెట్టుని, మనుషులు పెంచారు కదా? మనుషులు ఆ పని, భూమి మీదే చేశారు కదా? ఆ చెట్టుకి ఆ భూమి, ముడి పదార్థమా? కాదు. ఇక్కడ కూడా భూమి ముడి పదార్థం అవదు. మనుషులు ఆ భూమిని మొదట గుల్లగా దున్నాలంటే, ఆ దున్నే పని చెయ్యక ముందే భూమి వుంది. దాన్ని ఎవరూ చెయ్యలేదు. భూమి మీద దున్నే పని జరిగిందంటే, అది మొక్కల్ని పెంచడానికి జరిగిన పనే గానీ, భూమిని తయారు చెయ్యడానికి జరిగిన పని కాదు.

అడవిలో భూమి లాగే, తోటలో భూమి కూడా, ప్రకృతి సహజ పదార్థమే. భూమి ఏ సందర్భంలోనూ ముడి పదార్థం అవదు. ఎందుకంటే, బట్టే చొక్కాగా మారినట్టూ, చెక్కే కుర్చీగా మారినట్టూ, భూమే చెట్టుగా మారదు. భూమి ఎప్పుడూ ముడి పదార్థం అవదు.

అయితే, చెట్టుకి ముడి పదార్థం ఏది? విత్తనాలే ముడి పదార్థమా? - ఆలోచించండి!

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. కుర్చీకి ముడి పదార్థం ఏమిటి?

**జ**: కుర్చీని దేనితో తయారుచేస్తే అదే దాని ముడి పదార్థం. అది, చెక్క కావచ్చు, రేకు కావచ్చు, ప్లాస్టిక్ కావచ్చు, వెదురు కావచ్చు, ఇంకేదైనా కావచ్చు.

**2**. ముడి పదార్థం అంటే ఏమిటి? మనుషులు తయారుచేసినదా ; ప్రకృతి సహజ పదార్థమా?

**జ**: ముడి పదార్థం, మనుషులు తయారుచేసినదే. ప్రకృతి సహజంగా దొరికే పదార్థాన్ని ముడి పదార్థం అనకూడదు. సహజ పదార్థం మీద, మనుషులు కొంత పని చేసిన తర్వాతే అది ముడి పదార్థం అవుతుంది. →

**3**. అడవిలో, చెట్టు వుంది. ఒక మనిషి, ఆ చెట్టు కొమ్మని విరిచి చెక్కలుగా చేశాడు. ఆ చెక్కలకు ఆ చెట్టు, ముడి పదార్థం అవుతుందా?

**జ**: అవదు. ఆ చెట్టు, అడవిలో చెట్టు. అది సహజ పదార్థం. అది, మనుషులు చేసింది కాదు. కాబట్టి అది, చెక్కలకు ముడి పదార్థం కాదు.

**4**. ఆ చెక్కలతో, కుర్చీని చేస్తే?

**జ**: ఆ కుర్చీకి, ఆ చెక్కలు ముడి పదార్థమే. ఎందుకంటే, ఆ చెక్కలు, ఒక మనిషి తయారుచేసినవే గనక.

**5**. అడవిలో చెట్టు, ప్రకృతి సహజ పదార్థం కదా? మరి, దాని నించి తీసిన చెక్కలు కూడా సహజ పదార్థం ఎందుకు అవవు?

**జ**: ప్రకృతిలో ఒక పదార్థం ఎలా వుంటుందో, అలా వున్నప్పుడే అది సహజ పదార్థం. ఆ పదార్థాన్ని మనుషులు కొంచెం మార్చితే, అది ఇక సహజ పదార్థం కాదు. అడవిలో చెట్టు సహజమైనదే. కానీ, చెక్కల్ని ఒక మనిషి చేశాడు కాబట్టి, అవి సహజంగా వున్న పదార్థం కాదు.

**6**. అలాంటిదే ఇంకో ఉదాహరణ ఉందా?

**జ**: అడవి భూమిలో పెరిగిన దుంపలు సహజ పదార్థం. వాటిని, ఒక మనిషి బైటికి తీస్తే, బైటికి వచ్చాక అవి సహజ పదార్థం కాదు.

**7**. తోటలో చెట్టుకి ముడి పదార్థం ఏమిటి? అది భూమిలో పెరిగింది కాబట్టి, భూమే ముడి పదార్థమా?

**జ**: కాదు. భూమి, దేనికీ ముడి పదార్థం అవదు. భూమి మీద ఎన్నో చెట్లు పెరుగుతాయి. ఎన్నో పనులు జరుగుతాయి. అయినా, భూమి, ముడి పదార్థం అవదు.

**8**.



ఇది ఏమిటి?

**జ**: అడవీ, కొండా. ఇవి, సహజ పదార్థాలు.

**9**.



ఇది ఏమిటి?


**జ**: చెరగడం అనే పని చెయ్యడానికి అవసరమైన పనిముట్టు.

**10**.



ఇది ఏమిటి?

**జ** : సహజ పదార్థం.



**11.** ఇది ప్రకృతి సహజ పదార్థమా, వస్తువా?


**జ**: అది ఎలా పెరిగిందో తెలియకుండా జవాబు చెప్పలేము. ఆ పువ్వు అడవి చెట్టుకి పూసినది అయితే, ప్రకృతి సహజ పదార్థమే. తోటలో గానీ, ఇంటి పెరటిలో గానీ, మనుషుల శ్రమతో పెరిగినది అయితే, అది వస్తువే. సజీవ వస్తువు.

★

# 6. 'చెట్టు'కి ముడి పదార్థం ఏది?

ఒక ముడి పదార్థంతో, ఒక కొత్త వస్తువుని తయారుచేస్తే, ఆ కొత్త వస్తువు బరువు, ఆ ముడి పదార్థం బరువు కన్నా ఎక్కువగా వుంటుందా, తక్కువగా వుంటుందా, సమానంగా వుంటుందా?

కొంత బట్టా, కొంత దారమూ, కొన్ని గుండీలూ - ఈ ముడి పదార్థాలతో ఒక చొక్కాని తయారుచేశాం. ఆ ముడి పదార్థాల బరువు కన్నా ఆ చొక్కా బరువు, పెరుగుతుందా, తగ్గుతుందా, సమానమా?



- తగ్గుతుంది. ఎందుకంటే, బట్టని కత్తిరించేటప్పుడు, చిన్న చిన్న ముక్కలు రద్దుగా పోతాయి. అలాగే, దారంలో నించి కూడా కొన్ని దారం ముక్కలు, రద్దుగా పోతాయి. గుండీల విషయం అయితే, వాటి నించి పోయేదేమీ వుండదు. అవి బైట వున్నా, చొక్కాకి అంటుకుని వున్నా, వాటి బరువు ఒక్కలాగే వుంటుంది. కానీ బట్ట నించీ, దారం నించీ, రద్దులు పోతాయి కాబట్టి, వాటి బరువు కన్నా, వాటితో తయారయ్యే చొక్కా బరువు తక్కువగానే వుంటుంది.

చొక్కా సంగతే కాదు. ఏ వస్తువు సంగతైనా అంతే. కుర్చీ సంగతి చూడండి! చెక్కని కుర్చీగా చేసేటప్పుడు, చెక్కలో నించి బోలెడు రద్దు పోతుంది. చెక్కలోకి దిగే మేకుల బరువు ఎప్పటి లాగే వున్నా, చెక్కలో నించి రద్దు పోతుంది కాబట్టి, దానితో తయారయ్యే కుర్చీ బరువు, ముడి పదార్థాల బరువు కన్నా తగ్గుతుంది.

చొక్కా, కుర్చీ - ఇలాంటివి నిర్జీవ వస్తువులు. ఇలాంటి వస్తువుల విషయంలో, ముడి పదార్థాలు స్పష్టంగా తెలుస్తాయి. ఆ ముడి పదార్థాల బరువుల కన్నా, వాటితో తయారయ్యే వస్తువుల బరువులు, తక్కువగానే ఉంటాయి.

కానీ, చెట్లూ, పిట్టలూ, జంతువులూ వంటివి నిర్జీవ వస్తువులు కావు. అవి మనుషులతో సంబంధం లేకుండా అడవుల్లో పెరిగితే, అప్పుడు అవి ప్రకృతి సహజ పదార్థాలే గానీ, వస్తువులు కావు. కానీ వాటిని మనుషులు పెంచితే, అవి 'వస్తువులే'. అవి, సజీవ వస్తువులు. జీవం వున్న వస్తువులు. ఇలాంటి జీవం వున్న వస్తువుల విషయంలో, 'ముడి పదార్థం' అనే మాటకి అవకాశం వుండదు. ఇక్కడ ఆ మాట కుదరదు. వర్తించదు.

'చెట్టు' సంగతి చూద్దాం. చెట్టుని పెంచాలంటే, దానికి ముడి పదార్థం ఏది? విత్తనమా? - కాదు. ఎందుకంటే, విత్తనాన్ని ముడి పదార్థంగా అనుకుంటే, చొక్కా ఉదాహరణలో జరిగినట్టే ఇక్కడ కూడా జరగాలి. బట్ట బరువు కన్నా చొక్కా బరువు తక్కువగా వున్నట్టు, విత్తనం బరువు కన్నా దానితో తయారయ్యే చెట్టు బరువు తక్కువగా వుండాలి కదా? కానీ ఇక్కడ అలా జరగదు. విత్తనం బరువు కన్నా, దాని వల్ల వచ్చే చెట్టు బరువు, అనేక వేల, లక్షల

రెట్లు ఎక్కువగా వుంటుంది. కాబట్టి, విత్తనాన్ని ముడి పదార్థంగా అనుకోవడం కుదరదు.

అసలు విత్తనం నించి మొక్క మొలవడానికి గానీ, ఆ మొక్క చెట్టుగా ఎదగడానికి గానీ, విత్తనం ఒక్కటే చాలదు. దానితో పాటు, భూమిలో సారమూ, నీరూ, గాలీ, సూర్య రశ్మీ - ఇవన్నీ కూడా కావాలి. ఇవన్నీ కలిస్తేనే మొక్క తయారై ఎదుగుతుంది.

అయితే, చెట్టు పుట్టడానికీ, ఎదగడానికీ, అవన్నీ కావాలి కాబట్టి, వాటన్నిటినీ చెట్టుకి ముడి పదార్థాలు అనుకోవాలా? - అది కూడా కుదరదు. ఎందుకంటే, ఈ విషయంలో కూడా దీన్ని చొక్కా ఉదాహరణతో పోల్చి చూడాలి. ముడి పదార్థం అనేది, ఒక సారి కొత్త వస్తువుగా మారిపోయిన తర్వాత, ఇక ఆ ముడి పదార్థం పాత్ర అయిపోతుంది. ఆ కొత్త వస్తువు కోసం మళ్ళీ మళ్ళీ కొత్త ముడి పదార్థం అందుతూ వుండనక్కరలేదు. బట్ట, చొక్కాగా మారిపోయిన తర్వాత, ఆ చొక్కా కోసం, మళ్ళీ మళ్ళీ కొత్త బట్ట అందుతూ వుండాలా? - అక్కరలేదు. కానీ, ' చెట్టు' సంగతి అలా వుండదు. అది విత్తనం నించి మొలకెత్తిన తర్వాత, అది పెరగడానికి, నీరూ గాలీ సూర్య రశ్మీ - లాంటి వన్నీ ప్రతి రోజూ కావాలి. చెట్టు ఎంత పెరగాలో అంత పెరిగిపోయిన తర్వాత ఇక ఆ పదార్థాలు అక్కరలేదా? - అలా అనడానికి వీలు లేదు. చెట్టు ఎంత పెరిగినా, ఆ తర్వాత కూడా దానికి నిత్యం నీరూ, సూర్య రశ్మీ, అన్నీ కావాలి. అవి అందడం ఆగిపోతే, చెట్టు చచ్చిపోతుంది. అంటే, గాలీ, నీరూ లాంటి పదార్థాలు, చెట్టు ఎదగడానికీ, జీవించ డానికీ, నిత్యం అవసరమయ్యే ఆహార పదార్థాలే గానీ, చెట్టు పుట్టడానికి మొట్ట మొదట ఒక్క సారి మాత్రమే అవసరమయ్యే పదార్థాలు కావు. అందుకే అవి ముడి పదార్థాలు కావు. విత్తనం గానీ, నీరూ గాలీ లాంటివి గానీ, ఇవన్నీ చెట్టు కోసం అవసరమే. కానీ వాటిని ముడి పదార్థాలు అనకూడదు.

చొక్కా, కుర్చీ - లాంటి నిర్జీవ వస్తువుల విషయంలోనే 'ముడి పదార్థం' అనే మాట కుదురుతుంది. చెట్లూ, పిట్టలూ, జంతువులూ - లాంటి సజీవ వస్తువుల విషయంలో, ఆ మాట కుదరదు.

### ముడి పదార్థాలు లేకుండా తయారయ్యే వస్తువులు :

నిర్జీవ వస్తువుల విషయంలో కూడా, కొన్ని పనుల్లో ముడి పదార్థాలు వుండవు. అలాంటి పనుల్నీ, ఆ పనులతో తయారయ్యే వస్తువుల్నీ కొన్నిటిని, ఇప్పుడు చూస్తాం. భూమిలో ' బొగ్గు గని' వుంది. ఆ బొగ్గు కావాలంటే, దాన్ని తవ్వుకోవాలి. ఆ భూమిని తవ్వి, బొగ్గుని తీసి బైటపెడితే, ఆ బొగ్గు - నిర్జీవ వస్తువు. అయితే, ఆ నిర్జీవ వస్తువు కోసం, మొదట ఉపయోగించిన ముడి పదార్థం ఏది? - ఏదీ లేదు. భూమిలో వున్న ఆ బొగ్గు, ప్రకృతి సహజంగా తయారై వుంది. దాన్ని బైటికి తీయాలంటే, తవ్వకం పనే జరగాలి గానీ, దానికి ఏ ముడి పదార్థమూ అక్కర లేదు.

భూమిలో వున్న దుంపలూ, లోహాలూ, నూనెలూ వంటి సహజ పదార్థాల్ని బైటికి

తీసేటప్పుడూ ; అడవుల నించి పళ్ళనీ, చెట్లనీ, పిట్టల్నీ, జంతువుల్నీ తీసుకునేటప్పుడూ ; నదుల్లో, సముద్రాల్లో దొరికే పదార్థాల్ని తీసుకునేటప్పుడూ - ఇలాంటి ఏ పనిలోనూ ముడి పదార్థం వుండదు.

అంటే, ముడి పదార్థం అనేది, కొన్ని పనుల్లోనే వుంటుంది గానీ, అన్ని పనుల్లోనూ వుండదు. కానీ, 'పనిముట్లు' అయితే, అన్ని రకాల పనుల్లోనూ వుండాలి. ముడి పదార్థాలు వుండే పనుల్లో గానీ, అవి వుండని పనుల్లో గానీ, అన్ని పనుల్లోనూ పనిముట్లు వుండాలి.

వస్తువులు తయారవడానికి, ముడి పదార్థాలూ, పనిముట్లూ వుంటే చాలా? ఇంకే వస్తువులూ అక్కర లేదా? అవి, ముడి పదార్థాలు గానీ, పనిముట్లు గానీ, కాకూడదు. అలాంటి వస్తువులు ఏమైనా కూడా కావాలా? - ఆలోచించండి!


# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ఒక వస్తువు కొత్తగా తయారైంది. దాని కోసం, ముడి పదార్థాలూ, పనిముట్లూ, ఖర్చయ్యాయి. ఆ కొత్త వస్తువు బరువు, ముడి పదార్థాల్ని బట్టి వుంటుందా, పనిముట్లని బట్టి వుంటుందా?

**జ** : కొత్త వస్తువు బరువు, దాని ముడి పదార్థాల్ని బట్టే వుంటుంది. ముడి పదార్థాల బరువు కన్నా కొంత తక్కువ బరువుతోనే కొత్త వస్తువు వుంటుంది. పనిముట్ల బరువుతో దానికి సంబంధం వుండదు. పనిముట్లు, ఆ వస్తువులో ఉండవు.


**2**. ఒక విత్తనంలో నించి చిన్న మొక్క వచ్చింది. ఆ మొక్క ఇంకా పెరగడానికి, భూమిలో వున్న సహజ సారమూ, నీరూ, సూర్య రశ్మి, గాలీ, ఎరువులూ - ఇవన్నీ కలుస్తాయి. అయితే, ఆ అంశాలన్నిటినీ మనం తూచగలిగితే, వాటి బరువు కన్నా చెట్టు బరువు, ఎక్కువా - తక్కువా - సమానమా?

**జ** : విత్తనాన్ని మాత్రమే తీసుకుని చూస్తే, విత్తనం బరువు కన్నా చెట్టు బరువు అనేక లక్షల రెట్లు ఎక్కువ. కానీ, చెట్టు, ఏ యే అంశాలతో పెరిగిందో, ఆ అంశాలన్నిటినీ <u>తూచగలిగితే</u>, వాటి బరువూ, చెట్టు బరువూ, పూర్తిగా సమానంగా వుంటాయి. ఇతర అంశాలు వచ్చి చేరకుండా చెట్టు బరువు పెరగదు. ఒక చోటు నించి ఒక నలకంత బరువు వచ్చి చేరితేనే, ఇంకో చోట బరువు పెరుగుతుంది.



**3**. ఈ దుంపలు సహజ పదార్థమా, కాదా?

**జ** : ఆ చెట్టు, మనుషుల శ్రమతో పెరిగిందో లేదో తెలిస్తేనే, అది చెప్పగలము.

**4**. 

ఇది సహజ పదార్థమా?

**జ** : కాదు, మనుషులు చేసిన వస్తువే.

**5**.  ఇది ఏమిటి?

**జ** : వస్తువు. ★

# 7. సహాయక పదార్థాలు

ముడి పదార్థాలకూ, పనిముట్లకూ, 2 తేడాలు వుంటాయి.

1 ) బట్టతో చొక్కా తయారైతే, ఆ బట్టే చొక్కాగా మారిపోతుంది. చొక్కాని కుట్టిన దారం కూడా చొక్కాలోకి చేరిపోతుంది. అలాగే, చెక్కతో కుర్చీ తయారైతే, ఆ చెక్కే కుర్చీగా మారిపోతుంది. మేకులు కూడా కుర్చీలోకి చేరిపోతాయి. కానీ, ' పనిముట్ల' సంగతి అలా వుండదు. బట్టని కత్తిరించే కత్తెర గానీ, బట్టని కుట్టే సూది గానీ, చొక్కా లోకి చేరవు. అవి చొక్కాలో వుండిపోవు. కుర్చీని తయారుచేసే సుత్తీ, కత్తీ, రంపం లాంటి పనిముట్లేవీ కుర్చీలోకి చేరవు. - ఇది, ముడి పదార్థాలకూ, పనిముట్లకూ, మొదటి తేడా.

2 ) బట్టా, దారం - అనే ముడి పదార్థాలతో చొక్కాని తయారుచేసినప్పుడు, ఆ ముడి పదార్థాల ఆకారాలు మారిపోతాయి. బట్ట, బట్టగా వుండదు. దారం, దారంగా వుండదు. వాటి ఆకారాలు, చొక్కా ఆకారం లోకి మారిపోతాయి. అలాగే, చెక్క ముక్కలతో కుర్చీని చేసినప్పుడు, చెక్క ముక్కల ఆకారాలన్నీ కుర్చీ ఆకారంలోకి మారిపోతాయి. ఏ ముడి పదార్థం సంగతైనా ఇంతే. కానీ, పనిముట్ల సంగతి అలా కాదు. కొత్త వస్తువు తయారయ్యేటప్పటికి, పనిముట్ల ఆకారాలు మారవు. అవి, ఎప్పటి ఆకారాల తోటే వుండి పోతాయి. బట్టని కత్తిరించాక కూడా కత్తెర, కత్తెర లాగే వుంటుంది. కుర్చీని చేశాక కూడా సుత్తి, సుత్తి లాగే వుంటుంది. అలాగే, నాగలీ, మగ్గం, రంపం లాంటి ఏ పనిముట్టు అయినా, అది ఎంత పాత బడిపోయినా, వాటి ఆకారాలు ఎప్పటిలాగే వుంటాయి. - ఇది, ముడి పదార్థాలకూ, పనిముట్లకూ, రెండో తేడా.

ఈ తేడాల్ని బట్టి, ఏదైనా కొత్త వస్తువు తయారయ్యేటప్పుడు, అక్కడ ఏ వస్తువులు ముడి పదార్థాలుగా వున్నాయో, ఏ వస్తువులు పనిముట్లుగా వున్నాయో, అర్థం చేసుకోవచ్చు.

వస్తువుల్ని తయారు చెయ్యాలంటే, ముడి పదార్థాలూ, పనిముట్లూ, కావాలి కదా? కానీ, కొన్ని రకాల వస్తువులు తయారవ్వాలంటే, ఆ రెండు రకాలే చాలవు. ఇంకో రకం వస్తువులు కూడా కావాలి. వాటి పేరు ' సహాయక పదార్థాలు'. అంటే, సహాయం చేసే పదార్థాలు. ఇవి, ముడి పదార్థాలూ కావు, పనిముట్లూ కావు. కానీ, కొన్ని వస్తువులు తయారవడానికి ఇవి కూడా కావాలి. ఇవి ఏమిటో చూడాలంటే, మొదట వంటింట్లోకి వెళ్ళి 'వంట పని' ని చూస్తే, ఇవి తేలిగ్గా అర్థమవుతాయి.

' అన్నం' తయారవ్వాలంటే, ఏమేమి కావాలి? ముందు, ' బియ్యం' కావాలి. అవి అన్నంగా ఉడకటానికి 'నీళ్ళు' కావాలి. ఆ రెండూ కలిసి, ' అన్నం' అవుతుంది. అంటే, బియ్యమూ నీళ్ళూ, అన్నానికి, ముడి పదార్థాలు.

ఈ ' వంట పని' జరగడానికి ఇంకా

ఏం కావాలి? - 'గిన్నెలు' కావాలి. 'పొయ్యి' కావాలి. ఇవి పనిముట్లు.

అంతేనా? ముడి పదార్థాలూ, పనిముట్లూ వుంటే, అన్నం తయారైపోతుందా? - అప్పుడే కాదు. పొయ్యి మండడానికి కట్టెలు కావొద్దూ? పొయ్యి మీద పెట్టిన బియ్యం ఉడకాలంటే, కట్టెలు మండి పోయి బూడిదై పోతాయి. ఈ కట్టెలు ఏమిటి? ముడి పదార్థాలా? - కాదు. ఇవి, అన్నంలో కలిసి వుండవు కాబట్టి, ఇవి ముడి పదార్థాలు కావు. అయితే, కట్టెలు - పనిముట్లా? - కాదు. వాటి ఆకారాలు మారకుండా వుండవు కదా? మంటలో కట్టెల ఆకారాలు మారిపోతాయి కదా? కాబట్టి, అవి పనిముట్లు కూడా కావు.



అయితే మరి కట్టెలు ఏమిటి? అవి ఏ కోవలోకి వస్తాయి? వాటిని, 'సహాయక పదార్థాలు' - లేదా, 'సహాయక వస్తువులు' అనాలి. కట్టెలతో కాకుండా కిరసనాయిలుతో గానీ, గ్యాస్‌తో గానీ, పొయ్యి మండవచ్చు. మంట కోసం అవసరమయ్యేది ఏదైతే అదే సహాయక పదార్థం. అది, ముడి పదార్థమూ కాదు, పనిముట్టూ కాదు.

అన్నం వండే ముందు బియ్యాన్ని నీళ్ళతో కడగాలి కదా? ఆ నీళ్ళు ఏమిటి? ముడి పదార్థమా? కాదు. బియ్యం ఉడకడం కోసం బియ్యంలో పోసే నీళ్ళు అయితే ముడి పదార్థం అవుతుంది గానీ, బియ్యాన్ని కడిగే నీళ్ళు ముడి పదార్థం కాదు. అవి బైటికి పోతాయి. అయినా, కడిగే పని కోసం ఆ నీళ్ళు కూడా కావాలి. కాబట్టి అవి, సహాయక పదార్థం. ఒక వేళ బియ్యాన్ని కడగకుండానే, అందులో నీళ్ళు పోసి ఉడికించేస్తే, అప్పుడు సహాయక పదార్థం లేదని అర్థం.

ఎంగిలి గిన్నెల్ని కడిగి శుభ్రం చెయ్యాలనుకుందాం. ఈ గిన్నెల్ని కడిగే పనిలో ముడి పదార్థాలు ఏవి? పనిముట్లు ఏవి? సహాయక పదార్థాలు ఏవి? - ఆ కడిగే పని, ఎంగిలి గిన్నెల మీదే జరుగుతుంది. కాబట్టి, ఆ ఎంగిలి గిన్నెలే - ముడి పదార్థాలు. ఆ ఎంగిలి గిన్నెల పక్కన, ఒక బిందెతోనో, బకెట్టు తోనో, నీళ్ళు పెట్టుకోవాలి. ఆ నీళ్ళతో ఆ గిన్నెల్ని కడగాలి. ఆ బిందె గానీ, బకెట్టు గానీ, ఆ కడుగుడు పని కోసం అవసరమయ్యే పనిముట్లు. ఆ గిన్నెల్ని తోమడానికి అవసరమయ్యే బూడిదా, చిట్టూ, సబ్బూ వంటివి, సహాయక పదార్థాలు. ఆ గిన్నెల్ని కడిగే నీళ్ళు కూడా సహాయక పదార్థమే. ఆ తోమడం, కడగడం అయ్యేటప్పటికి, ఆ గిన్నెలు, శుభ్రపడ్డ గిన్నెలుగా మారతాయి. ఆ శుభ్రపడ్డ గిన్నెలు, ఆ కడుగుడు పని వల్ల తయారైన కొత్త వస్తువులు! ఆ కడుగుడు పనులు జరగడానికి, ముడి పదార్థాలూ, పనిముట్లూ, సహాయక పదార్థాలూ, అన్నీ వుంటాయి.

బట్టలు వుతికే పనిలో మాసిన బట్టలు - ముడి పదార్థాలు. బకెట్లు - పనిముట్లు. బట్టల్ని బాదే రాయి - పనిముట్టు. సబ్బూ, నీళ్ళూ - సహాయక పదార్థాలు. బట్టల్ని ఆరవేసే తీగలూ, క్లిప్పులూ - పనిముట్లు. శుభ్రంగా తయారైన బట్టలు - ఉతుకుడు

పని వల్ల వచ్చిన కొత్త వస్తువులు.

చేతి కుట్టు ద్వారా బట్టలు కుట్టే పనిలో, ముడి పదార్థాలూ, పనిముట్లూ మాత్రమే వుంటాయి. సహాయక పదార్థాలతో అవసరం వుండదు.

దుమ్ముతో వున్న గదిని చీపురుతో ఊడ్చాలనుకుందాం. ఆ ఊడ్చే పని, ఆ మాసిన నేల మీదే జరగాలి కాబట్టి, ఆ పనిలో, ఆ మాసి వున్న నేలే - ముడి పదార్థం. ఆ చీపురు - పనిముట్టు. ఆ దుమ్ముని ఎత్తడానికి ఒక చేట అవసరమైతే, అది కూడా ఒక పనిముట్టు. ఇక్కడ సహాయక పదార్థం లేదు. కానీ, ఆ మాసిన నేలని, నీళ్ళతో కడగాలంటే, ఆ నీళ్ళు, సహాయక పదార్థం. ఆ పని జరిగాక, ఆ గది శుభ్రమైన గదిగా తయారవుతుంది.

ఇక్కడ మనకు ఇంకో ప్రశ్న వస్తుంది.

తాగడం కోసం, గ్లాసుతో నీళ్ళు ఉన్నాయి. ఆ నీళ్ళు ఏమిటి? ముడి పదార్థమా, పనిముట్టా, సహాయక పదార్థమా? - తాగడానికి సిద్ధంగా ఉన్న నీళ్ళు - ముడి పదార్థం కాదు; పనిముట్టు కాదు; సహాయక పదార్థం కాదు. ఆ నీళ్ళకి ఇంకో పేరు పెట్టుకోవాలి. అది ఎందుకు ఉపయోగపడుతుందో ఆ పేరే. 'తాగడానికి సిద్ధంగా వున్న పదార్థం' అని.

అన్నం తయారై వుంటే, అది ముడి పదార్థమో, పనిముట్టో, సహాయక పదార్థమో అవదు. 'తినడానికి సిద్ధంగా వున్న పదార్థం' అనాలి. బియ్యం అయితే, తినడానికి సిద్ధంగా వుండవు. అది ఇంకా ఇంకో పదార్థంగా మారాలి. కాబట్టి బియ్యం ముడి పదార్థమే. అన్నం, అలా కాదు.

ముడి పదార్థంగా గానీ, పనిముట్టుగా గానీ, సహాయక పదార్థంగా గానీ కాకుండా, వాడకానికి సిద్ధంగా వున్న పదార్థాల్నీ, వస్తువుల్నీ, క్లుప్తంగా, 'వాడుకునే పదార్థం; లేదా వాడుకునే వస్తువు' అనవచ్చు.

ఒక శ్రమ జరిగిన తర్వాత తయారైన ఏ వస్తువు అయినా- ఒక 'ఉత్పత్తి.' ఉత్పత్తి అయినది - ఉత్పత్తి. ఆ ఉత్పత్తి తయారవడానికి అవసరమైన ముడి పదార్థాలూ, పనిముట్లూ వంటివి అన్నీ కలిసి, 'ఉత్పత్తి సాధనాలు'. ఉత్పత్తి తయారవడానికి అవసరమయ్యే సాధనాలు అవి. ఏ వస్తువు తయారవ్వాలన్నా, ఏ పని జరగాలన్నా, ఉత్పత్తి సాధనాలు ఉండాలి. అవి లేకపోతే ఏ పనీ జరగదు.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ముడి పదార్థాలకూ, పనిముట్లకూ తేడా ఏమిటి?

**జ :** ముడి పదార్థం, కొత్త వస్తువుగా మారిపోతుంది. కొత్త వస్తువు నించి ముడి పదార్థం విడిగా వుండదు. కానీ పనిముట్లు, కొత్త వస్తువు శరీరంలోకి వెళ్ళవు. వస్తువు తయారైపోయాక, పనిముట్లన్నీ విడిగా వుండిపోతాయి.

**2**. దుప్పటి తయారవ్వాలి. దానికి ముడి పదార్థాల్నీ, పనిముట్లనీ చెప్పండి!

**జ :** ముడి పదార్థం, దారం ఒక్కటే. పనిముట్లు - మగ్గమూ, ఇంకా కొన్నీ. →

**3**. ' సహాయక పదార్థాలు' అంటే?

**జ :** కొత్త వస్తువులు తయారవడానికి గానీ, కొన్ని పనులు జరగడానికి గానీ, కావలసిన ఒక రకం పదార్థాలు ఇవి. ముడి పదార్థాలు కానివీ, పనిముట్లు కానివీ, కానీ తప్పని సరిగా కావలసినవీ అయిన పదార్థాలే - సహాయక పదార్థాలు. లేదా, సహాయక వస్తువులు.

**4**. బట్టలు ఉతికే పనిలో ముడి పదార్థాలు ఏవి? ఆ పని వల్ల తయారైన వస్తువులు ఏవి?

**జ :** మాసిన బట్టలే - ముడి పదార్థాలు. ఆ పని వల్ల తయారైన వస్తువులు - ఉతికిన బట్టలు.

**6**. ముడి పదార్థం, సహాయక పదార్థం, వ్యక్తిగతంగా వాడుకునే పదార్థం. ఈ 3 పదార్థాల్నీ ఉదాహరణలతో చెప్పండి!

**5**. ఈ నీళ్ళు ఏమిటి?

**జ :** సహాయక పదార్థం.



**జ :** ' నీళ్ళ' ని తీసుకుందాం. బియ్యంలో పోసి అన్నం వండినప్పుడు ఆ నీళ్ళు - ముడి పదార్థం. గిన్నెలు కడిగే నీళ్ళు - సహాయక పదార్థం. నీళ్ళని తాగినప్పుడు ఆ నీళ్ళు - వాడుకునే పదార్థం. కొన్ని వస్తువులు, ఈ 3 రకాలుగానూ వుంటాయి.

**7**. పెన్సిలు, పుస్తకం, అన్నం, నీళ్ళు, బల్ల, వంట నూనె, పెట్రోలు, వంకాయలు - వీటిలో ఏది ముడి పదార్థం? ఏది సహాయక పదార్థం? ఏది పనిముట్టు? ( ఆ మూడు రకాల్లోకీ రానిది అయితే దాన్ని 'వాడుకునే వస్తువు' అనండి. )

**జ :**

| | | | |
|---|---|---|---|
| పెన్సిలు | - పనిముట్టు. లేదా సహాయక వస్తువు. | బల్ల | - పనిముట్టు. లేదా వాడుకునే వస్తువు. |
| పుస్తకం | - పనిముట్టు. లేదా, వాడుకునే వస్తువు. | వంట నూనె | - ముడి పదార్థం. |
| | | పెట్రోలు | - సహాయక పదార్థం. |
| అన్నం | - వాడుకునే పదార్థం. | వంకాయలు | - ముడి పదార్థం. |
| నీళ్ళు | - ముడి పదార్థం. సహాయక పదార్థం. వాడుకునే పదార్థం. | కళ్ళజోడు | - వాడుకునే వస్తువు. |
| | | చెప్పులు | - వాడుకునే వస్తువు. |
| | | నాగలి | - పనిముట్టు. |

**8**. విత్తనాన్ని ఏదో ఒక కోవలోకి చేర్చి తీరాలంటే, ఎందులోకి చేర్చవచ్చు?

**జ :** ' ముడి పదార్థం' అనుకోవచ్చు. అందులో నించే మొక్క మొలుస్తుంది కాబట్టి. విత్తనం - పనిముట్టు అవదు. సహాయక పదార్థం అవదు. విత్తనానికి ఏదో ఒక పేరు పెట్టాలంటే, ముడి పదార్థమే అవుతుంది. కానీ, అది ప్రకృతి సహజంగా ఏర్పడ్డ విత్తనం అయితే, దాన్ని ' సహజ మూల పదార్థం' అనో, ఇంకో పేరో పెట్టుకోవాలి.

→




**9**. కుండలో నీళ్ళు ఉన్నాయి. కుండ ఏమిటి? నీళ్ళు ఏమిటి?

**జ**: కుండ - పనిముట్టుగా వాడుకునేది.
నీళ్ళు - ఆహారంగా వాడుకునేవి.
ప్రతీ వస్తువూ వాడకం కోసమే. కానీ, దేని కోసం వాడుతామో ఆ తేడాని బట్టి ఎప్పుడు ఏ పేరు అవసరమో ఆ రకంగా చెప్పుకోవాలి.

**10**. 'ఉత్పత్తి సాధనాలు' అంటే?

**జ**: 'ఉత్పత్తి' ని తయారుచెయ్యడానికి అవసరమయ్యే సాధనాలు - ఉత్పత్తి సాధనాలు. కొన్ని ఉత్పత్తులు తయారవడానికి ముడి పదార్థాలు ఉండవు. కొన్నిటికి, సహాయక పదార్థాలు ఉండవు. ఎక్కడ ఏవి అవసరమో, అవే అక్కడ ఉత్పత్తి సాధనాలు.

**11**.  ఈ బొమ్మలో, ఏ వస్తువుకి ఏ పేరు వస్తుంది?

**జ**:
పొయ్యి - పనిముట్టు.
కట్టెలు - సహాయక పదార్థం.
కుండ - పనిముట్టు.
కుండలోవి - ముడి పదార్థాలు.

**12**. 

ఈ నీళ్ళు ఏమిటి?

**జ** : ముడి పదార్థం కావచ్చు.

**13**. 

ఈ నీళ్ళు ఏమిటి?

**జ** : అవి గిన్నిని కడిగే నీళ్ళు. సహాయక పదార్థం. ★

# 8. 'శ్రమ' అంటే ఏమిటి?

పార్వతి, చొక్కా కుట్టింది కదా? అది ఒక 'పని'. 'పని' నే శ్రమ అనవచ్చు. అది కుట్టు పని. లేదా, కుట్టు శ్రమ. ఈ కుట్టు శ్రమ వల్ల, మనం తొడుక్కునే రక రకాల దుస్తులు తయారవుతాయి.

'కుర్చీ' ని చేస్తే, అది వడ్రంగం పని. లేదా, వడ్రంగం శ్రమ. ఈ శ్రమ వల్ల, కుర్చీలూ, బెంచీలూ, మంచాలూ వంటి చెక్క వస్తువులు తయారవుతాయి.

మొక్కల్ని పెంచితే, అది వ్యవసాయ శ్రమ. దాని వల్ల, మొక్కలూ చెట్లూ పెరిగి, కాయలూ, పళ్ళూ, ధాన్యాలూ వస్తాయి.

అన్నమూ కూరలూ వండితే, అది వంట శ్రమ. దాని వల్ల, తినే పదార్థాలన్నీ తయారవుతాయి.

అంటే, మనం వాడుకోవడానికి ఏ వస్తువు కావాలన్నా, దాని కోసం కావలసిన శ్రమ జరగాలి. ఒక్క శ్రమే కాదు, బోలెడు శ్రమలు జరగాలి.

'చొక్కా' తయారవ్వాలంటే, కుట్టు పని, బట్ట మీద జరగాలి కదా? అంటే చొక్కా కన్నా ముందు 'బట్ట' వుండాలి. బట్ట వుండాలంటే, దాని కన్నా ముందు 'దారం' వుండాలి. దారం వుండాలంటే,

దాని కన్నా ముందు, ‘ దూది ( పత్తి )’ వుండాలి. దూది వుండాలంటే, దాని కన్నా ముందు, దూది మొక్కల్ని (పత్తి మొక్కల్ని) పెంచే పని జరగాలి. పత్తి మొక్కల్ని పెంచాలంటే, దాని కన్నా ముందు ‘ భూమి’ వుండాలి. కానీ భూమిని మనం తయారు చెయ్యనక్కరలేదు. ప్రకృతిలో అది మన కాళ్ళ కింద సిద్ధంగానే వుంది. దాని మీద ఏ పని కావాలన్నా చేసుకోవచ్చు. ఇళ్ళు కట్టుకోవచ్చు. పంటలు పండించుకోవచ్చు. మనకు పత్తి మొక్కలు కావాలంటే, భూమిలో రాళ్ళూ రప్పలూ లేకుండా చేసి, భూమిని దున్ని, పత్తి విత్తనాలు పాతి, ఆ మొక్కల్ని పెంచుకోవచ్చు.

అంటే, మనకు చొక్కా కావాలంటే, ఆ పని, భూమిలో పత్తి మొక్కల్ని పెంచడం దగ్గిర్నించీ ప్రారంభం కావాలన్నమాట! మొదట పత్తిని పండిస్తే, ఆ పత్తిని దారంగా వడికితే, ఆ దారాన్ని బట్టగా నేస్తే, ఆ బట్టని చొక్కాగా కుడితే, అన్ని పనులు చేస్తే, చొక్కా తయారవుతుంది.

చొక్కాకి ముడి పదార్థం బట్ట కాబట్టి, బట్ట తయారయ్యే వరకూ జరిగే వెనకటి పనులన్నీ ముడి పదార్థానికి సంబంధించిన పనులు.

అయితే, చొక్కా తయారవ్వాలంటే, ముడి పదార్థం ఒక్కటే చాలదు కదా? సూదీ, కత్తెరా లాంటి కొన్ని పనిముట్లు కూడా కావాలి కదా? ఆ పనిముట్లని తయారు చేసే పనులన్నీ కూడా అప్పటికే జరిగి, ఆ పనిముట్లు కూడా తయారై సిద్ధంగా వుండాలి.

అంటే, ఒక శ్రమ కొత్తగా జరగాలంటే, అంతకు ముందే అనేక శ్రమలు జరిగి వుంటాయి అన్నమాట!

‘ పత్తి’ దగ్గిర నించి మళ్ళీ చూద్దాం. పత్తి మొక్క పెరగడానికి కారణం ‘ విత్తనం’ ఒక్కటే కాదు. భూమి సారం, సూర్యరశ్మీ, నీరూ, గాలీ, వంటి వాటి వల్ల పత్తి తయారవుతుంది. వాటిలో ఏది లేకపోయినా మొక్క మొలవదు, పెరగదు. కానీ వాటిని ముడి పదార్థాలు అనలేము. ‘ ముడి పదార్థాలు’ అంటే, అవి, శ్రమతో తయారైనవై వుండాలి. గాలీ, నీరూ, సూర్యరశ్మీ, భూమి సారం - ఇవేవీ శ్రమతో తయారయ్యేవి కావు. ( భూమి సారం, నీరూ - శ్రమ ద్వారా వచ్చే సందర్భాలూ వుంటాయి. అప్పుడు కూడా అవి ముడి పదార్థాలు కాలేవు. అవి, చెట్టు నిత్యమూ జీవించడానికి అవసరమయ్యే ఆహారాలు. )


భూమి దున్నే శ్రమ


వడ్రంగం


వంట శ్రమ


గడ్డి కోసే శ్రమ


బట్టలుతికే శ్రమ

ఆ రకంగా, పత్తి తయారవుతుంది.

తర్వాత, పత్తితో దారం తయారైనప్పుడు, పత్తి - ముడి పదార్థం. దారం - కొత్త వస్తువు.

దారంతో బట్ట తయారైనప్పుడు, - దారం ముడి పదార్థం. బట్ట - కొత్త వస్తువు.

బట్టతో, చొక్కా తయారైనప్పుడు, బట్ట - ముడి పదార్థం. చొక్కా - కొత్త వస్తువు.

ఇక చొక్కాతో, ఇంకో కొత్త వస్తువు తయారయ్యేదేమీ వుండదు.

కానీ, ఆ చొక్కాయే, మాసిపోయినప్పుడల్లా, అది మొదట ముడి పదార్థం గానూ, దాన్ని ఉతికినప్పుడల్లా అదే కొత్త వస్తువు గానూ, ఇటూ అటూ మారుతూ వుంటుంది.

ఉతికిన బట్టల మీద ఇస్త్రీ పని జరిగితే, ఇస్త్రీ జరగక ముందు వున్న బట్టలు - ముడి పదార్థాలు. ఇస్త్రీ జరిగిన తర్వాత వున్న బట్టలు - ఆ శ్రమ ద్వారా బయటపడ్డ కొత్త వస్తువులు.


ఒక శ్రమ కొత్తగా జరగాలంటే, అంతకు ముందే ఎన్నో శ్రమల ద్వారా తయారైన ముడి పదార్థాలూ, పనిముట్లూ, సహాయక పదార్థాలూ, సిద్ధంగా వుండాలి. కానీ, కొన్ని శ్రమలు జరగడానికి ముడి పదార్థాలు అక్కరలేదు. కొన్ని శ్రమల్లో సహాయక పదార్థాలు అక్కరలేదు. కానీ పనిముట్లు అయితే, అన్ని శ్రమలకూ కావాలి.

ఈ విషయాలు ఇంత వివరంగా ఎందుకు చూడాలంటే, వెనకటి కాలంలో, అప్పటి పెద్ద పెద్ద మేధావులకు కూడా, ఏది ముడి పదార్థమో, ఏది పనిముట్టో, దేని పాత్ర ఏమిటో, తెలిసేది కాదు. ఇప్పటికీ చాలా మంది, ఈ విషయాల్ని సరిగా పట్టించుకోరు. అందుకే మనం ఈ విషయాలు సరిగా నేర్చుకోవాలి. మనం, వెనకటి వాళ్ళ కన్నా ఎక్కువ విషయాలు తెలిసిన వాళ్ళం అవ్వాలి.

# ప్రశ్నలూ - జవాబులూ

**1.** ‘ పత్తి’ నించి ‘ చొక్కా’ వరకూ ఏది ముడి పదార్థం? ఏది కొత్త వస్తువు?

**జ :** ఏ వస్తువు తయారైనప్పుడు, ఆ వస్తువే కొత్త వస్తువు. పత్తి తయారైతే, అప్పుడు అదే కొత్త వస్తువు. అప్పుడు అదే ‘ పూర్తిగా తయారైన’ వస్తువు. పత్తి ముడి పదార్థం అయితే, దానితో తయారయ్యే దారం - కొత్త వస్తువు. దారం - ముడి పదార్థం అయితే, దానితో తయారయ్యే బట్ట - కొత్త వస్తువు. బట్ట - ముడి పదార్థం అయితే, దానితో తయారయ్యే చొక్కా - కొత్త వస్తువు. చొక్కాతో ఇక కొత్త వస్తువు వుండదు. మాసిపోయినప్పుడు, అదే ముడి వస్తువు. ఉతికిన తర్వాత, అదే కొత్త వస్తువు. కొంత కాలానికి అది పూర్తిగా చిరిగిపోతుంది.




★

# 9. వస్తువుల్ని తయారు చెయ్యని శ్రమలు

శ్రమల వల్ల వస్తువులు తయారవుతా యని చూస్తున్నాం. కానీ, కొన్ని శ్రమల వల్ల ఏ వస్తువులూ తయారు కావు. 'బండి తోలడం' అనే పనిని చూడండి! ఇది కూడా ఒక శ్రమే. ఈ శ్రమ జరగాలంటే, మొదట 'బండి' వుండాలి. 'ఎద్దులు' వుండాలి. బండిని తోలే మనిషి వుండాలి.

కుట్టు పని వల్ల, దుస్తులు తయారై నట్టూ ; వడ్రంగం పని వల్ల చెక్క సామాన్లు తయారైనట్టూ ; బండిని తోలే పని వల్ల, ఏం వస్తువులు తయారవుతాయి? - ఏ వస్తువులూ తయారవవు. కానీ, ఈ పని వల్ల కొన్ని అవసరాలు తీరతాయి. మను షులు, బండి ఎక్కి ఒక చోటు నించి ఇంకో చోటుకి వెళ్ళవచ్చు. సామాన్లు కూడా ఒక చోటు నించి ఇంకో చోటుకి చేరతాయి. ఈ బండి తోలే పనిని, 'రవాణా శ్రమ' అనాలి. ఈ పనే లేకపోతే మనుషులు, ఎంత దూరం అయినా నడుస్తూనే వెళ్ళాలి. సామాన్లని మోసుకుంటూ తీసుకువెళ్ళాలి. ఈ రవాణా శ్రమ, వస్తువుల్ని తయారు చెయ్యడానికి కాదు. ప్రయాణం అవస రాలు తీర్చడానికి.

సైకిళ్ళూ బస్సులూ పడవలూ రైళ్ళూ విమానాలూ - ఇవన్నీ రవాణా సాధనాలే. అంటే, రవాణా పని జరగడానికి కావలసిన పనిముట్లు.

ఎద్దుల బండిని గోపయ్య నడుపు తున్నాడనుకుందాం. ఆ బండి నిండా ధాన్యం బస్తాలు వున్నాయి. ఆ బండిని తోలే పనిలో, ముడి పదార్థం ఏమిటి? పని ముట్లు ఏమిటి? సహాయక పదార్థాలు ఏమిటి? బండిలో వున్న ధాన్యం బస్తాలే ముడి పదార్థమా? - కాదు. ముడి పదార్థం అంటే, ఆ పదార్థం మీద కొంత శ్రమ జరిగే టప్పటికి, దాని శరీరంలో మార్పు జరిగి అది ఇంకో పదార్థంగా మారాలి. బట్ట మీద కుట్టు శ్రమ జరిగితే, అది చొక్కాగా మారు తుంది కదా? బియ్యం మీద వంట పని జరిగితే, అది అన్నంగా మారుతుంది కదా? అలాగ, బండిలో వున్న ధాన్యం, బండి దిగే టప్పటికి, ఇంకో పదార్థంగా మారుతుందా? - అలా జరగదు. బండిలో, మనుషులు వెళ్ళినా, సామాన్లు వెళ్ళినా, అవి ముడి పదా ర్థాలు అవవు. ఈ పనిలో, ముడి పదార్థాలు వుండవు. పనిముట్లూ, సహాయక పదా ర్థాలూ మాత్రమే వుంటాయి.



బండిని తోలే పని జరగాలంటే, మొదట 'బండి' వుండాలి కదా? అది ఒక పనిముట్టు. 'ఎద్దులు' కూడా వుండాలి కదా? అవి కూడా పనిముట్లే. ఎద్దులకు మేత పెట్టాలి కదా? ఆ మేత, బండిని తోలే పనిలో, ముడి పదార్థమూ అవదు ; పని ముట్టూ అవదు ; సహాయక పదార్థం అవు తుంది. బండి చక్రాలకు ఏదన్నా నూనె రాయాలనుకుందాం. ఆ నూనె కూడా సహా యక పదార్థమే అవుతుంది.

బస్సుని నడపాలంటే, ఇంజన్‌లో

ఏదైనా ఆయిల్ పొయ్యాలి కదా? ఆ ఆయిలు, కొంత సేపటికి కాలిపోతుంది కాబట్టి, అది సహాయక పదార్థం.

బండిని తోలే పని గోపయ్య చేస్తాడా, ఎద్దులు చేస్తాయా? లేకపోతే, గోపయ్యా, ఎద్దులూ కలిసి చేస్తాయా? - గోపయ్యే చేస్తాడు. ఆ శ్రమ చేసే మనిషి గోపయ్యే గానీ, ఎద్దులు కావు. ఎద్దులు, బండిని లాగినా, అది బండిని 'తోలడం' కాదు. బండిని తోలడం అంటే, ఎద్దుల్ని తోలడమే. బండికి ఎద్దుల్ని కట్టక ముందు, బండిని తోలేదేమీ వుండదు. ఎద్దులు లేని బండిని తోలుతారా? ఎద్దుల్ని కట్టాక, ఎద్దుల్ని తోలడమే, బండిని తోలడం. ఎద్దుల్ని తోలేది మనిషే గానీ, ఎద్దుల్ని తోలేది ఎద్దులు కావు. ఎద్దులు, వాటిని అవే తోలుకోవు. గోపయ్య, తొట్టిలో నిద్ర పోతూ వుండగా ఎద్దులు కొంత దూరం నడిచినా, అది, ఎద్దులు స్వతంత్రంగా ప్రవర్తిస్తున్నట్టు కాదు. బండిలో, బండి మనిషి లేకుండా ఎద్దులే బండిని కట్టుకుని దాన్ని తోలుకుంటూ వెళ్ళవు.

కార్లూ బస్సులూ రైళ్ళూ -వంటి వాటిని నడపాలంటే, ఆ పనుల్లో ఎద్దులు వుండవు. ఇంజన్లు వుంటాయి. ఎద్దుల్ని, 'పనిముట్లు అవుతాయి' అని చూశాం. అలాగే, ఇంజన్లు కూడా పనిముట్లే అవుతాయి. బండిని తోలే శ్రమ చేసేది బండి మనిషి అయినట్టే, బస్సుని నడిపే శ్రమ చేసేది, ఇంజన్ కాదు, బస్సు డ్రైవరే.

'శ్రమ' అనీ, 'పని' అనీ అన్నప్పుడు, ఒక మాట ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి. ఆ శ్రమని చేసేది, మనుషులే గానీ, పనిముట్లు కావు. పనిముట్లని ఉపయోగిస్తూ, మనుషులే శ్రమలు చేస్తారు. ఈ విషయం ఎక్కడా మరిచిపోకూడదు.

అన్ని పనుల వల్లా వస్తువులు తయారు కావు - అని చూశాం. అసలు, అన్ని పనులూ శ్రమలు అవవు. దీన్ని తర్వాత చూడాలి.

# ప్రశ్నలూ - జవాబులూ

**1.** 'బండి తోలడం' అనే శ్రమ వల్ల ఏం వస్తువులు తయారవుతాయి?

**జ:** ఏ వస్తువులూ తయారవవు. మనుషులూ, సామాన్లూ, ఒక చోటు నించి ఇంకో చోటుకి వెళ్ళడానికి ఆ శ్రమ అవసరం.

**2.** బండిని ఎద్దులు లాగుతున్నాయి. 'బండిని లాగే శ్రమ' ఎద్దులు చేస్తున్నాయా?

**జ:** 'శ్రమ' అనే దాన్ని, మనుషులు చేసే పనులుగానే అర్థం చేసుకోవాలి. బండిని లాగడానికి ఎద్దుల శరీరాలు చాలా కష్టపడతాయి ; చాలా అలిసిపోతాయి. అయినప్పటికీ, ఆ లాగడాన్ని, మనుషులు చేసే 'శ్రమ'తో సమానమైన విషయంగా భావించకూడదు. 'శ్రమ' అనే మాట మనుషులకే వర్తించే మాట. బండి మనిషి, ఎద్దుల్ని తోలే పని చెయ్యకపోతే ఎద్దులు బండిని లాగవు.

**3.** జంతువులు - ప్రాణం వున్న పనిముట్లు. కానీ, వాటిని పనిముట్లుగా ఉపయోగించడానికి

→


మనుషులకు ' హక్కు' వుంటుందా? అది జంతువుల హక్కుల్ని హరించడం అవదా?

**జ :** హక్కులూ, బాధ్యతలూ - అనేవి, మనుషుల సమాజానికి సంబంధించిన విషయాలే. ఇతర ప్రాణులకు హక్కులూ, బాధ్యతలూ వుండవు. కానీ మనుషులు, జంతువుల్ని, పనిముట్లుగా ఉపయోగించుకుంటారు కాబట్టి, వాటి పట్ల చాలా బాధ్యతతో ప్రవర్తించాలి. జంతువులకు కడుపు నిండా తిండీ, పరిశుభ్రమైన స్థలాలూ, వుండాలి. వాటి అనారోగ్యాల్ని గమనించి, తగినంత విశ్రాంతి ఇస్తూ వుండాలి. సుత్తీ కత్తీ నాగలీ మగ్గం - వంటి నిర్జీవ పనిముట్ల విషయంలో లాగ, సజీవ పనిముట్ల విషయంలో ప్రవర్తించకూడదు. జంతువుల్ని పనిముట్లుగా ఉపయోగించుకోవడం మానవులకు ఈ నాటి వరకూ తప్పనిసరి అవసరం గానే వుంది. అందుకే వాటి పట్ల బాధ్యతతో, వుండాలి. మానవులు, ' మానవత్వం' చూపవలసింది, ప్రధానంగా జంతువుల విషయంలోనే. ఇంకా కొంత కాలానికి జంతువుల్ని పనిముట్లుగా ఉపయోగించడం మనుషులు మానెయ్యాలి.


**4 .** 'పాల' కోసం ఆవుల్నీ, గేదెల్నీ పెంచుతాం. బండిని తోలే ఎద్దుల్ని పనిముట్లు అనుకున్నట్టుగానే, పాలు ఇచ్చే జంతువుల్ని కూడా పనిముట్లు అనుకోవాలా?

**జ :** కాయలూ, పళ్ళూ, ధాన్యాలూ ఇచ్చే మొక్కల్నీ చెట్లనీ, పనిముట్లు అనుకుంటామా? అలా అనుకోము. అలాగే ఇది కూడా. నిర్జీవ వస్తువుల తయారీలో వర్తించే ప్రతి మాటా, సజీవ ప్రాణుల విషయంలో వర్తించదు.

**5 .**




ఇది ఏమిటి?
**జ:** పనిముట్టు.



ఇది ఏమిటి?
**జ:** పనిముట్లు.

**6.** వస్తువుల్ని తయారుచెయ్యని శ్రమల్ని కొన్నిటిని చెప్పండి.

**జ :**



బండి తోలే శ్రమ



చదువు చెప్పే శ్రమ



వైద్యం చేసే శ్రమ

★

[3]

# 10. 'శ్రమ' అంటే - పనే, కానీ, ప్రతీ పనీ శ్రమ కాదు!

అన్నం వండడం - ఒక పని. ఇది శ్రమ.

అన్నం తినడం - ఒక పనే. కానీ, ఇది శ్రమ కాదు.

చదువు చెప్పడం -ఒక పని. ఇది శ్రమ.

చదువుకోవడం - ఒక పనే. కానీ, శ్రమ కాదు.

[ ఇక్కడ మనం మొదట ఒక విషయం చెప్పుకోవాలి. కొన్ని పాఠాల నించీ మనం ఏం చదువుతున్నామో తెలుసా? '**ఆర్థిక శాస్త్ర పాఠాలు**' చదువుతున్నాం. ఈ శాస్త్రంలో, వస్తువులూ, డబ్బూ, పనీ, శ్రమా - లాంటి విషయాలు కనపడతాయి. ఈ శాస్త్రంలో, 'శ్రమ' అంటే ఏం అర్థం వుంటుందో, ఆ అర్థం ప్రకారమే దాన్ని చెప్పుకోవాలి. ఒక వ్యక్తి, తెల్లవార్లూ మెలుకువగా కూర్చుని ఒక పుస్తకం అంతా చదివి పూర్తి చేసి, 'అబ్బ! ఎంత శ్రమ పడ్డానో!' అంటాడు. నిద్ర లేకుండా తెల్ల వార్లూ చదివాడు కాబట్టి, 'చాలా కష్ట పడ్డాడు' అనే అర్థంతో, 'చాలా శ్రమ పడ్డాడు' అనవచ్చు. కానీ అది, ఆర్థిక శాస్త్రంలో వుండే అర్థం ప్రకారం, 'శ్రమ' అవదు. ఆ వ్యక్తి, ఒక వృత్తిగా గానీ, ఒక సహాయంగా గానీ, ఎవరికైనా చదివిపెడితే, అది శ్రమే. కానీ, తన కోసం చదువుకుంటే, ఆ పని, శ్రమ కాదు. 'శ్రమ' ని ఇలాంటి అర్థాలతోనే చూడాలి.]

'శ్రమ' అంటే, అది ఏదో ఒక పనే.

కానీ 'పని' అంటే, అది శ్రమ కావచ్చు, కాకపోవచ్చు.

అన్ని పనులూ శ్రమలు కావు.

ఒక ఇంట్లో, పిల్లల్ని పెంచడానికి, సావిత్రి అనే పని మనిషి వుంది. సావిత్రి, ఆ ఇంట్లో, పిల్లలకు నీళ్ళు పోస్తుంది. అన్నాలు పెడుతుంది. ఆటలాడిస్తుంది. నిద్ర పుచ్చుతుంది. ఇంకా చాలా చేస్తుంది. ఈ పనులన్నీ శ్రమలే.

సావిత్రి, తన ఇంట్లో, తన స్వంత పిల్లల్ని పెంచుకోవడానికి చేసే పనులన్నీ కూడా, శ్రమలే.

పిల్లలకు నీళ్ళు పొయ్యడం - శ్రమే.

తను నీళ్ళు పోసుకోవడం - శ్రమ కాదు.

అన్నం తినిపించడం - శ్రమే.

తను అన్నం తినడం - శ్రమ కాదు.

నిద్రపుచ్చడం - శ్రమే.

తను నిద్రపోవడం - శ్రమ కాదు.



ఇది శ్రమే



ఇది శ్రమ కాదు

తను స్నానం చేసినా, అన్నం తిన్నా, నడిచినా, పుస్తకం చదివినా - ఇవన్నీ కూడా పనులే. ఈ పనులు చేసేటప్పుడు కూడా శరీరం కొంత అలసట చెందుతుంది. అయినా, ఇలాంటి పనులు, శ్రమలు అవవు. శరీరంతో చేసే ప్రతి పనినీ, ప్రతి కదలికనీ, 'శ్రమ' అనుకోకూడదు.

'చదువు చెప్పే శ్రమ'ని చూద్దాం. - అక్కడ టీచరూ, విద్యార్థులూ, వుంటారు. ఆ శ్రమలో, ముడి పదార్థం ఏదీ వుండదు. ఆ శ్రమ జరగడానికి, ఒక గదీ, బ్లాక్ బోర్డూ, సుద్ద ముక్కలూ, కుర్చీలూ బెంచీలూ లాంటి వస్తువులు కొన్ని కావాలి. అవన్నీ ఆ శ్రమ జరగడానికి కావలసిన పనిముట్లు. టీచరు, బోర్డు మీద, సుద్ద ముక్కతో రాస్తూ వుంటే, అది అరిగి ధూళిగా అయిపోతుంది. అది, సహాయక పదార్థం.

టీచరు, పిల్లల్ని బెత్తంతో దెబ్బలు కొడితే, ఆ పని, శ్రమ అవదు. చదువు చెప్పడానికి, దెబ్బలు కొట్టడం సహజ అవసరం కాదు. దెబ్బలు కొట్టడానికి ఉపయోగించే బెత్తం, చదువు చెప్పే శ్రమ కోసం అవసరమయ్యే పనిముట్టు గానీ, సహాయక పదార్థం గానీ, అవదు. టీచరు చెయ్యవలసిన అసలైన శ్రమతో సంబంధం లేని



తప్పుడు పనిముట్టు అది. అక్కడ ఆ తప్పుడు పనిముట్టు అవసరమైందంటే, అక్కడ టీచరుకీ విద్యార్థులకూ వుండే సంబంధం, తప్పుడుగా వుందని అర్థం. టీచరు, విద్యార్థుల్ని కొట్టడం అనేది, అక్కడ ఉండకూడని తప్పుడు పని కాబట్టి, తప్పుడు పని కోసమే, తప్పుడు పనిముట్టు అవసరమైంది. టీచరు చేతిలో బెత్తాన్ని చూసి, చదువు చెప్పే శ్రమ జరగాలంటే, ఆ బెత్తం కూడా అత్యవసరమైన పనిముట్టే అనుకో కూడదు.

[ మనం, ఇక్కడ 'ఆర్థిక శాస్త్రం' చదువుతున్నామని చెప్పుకున్నాం కదా? అదే కాదు. ఇక్కడ 'తత్వ శాస్త్రం' కూడా చదువుతున్నాం. దీన్ని గురించి చివర్లో బాగా చెప్పుకుందాం! ]

చదువు చెప్పేది టీచరు. అది, ఒక శ్రమ. ఆ పనిలో, టీచరుతో పాటు విద్యార్థులు కూడా శ్రమ చేస్తున్నట్టు అర్థం కాదు. విద్యార్థులు చదువుకునే వాళ్ళే గానీ, చదువు చెప్పే వాళ్ళు కాదు. చదువుకోవడం కూడా ఒక పనే అయినా, అది, శ్రమ కాదు.



డ్రిల్లు టీచరు, విద్యార్థులకు ఆటలు నేర్పడమూ, ఆడించడమూ, శ్రమలే. కానీ, విద్యార్థులు, ఆటలు నేర్చుకోవడమూ, ఆడుకోవడమూ, శ్రమలు కావు.

శరీరారోగ్యం కోసం, చల్ల గాలిలో నడవడం 'శ్రమా'?

- కాదు.



పుస్తకం చదవడం - శ్రమా?

- కాదు.

ఇంకా కొన్ని పాఠాలు చూస్తే, 'శ్రమ' అంటే ఏమిటో అర్థం అవుతుంది.

**వెలికితీత శ్రమలు :**

భూమి లోపల గనుల్లో, బొగ్గూ, అనేక రకాల లోహాలూ, చమురులూ, గ్యాస్‌లూ - వంటివి సహజంగా తయారై వుంటాయి. అలాగే, నదుల్లోనూ, సముద్రాల్లోనూ, చేపలూ, మంచి ముత్యాలూ వంటివి, సహజంగా తయారై వుంటాయి. ఇలాంటి సహజ పదార్థాల్ని బైటికి, తీసే శ్రమలకు, 'వెలికి తీసే శ్రమలు' అనే పేరు వుంటుంది. ఇలాంటి వెలికి తీసే శ్రమలు జరిగేటప్పుడు, ఆ శ్రమల్లో ముడి పదార్థం వుండదు. దీన్ని గురించి కొంత 9 వ పాఠంలో చూశాం. వెలికితీత శ్రమల్లో పని ముట్లూ, సహాయక పదార్థాలూ మాత్రమే అవసరమవుతాయి. ఈ వెలికితీత శ్రమల వల్ల బైటికి వచ్చే పదార్థాలన్నీ తర్వాత, ముడి పదార్థాలుగా ఉపయోగపడతాయి.

బంగారమూ, వెండీ, రాగీ, ఇనుమూ - వంటి లోహాలు, భూమి లోపలే, తయారై వుంటాయి. బొగ్గు, భూమి లోపల గడ్డలు గడ్డలుగా వున్నట్టుగా, లోహాలు అలా వుండవు. అవి, ఇసక రేణువుల్లాగ, భూమి లోపల మట్టిలో కలిసిపోయి వుంటాయి. ఆ మట్టిని తవ్వి, ఆ లోహాల రేణువుల్ని విడదీసి, దాన్ని కరిగించి, - అలా అనేక శ్రమలు చేస్తే, అప్పుడు ఆ లోహాల ముద్దలు తయారవుతాయి. ఆ ముద్దలతో అనేక రకాల వస్తువులు చేసుకోవచ్చు.

'డబ్బు అంటే ఏమిటి?' అని చూడడం కోసం కదా, మనం ఇదంతా చెప్పుకుం టున్నాం? - డబ్బుని బంగారం తోటే చేస్తారు. కానీ, బంగారంతో చేస్తారు - అనే మాట వల్ల డబ్బు అంటే ఏమిటో తెలిసి పోయినట్టు కాదు. వేరు వేరు రకాల వస్తు వుల్ని ఉపయోగించుకోవడం గురించి మొదట తెలియాలి.

రామయ్య అనే ఆయన ఇంట్లో అందరూ మట్టితో కుండలు చేస్తారు. చిన్న చిన్న పిడతలూ, వంట చేసుకునే దాకలూ, పెద్ద పెద్ద నీళ్ళ బానలూ అన్నీ మట్టి తోటే చేస్తారు. వాళ్ళ ఇంటి నిండా కొత్త కుండలు వుంటాయి. కానీ వాళ్ళ అవసరాలన్నీ కుండల తోటే తీరవు. వాళ్ళకి రోజూ బియ్యం కావాలి. కూరగాయలు కావాలి. పాలు కావాలి. అప్పుడప్పుడూ బట్టలు కావాలి. చెప్పులు కావాలి. అవన్నీ వాళ్ళకి ఎలా వస్తాయి? వాళ్ళకి, కుండలు చెయ్య డమే తెలుసు గానీ, ఇంకే పనీ రాదు. మరి ఆ వస్తువులు వాళ్ళకి ఎలా వస్తాయి?

# ప్రశ్నలూ - జవాబులూ

**1.** 'శ్రమ' అంటే - పనే. 'పని' అంటే - శ్రమ కాదు. - దీన్ని వివరించండి!

**జ :** శ్రమ అంటే, ఏదో ఒక 'పని'. కానీ, స్వంత శరీరం కోసం చేసుకునే పనులు, శ్రమలు అవవు. గాలి పీల్చడం, అన్నం తినడం, స్నానం చెయ్యడం, నిద్రపోవడం, పుస్తకం చదవడం, ఆడుకోవడం - వంటివి శ్రమల కోవలోకి రావు. అవే పనులు, ఇతరుల కోసం చేస్తే, ఆ ఇతరులు తన పిల్లలే అయినా, అవి శ్రమలే. వస్తువుల్ని తయారుచేసే ఏ పని అయినా - శ్రమే. జీవించడానికి అవసరమైన ఏ పని అయినా - శ్రమే. ⟶

**2**. (1) గాలి పీల్చుట, (2) పొలము దున్నుట, (3) చదువు కొనుట, (4) బట్టలు ఉతుకుట, (5) బండి తోలుట, (6) నిద్ర పోవుట - వీటిలో ఏవి శ్రమలు? ఏవి కావు?

**జ :** 1, 3, 6 - శ్రమలు కావు. మిగతావి శ్రమలు.

**3**. అన్నం తినడం, పుస్తకం చదవడం - లాంటి పనులు శ్రమలు కావు. అయితే, శ్రమలు కాని పనులు జరగడానికి, ఏ సాధనాలూ అక్కరలేదా?

**జ :** ఏ పని జరగాలన్నా, అది శ్రమ అయినా కాకపోయినా, దానికి తగిన వస్తువులన్నీ కావాలి. అన్నం తినాలంటే అన్నం కావాలి. పుస్తకం చదవాలంటే, పుస్తకం కావాలి. ఒక పని, శ్రమ అయినా కాకపోయినా, దాని సాధనాలు దానికి కావాలి.

**4**. టీచరు, విద్యార్థుల మీద బెత్తం ఉపయోగిస్తే, ఆ టీచరుకీ, విద్యార్థులకూ ఉండే సంబంధం, తప్పుడుగా ఉందని అర్థం. - ఏ విధంగా?

**జ :** టీచరు, పిల్లలకు విద్య నేర్పవలసిన వ్యక్తి. అతని పని, విద్య నేర్పడం. అంతే గానీ, దెబ్బలు కొట్టడం కాదు. టీచరు, పిల్లల్ని కొడితే, ఆ టీచరు, టీచరు పాత్ర నిర్వహించడం లేదనీ, పోలీసు పాత్ర నిర్వహిస్తున్నాడనీ, అర్థం. పిల్లల్ని కొట్టడం, విద్య నేర్పే చోట ఉండవలసిన సంబంధం కాదు. అలాంటి సంబంధం, తప్పుడు సంబంధం.

**5**. "ఇక్కడ తత్వ శాస్త్రం కూడా చదువుతున్నాము" అని పాఠంలో వుంది. 'తత్వ శాస్త్రం' అంటే?

**జ :** ఏ సమస్య అయినా, మనుషులందరికీ ఒకే రకంగా అర్థం కావాలి. దాన్ని పరిష్కరించే సరైన మార్గం అందరికీ ఒకే రకంగా నచ్చాలి. కానీ, ప్రస్తుతం అమలులో వున్న ఈ సమాజంలో అలా జరగదు. ఎంత చిన్న సమస్యలోనైనా, ఎవరి అభిప్రాయం వాళ్ళదే. అంటే, ఎవరి తత్వం వాళ్ళదే. అందులో ఏదో ఒకటి సరైనది కావచ్చు ; లేకపోతే, అసలు ఏదీ సరైనది కాకపోవచ్చు. పిల్లలు శ్రద్ధగా చదవకపోతే, వాళ్ళని బాగా దండించి భయపెట్టాలని చెప్పేది - ఒక రకం అభిప్రాయం. పిల్లలతో గోడ కుర్చీలు వేయించి, వాళ్ళకి ముంత పొగలు పెట్టి, పైనించి వేళ్ళాడదీసి, విపరీతంగా కొట్టి భయపెడితే, శిక్షిస్తే, పిల్లలు బాగా చదువుతారు - అనే అభిప్రాయం అది. ఆ విషయంలో, అది, ఒక సిద్ధాంతం. ఒక తత్వం. అది పూర్తిగా తప్పనీ, పిల్లలకు నెమ్మదిగా, శాంతంగా, అర్థమయ్యేటట్టు చెపితేనే, శ్రద్ధగా చదువుతారనీ, భయపెడితే విద్య రాదనీ చెప్పేది, ఇంకో రకం అభిప్రాయం. అది ఇంకో తత్వం. ఏ సమస్యలో అయినా, పరస్పర విరుద్ధంగా వుండే అభిప్రాయాలు ఉన్నాయి. ఎవరి తత్వ శాస్త్రం వాళ్ళదీ! కానీ, సరైన తత్వ శాస్త్రం ఏమిటో, దాన్నే తెలుసుకోవాలి ; దాన్నే అనుసరించాలి.

★

# 11. 'మారకాలు' అంటే ఏమిటి?

రామయ్య గారి ఇల్లు చిన్న పాక. వాళ్ళు చేసే పని, మట్టి కుండలు తయారు



చెయ్యడం. ఇంటి పెరట్లో కాసిన్ని కూర గాయలు పెంచుకుంటారు. ఒక గేదెని మేపుకుంటారు. అది పాలు ఇస్తుంది. వాళ్ళు చేసే అసలు పని మాత్రం కుండలు చెయ్యడమే, అంతే. అంత కన్నా వేరే పనులు వాళ్ళకి రావు. మరి వాళ్ళు రోజూ వాడుకోవడానికి ఇంకా చాలా వస్తువులు కావాలి కదా? వాళ్ళకి బియ్యం ఎలా వస్తాయి? బట్టలు ఎలా వస్తాయి? చెప్పులు ఎలా వస్తాయి? వాళ్ళు తయారుచెయ్యని వస్తువులు వాళ్ళకి ఎలా వస్తాయి?

ఈ రోజుల్లో మనకు తెలిసిన దాన్ని బట్టి, మనం ఈ ప్రశ్నలకు తేలిగ్గానే జవాబులు చెప్పుకోగలం. వాళ్ళు కుండలు చేస్తారు కాబట్టి, ఆ కుండల్ని అమ్ముకుని, అలా వచ్చిన డబ్బుతో, వాళ్ళకు కావలసిన వస్తువుల్ని బజార్లో కొనుక్కుంటారు - అని చెప్పుకోవచ్చు.

కానీ, ఈ అమ్మడాలూ, కొనడాలూ, వెనకటి కాలంలో లేవు. బాగా వెనకటి కాలంలో, 'డబ్బు' అనేదే లేదు. డబ్బు లేని కాలంలో ఏం జరిగింది? - అక్కడి నించీ ఇప్పుడు చూడాలి.

రామయ్య కుటుంబం వున్న ఊళ్ళోనే ఇంకా అనేక కుటుంబాలు వున్నాయి. లక్ష్మయ్య అనే ఆయన ఇంట్లో అందరూ పొలం పనులు చేసి ధాన్యమూ, కూర గాయలూ పండించుకుంటారు. వీళ్ళు కూడా గేదెల్నీ ఆవుల్నీ మేపుకుంటారు. కానీ వీళ్ళకి కుండలు చెయ్యడం రాదు. చెప్పులు కుట్టడం రాదు. మరి వీళ్ళకి కుండలూ, చెప్పులూ, ఎలా వస్తాయి?

ఆ ఊళ్ళోనే ఇంకా కొన్ని కుటుంబాలు వున్నాయి. కొన్ని ఇళ్ళ వాళ్ళు, చెక్క పనులు చేస్తారు. కొందరు, చెప్పులు కుడతారు. కొందరు, బట్టలు నేస్తారు. కొందరు, బట్టలు కుడతారు. కొందరు, బట్టలు ఉతుకుతారు. కొందరు, క్షవరాలు చేస్తారు. ఇలాగ, ఆ ఊళ్ళో వాళ్ళు రక రకాల పనులు చేస్తారు.

మనుషుల్లో, కొందరు ఒక రకం శ్రమా, మరి కొందరు ఇంకో శ్రమా - ఇలా వేరు వేరు శ్రమలు చేస్తారు కాబట్టి, అది 'శ్రమ విభజన' అవుతుంది. ప్రతి మనిషీ వంద రకాల శ్రమలు చెయ్యలేరు కాబట్టి, వేరు వేరు శ్రమలు చెయ్యడమే 'శ్రమ విభజన!'

ఒక ఇంట్లో జనం జీవించాలంటే, వాళ్ళకి 10 రకాల వస్తువులు తప్పనిసరిగా కావాలనుకుందాం. కానీ, ఆ ఇంట్లో వాళ్ళు,

2, 3 రకాల వస్తువులే తయారు చేసుకో గలరు. అంత కన్నా ఎక్కువ పనులు వాళ్ళకి రావు. మరి, వాళ్ళు చేసుకోని వస్తువులు వాళ్ళకి ఎలా వస్తాయి? ఈ సమస్య ఒక్క ఇంటి వాళ్ళదే కాదు. ప్రతి ఇంటి వాళ్ళకీ అదే సమస్య ఉంటుంది. ఆ సమస్య తీరే మార్గం ఏమిటి? - మార్గం ఏమిటంటే, ఒకళ్ళు తయారుచేసే వస్తువులు ఇంకొకళ్ళకి ఇచ్చి, వాళ్ళు తయారు చేసే వస్తువులు వీళ్ళు తీసుకోవడం.

రామయ్య ఇంట్లో కుండలే చేస్తారు కదా? వాళ్ళకి చెప్పులు కావాలి.

సోమయ్య ఇంట్లో చెప్పులే చేస్తారు. వాళ్ళకి కుండలు కావాలి.

ఒక రోజున రామయ్య ఒక కుండ పట్టుకుని సోమయ్య ఇంటికి వెళ్ళి, "సోమయ్యా! నా చెప్పులు పాడైపోయాయి. ఒక జత కొత్తవి కావాలి. ఈ కుండ తీసుకుని చెప్పులు ఇద్దూ!'' అని అడిగాడు.

సోమయ్య చాలా సంతోషంగా, '' నేను ఇప్పుడే మీ ఇంటికి వద్దామనుకుంటు న్నాను. మా నీళ్ళ కుండ బద్దలైపోయింది. మీ ఇంటికి వెళ్ళి కుండ తీసుకురమ్మని మా ఆవిడ ఇప్పుడే చెప్పింది. అంతలో నువ్వే వచ్చావు'' అని రామయ్యకి చెప్పి, భార్యని పిలిచాడు.

ఆవిడ వచ్చి కుండ తీసుకుని అందులో మొహం పెట్టి అన్ని పక్కలా చూసి, "పగుళ్ళు లేవు. చాలా బాగుంది'' అని సంతోషంగా కుండని వాకిట్లోకి తీసుకు వెళ్ళి, సుబ్బరంగా కడిగి, ఒక పక్క ఇసక మీద పెట్టి, దాన్నిండా నీళ్ళు పోసి మూత పెట్టింది.

సోమయ్య, రామయ్యతో, ''ఏ చెప్పులు కావాలో తీసుకో'' అన్నాడు.

రామయ్య, అక్కడే బల్ల కింద వున్న చెప్పుల జతలన్నిటినీ తణిఖీ చేసి ఒక జత తీసుకుని, వెంటనే కాళ్ళకి తొడుక్కున్నాడు. ''చెప్పులు బాగా కుదిరాయి. ''వెళ్తాను సోమయ్యా!'' అని సంతోషంగా వెళ్ళిపోయాడు.



ఒక వస్తువుని ఇచ్చి, ఇంకో వస్తువుని తీసుకోవడం

రామయ్యకీ, సోమయ్యకీ మధ్య, ఏం జరిగింది? రామయ్య తయారుచేసిన వస్తువు సోమయ్యకీ, సోమయ్య తయారు చేసిన వస్తువు రామయ్యకీ, మారాయి. ఇటు వస్తువు అటూ, అటు వస్తువు ఇటూ మారాయి. 2 వస్తువుల మధ్య ఇలా జరిగితే, దాన్ని 'మారకం' అనాలి. దీనికి ప్రత్యేకమైన పేరు వుంది. 'బార్టరు పద్ధతి మారకం' అనే పేరు.

రామయ్యకి చెప్పులు తయారుచేసుకునే పని రాకపోయినా, చెప్పులు దొరికాయి. సోమయ్యకి కుండలు తయారు చేసుకునే పని రాకపోయినా, కుండ దొరికింది. ఒకరి వస్తువు ఒకరికి మారడం వల్ల, రెండు కుటుంబాల అవసరాలూ తీరాయి.

**'మారకం' అనేది, శ్రమల సంబంధమే:**

కుండల వాళ్ళ కుటుంబానికీ, చెప్పుల వాళ్ళ కుటుంబానికీ వున్న 'సంబంధం' ఏమిటి? వాళ్ళు అన్న దమ్ములా? - కాదు. స్నేహితులా? - కాదు. శతృవులా - కాదు.

బంధువులా? - కాదు. మరి, వాళ్ళ సంబంధం ఏమిటి? - వాళ్ళు, ఒకరి పనిని ఒకరు వాడుకుంటారు. అంటే, వాళ్ళ మధ్య వున్నది ‘ శ్రమల సంబంధం.’

ఆ ఊళ్ళో వున్నది ఆ రెండు కుటుంబాలే కాదు. ఇంకా చాలా కుటుంబాలు వున్నాయి.

క్షవరాలు చేసే బాలయ్య కూతురు సీతకి బాగా జ్వరం వచ్చింది. జ్వరాలకు, పుల్లయ్య మంచి మందులు ఇస్తాడు. పుల్లయ్యని తీసుకొస్తే, సీతకి వైద్యం చేశాడు. రెండు రోజుల్లో జ్వరం తగ్గింది. తర్వాత, పుల్లయ్య పిల్చినప్పుడు బాలయ్య వెళ్ళి, పుల్లయ్యకి క్షవరం చేసి వచ్చాడు.

బాలయ్య శ్రమ, పుల్లయ్యకీ; పుల్లయ్య శ్రమ, బాలయ్యకీ - మారాయి. రెండు కుటుంబాల అవసరాలూ తీరాయి.

ఒక కుటుంబం వాళ్ళు, ఒకే రకం వస్తువులు చేసినా, వాటి తోటే వేరు వేరు రకాల వస్తువులు తెచ్చుకుంటారు.

కుండలు చేసే కుటుంబం వాళ్ళు,
ఒక కుండ ఇచ్చి చెప్పులూ,
ఇంకో కుండ ఇచ్చి కొంచెం ధాన్యం,
ఇంకో కుండ ఇచ్చి క్షవరం చేయించుకోవడం,
ఇంకో కుండ ఇచ్చి, బట్టలు ఉతికించుకోవడం, ఇలా చేస్తారు. - ఈ రకంగా, కుండల వాళ్ళ అవసరాలన్నీ తీరతాయి.

అలాగే, చెప్పులు చేసేవాళ్ళు కూడా చెప్పుల జతలు ఇచ్చి, వేరే వస్తువులు సంపాదించుకుంటారు. అలాగే, క్షవరాలు చేసే వాళ్ళు కూడా అందరికీ క్షవరాలు చేసిపెట్టి, తమకు కావలసిన వస్తువులు తెచ్చుకుంటారు. - ఇవన్నీ ‘ మారకాలే ’.

ఒక మనిషి, ఇంకో మనిషితో ఒక పని చేయించుకుని, మళ్ళీ తను కూడా ఆ మనిషి కోసం ఒక పని చేసిపెడితే, అది పనుల మారకం. అంటే, శ్రమల మారకం.

లేదా, వాళ్ళ వస్తువు వీళ్ళకీ, వీళ్ళ వస్తువు వాళ్ళకీ మారితే, అది వస్తువుల మారకం. అయితే, ‘వస్తువుల మారకం’ అనేది కూడా, శ్రమల మారకమే. వస్తువుల్ని మార్చుకుంటే, అది కూడా ఒకరి శ్రమని ఒకరికి మార్చుకున్నట్టే. కుండకీ, చెప్పుల జతకీ మారకం జరిగితే, అది కుండని చేసిన శ్రమకీ, చెప్పుల్ని చేసిన శ్రమకీ మారకం జరగడమే. ఆ ఊళ్ళో మనుషులందరి మధ్యా జరిగే మారకాలన్నీ ‘ శ్రమల మారకాలే.’ వాళ్ళ సంబంధాలు, ‘శ్రమల సంబంధాలే!’

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ‘ మారకాలు’ అంటే ఏమిటి?

**జ** : ఒక రకం వస్తువుని ఇచ్చి, ఇంకో రకం వస్తువుని తీసుకోవడం. ఇటు వస్తువు అటూ, అటు వస్తువు ఇటూ మారడమే - వస్తువుల మారకం.

**2**. క్షవరాలు చేసే కుటుంబం వారికి కుండ కావాలి. అప్పుడు, దేనికీ దేనికీ మారకం జరగాలి?

**జ** : క్షవరాలు చేసే మనిషి, కుండలు చేసే వారి నించి ఒక కుండని తీసుకుని, ఆ కుండ మనిషికి క్షవరం చేస్తాడు. క్షవరం చేసే శ్రమకీ, కుండలు చేసే శ్రమకీ, మారకం జరుగుతుందని అర్థం. ★

# 12. వస్తువు 'ఉపయోగపు విలువ '

రామయ్య, తను చేసిన కుండని సోమయ్యకి ఇచ్చి, సోమయ్య చేసిన చెప్పుల జతని తను తీసుకున్నాడు కదా? దీన్ని, 'బార్టరు పద్ధతిలో జరిగే మారకం' అంటారు అని చూశాం. ఇంకా 'డబ్బు' ప్రారంభం కాని కాలంలో జరిగిన మారకాలన్నీ ఇలాగే, వస్తువుని ఇచ్చి వస్తువుని తీసుకునే పద్ధతి లోనే ( బార్టరు పద్ధతి లోనే ) జరిగేవి.

డబ్బు ప్రారంభమైన తర్వాత అయితే, మారకాలు ఎలా జరుగుతాయి - అనే ప్రశ్న వస్తుంది. దాన్ని చూసేది తర్వాత పాఠాల్లో. కానీ, ప్రస్తుతం ఇక్కడ చాలా క్లుప్తంగానే చెప్పుకుంటాం. డబ్బు ప్రారంభమైన తర్వాత అయితే, ఒక వస్తువు కావాలంటే, ఇంకో వస్తువుని ఇవ్వడం కాదు. డబ్బే ఇవ్వాలి. మనం తయారుచేసే వస్తువులు ఎవరికి కావాలో వాళ్ళకి ఇచ్చి, వాళ్ళ దగ్గిర్నించి డబ్బు తీసుకోవాలి. ఆ డబ్బునే ఇంకొకళ్ళకి ఇచ్చి, వాళ్ళు తయారుచేసిన వస్తువులు మనం తీసుకోవాలి. డబ్బుతో జరిగేవి కూడా మారకాలే. అవి - డబ్బుకీ, వస్తువుకీ జరిగే మారకాలు. - ఇదంతా డబ్బు ప్రారంభమైన తర్వాత జరిగే సంగతి. అసలు డబ్బు అంటే ఏమిటో మొదట తెలియాలి. అది ఇంకా తెలీదు. మన వస్తువు ఇస్తే, డబ్బు ఎందుకు వస్తుంది? డబ్బు ఇస్తే, వస్తువు ఎందుకు వస్తుంది? - ఇవన్నీ తర్వాత పాఠాల్లో చూస్తాం. ఇప్పుడు మనం, డబ్బు ఇంకా లేని బార్టరు పద్ధతి మారకాల దశలోనే వున్నాం.

కుండ ఇచ్చి చెప్పుల జతని తీసుకుంటే, అది ఒక బార్టరు మారకం. గుప్పెడు బియ్యం ఇచ్చి, పిడికెడు కరివేపాకు తీసుకుంటే, అది ఒక బార్టరు మారకం. బుట్టెడు ధాన్యం ఇచ్చి, తట్టెడు ముంజెలో రేగుపళ్ళో తీసుకుంటే, అది ఒక బార్టరు మారకం. బట్టలు ఉతికే మనిషీ, వైద్యం చేసే మనిషీ, ఒకరి కోసం ఒకరు పని చేసి పెడితే, అది కూడా బార్టరు మారకం. - అలాగే, బాగా వెనకటి కాలంలో ఊళ్ళల్లో అందరి మధ్యా బార్టరు మారకాలు జరుగుతూ, అందరి అవసరాలూ తీరుతూ వుండేవి.

అయితే, వస్తువుల్లో చిన్నవీ, పెద్దవీ, చాలా పెద్దవీ, చాలా చిన్నవీ, వుంటాయి. చాలా తేలిగ్గా చేసేవీ, ఎంతో కష్టపడి చేసేవీ, వుంటాయి. చాలా తొందరగా తయారయ్యేవీ, ఎంతో కాలం జరిగితే గానీ తయారవనివీ, వుంటాయి. చిన్న వస్తువు ఇస్తే, పెద్ద వస్తువు రాదు. తేలిగ్గా తయారయ్యే వస్తువు ఇస్తే, కష్టంగా చెయ్యవలసిన వస్తువు రాదు. మారకాలు జరగడానికి ఒక షరతు వుంటుంది. 2 వస్తువులకూ 'విలువలు' సమానంగా వుండాలి - అనే షరతు.

ఇప్పటి వరకూ మనం, తేలిగ్గా అర్థం చేసుకోగలిగే విషయాలే చూశాం. ఇక్కడి నించీ క్రమ క్రమంగా కొంచెం కష్టాల్లోకి వెళ్ళవలసి వస్తుంది. కష్టాలంటే, మరీ కష్టాలేం కాదు. కొంచెం ఆలోచిస్తూ శ్రద్ధగా చదవాలి.

'మారకాలు' అనేవి ప్రారంభమైన కాలంలో, రోజువారీ అవసరాల కోసమే అవి జరుగుతాయి. కుండ మనిషికీ, చెప్పుల మనిషికీ, ఒకరి వస్తువుతో ఒకరికి అవసరం వుంది కాబట్టే, ఒకరి వస్తువుని

ఒకరు మార్చుకుని వాడుకున్నారు.

ఏది పెద్ద వస్తువు, ఏది చిన్న వస్తువు - అనే ఆలోచనే ఆ నాడు లేదు. చిన్న వస్తువుతోటే అవసరం వుంటే, తన పెద్ద వస్తువుని ఇచ్చెయ్యడానికి ఎవరికీ అభ్యంతరం వుండదు.

కానీ, క్రమ క్రమంగా అలాంటి అభ్యంతరాలు కూడా ప్రారంభమయ్యాయి. ఒక వస్తువుని చెయ్యడానికి, తక్కువ కష్టమా, ఎక్కువ కష్టమా? కుండని చెయ్యడం ఎక్కువ కష్టమా, చెప్పుల జతని చెయ్యడం ఎక్కువ కష్టమా? కుర్చీని చెయ్యడం ఎక్కువ కష్టమా, దుప్పటిని చెయ్యడం ఎక్కువ కష్టమా? - ఇలాంటి ఆలోచనలు బయల్దేరాయి. ఏ వస్తువుని చెయ్యడం కష్టమో, ఏ వస్తువుని చెయ్యడం తేలికో, క్రమంగా అనుభవాల ద్వారా తెలుస్తుంది. అలా తెలిసిన దగ్గిర్నించీ, మారకాలు జరగడానికి తప్పకుండా షరతులు ప్రారంభమవుతాయి.

ఇప్పుడు మనం కొన్ని వస్తువుల్ని చాలా జాగ్రత్తగా పరిశీలించాలి. ప్రతి వస్తువుకీ 2 రకాల లక్షణాలు ఉంటాయి.

(1) ఉపయోగపడే లక్షణం.


(2) మారకం అయ్యే లక్షణం.



**మొదటి లక్షణం :**

కుండ వల్ల, 'ఉపయోగం' ఏమిటి? - అది, నీళ్ళు పోసుకోవడానికి పనికి వస్తుంది. అది కుండకి వుండే సహజ లక్షణం. ఈ లక్షణం కుండ శరీరం లోనే వుంటుంది. ఈ లక్షణాన్ని కుండకు వున్న 'ఉపయోగపు విలువ' అనాలి.

చెప్పుల జత వల్ల, 'ఉపయోగం' ఏమిటి? - నడిచేటప్పుడు కాళ్ళకు రాళ్ళూ రప్పలూ గుచ్చుకోకుండా చెప్పులు ఉపయోగపడతాయి. అది చెప్పుల సహజ లక్షణం. ఈ లక్షణం చెప్పుల శరీరంలోనే ఉంటుంది. ఈ లక్షణాన్ని చెప్పుల 'ఉపయోగపు విలువ' అనాలి.



అయితే, కుండనీ, చెప్పుల జతనీ తీసుకుంటే, ఏది గొప్పది? ఏ వస్తువు ఇచ్చే ఉపయోగం ఎక్కువ గొప్పది? - 'ఉప యోగాల్ని' అలా పోల్చ కూడదు. కుండ కావలసినప్పుడు, అది లేకుండా, చెప్పుల జత వుంటే, అది కుండ తీర్చే అవసరాన్ని తీరుస్తుందా? అలాగే, చెప్పుల జత కావలసినప్పుడు, అది లేకుండా కుండ దొరికితే, అది చెప్పుల జత తీర్చే అవసరాన్ని తీరుస్తుందా? చిన్న పెన్సిలు అవసరం వున్నప్పుడు, ఒక కుర్చీ దొరికితే, దానితో అవసరం తీరుతుందా? ఏ అవసరానికి ఆ వస్తువే కావాలి. అన్నం - తినడానికి అవసరం. ఇల్లు - నివసించడానికి. దుప్పటి - కప్పుకోడానికి. పుస్తకం - చదువుకోడానికి. - ఈ రకంగా, ప్రతీ వస్తువుకీ ఒక ఉపయోగపు విలువ ఉంటుంది. కాబట్టి, ఉపయోగపు విలువల్లో ఏది ఎక్కువ, ఏది తక్కువ - అని పోల్చకూడదు. పోలిస్తే, అది తప్పు ఆలోచన. వేరు వేరు అవసరాల్ని తీర్చే వస్తువుల్లో ఏదీ ఎక్కువ కాదు, ఏదీ తక్కువ కాదు. - వస్తువుల గురించి ఇది మొట్టమొదట గ్రహించవలసిన విషయం.

**రెండో లక్షణం :**

ఇది, వస్తువుకి వుండే 'మారకం అయ్యే' లక్షణం. ఇక్కడి నించీ మన కష్టాలు కొంచెం ప్రారంభమవుతాయి.

# ప్రశ్నలూ - జవాబులూ


**1**. ధాన్యం ఇచ్చి, రేగు పళ్ళు తీసుకుంటే, ఆ మారకం పేరు ఏమిటి?


**జ** : అది, బార్టరు పద్ధతి మారకం.

**2**. 'ఉపయోగపు విలువ' అంటే? ఉదాహరణలతో చెప్పండి.

**జ** : ఒక వస్తువు వల్ల వుండే ఉపయోగమే, దాని ఉపయోగపు విలువ.

అన్నం - తినడానికి ఉపయోగపడుతుంది.
బట్టలు - కట్టుకోవడానికి. ఈ విధంగా.





**3**. మంచం ఉపయోగపు విలువ ఎక్కువా? కుర్చీ ఉపయోగపు విలువ ఎక్కువా?

**జ** : ఉపయోగపు విలువల్లో ఎక్కువ తక్కువలు వుండవు. మంచం, ఒక అవసరానికి. కుర్చీ, ఇంకో అవసరానికి, ఏ అవసరానికి, ఆ వస్తువే వుండాలి.

**4**. ప్రతీ వస్తువుకీ ఉపయోగపు విలువ వుంటుందా?

**జ** : ఉంటుంది. వస్తువు పాడైపోయినప్పుడే, ఇక దాని వల్ల ఉపయోగం ఉండదు.

**5**. 'నీళ్ళ' ఉపయోగపు విలువ ఎక్కువా, 'పాల' ఉపయోగపు విలువ ఎక్కువా?

**జ** : వేరు వేరు ఉపయోగపు విలువల్ని అలా పోల్చకూడదు. దేని ఉపయోగం దానిదే. పాలతో ఉపయోగం, నీళ్ళతో ఉపయోగం కన్నా ఎక్కువా కాదు, తక్కువా కాదు. అలాగే, నీళ్ళ సంగతి కూడా. వేరు వేరు ఉపయోగపు విలువల్లో, ఎక్కువ తక్కువలు వుండవు.

**6**. 1 కిలో బియ్యం వల్ల ఉపయోగం ఎక్కువా, 2 కిలోల ఉపయోగం ఎక్కువా?


**జ** : రెండూ బియ్యమే కాబట్టి, వీటిని పోల్చవచ్చు. తక్కువ బియ్యం వల్ల ఉపయోగం కన్నా, ఎక్కువ బియ్యం వల్ల ఉపయోగం ఎక్కువే.

**7**. చుట్ట, సారా, తుపాకీ, విషం - వీటికి కూడా ఉపయోగపు విలువలు ఉన్నట్టేనా?

**జ** : ఉన్నట్టే. చుట్ట ఎందుకు ఉపయోగపడుతుందో ఆ లక్షణాన్ని చూడాలి గానీ, ఆ ఉపయోగం మంచిదా చెడ్డదా అనే చర్చ కాదు ఇక్కడ. 'ఉపయోగపు విలువ' అంటే, 'అది మంచి ఉపయోగమే' అని చెప్పినట్టు అర్థం కాదు. ఆ వస్తువు గుణం ఏమిటో చెప్పడం మాత్రమే అది. సారా గుణం, సారాది. తుపాకీ గుణం, తుపాకీది. విషం గుణం, విషానిది.

**8**. కొన్ని వస్తువుల పేర్లు చెప్పి, అవి ఏ అవసరాల కోసం ఉపయోగపడతాయో చెప్పండి!

**జ** :

| నాగలి | తరాజు | పుస్తకం | గ్లాసు | చెప్పులు |
|---|---|---|---|---|
|  |  |  |  |  |
| పొలం దున్నడానికి | బరువులు తూచడానికి | చదువుకోడానికి | నీళ్ళు తాగడానికి | సుఖంగా నడవడానికి |

★

# 13. వస్తువు కి 'మారకం విలువ'

కుండ వల్ల, ' ఉపయోగం' ఏమిటి? - నీళ్ళు పోసుకోవడానికి పనికి వస్తుంది. కుండని ఎలా చేస్తారు? మట్టితో, ఫలానా రకంగా చేస్తారు. కుండ అయినా, చెప్పులు అయినా, కుర్చీ అయినా, ఏ వస్తువు అయినా, దాని వల్ల ఉపయోగం ఏమిటో, ఆ వస్తువుని కళ్ళతో చూస్తే తెలిసిపోతుంది. ఆ వస్తువుని ఏ శ్రమతో చేశారో కూడా తెలిసిపోతుంది. అంటే, ఉపయోగపు విలువల గురించి తెలుసుకోవడానికి, రోజూ మనకు తెలిసే ' లోక జ్ఞానం' చాలు. ఇది తెలుసుకోవడం చాలా తేలిక. ఇందులో కష్టం అయ్యేదేమీ వుండదు.

కానీ, ' మారకాలు' అనే పాఠం ప్రారంభమైనప్పటి నించీ, ఈ విషయాలు తెలుసుకోవడానికి ఎక్కువ శ్రద్ధ అవసరం. ఇవి అన్నీ మనం జీవించే సమాజానికి సంబంధించిన జ్ఞానాన్ని పెంచే విషయాలు. అవి ఏమిటో తెలుసుకోవాలనే కుతూహలంతో వుండాలి.

కుండా, చెప్పుల జతా, వేరు వేరు రకాల వస్తువులు. అలాంటి వాటికి మారకం జరగడం అంటే, ఆ వస్తువుల్లో వున్న ఏ లక్షణాల వల్ల అది జరుగుతుంది? ఆ 2 వస్తువులకూ ఏదో ఒక సమాన లక్షణం వుండాలి. అలా వుంటేనే, ఒక వస్తువుని ఇచ్చి ఇంకో వస్తువుని తీసుకోవడానికి, ఆ వస్తువులు గల వాళ్ళకి అభ్యంతరం వుండదు. కుండకీ, చెప్పుల జతకీ వుండే సమాన లక్షణం ఏమిటి? ఆ వస్తువుల బరువులు సమానమా? ఆ వస్తువుల పొడవులు సమానమా? - అలాంటి శరీర లక్షణాల సంగతి కాదు. అవి వేరు వేరు వస్తువులు కాబట్టి, వాటి శరీరాల్లో ఏ లక్షణాలూ సమానంగా వుండవు. కానీ, ఆ వేరు వేరు వస్తువులకు ఏదో ఒక లక్షణం సమానంగా వుండి తీరాలి. ఒక సమాన లక్షణం వుంటేనే, ఆ లక్షణం ద్వారా వాటికి మారకం సాధ్యం అవుతుంది. ఆ లక్షణం ఏమిటి? - ఆ లక్షణం, ఆ వస్తువుల్ని తయారుచేసే ' శ్రమ పరిమాణం. ( శ్రమ సైజు )'. కుండని చెయ్యడానికి ' కొంత శ్రమ' జరగాలి. చెప్పుల జత కోసం కూడా ' కొంత శ్రమ' జరగాలి. కుండ శ్రమ ఎంత వుందో, చెప్పుల జత శ్రమ కూడా అంత వుంటేనే, ఆ వస్తువులకు మారకం సాధ్యం. ఒక వస్తువు కోసం ఎక్కువ శ్రమ జరిగి, ఇంకో వస్తువు కోసం తక్కువ శ్రమ జరిగితే, మొదటి వస్తువు మనిషి ఆ మారకానికి ఒప్పుకోడు. వాటికి మారకం జరగదు.

అయితే, శ్రమ, ఏ వస్తువుకి ఎక్కువ జరిగిందో, ఏ వస్తువుకి తక్కువ జరిగిందో, ఎలా తెలుస్తుంది? శ్రమని ఎలా కొలవాలి? బరువుల్ని కొలవడానికి అయితే, తరాజు పద్ధతి వుంటుంది. పొడుగుల్ని కొలవడానికి, మీటరు-బద్ద పద్ధతి వుంటుంది. మరి, శ్రమల్ని కొలవడానికి ఏం పద్ధతి వుంటుంది? శ్రమల్ని కొలిచే సాధనం ఏమిటి? - శ్రమల్ని కొలవడానికి కూడా ఒక పద్ధతి వుంది. సాధనం వుంది. ఆ సాధనం- టైము. అంటే, ' కాలం'. ఒక శ్రమ చెయ్యడానికి ఎన్ని గంటలు పట్టింది? ఎన్ని రోజులు


పట్టింది? - ఇదీ, శ్రమల్ని కొలిచే సాధనం.

కుండని చెయ్యడానికి ఎంత కాలం పట్టింది? చెప్పుల జతని చెయ్యడానికి ఎంత కాలం పట్టింది? ఎక్కువ కాలం పడితే, అది ఎక్కువ శ్రమ. తక్కువ కాలం పడితే, అది తక్కువ శ్రమ. ఆ శ్రమలు సమానంగా ఉంటే, ఆ వస్తువుల్ని మార్చుకున్న వాళ్ళల్లో ఎవరికీ నష్టం జరగదు. తక్కువ శ్రమతో తయారైన వస్తువుని ఇస్తే, దానికి బదులుగా ఎక్కువ శ్రమతో తయారైన వస్తువు రాదు.

కుండని చెయ్యడానికి మొత్తం 2 గంటల శ్రమా, చెప్పుల జతని చెయ్యడానికి మొత్తం 5 గంటల శ్రమా పట్టిందనుకుందాం. ఆ 2 వస్తువులకు మారకం జరిగితే, కుండ మనిషికి అయితే, 2 గంటల శ్రమని ఇచ్చి, 5 గంటల శ్రమని తీసుకున్నట్టు అవుతుంది. ఇది ఇతనికి ఇష్టమే. దీనికి కుండ మనిషి సంతోషంగానే ఒప్పుకుంటాడు. కానీ, చెప్పుల మనిషికి అయితే, 5 గంటల శ్రమని ఇచ్చి, 2 గంటల శ్రమని తీసుకున్నట్టు అవుతుంది కదా? ఇది, అతనికి ఇష్టం అవదు. ఈ మారకానికి ఇతను ఒప్పుకోడు. కాబట్టి, ఎక్కువ శ్రమతో తయారైన వస్తువుకీ, తక్కువ శ్రమతో తయారైన వస్తువుకీ, మారకం జరగదు.

వేరు వేరు వస్తువులకు మారకాలు జరగడంలో అసలైన సూత్రం ఏమిటంటే, ఇచ్చే వస్తువుని తయారుచేసే శ్రమా, తీసుకునే వస్తువుని తయారుచేసే శ్రమా, సమానంగా వుండాలి. ‘శ్రమ’ అనే దాని కొలతలు, 2 వస్తువుల్లోనూ సమానంగా వుంటే, ఆ లక్షణంతోనే వాటికి మారకం జరుగుతుంది. వేరు వేరు వస్తువుల్లో శ్రమలు సమానంగా వుండడమే, ఆ రెంటికీ వున్న సమాన లక్షణం. మారకం జరగడానికి ఏ లక్షణం వుండాలో ఆ లక్షణం పేరు - ‘మారకం విలువ.’

కుండని తయారుచెయ్యడానికి మొత్తం 2 గంటల శ్రమ పట్టిందనుకుందాం. అదే, కుండకి - మారకం విలువ. చెప్పుల జతని తయారుచెయ్యడానికి కూడా మొత్తం 2 గంటల శ్రమ పట్టిందనుకుందాం. అది, దాని మారకం విలువ. అలాంటప్పుడు, కుండకి ఎంత మారకం విలువ వుందో, చెప్పుల జతకి కూడా అంత మారకం విలువ వుందని అర్థం. కుండని ఇచ్చి చెప్పుల్ని తీసుకుంటే, ఎంత విలువని ఇచ్చారో, అంత విలువని తిరిగి తీసుకున్నట్టు అవుతుంది. కుండ మనిషి, 2 గంటల శ్రమని ఇచ్చి, తను కూడా 2 గంటల శ్రమని తీసుకుంటాడు. అలాగే, చెప్పుల మనిషి కూడా, తను ఇచ్చినంత శ్రమని తిరిగి తీసుకుంటాడు. కుండకీ, చెప్పులకీ జరిగిన మారకం వల్ల, ఇటు మనిషికి గానీ, అటు మనిషికి గానీ, నష్టం జరిగేదేమీ వుండదు. అలా అని, లాభం వచ్చేది కూడా ఏమీ వుండదు. ఇచ్చిన విలువా, తీసుకున్న విలువా, సమానమే.



దీన్ని, ‘కుండ విలువ - చెప్పులు’ అని చదవాలి.

‘చెప్పుల విలువ - కుండ’ అని కూడా దీని అర్థం.

కుండా, చెప్పులూ సమానం. సమానం - ఏ విషయంలో? 'ఉపయోగపు విలువ' విషయంలో కాదు ; 'మారకం విలువల' విషయంలో. అంటే, ఆ వస్తువుల తయారీ కోసం అవసరమైన శ్రమ పరిమాణాల విషయంలో.

ఆ మారకం వల్ల, కుండ మనిషికి చెప్పులు దొరుకుతాయి ; చెప్పుల మనిషికి కుండ దొరుకుతుంది. ఎవరికీ ఏ లాభమూ నష్టమూ లేకుండానే. ఇచ్చినంత విలువే తిరిగి వస్తుంది. ఆ మారకం వల్ల, ఇద్దరి అవసరాలూ తీరతాయి.

[ 'మారకం విలువ' ని పొట్టిగా, తేలిగ్గా, 'విలువ' అనవచ్చు. 'విలువ' అన్నప్పుడు, దాన్ని 'ఉపయోగపు విలువ' అనుకోకూడదు. 'విలువ' అంటే, 'మారకం విలువే' అని అర్థం. ]

అయితే, ఈ మారకాలు ప్రారంభమైన వెనకటి కాలంలో, అప్పుడు వున్న మనుషులకు, 'శ్రమల' గురించి తెలుసా? కుండకి తక్కువ శ్రమ పడుతుందనీ, కుర్చీకి ఎక్కువ శ్రమ పడుతుందనీ, ఆ మనుషులకు తెలుసా? - తెలీదు. ప్రారంభంలో 'శ్రమ' అనే మాట ఎవ్వరికీ తెలీదు. ఎవరికి ఏ వస్తువుతో అవసరం వుంటుందో, ఆ వస్తువు కోసం, తమ వస్తువుని ఇచ్చేస్తారు. రెండో మనిషి కూడా తన వస్తువు ఇచ్చి, దీన్ని తీసేసుకుంటాడు. ప్రారంభ కాలంలో, 'సమాన లక్షణం' అనే మాటే వుండదు. ఆ సంగతే వాళ్ళకి తెలీదు.

క్రమ క్రమంగానే ఆ అనుభవాలు వచ్చాయి. ఏ వస్తువుని చెయ్యడానికి ఎక్కువ సేపు పడుతుందో, ఏ వస్తువుకి తక్కువ సేపు పడుతుందో, తెలుస్తూ వచ్చింది. అయినా, అలా తెలిసినప్పుడు కూడా ఆ లెక్కలు, ఖచ్చితంగా వుండవు. వెనకటి కాలంలో, ఖచ్చితమైన లెక్కలు లేకుండానే మారకాలు జరిగిపోయేవి అని ఊహించాలి.

## ప్రశ్నలూ - జవాబులూ

**1** . 'మారకం విలువ' అంటే?

**జ** : 2 వస్తువుల మధ్య మారకం జరగడానికి అవసరమైన విలువే - మారకం విలువ. ఆ వస్తువుల్ని తయారుచెయ్యడానికి అవసరమైన శ్రమలే, ఆ వస్తువుల మారకం విలువలు.

**2** . ప్రతీ వస్తువూ 'శ్రమ' తోనే తయారవుతుంది కదా? ప్రతీ వస్తువుకీ మారకం విలువ వున్నట్టేనా?


**జ** : వస్తువు తయారవగానే దాని శ్రమ, తప్పనిసరిగా 'విలువ' అయిపోదు. ఆ వస్తువుకి ఇంకో వస్తువుతో మారకం జరిగితేనే, ఆ 2 వస్తువుల శ్రమలూ విలువలుగా లెక్కకు వస్తాయి. మారకం జరగకపోతే, 'విలువ' ప్రసక్తి వుండదు.

**3** . 2 వేరు వేరు వస్తువులకు మారకం జరగాలంటే, ఆ వస్తువుల్లో ఏ లక్షణం సమానంగా వుండాలి?

**జ** : వాటి విలువలు సమానంగా వుండాలి. అంటే, ఆ వస్తువుల్ని చేసిన 'శ్రమ పరిమాణాలు' సమానంగా వుండాలి.

**4** . బరువుల్నీ, పొడవుల్నీ, శ్రమల్నీ కొలిచే సాధనాల్ని బొమ్మలతో చెప్పండి.

**జ** :




★

# 14. వస్తువుని తొందరగా చేస్తే? ఆలస్యంగా చేస్తే?

ఏ పని చెయ్యాలన్నా కొందరు తొంద రగా చేస్తారు ; కొందరు చాలా ఆలస్యంగా చేస్తారు. ఒక వస్తువుని ఒక మనిషి చురుగ్గా తక్కువ సేపట్లో చేసేస్తే, దానికి తక్కువ విలువ వుంటుందా? అదే రకం వస్తువుని ఇంకో మనిషి, బద్ధకంగా ఎక్కువ సేపు చేస్తే, దానికీ ఎక్కువ విలువ వుంటుందా? - అలా కాదు.

కుండల్ని చెయ్యాలంటే, ఒక్క కుటుంబం వాళ్ళే చెయ్యరు. ఇంకా కొన్ని కుటుంబాల వాళ్ళు కూడా ఆ పని చేస్తారు. కుండని చెయ్యడానికి సాధారణంగా ఆ పని చేసే వాళ్ళందరికీ 2 గంటల టైము పడుతుందనుకుందాం. అదే దాని లెక్క. ఒక మనిషికి కొంచెం ఎక్కువ సమయం, ఇంకో మనిషికి కొంచెం తక్కువ సమయం, పట్టవచ్చు. కానీ, సాధారణంగా పట్టే టైమే, ఆ వస్తువుకి విలువగా లెక్కకు వస్తుంది. కుండని చెయ్యడానికి సాధారణంగా పట్టే కాలం, 2 గంటలు అనుకుందాం. ఒక మనిషి, అదే రకం కుండని, 6 గంటల సేపు చేస్తే, దాని విలువ పెరగదు. ఆ 6 గంటల కాలం, 2 గంటల కాలం కిందే లెక్కకు వస్తుంది. ఇంకో మనిషి, కుండని ఒక్క గంట కాలంలోనే చురుగ్గా చెయ్య గలిగితే, ఆ కుండ విలువ తగ్గిపోదు. అది కూడా 2 గంటల కాలం గానే లెక్కకు వస్తుంది.

కుండ కోసం, చెప్పుల మనిషి, ఒక చెప్పుల జత పట్టుకుని వెళ్ళాడనుకుందాం. కుండ మనిషి, తెలివి తక్కువగా, " ఇది వరకు లాగ ఇప్పుడు కుండని ఇవ్వను. దీన్ని చెయ్యడానికి 6 గంటలు పట్టింది" అంటాడనుకుందాం.

చెప్పుల మనిషి ఆశ్చర్యపడి, " ఇది మామూలు కుండేగా? దీనికి నగిషీలూ అవీ లేవుగా? దీనికి ఎక్కువ కాలం ఎందుకు పట్టింది?" అని అడుగుతాడు.

" పట్టిందయ్యా! పట్టింది అలాగ."

" అదుగో, మీరు వాడుకుంటున్న కుండ కొత్తది లాగే వుంది. దానికి ఎంత కాలం పట్టింది?"

" దానికైతే 2 గంటలే. దీనికే 6 గంటలు పట్టింది."

" అయితే, నాకు ఇది వద్దు. దీన్ని నువ్వే వుంచుకుని, ఆ కుండే నాకియ్యి!" అంటాడు చెప్పుల మనిషి.

కుండ మనిషి తెల్ల మొహం వేస్తాడు. " సరేలే, ఇదే తీసుకో. చెప్పుల జత ఇటియ్యి" అని రాజీ కొస్తాడు. తన తప్పు తెలుసుకుంటాడు.

ఒక వస్తువు, సాధారణంగా అందరి దగ్గిరా ఎంత కాలంలో తయారవుతుందో, ఆ సగటు కాలమే, ఆ వస్తువు కోసం అవ సరమయ్యే కాలంగా లెక్కకు వస్తుంది. అంతేగానీ, బద్ధకంగా చేస్తే అది ఎక్కువ

విలువా, చురుగ్గా చేస్తే అది తక్కువ విలువా, అవవు.

**ప్రకృతి సహజ పదార్థం :**

'వస్తువు' అన్నప్పుడు, అది తయారవడానికి, మనుషులు చేసే శ్రమలు మాత్రమే చాలవు. ప్రకృతి సహజ పదార్థాలు కూడా కావాలి. ఏ వస్తువుని చూసినా, దాని మొదలు, ఏదో ఒక ప్రకృతి సహజ పదార్థం దగ్గర్నించీ ప్రారంభమవుతుంది.



ప్రకృతి సహజమైన అడవి


కుండని తయారు చెయ్యాలంటే, మొదట 'మట్టి' కావాలి. అది, భూమిని తవ్వితే దొరుకుతుంది. భూమి, ప్రకృతి సహజ పదార్థం. అది ఎవరి శ్రమ తోటీ తయారైనది కాదు. ఆ సహజ పదార్థానికి మారకం విలువ వుండదు. అలాంటి భూమిని తవ్వాలంటే, సహజ పదార్థం మీద (భూమి మీద) కొంత శ్రమ జరగాలి. భూమిని తవ్వి కొంత మట్టిని తీసి ఒక పక్కన పెడితే, ఆ మట్టి అలా బైటికి రావడానికి కొంత శ్రమ జరిగింది కదా? కాబట్టి, ఆ మట్టి, సహజ పదార్థం కాదు. ప్రకృతి, ఆ మట్టిని, ఎక్కడ వుండే లాగ, ఎలా వుండే లాగ ఇచ్చిందో, అలా వున్నప్పుడు మాత్రమే అది సహజ పదార్థం. దాని కోసం కొంత శ్రమ జరిగాక, అది సహజ పదార్థం కాదు. బైటికి వచ్చిన మట్టికి, ఇప్పుడు కొంత విలువ వుంటుంది. దాని కోసం ఎంత శ్రమ జరిగిందో, ఆ శ్రమే దాని విలువ. ఆ మట్టి ఇప్పుడు, కుండ తయారీకి కావలసిన ముడి పదార్థం అవుతుంది.



ఈ మట్టి కుప్ప సహజ పదార్థం కాదు

**పనిముట్టులో శ్రమ :**

ఆ మట్టిని అలా తవ్వడానికి ఏదైనా ఒక పనిముట్టు కూడా కావాలి. ఆ పనిముట్టు అప్పటికే శ్రమతో తయారై వుంటుంది. మట్టిని తవ్వడంలో ఆ పనిముట్టు కావాలి కాబట్టి, ఆ పనిముట్టుని చేసిన శ్రమ కూడా, ఆ మట్టిని తవ్వే పని కోసం అవసరమైనట్టు అర్థం. పార లాంటి, నాగలి లాంటి, గునపం లాంటి పనిముట్టుని చూడండి. దానితో, ఏదైనా చిన్న పని ఒక గంట సేపు చేసేటప్పటికే, ఆ పనిముట్టు అంతా అరిగిపోతుందా? - అలా అరిగిపోదు. అలాంటి పనిముట్లు అనేక సంవత్సరాల పాటు పనికివస్తాయి. మధ్య మధ్యలో వాటికి పదును పెట్టిస్తూ, బాగు చేయిస్తూ వుండాలి. కొంత కాలానికి ఇక పదును పెట్టినా పనికి రానంతగా పాడైపోతాయి. ప్రతీ పనిముట్టుకీ ఒక జీవితకాలం వుంటుంది. ఆ జీవితకాలంలో, అది, ఎన్ని వస్తువుల తయారీ



కోసం ఉపయోగపడుతుందో, ఆ వస్తువు లన్నిటికీ, ఆ పనిముట్టు విలువ, చిన్న చిన్న భాగాలుగా చేరుతుంది.

ఒక నాగలి విలువ - 20 గంటల శ్రమ. ఆ నాగలి, తన జీవిత కాలంలో, 40 ఎక రాల్ని దున్నడానికి ఉపయోగపడింది. అంటే, 1 ఎకరాన్ని దున్నే పనిలో, నాగలి ద్వారా చేరే విలువ - అర్ధ గంట శ్రమ. 1 ఎకరంలో పండే ధాన్యానికి, ఆ నాగలి ద్వారా చేరే శ్రమ అది. ఆ ధాన్యం పంట కోసం, ఇంకా ఇతర పనిముట్లూ, ఎద్దులూ, దున్నే మనుషులూ, - ఆ శ్రమలన్నీ వేరు.

నేల నించి మట్టిని తవ్వితే, తవ్విన శ్రమా, పనిముట్లని తయారుచేసిన శ్రమలో భాగం, ఆ రెండూ కలిసే - మట్టి విలువ.

అలా, తయారైన మట్టితో, కుండని చెయ్యాలంటే, మట్టిని తడపడానికి నీళ్ళు కావాలి. దూరంగా ఒక నీళ్ళ గుంట వుంది. అది మనుషులు తవ్వింది కాదు. గుంటలో నీళ్ళు ప్రకృతి సహజ పదార్థమే. ఆ నీళ్ళు గుంటలోనే వున్నప్పుడు, వాటికి విలువ వుండదు. ఆ నీళ్ళు ఇవతలికి రావాలంటే, వాటిని తీసుకువచ్చే శ్రమ చెయ్యాలి. ఆ పని కోసం ఒక గిన్ని లాంటి పనిముట్టు కూడా కావాలి. ఆ పనిముట్టు అప్పటికే శ్రమ ద్వారా తయారై వున్నదే. ఆ నీళ్ళని ఇవతలికి మోసుకు వస్తే, ఆ మోసిన శ్రమా, ఆ పనిముట్టులో శ్రమా, ఆ రెండూ కలిసి, నీళ్ళకి - విలువ. ఆ నీళ్ళని మట్టిలో పోసి కలిపితే, ఆ నీళ్ళూ, మట్టీ, రెండూ ముడి పదా



ర్థాలే. ఆ ముడి పదార్థాలతో కుండని చెయ్యడానికి కూడా కొంత శ్రమ జరగాలి. ఆ శ్రమ జరగడానికి కూడా ఏదో ఒక పని ముట్టు వుండాలి. మట్టిని తవ్వడం దగ్గి ర్నించీ, కుండని చేసే వరకూ, రామయ్య్య చేసిన రక రకాల శ్రమలూ, ఆ శ్రమల్లో ఉపయోగించిన పనిముట్లకి సంబంధిం చిన శ్రమలూ, అవన్నీ కలిసే కుండని తయారు చెయ్యడానికి అవసరమైన 'మొత్తం శ్రమ' అవుతుంది. ఆ మొత్తం శ్రమే ఆ కుండకి విలువ. ఆ మొత్తం శ్రమని, '2 గంటలు' అనుకుంటే, ఆ కుండ విలువ, 2 గంటల శ్రమ.

ఏ వస్తువుకి విలువ ఏర్పడే విధానం అయినా ఇలాగే.

# ప్రశ్నలూ - జవాబులూ

**1.** కుట్టు మనిషి, ఎవరికైనా చొక్కాని కుట్టిపెడితే, 1 శేరు బియ్యం వస్తాయి. పార్వతి, 1 చొక్కాని, 1 పూటలో కుట్టగలదు. సావిత్రి, అదే రకం చొక్కాని, 2 పూటల్లో కుడుతుంది. ఇద్దరి శ్రమలూ సమానమేనా? ఎవరికి ఎన్ని బియ్యం వస్తాయి?

**జ:** పార్వతి శ్రమ కాలం కన్నా, సావిత్రి శ్రమ కాలం రెట్టింపు. కానీ, ఇద్దరి పనీ ఒకే రకంగా లెక్కకు వస్తుంది. ఇద్దరు చేసిందీ ఒక్కొక్క చొక్కా కుట్టడమే. ఇద్దరికీ బియ్యం ఒకే రకంగా వస్తాయి. మందగొడిగా పనిచేస్తే, ఆ ఎక్కువ కాలంలో కొంత కాలం విలువ లేని దిగా పోతుంది. అయితే, ఈ ఉదాహరణలో, ఎవరి కాలం సగటు కాలంగా వుందో, ఆ విషయం ప్రశ్నలో లేదు. పార్వతి కాలమే సగటు కాలం అయితే, ఆమె ప్రకారమే సావిత్రికి కూడా జరుగుతుంది. లేదా, సావిత్రిదే సగటు కాలం అయితే, ఈ ప్రకారమే జరుగుతుంది. ★

[4]



# 15. పాత శ్రమా, కొత్త శ్రమా



ఒక వస్తువుని తయారుచెయ్యడానికి అవసరమైన మొత్తం శ్రమే, ఆ వస్తువుకి విలువ కదా? ఆ ‘ మొత్తం శ్రమ’ లో, పాత శ్రమ కొంతా, కొత్త శ్రమ కొంతా వుంటాయి. ఆ రెండూ కలిసి, వస్తువు తయారైపోయాక, ఆ మొత్తం శ్రమ అంతా, ‘ పాత శ్రమే’ అవుతుంది.

వస్తువుని తయారుచెయ్యడానికి, ముడి పదార్థాలూ, పనిముట్లూ, సహాయక పదార్థాలూ, కావాలి. అవి లేకుండా వస్తువు తయారవదు. ఆ 3 రకాల వస్తువులూ శ్రమలతో తయారై వున్నవే. అదంతా అప్పటికే జరిగిన శ్రమ కాబట్టి, అది పాత శ్రమ. వాటిని ఉపయోగిస్తూ తర్వాత చేసేది - కొత్త శ్రమ. కుండ తయారైపోయాక, దాని మొత్తం శ్రమ అంతా - పాత శ్రమే.

బట్టతో చొక్కాని కుడితే, మొదట బట్టని తయారుచేసిన శ్రమ అంతా, పాత శ్రమ. పనిముట్లని చేసిన శ్రమ - పాత శ్రమ. ఆ బట్ట మీద తర్వాత జరిగిన కుట్టు శ్రమ, కొత్త శ్రమ. చొక్కా తయారైపోయాక, కుట్టు శ్రమ కూడా పాత శ్రమే.

**‘ పాత శ్రమ’ కి వేరే పేర్లు :**

గత శ్రమ. జరిగిపోయిన శ్రమ. వస్తువుల రూపంలో వున్న శ్రమ ( ఉత్పత్తి సాధనాలన్నీ వస్తువులుగానే వుంటాయి. వాటిలో వున్న శ్రమ కాబట్టి, ఇది వస్తు రూపపు శ్రమ ). నిర్జీవ శ్రమ. - ఇందులో ఏ పేరు అయినా, ఉత్పత్తి సాధనాల విషయమే. ఇది, పాత శ్రమే.

**‘ కొత్త శ్రమ’ కి వేరే పేర్లు :**

ప్రస్తుత శ్రమ. జరుగుతూ వున్న శ్రమ. సజీవ శ్రమ. - ఇందులో ఏ పేరు అయినా కొత్త శ్రమే.

పాత శ్రమలే లేకపోతే, ( అంటే, ముడి పదార్థాలూ పనిముట్లూ సహాయక వస్తువులూ లేకపోతే ), కొత్త శ్రమలు చెయ్యడం సాధ్యం కాదు. ( ‘ వెలికి తీత శ్రమలు’ జరగడానికి ముడి పదార్థాలు లేకపోయినా, మిగతావి తప్పకుండా వుండాలి. )

వస్తువుకి వున్న ‘ మారకం విలువ’ అంటే - శ్రమే. పాత శ్రమా, కొత్త శ్రమా కలిసినది. అదంతా శ్రమే కాబట్టి, దాన్ని ‘ శ్రమ’ అంటే చాలు. పాతదా, కొత్తదా - ఆ తేడాలు ప్రతీ సారీ అక్కర లేదు. ఆ వివరాలతో అవసరం వున్న సందర్భాల్లోనే వాటిని చూడాలి.

కొన్ని వస్తువులు ఎక్కువ శ్రమతో తయారైతే, కొన్ని వస్తువులు తక్కువ శ్రమతో తయారవుతాయి. ఎక్కువ శ్రమ అయితే, అది ఎక్కువ విలువ. తక్కువ శ్రమ అయితే, అది తక్కువ విలువ.

వ్యవసాయ శ్రమల ద్వారా తయారయ్యే ఉత్పత్తులు ఎప్పుడూ ఒకే విలువతో వుండవు. ఎందుకంటే, ఒక ఎకరం భూమిలో, పండే పంట, ప్రతీ సారీ ఒకే పరిమాణంతో వుండదు. ఎక్కువ పంట పండితే, ఒక బస్తా ధాన్యానికి పట్టే శ్రమ కాలం తగ్గి, బస్తా విలువ తగ్గుతుంది. లేదా, తక్కువ పంట పండితే, బస్తా ధాన్యానికి పట్టే శ్రమ కాలం

పెరిగి, బస్తా విలువ పెరుగుతుంది.

ఆ ధాన్యంతో బియ్యం తయారైతే, ఆ బియ్యంతో రొట్టెలు తయారైతే, ధాన్యం విలువల్లో జరిగే మార్పుల్ని బట్టి, వాటితో తయారయ్యే పదార్థాల విలువలు కూడా మారతాయి.

ఒక వస్తువుకి గానీ, పదార్థానికి గానీ, దానికి పట్టిన శ్రమని బట్టే - దాని విలువ.

కుండ విలువ - 2 గంటల శ్రమ.

చెప్పుల విలువ - 2 గంటల శ్రమ.

ఈ 2 వస్తువుల విలువలూ సమానమే కాబట్టి, ఆ వస్తువులకు మారకం జరుగుతుంది. చెప్పుల విలువ, 2 గంటల శ్రమ కదా? కుండ విలువ, 1 గంట శ్రమే అయితే, ఆ వస్తువులకు మారకం జరగదు. అప్పుడు, కుండ మనిషికి చెప్పుల జత కావాలంటే, 2 కుండలు ఇవ్వాలి. అలాగైతే విలువల లెక్క సరిపోతుంది.

సమాన విలువల మధ్యనే మారకం జరుగుతుంది గానీ, తక్కువ -ఎక్కువ విలువల మధ్య మారకం జరగదు. ఇది 'విలువ సూత్రం.'

'విలువ' అంటే శ్రమే - అని చూశాం. కుండ విలువ - 2 గంటల శ్రమ. అయితే, ఆ కుండని చూస్తే, అందులో, 'విలువ' కనపడుతుందా? - కుండని చూస్తే, అది నలుపో తెలుపో, పెద్దదో చిన్నదో, అలా దాని శరీర లక్షణాలు కనపడతాయి.

చొక్కాని చూస్తే, 'ఇది కుట్టు శ్రమతో తయారైంది' అని తెలుస్తుంది. కుర్చీని చూస్తే, 'ఇది వడ్రంగం శ్రమతో తయారైంది' అని తెలుస్తుంది. ఏ వస్తువుని చూసినా, దాని కోసం ఏం శ్రమ జరిగిందో తప్పకుండా తెలుస్తుంది. కానీ, వస్తువు శరీరంలో 'విలువ' అనే లక్షణం కనపడదు. ఎందుకంటే : విలువ అంటే శ్రమే అయినా, వస్తువులో కనపడే శ్రమే, యథాతథంగా, అదే రూపంతో, 'విలువ' కాదు. 'మారకం విలువ' అంటే, వస్తువుని ఏ శ్రమలు తయారుచేస్తాయో, ఆ శ్రమలే వాటి రూపాల తోటే, సూటిగా కనపడడం కాదు. వస్తువులో కనపడే శ్రమ, విలువగా మారడానికి చాలా తతంగం వుంది. చొక్కాలో కుట్టునీ, కుర్చీలో వడ్రంగాన్నీ చూడగానే, విలువని చూసినట్టు కాదు.

అయితే, విలువ ని ఎలా చూడగలం?

# ప్రశ్నలూ - జవాబులూ

**1.** 'పాత శ్రమ' అంటే? 'కొత్త శ్రమ' అంటే? ఉదాహరణలతో చెప్పండి!

**జ :** 'పాత శ్రమ' అంటే, అప్పటికే జరిగిపోయిన శ్రమ. 'కొత్త శ్రమ' అంటే, కొత్తగా జరుగుతూ వున్న శ్రమ. బట్టని చొక్కాగా కుట్టాలి. బట్ట అప్పటికే తయారై వుంది. బట్టని చేసిన శ్రమ - పాత శ్రమ. బట్ట మీద జరిగే కుట్టు శ్రమ - కొత్త శ్రమ. పనిముట్లని తయారుచేసిన శ్రమ కూడా - పాత శ్రమ. సూదిని తయారుచేసిన శ్రమ - పాత శ్రమ. దానితో చేసే కుట్టు శ్రమ - కొత్త శ్రమ. దీన్ని క్లుప్తంగా చెప్పుకుంటే, ఉత్పత్తి సాధనాల్ని చేసిన శ్రమ పాత శ్రమ. వాటితో జరిగే శ్రమ - కొత్త శ్రమ.

**2.** పాత శ్రమకీ, కొత్త శ్రమకీ, కొన్ని వేరు వేరు పేర్లు ఏమిటి?

**జ :** పాత శ్రమ = గత శ్రమ = నిర్జీవ శ్రమ = జరిగిపోయిన శ్రమ.
కొత్త శ్రమ = ప్రస్తుత శ్రమ = సజీవ శ్రమ = జరుగుతూ వున్న శ్రమ. →

**3**. మనుషులు చేసేది, పాత శ్రమా, కొత్త శ్రమా?

**జ**: ఏ శ్రమ అయినా మనుషులు చేసేదే.
పాత శ్రమా మనుషులు చేసినదే ;
కొత్త శ్రమా మనుషులు చేసేదే.





**4**. పార్వతి, చొక్కా కుడుతోంది. ఇక్కడ పాత శ్రమ జరుగుతోందా, కొత్త శ్రమ జరుగుతోందా?

**జ**: కొత్త శ్రమ జరుగుతోంది. పాత శ్రమలు అంతకు ముందే జరిగాయి. బట్టా, సూదీ, దారం, గుండీలూ, అంతకు ముందే తయారై వున్నాయి.

**5**. కుర్చీ ఇప్పుడే తయారైంది. కుర్చీని తయారుచేసిన శ్రమ పాత శ్రమా, కొత్త శ్రమా?

**జ**: కుర్చీ తయారైపోయింది కాబట్టి, దాని కోసం ఖర్చయిన శ్రమ అంతా పాత శ్రమే.

**6**. చొక్కా తయారవ్వాలంటే, బట్ట కావాలి. బట్ట కోసం దారం కావాలి. దారం కోసం పత్తి కావాలి. పత్తి కోసం వ్యవసాయ శ్రమ కావాలి. ఇన్ని శ్రమల్లో, చొక్కా ఏ శ్రమతో తయారైనట్టు అర్థం?

**జ**: చొక్కా కోసం ఏ ముడి పదార్థం కావాలో, ఆ ముడి పదార్థం మీద జరిగే శ్రమనే చెప్పుకోవాలి. చొక్కాకి ముడి పదార్థం - బట్ట. ఆ బట్ట మీద జరిగే శ్రమ - కుట్టు. కాబట్టి, "చొక్కా, కుట్టు శ్రమతో తయారవుతుంది" అని చెప్పుకోవాలి. ఏ వస్తువు గురించి అయినా, అది తయారయ్యే దశలో జరిగే శ్రమనే కొత్త శ్రమగా చెప్పుకోవాలి.

**7**. చొక్కాని తయారు చెయ్యడానికి 'కుట్టు శ్రమ' మాత్రమే చాలా? బట్టని తయారుచేసిన నేత శ్రమా, పత్తిని తయారుచేసిన వ్యవసాయ శ్రమా, అక్కర లేదా?

**జ**: నేత శ్రమ కావలసింది చొక్కా కోసం కాదు ; బట్ట కోసం. వ్యవసాయ శ్రమ కావలసింది, చొక్కా కోసమూ కాదు, బట్ట కోసమూ కాదు ; పత్తి కోసం. గత శ్రమల పేర్లు తీసుకోవడం మొదలుపెడితే, నాగలిని తయారుచేసే శ్రమా, మగ్గాన్ని తయారుచేసే శ్రమా మాత్రం కావొద్దా? అంతే కాదు, నాగలిని తయారుచెయ్యడానికీ, మగ్గాన్ని తయారుచెయ్యడానికీ కూడా సాధనాలు కావాలి. ఆ సాధనాల్ని తయారుచెయ్యడానికి కూడా సాధనాలు కావాలి. ఇది, వెనక్కి వెనక్కి అంతం లేకుండా పోతుంది. కాబట్టి, అదంతా అనవసరం. చొక్కా, బట్ట మీద కుట్టుతో తయారవుతుంది కాబట్టి, కుట్టునే తీసుకోవాలి. వెనకటి శ్రమ అంతా, ముడి పదార్థాల్లోనూ, పనిముట్ల లోనూ వుంటుంది. ఆ పాత శ్రమల మీద, కొత్త శ్రమ కలుస్తుంది. ఏ వస్తువు సంగతైనా ఇలాగే.

**8**. ఏదైనా ఒక వస్తువు ( ఒక ఉత్పత్తి ) తయారవ్వాలంటే, ఏమేమి కావాలి?

**జ**: ఉత్పత్తి సాధనాలూ + శ్రమా.
పాత శ్రమా + కొత్త శ్రమా.

**9**. 

ఇందులో ఏం శ్రమ?

**జ**: పాత శ్రమ.

**10**. కొత్త శ్రమ ఒక్కటే విడిగా జరుగుతుందా?


**జ**: జరగదు. కొత్త శ్రమ జరిగేటప్పుడు, ముడి పదార్థాలూ పనిముట్లూ అవీ ఖర్చవుతూ వుంటాయి. అంటే, కొత్త శ్రమతో పాటు పాత శ్రమ కూడా ఖర్చవుతుంది. ★

# 16. 'విలువ' ని ఎలా చూడగలం?

ఏ వస్తువుని చూసినా దాని శరీర లక్షణాలన్నీ తెలుస్తాయి. అది ఎందుకు ఉపయోగపడుతుందో తెలుస్తుంది. చొక్కా అయితే, తొడుక్కోడానికి. కుండ - నీళ్ళు పోసుకోవడానికి. కుర్చీ - కూర్చోవడానికి. ఇలా, వస్తువుల శరీర లక్షణాల ద్వారా వాటి ఉపయోగపు విలువలు కనపడతాయి. కానీ ఏ వస్తువుని చూసినా, దాని విలువ ( మారకం విలువ ) కనపడదు. మరి, 'విలువ' ని ఎలా చూడగలం? అది వస్తువు శరీరంలో వుండదు కాబట్టి, దాన్ని చూడనే లేమా?

ఎందుకు చూడలేము? 'విలువ' అంటే, 'మారకం విలువే' కదా? ఏ వస్తువు మారకం విలువ అయినా, ఆ వస్తువుకి 'మారకం జరిగినప్పుడు' తప్పకుండా కనపడుతుంది.

విలువల్ని మనం ఇంతకు ముందే చూశాం. కుండకీ, చెప్పుల జతకీ, మారకం జరిగినప్పుడు, అక్కడ ఏం జరిగింది? అక్కడ ఏం చూశాం?



ఇక్కడ, 'విలువ' కనపడుతోంది
కుండకి బదులుగా వచ్చింది - కుండ విలువ
చెప్పులకు బదులుగా వచ్చింది - చెప్పుల విలువ

కుండ విలువ - చెప్పులు.
చెప్పుల విలువ - కుండ.

కుండని ఇచ్చి, చెప్పుల్ని తీసుకుంటే, ఆ చెప్పుల్ని చూస్తే, కుండ విలువని చూసినట్టే. అలాగే, చెప్పుల్ని ఇచ్చి కుండని తీసుకుంటే, చెప్పుల విలువని కూడా చూసినట్టే.

కుండకి మారకమే జరగకపోతే? తయారైన కుండని ఇంట్లోనే వాడుకుంటున్నారు. దాన్ని మారకానికి పంపలేదు. కుండ వెళ్ళిపోలేదు. దానికి బదులుగా రెండో వస్తువు రాలేదు. అలాంటప్పుడు, ఆ కుండ విలువని చూడలేము.

వస్తువుకి మారకం జరగకపోతే, దానికి విలువ లేదని అర్థమా? ఆ వస్తువు శ్రమతో తయారుకాలేదనీ, అందుకే విలువ లేదనీ, అర్థమా? - అలా కాదు. శ్రమ లేకపోతే ఏ వస్తువూ తయారు కాదు. వస్తువు తయారవడమే మొదట జరుగుతుంది. అలా తయారైన వస్తువుకి, మారకం జరుగుతుందా లేదా అనేది, తర్వాత సంగతి. మారకం జరిగినా జరగకపోయినా, ప్రతి వస్తువూ శ్రమలతో తయారయ్యేదే. మారకం జరిగితే, దాని విలువని చూస్తాం. మారకం జరగకపోతే, దాని విలువ ప్రసక్తి వుండదు.

కుండకి మారకం జరిగితే, దాని విలువ ఇంకో వస్తువుగా వుంటుంది కదా? వస్తువు విలువ, ఆ వస్తువు నించి దూరంగా, విడిగా వుండడం ఆశ్చర్యంగా లేదూ?

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. వస్తువు తయారైంది. దాన్ని చూస్తే దాని రంగు తెలుస్తుంది. దాని విలువ తెలుస్తుందా?

**జ** : తెలియదు. ఎందుకంటే, విలువ, వస్తువు శరీరంలో వుండదు.

**2**. మట్టి పిడతా, వెండి చెంబూ, పక్క పక్కనే వున్నాయి. వాటిని చూస్తే, మట్టి పిడతకి విలువ తక్కువ అనీ, వెండి చెంబుకి విలువ ఎక్కువ అనీ, మనకు తెలిసిపోతుంది కదా? అంటే, ఆ వస్తువుల్లో విలువలు కనపడినట్టే కదా?

**జ** : అలాంటి వస్తువుల్ని మనం అంతకు ముందు కూడా చాలా సార్లు చూసి వుంటాం. మట్టి విలువ కన్నా బంగారం విలువ చాలా ఎక్కువగా వుంటుందని అంతకు ముందే విని వుంటాం. అలాంటి అనుభవాల వల్ల, ఏ వస్తువుని చూసినా దాని విలువ ఎలా వుండవచ్చో కొంచెం ఊహించగలం. అంతే గానీ, మట్టి పిడతకి చిన్న విలువా, వెండి చెంబుకి పెద్ద విలువా, వుంటాయని మనం అనుకునేది, ఆ విలువలు ఆ వస్తువుల శరీరాల్లో కనపడడం వల్ల కాదు.


**3**.



దీని విలువ ఏమిటి?

**జ**: తెలీదు. కుండకి మారకం జరిగి, ఇంకో వస్తువు వస్తేనే అది కుండ విలువ అవుతుంది.


**4**.



కుండ విలువ ఏమిటి?

**జ** : కుండ విలువ - చెప్పుల జత.

**6**.




దీని అర్థం?


**జ** : ఈ రెండు ఉత్పత్తుల విలువలూ సమానం అని.

ధాన్యం ఇచ్చి, కుర్చీని తీసుకున్నారు. కుర్చీని ఇచ్చి ధాన్యం తీసుకున్నారు. ఇది బార్టరు మారకం.

**5**.



**7**.



దీని అర్థం ఏమిటి?

**జ** : చొక్కా కుట్టి పెడితే, బట్టలు ఉతికిపెడతాడు.

కుండకీ, చెప్పులకూ జరిగిన మారకం కూడా బార్టరు మారకమే.

★

# 17. వస్తువు విలువ, వస్తువుకి బైట ఎందుకు ఉంటుంది?


తయారుచేసిన వస్తువుని, స్వంతానికే వాడుకుంటే, దాని విలువ ఏమిటో తెలియదు. ఆ విలువని చూడలేము. ఆ వస్తువుని, ఎవరికైనా ఉచితంగా ఇస్తే, అప్పుడు కూడా దాని విలువ ప్రసక్తి వుండదు.

కుండకీ, చెప్పుల జతకీ, మారకం జరిగింది. కుండని ఇస్తే చెప్పులు వచ్చాయి. చెప్పులు ఎందుకు వచ్చాయి? కుండని తీసుకున్న వాళ్ళు, కుండ విలువని చెల్లించాలి కాబట్టి, ఆ విలువ కోసమే చెప్పులు ఇచ్చారు. కుండకి మారకం జరిగి, కుండ వెళ్ళిపోయింది కాబట్టి, దాని విలువ వచ్చింది. ఇప్పుడు, కుండ విలువ కనపడుతోంది - చెప్పులుగా. చెప్పుల రూపంతో! ఆ చెప్పుల్ని చూస్తే, కుండ విలువని చూసినట్టే.

అలాగే, చెప్పుల సంగతి చూస్తే, చెప్పుల విలువ కూడా కనపడుతోంది, కుండగా. కుండ రూపంతో!

కుండ విలువ, చెప్పులుగా వుండడం అంటే, కుండ విలువ, కుండ శరీరంలో లేదు. ఆ శరీరం నించి విడిగా బైట వుంది. అలాగే, చెప్పుల విలువ కుండగా వుండడం అంటే, చెప్పుల విలువ, చెప్పుల శరీరంలో లేదు. ఆ శరీరం నించి విడిగా బైట వుంది. ఏ వస్తువు విలువ కనపడాలన్నా, అది, ఆ వస్తువు నించి బైట, ఇంకో వస్తువుగా వుంటుంది. ఉపయోగపు విలువ అయితే, వస్తువులోనే వుంటుంది గానీ, వస్తువు నించి బైట వుండదు కదా?

ఒక వస్తువు - విలువ ని చూడాలంటే, ఇంకో, వస్తువుని చూడాలన్నమాట!




కుండ విలువ, కుండకి బైట వుంది!


వస్తువు విలువ, వస్తువు శరీరంలోనే వుండక, దాన్నించి విడిగా బైట ఎందుకు వుంటుంది? - 'విలువ' గురించి మొట్ట మొదట ఈ ప్రశ్న రావాలి. దీనికి జవాబు తర్వాత చూద్దాం.

**కుండ విలువ ఎప్పుడూ చెప్పులేనా?**

కుండ విలువ, చెప్పుల రూపంతో వుందని చూశాం కదా? కుండ విలువ ఎప్పుడూ చెప్పుల రూపంతోనే వుంటుందా? - అలా వుండదు. కుండ, ఎప్పుడూ చెప్పుల జత తోనే మారదు కదా? కుండ, ఇప్పుడు చెప్పులతో మారింది కాబట్టి, కుండ విలువ ఇప్పుడు చెప్పులుగా వుంది. అదే కుండ, చెప్పులతో గాక, ఇంకో వస్తువుతో మారి వుంటే, కుండ విలువ, ఇంకో వస్తువుగానే వుంటుంది కదా?

రామయ్య ఇంట్లో, ఒకటి రెండు కుండలే కాదు, చాలా కుండలు తయారవు

తాయి. వాటిలో కొన్నిటినే వాళ్ళు స్వంతానికి వాడుకుంటారు. మిగతా వాటిని మారకాలు చేసి, వాటితో వేరే వేరే వస్తువులు తెచ్చుకుంటారు. ప్రతీ కుండ తోటీ చెప్పుల జతలే తెచ్చుకోరు. ఒక కుండని ఇచ్చి చెప్పులు తెచ్చుకుంటే, ఇంకో కుండని ఇచ్చి ధాన్యం తెచ్చుకోవచ్చు. మూడో కుండని ఇచ్చి చేట తెచ్చుకోవచ్చు. నాలుగో కుండని ఇచ్చి బట్టలు ఉతికించు కోవచ్చు. ఒక కుండకి బదులుగా ఏ వస్తువు వస్తే, ఆ వస్తువే ఆ కుండ విలువ. ఆ వస్తువు రూపమే, ఆ విలువకి రూపం. ఒక కుండ విలువ, చెప్పుల రూపంతో ; ఇంకో కుండ విలువ, ధాన్యం రూపంతో ; మూడో కుండ విలువ, బెల్లం రూపంతో - ఇలా



వుంటాయి. కుండ మనిషికి, ఏ వస్తువుతో అవసరం వుందో, కుండని ఇచ్చి ఆ వస్తువుని తెచ్చుకుంటాడు.



కుండలు ఇచ్చి, వేరు వేరు వస్తువులు తెచ్చుకున్నారు. ప్రతీ మారకం లోనూ, కుండ విలువ కుండకి బైటే వుంది!

10 కుండలు ఒకే సైజులో, ఒకే రకంగా వున్నాయి అనుకుందాం. వాటిని తయారు చేసిన శ్రమ అంతా ఒకే రకం. వాటి విలువలన్నీ సమానం. కానీ, ఆ 10 కుండలూ వేరు వేరు వస్తువులతో మారతాయి కాబట్టి, ఏ కుండ విలువ రూపం ఆ కుండదే.

'ధాన్యం' అనే వస్తువుని చూద్దాం. ధాన్యం పండించిన మనిషి, కొంత ధాన్యం ఇచ్చి చెప్పుల జత తీసుకుంటే, కొంత ధాన్యం ఇచ్చి బెల్లం తీసుకోవచ్చు. ధాన్యం అంతా ఒకే రకం అయినా, అది వేరు వేరు వస్తువులతో మారుతుంది కాబట్టి, ధాన్యం విలువ, వేరు వేరు రూపాలతో వుంటుంది.

కుండ, చెప్పులతో మారినా, బెల్లంతో మారినా, ధాన్యంతో మారినా, ఏ వస్తువుతో మారినా, కుండకి విలువగా వుండేది - ఇంకో వస్తువే. ఆ విలువ, కుండ శరీరానికి బైట వుండేదే. ఉపయోగపు విలువ అయితే అలా బైట వుండదు. అది, వస్తువు శరీరం లోనే వుంటుంది. కుండ పెద్దదో చిన్నదో చూడాలంటే, కుండనే చూడాలి. మామిడి పండు, తియ్యగా వుందో పుల్లగా వుందో చూడాలంటే, ఆ పండునే తిని చూడాలి. కానీ, మారకం విలువని చూడాలంటే, ఆ

వస్తువుని చూస్తే కాదు, దానికి బైట చూడాలి. దీన్ని బట్టి గ్రహించవలసింది - 'ఉపయోగపు విలువ' అనేది, సహజమైన లక్షణం ; 'మారకం విలువ' అనేది అసహజమైన లక్షణం - అని.

శరీరంలో వుండే లక్షణాలే సహజ మైనవి ; ఉండదగ్గవి. శరీరంతో సంబంధం లేకుండా బైట వుండే లక్షణం, అసహజ మైనది ; ఉండకూడనిది. - మొదట ఈ విషయాలు అర్థం చేసుకోవాలి.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. రామయ్య, 4 కుండలు తయారుచేశాడు. అన్నీ ఒకే రకం. వాటిని వేరు వేరు మనుషులకు ఇచ్చి, వాళ్ళ నించి వేరు వేరు వస్తువులు తీసుకున్నాడు. అన్ని కుండలకూ విలువ సమానమేనా? ఆ కుండల 'విలువ రూపం' ఒకటేనా?

**జ** : 4 కుండలూ ఒకే రకం. అన్నిటికీ శ్రమ కాలం సమానమే. కాబట్టి, 'విలువ' సమానమే. కానీ, ఆ కుండలు, వేరు వేరు వస్తువులతో మారాయి. కాబట్టి, వాటి విలువ రూపాలు ఒకటి కాదు. ఒక కుండ విలువ, ధాన్యంగా వుంటే ; ఇంకో కుండ విలువ, చెప్పుల జతగా వుంటుంది. 4 కుండలకూ విలువ సమానమే అయినా, ఆ విలువని చూపించే రూపాలు వేరు వేరు.

**2**. వస్తువు విలువ, వస్తువుకి దూరంగా, బయట ఎందుకు వుంటుంది?

**జ** : 'విలువ' అనేది, సహజ లక్షణం అయితే, అది కూడా 'రంగు' లాగా, 'బరువు' లాగా, వస్తువు శరీరంలోనే వుండేది. అది సహజ లక్షణం కాదు కాబట్టే, వస్తువుకి బయట వుంటుంది.

**3**.



ఇవి ఏం శ్రమలు?

**జ** : పాత శ్రమలు.

**4**. విలువ అంటే శ్రమే కదా? శ్రమ, అసహజమైనది ఎలా అవుతుంది?

**జ** : దీని కోసం, ఇంకా 3, 4 పాఠాలు చూడాలి. అవి కూడా చూసే దాకా ఆగాలి.

**5**. బట్టలు ఉతికే పనిలో, పాత - కొత్త శ్రమల్ని బొమ్మలతో చూపించండి!

**జ** :



పాత శ్రమ



కొత్త శ్రమ

**6**. కొన్ని కొత్త శ్రమల్ని చూపించండి.

**జ** :



★

# 18. విలువ అసహజమైనది!

వస్తువుకి సంబంధించిన సహజ విషయాలు, (1) దాన్ని తయారు చెయ్యడమూ, (2) వాడుకోవడమూ - ఈ రెండే. తయారు చెయ్యక పోతే వస్తువే వుండదు. వస్తువు కావాలంటే, దాన్ని తయారుచేసుకోవలిసిందే. అది సహజ విషయం. తయారైన వస్తువుల్ని వాడుకోకపోతే, అవసరాలు తీరవు. అవసరాలు తీరాలంటే, వస్తువుల్ని వాడుకోవలిసిందే. వాడుకోవడం కూడా సహజ విషయం. - ఈ 2 విషయాలూ మానవ జీవితంలో తప్పనిసరిగా జరగవలసిన విషయాలు. - ఇంత వరకూ తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు.

కానీ, 'మారకాలు' కూడా అంత తప్పనిసరి విషయాలేనా? అంత సహజ విషయాలేనా? మారకాలు లేకపోతే, వస్తువుల్ని తయారు చేసుకోవడమూ, వాడుకోవడమూ సాధ్యం కాదా?

ఆటవిక కాలం- అనే వెనకటి కాలంలో మనుషులు, వస్తువుల్ని తయారు చేసుకుంటూ, మారకాలు లేకుండానే వాటిని వాడుకుంటూ జీవించేవారు కదా? అది ఎలా సాధ్యమైంది?

చొక్కా తయారవ్వాలంటే, బట్టా, సూదీ దారాలూ వుండి తీరాలి కదా? వాటిలో ఏది లేకపోయినా చొక్కా తయారవడం ఆగిపోతుంది. అయితే, ఆ బట్టా సూదీ దారాలు, మారకాల వల్ల వచ్చినవే అయి వుండాలా? అవి, మారకాలు లేకుండా వచ్చినవి అయితే, వాటితో చొక్కా తయారవదా? అలాగే, తయారైన చొక్కాకి మారకం జరగకపోతే, దాన్ని తొడుక్కోవడం సాధ్యం కాదా? అది ఒంటి మీదకి ఎక్కదా?

అంటే, వస్తువులు తయారవడానికి గానీ, తర్వాత ఉపయోగపడడానికి గానీ, మారకాలతో ఏమీ సంబంధం లేదు. మారకాలు సహజ అవసరాలు కావు. మారకాలు లేకపోయినా, వస్తువులు తయారవుతాయి ; ఉపయోగపడతాయి. కాబట్టి, మారకాలు అసహజ విషయాలే. కానీ, ఈ విషయం అర్థం చేసుకోవడం ఇబ్బందిగా వుంటుంది. అయినా, 'మారకాలు అసహజమైనవి' అని అర్థం చేసుకోక తప్పదు. మారకాలు అసహజమైనవి కాబట్టి, వాటి వల్ల ఏర్పడే 'మారకం విలువ' కూడా అసహజమైనదే. విలువ, అసహజమైనది కాబట్టే అది వస్తువుకి బయట వుంటుంది.

దీని మీద బోలెడు సందేహాలు వస్తాయి.

**మొదటి సందేహం :** 'విలువ అసహజమైనది ఎలా అవుతుంది? విలువ అంటే శ్రమే కదా? శ్రమలు లేకపోతే వస్తువులు తయారవవు కదా? అలాంటప్పుడు, శ్రమలు అసహజమైనవి ఎలా అవుతాయి?

**జవాబు :** వస్తువులు తయారవడానికి శ్రమలు అవసరమే. చొక్కా కోసం కుట్టు శ్రమ అవసరం. కుర్చీ కోసం వడ్రంగం శ్రమ అవసరం. ఈ రకంగా, రక రకాల శ్రమలు లేకపోతే వస్తువులే వుండవు. శ్రమలు లేకపోతే, ప్రకృతి సహజ పదార్థాల్ని, వస్తువులుగా తయారుచెయ్యడమే జరగదు. కాబట్టి, వస్తువుల్ని తయారుచేసే శ్రమలన్నీ

సహజమైనవే. కానీ, 'అసహజత్వం' అనేది, ఈ సహజ శ్రమల గురించి కాదు. ఈ సహజ శ్రమలు, 'విలువగా మారడం' గురించి. ఒక సహజ శ్రమ, 'విలువ' గా మారడంలో, చాలా అసహజత్వం జరుగుతుంది. అసహజంగా మారిన శ్రమలే 'విలువ' అవుతాయి. అందుకే విలువ, అసహజమైనది అవుతుంది.

[ శ్రమ, విలువగా మారడం అంటే, ఏం జరుగుతుందో తెలిస్తే తప్ప, ఇక్కడ ఈ విషయం అర్థం చేసుకోలేము. దీన్ని కొంత దూరం వెళ్ళాక ఇంకో పాఠంలో వివరంగా చూస్తాం. ]

కుట్టు శ్రమ - సహజమైనదే. అది విలువగా మారడమే - అసహజమైనది. వడ్రంగం శ్రమ - సహజమైనదే. అది విలువగా మారడమే అసహజమైనది. మారకాల వల్లే, శ్రమలు అసహజంగా మారతాయి కాబట్టే మారకాలు అసహజం. మారకం విలువ, అసహజం.

**రెండో సందేహం :** 'మారకాలు అసహజమైనవి ఎలా అవుతాయి? ఏ మనిషి అయినా, 2, 3 రకాల వస్తువుల కన్నా ఎక్కువ వస్తువులు తయారు చేసుకోలేడు కదా? కానీ, మనుషులు జీవించడానికి చాలా రకాల వస్తువులు కావాలి కదా? మారకాల పద్ధతి లేకపోతే, వేరే రకాల వస్తువులు ఎలా దొరుకుతాయి? మనుషుల అవసరాలు ఎలా తీరతాయి? మారకాలు, అసహజమైనవి ఎలా అవుతాయి?

**జవాబు :** ఈ సందేహాలన్నీ ఎంతో మంచివి. తెలివైనవి. సందేహాలు రావడం అంటే, ఆలోచిస్తున్నామనడానికి గుర్తు. ఈ సందేహాలన్నిటికీ సరైన జవాబులు వున్నాయి. కానీ వాటిని ఇక్కడే అర్థం చేసుకోలేము. ఇంకా కొన్ని పాఠాలు చూడాలి. ఒక మనిషి, తనకు కావలసిన అనేక రకాల వస్తువులన్నీ తనే తయారు చేసుకోలేడనేది నిజమే. మారకాల వల్ల, మనుషుల అవసరాలు తీరడం అనేదీ నిజమే. కానీ, ఇదంతా, మనుషుల సంబంధాలు, 'ఫలానా రకంగా' వుండడం వల్లనే. ఈ సంబంధాల్లోనే ఒక అసహజత్వం వుంది. ఆ అసహజత్వం వల్లనే మారకాలు అవసరమవుతున్నాయి. ఈ అసహజత్వం లేకపోతే, మారకాలతో అవసరం వుండదు. మారకాలతో అవసరం లేకపోతే, సహజ శ్రమలు, 'విలువ' గా మారే పరిస్థితి వుండదు. ఇదంతా ఎలా సాధ్యమో ఈ పాఠంలోనే చూడలేము.

'మారకాలు ఎందుకు అసహజం? విలువ ఎందుకు అసహజం?' అని, చాలా మంచి సందేహాలు వచ్చిన వాళ్ళకి, మారకాల గురించి ఇంకో 2 సందేహాలు కూడా తప్పకుండా రావాలి. ఎలాగంటే : (1) వస్తువు విలువ, వస్తువు శరీరంలో లేకుండా బైట ఎందుకు వుంది? అది, శరీరంలోనే ఎందుకు లేదు? (2) వస్తువుకి, విలువ, సహజ లక్షణమే అయితే, అది ఎప్పుడూ కనపడుతూనే వుండాలి కదా? అది, మారకం జరిగితేనే కనపడడమూ, మారకం జరగకపోతే కనపడక పోవడమూ ఏమిటి? - ఈ సందేహాలు కూడా రావాలి.

'డబ్బు అంటే ఏమిటి?' అనే ప్రశ్నతో మొదలుపెట్టిన తర్వాత, మనం ఇప్పటి దాకా 'డబ్బు' ని చూడనే లేదు. ఇప్పుడిప్పుడే డబ్బుకి కొంచెం దగ్గిరికి వస్తున్నాం.

[ ఈ పాఠానికి, చివర్లో రావలసిన ప్రశ్నలు పాఠంలోనే ఉన్నాయి. చివర్లో ప్రశ్నలు లేవు. ] ★

# 19. విలువ అంతా శ్రమదే! అది, ఏ పదార్థానిదీ కాదు!

ఏ వస్తువు అయినా, శ్రమ తోనే తయారవుతుంది - అనవచ్చునా? అలా అంటే, అది పొరపాటు. ఎందుకంటే, వస్తువు తయారవడానికి ' శ్రమ' ఒక్కటే చాలదు కదా? ' ప్రకృతి సహజ పదార్థం' కూడా వుండాలి కదా? అంటే, వస్తువు తయారవడానికి, ( 1 ) ప్రకృతి సహజ పదార్థమూ, ( 2 ) శ్రమా - ఈ 2 అంశాలూ కావాలి. సహజ పదార్థమూ + శ్రమా = వస్తువు. వస్తువు గురించి, ఇది, మొట్ట మొదట తెలుసుకోవలసిన విషయం.

తర్వాత, రెండో విషయం : వస్తువు తయారవడానికి 2 అంశాలు అవసరమైనా, వస్తువుకి ఏర్పడే విలువ, ఆ 2 అంశాలదీ కాదు ; ఒక్క అంశానిదే. ' శ్రమ' అనే అంశానిదే. - ఈ విషయం సరిగా అర్థం చేసుకుంటే, ' ఆర్థిక శాస్త్రం'లో ప్రధాన విషయం అంతా తెలిసిపోయినట్టే. ఇది తెలిస్తే, తర్వాత విషయాలన్నీ తేలిగ్గా అర్థమవుతాయి.

చొక్కాని తీసుకుందాం. దాని కోసం, మొత్తం 3 గంటల శ్రమ అవసరమైందనుకుందాం. చొక్కా విలువ అంతా, ఆ శ్రమదే.

చొక్కాలో, ' బట్ట' అనే పదార్థం వుంది కదా? దాని మాటేమిటి? దానికి, ' విలువ' లేదా? - బట్టకి విలువ వుంది. కానీ, బట్టకి ఆ విలువ ఎలా వచ్చిందో చూస్తే, అది కూడా శ్రమ వల్ల వచ్చినట్టే తేలుతుంది. బట్టలో వున్న దారానికీ విలువ వుంది. దానికి ఆ విలువ ఎలా వచ్చిందో చూస్తే, అదీ శ్రమదే. దారంలో వున్న పత్తికీ విలువ వుంది. అదీ శ్రమదే. ఆ పత్తి ఎక్కడ పండిందో అక్కడికి వెళ్తే, అది ప్రకృతి సహజ పదార్థం అయిన భూమి అవుతుంది. భూమికి విలువ వుండదు. విలువ లేని భూమి మీద, శ్రమ జరగడం మొదలైతే, పత్తి పండుతుంది.

ఆ పత్తికి కొంత విలువ ఏర్పడిందంటే, అది భూమి వల్ల కాదు ; పత్తిని పండించడానికి జరిగిన రక రకాల కొత్త శ్రమల వల్లా, అక్కడ అవసరమైన ఉత్పత్తి సాధనాలకు సంబంధించిన పాత శ్రమల వల్లా, ఏర్పడింది. ఆ విలువ, ఆ శ్రమలదే గానీ, పత్తి అణువులది కాదు.

ఆ పత్తి, వెయ్యి కిలోల బరువు గలది అయితే, అందులో నించి ఒక్క చొక్కాకి అవసరమైనంత పత్తినే, దాని విలువనే, మనం దృష్టిలో పెట్టుకోవాలి. ఆ పత్తితో దారం తయారవ్వాలంటే, పత్తికి వున్న విలువ మీద ( పాత శ్రమ మీద ), దారాన్ని చేసే పనిముట్ల పాత శ్రమలు కూడా కలుస్తాయి. పనిముట్లతో జరిగే కొత్త శ్రమలు కూడా కలిసి, ఆ మొత్తం శ్రమ, దారం విలువ అవుతుంది. ఆ దారంతో బట్ట తయారైనప్పుడూ అంతే. ఆ బట్టతో చొక్కా తయారైనప్పుడూ అంతే. ప్రతీ దశలోనూ అలాగే జరిగి, ముడి పదార్థాల పాత శ్రమకు, పనిముట్ల పాత శ్రమలూ, వాటితో

జరిగే కొత్త శ్రమలూ కలిసి, శ్రమ రాసి పెరగడం వల్లనే, విలువ పెరుగుతూ వుంటుంది.

చొక్కా విలువ 3 గంటల శ్రమ అయితే, అది పత్తిని పండించడం దగ్గిర నించీ ప్రారంభమై, తర్వాత దశల్లో కూడా శ్రమలు కలుస్తూ, ఆ రకంగా చివరికి 3 గంటలు అయిందని అర్థం. అంటే, ఆ విలువ అంతా, పత్తి దగ్గిర్నించీ, కుట్టు వరకూ జరిగిన శ్రమలదే గానీ, చొక్కాలో వున్న ఏ పదార్థానిదీ కాదు. చొక్కాలో, కొంత బట్టా, దాన్ని కుట్టిన దారం, చొక్కాకి అంటించిన గుండీలూ, కాలర్‌లో పెట్టిన గట్టి ముక్కలూ - అలా అనేక పదార్థాలు వుంటాయి. కానీ, 'విలువ' అనేది, ఆ పదార్థాల్లో ఏ అణువులదీ కాదు.

వస్తువు విలువని అర్థం చేసుకోవాలంటే, దాని కోసం చిట్ట చివరగా జరిగిన కొత్త శ్రమ నించి వెనక్కి, పాత శ్రమల్ని చూసుకుంటూ వెళ్ళాలి. 'పాత శ్రమ' అంటే, ఎంత పాత దాకా వెళ్ళాలి? సహజ పదార్థం కనపడే దాకా వెళ్ళాలి. అక్కడ జరిగిన ప్రారంభ శ్రమ దగ్గిరికి వెళ్ళాలి. వెనక్కి వెళ్ళేటప్పుడు దారి పొడుగునా ముడి పదార్థాల నించీ, పనిముట్ల నించీ చేరిన శ్రమల్ని తీసివేస్తూ వెనక్కి వెళ్తే, ఏం కనపడుతుందో చూడాలి. చొక్కాకి వున్న వెనక దశల్ని చూసుకుంటూ వెళ్తే, చొక్కా వెనక బట్ట, బట్ట వెనక దారం, దారం వెనక పత్తి, పత్తి వెనక ప్రకృతి ఇచ్చిన భూమి - అలా కనపడతాయి. ఏ వస్తువుకి అయినా దాని వెనక దశల్ని చూసుకుంటూ వెళ్తే, ఏ శ్రమా లేని దశ ఒకటి కనపడుతుంది. అక్కడ సహజ పదార్థం ఒకటి కనపడుతుంది. ఆ సహజ పదార్థం మీద కొంచెం శ్రమ జరిగితే, పాత శ్రమ లేకుండానే కొత్త శ్రమ జరిగినట్టు అవుతుంది.

అడవిలో వున్న చెట్టూ, దానికి వున్న పళ్ళూ, సహజ పదార్థాలు. వాటికి విలువలు వుండవు. ఒక మనిషి, ఆ చెట్టెక్కి, పళ్ళు తెంచి, కిందకి తెచ్చుకుంటే, అదంతా కొత్త శ్రమ. కానీ అక్కడ ముడి పదార్థమూ లేదు ; పనిముట్లూ లేవు. అంటే, పాత శ్రమ లేకుండానే కొత్త శ్రమ జరిగింది. అక్కడే శ్రమ అనేది ప్రారంభమైంది. అక్కడ చూస్తే, విలువ అనేది, ఎక్కడి నించి మొదలైందో తెలుస్తుంది. శ్రమ జరిగినప్పటి నించే, ఆ శ్రమే విలువగా లెక్కకు వస్తున్నదని తెలుస్తుంది.

ఒక కుండని చూసినా, కుర్చీని చూసినా, ఏ వస్తువుని చూసినా, దాని విలువ, దాని శరీరానిదే అనుకుంటాం. శరీరంలో వున్న పదార్థాలదే అనుకుంటాం. కానీ విలువ, ఏ పదార్థానిదీ కాదు. ఇది కుండ సంగతే కాదు ; చొక్కా సంగతే కాదు. బంగారపు ఆభరణం అయినా అంతే ; బ్రహ్మాండమైన ఏడంతస్తుల భవనం అయినా అంతే. ఓడ అయినా, విమానం అయినా, అంతే. వస్తువు చిన్నదా, పెద్దదా అని కాదు. ఎంత పెద్ద వస్తువు అయినా అంతే. వస్తువు విలువ, దాని తయారీకి అవసరమైన, దాని ముడి పదార్థాల తయారీకి అవసరమైన, దాని పనిముట్ల తయారీకి అవసరమైన, దాని సహాయ పదార్థాల తయారీకి అవసరమైన, అనేక దశల్లో జరిగిన లక్షల - కోట్ల శ్రమ గంటలన్నీ కలవగా ఏర్పడిన మొత్తం శ్రమలో ఒక భాగం. అదే, ఆ వస్తువు విలువ.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ' శ్రమ' కనపడుతుందా?

**జ**: ఏ శ్రమ అయినా, అది జరుగుతూ వున్నప్పుడు తప్పకుండా కనపడుతుంది. బట్టలు కుడుతూ వున్నప్పుడు, కుట్టు శ్రమ జరుగుతూ వుండడం కనపడదూ? నేత పని జరుగుతూ వుంటే, అది కనపడదూ? వంట పని కనపడదూ? అలాగే ఏ శ్రమ అయినా కనపడుతుంది. అది జరుగుతూ వున్నప్పుడే కాదు ; జరిగిపోయిన తర్వాత కూడా ఆ వస్తువుని చూస్తే, ఆ శ్రమలు ఆ వస్తువు శరీరంలో, కనపడతాయి. చొక్కాని చూస్తే, నేతా కుట్టూ జరిగినట్టు కనపడతాయి. ఏ ఉత్పత్తిని చూసినా అలాగే.

**2**. సహజ పదార్థమూ + శ్రమా = వస్తువు - కదా? అయితే, ఏ వస్తువులో అయినా సహజ పదార్థం కనపడుతుందా? ' కుండ' లో గానీ, ' చొక్కా' లో గానీ, ' కుర్చీ' లో గానీ, ఏ వస్తువులో అయినా, సహజ పదార్థాన్ని చూడగలమా?

**జ**: ' వస్తువు' లో అయితే చూడలేము. ' వస్తువు' లో కాకుండా అయితే, సహజ పదార్థాన్ని చూడగలము. దూరంగా వున్న భూమిని చూస్తే, అది సహజ పదార్థం. ' అడవి' ని చూస్తే, ' కొండ' ని చూస్తే, అవి సహజ పదార్థాలు. అడవిలో, చెట్టు కొమ్మకి వున్న ' ఆకు' ని చూస్తే, ' పండు' ని చూస్తే, అవి సహజ పదార్థాలు. చెట్టు ఎక్కి ఆ పండు ని కోసి కిందకి తెచ్చుకుంటే, ఇక అది సహజ పదార్థం కాదు. అది, ప్రకృతి ఎలా ఇచ్చిందో అలా వున్న పదార్థం కాదు. ఆ పండు, ఒక మనిషి శ్రమతో కిందకి వచ్చిన పదార్థం. - ' కుండ' లో కనపడే ' మట్టి', సహజ పదార్థం కాదు. కుర్చీలో కనపడే ' చెక్క', సహజ పదార్థం కాదు. ఏ వస్తువులోనూ, సహజ పదార్థాన్ని చూడలేము. <u>ఏ వస్తువుని చూసినా అందులో ముడి పదార్థాలే కనపడతాయి.</u> కానీ, ఆ ముడి పదార్థాల్లో నించి కూడా శ్రమని తీసేస్తే, అప్పుడు సహజ పదార్థం దగ్గిరికి వెళ్తాం. ఆ సహజ పదార్థమే లేకపోతే, ముడి పదార్థాలు తయారుకావు. కాబట్టి, ' సహజ పదార్థమూ + శ్రమా = వస్తువు' అంటాం. ఆ సహజ పదార్థం, వస్తువు లోనే కనపడుతుందని కాదు.

**3**. చొక్కాలో వున్న ప్రకృతి సహజ పదార్థం ఏమిటి?

**జ**: చొక్కాలో వున్నది - బట్ట. బట్టలో వున్నది - దారం. దారంలో వున్నది - పత్తి. పత్తిలో ఇంకేమీ లేదు. కానీ ఆ పత్తి, సహజ పదార్థం కాదు. ఏ వస్తువులోనూ సహజ పదార్థం కనపడదు. ముడి పదార్థాలే కనపడతాయి.

**4**. చొక్కాలో నించి కుట్టు శ్రమని తీసేస్తూ, అసలు శ్రమే లేని దశకు వెళ్ళండి! ఎక్కడికి వెళ్తారు?

**జ**: చొక్కాలో నించి ఒక్కొక్క శ్రమనీ తీసేస్తూ వెళ్తే, కాస్సేపటికి ' పత్తి' దగ్గిరికి వెళ్తాం. ఆ పత్తిలో నించి కూడా వ్యవసాయ శ్రమని తీసేస్తే, ' భూమి' దగ్గిరికి వెళ్తాం. ఏ వ్యవసాయ శ్రమా జరగని రాళ్ళూ రప్పల భూమి దగ్గిరికి. కానీ, ఆ భూమి, చొక్కాలో ఉండదు.

**5**. చొక్కా తయారవ్వాలి. బట్టా, దారం అన్నీ ఉన్నాయి. సూది లేదు. ఏం జరుగుతుంది?


**జ**: పని ఆగిపోతుంది. ఉత్పత్తి సాధనాల్లో ఏది లేకపోయినా పని జరగదు. ★

# 20. సహజ పదార్ధమూ + శ్రమా = వస్తువు
## విలువ ఉండదు + విలువ = సరుకు

సహజ పదార్థం మీద శ్రమ జరిగినప్పుడు, ఆ సహజ పదార్థపు రూపం చాలా మారిపోతుంది. భూమిని తవ్వి మట్టిని బైటికి తీస్తే, ఆ మట్టి, ఇక వెనకటి భూమి కాదు. ఆ మట్టితో కుండని చేస్తే, ఆ కుండ, ఇక వెనక తవ్విన మట్టి కుప్ప కాదు. శ్రమల ద్వారా పదార్థాల ఆకారాలు ఎలా మారినా, విలువ అనేది, సహజ పదార్థాలదీ కాదు. మారిన పదార్థాలదీ కాదు.

ఒక ఓడ విలువనో, విమానం విలువనో, పరిశీలిస్తూ వెనక్కి వెళ్ళండి! ఆ విలువ కథ, వెనక్కి వెళ్ళి వెళ్ళి భూమి దగ్గిరికో, భూమిలో వున్న లోహాల గనుల దగ్గిరికో వెళ్తుంది. అక్కడ ప్రారంభమైన శ్రమకి, అనేక వందల దశల్లో జరిగిన కొత్త శ్రమలు కలిసి, చిట్ట చివరికి ఆ ఓడో, విమానమో తయారవడం కనపడుతుంది.

'విలువ అనేది శ్రమదే' అని అర్థం చేసుకోవడానికి ఇంకో చిన్న ఉదాహరణ చూద్దాం. అడవిలో ఒక చోట, భూమి లోపల దుంపలు ఉన్నాయి. అవి అక్కడ అలా పెరగడానికి, మనుషులెవరూ ఏ శ్రమా చెయ్యలేదు. ఆ దుంపలు అక్కడ ప్రకృతి సహజంగానే పెరిగాయి. ఆ భూమీ, ఆ దుంపలూ, సహజ పదార్థాలే. వాటికి విలువలు ఉండవు.



ఆ దుంపల్ని బైటికి తియ్యాలంటే, నేలని తవ్వడానికి ఒక పనిముట్టు కావాలి. ఆ పక్కనే ఒక ఎండిన చిన్న చెట్టుకొమ్మ నేల మీద పడి వుంది. ఆ చెట్టు కూడా ఎవరూ పెంచిన చెట్టు కాదు. నేల మీద పడి వున్న ఆ కొమ్మ కూడా సహజ పదార్థమే. దానికీ విలువ వుండదు.



ఆ కొమ్మని పనిముట్టుగా ఉపయోగించుకుంటూ, ఒక మనిషి, భూమిని తవ్వి లోపల వున్న దుంపల్ని బైటికి తీసి నేల మీద పెట్టాడు. ఆ పని కోసం ఒక గంట సేపు పట్టింది. అంటే, ఆ మనిషి, గంట సేపు తవ్వకం శ్రమ చేశాడు. ఆ తవ్వకం పనిలో ముడి పదార్థం లేదు కాబట్టి, ముడి పదార్థం నించి చేరే శ్రమ ఏదీ లేదు. ఆ పనిలో ఒక పనిముట్టు వున్నా, అది శ్రమతో తయారైనది కాదు కాబట్టి, దాని నించి చేరే శ్రమ కూడా ఏదీ లేదు. ఆ దుంపల్ని బైటికి తియ్యడానికి జరిగిన శ్రమ, 1 గంట మాత్రమే.

నేల మీదకు చేరిన దుంపలు సహజ పదార్థమా? - కాదు. అవి, భూమి లోపల ఉన్నప్పుడే, వాటిని ప్రకృతి ఎలా ఇచ్చిందో

అలా ఉన్నప్పుడే అవి సహజ పదార్థం. కొంత శ్రమ జరగడం ద్వారా పైకి వచ్చిన దుంపలు ఇక సహజ పదార్థం కాదు. అవి ఇప్పుడు శ్రమతో తయారైన పదార్థం. లేదా, వస్తువు. నేల మీదకి చేరిన దుంపల్లో నించి శ్రమని తీసేసినట్టుగా, అసలు శ్రమ జరగ నట్టుగా ఊహించండి! అప్పుడు, దుంపలు భూమిలోనే ఉంటాయి.

భూమిలో దుంపలూ + కొంత తవ్వకం శ్రమా = నేల మీద దుంపలు. ఈ దుంపలు ఇప్పుడు ఎవరివి? - అవి నేల మీదకి వచ్చే లాగ ఎవరు శ్రమ చేశారో ఆ మనిషివి.

నేల మీద దుంపలకు ఇప్పుడు 'విలువ' వుంటుంది. వాటి కోసం జరిగిన శ్రమే, వాటి విలువ. ఎంత శ్రమ జరిగిందో, అంత విలువ. ఆ దుంపలకు భూమిలో వున్నప్పుడు లేని విలువ, బైటికి వచ్చి నప్పుడు ఏర్పడింది. ఎందుకు?

నేల మీద వున్న దుంపలకు ఏర్పడిన విలువ, ఆ దుంపల శరీరాలదా, అవి బైటికి రావడానికి జరిగిన శ్రమదా? - ఆ శ్రమదే. ఆ శ్రమే జరగకపోతే, ఆ దుంపలు నేల మీద వుండవు. నేల లోపలే కప్పడిపోయి వుంటాయి. అప్పుడు వాటికి విలువ వుండదు. బైటికి రావడం వల్లనే వాటికి విలువ. ఆ విలువ, అవి బైటికి రావడం కోసం జరిగిన శ్రమదే.

**ఒక ప్రశ్న :** నేల మీదకు చేరిన దుంపలకు అయినా విలువ వుంటుందని ఎందుకు అనుకోవాలి? అవి అలా నేల మీదకు రావడానికి కొంత శ్రమ జరిగిన మాట నిజమే. అంత మాత్రాన, ఆ శ్రమకు 'విలువ' అనే పేరు ఎందుకు రావాలి? ఆ పేరు లేకుండానే ఆ దుంపల్ని వాడుకోవచ్చు కదా?

**జవాబు :** నిజమే. ఇది చాలా మంచి ప్రశ్న. ఆ దుంపల కోసం ఏ మనిషి శ్రమ చేశాడో ఆ మనిషే వాటిని వాడుకుంటే, అప్పుడు 'విలువ' అనే మాట వుండదు. 'విలువ' అంటే, 'మారకం విలువే' కదా? <u>మారకం</u> జరగవలసి వుంటేనే 'విలువ' ప్రసక్తి వస్తుంది.

ఒక మనిషి, తన శ్రమతో ఒక వస్తువుని తయారుచేసినప్పుడు, ఆ వస్తువు మీద అతనికే హక్కు వుంటుంది. అది, అతని స్వంతం అయిపోతుంది. <u>శ్రమ చెయ్యడం వల్లే ఆ హక్కు ఏర్పడుతుంది.</u> అది సరియైన హక్కు. ఒక మనిషి, 1 గంట శ్రమ చేసి తవ్వి బైటికి తీసిన దుంపల్ని, ఇంకో మనిషి వచ్చి వాటిని వూరికే తీసుకుపో గలడా? అలా వీలు అవదు. ఆ దుంపలు మొదటి మనిషివే - అని రెండో మనిషి కూడా ఒప్పుకుంటాడు. ఆ తవ్వకం పని రెండో మనిషే చేసి వుంటే, ఆ దుంపలు అతనివే అని మొదటి మనిషి కూడా ఒప్పుకుంటాడు. కాబట్టి, ఇప్పుడు నేల మీద వున్న దుంపలు మొదటి మనిషివే. ఆ శ్రమ అతనే చేశాడు కాబట్టి. ఆ దుంపల్ని రెండో మనిషి తీసుకోవాలంటే, ఆ దుంపల విలువ ఎంత వుందో అంత విలువ గల ఇంకో వస్తువుని ఇవ్వాలి. లేదా, అంత విలువ గల ఏదైనా పని చేసిపెట్టాలి. అలా చేస్తే, దుంపల విలువని ఇచ్చేసి ( విలువని చెల్లించి ) దుంపల్ని తీసుకున్నట్టు అవుతుంది.

భూమిలో దుంపలూ + శ్రమా =
బైటికొచ్చిన దుంపలు.

ఆ దుంపల విలువ = ఆ శ్రమే.

'విలువ' అనే మాట ఎప్పుడు వుంటుందంటే, మారకాలు జరగాలంటేనే. మార

కాలే లేకుండా ఎవరి వస్తువుల్ని వాళ్ళే వాడుకుంటే, విలువ లెక్కలతో అవసరం వుండదు. మారకాలు జరగాలంటే మాత్రం, ఇచ్చే వస్తువు విలువా, తీసుకునే వస్తువు విలువా, సమానంగా వున్నాయో లేవో తెలియాలి కాబట్టి, విలువ లెక్కలు అవసరం.

మారకాలు జరిగేటప్పుడు, ఆ 2 వస్తువులకూ 'సరుకులు' అనే కొత్త పేరు వస్తుంది. మారకం అయిపోయాక అవి మళ్ళీ వస్తువులే.

ఇద్దరు మనుషులు కలిసి, చెరో కర్రపుల్లా పట్టుకుని ఆ దుంపల్ని తవ్వుకున్నారనుకుందాం. ఆ పనికి అర గంట కాలం పట్టిందనుకుందాం. ఇద్దరికీ చెరో అర గంటా. ఇద్దరూ సమానంగా శ్రమ చేసినట్టు అవుతుంది. 2, 3 నిముషాల తేడా వున్నా అది లెక్కలోకి రాదు. ఇద్దరూ తవ్వి తీసుకున్న దుంపల్ని ఇద్దరూ వాడుకోవచ్చు. అప్పుడు మారకం ప్రసక్తీ, విలువ ప్రసక్తీ, ఉండవు.

భూమి మీద వ్యవసాయం శ్రమలు, నలుగురైదుగురు కలిసి చేసుకుంటారనుకుందాం. అందరూ ఒకే రకంగా, బాధ్యతగా పనులు చేశారు. చివరికి పంట పండింది. దాన్ని అందరూ వాడుకున్నారు. శ్రమలు చేసేటప్పుడు బాధ్యతగా చేసి, పంటని వాడుకునేటప్పుడు కూడా బాధ్యతగా వాడుకుంటారు. శ్రమలు చేసే మనుషులు ఇలా వుండడం అంటే, సమిష్టిగా వున్నారని అర్థం. శ్రమలు చేసే సంబంధాలు ఇలా వుంటే, విలువ లెక్కలూ, మారకాలూ అక్కరలేదు.

కానీ, మనుషులు విడి విడిగానే శ్రమలు చేసుకుంటున్నారు. వెనకటి కాలం నించీ ఈ నాటి వరకూ వున్న పరిస్తితి ఇదే. దీన్ని బట్టి, మారకాలూ, విలువ లెక్కలూ ఎందుకు అవసరమవుతున్నాయో అర్థం చేసుకోవాలి.

**ఎంత శ్రమకి అంత విలువ :**

ఒకే బరువుతో 2 వేరు వేరు లోహాల్ని తీసుకుందాం. 1 తులం బరువు గల రాగినీ, 1 తులం బరువు గల బంగారాన్నీ. దేని విలువ ఎక్కువ? - బంగారం విలువ ఎక్కువ. రాగి విలువ తక్కువ.- ఎందువల్ల?

ఎక్కువ విలువ అంటే, ఎక్కువ శ్రమే కదా? తక్కువ విలువ అంటే తక్కువ శ్రమ. తులం రాగిని తయారుచెయ్యడాని కన్నా, తులం బంగారాన్ని తయారు చెయ్యడానికి ఎక్కువ శ్రమ పడుతుందన్నమాట!

వజ్రం విలువ, అదే బరువు గల బంగారం విలువ కన్నా చాలా ఎక్కువ వుంటుంది. ఎందువల్ల? -దాన్ని తయారు చెయ్యడానికి, బంగారం కన్నా కూడా చాలా ఎక్కువ శ్రమ పడుతుందన్నమాట! అంటే, దేన్ని అయినా తయారుచెయ్యడానికి జరిగే శ్రమే - దాని విలువ! ఎక్కువ శ్రమ అయితే, ఎక్కువ విలువా; తక్కువ శ్రమ అయితే, తక్కువ విలువా.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. భూమిలో దుంపలకు విలువ లేదు. భూమి పైకి వచ్చిన దుంపలకు విలువ వుంది. ఎందుకు?

**జ**: భూమిలో దుంపలు - సహజ పదార్థం. ఆ దుంపల కోసం ఎవరూ వ్యవసాయ శ్రమ చెయ్యలేదు. కానీ, ఆ దుంపల్ని భూమి పైకి తేవడానికి ఒక మనిషి, శ్రమ →

చేశాడు. ఆ దుంపల కోసం కొంత శ్రమ జరిగింది కాబట్టే, అది విలువ అవుతుంది.

ఆ దుంపల్ని ఇంకొకరు తీసుకోవాలంటే, ఆ శ్రమ కోసం, ఇంకో శ్రమని ఇవ్వాలి.

**2**. బంగారానికి బొగ్గు కన్నా విలువ ఎక్కువ. ఎందుకు? బంగారం, బొగ్గు కన్నా తక్కువగా దొరుకుతుంది కాబట్టా? లేకపోతే, బంగారానికి ఎక్కువ శ్రమ పడుతుంది కాబట్టా?

**జ**: ఎక్కువ శ్రమ పడుతుంది కాబట్టి. ఎక్కువ శ్రమకి, ఎక్కువ విలువ. తక్కువ శ్రమకి, తక్కువ విలువ. ఎక్కువ శ్రమ పట్టడానికి కారణం, తక్కువగా దొరుకుతుంది కాబట్టే. కానీ, 'విలువ'కి కారణాన్ని, 'శ్రమ' అనే మాట ద్వారానే చెప్పాలి. ఎక్కువ శ్రమ పడుతుంది కాబట్టే ఎక్కువ విలువ. జవాబు ఆ రకంగా వుండాలి. దాని మీద ఇంకో ప్రశ్నకి అవకాశం ఉండదు.

**3**. కొంత మంది మనుషులు కలిసి సమిష్టిగానే శ్రమలు చేసుకుంటారనుకుందాం.

అప్పుడైనా, ఎన్ని రకాల వస్తువుల్ని చేసుకోగలరు? అలాంటి 2 బృందాలు వేరు వేరుగా ఉంటారు. అప్పుడైనా మారకాలతో అవసరం ఉండదా? లేకపోతే అవసరాలెలా తీరతాయి?


**జ**: అవును. ఇలాంటి సందేహాలన్నీ రావాలి. కానీ, ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి

ఈ పాఠం సరిపోదు. ఇంకా చాలా పాఠాలు చూడాలి. ఇక్కడ అర్థం చేసుకోవలసింది ఏమిటంటే, ఇద్దరు మనుషులు కలిసి ఆ దుంపల్ని తవ్వుకుంటే, వాటిని ఇద్దరూ వాడుకోవచ్చు - అని. ఒక్క మనిషే ఆ పని చేసి, ఇంకో మనిషి ఊరికే కూర్చుని వుంటే, అప్పుడు, ఆ దుంపల్ని ఇద్దరూ వాడుకోగలరా? పని చెయ్యని మనిషికి ఆ దుంపల్ని వాడుకునే హక్కు ఉంటుందా? ఇద్దరూ ఆ పని చేస్తే? ఒక్కరే ఆ పని చేసి, రెండో మనిషి చెయ్యకపోతే? - ఈ విషయాలే ఇక్కడ అర్థం చేసుకోవాలి. తర్వాత విషయాలు తర్వాత. **H**

# 21. బార్టరు మారకాల సమస్య!

**బా**ర్టరు పద్ధతి మారకాలు అంటే, వస్తువుని ఇచ్చి వస్తువునో, పనినో, తీసుకునే మారకాలు. ఈ బార్టరు పద్ధతిలో, చాలా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్తితి కూడా వుంటుంది. ఒక ఉదాహరణ చూద్దాం!

రామయ్య చెప్పులు, బాగా పాతబడి పాడై పోయాయి. అయినా వాటి తోనే కాల క్షేపం చేస్తూ ఇబ్బంది పడుతున్నాడు. ఒక రోజు కాస్త ఖాళీ చేసుకుని ఒక కొత్త కుండ పట్టుకుని చెప్పుల సోమయ్య దగ్గిరికి వెళ్ళి ఎప్పటి లాగే, "ఒక జత చెప్పులు ఇయ్యి సోమయ్యా!" అని అడిగాడు.



సోమయ్య కొంచెం నవ్వి, "ఇప్పుడు మాకు కుండ అక్కర లేదు రామయ్యా! పాత కుండలు బాగానే వున్నాయి" అన్నాడు.

రామయ్య కూడా నవ్వి, "ఇప్పుడు అక్కర లేదా? అలాగా? ఫర్వాలేదులే.

మీకేం కావాలో చెప్పు! అది తెచ్చి యిచ్చి చెప్పులు పట్టుకుపోతాను" అన్నాడు.

"మాకా? బెల్లం కోసం వెళ్దామను కున్నాను. మా ఆవిడే వెళ్తానంది పొద్దున్న. వెళ్ళిందో లేదో అడుగుతా నుండు. ఏమే! ........." అని సోమయ్య పెళ్ళాం కోసం అరవబోతోంటే, ఆవిడే వచ్చింది. "ఎక్కడ వెళ్ళానూ? పని తెమిల్తేనా? ఇదుగో, గుగ్గిళ్ళు ఉడకేసి వెళ్దామను కుంటున్నాను" అంది.



రామయ్య సంతోషంగా లేచి, కింద పెట్టిన కుండ పట్టుకుని, "అబ్బే, ఇంకెందుకూ నువ్వెళ్ళేది? నేను తెచ్చి పెట్టి చెప్పులు పట్టుకుపోతా. బెల్లమేంగా? సిటికెలో రానూ?" అంటూ గబ గబా బెల్లం వెంకన్న దగ్గిరికి బైల్దేరాడు. - "వెంకన్నా! ఈ కుండ తీసుకుని బెల్లం ఇయ్యి! నాకసలు చెప్పులు కావాలని సోమయ్య దగ్గిరికి వెళ్ళాను. వాళ్ళకి కుండ అక్కర లేదంట. బెల్లం కావాలంట. 'సరే, తెస్తాలే' అని ఇటొచ్చా. బెల్లం పట్టుకుపోయి వాళ్ళకిచ్చి చెప్పులు తీసుకోవాలి వెంకన్నా! చెప్పులు తెగిపోయి చాలా యాతనగా వుందయ్యా. మట్టి తవ్వుదామని పోతే అక్కడన్నీ ముళ్ళే. చెప్పుల్లేక చస్తున్నాను. కాస్త తొందరగా ఇద్దూ, పోవాలి. మట్టి పని చాలా వుంది" అన్నాడు గబ గబా.

బెల్లం వెంకన్న కొంచెం ఇబ్బందిగా చూశాడు. "అయ్యో, రామయ్యా! మాకూ కుండ అక్కర్లేదయ్యా! మొన్నే మీ తమ్ముడి గారింట్లో రెండు కుండలూ దాకలూ తెచ్చింది మా ఆవిడ" అన్నాడు.

రామయ్య కొంచెం కంగారుపడ్డాడు. "మీకూ అక్కర్లేదా కుండ? అయ్యో, ఇప్పుడెలాగయ్యా? తొందరగా పోదామను కున్నాను. సరేలే, పోనీ మీకేం కావాలో చెప్పు! అది మీకు తెచ్చిపెట్టి, బెల్లం పట్టుకు పోయి సోమయ్య కిచ్చి, చెప్పులు కాళ్ళకేసు కుని ఇంటికి పోతాను. మీకేం కావాలో తొందరగా చెప్పు" అంటూ తొందరపడ్డాడు.

బెల్లం వెంకన్న, "ఒసేయ్, ఇలా రా!" అని పెద్ద కేక పెట్టి పెళ్ళాన్ని ముద్దుగా పిలిచాడు. "చీపుళ్ళో ఏవో కావాలన్నావుగా? ఒక చీపురు తెమ్మంటావా?" అని అడిగాడు.

ఆవిడ, కొత్త చీపురుతోనే నేల ఊడుస్తూ, దాన్ని చేతిలో ఝాడించుకుంటూ వచ్చింది. "చీపురు నిన్న నేనే తెచ్చేశా గానీ, చిన్న చేట ఒకటి కావాలి. పాత చేట సుబ్బరంగా కన్నాలు పడిపోయింది. చేట తెచ్చిపెట్టు రామన్నయ్యా!" అంది.

రామయ్య చప్పున కుండ అందుకుని, "చేటేగా? అదెంత పని? వీరమ్మ నడిగి ఇప్పుడే పట్టుకొస్తా. నా కోసం బెల్లం తూచి మూటగట్టి వుంచు వెంకన్నా! కాస్త తొందరగా పోవాలి ఇంటికి" అనేసి గబ గబా అంగలేసుకుంటూ గుమ్మం దాటాడు.


వెనక నించి వెంకన్న గట్టిగా పిల్చి, "ఇదుగో రామయ్యా! పోనీ బెల్లం పట్టుకెళ్ళి ఆ చెప్పులేవో తెచ్చుకో. చేట సంగతి రేపు చూద్దాంలే" అన్నాడు.

"అబ్బే, మళ్ళీ రేపు కూడా తిరుగుడెందుకూ? సిటికిలో రానూ చేటతో?" అంటూ రామయ్య కుంటు కుంటూ

కుండతో, పాదాల నెప్పులతో, ఎలాగో వెళ్ళి పడ్డాడు వీరమ్మ దగ్గిర.

నంగతంతా చెప్పాడు గబ గబా. "చెప్పులు తెగిపోయి కాళ్ళేలా పుళ్ళు పడ్డాయో చూడు వీరమ్మా! నేల మీద కాలు మోపాలంటే చచ్చే చావుగా వుంది. మీ చేట పట్టుకుపోయి బెల్లం వాళ్ళ కిచ్చి, వాళ్ళ బెల్లం పట్టుకుపోయి చెప్పుల వాళ్ళ కిచ్చి, అప్పుడు తీసుకోవాలి నేను చెప్పులు. గట్టి చేట ఒకటి నువ్వే చూసి ఇద్దూ వీరమ్మా! తెగ తిరుగుతున్నాను. తొందరగా పోవాలి. బోలెడు పనుందమ్మా ఇంటి దగ్గిర" అన్నాడు గట్టు మీద చతికిలబడి.

రామయ్య చెప్పినంతసేపూ వీరమ్మ, "అయ్యో! చెప్పులు దొరకలేదా? అయ్యో, అయ్యో" అని జాలి పడుతూనే వింది.



"కుండల్లో నీళ్ళు తాగటం ఎప్పుడో మానే శాంగా రామయ్యన్నయ్యా! మా ఇంట్లో అందరికీ ఉబ్బసాల తెగుళ్ళేగా? చల్లటి నీళ్ళు తాగొద్దన్నాడు మందుల సుబ్బయ్య. ఇంట్లో కుండలే తీసి అటక మీద పడేశాం. కొత్త కుండేం చేసుకుంటాం? పోనీ నీకు కావాలంటే చేట పట్టుకెళ్ళు. తర్వా తెప్పుడన్నా చూసుకుందాం లే" అంది ఆప్యాయంగా.

ఆ మాటలన్నీ రామయ్య తెల్లబోతూ విన్నాడు. "మీకూ కుండ వొద్దా? కుండలే మానేశారా! ఇదేవిటి? మరి నాకు చెప్పు లెలా దొరుకుతాయి? నీ దగ్గిర్నించి చేట తీసుకుపోతే, తర్వాత మాత్రం నీకేం తెచ్చి యిస్తాను? మీరు కుండలే వాడటం లేదుగా? బాగానే వుంది. పోనీ... నీకేం కావాలో చెపుతావా? .... వొద్దులే, ఇంటికే పోతాను. ఇంకెంత తిరగను?" అనేసి రామయ్య తన కుండని భుజం మీద పెట్టుకుని వెనక్కి తిరిగాడు.

అంతలో వీరమ్మ, అక్కడే వున్న చేటల దొంతుల్లో నించి చాపంత చేట తీసి, "ఇదుగో, తీసుకో అన్నయ్యా!" అంటూ ఇవ్వబోయింది.

"వొద్దు లేమ్మా, వొద్దు! తర్వాత ఏం ఇవ్వాలి నీకు?" అంటూ రామయ్య విచారంగా కుంటు కుంటూ వెళ్ళి పోయాడు.



రామయ్య సమస్య ఏమిటి?

అతనికి కావలసిన వస్తువు దొరకలేదు. అలాంటి సమస్య అతనికొక్కడికే కాదు, అది అందరికీ ఎప్పుడో అప్పుడు ఎదురవు తూనే వుంటుంది. బార్టరు పద్ధతిలో వచ్చే ఇబ్బంది అదే. మరి పరిష్కారం ఏమిటి?

[ ఈ పాఠంలో ప్రశ్నలు లేవు. ]

**H**



# 22. డబ్బు వచ్చేసింది!



మొట్ట మొదటి పాఠాన్ని 'డబ్బు అంటే ఏమిటి?' అనే ప్రశ్నతో మొదలు పెట్టాం. 'డబ్బు' ని ఇక్కడి నించీ చూడ బోతున్నాం.

వస్తువుని ఇచ్చి వస్తువుని తీసుకునే 'బార్టరు మారకాల పద్ధతి' లో, కావలసిన వస్తువు, కావలసిన సమయంలో దొరికితే దొరుకుతుంది, లేకపోతే లేదు. ఈ సమస్యకి పరిష్కారం ఏమిటి?

పరిష్కారం ఎప్పుడోనే జరిగిపోయింది - 'డబ్బు' అవతరణ ద్వారా! ఏ వస్తువు అయినా, ఏ సమయంలో అయినా, తప్పకుండా దొరికే లాగ చెయ్యగలుగుతుంది - డబ్బు! అంటే, బార్టరు మారకాల సమస్యని, డబ్బు, మహా సుఖవంతంగా పరిష్కరిస్తుందన్నమాట!

అయితే, 'డబ్బు' అంటే ఏమిటి? అది ఎలా పుట్టింది? మారకాల సమస్యని అది ఎలా పరిష్కరిస్తుంది? - ఈ విషయాలన్నీ ఇప్పుడు వరసగా చూడాలి.

'డబ్బు' అంటే, అది కూడా ఒక వస్తువే. కానీ అది, ఏ సహజమైన ఉపయోగపు విలువా లేని వస్తువు. అదే డబ్బు ప్రత్యేకత. ఆ వస్తువు, మట్టి తోనో, పత్తి తోనో, చెక్క తోనో తయారయ్యేది కాదు. అది, 'బంగారం' అనే లోహంతో తయారవుతుంది. 'డబ్బు', గుండ్రంగా, చిన్న బిళ్ళలా, ప్రత్యేకమైన ఆకారంతో ఉంటుంది. ఆ బిళ్ళ మీద కొన్ని అక్షరాలూ, ఆ దేశాన్ని పరిపాలించే రాజుల బొమ్మలూ, ఉంటాయి. అది ఒక 'నాణెం'. అలాంటి రూపంతో వుండే బంగారపు నాణమే - డబ్బు. ఆ రూపం, ఇతర వస్తువుల రూపాల లాంటిది కాదు. ఆ నాణానికి ఒక పేరు వుంది. 'రూపాయి' అనే పేరు. ఆ నాణెం, 1 రూపాయి.

డబ్బు ఎలా పుట్టింది? - మారకాల సంబంధాలలో నించే, మారకాల అవసరాల కోసమే పుట్టింది. భూమిలో బొగ్గూ, చమురూ - వంటివి దొరుకుతాయి కదా? అలాగే, వెండీ, బంగారమూ వంటి లోహాలు కూడా దొరుకుతాయని, వెనకటి కాలంలోనే అప్పటి మనుషులు కని పెట్టారు. అయితే, బొగ్గు దొరికినంత ఎక్కువగా ఏ లోహమూ దొరకదు. 'బంగారం' అసలే దొరకదు. భూమిలో నించి 1 కిలో బరువు గల బొగ్గుని తవ్వడం కోసం చెయ్యవలసిన శ్రమ 2 గంటలు అనుకుందాం. అంతే బరువు గల బంగారాన్ని తవ్వాలంటే, వేల రెట్ల శ్రమ ఎక్కువగా అవసరమవుతుంది. అంటే, బొగ్గు విలువ కన్నా, అంతే బరువు గల బంగారం విలువ, చాలా ఎక్కువగా వుంటుంది. ఎక్కువ శ్రమ అవసరమవుతుంది కాబట్టే, ఎక్కువ విలువ.

ఏ వస్తువు అయినా, ప్రకృతి సహజ పదార్థాల మీద రక రకాల శ్రమలు జరగడం వల్లనే తయారవుతుందని వెనక పాఠాల్లో చూశాం కదా? బంగారం సంగతి కూడా అంతే. భూమి లోపల వున్న బంగారం పొడి - ప్రకృతి సహజ పదార్థం.

దానికి విలువ వుండదు. దాన్ని బైటికి తెచ్చి, ముద్దగా తయారుచెయ్యడానికి, అనేక రకాల శ్రమలు జరగాలి. ఏ వస్తువుకి వున్న విలువ అయినా, ఆ పదార్థానిది కాదనీ, ఆ వస్తువు కోసం జరిగిన శ్రమలదే ననీ కూడా, వెనక పాఠాల్లో చూశాం. బంగారానికి వున్న విలువ సంగతి కూడా అంతే. బంగారం విలువ, దాని శరీరంలో వున్న సహజ పదార్థానిది కాదు. ఆ సహజ పదార్థం మీద వరసగా జరిగిన శ్రమలదే.

బంగారాన్ని తయారు చెయ్యడం కనిపెట్టిన ప్రారంభ కాలంలోనే దానితో డబ్బు నాణాల్ని తయారు చెయ్యడం జరగలేదు. బంగారంతో, ప్రారంభంలో, గొలుసులూ గాజులూ ఉంగరాలూ - లాంటి వస్తువులనే తయారుచేసేవారు. అవి, 'నగలే' గానీ, డబ్బు నాణాలు కావు.

బంగారం కూడా ఒక వస్తువే కాబట్టి, చిన్న చిన్న బంగారం ముక్కలకూ, ఇతర వస్తువులకూ కూడా మారకాలు జరిగేవి. ఆ మారకాలు, బార్టరు పద్ధతి మారకాలే. కుర్చీని ఇచ్చి, దాని విలువకి సరిపోయే టంత చిన్న బంగారం ముక్కని తీసుకో వచ్చు. అలాంటి నాలుగు బంగారం ముక్కలు సంపాదించాక, వాటితో ఏదైనా నగ చేయించుకోవచ్చు. దుప్పటి ఇచ్చో, ధాన్యం ఇచ్చో, బంగారం ముక్కలు తీసుకో వచ్చు. బంగారం ముక్క ఇచ్చి, ఒక ఆవుని తీసుకోవచ్చు.

బంగారంతో అవసరం లేనప్పుడు, దాన్ని ఎవరూ తీసుకోరు. దానితో మారకం జరగదు. కుండతో అవసరం లేనప్పుడు దానికి మారకం జరగలేదు కదా? అలాగే బంగారానికి కూడా.

బంగారం ముక్కలూ, బంగారం నగలూ వుంటూ వుండగానే, బంగారంతో డబ్బు నాణాల్ని కూడా ఊహిద్దాం. 'డబ్బు' అనే మాట పుట్టడంతో పాటే, 'అమ్మడం - కొనడం - ధర - సరుకు' అనే కొత్త మాటలు కూడా పుట్టుకొచ్చాయి.

డబ్బు నాణెంతో ఏం పని జరుగు తుందో ఇప్పుడు చూద్దాం.

కుండల రామయ్యకి చెప్పులు కావాలి. అయితే, అతను ఇప్పుడు, తిన్నగా చెప్పుల సోమయ్య దగ్గిరికి వెళ్ళడు. మొదట, డబ్బు నాణాలు వున్న వాళ్ళ దగ్గిరికి వెళ్తాడు. సూరన్న దగ్గిర డబ్బు నాణాలు వున్నాయనీ, అతని ఇంట్లోకి కుండ కావాలనీ, అను కుందాం. ( సూరన్న దగ్గిర డబ్బు నాణాలు ఎందుకు వున్నాయో తర్వాత తెలుస్తుంది. విషయాలు అర్థం చేసుకోవడానికి మొదట ఇలాగే, కొందరి దగ్గిర డబ్బు నాణాలు వున్నాయని ప్రారంభించాలి. )

రామయ్య, తన కుండ తీసుకుని సూరన్న దగ్గిరికి వెళ్ళి, "ఈ కుండని అమ్ముతాను. కొంటావా?" అని అడిగాడు. సూరన్నకి కుండ కావాలి కాబట్టి, "ఆఁ, కొంటాను. ధర ఎంత?" అన్నాడు సూరన్న.

"ధరా? నీకూ తెలుసుగా? ఒక రూపాయి" అని చెప్పాడు రామయ్య.


"రూపాయా? తగ్గదా?" అన్నాడు సూరన్న.

"భలే వాడివే సూరన్నా! కొత్తగా బేరా లాడుతున్నావే!" అని నవ్వాడు రామయ్య.

"సరేలే, ఇయ్యి! కుండ బాగుందా? కన్నాలూ గిన్నాలూ లేవు కదా?" అంటూ సూరన్న కుండని తీసుకుని ఒక సారి దాని

లోపలికి చూశాడు. చుట్టూ తణిఖీ చేశాడు. కుండని తన పక్కన పెట్టుకుని, బొడ్లోంచి చిన్న సంచి తీసి, అందులో నించి ఒక బిళ్ళ తీసి, " ఇదుగో రూపాయి" అంటూ దాన్ని రామయ్య చేతిలో పెట్టాడు.

రామయ్య, వెంటనే దాన్ని కళ్ళకి అద్దు



కుని, బొడ్డు దగ్గిర పంచెలో పెట్టి, బట్టని గట్టిగా మెలికలు తిప్పి, బిళ్ళ కింద పడి పోకుండా బిగించాడు. "వెళ్తాను సూరన్నా!" అంటూ నవ్వు మొహంతో అక్కణ్ణించి కదిలాడు.

కుండల రామయ్యకీ, డబ్బు బిళ్ళ సూరన్నకీ మధ్య, ఏం జరిగింది? - రామయ్య కుండకీ, సూరన్న డబ్బు బిళ్ళకీ, మారకం జరిగింది. ఆ కుండకి ఎంత విలువ వుందో, ఆ బంగారం బిళ్ళకి కూడా అంత విలువ వుందన్నమాట! అందుకే, ఆ రెండింటికీ మారకం జరిగింది.

రామయ్య, కుండని అమ్మేశాడు. డబ్బు తీసుకున్నాడు.

సూరన్న కుండని కొనేశాడు. డబ్బు ఇచ్చేశాడు.

" డబ్బు అంటే - బంగారం బిళ్ళ" అని తెలిస్తేనే, డబ్బు గురించి పూర్తిగా తెలిసినట్టు కాదు.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ' డబ్బు' అంటే ఏమిటి?

**జ**: డబ్బు కూడా శ్రమతో తయారైన వస్తువే. అనీ, అది బంగారంతో తయారయ్యే బిళ్ళ అనీ మాత్రమే తెలుసు. అంత కన్నా తెలీదు.

**2**. ' అమ్మడం' అంటే? ' కొనడం' అంటే?

**జ**: ' అమ్మడం' అంటే, వస్తువుని ఇచ్చి డబ్బుని తీసుకోవడం.
' కొనడం' అంటే, డబ్బుని ఇచ్చి వస్తువుని తీసుకోవడం.

**3**. 'వస్తువు'కీ, 'డబ్బు'కీ 'మారకం' జరిగింది. ' అమ్మడం' ఎవరు చేశారు? ' కొనడం' ఎవరు చేశారు?

**జ**: వస్తువుని ఇచ్చిన మనిషి ' అమ్మకం' చేశాడు.
డబ్బుని ఇచ్చిన మనిషి ' కొనడం' చేశాడు.

**4**. కుండల రామయ్య దగ్గర 1 రూపాయి ఉంది. అతనికి, ఆ డబ్బు ఎలా వచ్చింది?

**జ**: రామయ్య, తను తయారుచేసిన కుండని అమ్మితే, ఆ డబ్బు వచ్చింది.

**5**. ' ధర ' అంటే ఏమిటి? ' విలువ' యేనా?

**జ**: అవును. ' విలువ' కి ఇంకో పేరే ' ధర.' కానీ, ' ధర ' అన్నప్పుడు, వస్తువుకి ఇంకో వస్తువుతో గాక, ' డబ్బు' తో మారకం జరిగిందని తెలుస్తుంది.

**6**. కుండని ఇచ్చి, చెప్పుల్ని తీసుకుంటే, కుండని అమ్మినట్టూ, చెప్పుల్ని కొన్నట్టూ అర్థాలు రావా?

**జ**: వస్తాయి. కానీ, బార్టరు పద్ధతిలో ' అమ్మడం, కొనడం' అనే మాటలు లేవు. వస్తువుకీ, డబ్బుకీ మారకం జరిగి నప్పుడే ఆ మాటలు ప్రారంభమయ్యాయి.



# 23. 'డబ్బు'తో ఏం చేస్తారు?

రామయ్యకి కావలసింది, ‘ చెప్పుల జత’ కదా? ఆ బిళ్ళ ఎందుకు తీసుకున్నాడు? ఆ బిళ్ళని ఏం చేసుకుంటాడు?

తెలివిగా ఆలోచిస్తే, సూరన్న చేసింది చూశాక, ఈ సందేహం రాకూడదు. సూరన్న, తన దగ్గిర వున్న డబ్బుతో ఏం చేశాడు? దాన్ని ఇచ్చి, తనకు కావలసిన కుండని కొన్నాడు కదా? అలాగే, రామయ్య కూడా తన చేతిలోకి వచ్చిన డబ్బుతో, అదే పని చేస్తాడు. - అది ఊహించలేమా? - సూరన్న, ఆ డబ్బు ఇచ్చి కుండని కొన్నట్టే, రామయ్య కూడా ఆ డబ్బు ఇచ్చి చెప్పుల జత కొంటాడు. అంతే కదా?

సూరన్న దగ్గిర, అసలు ఆ డబ్బు బిళ్ళ ఎందుకు వుంది? అది అతనికి ఎలా వచ్చింది? - మనకి ఈ సందేహాలు, రామయ్య సూరన్న దగ్గిరికి రాక ముందే వస్తే, అవి అప్పుడు తెలివైన సందేహాలే. కానీ, ఇప్పుడు రామయ్యని చూశాక కూడా ఆ సందేహాలు ఇంకా వుంటే, అవి ఇప్పుడు తెలివి తక్కువ సందేహాలు. రామయ్య చేతిలోకి డబ్బు బిళ్ళ ఎలా వచ్చిందో తెలిస్తే, సూరన్న సంగతి కూడా తెలిసిపోతుంది. రామయ్యకి డబ్బు ఎలా వచ్చింది? - తన వస్తువుని అమ్ముకున్నాడు కాబట్టి వచ్చింది. సూరన్నకి అయినా అలాగే వచ్చి వుంటుంది కదా? సూరన్న కూడా తను తయారుచేసిన ఏదో వస్తువుని అమ్ముకుని వుంటాడు. అందుకే డబ్బు వచ్చి వుంటుంది. ఈ మాత్రం అర్థం చేసుకోలేమా? ఆలోచిస్తూ ఆధారాన్ని పట్టుకుంటే, ప్రతీదీ అర్థమవుతూ వుంటుంది.

అయితే, సూరన్న ఏం వస్తువులు తయారుచేస్తాడో, ఆ డబ్బుని చూస్తే తెలీదు. కాబట్టి, సూరన్న ఏ పని చేస్తాడో, ఏదైనా పనిని మనం ఉదాహరణగా పెట్టుకోవాలి. సూరన్న జొన్నలు పండిస్తాడనీ, కాసిన్ని జొన్నలు అమ్మితే నాలుగైదు రూపాయలు వచ్చాయనీ, అనుకుందాం. ఆ డబ్బులో నించే ఒక రూపాయిని ఇచ్చి ఇప్పుడు కుండని కొన్నాడన్నమాట! ఎవరికైనా డబ్బు ఎలా వస్తుంది? - ఏదైనా వస్తువుని అమ్మితేనే వస్తుంది.

కుండకీ, డబ్బుకీ మారకం జరిగే ముందు, రామయ్యే తన కుండతో సూరన్న దగ్గిరికి వచ్చాడని చెప్పుకున్నాం. కానీ, అది అలాగే జరగాలని కాదు. సూరన్నే, రూపాయి పట్టుకుని రామయ్య దగ్గిరికి వెళ్ళి కుండని అమ్మమని అడగవచ్చు. ఎవరు, ఎవరి దగ్గిరికి వెళ్తారనేది కాదు. కుండకీ, డబ్బుకీ, మారకం జరిగింది - అనేదే ఇక్కడ అసలు విషయం.

సరే, కుండని అమ్మితే, రామయ్యకి రూపాయి వచ్చింది. ఇప్పుడు అతనేం చేస్తాడు? ఆ రూపాయిని పెట్లో దాచేస్తాడా? డబ్బుని పెట్లో దాచేస్తే అతనికి చెప్పులెలా వస్తాయి? ఆ రూపాయిని పెట్లో నాలుగు రోజులు దాచినా, పది రోజులు దాచినా, ఎప్పటికైనా దాన్ని బైటికి తియ్యవలిసిందే.

రామయ్యకి, చెప్పులు వెంటనే కావాలి

కదా? వాటి కోసం అతను బొడ్లో బిగించిన రూపాయితో, అప్పటి కప్పుడే చెప్పుల సోమయ్య దగ్గరికి బైల్దేరాడు. "సోమయ్యా! ఒక మంచి చెప్పుల జత కావాలయ్యా! ధర ఎంత?" అని అడిగాడు.

"నీకు తెలీదా? కొత్తగా అడుగుతావేం? రూపాయేగా?" అన్నాడు సోమయ్య.

"రూపాయా? తెలుసులే. ఏవన్నా తగ్గిందేవోనని అడిగాలే" అన్నాడు రామయ్య.

"బేరాలాడుతున్నావే కొత్తగా!" అన్నాడు సోమయ్య కొంచెం నవ్వుతూ.

"సరే, తీసుకో డబ్బు" అంటూ రామయ్య బొడ్లో చుట్టిన గుడ్డ మడత ల్లోంచి రూపాయి బిళ్ళ తీసి, సోమయ్య చేతిలో పెట్టాడు. ఒక చెప్పుల జత తీసుకుని అప్పటికప్పుడే దాన్ని కాళ్ళకి తొడుక్కుని సంతోషంగా వెళ్ళిపోయాడు.

రామయ్య, చెప్పులు కొనడానికి సోమయ్య దగ్గిరికి వచ్చినప్పుడు, సోమయ్య ఆ డబ్బు తీసుకోవడానికి తిరస్కరిస్తాడా? "ఇప్పుడు నాకు బంగారం బిళ్ళతో అవసరం లేదు. చెప్పులు ఇవ్వను. నాకు బంగారం వద్దు" అంటాడా? - అలా అనడు. రామయ్య ఇవ్వబోయేది ఏమిటో సోమయ్యకి తెలుసు. అది మామూలు బంగారం ముక్క కాదు. అది డబ్బు! అది డబ్బు బిళ్ళ! దానితో ఏం చేస్తారో అతనికి తెలుసు. అసలు సోమయ్య, చెప్పుల జతల్ని తయారుచేసి వుంచింది, అమ్మకాల కోసమే. కొనే వాళ్ళు ఎంత ఎక్కువ మంది వస్తే అంత సంతోషం అతనికి. డబ్బు తీసుకుంటే అది తర్వాత తనకి ఎలా పనికి వస్తుందో అతనికి తెలుసు. అందుకే, డబ్బు తీసుకుని చెప్పులు ఇచ్చాడు.

రామయ్యకి ఒక సారి బార్టరు పద్ధతిలో, చెప్పులతో ఎంతో అవసరం వున్నా, అవి దొరక్క చాలా ఇబ్బంది పడ్డాడు కదా? కానీ, ఇప్పుడు డబ్బు పద్ధతిలో, అలాంటి ఇబ్బంది వచ్చిందా? - రాలేదు. చెప్పులు దొరకడం చాలా తేలిగ్గా జరిగింది. మొదట, తన వస్తువుని అమ్మేస్తే, డబ్బు వచ్చింది. తర్వాత, ఆ డబ్బుతో కొంటే, చెప్పులు వచ్చాయి. రామయ్య, తన కుండని అమ్ముకున్నప్పుడు - అమ్మకందారుడు. చెప్పులు కొన్నప్పుడు - కొనుగోలుదారుడు.

ఎవరికి ఏ వస్తువు కావాలన్నా, మొదట తమ వస్తువుని అమ్ముతారు. డబ్బు వస్తుంది. తర్వాత, ఆ డబ్బుతోటే, తమకు కావలిసిన వస్తువుని కొంటారు. ఆ రకంగా, రెండే రెండు మారకాలతో, కావలసిన వస్తువు తేలిగ్గా దొరుకుతుంది. ఇదే బార్టరు పద్ధతిలో అయితే, కావలసిన వస్తువు వెంటనే దొరికితే దొరుకుతుంది; లేకపోతే లేదు. బార్టరు పద్ధతికీ, డబ్బు పద్ధతికీ, ఈ తేడా ఎందుకు వుంటుంది?

### డబ్బుకీ, డబ్బు కాని మామూలు వస్తువుకీ, ఏమిటి తేడా?:

కుండా, చెప్పులూ - లాంటి ఏ మామూలు వస్తువుని ('డబ్బు నాణెం' కాని వస్తువుని) తీసుకున్నా, దానికి ఏదో ఒక సహజమైన ఉపయోగపు విలువ వుంటుంది. అలాంటి వస్తువుల మధ్య మారకాలు జరగాలంటే, వాటికి వున్న 'విలువల' వల్ల సమస్య రాదు; వాటి 'ఉపయోగపు విలువల' వల్లే సమస్య వస్తుంది.

కుండ మనిషికి చెప్పులతో అవసరం వున్న సమయంలో, చెప్పుల మనిషికి కుండతో అవసరం లేదనుకుందాం. కుండని తీసుకోవాలంటే, చెప్పుల మనిషికి, కుండకి వున్న లక్షణాల్లో దేన్ని గురించి అభ్యంతరం? కుండకి వున్న 'విలువ' గురించి కాదు. చెప్పులకు వున్నంత విలువ, కుండకు కూడా వుంది. చెప్పులు ఇచ్చి కుండని తీసుకుంటే, ఇచ్చినంత విలువని మళ్ళీ వెనక్కి తీసుకోవచ్చు. కాబట్టి సమస్య, 'విలువ' గురించి కాదు. సమస్య అంతా కుండ ఇచ్చే 'ఉపయోగపు విలువ' గురించి. చెప్పుల మనిషికి ప్రస్తుతం అది అక్కర లేదు. సహజ ఉపయోగపు విలువలు వుండే వస్తువుల మధ్య మారకాలు జరగాలంటే, ఆ ఉపయోగపు విలువల తోటే సమస్య వస్తుంది. ఆ వస్తువులకు విలువ కూడా వున్నా, ఆ విలువని అంటి పెట్టుకుని ఒక ఉపయోగపు విలువ కూడా వుంటుంది కాబట్టి, దానితోనే సమస్య. వస్తువుల మధ్య మారకాలు జరగాలంటే, వాటి ఉపయోగపు విలువలే, ఎప్పుడో అప్పుడు అడ్డుగా నిలుస్తాయి.

మారకాలు సుఖంగా జరగాలంటే, ఏ ఉపయోగపు విలువా లేకుండా, 'విలువ' ఒక్కటే విడిగా వుండే విచిత్రమైన వస్తువు కావాలి.

'డబ్బు' అలాంటి విచిత్ర వస్తువే! అది ఎలాంటి విచిత్ర వస్తువో తర్వాత చూడండి!

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ఎవరికైనా డబ్బు ఎలా వస్తుంది?

**జ**: ఆ వ్యక్తి తయారుచేసిన వస్తువుని అమ్మితే డబ్బు వస్తుంది. లేదా, ఒక మనిషి, ఇంకొకరికి ఏదైనా పని చేసి పెడితే, డబ్బు వస్తుంది.

**2**. డబ్బు రావడానికి ఇంకే మార్గాలూ ఉండవా?

**జ**: ఉంటాయి. తర్వాత పాఠాల్లో.

**3**. వస్తువుని అమ్మకపోయినా డబ్బు వస్తుందా? ఇంకో మనిషికి ఏ పనీ చేసి పెట్టకపోయినా డబ్బు వస్తుందా?


**జ**: ఇది కూడా తర్వాత పాఠాల్లోనే.

**4**. కుండల రామయ్యకి జుట్టు బుట్ట లాగా పెరిగిపోయింది. క్షవరం చేయించుకోవాలంటే డబ్బు లేదు. క్షవరం చేసే మనిషి, వెంటనే డబ్బు కావాలన్నాడు. అతను కూడా ఆ డబ్బుని, ఒక వైద్యుడికి ఇవ్వాలి. డబ్బు ఇస్తేనే రామయ్యకి క్షవరం చేస్తానన్నాడు. మరి, రామయ్య ఏం చేస్తాడు?

**జ**: ఎవరినన్నా అడిగి డబ్బు తీసుకుని అది ఇచ్చి క్షవరం చేయించుకోవచ్చు. లేకపోతే, తన కుండలే అమ్మకం అయ్యి, చేతిలోకి డబ్బు వచ్చేదాకా క్షవరమే మానెయ్యవచ్చు.

**5**. డబ్బునీ, డబ్బు గాని కొన్ని వస్తువుల్నీ చూపించండి!

**జ**:  ఇది డబ్బు.



ఇవి, డబ్బు కాని వస్తువులు.

**H**







# 24. ' ఉపయోగపు విలువ' లేని, ' విలువ' మాత్రమే వున్న విచిత్ర వస్తువే - డబ్బు!

మారకాలు వెంట వెంటనే జరగాలంటే, ఉపయోగపు విలువల వల్ల ఆటంకాలు ఏర్పడని పద్ధతి కావాలి. ఏ ఉపయోగపు విలువా లేకుండా, విలువ మాత్రమే వుండే వస్తువు కావాలి. అలాంటి వస్తువుతోనే మారకాలు తేలిగ్గా జరుగుతాయి. ఆ అవసరం కోసం ఏర్పడిన వస్తువే - డబ్బు నాణెం.

డబ్బు నాణెం, బంగారంతో తయారవుతుంది. ( బంగారంతోనే కాదు, వెండితో కూడా. వెండి సంగతి వదిలేద్దాం. ) బంగారానికి విలువ వుంటుంది కాబట్టి, బంగారంతో తయారైన డబ్బు నాణానికి కూడా విలువ వుంటుంది. కానీ ఈ వస్తువు, నాణెం రూపంలో వుంటుంది కాబట్టి, దీనికి, మామూలు వస్తువులకు వుండే ఏ సహజ ఉపయోగపు విలువా వుండదు. కుండ, చెప్పులు, కుర్చీ, దుప్పటి - వంటి వస్తువులకు లాగ, డబ్బు నాణెం, ఏ సహజ అవసరాలకూ పనికిరాదు. కానీ, డబ్బు నాణానికి కూడా ఒక ఉపయోగపు విలువ వుంటుంది. మామూలు వస్తువులతో మారడానికి పనికిరావడమే ఆ ఉపయోగపు విలువ. ఆ నాణెం పుట్టిందే అందుకు. వస్తువులతో మారడానికి తప్ప, అది ఏ సహజ అవసరాన్నీ తీర్చదు.

అంటే, డబ్బు అనేది ఒక వస్తువే అయినా, దానికి కూడా ఒక ఉపయోగపు విలువ వున్నా, అది సహజమైన వస్తువూ కాదు ; దాని ఉపయోగపు విలువ, సహజమైన ఉపయోగపు విలువా కాదు. కాబట్టి, డబ్బుగా వున్న వస్తువుకి, అసలు ఉపయోగపు విలువే లేదని అర్థం.

ఆ నాణానికి, ఏ ఉపయోగపు విలువా లేకపోవడం వల్లనే, అది ' డబ్బు' అయింది. దానికి కూడా ఏదైనా ఉపయోగపు విలువ వుంటే, అది కూడా ఏదో ఒక మామూలు వస్తువే అయ్యేది. దానితో మారకం జరగాలంటే, దాని ఉపయోగపు విలువ ఎప్పుడో అప్పుడు అడ్డం వచ్చేది.

ఒక వస్తువులో నించి ఉపయోగపు విలువ విడిపోయి, బైటికి పోయి, అక్కడ విలువ ఒక్కటే మిగిలితే, ఆ వస్తువు ఎలా వుంటుంది? ఏ ఉపయోగపు విలువ తోటీ లంకె లేకుండా వుంటుంది. అలాంటి వస్తువే - డబ్బు! అది, విలువతో మాత్రమే వుంటుంది కాబట్టి, ఆ విలువ, వస్తువుల ప్రపంచంలో వున్న ఏ మామూలు వస్తువుతోనైనా మారగలదు. ( కొనగలదు ). డబ్బుకి ఆ అర్హత కలుగుతుంది. వస్తువుల్ని అమ్మదల్చుకున్న వాళ్ళకి, తమ వస్తువుల్ని ఇచ్చి డబ్బుని తీసుకోవడానికి ఏ అభ్యంతరమూ వుండదు. ఆ రకంగా, బార్టరు

మారకాల సమస్యని, డబ్బు, అద్భుతంగా పరిష్కరించగల సాధనం అయింది.

**అమ్మడమూ, కొనడమూ :**

రామయ్య, తన కుండని అమ్మి, చెప్పుల్ని కొన్న ఉదాహరణలో, ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. (1) కుండని అమ్మిన మనిషి. (2) కుండని కొన్న మనిషి. (3) చెప్పుల్ని అమ్మిన మనిషి.

(1) **కుండని అమ్మిన మనిషి :** ఈ మనిషి, తను తయారుచేసిన వస్తువుని అమ్మాడు. ఆ వస్తువు విలువతో సమానమైన డబ్బు వచ్చింది. అది, 1 రూపాయి. ఆ డబ్బే, కుండ 'విలువ'. ఇప్పుడు కుండ, అతనిది కాదు. ఆ రూపాయే అతనిది. అతనికి వెంటనే చెప్పులు కావాలి. చెప్పులు కొనేశాడు. చెప్పుల విలువ - 1 రూపాయి. ఆ డబ్బు వెళ్ళిపోయింది. చెప్పులు వచ్చాయి. ఇప్పుడు ఆ డబ్బు రామయ్యది కాదు. చెప్పులే అతనివి. తన శ్రమతో తయారుచేసిన కుండని అమ్మి, ఆ విలువ తోనే చెప్పులు కొన్నాడు కాబట్టి, అతని వస్తువు విలువ, ఎక్కడికీ పోలేదు. అతని విలువ, అతనికే అందింది.

(2) **కుండని కొన్న మనిషి :** ఇతను, జొన్నల్ని పండించే శ్రమ చేసే మనిషి. తన వస్తువుని అమ్ముకోవడం వల్ల అతని దగ్గిర కొంత డబ్బు వుంది. ఆ డబ్బులో నించే 1 రూపాయితో కుండని కొన్నాడు. అతని జొన్నల విలువ ఎక్కడికీ పోలేదు. అతని విలువ, అతనికే అందింది.

(3) **చెప్పుల్ని అమ్మిన మనిషి :** ఇతను తన శ్రమతో, చెప్పుల జతలు తయారు చేస్తాడు. ఒక జతని అమ్మి, 1 రూపాయి తీసుకున్నాడు. ఇతని వస్తువు విలువ, ఎక్కడికీ పోలేదు. దానికి బదులే ఆ డబ్బు వచ్చింది. ఆ డబ్బుతో తర్వాత అతను ఏం చేస్తాడు? తన ఇంటి అవసరాలకు కావలసిన వస్తువు ఏదైనా కొనుక్కుంటాడు. లేకపోతే, ఆ రూపాయి నాణాన్ని చెరిపించి, ఉంగరం లాంటి వస్తువు ఏదైనా చేయించుకుంటాడు. అప్పుడు ఇక ఆ డబ్బు వుండదు. ఆ నగ వుంటుంది. అది, బంగారంతో వున్న నగ కాబట్టి, దానికి కూడా విలువ వుంటుంది.

ఈ ముగ్గురు మనుషుల మధ్యా, అమ్మకాలూ, కొనుగోళ్ళూ జరిగాయి. వస్తువు వెళ్ళిపోయి, డబ్బు వస్తే, అది - అమ్మకం. డబ్బు వెళ్ళిపోయి, వస్తువు వస్తే, అది - కొనుగోలు.

ఇక్కడ - జొన్నలూ, కుండా, చెప్పులూ అనే 3 వస్తువులు కనపడుతున్నాయి.

ఒక మనిషి, జొన్నలు అమ్మి, కుండని కొన్నాడు.

రెండో మనిషి, కుండని అమ్మి, చెప్పులు కొన్నాడు.

మూడో మనిషి, చెప్పులు అమ్మాడు. ఇంకేదో కొంటాడు. ఇంకా కొనలేదు.

ఇందులో, ఏ 2 వస్తువుల మధ్య మారకం జరిగింది? కుండ సంగతి చూడండి. కుండకి, జొన్నలతో మారకం జరిగిందా, చెప్పులతో మారకం జరిగిందా?

జొన్నల మనిషికి ఎలా కనపడుతుందంటే - తను, జొన్నల్ని అమ్మి, ఆ డబ్బుతో కుండని కొన్నాడు కాబట్టి, జొన్నలకీ - కుండకీ మారకం జరిగినట్టు కనపడుతుంది.

కుండ మనిషికి ఎలా కనపడుతుందంటే - తను, కుండని అమ్మి, ఆ డబ్బుతో

చెప్పులు కొన్నాడు కాబట్టి, కుండకీ - చెప్పులకీ మారకం జరిగినట్టు కనపడుతుంది.

చెప్పుల మనిషికి ఎలా కనపడుతుందంటే - తను, చెప్పుల్ని అమ్మిన డబ్బుతో ధాన్యాన్ని కొంటే, చెప్పులకూ - ధాన్యానికీ మారకం జరిగినట్టు కనపడుతుంది.

ఇందులో ఏది నిజం? - ఏదీ నిజం కాదు. ఇవి, బార్టరు పద్ధతి మారకాలు కావు ; ఇక్కడ, ఏ 2 వస్తువులకూ సూటిగా మారకం జరగలేదు. ప్రతి వస్తువూ డబ్బుతోనే మారింది గానీ, ఇంకో వస్తువుతో మారలేదు. కుండ, జొన్నలతోనూ మారలేదు, చెప్పుల తోనూ మారలేదు. డబ్బుతోనే మారింది. ఆ డబ్బు వెళ్ళి చెప్పులతో మారింది. ఏ వస్తువుని చూసినా, అది డబ్బుతోనే మారింది.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ' డబ్బు - వస్తువు' అంటే? ' మామూలు వస్తువు' అంటే?

**జ** : ' డబ్బు వస్తువు' అంటే, ఏ ఉపయోగపు విలువా లేని బంగారం బిళ్ళ. డబ్బు కాని వస్తువులన్నీ మామూలు వస్తువులు.

**2**. బార్టరు పద్ధతిలో వచ్చే ఇబ్బంది, డబ్బు పద్ధతిలో ఎలా పోతుంది?

**జ** : ' డబ్బు' కూడా ఒక వస్తువే అయినా, అది మామూలు వస్తువు కాదు. దానికి ఏ ఉపయోగపు విలువా వుండదు. కుండని ఇచ్చి బెల్లం సంపాదించుకోవాలనుకున్న మనిషి, మొదట కుండని అమ్మి, డబ్బు తీసుకుంటాడు. తర్వాత ఆ డబ్బుని ఇచ్చి, బెల్లం కొనుక్కుంటాడు. ఆ రకంగా, డబ్బు పద్ధతిలో, ఎవరికైనా, కావలసిన వస్తువు వెంటనే దొరుకుతుంది. బార్టరు సమస్య, డబ్బు ద్వారా తీరిపోతుంది.

**3**. కుర్చీలు తయారుచేసే మనిషి, ఒక కుర్చీని అమ్మి, 1 బంగారం రూపాయిని తీసుకున్నాడు. ఇది కూడా ' మారకం' జరగడమేనా?

**జ** : అవును, అది కూడా 2 వస్తువుల మారకమే. అది, కుర్చీకీ, బంగారం బిళ్ళకీ, జరిగిన మారకం. కుర్చీకి ఎంత విలువ వుందో, ఆ బంగారం బిళ్ళకి కూడా అంత విలువవుంది. అందుకే ఆ మారకం జరిగింది.

**4** . 


ఇందులో నించి, దాని ఉపయోగపు విలువ పోవడం, ఎప్పుడు జరుగుతుంది?

**జ**: కుండకి కన్నం పడితే, పగుళ్ళు పడితే, ఇక అది నీళ్ళకి పనికిరాదు. అందులో చిట్టో, బియ్యమో పోసుకోవచ్చు.

**5** . 


ఇందులో ఉపయోగపు విలువ పోతే, ఈ బిళ్ళ ఏమవుతుంది?

**జ** : ఈ బిళ్ళకి ఈ ఆకారం పోతే, ఇది బంగారం ముద్దగా మారిపోతుంది. ఆ ముద్ద, ఏదైనా నగకో, వస్తువుకో, ముడి పదార్థం అవుతుంది.

**6** . 

దీనికి ఉపయోగపు విలువ వుందా?


**జ** : లేదు. చెప్పులు తెగిపోయాయి. ఉపయోగం లేదు. **H**

# 25. డబ్బు, మారకాలకు మధ్యవర్తా?


డబ్బు అనేది - వస్తువుల మారకాలకు మధ్యవర్తిగా వున్నట్టు కనపడుతుంది. కానీ, అది నిజం కాదు. జొన్నలూ, కుండా, చెప్పులూ వుదాహరణలో, డబ్బు, ఏ 2 వస్తువుల మారకానికి మధ్యవర్తిగా వుంది? కుండ, జొన్నలతో మారడానికా, చెప్పులతో మారడానికా? కుండ, ఒక సారి జొన్నలతో మారి, ఇంకో సారి చెప్పులతో మారిందా?

రామయ్య్య చేతిలో నించి కుండ వెళ్ళిపోయి, చెప్పులు వచ్చిన క్రమం ఎలా వుందో బొమ్మలతో చూద్దాం.

మొదట, కుండ వెళ్ళిపోయి డబ్బు వచ్చింది.



తర్వాత, డబ్బు వెళ్ళిపోయి,
చెప్పులు వచ్చాయి.



కుండ, చెప్పులతో మారిందా?
చెప్పులు, కుండతో మారాయా?
ఆ 2 వస్తువులూ సూటిగా మారలేదు.
కుండ, డబ్బుతోనే మారింది.
చెప్పులు కూడా, డబ్బుతోనే మారాయి.
కుండ కన్నా ముందు జొన్నల సంగతి తీసుకుంటే, జొన్నలు కూడా డబ్బుతోనే మారాయి. జొన్నల మనిషి, ఆ డబ్బునే ఇచ్చి కుండని తీసుకున్నాడు.

ఏ వస్తువు అయినా, డబ్బు తోనే మారుతుంది గానీ, ఇంకో వస్తువుతో మారదు.

కుండ, జొన్నలతోనూ మారలేదు ; చెప్పులతోనూ మారలేదు. - కుండ, డబ్బుతో తప్ప, ఏ వస్తువుతోనూ మారలేదు.

డబ్బు చేసే పని, ఎప్పుడూ ఏదో ఒక వస్తువుతో మారుతూ వుండడమే. అంతే. అంత కన్నా దాని పాత్ర ఏమీ వుండదు. కానీ, డబ్బు చేసే ఆ చిన్న పని వల్లనే, ఒక వస్తువుని అమ్మడమూ, ఇంకో వస్తువుని కొనడమూ, తేలిగ్గా జరిగిపోతాయి.

రామయ్య, కుండని పట్టుకుని బార్టరు పద్ధతిలో చెప్పుల కోసం వెళ్ళినప్పుడు, చెప్పులు అక్కడ సిద్ధంగా వున్నా సరే, అతనికి అవి దొరకలేదు కదా? కానీ, డబ్బు పట్టుకువెళ్తే, అక్కడ చెప్పులు సిద్ధంగా లేకపోయినా, తప్పకుండా దొరుకుతాయి, కాస్త ఆలస్యంగా అయినా. చెప్పుల మనిషి, "చెప్పులు ఇప్పుడు లేవు గానీ, తొందరగా తయారుచేసి ఇచ్చేస్తాను" అంటాడు. అంతే గానీ, బార్టరు పద్ధతిలో "ఇప్పుడు మాకు కుండ వద్దు" అన్నట్టు, "ఇప్పుడు మాకు డబ్బు వద్దు, చెప్పులు ఇవ్వను" అనడు. అంటే, డబ్బు పట్టుకుని కొనడానికి వెళ్తే, అవతలి వస్తువు, డబ్బుతో మారడానికి విముఖంగా వుండదు. డబ్బుతో సంబంధానికి, ఏ వస్తువు అయినా పరిగెత్తుకుని వస్తుంది.

డబ్బు - సమస్త వస్తువులకూ ' విలువ రూపం'. ఇది డబ్బుకి వున్న ప్రధాన లక్షణం. దీన్ని తర్వాత పాఠంలో వివరంగా చూస్తాం. ప్రస్తుతం ఇక్కడ, డబ్బు విధానానికి సంబంధించిన విషయాలు కొన్ని చూస్తాం.

**డబ్బు గురించి**
**కొన్ని చిన్న విషయాలు :**

(1) డబ్బు పద్ధతి వల్ల, ' అమ్మడం, కొనడం, ధర, సరుకు' అనే కొత్త మాటలు వస్తాయి. అమ్మకానికి సిద్ధంగా వున్న వస్తువులే- సరుకులు. ఆ మాట వల్ల, ' ఆ వస్తువులు అమ్మకానికే వున్నాయి' అని తెలుస్తుంది. కుండని తయారుచేసి స్వంతానికి వాడుకుంటే, అది ' సరుకు' కాదు. ఇంట్లో, 'అన్నం' వండుకుంటే, అది 'సరుకు' కాదు. వాటినే బైటికి అమ్మితే, అవి - సరుకులు. అమ్మకం అయిన తర్వాత అవి మళ్ళీ వస్తువులే. బైట ఒక సరుకుని కొని, వాడకానికి తెచ్చుకుంటే, అది మళ్ళీ వస్తువే.

' సరుకు' అనే మాట కనపడ్డప్పుడల్లా, "సరుకు అంటే వస్తువే. కానీ అది అమ్మకం కోసం వుంది" అని గుర్తు చేసుకోవాలి.

వస్తువులు తయారైన తర్వాత, వాటికి అమ్మకం జరగవలసిన అవసరం లేకపోతే, వాటిని వెంటనే వాడుకోవచ్చు. కానీ, తయారైన వస్తువులకు, అమ్మకాలు జరగవలసి వుంటే, ఆ వస్తువుల్ని, వెంటనే వాడు కోవడానికి వీలు వుండదు. కొత్త వస్తువులు సిద్ధంగానే వుంటాయి. వాటితో అనేక మందికి అవసరాలూ వుంటాయి. అయినా, ఆ వస్తువుల్ని వాడుకోవడం సాధ్యం కాదు. ఒకరు వాటిని అమ్మాలి. ఇంకొకరు వాటిని కొనాలి. అప్పుడు మాత్రమే ఆ వస్తువులు వాడకంలోకి వెళ్తాయి.

(2) అమ్మకానికి ఇవ్వకుండా ఇంట్లోనే వాడుకునే వస్తువులకు విలువలు ఎలా వుండవచ్చో తెలుస్తుందా? - తెలుస్తుంది. ఎలాగంటే : అదే రకం వస్తువుల్ని బైట అమ్ముతూ వుంటారు కదా? బైట అమ్మిన కుండ విలువ 1 రూపాయి అయితే, ఇంట్లో వున్న కుండ విలువ కూడా అంతే కదా? ఇంట్లో దాన్ని కొత్తలోనే అమ్మితే, రూపాయి వచ్చేది కదా? - ఆ రకంగా, బైట వున్న విలువల్ని బట్టి, అమ్మకానికి వెళ్ళని వస్తువుల విలువలు కూడా తెలుస్తాయి. కానీ, అమ్మకానికి వెళ్ళనివి సరుకులు కావు. వాటికి విలువ ప్రసక్తి వుండదు.

(3) డబ్బు పద్ధతి వచ్చాక, వస్తువుల మారకాలు ఆగిపోయినట్టా? - అలా కాదు. బార్టరు పద్ధతిలో జరిగింది అయినా, డబ్బు పద్ధతిలో జరిగేది అయినా, వస్తువుల మారకాలే. వీళ్ళ వస్తువులు వాళ్ళకీ, వాళ్ళ వస్తువులు వీళ్ళకీ మారడాలే.

(4) బార్టరు పద్ధతిలో, ' అమ్మడం, కొనడం, సరుకులు' అనే మాటలు వుండవు. అయినా, అక్కడ జరిగేవి కూడా, ఆ 2 పనులే. కుండని ఇచ్చి చెప్పుల్ని తీసుకున్నప్పుడు, దాన్ని కుండ వేపు నించి చూస్తే - అది కుండని అమ్మడం ; చెప్పుల్ని కొనడం - ఆ మాటలు అప్పుడు లేకపోయినా. చెప్పుల వేపు నించి చూస్తే, అది చెప్పుల్ని అమ్మడం ; కుండని కొనడం.

(5) బార్టరు పద్ధతిలో అమ్మడమూ, కొనడమూ ఒక్క మారకంతోనే జరిగిపోతాయి. కానీ, డబ్బు పద్ధతిలో అయితే, ఒక వస్తువుని అమ్మడమూ, ఆ విలువతో ఇంకో వస్తువుని కొనడమూ, విడి విడిగా

జరుగుతాయి.

కుండని ఇచ్చి డబ్బు తీసుకుంటే, అది కుండని అమ్మడం. ఆ డబ్బు ఇచ్చి చెప్పులు తీసుకుంటే, అది చెప్పుల్ని కొనడం. ఈ రకంగా, డబ్బు పద్ధతిలో, అమ్మడాలూ, కొనడాలూ విడిపోతాయి. కుండ విషయంలో జరిగేదే చెప్పుల విషయంలో కూడా.

**(6)** బార్టరు మారకాల్లో, 'విలువ' గా వున్న మాట, డబ్బు మారకాల్లో 'ధర' అవుతుంది. 'ధర' అనే మాట, 'ఆ మారకం, డబ్బు ద్వారా జరిగినట్టు' తెలుపుతుంది. కుండకీ, 1 రూపాయి నాణానికీ, మారకం జరిగితే, కుండ ధర - 1 రూపాయి. అలాగే, డబ్బుకీ చెప్పులకీ మారకం జరిగితే, చెప్పుల ధర - 1 రూపాయి.

'ధర' అనే మాటకి, ఇంకా 'వెల, ఖరీదు, మూల్యం' అనే పేర్లు కూడా వుంటాయి. బార్టరు మారకాల్లో మాత్రం 'విలువ' అనే పేరే వుంటుంది.

**(7)** బార్టరులో, కుండని ఇచ్చి, చెప్పుల్ని తీసుకుంటే, అది కుండని అమ్మడమూ, చెప్పుల్ని కొనడమూ - అవుతాయి కదా? అయితే, డబ్బు పద్ధతిలో, కుండని ఇచ్చి డబ్బు తీసుకుంటే, అది కుండని అమ్మడమూ, డబ్బుని కొనడమూ అవుతాయా? డబ్బు ఇచ్చి, చెప్పుల్ని తీసుకుంటే, అది, డబ్బుని అమ్మడమూ, చెప్పుల్ని కొనడమూ, అవుతాయా? - ఈ 'అమ్మడమూ, కొనడమూ' అనే మాటలు, మామూలు వస్తువుల గురించే గానీ, డబ్బు గురించి కాదు. బార్టరు మారకంలో అయితే, 2 వేపులా మామూలు వస్తువులే వుంటాయి కాబట్టి, ఆ మాటలు ఆ 2 వస్తువులకూ వాడవచ్చు. ఒక వస్తువుని అమ్మడమే, రెండో వస్తువుని కొనడం. అలాగే, ఒక వస్తువుని కొనడమే, రెండో వస్తువుని అమ్మడం.

డబ్బు పద్ధతిలో అయితే, మామూలు వస్తువు, ఒక్క వేపే వుంటుంది. అమ్మేదీ, కొనేదీ, ఆ మామూలు వస్తువునే. రెండో వేపు, డబ్బు వుంటుంది. అమ్మడం, కొనడం - అనే మాటలు, డబ్బు కోసం కాదు.

కుండని ఇచ్చి డబ్బుని తీసుకుంటే, ఒకరు కుండని అమ్మారు ; ఇంకొకరు కుండని కొన్నారు. అంతే గానీ, అక్కడ, 'ఒకరు డబ్బుని అమ్మారు. ఇంకొకరు డబ్బుని కొన్నారు' అని కాదు.

**(8)** అయితే, 'డబ్బుని అమ్మడమూ, డబ్బుని కొనడమూ' అనే తమాషాలు కూడా వుంటాయి. అది ఎప్పుడంటే, ఒక దేశపు డబ్బుని ఇచ్చి, ఇంకో దేశపు డబ్బుని తీసుకోవాలంటే! రెండు వేపులా డబ్బే వున్నప్పుడు! అదంతా ఇక్కడ మనకి అనవసరం. ఇక్కడ చూసేది, వస్తువులకూ, డబ్బుకీ జరిగే మారకాల సంగతి.

## ప్రశ్నలూ - జవాబులూ



**1**. 'సరుకు' అంటే ఏమిటి? అది, వస్తువా కాదా?

**జ** : అది వస్తువే. అమ్మకం కోసం సిద్ధంగా వున్న వస్తువే సరుకు.

**2**. డబ్బు, మారకాలకు మధ్యవర్తా?

**జ** : కాదు, మారకాల సాధనం ; అంతే. సరుకులతో మారడమే దాని పని.

**3**. మీరు ఒక సారి ఒక షాపులోకి వెళ్ళి, 1 రూపాయి ఇచ్చి, 1 పెన్సిలు కొన్నారు. రూపాయి ⟶

వెళ్ళిపోయి, పెన్సిలు మీ చేతిలోకి వచ్చింది. అక్కడ జరిగిందేమిటో మీకు అర్థమైందా?

**జ** : అక్కడ, 1 రూపాయికీ, 1 పెన్సిల్‌కీ, ' మారకం' జరిగింది. ఇది వరకు అయితే, ఈ ' మారకం' అనే మాట తెలియదు. ఇప్పుడైతే, ఏ వస్తువుని కొన్నా, ' ఇది ఒక మారకం' అని అర్థం అవుతోంది.


**4** . ఒకాయన ఇంకో ఊరు వెళ్ళడానికి బస్సు ఎక్కాడు. టిక్కెట్టు కోసం డబ్బు ఇచ్చాడు. ఊరు చేరాక బస్సు దిగాడు. అక్కడ దేనికీ, దేనికీ, మారకం జరిగింది?

**జ** : ' ప్రయాణ సౌకర్యం ( రవాణా శ్రమ )' అనే సరుకుకీ, డబ్బుకీ, మారకం జరిగింది.

**5** . ఒకావిడకి జ్వరం వచ్చింది. డాక్టర్ దగ్గిరికి వెళ్ళి వైద్యం చేయించుకుంది. డబ్బు ఇచ్చింది. అక్కడ, దేనికీ, దేనికీ, మారకం జరిగింది?

**జ** : ' వైద్య సౌకర్యం ( వైద్య శ్రమ)' అనే సరుకుకీ, డబ్బుకీ.


**6** .



ఇది ఏమిటి?

**జ** : కుండ విలువ, చెప్పులు.


**7** .



ఇది ఏమిటి?

**జ** : కుండ ధర, రూపాయి.

**8**.




ఇది ఏమిటి?

**జ** : కుర్చీ ధర 10 రూపాయలు.

**9** . రూపాయి బిళ్ళకీ, 10 రూ.ల బిళ్ళకీ తేడా ఏమిటి?

**జ** : 1 రూపాయి బిళ్ళలో వున్నంత బంగారానికి 10 రెట్ల బంగారం, 10 రూ.ల బిళ్ళలో వుంటుంది.


**10.**



రూపాయి ధర, కుండా?

**జ**: కాదు. డబ్బుకి ధర వుండదు. మామూలు వస్తువులకు, విలువా, ధరా కూడా వుంటాయి. ఒక వస్తువుకి బదులు ఇంకో వస్తువు వస్తే, అది విలువ. డబ్బు వస్తే, అది ధర. డబ్బు, మామూలు వస్తువులతోనే మారుతుంది గానీ, డబ్బుతో మారదు. రూపాయి, కుండతో మారితే, ఆ కుండ, రూపాయికి విలువ అవుతుంది, ధర అవదు.

**11.**



రూపాయి ధర, రూపాయా?

**జ**: రూపాయి, రూపాయితో మారడం జరగదు. ఒక రూపాయికి, ఇంకో రూపాయి, విలువా కాదు. ధరా కాదు.

★

# 26. డబ్బు, సమస్త వస్తువులకూ 'విలువ రూపం!'

డబ్బుకి వున్న అతి ప్రధాన లక్షణాన్ని ఇప్పుడు చూస్తాం.

బార్టరు పద్ధతికీ, డబ్బు పద్ధతికీ, ఎన్ని తేడాలు వున్నా, వాటిలో ప్రధానమైన తేడా, 'విలువ రూపం' విషయంలో. బార్టరు పద్ధతిలో, కుండకీ, చెప్పులకీ మారకం జరిగితే, కుండ విలువని చూడాలంటే, చెప్పుల్ని చూడాలి. చెప్పుల విలువని చూడాలంటే, కుండని చూడాలి. కుండకీ, చెప్పులికీ, విలువలు సమానమే. అయినా, ఆ విలువలు కనపడే రూపాలు, ఒకే రకంగా వుండవు. దేని విలువ రూపం దానిదే. ఆ విలువలు, వేరు వేరు వస్తువుల ద్వారా కనపడతాయి.

ఒకే రకం వస్తువుల్ని తీసుకున్నా, వాటి విలువలు ఎప్పుడూ ఒకే రూపంతో వుండవు. ఒకే రకమైన 10 కుండల్ని మారకాలకు పెడితే, అన్నీ చెప్పులతోనే మారవు. వేరు వేరు వస్తువులతో మారతాయి. కాబట్టి ఒక కుండ విలువ రూపం వున్నట్టు, ఇంకో కుండ విలువ రూపం వుండదు.

కానీ, డబ్బు పద్ధతిలో అయితే, ఏ వస్తువు విలువ రూపం ఆ వస్తువుది కాదు. ఏ వస్తువు అయినా డబ్బుతో మారవలసిందే కదా? సమాజంలో వెయ్యి రకాల వస్తువులు వున్నా, ఆ వస్తువుల మనుషులు, తమ వస్తువుల్ని బార్టరు పద్ధతిలో మార్చుకోరు. డబ్బు పద్ధతిలోనే మార్చుకుంటారు. వెయ్యి రకాల వస్తువుల విలువలూ, డబ్బు రూపంతో కనపడవలిసిందే. 'విలువ' అనేది, ఇంకే రూపంతోనూ వుండదు.

కుండ విలువ - కొంత డబ్బు.
చెప్పుల విలువ - కొంత డబ్బు.
ధాన్యం విలువ - కొంత డబ్బు.
కుర్చీ విలువ - కొంత డబ్బు.

దేని విలువ అయినా కొంత డబ్బే. దేని విలువని చూడాలన్నా, డబ్బుని చూడవలిసిందే. అందుకే, <u>సమస్త వస్తువులకూ విలువ రూపం - డబ్బే!</u>

'డబ్బు అంటే బంగారం బిళ్ళ' అనీ, 'అది కూడా ఒక వస్తువే' అనీ, ఈ 2 విషయాలే తెలుసుకుంటే, డబ్బు గురించి పూర్తిగా తెలుసుకున్నట్టు కాదు. సమస్త వస్తువుల తోటీ మారే హక్కు గల వస్తువుగా వుండడం వల్లనే, ఆ ప్రధాన లక్షణం వల్లనే, ఆ వస్తువు, 'డబ్బు' అవుతుంది.

ఏ సాధారణ వస్తువు విలువ అయినా డబ్బు రూపంతోనే కనపడుతుంది కాబట్టి, డబ్బు అనేది, సమస్త వస్తువులకూ విలువ రూపం.

కుండ = చెప్పులు.
కుండ = 1 రూపాయి.
విలువ లెక్కల్లో, ఈ 2 విషయాలూ ఒకటే.

కుండ, చెప్పులతో మారినప్పుడు, ఆ చెప్పులే, కుండకి విలువ కదా? అలాగే,

కుండ, రూపాయితో మారినప్పుడు, ఆ రూపాయే కుండకి విలువ.

విలువ అంటే, శ్రమే కదా?

ఒక వస్తువుని అమ్మగా వచ్చే డబ్బు, ఆ వస్తువుని తయారుచెయ్యడానికి అవసరమయ్యే మొత్తం శ్రమదే - అని అర్థం! దీన్ని క్లుప్తంగా చెప్పుకుంటే, డబ్బు - మొత్తం శ్రమదే. పాత - కొత్త శ్రమలు రెండూ కలిపినదే, ఆ మొత్తం. ఆ మొత్తం శ్రమ ఎవరిది? ఆ పాత శ్రమా, ఆ కొత్త శ్రమా చేసిన వ్యక్తులది. - ఈ అంశం, ఆర్థిక శాస్త్రానికంతటికీ మూలం అయినది!

వస్తువుల్లో ఎక్కువ శ్రమతో తయారయ్యేవీ, తక్కువ శ్రమతో తయారయ్యేవీ, వుంటాయి కదా? వస్తువుకి బదులుగా వచ్చే డబ్బు, వస్తువు విలువకి తగ్గట్టుగానే వుంటుంది. ఎక్కువ విలువకి ఎక్కువ డబ్బూ, తక్కువ విలువకి తక్కువ డబ్బూ! విలువ పరిమాణాన్ని బట్టే, డబ్బు పరిమాణం ఉంటుంది.

**ఒక ప్రశ్న** : కుండ మనిషి, కుండని అమ్మగా వచ్చిన డబ్బుతోనే చెప్పుల్ని కొన్నాడు. కుండ విలువతోనే చెప్పుల్ని కొన్నాడు కాబట్టి, కుండ విలువకి రూపం - చెప్పుల రూపమా?

**జవాబు** : కాదు. కుండ, డబ్బుతో మారింది గానీ, చెప్పులతో కాదు. దేనితో మారిందో, దాని రూపమే - విలువ రూపం. డబ్బుతో మారితే, డబ్బు రూపమే కుండ విలువకి రూపం.

**ఇంకో ప్రశ్న** : 1 రూపాయి నాణెం, మొదట జొన్నలతో, తర్వాత కుండతో, తర్వాత చెప్పులతో, అలా మారితే, ఆ రూపాయి బిళ్ళని, ఏ వస్తువుకి విలువగా అనుకోవాలి? అది, జొన్నల విలువా, కుండ విలువా, చెప్పుల విలువా?

**జవాబు** : ఆ నాణెం, ఏ వస్తువుతో మారినప్పుడు, ఆ వస్తువుకి విలువ. జొన్నలతో మారినప్పుడు, అది, జొన్నల విలువ. జొన్నల మనిషి, జొన్నల్ని అమ్మి తన చేతిలోకి తీసుకున్న డబ్బుతో, 10 రోజుల దాకా ఇంకో వస్తువుని కొనక పోతే, అప్పటి దాకా అది జొన్నల విలువే. దానితో కుండని కొంటే, అప్పుడు అది, కుండ విలువ. కుండని అమ్మిన మనిషి, ఆ డబ్బుతో చెప్పుల్ని కొంటే, అప్పుడు అది చెప్పుల విలువ. అలా అది, ఏ వస్తువుతో మారినప్పుడు, ఆ వస్తువు విలువే, ఇంకో వస్తువుతో మారే దాకా.

**ఇంకో ప్రశ్న** : కుండల రామయ్య భార్య రాధమ్మ. ఆమెకి వున్న 4 చీరలూ పాతబడిపోయాయి. వెంటనే 2 చీరలు కావాలి. కొత్త చీర ధర 10 రూపాయలు. ఒక కుండని అమ్మితే, ఒక్క రూపాయే వస్తుంది. 10, 15 కుండల్ని అమ్మే దాకా డబ్బుని కూడబెట్టి, 10 రూపాయలు చేరాక చీర కొనుక్కోవాలి. డబ్బు పద్ధతిలో అయితే ఇలా చెయ్యవచ్చు. కానీ, బార్టరు పద్ధతిలో ఇది ఎలా జరిగేది? కుండ విలువ కన్నా, చీర విలువ 10 రెట్లు. ఒక చీర కావాలంటే, 10 కుండలు తీసుకువెళ్ళి ఇచ్చి చీరని అడగాలా? చీరల వాళ్ళు, 10 కుండలు ఏం చేసుకుంటారు? మరి, కుండల వాళ్ళకి, ఎక్కువ విలువ గల వస్తువులు కావాలంటే, వాటిని ఎలా సంపాదించగలిగేవారు?

**జవాబు** : ఆ రోజుల్లో ఎలా జరిగేదో మనకు తోచినట్టు ఊహించ వలిసిందే.

దీన్ని బట్టి, బార్టరు పద్ధతిలో కన్నా,

డబ్బు పద్ధతిలో మారకాలు జరగడం, ఎంతో సుఖం అని తెలుస్తోంది. ఒక చిన్న వస్తువు ధర 1 రూపాయి అయితే, రెట్టింపు విలువ గల వస్తువు ధర, 2 రూపాయలు. సగం విలువే గల వస్తువు ధర, అర్ధ రూపాయే. డబ్బుని ఎన్ని భాగాలుగా అయినా చెయ్యవచ్చు. ఎన్ని భాగాల్ని అయినా కలపవచ్చు. కొంత డబ్బుని కూడ బెట్టి, దానితో ఎక్కువ విలువ గల వస్తువులు కొనవచ్చు. బార్టరు పద్ధతిలో అయితే, ఈ సదుపాయాలన్నీ అసాధ్యం. అక్కడ ఎదురయ్యే సమస్యల వల్లనే డబ్బు పద్ధతి పుట్టుకొచ్చింది.

'డబ్బు' కూడా ఒక వస్తువే అయినా, అది 'సాధారణ' వస్తువు కాదు. 'అసాధారణ' వస్తువు. ఇప్పటి దాకా రూపాయి నాణాలనే చూశాం. మరి, 'కాయితం డబ్బు'ని కూడా చూద్దామా?

## ప్రశ్నలూ - జవాబులూ

**1**. 'డబ్బు' అంటే ఏమిటి?

**జ**: 'డబ్బు' అంటే, సమస్త వస్తువుల విలువలనూ చూపించే హక్కు గల వస్తువు.

**2**. 1 కుండకి బదులుగా, 1 చెప్పుల జత రావడానికీ, 1 రూపాయి రావడానికీ, తేడా ఉందా?

**జ**: 'విలువ' విషయంలో తేడా లేదు.

కుండకి బదులుగా చెప్పులు వస్తే, ఆ చెప్పులే కుండ విలువ కదా? అలాగే, కుండకి బదులుగా కొంత డబ్బు వస్తే, ఆ డబ్బే కుండ విలువ. 'ఆర్థిక శాస్త్రం'లో ఇది ఎంతో ముఖ్యంగా గ్రహించవలసిన విషయం.


**3**. డబ్బు 'అసాధారణ' వస్తువు, ఏ విధంగా?

**జ**: సాధారణ వస్తువులన్నిటికీ ఏదో ఒక 'ఉపయోగపు విలువ' వుంటుంది. డబ్బుకి అది వుండదు. ఉపయోగపు విలువ లేకపోవడమే దాని అసాధారణత్వం.

**4**. 'విలువ రూపం' అంటే ఏమిటి?


**జ**: విలువని చూపించే రూపం. విలువ, వస్తువు శరీరంలో కనపడదు కదా? దాన్ని బైట, ఏదో ఒక వస్తువు రూపంతో చూడాలి.

**5**. ఇవి ఏమిటి?



కుండని అమ్మితే రూపాయి వచ్చింది.
కుండ విలువ, డబ్బుగా కనపడుతోంది.
చేట విలువ, డబ్బుగా.
అరిటి పళ్ళ విలువ, డబ్బుగా.
ధాన్యం విలువ, డబ్బుగా. చెప్పుల విలువ, డబ్బుగా.
డబ్బు, ఏ వస్తువు విలువని అయినా చూపిస్తుంది.
అందుకే అది, వస్తువుల ఉమ్మడి విలువ రూపం.

# 27. ‘ఉపయోగపు విలువ’ లేని, ‘విలువ’ కూడా లేని మరింత వింత వస్తువు కాయితం డబ్బు!



‘డబ్బు నాణాల’ పద్ధతిని కనిపెట్టిన వెంటనే బార్టరు పద్ధతి ఆగిపోదు. డబ్బుతో మారకాలు ఇక్కడొకటీ, అక్కడొకటీ మాత్రమే ప్రారంభమవుతాయి. చాలా వస్తువుల విషయంలో, గతంలో లాగే బార్టరు పద్ధతే సాగుతూ వుంటుంది. కానీ, డబ్బు పద్ధతి వల్ల, మారకాలు చాలా తేలిగ్గా జరుగుతాయి కాబట్టి, క్రమక్రమంగా డబ్బు పద్ధతే స్థిరపడి, బార్టరు పద్ధతి తగ్గిపోతూ, చివరికి అది పూర్తిగా అంతర్ధానమవుతుంది.

ఇప్పుడు ప్రపంచంలో, ఏ దేశంలో అయినా, డబ్బు పద్ధతే వుంది. బార్టరు పద్ధతి లేదు.

‘జొన్నలూ - కుండా - చెప్పులూ’ ఉదాహరణనే తీసుకుందాం. బంగారం రూపాయి బిళ్ళ, జొన్నల్ని అమ్మిన మనిషి చేతిలోకి రావడం మొదట చూశాం. అంతకుముందు అది ఎంత మంది చేతుల్లో తిరిగివచ్చిందో మనకు తెలీదు. మనం చూసినప్పుడు అది జొన్నల మనిషి చేతిలో వుంది. అతను ఆ బిళ్ళని కుండ మనిషికి ఇచ్చి కుండని కొన్నాడు. ఆ బిళ్ళ, కుండ మనిషి చేతిలో పడింది. ఆ మనిషి, ఆ బిళ్ళని, చెప్పుల మనిషికి ఇచ్చి చెప్పులు కొన్నాడు. ఆ బిళ్ళ, చెప్పుల మనిషి చేతిలో ఆగిపోవడం వరకూ చూశాం. తర్వాత అది ఎక్కడికి వెళ్తుంది? - ఆ చెప్పుల మనిషి ఏ వస్తువుని కొంటాడో, ఆ వస్తువుని అమ్మే మనిషి దగ్గిరికి వెళ్తుంది.

ఆ తర్వాత? - ఇంకో మనిషి దగ్గిరికి. ఆ తర్వాత? - అప్పుడు కూడా అలాగే. ఎప్పుడైనా అలాగే. అది అలా వస్తువులతో మారుతూనే, అలా తిరుగుతూనే వుంటుంది. దానితో ఏమీ కొనకుండా, దాన్ని పెట్లో దాచి పెట్టేస్తే, అది కదలదు. కానీ, అలా దాచి పెట్టేస్తే, దానితో ఏదీ కొనకపోతే, కావలసిన వస్తువులు ఎలా వస్తాయి? జనం, వాటితో, వస్తువుల్ని కొంటూనే వుంటారు. అవి, అలా తిరుగుతూనే వుంటాయి. డబ్బు బిళ్ళలు, మామూలు వస్తువులతో, మారకాల్లో తిరగడాన్ని ‘చలామణీలో తిరగడం’ అంటాం.

అందరి చేతుల్లోనూ ఒక్క బిళ్ళే తిరగదు. వందల బిళ్ళలు తిరుగుతూ వుంటాయి. కొన్ని ఎక్కువ సార్లూ, కొన్ని తక్కువ సార్లూ. అలా తిరుగుతూ వున్నప్పుడు ఆ బిళ్ళలు అరిగిపోవడం మొదలవుతుంది.

ఒక కొత్త రూపాయి బిళ్ళ, ఫలానా కొంత బరువుతో కొత్తగా తయారైనప్పుడు, దాని విలువ, ‘2 గంటల శ్రమ’ అనుకుందాం. ఆ కొత్త బిళ్ళ, ఒక సంవత్సరం పాటు, అనేక చేతుల్లో, జేబుల్లో, సంచుల్లో, పెట్టెల్లో,

పడుతూ లేస్తూ తిరగడం వల్ల, కొంత అరిగిపోతుంది. అలా అరిగిపోవడం వల్ల, ఆ బిళ్ళ విలువ, కొంత పోయినట్టే కదా? అరిగిపోయిన బిళ్ళని ఇస్తే, కొత్త బిళ్ళకి వచ్చినట్టుగా, అంత విలువ గల వస్తువులు రాకూడదు కదా? - కానీ, కొంత అరిగిపోయిన బిళ్ళకి కూడా, వస్తువులు వెనకటిలాగే వస్తాయి. ఆ వస్తువుల్ని అమ్మే వాళ్ళు, అరిగిపోయిన రూపాయిల్ని కూడా మంచి రూపాయల్లాగే తీసుకుంటారు. తన వస్తువుని ఇచ్చి అరిగిన రూపాయిని తీసుకోవాలంటే, " ఈ బిళ్ళ కొంచెం అరిగిపోయింది. దీనికి పూర్తి విలువ వుండదు. దీనికి నా వస్తువుని ఇవ్వను" అని ఎవ్వరూ అనరు. అరిగిన రూపాయిల్తో కూడా మారకాలు జరిగిపోతూనే వుంటాయి.

ఒక కొత్త రూపాయి బిళ్ళ వెంట మనం కూడా బైల్దేరితే, అది ఎక్కడెక్కడికి వెళ్తుందో చూడవచ్చు. దాని ప్రయాణానికి అంతం వుండదు. అంతం ఎప్పుడంటే, అది మరీ బక్కగా ఆకులా అరిగిపోయినప్పుడు. బాగా అరిగిపోయిన బిళ్ళల్ని ప్రభుత్వమే వెనక్కి తీసి, వాటిని మళ్ళీ కొత్త బిళ్ళలుగా పూర్తి బరువుతో తయారుచేయిస్తుంది.

అరిగిపోయి, విలువలు తగ్గిన బిళ్ళల్ని కూడా, వాటి విలువల సంగతి పట్టించుకోకుండా జనం వాటితోనే మారకాలు చేసుకుంటారు కదా? ఆ అనుభవాల వల్లే, 'కాయితం డబ్బు' పుట్టుకొచ్చింది. విలువ తగ్గిన బిళ్ళల్ని కూడా పూర్తి విలువ గల బిళ్ళలుగా భావించినట్టే, అసలు విలువే లేని కాయితం ముక్కని డబ్బుగా ఎందుకు అనుకోకూడదు? అందరూ దాన్నే అంగీకరిస్తే, కాయితం రూపాయలతోనే మారకాలు చేసుకోవచ్చు కదా?- ఇదీ, 'కాయితం డబ్బు' పుట్టడానికి వెనక వున్న ఆలోచన!

అయితే, విలువ కొంచెం తగ్గిన బంగారం బిళ్ళా, అసలు విలువే లేని కాయితం ముక్కా - రెండూ ఒకటేనా? అరిగిన బంగారం బిళ్ళతో మారకాలు జరగడం అంటే, ఆ బిళ్ళకి కొత్తగా వున్నప్పుడు ఏ విలువ వుంటుందో ఆ విలువ ప్రకారమే దానితో మారకాలు జరుగుతాయి. కానీ, 'కాయితం ముక్క' ఎంత కొత్తగా వున్నా ఆ ముక్కకి విలువే వుండదు కదా? దానితో మారకాలు ఏ లెక్కలతో జరుగుతాయి? 'కాయితం ముక్క' ఇస్తే వస్తువులు ఎందుకు వస్తాయి?


'కాయితం నోటు'కి స్వంత విలువ వుండదు, నిజమే. కానీ, దానికి కూడా కొంత విలువని ఇచ్చే ఏర్పాటు ఏదైనా వుంటే, కాయితం నోటు కూడా డబ్బుగా తిరగగలుగుతుంది. అలాంటి మార్గం వుంది. ఎలాగంటే : కాయితం డబ్బుని అచ్చు వేయించి విడుదల చెయ్యవలసిన బాధ్యత, దేశాన్ని పరిపాలించే ప్రభుత్వానిదే. ఆ ప్రభుత్వం, ప్రజలకు ఇలా చెపుతుంది : " మీ అందరి దగ్గిరా బంగారం డబ్బు బిళ్ళలు వున్నాయి కదా? కొందరి దగ్గిర ఎక్కువా, కొందరి దగ్గిర తక్కువా వుండవచ్చు. బంగారం నాణాలే చలామణీలో తిరగడం వల్ల, బంగారం అంతా వృధాగా అరిగిపోతూ వుంటుందని మీకు తెలుసు. ఆ బిళ్ళల్ని మళ్ళీ చేయించాలి. అదంతా బోలెడు వృధా కదా? అలా కాకుండా మనం ఒక పని చెయ్యవచ్చు. చలామణీలో తిరగడానికి కాయితం నోట్లని పెట్టుకుంటే,

బంగారం నాణాల్ని అరిగిపోకుండా వుంచుకోవచ్చు. అయితే, ఆ బంగారం నాణాలన్నిటినీ ఒక చోట దాచిపెట్టాలి. బైట తిరిగే పని కోసం కాయితం నోట్లని పంపాలి. మీ దగ్గిర వున్న బంగారం రూపాయలన్నీ మాకు ( ప్రభుత్వానికి ) అప్పజెప్పండి! వాటిని ఒక చోట దాచిపెడతాం. మీరు ఎన్ని బంగారం రూపాయలు మాకు ఇస్తే, మేము అన్ని కాయితం రూపాయలు మీకు ఇస్తాం. 1 బంగారం రూపాయి తిరగడానికి బదులు, 1 కాయితం రూపాయి తిరుగుతూ వుంటుంది. బంగారం రూపాయికి వుండే విలువే, కాయితం రూపాయికి వున్నట్టు అర్థం. 1 బంగారం రూపాయితో కొనవలసిన వస్తువుని, 1 కాయితం రూపాయితో కొనవచ్చు. 2 బంగారం రూపాయలతో కొనే వస్తువుని, 2 కాయితం రూపాయలతో. కాయితం డబ్బు వల్ల సమస్యేమీ రాదు. బంగారం అరిగిపోకుండా చేసుకోవాలంటే, ఇదే మార్గం. కాబట్టి మీ బంగారం రూపాయలు తెచ్చి మాకు ఇచ్చి, కాయితం రూపాయలు తీసుకోండి! ఇక వాటితోనే మీరు వస్తువుల్ని కొనుక్కోవచ్చు'' అని చెప్పింది ప్రభుత్వం.

అంతే కాదు, " మీ బంగారం డబ్బుని వెనక్కి తీసేసుకోవాలని మీకు ఎప్పుడైనా అనిపిస్తే, కాయితం డబ్బుని తెచ్చి మాకు ఇచ్చేసి, మీ బంగారం మీరు తీసుకోవచ్చు'' అని కూడా చెప్పారు. బంగారాన్ని వెనక్కి తీసుకునే అవకాశం కూడా ఇచ్చారు. ఎందుకంటే, ప్రజలకు ' కాయితం డబ్బు' మీద నమ్మకం కలగడానికి.

ప్రభుత్వం చెప్పగానే, అందరూ అలాగే చెయ్యరు. కొందరే తమ బంగారం డబ్బుని ప్రభుత్వానికి ఇచ్చి, కాయితం డబ్బు తీసుకున్నారు, భయపడుతూనే! ఆ ధైర్యం చెయ్యలేని వాళ్ళు, బంగారం డబ్బే వుంచుకున్నారు.

'కాయితం డబ్బు' ప్రారంభమైన కొత్తలో, ఒక ఊళ్ళో జరిగే అమ్మడాలూ కొనడాలూ, బంగారం డబ్బుతోనూ జరుగుతాయి ; కాయితం డబ్బుతోనూ జరుగుతాయి. చెప్పుల మనిషి, తన దగ్గిరికి వచ్చిన వాళ్ళు బంగారం డబ్బు ఇచ్చినా చెప్పులు ఇస్తాడు ; కాయితం డబ్బు ఇచ్చినా చెప్పులు ఇస్తాడు. ప్రారంభంలో, 2 రకాల డబ్బూ చలామణీలో తిరుగుతూ వుంటుంది.



ఈ బిళ్ళ విలువే, నోటు విలువ

క్రమంగా, అందరి చేతుల్లోకీ కాయితం డబ్బే చేరింది. బంగారం బిళ్ళలు బ్యాంకులోకి చేరాయి.

అయితే, చలామణీలో బంగారం నాణాలు తిరిగితే అవి అరిగిపోతాయి, నిజమే. మరి కాయితం నోట్లు తిరిగితే, అవి చిరిగిపోవూ? - అది ఫర్వాలేదు. కొంత బంగారం అరిగిపోవడం కన్నా, కొంత కాయితం చిరిగి పోయినా, అది లెక్కలో ఖర్చు కాదు.

'డబ్బు' అనే దానికి ఉపయోగపు విలువ వుండదని గతంలోనే చూశాం. అయితే, బంగారం డబ్బుకి అయితే, ఉప

యోగపు విలువ లేకపోయినా, ‘ విలువ’ అయినా వుంటుంది. కానీ, కాయితం డబ్బుకి అయితే, ఉపయోగపు విలువే కాదు, ‘ విలువ’ కూడా వుండదు. ఏ లక్షణమూ లేని వింత వస్తువు కాయితం డబ్బు!


# ప్రశ్నలూ - జవాబులూ

**1**. రామయ్య, కుండని అమ్మాడు. అతని చేతిలోకి రూపాయి బిళ్ళ వచ్చింది. అతను ఆ బిళ్ళని చెప్పుల మనిషికి ఇచ్చి చెప్పులు కొన్నాడు. రూపాయి బిళ్ళ, చెప్పుల మనిషి చేతిలోకి వెళ్ళింది. చెప్పుల మనిషి, ఆ బిళ్ళని ఇచ్చి బెల్లం కొన్నాడు. రూపాయి, బెల్లం మనిషి చేతిలోకి వెళ్ళింది. ఈ రకంగా, ఆ బిళ్ళ ఇంకా ఎంత మంది దగ్గిరికి వెళ్తుంది?

**జ** : అది అరిగిపోయే దాకా అలా వెళ్తూనే వుంటుంది. కాయితం నోటు అయితే, అది చిరిగిపోయే దాకా.

**2**. రూపాయి బిళ్ళ అనేక సరుకులతో మారుతూ వుంటుంది కదా? అది, ఏ సరుకు విలువని చూపిస్తుంది?

**జ** : రూపాయి బిళ్ళ, ఏ సరుకుతో మారినప్పుడు, ఆ సరుకుకి విలువగా వుందని అర్థం. కుండతో మారినప్పుడు, ఆ రూపాయి, కుండ విలువ. ఆ రూపాయితో ఇంకో సరుకుని కొనే దాకా, అది కుండ విలువే. అది కుండ మనిషి చేతిలోనే వుంటుంది.


**3**. 

ఈ రూపాయలు రెండూ, సమాన విలువలు గలవేనా?

**జ** : అవి, సమాన విలువలు గలవి కావు. బంగారం బిళ్ళకి వున్న విలువ, కాయితం నోటుకి వుండదు. కానీ సరుకులతో మారడానికి, కాయితం నోటు, బిళ్ళకి బదులుగా వచ్చింది కాబట్టి, రెండూ సమానమైనవే.

**4**. ఒక వస్తువుని అమ్మినప్పుడు, రూపాయి బిళ్ళని తీసుకోవాలా, రూపాయి నోటుని తీసుకోవాలా?

**జ** : దేన్ని తీసుకున్నా ఒకటే. ఎందుకంటే, ఆ మనిషి, తర్వాత, తనకు కావలసిన వస్తువుని కొనేటప్పుడు, రూపాయి బిళ్ళని అయినా ఇవ్వవచ్చు; కాయితం నోటుని అయినా ఇవ్వవచ్చు. దేన్ని ఇచ్చినా, అవతలి వాళ్ళు కూడా దాన్ని తీసుకుంటారు.



**5**. మనం ఇప్పుడు చూసే రూపాయి బిళ్ళలు బంగారంతో గానీ, వెండితో గానీ, వుండవు. నికిల్ వంటి వేరే రకపు లోహాలతో వుంటాయి. చిల్లర నాణాలు కూడా అలాగే వుంటాయి. దీని అర్థం ఏమిటి?

**జ** : బంగారం బిళ్ళకి బదులుగా కాయితం నోటు ఎందుకు వచ్చింది? బంగారం అరిగిపోకుండా, దానికి బదులుగా తిరగాలని. అలాగే, బంగారం బిళ్ళకి బదులుగా నికిల్ బిళ్ళ కూడా, దాని ప్రతినిధిగానే వుంటుంది. చిల్లర బిళ్ళలన్నీ కూడా అలాంటివే. బంగారం అరిగిపోకుండా అవి కూడా తిరుగుతాయి.

# 28. డబ్బు స్థానం లోకి బంగారం పోయి, కాయితం వచ్చిందా?

'కాయితం డబ్బు' ప్రారంభమైం దంటే, 'డబ్బు' స్థానంలో నించి బంగారం పోయి, కాయితమే డబ్బుగా అయిందని అర్థమా? - కాదు. అప్పుడు కూడా 'డబ్బు'గా వుండేది బంగారమే. ఒక వస్తువుకి బదులుగా కాయితం డబ్బు వెళ్ళాలంటే, దాని లెక్కలన్నీ బంగారానికి వుండే విలువని బట్టే వుంటాయి.

బంగారం నాణెం, కాయితం నోటుని పిల్చి ఇలా చెపుతుంది : " నేను ప్రభుత్వం వారి గదిలో, అరిగిపోకుండా కూర్చుని వుంటాను. నువ్వే బైటికి వెళ్ళి, వస్తువులతో మారే పని చెయ్యి!"

కాయితం నోటు సందేహంలో పడి, " నన్ను డబ్బుగా ఎవరు ఒప్పుకుంటారు? నన్ను ఎవరు తీసుకుంటారు? 'నీ మొహం! నువ్వు కాయితం ముక్కవి! కాయితం ముక్కకి ఏం విలువ వుంటుంది' అని అందరూ నన్ను అనరూ?" అంటుంది.

" కాయితం విలువ కాయితానికి వుంటుందిలే గానీ, ఇక్కడ నీ విలువ సంగతి ఎందుకు? 'డబ్బు' అంటే నువ్వు కాదు, నేనే. నువ్వు నా ప్రతినిధివి, అంతే. నేను నిన్ను ఒక పని చెయ్యమని పంపిస్తున్నాను. నా విలువతోనే నువ్వు తిరుగుతావు. నీ విలువ సంగతి ఇక్కడ అక్కరలేదు. నా విలువనే నువ్వు చెపుతావు. తెలిసిందా?"

" సరే, తెలిసింది. సరే, అలాగే."

కాయితం నోటు, మారకాల్లోకి భయపడుతూనే దిగింది గానీ, దాన్ని జనం చక్కగానే గౌరవించారు.

ఒక చెప్పుల జత విలువ - 2 గంటల శ్రమ. ఆ చెప్పుల్ని అమ్మితే, 1 కాయితం రూపాయి నోటు వచ్చింది. అంటే, ఆ కాయితం ముక్క తయారవడానికి 2 గంటల శ్రమ పట్టిందని అర్థమా? - కాదు. ఆ విలువ, 1 బంగారం రూపాయిదే గానీ, ఆ కాయితం నోటుది కాదు.

కాయితం రూపాయి, తనకు విలువ లేకుండానే, బంగారం రూపాయి విలువనే తన విలువగా చెప్పుకుంటూ తిరుగుతుంది. కాయితం రూపాయి విలువగా కనపడేది, బంగారం రూపాయి విలువే.

బంగారం రూపాయికి వున్నంత విలువ, కాయితం రూపాయికి వుండాలంటే, దానికి ప్రభుత్వం ఒక నిబంధన పాటించవలసి వుంటుంది. ప్రభుత్వం, తన దగ్గిర ఎన్ని బంగారం రూపాయల్ని దాచిపెడితే, అన్ని కాయితం రూపాయలనే బైటకి పంపాలి. [ ఈ విషయాలు మనకు ఇప్పుడు వద్దు. ఒక్క చిన్న ఉదాహరణ చెప్పుకుని దీన్ని వదిలేద్దాం. ]

ప్రభుత్వం, ఒక మనిషి దగ్గిర్నించి ఒక బంగారం రూపాయి బిళ్ళ తీసుకుని, దానికి బదులుగా ఆ మనిషికి ఒక్క కాయితం రూపాయే ఇవ్వాలి. ఏ మనిషి

నించి ఎన్ని బిళ్ళలు తీసుకుంటే, అన్ని కాయితం నోట్లే ఇవ్వాలి. అలా జరిగితే, బంగారం రూపాయికి వున్న విలువే కాయితం రూపాయికి వుంటుంది. అలా గాక, ప్రభుత్వం, ఒక బంగారం రూపాయికి బదులుగా 2 కాయితం రూపాయలు ఇచ్చిందనుకుందాం. ఆ 2 కాయితం రూపాయలకి, 2 బంగారం రూపాయలకు వుండే విలువ వుండదు. ఆ 2 కాయితాలకీ కలిసి, ఒక్క బంగారం రూపాయికి వుండే విలువే వుంటుంది. అంటే, అప్పుడు, 1 కాయితం రూపాయి, అర్ధ బంగారం రూపాయి విలువతోనే తిరుగుతుంది. బయట తిరిగే కాయితం రూపాయికి ఎంత విలువ వుండాలో, లోపల దాచిన బంగారం విలువని బట్టే వుంటుంది.

బంగారాన్ని ప్రభుత్వం దాచిపెట్టడం అనేది, కాయితం డబ్బు వచ్చిన ప్రారంభంలో మాత్రమే జరిగిన సంగతి కాదు. ఈ నాడు కూడా, ప్రభుత్వపు రిజర్వ్ బ్యాంకులో, టన్నుల టన్నుల బంగారం మూలుగుతూ వుంటుంది. అది బైట తిరగదు కాబట్టి, అది అరిగిపోదు. అది అక్కడ వుంటే, దాని విలువ లెక్కల ప్రకారమే, బైట ఎంత కాయితం డబ్బు తిరగాలో అంత తిరుగుతూ వుంటుంది. ఈ విషయాలు ఇంతకన్నా ఇక్కడ మనకు అనవసరం.

జనంలో, కాయితం డబ్బు స్థిరపడి పోయాక, " కావాలంటే కాయితం డబ్బుని ఇచ్చి, బంగారం డబ్బుని తీసుకోవచ్చు" అని గతంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం రద్దు చేసింది. అయినా, దాని వల్ల జనాలకు ఇబ్బంది లేదు. బంగారం డబ్బుతో జరిగే పని అంతా, జనం చేతుల్లో వున్న కాయితం డబ్బుతోనే జరుగుతోంది కాబట్టి. జనాలకు బంగారమే కావాలంటే, చేతుల్లో వున్న కాయితం డబ్బుతోనే బంగారాన్ని అమ్మే షాపులోకి వెళ్ళి బంగారాన్ని కొనుక్కోవచ్చు.

ప్రతీ దేశంలోనూ, బంగారం ముద్దలు, బ్యాంకుల్లో వుంటాయి. ఆ విలువకి తగ్గ కాయితం డబ్బు, చలామణీలో వుంటుంది.

భారత దేశపు డబ్బు పేరు - 'రూపాయి' కదా? అలాగే, దేశపు భాషని బట్టి, ఏ దేశపు డబ్బు పేరు ఆ దేశానికి వుంటుంది. ఇంగ్లండు డబ్బు పేరు - పౌండు. అమెరికా డబ్బు పేరు - డాలరు. ఇలా.

వస్తువుల్ని అమ్మడాలూ, కొనడాలూ అనేవి, దేశం లోపలే కాదు, వేరు వేరు దేశాల మధ్య కూడా జరుగుతాయి. ఈ దేశం వాళ్ళు, ఆ దేశానికీ ; ఆ దేశం వాళ్ళు, ఈ దేశానికీ - అమ్ముకుంటారు, కొనుక్కుంటారు. అవే, సరుకుల ఎగుమతులూ, దిగుమతులూ. వాటికి, డబ్బు లెక్కలు చూసుకుంటారు. అయితే, ఒక దేశం, ఇంకో దేశానికి కొంత డబ్బు ఇవ్వవలసి వస్తే, తమ కాయితం డబ్బు ఇస్తే, అది కుదరదు. ఒక దేశపు కాయితం నోట్లు, ఇంకో దేశంలో తిరగడానికి ( చలామణీ అవడానికి ) పనికి రావు. ఎందుకంటే, అసలు డబ్బు అనేది, బంగారమే కదా? ఆ బంగారాన్ని ఇక్కడే పెట్టుకుని, కాయితాలే ఇంకో దేశానికి పంపితే, అది డబ్బు ఇచ్చినట్టు అవదు. కాబట్టి, విదేశాల నించి సరుకుల్ని కొని డబ్బు ఇవ్వాలంటే, బంగారమే పంపాలి.

అందుకే, బంగారం అనేది, 'ప్రపంచ

ధనం'. దేశాల మధ్య చెల్లింపులు బంగారం తోనే జరగాలి.

**డబ్బు ని కూడబెట్టడం :**

'డబ్బు' అనేది ప్రారంభమైన తర్వాత, 'విలువని కూడ బెట్టడం' అనే వింత ఒకటి ప్రారంభమవుతుంది. ఇక్కడ బార్టరు మారకాన్ని ఒక సారి జ్ఞాపకం చేసుకోండి!

కుండని ఇచ్చి చెప్పుల్ని తీసుకుంటే, కుండని అమ్మడమూ, చెప్పుల్ని కొనడమూ ఒకే చర్యతో జరిగిపోతాయి. అమ్మడం ఒక సారీ, కొనడం ఇంకో సారీ, విడి విడిగా జరగవు. ఒక కుండని ఇచ్చి చెప్పుల్ని తీసు కుంటే, ఆ చెప్పుల్ని వాడెయ్యవలిసిందే. 4 కుండలు ఇచ్చి, 4 రకాల వస్తువులు తీసుకుంటే, ఆ వస్తువులన్నిటినీ వాడెయ్య వలిసిందే. కుండ విలువ అయిన చెప్పుల్లో నించో, ధాన్యంలో నించో కొంత భాగాన్ని ఖర్చు పెట్టకుండా దాచడానికి వీలు అవదు. కానీ డబ్బు విధానంలో అయితే, కొంత విలువని దాచడానికి వీలు అవు తుంది. ఒక కుండని అమ్మి 1 రూపాయిని తీసుకుంటే, ఆ రూపాయితో ఏదో ఒక వస్తువుని కొనడం తప్పనిసరే. కానీ, 4 కుండల్ని అమ్మి 4 రూపాయలు తీసుకుంటే, ఆ డబ్బులో నించి, ఒక పావలానో, అర్ధనో, ఖర్చు పెట్టకుండా దాచడం సాధ్యమే. కొన్ని వస్తువుల్ని అమ్మి కొంత డబ్బుని తీసుకుంటే, కొంత విలువని చేతితో పట్టుకున్నట్టు అర్థం. ఆ డబ్బులో నించి కొంత భాగాన్ని దాస్తే, కొంత విలువని దాచినట్టు అర్థం. ఇది బార్టరు విధానంలో సాధ్యం కాదు. డబ్బు విధానంలో సాధ్యమే.

డబ్బు విధానంలో, అమ్మడాలూ కొనడాలూ విడిపోతాయి. అవి, కలిసి జరగవు. విడి విడిగా జరుగుతాయి. అమ్మకం జరిగిన తర్వాత, ఆ డబ్బునంతా దాచ వచ్చు. లేదా కొంత డబ్బుని దాచవచ్చు. ఇది సాధ్యం అవుతుంది కాబట్టి, డబ్బుని కూడబెట్టే లక్షణం ఒకటి సమాజంలో కొత్తగా పుట్టుకొస్తుంది. కొందరు కొంత డబ్బుని కూడబెట్టవచ్చు; కొందరు అసలే కూడబెట్టక పోవచ్చు.

అమ్మడాలూ, కొనడాలూ విడిపోయే పరిస్తితి, వాటి మధ్య సమన్వయం చెడిపోయే సమస్యకి దారితీస్తుంది. దీన్ని "సంక్షోభాలు" పాఠంలో మళ్ళీ చూస్తాం.

'డబ్బు అంటే ఏమిటి?' అనే ప్రశ్న మొట్ట మొదట వేసుకుని, దాన్ని చూడడం ప్రారంభించిన తర్వాత, దాన్ని ఇప్పటికి పూర్తి చేశాం. డబ్బు అంటే, సమస్త సరుకులకూ ఏకైక విలువ రూపం!

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. బంగారం రూపాయి బిళ్ళకు బదులు, కాయితం నోటు, చలామణీ లోకి వచ్చింది. ఇప్పుడు 'డబ్బు' అనేది, బంగారమా, కాయితమా?

**జ :** ఇప్పుడు కూడా 'డబ్బు' అనేది - బంగారమే. కాయితం కాదు. అయితే, బంగారం బిళ్ళలే చలామణీలో తిరిగితే అరిగిపోతాయి కాబట్టి, ఆ తిరిగే పని, బంగారం బిళ్ళకి బదులు కాయితం ముక్క చేస్తోంది, అంతే. ఆ తిరిగే పని కోసం, →

కాయితం నోటు పోయి, ఇంకో పద్ధతి ఏదైనా వచ్చినా, అప్పుడు కూడా డబ్బుగా వుండేది బంగారమే. బంగారం విలువని బట్టే, డబ్బు లెక్కలు వుంటాయి.

**2**. బంగారం డబ్బుకి స్వంత విలువ వుంటుంది. కాయితం డబ్బుకి స్వంత విలువ వుండదు. అయినా కాయితం డబ్బు, ఎలా పని చెయ్యగలుగుతోంది?

**జ** : బంగారం డబ్బుకి వుండే విలువతోనే కాయితం డబ్బు తిరుగుతుంది. కుండని అమ్మితే, 1 కాయితం రూపాయి వచ్చిందంటే, ఆ విలువ, ఆ కాయితం ముక్కది కాదు ; బంగారం బిళ్ళది. కుండని అమ్మిన మనిషి చేతిలోకి కాయితం ముక్కే వచ్చినా, అది, బంగారం బిళ్ళే వచ్చినట్టు అర్థం.

**3**. 'ప్రపంచ ధనం' అంటే?

**జ** : ప్రపంచానికంతటికీ వర్తించే ధనం. అన్ని దేశాలకూ డబ్బుగా వుండే వస్తువే 'ప్రపంచ ధనం'. అది బంగారమే. ఒక దేశం, ఇంకో దేశం నించి కొన్ని సరుకుల్ని కొంటుంది ; తన సరుకుల్ని ఆ దేశానికి అమ్ముతుంది. అప్పుడు 2 దేశాలూ లెక్కలు చూసుకుంటాయి. రావలసిన డబ్బుకీ, పోవలసిన డబ్బుకీ లెక్కలు సరిపోతే, ఎవరూ ఎవరికీ ఏమీ ఇవ్వనక్కరలేదు. కానీ, ఒక దేశం, రెండో దేశానికి కొంత డబ్బు ఇవ్వాలని తేలితే, తన కాయితం నోట్లు ఇస్తే కుదరదు. ఎంత ఇవ్వాలో ఆ విలువకి తగ్గట్టు బంగారం ముద్దే ఇవ్వాలి. బంగారం నాణాలు ఇచ్చినా అవి అక్కడ పనికిరావు. వాటిని, ఆ దేశం వాళ్ళు ముద్ద చేసేసుకుంటారు. అన్ని దేశాల్లోనూ అసలైన డబ్బు, బంగారమే. అందుకే అది 'ప్రపంచ ధనం'.

**4**. ఇప్పుడు అన్ని దేశాల్లోనూ కాయితం డబ్బు ఉందా? కొన్ని దేశాల్లో బంగారం బిళ్ళలే చలామణీలో నడుస్తున్నాయా?

**జ** : ఇప్పుడు బంగారం బిళ్ళల పద్ధతి ఎక్కడా లేదు. అన్ని దేశాల్లోనూ కాయితం డబ్బే వుంది. కానీ, ఏ దేశంలో కాయితం డబ్బు, ఆ దేశంలో మాత్రమే చలామణీలో తిరుగుతుంది. ఒక దేశపు కాయితం డబ్బు, ఇతర దేశాల్లో చలామణీలోకి పనికిరాదు.

**5**. కుండ = 1 రూపాయి బంగారు నాణం. అయితే, 1 రూపాయి నాణానికి బదులుగా, 4 కాయితం రూపాయలు చలామణీలో తిరుగుతున్నాయి అనుకుందాం. కుండని అమ్మితే, ఎన్ని కాయితం రూపాయలు రావాలి? ఎందుకు?

**జ** : 1 బంగారం రూపాయికి బదులుగా 4 కాయితం రూపాయలు వున్నాయి కాబట్టి, 1 నాణం విలువ, 4 కాయితం రూపాయల్లో వుంటుంది. కాబట్టి, కుండకి బదులుగా, 4 కాయితం రూపాయలు రావాలి.

**6**. ప్రతీ దేశం లోనూ, బ్యాంకుల్లో వుండే టన్నుల టన్నుల బంగారం చివరికి ఏమవుతుంది?

**జ** : సమాజంలో మారకాల విధానం అనేది వుంటూనే వుంటే, బంగారం రాసులు అలా వుండవలసిందే. కాయితం డబ్బుకి గానీ, ఇంకో రకం డబ్బుకి గానీ, అసలు మూలం - ఆ బంగారమే. దానికి 'చివర' అనేది వుండదు. మారకాల విధానం పోతే, ఆ బంగారాన్ని బైటికి తీసి, దానితో గోడలు కట్టుకోవచ్చు. **H**

# 29. శ్రమలు చెయ్యడం ఎందుకు?

ప్రకృతిలో వుండే ప్రాణులు, మనుషులు మాత్రమే కాదు. ' చీమ' అంత చిన్న ప్రాణి నించీ, ' ఏనుగు' అంత పెద్ద ప్రాణి వరకూ, అనేక రకాల క్రిమి కీటకాలూ, పక్షులూ, జంతువులూ, వున్నాయి. భూమి మీదే జీవించేవి కొన్నీ, నీటిలోనే జీవించేవి కొన్నీ, రెండు చోట్లా జీవించేవి కొన్నీ. ఎక్కడ జీవించడానికైనా ప్రతి ప్రాణికీ ఆహారం కావాలి.

కానీ, మనుషులు తప్ప మిగతా ప్రాణులేవీ ఆహారం కోసం శ్రమలు చేసుకోవు. వాటికి శ్రమలు చెయ్యడం తెలియదు. అవి ప్రకృతిలో దొరికే గడ్డీ గాదం, ఆకులూ అలములూ వంటి వాటినే తింటూ బతుకుతాయి. కొన్ని రకాల పెద్ద ప్రాణులు, చిన్న ప్రాణుల్ని తింటూ బతుకుతాయి.

పక్షుల లాంటివి చెట్ల మీద గూళ్ళు కట్టుకున్నా, కోతుల్లాంటివి భూమిలో దుంపలు పైకి లాక్కున్నా, అలాంటి చేష్టలు ' శ్రమలు చెయ్యడం' అవదు. ప్రతీ ప్రాణి లోనూ కొన్ని ' సహజ ప్రేరణలు' వుంటాయి. ఆ ప్రేరణలు ఎప్పుడూ మారవు. పక్షులు కట్టే గూళ్ళు గానీ, జంతువుల ప్రవర్తనలు గానీ, ఎప్పుడూ ఒకే రకంగా వుంటాయి.

కానీ, మనుషుల సంగతి వేరు. మనుషుల శరీర నిర్మాణం వేరు. ఆలోచించడం, మాట్లాడడం, మనుషుల ప్రత్యేకతలు. అయినా మనుషులకు కూడా ప్రారంభంలో, ఏ శ్రమలూ చెయ్యడం తెలియదు. మనుషులు కూడా జంతువుల లాగానే ప్రకృతిలో ఏది దొరికితే అదే తింటూ, నగ్నంగా తిరిగారు. క్రమ క్రమంగా, మట్టితో చిప్పలు చెయ్యడం, రాళ్ళని అరగదీసి పనిముట్లు చేసుకోవడం - వంటి పనులతో మొదలుపెట్టి, ఆహారం పండించుకోవడం, బట్టలు నేసుకోవడం, ఇళ్ళు కట్టుకోవడం - వంటి పనుల దాకా, ఈ నాడు మనకు తెలిసిన పనుల దాకా నేర్చుకున్నారు. ఇంకా నేర్చుకుంటారు. జంతువులైతే ఎప్పుడూ ఒకటే. శ్రమలు చెయ్యడం మనుషులకే ప్రత్యేక లక్షణం.

ఏ పని జరగాలన్నా, ఏ వస్తువు కావాలన్నా, ప్రకృతిలో దొరికే సహజ పదార్థాల్ని ఉపయోగించుకుంటూ చేసుకోవలిసిందే. మొదట ముడి పదార్థాల్నీ, పనిముట్లనీ, తయారుచేసుకోవాలి. తర్వాత, వాటిని ఉపయోగించుకుంటూ వేరే వస్తువులు తయారుచేసుకోవాలి. ఈ పనులు చేసుకోవడంలో ఎద్దులూ, గుర్రాలూ, ఒంటెలూ వంటి జంతువులు కూడా ఉపయోగపడతాయి. కానీ <u>జంతువులన్నీ - పనిముట్లే. పనులు చేసేది జంతువులు కాదు, మనుషులే.</u>

ఒక సారి తయారుచేసుకున్న వస్తువులు అలాగే వుండిపోవు. ఖర్చయిపోతూ వుంటాయి. ఆహార పదార్థాలన్నీ ఏ రోజుకారోజే ఖర్చయిపోతాయి. బట్టలు, కొన్ని నెలల్లో ఖర్చయిపోతాయి. ఇళ్ళు చాలా సంవత్సరాలపాటు వుంటాయి. మను

షులు, రోజూ కొన్ని వస్తువుల్ని వాడుకుంటూ, అదే కాలంలో, అదే రకపు కొత్త వస్తువులు తయారుచేసుకుంటూ వుంటారు. కిందటి సంవత్సరపు ధాన్యం పంట వాడకం అయిపోతూ వుంటే, అదే కాలంలో, కొత్త ధాన్యం పండించే పనులు జరుగుతూ వుంటాయి. బట్టలూ, చెప్పులూ, మందులూ, ప్రతీ వస్తువూ అలాగే. బస్సులూ, రైళ్ళూ, వెనకటివి పాతబడిపోతూ వుంటే, కొత్తవి తయారవుతూ వుంటాయి. అన్నీ అలాగే. ఒక వేపు - రోజూ ఖర్చయిపోతూ వున్న వస్తువులే, ఇంకో వేపు - రోజూ తయారవుతూ వుంటాయి. మొత్తం మీద మనుషులు, రోజూ రక రకాల శ్రమలు చేసుకుంటూనే వుండాలి.

ఒకవేళ, మనుషులు ఏ శ్రమలూ చెయ్యకుండా, ఒక రోజు నించీ హఠాత్తుగా శ్రమలన్నీ మానేస్తారనుకుందాం. అప్పుడేం జరుగుతుంది? - ఊహించండి! మనుషులందరూ హఠాత్తుగా పనులు మానెయ్యడం అంటే, పొలాల్లో పనులూ, ఇతర పనులూ మానెయ్యాలి. వంటలు మానెయ్యాలి. బట్టలు ఉతుక్కోవడం, ఇళ్ళు శుభ్రం చేసుకోవడం, నీళ్ళు తెచ్చుకోవడం, అన్నీ మానెయ్యాలి. ఇళ్ళల్లో సిద్ధంగా పళ్ళూ రొట్టెలూ లాంటివి వుంటే తింటారు. సిద్ధంగా వున్న నీళ్ళు తాగుతారు. 2, 3 రోజులు అయ్యేటప్పటికి అన్నీ అయిపోతాయి. తర్వాత పిల్లలకు తిండి వుండదు. తాగే నీళ్ళు వుండవు. వెంటనే జబ్బులు మొదలవుతాయి. కానీ, వైద్యం చెయ్యడం ఆగిపోతుంది కాబట్టి, ఏ మందూ వుండదు. 2 రోజుల్లోనే, మొదట పిల్లలు చచ్చిపోవడం మొదలవుతుంది.

[ పిల్లలకు ప్రమాదం జరిగే దాకా పెద్ద వాళ్ళు శ్రమలు మానేసి కూర్చోరు. అలా ఎప్పుడూ జరగదు. కానీ, శ్రమలు చెయ్యడం ఆగిపోతే ఏం జరుగుతుందో చూడడానికే ఇది. నిత్యం శ్రమలు ఎంత అవసరమో తెలుస్తుంది దీని వల్ల. ]

తర్వాత, అప్పటికే జబ్బులతో వున్న వాళ్ళు చచ్చిపోతారు. మంచి నీళ్ళు కూడా లేక, 3 రోజుల్లోనే చాలా జనం చచ్చిపోతారు. ఎక్కడ చచ్చిపోయిన వాళ్ళు అక్కడే పడి వుంటారు. వాళ్ళని పూడ్చిపెట్టడాలూ, దహన క్రియలూ లాంటి పనులేవీ జరగవు. జంతువులకు తిండీ నీళ్ళూ ఆగిపోతాయి కాబట్టి, అవీ పడిపోతాయి. జంతువులూ, పిల్లలూ, పెద్దలూ అందరూ, ఇళ్ళల్లోనూ, వాకిళ్ళల్లోనూ, రోడ్ల మీదా, చచ్చిపోయి పడి వుంటారు.

ఆ ఘోరాన్ని భరించలేక, ఎలాగైనా బతకాలనుకునే వాళ్ళు, అడవుల్లోకి పరిగెత్తుతారు. బళ్ళు ఎక్కి వెళ్ళడం కాదు. బళ్ళు తోలడం వుండదు. ఈసురోమంటూ నడకతో అడవుల్లోకి చేరగలిగితే, అక్కడ చెట్ల మీద ఏమన్నా దొరికితే తింటారు. గుంటల్లో నీళ్ళు దొరికితే తాగుతారు. అలా, ఆకలితో మాడుతూ, చెట్ల కింద తిరుగుతూ, కొన్నాళ్ళు గడుపుతారు. బట్టలన్నీ పీలికలైపోయి, ఆఖరికి నగ్నంగా మిగులుతారు. బట్టలు పోయిన క్షణం నించీ ఇక వాళ్ళు, జంతువులే. మానవ జంతువులు. జంతువులైతే అడవుల్లో హాయిగానే బతుకుతాయి. మానవ జంతువులు, అడవుల్లో ఎన్నో రోజులు బతకలేరు.

అంటే, మనుష లందరూ శ్రమలన్నీ మానెయ్యడం జరిగితే, ఊళ్ళల్లో జనం ఒక

వారం లోనూ; అడవుల్లోకి పోయినా, అక్కడ కూడా శ్రమ చెయ్యని జనం ఒక్క నెల్లాళ్ళ లోనూ, చచ్చి వూరుకుంటారు. మొత్తం మానవ సమాజమే అంతర్ధానమై పోతుంది - శ్రమే ఆగిపోతే!

మనుషులు రోజూ బతకాలంటే, శ్రమలు ఎంత అవసరమో అర్థమైందా? శ్రమలు మానెయ్యడం, ఏ నాటికీ సాధ్యం కాదు. కాకపోతే, ఎక్కువ కష్టంతో చెయ్యవలసిన శ్రమని, కొంత తేలిగ్గా చెయ్యగలిగే విధంగా కొత్త మార్పులు నేర్చుకోవచ్చు. తేలిగ్గా చేసినా, శ్రమ అనేది శ్రమే. శ్రమలే చెయ్యకుండా మనుషులు జీవించడం మాత్రం, ఏ నాటికీ సాధ్యం కాదు.

## ప్రశ్నలూ - జవాబులూ

**1**. మనుషులందరూ అన్ని పనులూ మానేసి, కబుర్లు చెప్పుకుంటూ కూర్చోకూడదూ?

**జ**: కూర్చోవచ్చు గానీ, కబుర్లు దేన్ని గురించి చెప్పుకోవాలి? పత్రికల గురించా? - అవి ఉండవు. చదువుల గురించా? - అవి ఉండవు. సినిమాల గురించా? - అవి ఉండవు. రాజకీయాల గురించా? - అవి ఉండవు. పనులే లేనప్పుడు, మాటలన్నీ హరించి పోతాయి. అసలు, మాటలు ఎలా పుట్టుకొచ్చాయో తెలుసా? ఆటవిక మానవులు, చిన్న చిన్న పనులు చెయ్యడం మొదలుపెట్టడం వల్లే, ఆ అవసరాల కోసమే క్రమంగా మాటలు ఏర్పడ్డాయి. ఆ పనులే ఆగిపోతే, ఇక మాటలతో అవసరం ఉండదు. భాషే అంతర్ధానమై పోతుంది.

**2**. ఈ నాడు మనకు అనేక పనులు తెలుసు. ఇంకా తర్వాత కాలంలో ఎన్ని పనులు పుట్టుకొస్తాయి?

**జ**: ఇప్పుడు తెలిసిన పనులన్నీ గతంలో తెలియనివే కదా? అలాగే, ప్రకృతికి సంబంధించిన కొత్త విషయాలు తెలుస్తూ వుంటే, కొత్త వస్తువుల్ని చేసుకునే కొత్త పనులు పుట్టుకు రావచ్చు.

**3**. తిండీ, బట్టా, ఇల్లూ, మందులూ, రవాణాలూ ఉంటే చాలదా? అనేక వస్తువులు ఎందుకు?

**జ**: తప్పనిసరిగా కావలసినవి కొన్నే ఉంటాయి. అనేక డజన్ల రకాల వస్తువులు అనవసరం.

**4**. పక్షులు గూళ్ళు కట్టుకుంటాయి. జంతువులు కూడా కొన్ని నివాసాలు వెతుక్కుంటాయి. అవన్నీ 'శ్రమలు' కావా?

**జ**: కావు. 'శ్రమ' అనే మాటా, ఆ అర్థమూ, మనుషుల విషయంలో తప్ప, పక్షులకూ, జంతువులకూ వర్తించవు.

**5**. శ్రమలన్నీ ఆగిపోతే ఏమవుతుంది?

**జ**:



★

# 30. శ్రమల్లో తేడాలు

శ్రమల్లో - 'శారీరక శ్రమలూ, మేధా శ్రమలూ' అనే తేడాలు వుంటాయి. ఆ శ్రమల్లోనే మళ్ళీ, 'నైపుణ్యం గల శ్రమలూ, నైపుణ్యం లేని శ్రమలూ' అనే తేడాలు కూడా వుంటాయి.

'శారీరక శ్రమ' అంటే, ఆలోచించే అవసరం తక్కువగా వుంటుంది. 'మేధా శ్రమ' అంటే, ఆ అవసరం ఎక్కువగా వుంటుంది.

గడ్డి కొయ్యడం, పొలం దున్నడం, రోడ్లు వూడ్చడం, గిన్నెలు కడగడం, బట్టలు వుతకడం వంటి శ్రమలు, శారీరక శ్రమలు. అందులోనే, అవి - నైపుణ్యం లేని శ్రమలు. వీటిని నేర్చుకోవడానికి కొన్ని రోజుల కన్నా ఎక్కువ కాలం పట్టదు. అంతేగాక, ఈ పనులు నేర్చుకోవడానికి, ఎక్కువ వస్తువులు ఖర్చయ్యేది కూడా వుండదు.

కుట్టు పనీ, వడ్రంగం పనీ, వంట పనీ, బట్టలు నేసే పనీ, బస్సులూ - రైళ్ళూ నడిపే పనీ - లాంటివి కూడా శారీరక శ్రమలే. కానీ, అందులోనే ఇవి - నైపుణ్యం గల శ్రమలు. వీటిని నేర్చుకోవడానికి కొన్ని రోజులూ, కొన్ని వారాలూ మాత్రమే సరిపోవు. ఇంకా ఎక్కువ కాలం కావాలి. వీటిని నేర్చుకోవడానికి చాలా వస్తువులు ఖర్చవుతాయి.

చదువు చెప్పడం, వైద్యం చెయ్యడం, సైన్సు పరిశోధనలు చెయ్యడం - లాంటి పనులు, మేధా శ్రమలు. వీటిలో ఏ శ్రమని చూసినా, అందులోనే నైపుణ్యం లేనివీ, ఉన్నవీ కూడా వుంటాయి. 'చదువు చెప్పడం' లోనే, తక్కువ తరగతుల్లో చెప్పడం, ఎక్కువ తరగతుల్లో చెప్పడం - అలా తేడాలు వుంటాయి. వైద్యం చెయ్యడంలోనూ, సైన్సు పరిశోధనల్లోనూ కూడా అలాగే.

ఏ మేధా శ్రమ నేర్చుకోవడానికైనా, ఎక్కువ కాలమూ, ఎక్కువ వస్తువుల ఖర్చూ, అవసరమవుతాయి. ఆ శ్రమల్లోనే, నైపుణ్యం గల శ్రమని నేర్చుకోవడానికైతే, ఇంకా ఎక్కువ కాలమూ, ఎక్కువ ఖర్చూ అవసరం. - ఈ రకంగా, శ్రమల్లో అనేక రకాలు వుంటాయి.

'శ్రమ' అనేది ఎలాంటి శ్రమ అయినా, అది శ్రమే. ఏ శ్రమ చేసేటప్పుడైనా, శరీరం అంతా కష్టపడుతుంది. కొన్ని గంటల సేపు శ్రమ చేసేటప్పటికి, ఆ మనుషులు అలిసిపోతారు. మేధా శ్రమలు చేసేటప్పటి కన్నా, శారీరక శ్రమలు చేసేటప్పుడు, మరీ తొందరగా అలిసిపోతారు. అలిసిపోయినప్పుడు, శ్రమ చెయ్యడం ఆపేసి కొంత సేపు విశ్రాంతిగా గడపాలి. ఆ తర్వాత మళ్ళీ శ్రమ చెయ్యడానికి శరీరానికి శక్తి కలుగుతుంది.

శ్రమల్లో తేడాలు వుంటాయి కాబట్టి, శ్రమల విలువలు కూడా తేడాలుగా, ఎక్కువ - తక్కువలుగా వుంటాయి. 1 గంట సేపు గడ్డి కోసినందుకు ఆ శ్రమకు వుండే విలువ కన్నా, 1 గంట సేపు చదువు చెప్పినందుకు ఆ శ్రమకు వుండే విలువ కొంత ఎక్కువగా వుంటుంది. రెండూ, 'గంట సేపు' జరిగిన శ్రమలే. అయినా,

వాటి విలువలు తేడాగా వుంటాయి. ఎందుకంటే, ఆ శ్రమలు నేర్చుకోవడానికి అవసరమయ్యే కాలాలూ, అవసరమయ్యే వస్తువుల ఖర్చులూ, తేడాగా వుంటాయి కాబట్టి. గడ్డి కోసే శ్రమకు తక్కువ విలువా, చదువు చెప్పే శ్రమకు ఎక్కువ విలువా వుండడం, 'విలువ సూత్రం' ప్రకారం సరైనదే. కానీ, ఆ 'తేడా' ఎంత వుండాలో ఆ సూత్రం చెప్పదు. ఆ 2 శ్రమలూ ఏ పరిస్థితుల్లో జరుగుతాయో ఆ సమాజాన్ని బట్టి, ఆ తేడా వుంటుంది.

1 గంట శారీరక శ్రమనీ, 1 గంట మేధా శ్రమనీ తీసుకుంటే, రెండూ గంట - గంట శ్రమలే అయినా, వాటి విలువలు తేడాగా వుండడం ఆశ్చర్యం కలిగిస్తుంది. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలంటే : బెల్లం, దూదీ, ఇనుమూ -ఈ 3 వస్తువుల్నీ కిలో - కిలో బరువులతో తీసుకుందాం. 3 వస్తువులూ, ఒకే బరువు గలవి. కానీ, వాటి సైజులు ఎలా వుంటాయి? కిలో బరువు గల దూది, ఒక పెద్ద గంపెడు వుంటుంది. బెల్లం అయితే, ఆ గంపలో ఒక పక్కకే వుంటుంది. ఇనుము అయితే, ఆ గంపలో మట్టులోకి కూడా రాదు. ఆ 3 వస్తువులకూ బరువులు ఒకటే. కానీ వాటి పరిమాణాలు (సైజులు) చాలా తేడాగా వుంటాయి. ఇనుములో అణువులు, దగ్గిరికి నొక్కుకు పోయి వుంటాయి. బెల్లంలో అణువులు కొంచెం దూరంగా వుంటాయి. దూదిలో అణువులైతే, చెప్పక్కర్లేదు, చాలా దూర దూరంగా వుంటాయి. - శ్రమల విలువల్లో తేడాల్ని ఇలాగే అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి. 10 వేరు వేరు శ్రమల్ని, అన్నిటినీ గంట గంట చొప్పున తీసుకుంటే, వాటి విలువలు ఎక్కువ తక్కువలుగా వుంటాయి. ఆ 10 శ్రమల్లో, 2, 3 శ్రమల విలువలు ఒకే రకంగా వుండవచ్చు. వడ్రంగం శ్రమకీ, కుట్టు శ్రమకీ, విలువ ఒకే రకంగా వుండవచ్చు. కానీ, అన్ని శ్రమల విలువలూ ఒకే రకంగా వుండవు.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. అప్పటి వరకూ సహజంగా వున్న భూమి మీద దున్నే పని జరిగింది. ఆ భూమికి విలువ వుంటుందా?

**జ :** ఉంటుంది. కానీ, ఆ విలువ, దున్నే శ్రమ జరగడం వల్ల ఏర్పడినదే. ఆ విలువ, ఆ శ్రమదే; భూమిది కాదు. ఆ భూమి మీద ఏదైనా పంట పండితే, ఆ పంట విలువ లోకి, ఆ దున్నిన శ్రమ విలువ కూడా చేరుతుంది. భూమి నించి చేరే విలువ ఏమీ వుండదు.

**2**. ఒక మనిషి ఎప్పుడూ గడ్డి కోసే పని చేస్తాడు. ఇంకో మనిషి ఎప్పుడూ చదువు చెప్పే పని చేస్తాడు. ఏది శారీరక శ్రమ? ఏది మేధా శ్రమ?

**జ :** గడ్డి కొయ్యడం - శారీరక శ్రమ. చదువు చెప్పడం - మేధా శ్రమ.

**3**. గడ్డి కోసే మనిషి, చదువు చెప్పగలడా? చదువు చెప్పే మనిషి గడ్డి కొయ్యగలడా?

**జ :** నేర్చుకుంటే అన్నీ చెయ్యగలరు. మేధా శ్రమ చేసే మనిషి, శారీరక శ్రమని నేర్చుకోవడం చాలా తొందరగా జరుగుతుంది. శారీరక శ్రమ మనిషి, మేధా శ్రమని నేర్చుకోవడానికి ఎక్కువ కాలం పడుతుంది. చిన్న తనం నించీ కొన్ని వేరు వేరు ⟶

శ్రమలు నేర్పితే, ఒక పని చేసే వాళ్ళకి, ఇంకో పని నేర్చుకోవడం చాలా తేలిక అవుతుంది.

**4**. 'విలువ సూత్రం' అంటే ఏమిటి?

**జ**: 'విలువ' కి సంబంధించిన నియమాల్ని చెప్పే సూత్రం. సమాన విలువల మధ్యనే మారకం జరుగుతుంది - అనేది ఒక నియమం. శారీరక శ్రమకి వుండే విలువ కన్నా, మేధా శ్రమకి వుండే విలువ ఎక్కువగా వుంటుంది - అనేది ఇంకో నియమం. 'విలువ' కి సంబంధించిన నియమాలన్నీ 'విలువ సూత్రం' లో భాగాలే.

**5**. శారీరక శ్రమ విలువ కన్నా, మేధా శ్రమ విలువ ఎంత ఎక్కువగా వుంటుంది. రెట్టింపుగానా, 4 రెట్లా, 10 రెట్లా?


**జ**: శారీరక శ్రమ విలువ కన్నా మేధా శ్రమ విలువ ఎక్కువగా వుంటుంది - అన్నంత వరకే విలువ సూత్రం చెపుతుంది. ఆ తేడా ఎంత ఎక్కువగా వుండాలో ఆ సూత్రం చెప్పదు. ఆ తేడా చాలా ఎక్కువగా వుంటే, దాని వల్ల శారీరక శ్రమలకు చాలా అన్యాయం జరుగుతుంది. ఆ తేడా ఎంత వుంటుందీ - అనేది, ఆ సమాజంలో వున్న శ్రమ సంబంధాల స్వభావాన్ని బట్టి వుంటుంది. ఈ శ్రమ సంబంధాల్ని మనం ఇంకా చూడలేదు.

**6**. శారీరక శ్రమ విలువకీ, మేధా శ్రమ విలువకీ తేడా వుండడం, అవసరమా? అది సరైనదేనా? అన్ని శ్రమలకూ ఒకే విలువ వుండకూడదా?

**జ**: అన్ని శ్రమలకూ ఒకే విలువ వుంటే, ఎక్కువ ఖర్చు తోటీ, ఎక్కువ కాలం తోటీ నేర్చుకోవలసిన శ్రమల్ని, ఎవరూ చెయ్యరు ; చెయ్యలేరు. అందరూ తేలికైన, తమకు ఇష్టమైన శ్రమలనే ఎంచుకుంటారు. అప్పుడు, సమాజంలో, కొన్ని శ్రమలు, లేకుండా పోతాయి ; అవసరాలే తీరకుండా పోతాయి. దీని కోసం ఎన్నో వివరాలు అర్థం చేసుకోవాలి. అది ఇక్కడ సాధ్యం కాదు.

**7**. శారీరక శ్రమలు కొన్నీ, మేధా శ్రమలు కొన్నీ చూపించండి!

**జ** :










# 31. ' విలువ' అంటే శ్రమ. ' శ్రమ' అంటే విలువ కాదు

ఒక వస్తువుని అమ్మకానికి పెట్టి నప్పుడు, దాని ' విలువ' గా లెక్కకు వచ్చేది ఏమిటి? - ఆ వస్తువు తయారవడానికి అవసరమైన మొత్తం శ్రమే. అంటే, ' విలువ' గా అయ్యేది - శ్రమే.

అయితే, ' శ్రమ' అనేది, తప్పకుండా విలువేనా? - కాదు. ఆ వస్తువు, అమ్మకానికి వెళ్ళకపోతే, ఆ శ్రమ, విలువ కాదు. ఇంట్లో అన్నమూ కూరలూ వండుకున్నాం. అవి, వంట శ్రమతో తయారయ్యాయి. ఆ పదార్థాల కోసం శ్రమ జరిగింది కాబట్టి, ఆ శ్రమ, విలువేనా? అది విలువే అయితే, దానికి డబ్బు చెల్లించాకే ఆ పదార్థాల్ని తినాలి. కానీ, అలా జరగదు. ఆ వంటల కోసం శ్రమ జరిగినా, ఆ శ్రమ, విలువ కాదు.

ఆ వంట శ్రమే, భోజనాల హోటల్లో జరిగితే, ఆ శ్రమ, అక్కడ విలువ అవుతుంది - ఆ భోజన పదార్థాల్ని అక్కడ అమ్మకానికి పెడతారు కాబట్టి.

విలువగా అయ్యేది - శ్రమే. కానీ, ' శ్రమ' అనగానే అది విలువ కాదు. దీన్ని అర్థం చేసుకుంటే, ఇది, సహజత్వానికీ, అసహజత్వానికీ వుండే తేడాని చూపిస్తుంది.

శ్రమ, విలువగా మారడం, ప్రకృతి సహజంగా జరిగే రసాయనిక చర్య కాదు.

బియ్యాన్ని ఉడకబెడితే, అది అన్నంగా మారుతుంది. పిండిలో నీళ్ళు కలిపితే, అది ముద్దగా మారుతుంది. పాలలో మజ్జిగ చుక్క వేస్తే, అది పెరుగుగా గట్టిపడుతుంది. - ఇవన్నీ పదార్థాల ధర్మాలు. శ్రమ, విలువగా మారడం, ఆ రకం మార్పుల లాంటిది కాదు.

శ్రమ - అంటే, ' పని' కాబట్టి, అది పదార్థం కాదు. విలువ - అనేది కూడా పదార్థం కాదు. అది, ఒక లెక్క. టైము లెక్క. శ్రమ, విలువగా మారే లెక్క ఎలా వుంటుందో, వేరే పాఠంలో చూస్తాం.

' విలువ అంటే శ్రమే' అని అర్థం చేసుకోవడం సరైనదే ; కానీ, ' శ్రమ అంటే విలువ' అని అర్థం చేసుకుంటే, అది తప్పు. శ్రమని విలువగా అర్థం చేసుకుంటే, ఏ వస్తువుకి అయినా విలువ వుండాలి. ప్రతీ వస్తువూ శ్రమతోనే తయారవుతుంది కాబట్టి, ఆ శ్రమ తప్పనిసరిగా విలువగా ఉంటుందనీ, అలా ఉండాలనీ, అర్థం చేసుకున్నట్టు అవుతుంది.

రామయ్య శ్రమతో కుండ తయారైంది. ' శ్రమ అంటే విలువే ' అనే వాదం ప్రకారం, రామయ్య శ్రమ, విలువగా మారి తీరాలి. అంటే రామయ్య, ఆ కుండని మారకం చేసి ఇంకో వస్తువుని సంపాదిస్తే, అదే, కుండ విలువ అవుతుంది. రామయ్య, ఆ కుండ విలువనే వాడుకోవాలి గానీ, కుండని వాడకూడదు. ఒక వేళ, కుండతోనే అవసరం ఉంటే? కుండని చెయ్యకూడదు. ఇంకేదైనా వస్తువుని చేసి, దాన్ని ఇచ్చి కుండని సంపాదించుకోవాలి. - ' శ్రమ

అంటే విలువే' అనుకుంటే, ఇలాంటి పిచ్చి అర్థాలన్నీ వస్తాయి.

"పనిముట్లు కూడా పని చేస్తాయి" అనే వాదం లాంటిదే, ఈ "శ్రమ అంటే విలువే" అనే వాదం! అందుకే, ఈ వాదంతో కొట్టుకుపోయే వాళ్ళకి, మారకాలూ - అమ్మకాలూ - విలువ లెక్కలూ వంటి విషయాల్లో వుండే అసహజత్వాలు కనపడవు.

శ్రమ అనేది, దానికి మారకం జరిగినప్పుడే విలువగా మారుతుంది. ('మారడం' అంటే, లెక్కకు రావడం.) అంతే గానీ, శ్రమ, విలువగా మారాలని రూలేమీ లేదు. శ్రమ సహజంగానే విలువ కాదు.

# ప్రశ్నలూ - జవాబులూ


**1**. ఒక వస్తువు తయారైంది. ఆ శ్రమ, విలువేనా?

**జ**: మళ్ళీ మొదటికొస్తే ఎలాగ? ఆ వస్తువుకి మారకం జరిగిందా? మారకం జరిగితేనే, ఆ శ్రమకి, విలువ లెక్క.

**2**. చొక్కా తయారైంది. దానికి మారకం జరగలేదు. అయినా, దాని కోసం మొత్తం ఎంత శ్రమ అవసరమైందో లెక్క కట్టకూడదా?

**జ**: 'మొత్తం శ్రమ' లెక్క ఎందుకు? చొక్కా కోసం ఏమేమి కావాలి? (1) ఫలానా అంత బట్టా, కొంత దారం, కొన్ని గుండీలూ. (2) ఫలానా పనిముట్లూ. (3) కొన్ని గంటల కుట్టు శ్రమా. - వివరాలు ఈ రకంగా కావాలి గానీ, అన్నిటినీ కలిపి, 'మొత్తం శ్రమ' అనే లెక్కలు ఎందుకు? - మారకాల కోసం అయితేనే, 'మొత్తం శ్రమ' లెక్క కావాలి.

**3**.



తవ్వకం శ్రమ, విలువేనా?

**జ**: ఈ శ్రమ, స్వంతానికే జరిగిందో, మారకానికి జరిగిందో తెలీదు.

**4**. నా వంట నేనే చేసుకుంటాను. నా బట్టలు నేనే ఉతుక్కుంటాను. అవి, 'శ్రమలు' అవుతాయా?

**జ**: శ్రమలే. కానీ, ఆ వంటల్ని తినే పనీ, ఆ ఉతికిన బట్టల్ని ఒంటి మీద ధరించే పనీ, శ్రమలు అవవు.

**5**.




ఇది శ్రమేనా?

**జ**: కాదు.

**6**. స్నేహితులందరూ కొండలెక్కి, అక్కడ చాలా సేపు తిరిగి, కబుర్లు చెప్పుకుని, అలిసిపోయి. ఇళ్ళకొచ్చారు. అదంతా శ్రమేనా?

**జ**: కాదు. వాళ్ళు చాలా అలిసిపోయే వుండవచ్చు. కానీ, అది 'శ్రమ చెయ్యడం' అవదు.

**7**.



ఇది శ్రమేనా?

**జ**: కాదు.

**8**. ఏది శ్రమో, ఏది కాదో, ఎలా నిర్ణయించాలి?

**జ**: వస్తువుల్ని తయారుచేసే పనులూ, అవసరాల్ని తీర్చే పనులూ, శ్రమలు అవుతాయి. స్వంత శరీరం కోసం చేసుకునే పనులు (తిండీ, స్నానం లాంటివి) శ్రమలు కావు. శరీరంతో జరిగే సహజ చర్యలు (మల, మూత్ర విసర్జన లాంటివి) శ్రమలు కావు.

★

# 32. శ్రమ, 'విలువ'గా మారడం, ఎలా జరుగుతుంది?






కొత్త చొక్కాని చూద్దాం. అది ఏ శ్రమతో తయారవుతుంది? - దాని ముడి పదార్థాల మీద జరిగే శ్రమనే చెప్పుకోవాలి. చొక్కాకి ముడి పదార్థం ఏది? - బట్ట. బట్ట మీద జరిగిన శ్రమ ఏది? - కుట్టు. కాబట్టి, చొక్కా, కుట్టు శ్రమతో తయారవుతుంది. వెనకటి శ్రమలన్నీ బట్ట లోనే వుంటాయి. వాటి సంగతి ఇక్కడ అనవసరం.

కుట్టు పని జరుగుతూ వుండగా చూస్తే, ఏం పని జరుగుతోందో స్పష్టంగా కనపడుతుంది. ఆ శ్రమకు ఒక 'రూపం' వుంది. రూపం వుంది కాబట్టే, అది కనపడుతుంది.

తయారైన చొక్కాని చూస్తే, దాని కోసం కుట్టు శ్రమ జరిగినట్టు ఆ శ్రమ స్పష్టంగా కనపడుతుంది.

కుర్చీ - ఏ శ్రమతో తయారవుతుంది? వడ్రంగం శ్రమతో. కుర్చీని చూస్తే, ఆ శ్రమ కనపడుతుంది.

పుస్తకం - ఏ శ్రమతో? అచ్చు శ్రమతో. పుస్తకాన్ని చూస్తే, ఆ శ్రమ కనపడుతుంది.

ఏ వస్తువుని తయారుచేసే శ్రమ అయినా, ఆ వస్తువులో కళ్ళకి స్పష్టంగా కనపడుతుంది.

'కుట్టు' అనీ, 'వడ్రంగం' అనీ, 'రాత' అనీ, 'నేత' అనీ, ప్రతీ శ్రమకీ ఏదో ఒక పేరు వుంటుంది. బండిని తోలితే, అది - బండి తోలే శ్రమ. చదువు చెప్తే, అది - చదువు చెప్పే శ్రమ. ప్రతీ శ్రమా, ఒక 'రూపం వున్న శ్రమ'. ఒక పేరు వున్న శ్రమ. ప్రత్యేక లక్షణాలు వున్న శ్రమ. ప్రతీ వస్తువూ, కొన్ని రూపం వున్న శ్రమలతోనే తయారవుతుంది.

కానీ, ఒక రూపం వున్న శ్రమ, 'విలువ'గా మారితే, దాని రూపమూ, దాని పేరూ, దాని ప్రత్యేకతా, దాని గుణ గణాలూ, అన్నీ అదృశ్యమైపోతాయి. అది, 'రూపం లేని శ్రమ' అయిపోతుంది. ఎలాగంటే :

3 రకాల ప్రత్యేక శ్రమల్ని తీసుకుందాం. వ్యవసాయ శ్రమా, నేత శ్రమా, కుట్టు శ్రమా - అనే శ్రమల్ని. వీటిలో ఏ శ్రమ ఎంత సేపు జరిగిందో, వాటి కొలతలు కూడా తీసుకుందాం. వ్యవసాయ శ్రమ - 5 గంటలు. నేత శ్రమ - 4 గంటలు. కుట్టు శ్రమ - 3 గంటలు. ఈ 3 ప్రత్యేక శ్రమల తోటీ ఒక వస్తువు తయారైందనుకుందాం. [ ఇక్కడ, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, ఆ శ్రమలు జరగడానికి అవసర మయ్యే ఉత్పత్తి సాధనాల సంగతి తీసుకోవడం లేదు. ఉత్పత్తి సాధనాలతో జరిగే కొత్త శ్రమల సంగతే చూస్తున్నాం.]

ఈ 3 శ్రమలూ జరిగిన మొత్తం కాలం ఎంత? వ్యవసాయ శ్రమ 5 గంటలు + నేత 4 గంటలు + కుట్టు 3 గంటలు. మొత్తం 12 గంటలు. వస్తువు కోసం జరిగే మొత్తం శ్రమే, ఆ వస్తువుకి విలువ కదా?

అంటే, ఈ ఉదాహరణలో వున్న వస్తువు విలువ, 12 గంటలా? - అలా కాదు. వస్తువు కోసం జరిగిన ప్రత్యేక శ్రమలు 'విలువ'గా మారే విధానం అది కాదు. ఆ శ్రమలు జరిగిన కాలాలు, అవి జరిగిన గంటల లెక్కతోనే కలవడం కాదు. ఆ శ్రమల కాలాల్ని, డబ్బు, తన విలువ ద్వారా కొలుస్తుంది. ఆ కొలతల ద్వారా, ఆ ప్రత్యేక శ్రమల కాలాలు, అవి జరిగిన గంటల లెక్క కన్నా కొంత ఎక్కువో తక్కువో అవుతాయి. అలా మారిన విలువ గంటలే కలుస్తాయి.

డబ్బు చెయ్యవలసిన పని ఇక్కడి నించి ప్రారంభమవుతుంది. డబ్బు అంటే - బంగారం. బంగారాన్ని తయారుచేసే శ్రమ కూడా - ఒక ప్రత్యేక శ్రమ. ఒక రూపం వున్న శ్రమ. ఆ శ్రమకి, '1 గంట బంగారం శ్రమకి ఇంత విలువ' అని, ఎంతో కొంత విలువ వుంటుంది. ఆ శ్రమ విలువే, ఇతర శ్రమల్లో, దేనికి ఎంత విలువ వుందో, ఆ విలువల్ని కొలుస్తుంది.

1 గంట శారీరక శ్రమనీ, 1 గంట మేధా శ్రమనీ తీసుకుంటే, రెండూ గంట - గంట శ్రమలే. అయినా, వాటి విలువలు తేడాగా వుంటాయి - అని చూశాం. ఆ వేరు వేరు శ్రమల్లో విలువల్ని, డబ్బు శ్రమ, తన విలువతో కొలుస్తుంది. దీన్ని, తరాజులో బరువుల్ని తూచే బరువు రాయి ఉదాహరణతో అర్థం చేసుకోవాలి.

తరాజులో బరువుల్ని తూచే రాయికి, కొంత 'స్వంత బరువు' వుంటుంది. ఆ రాయి బరువుని 'కిలో' అనుకుందాం. ఆ తరాజు దగ్గిర, దూదీ, బెల్లం, పిండీ - అనే 3 పదార్థాలు తమ బరువుల్ని తూపించుకోవడానికి వచ్చి వున్నాయి. దూది అయితే, పెద్ద బస్తాడు వుంది. దాన్ని తరాజులో పెట్టి తూస్తే - అది కిలో బరువు కూడా అవలేదు. పిండి, చిన్న సంచితో వుంది. దాన్ని తూస్తే, కిలోన్నర అయింది. బెల్లం - పిండి సంచి కన్నా చిన్న గడ్డలా కాయితంలో వుంది. దాన్ని తూస్తే, 2 కిలోలు అయింది.


ఆ పదార్థాల సైజులకూ, వాటి బరువులకూ, ఏమీ సంబంధం లేదు. బస్తా నిండా ఎంతో పెద్ద సైజుతో వున్న దూది, తక్కువ బరువుతో వుంది. చిన్న సైజుతో వున్న బెల్లం, ఎక్కువ బరువుతో వుంది.

ఒకే పదార్థాన్ని అయితే, ఎక్కువగా తీసుకుంటే ఎక్కువ బరువూ, తక్కువగా తీసుకుంటే తక్కువ బరువూ, అవుతాయి. ఒకే పదార్థంలో, సైజుకీ, బరువుకీ సంబంధం వుంటుంది. కానీ వేరు వేరు పదార్థాల్ని చూస్తే, సైజులు సమానంగా వుంటే, బరువులు సమానంగా వుండవు. బరువులు సమానంగా వుంటే, సైజులు సమానంగా వుండవు.

సరిగ్గా, వేరు వేరు శ్రమల విలువల సంగతి అలాంటిదే. వేరు వేరు శ్రమలు జరిగిన కాలాలకూ, ఆ శ్రమల విలువలకూ, సంబంధం వుండదు.

ఒకే శ్రమని తీసుకుంటే, అది ఎక్కువ సేపు జరిగితే ఎక్కువ విలువా, తక్కువ సేపు జరిగితే తక్కువ విలువా, వుంటాయి. ఇది ఒకే శ్రమ సంగతి. కానీ, వేరు వేరు శ్రమల్ని తీసుకుంటే, ఎక్కువ సైజు వున్న చోట ఎక్కువ విలువా, తక్కువ సైజు వున్న చోట తక్కువ విలువా కాదు. అన్ని శ్రమల్నీ

ఒకే కాలం ప్రకారం ( గంట - గంట చొప్పున ) చూస్తే, వాటి విలువలు తేడాగా వుంటాయి. లేదా, అన్ని శ్రమలకూ ఒకే విలువ వుండే లాగ చూస్తే, అవి జరిగిన కాలాలు తేడా అవుతాయి. ఒక మేధా శ్రమకీ, ఒక శారీరక శ్రమకీ కూడా ఒక్కొక్క రూపాయి విలువే వుండాలంటే, వాటి కాలాలు ఎలా వుండవచ్చు? మేధా శ్రమకి 1 రూపాయి విలువ, అర గంట కాలానికే వుందనుకుందాం. అలాగైతే, ఒక శారీరక శ్రమకి, 1 రూపాయి విలువ, 3 గంటల కాలానికి వుండవచ్చు. - దీని సారాంశం, అన్ని శ్రమలకూ విలువలు ఒకే రకంగా వుండవు - అని.



విలువని తరాజుతో తూచడం కుదరదు. అయినా, చొక్కా విలువని, రూపాయితో కొలవడాన్ని, ఇలా తరాజు ద్వారా ఊహిస్తున్నాం. అంతే.

వేరు వేరు పదార్థాల బరువుల్ని తూచడానికి, తనకి కూడా స్వంత బరువు వున్న బరువు రాయి ఉంటుంది కదా? అలాగే, వేరు వేరు శ్రమల విలువల్ని కొలవడానికి, తనకు కూడా స్వంత విలువ వున్న బంగారు నాణెం వుంటుంది. ఆ నాణెం, 'ఫలానా అంత' బంగారంతో తయారైన రూపాయి బిళ్ళ. ఆ నాణానికి, కొంత విలువ వుంటుంది. ఆ విలువ, ఆ నాణానికి ఎలా ఏర్పడుతుంది? దాన్ని తయారుచెయ్యడానికి అవసరమైన మొత్తం శ్రమ కాలం వల్ల ఏర్పడుతుంది. ఆ మొత్తం శ్రమని 2 గంటలు అనుకుందాం. అది, బంగారం రూపాయిని ( డబ్బుని ), తయారుచేసే శ్రమ. ఆ 2 గంటల శ్రమ విలువ, 1 రూపాయి ( 1 నాణెం ).

బంగారాన్ని తయారుచేసే శ్రమలో, 2 గంటల శ్రమ విలువ - 1 రూపాయి కాబట్టి, అన్ని శ్రమల విలువలూ అలాగే వుంటాయా? కుట్టు శ్రమలో 2 గంటల్ని తీసుకుంటే, దాని విలువ 1 రూపాయి అవుతుందా? వైద్యం శ్రమలో కూడా అలాగే అవుతుందా? - అలా ఉండదు. శ్రమల్లో, శారీరక శ్రమలూ - మేధా శ్రమలూ అనే తేడాలు ఉన్నాయి కాబట్టి, వాటి విలువలు తప్పకుండా కొంత కొంత తేడాలతో ఉంటాయి. ఏ శ్రమకి ఎంత విలువ వుంటుందో, ఆ శ్రమల్ని, రూపాయి నాణెం కొలుస్తుంది. బరువు రాయి, తన బరువుతో, ఇతర పదార్థాల బరువుల్ని కొలిచినట్టు, రూపాయి నాణెం, తన విలువతో, ఇతర శ్రమల విలువల్ని కొలుస్తుంది. 1 గంట కుట్టు శ్రమకి ఎంత విలువ వుంటుందో, రూపాయి నాణెంతో కొలిస్తే, అది 1 రూపాయిగా వుండవచ్చు. లేదా, ఎక్కువో తక్కువో వుండవచ్చు. అలాగే, 1 గంట వైద్యం విలువని కొలిస్తే, అది,

కుట్టు విలువ కన్నా తప్పకుండా ఎక్కువగా వుంటుంది. ఈ రకంగా, రూపాయి నాణెం, తన విలువ ద్వారా, ఇతర శ్రమల విలువల్నీ, వస్తువుల విలువల్నీ కొలిచే పాత్రగా వుంటుంది. బరువు రాయి, బరువుల్ని తూచే సాధనంగా వున్నట్టు.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. బట్ట మీద కుట్టు శ్రమ జరిగింది. ఆ శ్రమ, బట్ట లోకి ఇంకుతుందా?

**జ**: పిండితో రొట్టెలు చెయ్యాలంటే, పిండిలో నీళ్ళు పోస్తే, ఆ నీళ్ళు పిండిలో ఇంకి కలిసిపోతాయి. కానీ, 'శ్రమ' సంగతి అలా కాదు. శ్రమ - ఒక పదార్థం కాదు. బట్ట మీద, కుట్టు పని చేస్తే, ఆ పనే - శ్రమ.

**2**. ఒక మేధా శ్రమ విలువ, 4 గంటలకి, 8 రూపాయలు. ఒక శారీరక శ్రమ విలువ, 2 గంటలకి, 2 రూ.లు. ఆ మేధా శ్రమలో, 1 గంట విలువ ఎంత? ఆ శారీరక శ్రమలో, 1 గంట విలువ ఎంత?

**జ**: మేధా శ్రమలో, 1 గంట విలువ - 2 రూ.లు. శారీరక శ్రమలో, 1 గంట విలువ - 1 రూపాయి.

**3**. ఏ రకం శ్రమ చేసే మనుషులకైనా, భోజనమూ, బట్టలూ, ఇల్లూ, మందులూ - వంటివన్నీ ఒకే రకంగా కావాలి. ఎటొచ్చీ, ఆ శ్రమల్ని నేర్చుకోవడానికి అయ్యే ఖర్చులే, కాలాలే, తేడా అవుతాయి. అలాంటప్పుడు, శారీరక శ్రమ విలువ కన్నా, మేధా శ్రమ విలువ రెట్టింపుగానో, 2 - 3 రెట్లుగానో, 10 రెట్లుగానో ఎందుకు ఉండాలి?

**జ**: ఆ తేడా, అన్ని రెట్లు ఉండకూడదు. రెట్టింపుగా కూడా ఉండనక్కర లేదు. ఆ తేడా, ఎంత అవసరమో అంతే ఉండాలి. ఈ నాటి వరకూ వున్న సమాజాల్లో, ఆ తేడాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. దానికి, వేరే కారణాలు ఉన్నాయి. ( వాటిని వేరే పాఠాల్లో చూస్తాం. )

**4**. డబ్బు, వస్తువుల విలువల్ని ఎలా కొలుస్తుంది?

**జ**: డబ్బు అంటే, కొంత బంగారం బిళ్ళ. ఆ బంగారానికి, కొంత విలువ వుంటుంది. ఈ విలువ, పాత శ్రమా, కొత్త శ్రమా కలిసినదే. ఇక్కడ మొత్తం శ్రమనే తీసుకోవాలి. బంగారాన్ని చేసే శ్రమలో, మొత్తం 2 గంటల శ్రమతో, 1 రూపాయి బిళ్ళ తయారవుతుంది అనుకుందాం. ఈ 2 గంటల శ్రమ విలువ, 1 రూపాయి. ( అంత బంగారం. ) ప్రతీ శ్రమ విలువా ఒకే రకంగా వుండదు కదా? బంగారం శ్రమ విలువ కన్నా కుట్టు శ్రమ విలువ, సగమే అనుకుందాం. అప్పుడు, కుట్టు శ్రమలో 4 గంటల విలువ, 1 రూపాయి అవుతుంది. డబ్బు శ్రమ విలువకీ, మామూలు శ్రమ విలువకీ తేడా ఎలా వుందో, ఆ రెంటినీ పోల్చి లెక్క కట్టడమే ఇది.

**5**. తరాజు ముందు వేరు వేరు పదార్థాలు ఉన్నాయి. వాటిని బరువు రాయి కొలిచి, ఏ పదార్థం బరువు ఎంత ఉందో, ఖచ్చితంగా చెపుతుంది. ఆ కొలతల్లో పొరపాట్లు ఉండవు.

→

అలాగే, బంగారం రూపాయి, ఇతర వస్తువుల విలువల్ని కొలుస్తుంది కదా? ఆ కొలతలు కూడా ఏ పొరపాట్లూ లేకుండా, చాలా ఖచ్చితంగా ఉంటాయని చెప్పగలమా?

**జ :** అస్సలు చెప్పలేము. బరువు రాయి చేసే పని, వస్తువుల శరీర లక్షణం అయిన బరువుని కొలవడం. ఒక కుర్చీ బరువుని తూస్తే, అది ' ఇన్ని కిలోల, ఇన్ని గ్రాములు' అని ఖచ్చితమైన లెక్క కనపడుతుంది. అది ' సగటు లెక్క' కాదు. కానీ, ' విలువ' ని కొలవడం అంటే ఏ పదార్థమూ కాని శ్రమని కొలవడం. శ్రమలు, రక రకాల పరిస్థితుల్లో జరుగుతాయి. ప్రతీ శ్రమనీ, సగటు లెక్కతో తీసుకోవలిసిందే. చొక్కా గానీ, కుర్చీ గానీ, ఏది తయారైనా, ముడి పదార్థాల శ్రమలూ, పనిముట్ల శ్రమలూ, వాటి మీద జరిగే కొత్త శ్రమలూ - అన్నిటిలోనూ సగటు లెక్కలే. ఆ సగటులన్నీ కలిసిన మొత్తం కూడా ఖచ్చితమైన లెక్కతో వుండదు. ఒక మనిషి, ఒక చొక్కాని 5 గంటల్లో కుడితే, ఆ కాలం ఖచ్చితంగా తెలుస్తుంది. ఆ చొక్కా కోసం ఎంత బట్ట పట్టిందో, ఎంత దారం పట్టిందో, అన్నిటినీ ఖచ్చితంగా కొలవవచ్చు. కానీ, అన్నిటికీ సంబంధించిన శ్రమల్ని సగటు లెక్కలతో కలిపి, వాటి విలువల్ని కొలవాలంటే, ఆ శ్రమల కొలతలన్నీ ఖచ్చితంగా వుంటాయని చెప్పడానికి లేదు. ' శ్రమ' అనేది, ఒక పదార్థం కాదు కాబట్టే, ఈ సమస్య. అయితే, శ్రమల విలువల్ని కొలవడంలో ఎన్ని అస్తవ్యస్తతలు జరిగినా, అవి ఎప్పుడూ ఒక్క శ్రమ విషయంలోనే జరగవు. అన్ని శ్రమల కొలతల్లోనూ జరుగుతాయి. కాబట్టి ఆ అస్తవ్యస్తతలు ఎక్కడా జరగని దానితో సమానం. శ్రమల విలువల్ని డబ్బు ద్వారా కొలవడం, వస్తువుల బరువుల్ని బరువు రాయితో కొలిచినంత ఖచ్చితమైన లెక్క కాకపోయినా, విలువల్ని కొలిచే మార్గం అది. ఇంకో మార్గం ఏదీ లేదు. అందుకే విలువనీ, దాని కొలతల్నీ ' అసహజమైన విషయాలు' అనడం!

**6**. ఒక చొక్కాని, 5 రూపాయలతో కొన్నాం. ఆ చొక్కాకి నిజంగా అంత విలువా ఉన్నట్టా లేనట్టా? ఆ విలువ కొలత సరైనదా కాదా?

**జ :** సరైనదే. ఒక వేళ, ఒక శాల్తీ విషయంలో చిన్న తేడా జరిగితే జరగవచ్చు. ఎక్కువ శాల్తీల విలువల్ని కలిపితే, ఆ తేడా తగ్గిపోతుంది. 100 చొక్కాల విలువ, 5 × 100 = 500 రూ.లు. ఆ 100 చొక్కాల్లో, ఒక దాని కోసం ఎక్కువ శ్రమా, ఒక దాని కోసం తక్కువ శ్రమా జరిగినా, ఏదో ఒక్క చొక్కానే విడిగా చూడకుండా, ఎక్కువ శాల్తీల్ని తీసుకుంటే, ఆ మొత్తం కోసం జరిగిన శ్రమకీ, దాని విలువ కొలతకీ, తేడా రాదు. ఏదో కాస్త తేడా వున్నా, అది అంతే. ' విలువ'ని కొలవడానికి మార్గం అదే మరి!

**7**. అసలు ఈ విలువ కొలతలు ఎందుకు? విలువల గొడవ లేకుండా, వస్తువుల్ని తయారుచేసుకోవడమూ, వాడుకోవడమూ - చెయ్యలేమా?

**జ :** ' చెయ్యలేమా' కాదు. అలాగే చెయ్యాలి. కానీ, అది సాధ్యం కావాలంటే, ఇప్పుడు అమలులో వున్న విషయాల్లో బోలెడు మార్పులు జరగాలి. అలా మార్పులు జరిగితేనే అది సాధ్యం. లేకపోతే, విలువ లెక్కలు లేకుండా బతకడం సాధ్యం కాదు. ★

# 33. డబ్బు అనేది, 'రూపం లేని శ్రమ!'

మనం 3 వేరు వేరు శ్రమలతో తయారైన ఒక వస్తువుని ఉదాహరణగా తీసుకున్నాం. ఆ శ్రమల్ని ఇలా చెప్పు కున్నాం : వ్యవసాయ శ్రమ 5 గంటలు. నేత 4 గంటలు. కుట్టు 3 గంటలు. ఈ కాలాలు ఇలాగే కలిస్తే, మొత్తం శ్రమ, 12 గంటలు అవుతుంది కదా? కానీ, శ్రమలు కలిసేది ఇలా కాదు. శ్రమల విలువల్ని, మొదట రూపాయి నాణెం కొలవాలి. ఆ ప్రత్యేక శ్రమలు, విలువని చెప్పే యూనిట్లలోకి (విలువ గంటల లోకి) మారతాయి. బంగారాన్ని తయారు చేసే శ్రమకి విలువ ఏ లెక్కన వుంటుందో, ఆ విలువ యూనిట్లలోకి.

ఆ 3 శ్రమలూ, విలువలుగా మారినప్పుడు, ఇలా మారాయి అనుకుందాం : 5 గంటల వ్యవసాయ శ్రమ, 3 గంటల బంగారం శ్రమ అయింది. 4 గంటల నేత శ్రమ, 2 గంటల బంగారం శ్రమ అయింది. 3 గంటల కుట్టు శ్రమ, దాని విలువ, బంగారం శ్రమ విలువతో సమానం అవడం వల్ల, అది ఎక్కువో తక్కువో అవకుండా 3 గంటలుగానే వుంది. అలా, ఆ 3 ప్రత్యేక శ్రమలూ, విలువ గంటల లోకి మారిపోయాక, ఆ మారిన శ్రమ మొత్తం, 3 + 2 + 3 = 8 విలువ గంటలు అవుతుంది. ఆ ప్రత్యేక శ్రమలు, అవి జరిగిన కాలాల ప్రకారమే కలిస్తే, 12 గంటలు అయ్యేది. కానీ, అది, విలువ గంటల్లోకి మారింది కాబట్టి 8 గంటలు అయింది. ఇది 'విలువ' గా మారిన కాలం. ఇలా మారిన శ్రమలో, 2 గంటల శ్రమ విలువ, 1 రూపాయి. (ఆ రూపాయి బిళ్ళలో వున్న ఫలానా అంత బరువు గల బంగారం.) ఆ ప్రకారం, 8 గంటల విలువ, 4 రూపాయలు. మనం ఉదాహరణగా తీసుకున్న వస్తువు విలువ, 4 రూపాయలు అవుతుందన్నమాట! ఆ వస్తువుని తయారు చెయ్యడం కోసం అవసరమైన ఉత్పత్తి సాధనాల్ని మొదట తీసుకోలేదు. ఆ సాధనాల విలువని కూడా ఇప్పుడు కలపాలి. దాన్ని 2 రూపాయలు అనుకుందాం. అది కూడా కలిస్తే, ఆ వస్తువు విలువ, 4 + 2 = 6 రూపాయలు అవుతుంది.

వస్తువుని తయారుచేసిన మొదటి 3 శ్రమలూ (వ్యవసాయమూ, నేతా, కుట్టూ అనేవి), రూపాలూ, పేర్లూ, ప్రత్యేకతలూ వున్న శ్రమలు. కానీ, వాటితో తయారైన వస్తువు, అమ్మకానికి పోవడం వల్ల, ఆ శ్రమలు, 'విలువ' లెక్కల్లోకి మారిపోయాయి. ఉత్పత్తి సాధనాల్ని తయారు చేసిన శ్రమలన్నీ గతంలోనే విలువగా మారి వున్నాయి. అదంతా కలిసిన తర్వాతే ఆ వస్తువు విలువ, 6 రూపాయలు. 'విలువ' అనేదంతా కూడా శ్రమే. కానీ, ఆ శ్రమ ఇప్పుడు, వ్యవసాయం కాదు, నేత కాదు, కుట్టు కాదు. దానికి, అసలు రూపాలన్నీ పోయాయి. అది ఇప్పుడు, 'రూపం లేని శ్రమ'. దానికి సైజు మాత్రమే వుంటుంది. 1 గంటా, 2 గంటలా, 5 గంటలా - అలా

'పరిమాణం' మాత్రమే వుంటుంది. అది ఏం శ్రమో చెప్పలేము. దానికి పేరూ, ఊరూ ఉండవు.

వస్తువుల కోసం జరిగిన ప్రతీ రూపం వున్న శ్రమనీ, బంగారం రూపాయి, తన విలువ ద్వారా కొలుస్తుందని చూశాం. బంగారం నాణెం తయారైందంటే, దాని విలువ కూడా 'రూపం లేని శ్రమ'గా మారిపోయి వున్నదే. ఆ విలువ యూనిట్టే, (ఆ నాణెం విలువే), ఇతర శ్రమల విలువల్ని కొలిచింది.

ఒక కొత్త చొక్కా ధర, 10 రూపాయలు. ఆ డబ్బు దేన్ని చెపుతోంది? - ముడి పదార్థం విలువా, పనిముట్ల విలువా, కుట్టు శ్రమ విలువా, అన్నీ కలిసిపోయి, అంత డబ్బుగా వుంది - అని చెపుతోంది.

ప్రశ్న : ఒక చొక్కాని తయారుచేసుకోవాలంటే, ఏమేమి కావాలి? - దీనికి 2 రకాల జవాబులు ఉంటాయి.

**(1) 'ఉపయోగపు విలువ' దృష్టితో చెప్పుకుంటే** : ఫలానా ముడి పదార్థాలు కావాలి. ఫలానా పనిముట్లు కావాలి. ఫలానా ఇన్ని గంటల కుట్టు శ్రమ కావాలి. వీటితో చొక్కా తయారవుతుంది.

**(2) 'విలువ' దృష్టితో చెప్పుకుంటే** : 10 రూపాయలు కావాలి. అంత విలువతో (అంత డబ్బుతో) చొక్కా తయారవుతుంది.

మనం ఒక డబ్బు నాణాన్నో, నోటునో చూశామంటే, అది ఏమిటి? అది 'విలువ'. విలువ అంటే శ్రమ. 'డబ్బు' అనేది శ్రమ. ఏం శ్రమ? బంగారాన్ని చేసే శ్రమ. '1 రూపాయి' అనే విలువ, దేని విలువ? - ఆ రూపాయి బిళ్ళలో ఎంత బంగారం వుందో ఆ బంగారం ముద్ద విలువ అది. రూపాయి బిళ్ళని చూస్తే, బంగారాన్ని చేసిన శ్రమ కనపడుతుంది గానీ, ఇతర శ్రమ లేవీ కనపడవు. కుండని ఇచ్చి 1 రూపాయి తీసుకుంటే, అప్పుడు ఆ రూపాయి, కుండ విలువే. కానీ, ఆ రూపాయిలో కుమ్మరి శ్రమ కనపడదు. ఆ రూపాయి బిళ్ళ, ఏ వస్తువుకి విలువగా వున్నా, ఆ విలువలో బంగారం శ్రమే కనపడుతుంది. ఆ రూపాయి, ఏ వస్తువుకి విలువగా వుందో ఆ వస్తువుని చేసిన శ్రమ కనపడదు.

కానీ, 'విలువ' అంతా శ్రమే. ఒక రూపాయి అయితే, కొంచెం శ్రమ. వెయ్యి రూపాయలు అయితే, వెయ్యి రెట్ల శ్రమ. డబ్బు అనేది శ్రమే!

ఎంత డబ్బు, అంత శ్రమ!

డబ్బు - ఇతర వస్తువులతో మారే పనిని ఏ లక్షణంతో చేస్తుంది? - తనలో వున్న 'విలువ' అనే లక్షణంతోనే చేస్తుంది. డబ్బు కూడా శ్రమ తోనే తయారవుతుంది కాబట్టి, అది మారకాల సాధనం పాత్రని నిర్వహించగలుగుతుంది.

'డబ్బు అంటే మారకాల సాధనం' అని, ఆ ఒక్క సంగతే తెలుసుకుంటే, డబ్బుని తెలుసుకున్నట్టు కాదు. అది, కూడా, శ్రమతో తయారవుతుందనీ, అందుకే అది, ఇతర వస్తువుల శ్రమల్ని తన ద్వారా కొలవగలుగుతుందనీ, డబ్బు అంటే కారణం లేకుండా ఏర్పడిన గుర్తు కాదనీ, తెలుసుకోవాలి.

డబ్బుకి - గుణమూ, పరిమాణమూ ఉన్నాయి. **గుణం** : విలువ. ఆ విలువతో అది, ఏ వస్తువుతో అయినా మారగలదు. **పరిమాణం** : 1 రూపాయిలో వున్న విలువకి

కొంత సైజు వుంటుంది. ఆ రూపాయితో, అంతే విలువ గల వస్తువుని మాత్రమే కొనగలం. 10 రూపాయలతో, 10 రూపాయల విలువ గల వస్తువుని మాత్రమే. వెయ్యి రూపాయలతో, వెయ్యి విలువ గల వస్తువుని మాత్రమే.

డబ్బులో వున్న గుణం అయితే, దేన్ని అయినా కొనగలదు. పరిణామం అయితే, దాని హద్దు దాటి కొనలేదు. ఇది డబ్బులో, గుణానికీ, పరిమాణానికీ వైరుధ్యం. ఈ వైరుధ్యం, డబ్బుని కూడబెట్టే వాళ్ళకి, ఆ కూడబెట్టడంలో సంతృప్తి లేకుండా చేస్తుంది. కోటి రూపాయలు సంపాదించినా, దానితో కూడా కొనలేని వస్తువులు వుంటాయి కాబట్టి, ఆ డబ్బు సంతృప్తిని ఇవ్వదు. వెయ్యి కోట్లు సంపాదించినా, అదీ సంతృప్తిని ఇవ్వదు. డబ్బు రాసి, ఎప్పటికీ సంతృప్తిని ఇవ్వదు. సంతృప్తిని ఇచ్చే లక్షణం, డబ్బులో లేదు.

ఆకలితో వున్నప్పుడు అన్నం తినడానికి ఒక సహజమైన హద్దు వుంటుంది. కడుపు నిండాలి. ఆకలి తగ్గాలి. దాహం తీరాలి. - ఇది ఉపయోగపు విలువల వల్ల ఏర్పడే ఫలితం!

మారకం విలువ అయిన డబ్బుతో, మారకం విలువ దృష్టితో, సంతృప్తి కలిగే అవకాశం వుండదు. ఇది, మారకం విలువలో ( డబ్బులో ) ఉన్న వైరుధ్యం. ఇది అసహజ లక్షణం.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. డబ్బు అంటే శ్రమ - వివరించండి!

**జ** : ఏ వస్తువు అయినా, శ్రమతో తయారయ్యేదే. కానీ, మామూలు వస్తువుల్లో, ఏదో ఒక ఉపయోగపు విలువ వుంటుంది. ' డబ్బు'లో ఏ ఉపయోగపు విలువా వుండదు. విలువ ఒక్కటే వుంటుంది. విలువ అంటే శ్రమే కదా? కాబట్టి డబ్బు అంటే శ్రమే.

**2**. ఏ వస్తువు అయినా శ్రమతో తయారయ్యేదే కదా? ' డబ్బు' మాత్రమే శ్రమతో వుండే విషయం లాగ, ' డబ్బు అంటే శ్రమే' అని ఎందుకు అనాలి?

**జ** : ఏ మామూలు వస్తువు అయినా, ' డబ్బు' అయినా, అన్నీ శ్రమలతో తయారయ్యే వస్తువులే. అయితే, ఏ మామూలు వస్తువుని చూసినా, కుర్చీని చూసినా, చొక్కాని చూసినా, అది ఏమిటో ఎవరూ చెప్పకుండానే అందరికీ తెలుస్తుంది. కానీ, ' డబ్బు' సంగతి అలా కాదు. ' డబ్బు'ని చూస్తే, ' అది, వస్తువుల్ని కొనే సాధనం' అన్నంత వరకే తెలుస్తుంది గానీ, ఆ పని అది ఏ లక్షణంతో చేస్తుందో ఎవరికీ తెలీదు. ' డబ్బు' అంటే, కేవలం ' విలువ'. ' విలువ' అంటే, ' రూపం లేని శ్రమ'. ఆ ' రూపం లేని శ్రమ' లో, అనేక రూపం వున్న శ్రమలు ఉన్నాయి. ప్రత్యేక శ్రమలన్నీ, అలా మారిన లెక్కతో వున్నా, అదంతా శ్రమే. కాబట్టి, ' డబ్బు అంటే, శ్రమ' - అని తప్పకుండా తెలుసుకోవాలి.

**3**. డబ్బుకి ఒక ప్రత్యేక లక్షణం వుంది. ఏమిటి?

**జ** : డబ్బు అంటే మారకం విలువ. అది, ఏ ' ఉపయోగపు విలువ' గా అయినా ⟶

తక్షణం మారగలదు. అంటే, డబ్బుని ఇచ్చి, ఏ వస్తువుని అయినా కొనవచ్చు.

**4.** డబ్బులో, గుణానికీ, పరిమాణానికీ వైరుధ్యం ఉంటుంది. వివరించండి!

**జ :** డబ్బు, సరుకుల ప్రపంచంలో వున్న ఏ సరుకుతో అయినా మారగలదు. అది, డబ్బుకి వున్న గుణం. కానీ, 'డబ్బు' అన్నప్పుడు, దానికి ఎంతో కొంత పరిమాణం ( సైజు ) ఉంటుంది. ఆ పరిమాణం, ఏ సరుకుని బడితే ఆ సరుకుని కొనలేదు. 1 రూపాయి, 1 రూపాయి విలువ గల సరుకునే కొనగలదు గానీ, అంత కన్నా ఒక్క పైస ఎక్కువ విలువ గల సరుకుని అయినా కొనలేదు. 10 రూపాయల్ని తీసుకుంటే, ఆ డబ్బు, 10 కన్నా ఎక్కువ విలువ గల సరుకుని కొనలేదు. 1,000 రూపాయల్ని తీసుకున్నా అంతే ; లక్ష రూపాయల్ని తీసుకున్నా అంతే. డబ్బు పరిమాణానికి ఒక 'పరిమితి' ఉంటుంది. అంటే, డబ్బుకి వున్న గుణం - పరిమితి లేనిది. పరిమాణం - పరిమితమైనది. ఇదీ, డబ్బులో గుణానికీ, పరిమాణానికీ వైరుధ్యం.

**5.** 'విలువ' కూడా శ్రమే కదా? వస్తువు శరీరంలో విలువ ఎందుకు కనపడదు?

**జ :** 'విలువ' కూడా శ్రమే గానీ, అది రూపాలన్నీ పోయిన శ్రమ. రూపాలు పోయినప్పుడు, పరిమాణమే ( సైజే ) మిగులుతుంది. రూపం లేనిది, ఎలా కనపడుతుంది?

**6.** 'డబ్బు కాని' సాధారణ వస్తువుల్లో వైరుధ్యం ఉండదా?

**జ :** సాధారణ వస్తువుల్లో దేనికి అయినా, ఒక్క ఉపయోగపు విలువే ఉంటుంది. చొక్కా - తొడుక్కోవడానికి. దానికి ఇంకో ఉపయోగపు విలువ ఉండదు. చొక్కా పరిమాణం, ఆ ఉపయోగపు విలువ ఇవ్వడానికి తగినట్టుగానే వుంటుంది. కుర్చీ అయినా అంతే, పుస్తకం అయినా అంతే. బియ్యం లాంటి పదార్థం, తక్కువగా వున్నా, ఎక్కువగా వున్నా, అది ఇచ్చేది ఒక్క రకం ఉపయోగపు విలువే. ఎక్కువ బియ్యం, తన ఒక్క ఉపయోగపు విలువనే ఎక్కువగా ఇస్తుంది. సాధారణ వస్తువుల్లో, దాని ఉపయోగానికీ, దాని పరిమాణానికీ వైరుధ్యం వుండదు. డబ్బు సంగతి అలా కాదు. దాని గుణం అయితే, సమస్త - ఉపయోగపు విలువలుగానూ ఉండగలదు. దాని పరిమాణం అయితే, ప్రతీ ఉపయోగపు విలువనీ సంపాదించలేదు. ఇలాంటి వైరుధ్యం, సాధారణ వస్తువుల్లో ఉండదు. మారకం విలువలో వున్న వైరుధ్యం, ఉపయోగపు విలువలో ఉండదు.






**7.** చొక్కాలో కుట్టు శ్రమ కనపడినట్టే, రూపాయి నాణెంలో, ఆ నాణాన్ని చేసిన శ్రమ కనపడుతుంది కదా? అది, రూపం లేని శ్రమ ఎలా అవుతుంది?

**జ :** చొక్కాని, ఉపయోగపు విలువగా చూస్తాం; ఉపయోగపు విలువగానే వాడతాం. రూపాయిని, ఉపయోగపు విలువగా చూడం; 'విలువ'గా చూస్తాం. ఆ బిళ్ళని విలువగానే వాడతాం. విలువ అనేది, అనేక రూపాలు కలిసి పోయిన శ్రమ. కాబట్టి, అది, శ్రమలకు వుండే సహజ రూపాలు పోయిన శ్రమ. ★

# 34. మానవ సంబంధాలు అంటే, శ్రమ సంబంధాలే!

ఇప్పటి దాకా, వస్తువులూ, వాటి విలువలూ, మారకాలూ, డబ్బూ - అవన్నీ చూశాం. ఇక్కడి నించీ, 'మానవ సంబంధాలు' అంటే ఏమిటో చూడాలి.

'మానవ సంబంధాలు' అంటే, 'శ్రమ - సంబంధాలు'. రక్త సంబంధాలు అయితే, చీమలకూ, దోమలకూ, అన్నిటికీ వుంటాయి. మానవులు కానివి ఏవీ, శ్రమలు చెయ్యవు. శ్రమ చేసేది మనుషులే. శ్రమలు చేస్తూ, ఆ శ్రమల్ని మారకాలు చేసుకుంటూ జీవించేది మనుషులే. కాబట్టి, మానవుల సంబంధాలు అంటే, 'శ్రమ' సంబంధాలే.

మనుషులు, శ్రమలు చెయ్యడం ప్రారంభించినప్పటి నించీ, ఈ నాటి వరకూ జరిగిన కాలాన్ని చూస్తే, ఈ శ్రమ సంబంధాలు అనేక రకాలుగా మారిపోతూ వచ్చాయి. ఆ మార్పులు, మంచివో చెడ్డవో, అవి ఎలా జరిగాయో మనం తెలుసుకోవాలి.

మనం మనుషులం! మన కన్నా వెనకటి తరాల్లో పుట్టిన మనుషులు ఎలా జీవించారో, ఈ నాడు మనం ఎలా జీవిస్తున్నామో - మనం తెలుసుకోవాలి. మనుషుల కర్తవ్యం - మనుషులు జీవించే విధానాల గురించీ, మనుషుల మధ్య వుండే సంబంధాల గురించీ, తెలుసుకోవడమే. మనుషులు నేర్చుకోవలసిన జ్ఞానం అదే.

మనం నిత్యం కళ్ళ ముందు అనేక విషయాలు చూస్తూ వుంటాం. అవి మంచివి అయినా, చెడ్డవి అయినా, అన్నీ ఎలా వుంటే అలాగే అలవాటై పోయి వుంటాయి. దేని గురించీ ప్రశ్నలు రావు. అన్నీ ఒక్కలాగే కనపడతాయి. ప్రకృతిలో జరిగేవీ, సమాజంలో జరిగేవీ, అన్నీ సహజంగానే కనపడతాయి.



సూర్యుడు రోజూ ఒక్క దిక్కునే ఉదయించడం చూస్తాం. ఆ దిక్కు పేరు - తూర్పు. "సూర్యుడు, తూర్పునే ఎందుకు ఉదయిస్తాడు? రోజూ అలాగే ఎందుకు జరుగుతుంది?" అనే ప్రశ్నలు వస్తాయా? - రావు. ప్రశ్న వస్తే, జవాబు కోసం వెతుకుతాం. వెతికితే జవాబు తప్పకుండా దొరుకుతుంది. కానీ, ప్రశ్నే లేకుండా, "అది అంతే, అది సహజం" అని దాన్ని వదిలేస్తాం. రావలసిన చోట ప్రశ్న రావడం లేదంటే, ఆలోచించడం లేదని అర్థం.

ఇళ్ళ ముందూ, రోడ్ల మీదా, బిచ్చగాళ్ళు అడుక్కుంటూ తిరగడం రోజూ చూస్తాం. "ఈ మనుషులు ఇలా అడుక్కునే స్థితిలో ఎందుకు వున్నారు? మనం అలా లేము



కదా? మనకీ, వాళ్ళకీ, తేడా ఏమిటి?" అనే ప్రశ్నలు వస్తాయా? - రావు. ఆ ప్రశ్నలు, ఆ అడుక్కునే వాళ్ళకి కూడా రావు. "చాలా మంది అడుక్కోవడం లేదు కదా? మనమే ఇలా ఎందుకు వున్నాం?" అని వాళ్ళు అనుకోరు. "మనం ఇంతే, మనం చాలా పేదలం" అని మాత్రమే అనుకుంటారు. వాళ్ళ గురించి మనం కూడా, "వాళ్ళు అంతే, వాళ్ళు పేదలు కదా?" అనుకుంటాం. అంతే. అక్కడితో అది తెలిసిపోయింది అనుకుంటాం. అంతేగానీ, "పేదలు అంటే ఏమిటి? మనుషుల్లో కొందరు పేదలుగా ఎందుకు వున్నారు?" అని ఇంకా కొన్ని ప్రశ్నలు రావు. అది అంతే! అది సహజం! మనకు ఎలా కనపడితే అదే సహజం! ఎప్పుడన్నా పేదల మీద కాస్త జాలి కలిగితే, కొంచెం దాన ధర్మాలు చేస్తాం. జాలి కలగకపోయినా, "దానం చేస్తే పుణ్యం వస్తుంది" అనే నమ్మకంతో అయినా అలా చేస్తాం. ప్రశ్న రావలసిన ప్రతి చోటా, అన్నీ సహజంగానే కనపడి, ఏ ప్రశ్నలూ లేకుండా కాలం గడిచిపోతూ వుంటుంది.

కానీ, మనుషులు తెలుసుకోవలసిన విషయాలు అనేకం వున్నాయి. మనుషులు, తమ జీవితాల గురించి సరిగా ఆలోచించడం నేర్చుకోవాలి. నిజాలు తెలుసుకోవడం నేర్చుకోవాలి.

పిల్లలూ! మీకు, 'యజమానులు' అంటే తెలుసా? 'సేవకులు' అంటే తెలుసా? 'పేదలూ - ధనికులూ' అంటే తెలుసా? ఆ తేడాలు ఎలా ఏర్పడతాయో తెలుసా? - అదే ఇప్పుడు తెలుసుకోవాలి.

కొందరు మనుషులు 'యజమానులు'! ఆ యజమానుల దగ్గిర సేవలు చేసే మనుషులు 'సేవకులు'. యజమానులే - ధనికులు! సేవకులు - పేదలు!

ధనికులకు పెద్ద పెద్ద ఇళ్ళూ, పూల తోటలూ, మంచి ఆహారం, మంచి బట్టలూ, కార్లూ, విద్యలూ కళలూ - అన్నీ వుంటాయి. పేదలకు అవేవీ వుండవు. ఉంటే పూరిగుడిసెలే. లేదా, ఒక్క ఇరుకు గది కొంపలే. మంచి తిండీ, మంచి వస్తువులూ వుండవు. చదువులు వుండవు. కొంచెం సుఖంగా జీవించగలిగే ఏ సదుపాయాలూ వుండవు.

మనుషులు, ఇంత తేడాగా ఎందుకు వున్నారు? అందరూ మనుషులే కదా? అందరూ ఒకే రకంగా ఎందుకు బతకడం లేదు? - ఈ విషయాలు తెలియకపోతే, మనుషుల గురించి మనుషులకు ఏమీ తెలియదని అర్థం. దీన్ని, 'బానిసల కాలం' నించీ చూడడం మొదలుపెట్టాలి ( క్లుప్తంగానే ).

పిల్లలూ! 'బానిసలు' అంటే తెలుసా మీకు? ఆ మాట ఎప్పుడైనా విన్నారా అసలు? బానిసల గురించి ఏవైనా పుస్తకాలు చదివారా? - వందల, వేల సంవత్స

రాల కిందట వుండిన పేదలందరూ బానిసలే.

మనుషులు, అడవుల్లో నగ్నంగా జంతువుల్లాగే తిరిగిన దశలో నించి క్రమంగా శ్రమలు నేర్చుకున్నారు కదా? ఆ మనుషుల మధ్య చాలా కాలం వరకూ, ఏ తేడాలూ, ఏ ఎక్కువ తక్కువలూ, లేవు. అలాంటి మనుషుల మధ్య క్రమంగా, 'బానిసలూ - బానిసల యజమానులూ' అనే తేడాలు ప్రారంభమయ్యాయి. ఆ తేడాలు ఎందుకు ప్రారంభమయ్యాయో చూడాలంటే, అనేక దేశాల చరిత్రలు చూడాలి. అదంతా ఇక్కడ వద్దు! ఏ తేడాలూ లేని మనుషుల మధ్య, తేడాలు ప్రారంభమవడం నిజం. కాబట్టి, ఆ తేడాలు ఏమిటో తెలుసుకుంటే చాలు!

మనుషులు, తమ జీవితాల కోసం అనేక రకాల శ్రమలు చేసుకోవాలి కదా? ఆ శ్రమలన్నీ మానేసిన వాళ్ళు - యజమానులు. యజమానుల కోసం కూడా శ్రమలన్నీ చెయ్యవలసిన వాళ్ళు - బానిసలు.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. మనుషులు తెలుసుకోవలసింది ఏమిటి?

**జ**: తమ జీవితాల గురించీ ; ప్రకృతి గురించీ.

**2**. మానవ సంబంధాలు అంటే, శ్రమ సంబంధాలు. - వివరించండి!

**జ**: ప్రకృతిలో, మానవులు తప్ప, ఏ ఇతర ప్రాణులూ శ్రమలు చెయ్యవు. అవి, ప్రకృతిలో సహజంగా దొరికే పదార్థాల మీదే ఆధారపడి బతుకుతాయి. కానీ మానవులు అలా కాదు. వారు, ప్రకృతిలో దొరికే పదార్థాల్నీ తింటారు ; తాము స్వయంగా శ్రమలు కూడా చేసుకుంటూ అనేక వస్తువుల్ని తయారు చేసుకుంటారు. శ్రమలు చెయ్యడం మానవుల ప్రత్యేక లక్షణం. కాబట్టి మానవుల మధ్య ఏర్పడే సంబంధాలన్నీ శ్రమలకు సంబంధించినవిగానే వుంటాయి.

**3**. మానవులు, ఆటవిక దశలోనే ఉండి, ఇంకా శ్రమలు చెయ్యడం తెలుసుకోక ముందు, ఆ మనుషుల మధ్య ఎలాంటి సంబంధాలు వుండి వుంటాయి?

**జ**: శ్రమలు చెయ్యడం తెలియని కాలంలో జీవించిన మనుషులు, ఇంకా జంతు స్థాయిలో వున్న మనుషులే. అప్పటి మనుషుల సంబంధాలు, జంతువుల సంబంధాల లాంటివే. వాళ్ళు, జంతువుల్లాగే, ప్రకృతిలో దొరికిందే తింటారు.

**4**. కుండల రామయ్యకీ, చెప్పుల సోమయ్యకీ వున్న సంబంధం ఏమిటి?

**జ**: అది శ్రమల సంబంధమే. ఒకరి శ్రమని ఒకరు వాడుకుంటారు. ఇలాంటి సంబంధం, సమానుల మధ్య వుండే శ్రమ సంబంధం.

**5**. 'యజమానులు' అంటే? 'బానిసలు' అంటే?

**జ**: ఈ మాటల అర్థాలు, ఈ పాఠంలో ఇంకా సరిగా తెలియడం లేదు. 'శ్రమలు చెయ్యని వాళ్ళు యజమానులు' అనీ, 'శ్రమలు చేసే వాళ్ళు బానిసలు' అనీ, అంతే తెలుస్తోంది.

★

# 35. 'శ్రమని దోచడం' మొదలైంది!

'ఆస్తి' అంటే, తెలుసా మీకు? ఒక బానిస యజమాని కుటుంబానికి, కొన్ని వందల, వేల ఎకరాల భూమి వుంటుంది. అంత భూమి వాళ్ళకి ఎలా వచ్చిందో ఇక్కడ అనవసరం. వచ్చింది అలాగ. అది నిజం! ఈ నాటికీ పెద్ద పెద్ద భూములు వున్న ధనవంతులు కనపడుతూనే వున్నారు కదా? "ఇంత భూమి మీకు ఎలా వచ్చింది?" అని ఈ ధనవంతుల్ని అడగండి! వాళ్ళు, "ఈ భూమిని మా తాత గారు ఇచ్చారు. మా తండ్రి గారు ఇచ్చారు. ఇది మా కుటుంబం ఆస్తి" అని చెపుతారు. "ఇంత భూమి, మీ తండ్రి గారికి అయినా, తాత గారికి అయినా, ఎలా వచ్చింది?" అని వాళ్ళని మళ్ళీ అడగండి!

"మా తండ్రి గారూ, తాత గారూ, చాలా కష్టించి, ఈ భూమిని సంపాదించారు" అని చెపుతారు. ఎన్ని రకాలుగా అడిగినా, వాళ్ళు అలాగే చెపుతారు. అంత భూమి, వాళ్ళ కుటుంబం ఆస్తి ఎలా అయిందో నిజానికి వాళ్ళకే తెలీదు. వాళ్ళు చెప్పిందే వాళ్ళకి తెలుసు. వాళ్ళు అదే నమ్ముతున్నారు. బానిసల కాలం నించీ యజమానుల కుటుంబాలకు అంతంత ఆస్తులు వుండడం మాత్రం నిజం.

ఏ మనిషి అయినా, ఏ కుటుంబం అయినా, ఒక నదినో, ఒక సముద్రాన్నో చూపించి, "ఈ నది అంతా నాదే. ఈ సముద్రం నాదే. ఇది నా ఆస్తి" అంటే ఎలా వుంటుంది? అదే మాట, భూమి గురించి అన్నా అలాగే వుంటుంది. భూమి, ప్రకృతి సహజ పదార్థం. దాన్ని ఏ మనుషులూ చెయ్యలేదు. కాబట్టి భూమిలో, చింతాకు అంత భాగం అయినా ఎవరికీ ఆస్తి అవదు. 'చింతాకు అంత' అనడం కన్నా, 'సూది మొన మోపినంత' అంటే, ఇంకా బాగుంటుంది.

కానీ, మనుషులు భూమి మీదే నివసించాలి కదా? ఆకాశంలోకి పోలేరు కదా? కాబట్టి, నివసించే అవసరాల కోసం భూమిని ఉపయోగించుకోవడానికి అయితే, ఏ మనిషికైనా హక్కు వుంటుంది. అయితే, ఆ ఉపయోగించుకోవడం, స్వంత శ్రమతో చేసుకోవాలి. కొన్ని పనులు చెయ్యడానికి, ఒకరిద్దరు మనుషుల వల్ల సాధ్యం కాదు. ఎక్కువ మంది కలిసి చెయ్యాలి. అలాగే, పది మంది కలిసి, కొంత భూమి మీద పంటలు పండించుకుని, ఆ పంటని అందరూ తీసుకోవచ్చు. వాళ్ళందరూ కలిసి కొన్ని ఇళ్ళు కట్టుకుని, ఆ ఇళ్ళలో అందరూ నివసించవచ్చు. అలాగే, ఏ అవసరం తీరాలన్నా, భూమిని ఉపయోగించుకోవచ్చు. కానీ, అప్పుడు కూడా అది ఎవరి ఆస్తీ అవదు. ఒక తరం మనుషులు వృద్ధులై గతించిపోయాక, ఇంకో తరం మనుషులు ఆ భూమినే వాడుకోవాలి కదా? కాబట్టి, దాన్ని పాడు చెయ్యకూడదు. 'ఇది నా ఆస్తి' అని దాన్ని ఎవరూ ఆక్రమించకూడదు.

కానీ, బానిస యజమానులు, ఏ నాడో, వందల, వేల సంవత్సరాల కిందటే, భూమినంతా తమ స్వంత ఆస్తులుగా, ఎవరికి దొరికింది వాళ్ళు ఆక్రమించేశారు. భూమినే

కాదు, ఆ భూమి మీద శ్రమలు చెయ్యడానికి, తోటి మనుషుల్ని కూడా తమ ఆస్తిగా బంధించేశారు. ఆ బంధాల్లో పడ్డ మనుషులే బానిసలు. అంటే, బానిస యజమాని అనేవాడు, ( 1 ) భూమికి యజమాని, ( 2 ) బానిసలకు కూడా యజమాని. - ఈ రెండూ ఘోరమైన తప్పులే. - ఈ తప్పులు ఏ నాడో జరిగిపోయాయి.

[ ఈ నాటికీ, ఆ తప్పుల్లో మొదటి తప్పు ఇంకా జరుగుతూనే వుంది.]

ఏ వస్తువు తయారవ్వాలన్నా, ఏ శ్రమ జరగాలన్నా, మొదట భూమి కావాలి. భూమి ఇచ్చే సహజ పదార్థాలే - ముడి పదార్థాలుగా, పనిముట్లుగా, తయారవుతాయి. వస్తువుల్ని తయారుచేసే పనిస్థలాలూ, ఇళ్ళూ, రోడ్లూ - ఏది కావాలన్నా, భూమి కావాలి. అలాంటి భూమి -ఒక పనిముట్టు! ఒక సాధనం! 'విలువ' లేకుండా దొరికే సాధనం!

వస్తువుల్ని, 'ఉత్పత్తులు' అనవచ్చు. ఉత్పత్తి అయ్యేవి - ఉత్పత్తులు. ఉత్పత్తులు తయారవడానికి భూమి, ఒక సాధనం కాబట్టి, భూమిని, 'ఉత్పత్తి సాధనం' అనాలి. ఉత్పత్తుల్ని ( వస్తువుల్ని ) తయారుచేసే బానిసలు - ఉత్పత్తిదారులు.

బానిస యజమాని, భూమినీ, బానిసల్నీ తన ఆస్తులుగా ఆక్రమించడం అంటే, ( 1 ) ఉత్పత్తి సాధనాన్నీ, ( 2 ) ఉత్పత్తిదారుల్నీ - ఈ రెంటినీ ఆక్రమించినట్టు అర్థం.

'భూమి' అంతా, బానిస యజమానుల ఆస్తి!


బానిసలకు ఉత్పత్తి సాధనం అయిన భూమి వుండదు. భూమి దాకా ఎందుకు? వాళ్ళ శరీరాల మీదే వాళ్ళకు హక్కులు వుండవు. ఆవుల్నీ, గేదెల్నీ అమ్మినట్టూ, కొన్నట్టూ, బానిస యజమానులు, బానిసల్ని అమ్మవచ్చు ; కొనవచ్చు ; ఆగ్రహం మితి మీరితే, చంపవచ్చు కూడా! అది నేరం అవదు. బానిసలు, యజమాని ఆస్తి కాబట్టి, ఎవరి ఆస్తిని వాళ్ళు ఏమైనా చేసుకోవచ్చు!

" ఈ భూమి మాది" అని చెప్పే యజమాని, ఆ భూమి మీద ఏదైనా శ్రమ చేస్తాడా? పంటలు పండించుకుంటాడా? - ఆ కుటుంబ సభ్యులు, ఇంటా బైటా,



ఏ శ్రమలూ చెయ్యరు. తోటి మనుషుల్ని, బానిసలుగా చేసింది, మొత్తం శ్రమలన్నీ తప్పించుకోవడానికే.

బానిసల్లో స్త్రీలూ పురుషులూ పిల్లలూ అందరూ, యజమాని కుటుంబం కోసమే శ్రమలు చేస్తారు. శ్రమలన్నీ జరగడానికి అవసరమైన ముడి పదార్థాలూ, పనిముట్లూ, సహాయక పదార్థాలూ అన్నీ, బానిసలు చేసేవే. ఈ ఉత్పత్తి సాధనాలన్నీ



కూడా యజమాని ఆస్తే! బానిసలు, యజమాని ఆస్తిగా వున్న భూమి మీద వ్యవసాయం చేసి పంటలు పండిస్తారు. పశువుల్ని పెంచుతారు. బళ్ళు తోలుతారు. యజమానుల్ని కూర్చోబెట్టి పల్లకీలు మోస్తారు. యజమాని ఇంటిలో జరగవలసిన గృహ శ్రమలన్నీ చేస్తారు. యజమానుల పిల్లల్ని పెంచుతారు. ఈ పనీ, ఆ పనీ అని కాదు. యజమాని కుటుంబం సౌఖ్యాలతో జీవించడానికి ఎన్ని శ్రమలు,



ఎలాంటి శ్రమలు అవసరమో, అన్నీ రాత్రింబవళ్ళూ చేస్తూనే వుంటారు.

అన్ని శ్రమలు చేసే బానిసలకు ఆ శ్రమలకు బదులుగా అందేది ఏమిటి? - కొన వూపిరితో బతికి వుండడానికి పిడికెడు తిండీ, చింపిరి గుడిసే, అంతే! అది అయినా ఎందుకు అందుతుందంటే, వాళ్ళు బతికి వుండకపోతే, వాళ్ళు చేసే శ్రమలన్నీ యజమానులే చేసుకోవాలి కాబట్టి. బానిసలు బతికి వుండవలసింది, బానిసల కోసం కాదు, యజమానుల కోసమే! బానిసలు బతకడం, యజమానులకే అవసరం. ఎద్దులకు మేత పెట్టడం లాంటిదే, బానిసలకు తిండి పెట్టడం.

'శ్రమని దోచడం' అంటే ఏమిటో ఇంకా ఈ పాఠంలో చూడలేదు. అది, బానిస యజమానులతోనే ప్రారంభమవుతుంది. దీన్ని తర్వాత పాఠంలో చూస్తాం.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. 'ఆస్తి' అంటే ఏమిటి?

**జ**: భూమీ, ఇతర ఉత్పత్తి సాధనాలూ, డబ్బూ, ఇల్లూ, ఇంట్లో వస్తువులూ, వెండి - బంగారాల నగలూ - వీటిలో ఏది వున్నా 'ఆస్తే'.
శ్రమతో తయారైనదంతా ఆస్తే.

**2**.



ఇది ఆస్తి యేనా?

**జ**: భవనం, శ్రమతో తయారవుతుంది. కాబట్టి, ఆస్తే.

**3**. బానిస యజమానికి వుండే ఆస్తి ఏమిటి?

**జ**: వందల, వేల ఎకరాల భూమీ ; ఆ భూమిని సాగు చేసే వందల మంది బానిసలూ. అంటే, ఉత్పత్తి సాధనాలూ, ఉత్పత్తిదారులూ - ఈ రెండూ బానిస యజమానికి ఆస్తి.

**4**. 'బానిసత్వం' ఎలా ప్రారంభమై వుంటుంది? క్లుప్తంగా చెప్పగలరా?

**జ**: దీనికి, ఒక్కో దేశంలో ఒక్కో చరిత్ర ఉంటుంది. అయినా, అన్ని చరిత్రల సారాంశమూ ఒకటే. వెనకటి ఆటవిక దశల్లో, మనుషులు, గణాలుగా, తెగలుగా, గుంపులుగా జీవించేవారు. నీళ్ళ మడుగుల్నీ, పళ్ళ చెట్లనీ, జంతువుల్నీ వెతుక్కుంటూ తిరిగేవారు. అలాంటి దశల్లో, ఒక తెగ మనుషులు, దూరంగా వుండే ఇంకో తెగ మనుషుల మీద దాడులు చేసి, వాళ్ళని చంపేసి, ఆ ప్రాంతాన్ని ఆక్రమించేవారు. ఆ నాడు అవి జంతువుల దాడుల లాంటివే. క్రమంగా, ఆ దాడుల్లో దొరికిన 'శతృవుల్ని' చంపడం మానేసి, వాళ్ళతో శ్రమలు చేయించుకునే మార్గం కనిపెట్టారు. బానిసత్వం అలా ప్రారంభమైనట్టు, చరిత్రలన్నీ చెపుతున్నాయి. ★

# 36. బానిస యజమానుల వికృత సంస్కృతి!

ఒక బానిస యజమాని కుటుంబానికి, వెయ్యి ఎకరాల భూమి వుందనుకుందాం. అందులో పంటలు పండాలంటే, విత్తనాలూ, ఎరువులూ, పనిముట్లూ వంటి ఖర్చుల కోసం - 50 ఎకరాల్లో పంట అనుకుందాం. మొత్తం వెయ్యి ఎకరాల్లో పని చేసే బానిసలు, 100 కుటుంబాల వాళ్ళు. వాళ్ళ పోషణ కోసం ఖర్చు - 150 ఎకరాల్లో పంట. ఒక్కొక్క బానిస కుటుంబానికీ, ఒకటిన్నర ఎకరాల పంట.

**పంట వివరాలు :**

| | |
|---|---|
| మొత్తం పంట - | 1,000 ఎకరాల పంట. |
| సాగు ఖర్చు---- | 50 ఎకరాల పంట |
| బానిసల శ్రమ - | 950 ఎకరాల పంట. |
| బానిసల పోషణ - | 150 ఎకరాల పంట. |
| భూస్వామికి - | 800 ఎకరాల పంట. |

ఇది, బానిసల శ్రమలో భాగమే.

యజమానులు ఏ శ్రమలూ చెయ్యరు; బానిసలే అన్ని శ్రమలూ చేస్తారు. అంటే, బానిసలకూ, యజమానులకూ మధ్య జరిగే అసలు విషయం ఏమిటి? - ఏ శ్రమలూ చెయ్యని యజమానుల కుటుంబాలు కూడా బతికి వుండగలుగుతున్నాయి అంటే, అది ఎలా జరుగుతోంది? బానిసల శ్రమ తోనే! బానిసలు చేసే శ్రమల వల్ల రక రకాల ఉత్పత్తుల రాసి తయారవుతూ వుంటుంది. ఆ రాసిలో నించి బానిసలు కనీస పోషణ కోసం ఖర్చయ్యే భాగం పోగా, మిగిలినదంతా యజమాని కుటుంబానిదే అవుతుంది. బానిసలు, ప్రతి రోజూ 18 గంటల సేపు రక రకాల శ్రమలు చేసి, ఆ శ్రమలో నించి 2 గంటల శ్రమని మాత్రమే తమ పోషణ కోసం పొందితే, మిగిలిన 16 గంటల శ్రమ ఏమవుతుంది? - అది, యజమాని కుటుంబానికే.

ఒక యజమాని దగ్గిర వుండే బానిసలు రోజూ 18 గంటల కాలం శ్రమలు చేసి, 2 గంటల శ్రమ వల్ల వచ్చేటంత తక్కువ ఉత్పత్తిని తమ పోషణ కోసం వాడతారనుకుందాం. మిగిలిన 16 గంటల శ్రమ ఏమిటి? - ఇది, అదనపు శ్రమ. అదనంగా చేసిన శ్రమ. దేని కన్నా అదనంగా? - బానిసలు తమ పోషణ కోసం వాడుకునే దాని కన్నా అదనంగా. బానిసలు, 1 రోజుకి, 2 గంటల శ్రమని మాత్రమే వాడుకుంటున్నప్పుడు, 18 గంటల శ్రమ ఎందుకు చెయ్యాలి? - చెయ్యాలి, అంతే. యజమాని కుటుంబం సుఖ విలాసాలతో బతకడానికి, బానిసలు చాలా అదనంగా శ్రమ చెయ్యాలి.

వెయ్యి ఎకరాల ఉదాహరణలో, బానిసలు చేసిన మొత్తం శ్రమ, ఎన్ని ఎకరాల పంట? - వాళ్ళ పోషణ కోసం అందేది - 150 ఎకరాల పంట + యజమాని కుటుంబానికి పోయేది 800 ఎకరాల పంట = 950 ఎకరాల పంట.

దీని అర్థం ఏమిటి? - బానిసల శ్రమలో నించి, ఎంతో ఎక్కువ భాగాన్ని యజమాని తీసేసుకుంటున్నాడని అర్థం. ఇది, బానిసల శ్రమని దోచడం. ఇది, 'శ్రమ దోపిడీ'!

ఇలా 'శ్రమని దోచే పద్ధతి' వేల సంవత్స రాల కిందట, బానిసల కాలంలోనే మొద లైంది. యజమానుల కుటుంబాలన్నీ, ఈ శ్రమని దోచే విధానంతోనే జీవించాయి.

బానిసలైతే, వారి శ్రమతోనే వారు జీవిస్తారు. వారు 18 గంటలు శ్రమ చేసి,



అందులో నించే తమ పోషణ కోసం కొంత శ్రమని పొందుతున్నారంటే, వారు జీవించేది, తమ స్వంత శ్రమ తోనే. ఇతరుల శ్రమతో కాదు. ఇతరుల శ్రమని దోచడం ద్వారా కాదు.

యజమానులయితే, ఏ శ్రమా చెయ్యకుండా బానిసల శ్రమని దోచి జీవిస్తారు. అంటే, యజమానుల కుటుంబాల్ని బానిసలే పోషిస్తున్నారన్నమాట! యజమానులూ, వాళ్ళ భార్యలూ, వాళ్ళ పిల్లలూ, వాళ్ళ గుర్రాలూ కుక్కలూ నక్కలూ అన్నీ, బానిసల శ్రమల ద్వారానే బతుకుతున్నాయి. కానీ, ఇది పైకి చాలా తల్లకిందులుగా కనపడుతుంది - యజమానులే బానిసల్ని పోషిస్తున్నట్టు! యజమానుల వల్లే బానిసలు బతుకుతున్నట్టు!

యజమానులు జీవించడానికి కావలసిన శ్రమలన్నీ బానిసలే చేస్తే, మరి యజమానులేం చేస్తారు? - ఏమీ చెయ్యరు. వాళ్ళు, యజమానులయ్యేది, ఏమీ చెయ్యకుండా జీవించడానికే. వాళ్ళు, 'తినడం' ఒక్కటే చేస్తారు.

తిళ్ళు తింటూ, నిద్రలు పోతూ, ఎవరైనా రోజంతా ఎలా గడుపుతారు? ఏ పనులూ చెయ్యని వాళ్ళకి రోజులన్నీ ఎలా గడుస్తాయి? - బ్రహ్మాండంగా గడుస్తాయి! యజమానులు, తమ కాలక్షేపాల కోసం అనేక దారులు ఏర్పర్చుకున్నారు. విలాసాలు, వ్యసనాలు, జూదాలు, వేటలు, కుక్కలతో నక్కలతో ముచ్చట్లు, ఎద్దులతో గుర్రాలతో పోటీలు, ఊళ్ళ వెంట రికామీగా తిరగడాలు - ఇదీ అదీ అని కాదు ; వాళ్ళు అనేక రకాల కాలక్షేపాలు కనిపెట్టుకున్నారు.



యజమానులు బానిసలతో కూడా పందేలు ఆడిస్తారు. ఆ పందేల్లో బానిసలు, ఒకళ్ళని ఒకళ్ళు పొడుచుకుని, రక్తాలు కారుతూ కింద పడి చచ్చిపోవాలి. యజమాని కుటుంబాల స్త్రీలూ, పురుషులూ అందరూ, పోటీల్లో జంతువులు పడే బాధనీ, బానిసలు పడే బాధనీ చూస్తూ ఆనందిస్తారు. ఏ శ్రమా చెయ్యకుండా కాలం గడిపే యజమానుల జీవిత విధానం అది. జాలీ, దయా, కరుణా, మానవత్వం - అనే మాటలూ, ఆ ఆలోచనలూ,

ఆ అనుభూతులూ, ఆ నాటికి ఇంకా పుట్టలేదు.

యజమాని కుటుంబాల స్త్రీల కైతే, రోజంతా అలంకారాలూ, నగలు మార్చి మార్చి చేయించుకోవడాలూ - వంటి అదనపు కాలక్షేపాలెన్నో వుంటాయి. - మొత్తం మీద, యజమానుల కుటుంబాల్లో, విలాసాలూ వ్యసనాలే వాళ్ళ జీవిత విధానం అయిపోతుంది. అదే వాళ్ళ 'సంస్కృతి' అయిపోతుంది. 'మానవ సమాజం' లో, విలాసాలూ, వ్యసనాలూ అనే విధానాలు, బానిస యజమానుల



కాలక్షేపాల కోసమే, ఆ నాటి నించే మొట్ట మొదట పుట్టుకొచ్చాయి.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ఒక బానిస యజమాని భూమి ఆస్తి 1,000 ఎకరాలు. అందులో, ధాన్యం పంటలూ, పళ్ళ తోటలూ, విహార స్థలాలూ, పశువుల మందలూ అన్నీ ఉన్నాయి. వేరు వేరు శ్రమల ఫలితాల్ని కూడా 'ధాన్యం' గా చెప్పుకుందాం. ఆ పనులన్నీ జరిగి వెయ్యి ఎకరాల్లో పంటలు పండాలంటే, ఉత్పత్తి సాధనాల ఖర్చు - 50 ఎకరాల పంట. ఒక సంవత్సర కాలంలో, వెయ్యి ఎకరాల ద్వారా వచ్చిన పంట అంతా బానిసల శ్రమేనా?

**జ** : వెయ్యి ఎకరాల్లో పంట పండడానికి, నాగళ్ళూ, విత్తనాలూ, వంటి వాటి కోసం 'ఎంత ఖర్చు' అయిందో అది, 'ఉత్పత్తి సాధనాల' ఖర్చు. ప్రతీ సంవత్సరంలోనూ 'ఉత్పత్తి సాధనాల ఖర్చు' ని తీసివెయ్యగా వుండే రెండో భాగమే బానిసల శ్రమ. ఉత్పత్తి సాధనాలన్నీ కూడా బానిసలు చేసేవే అయినా, ఆ శ్రమ, ఎప్పుడూ - గత శ్రమ. ఒక సంవత్సరంలో వెయ్యి ఎకరాల ద్వారా వచ్చిన పంటలో నించి, ఉత్పత్తి సాధనాల ఖర్చుని తీసివెయ్యగా మిగిలినదే, ఆ సంవత్సరపు బానిసల శ్రమ. అది 950 ఎకరాల పంట.

**2**. 'బానిసల శ్రమ ఫలితం' అంటే ఏమిటి?

**జ** : బానిసలు శ్రమలు చేస్తారు. ఉత్పత్తులు వస్తాయి. ఆ ఉత్పత్తుల రాసి లో నించి, ఆ శ్రమలు జరగడం కోసం అవసరమైన ఉత్పత్తి సాధనాల ఖర్చుని తీసెయ్యాలి. అది గాక, మిగిలిన ఉత్పత్తి అంతా బానిసల శ్రమ ఫలితం.


**3**. వ్యవసాయ శ్రమ జరగడానికి, పారలూ, గునపాలూ, నాగళ్ళూ వంటి అనేక ఉత్పత్తి సాధనాలు కావాలి. ఆ ఖర్చు ఎవరిది?

**జ** : ఆ ఉత్పత్తి సాధనాలన్నీ యజమాని ఆస్తిగానే ఉంటాయి. కానీ, ఆ పనిముట్లని చేసేది బానిసలే. వెనకటి బానిసల శ్రమతో తయారైనవే అవన్నీ. అవి పాత బడి పోతూ వుంటే, అప్పుడు వున్న బానిసలు మళ్ళీ వాటిని చేస్తూ వుంటారు. అయితే, మనం ఒక సంవత్సరపు వ్యవసాయాన్ని చూసేటప్పుడు, అక్కడ ఖర్చయ్యే ఉత్పత్తి సాధనాలు, ఆ సంవత్సరంలో పనిచేసే బానిసలు చేసేవి కాదు. అప్పటికే తయారై వున్న ఉత్పత్తి సాధనాలతో, ⟶

బానిసలు పని చేస్తారు. ఉత్పత్తి సాధనాలు ఎప్పుడూ యజమాని ఆస్తిగా వుంటాయి. కానీ, అవి బానిసల శ్రమతో తయారయ్యేవే.

**4**. యజమానికీ, బానిసలకూ వుండే సంబంధాలు ఏమిటి?

**జ**: అవి, 'శ్రమ సంబంధాలే'. శ్రమలు చేసేది బానిసలే. శ్రమలు చెయ్యకుండా, బానిసల శ్రమలతో జీవించేది - యజమానులు. ఇవి, కుండల రామయ్యకీ, చెప్పుల సోమయ్యకీ వుండే రకం సంబంధాలు కావు.



బానిసకూ, యజమానికీ వుండే సంబంధం ఇదే.

**5**. 'బానిసలకు' వేరే పేర్లు ఉన్నాయా?

**జ**: యజమానుల కుటుంబాలకు బానిసలే సేవలు చేస్తారు కాబట్టి, వారు - సేవకులు. శ్రమలన్నీ వారే చేస్తారు కాబట్టి, వారు - శ్రామికులు. ఉత్పత్తి అంతా వారి ద్వారానే జరుగుతుంది కాబట్టి, వారు - ఉత్పత్తిదారులు. కానీ, ఈ వేరు పేర్ల వల్ల, 'బానిసత్వం' అనే స్తితి కనపడదు. 'బానిసలు' అనే మాట వల్లనే, 'వారు, యజమాని ఆస్తిగా వున్న వారు' అని తెలుస్తుంది. 'సేవకులు, శ్రామికులు, ఉత్పత్తిదారులు' అనే మాటల వల్ల, 'వారు, యజమాని ఆస్తి' అని తెలియదు. కాబట్టి, బానిసల్ని, బానిసలే అనాలి.

**6**. బానిసలకూ, యజమానులకూ వున్న సంబంధాల్ని, 'అసమాన శ్రమ సంబంధాలు' అనాలా?

**జ**: ఈ సంబంధాలకు, అంత చిన్న మాట చాలదు. బానిసలు, యజమానుల 'స్వంత ఆస్తి'! ఒక మనిషి, ఇంకో మనిషి ఆస్తి! అంత క్రూర, నీచ శత్రు సంబంధాలు అవి!

**7**. 'శ్రమ దోపిడీ' అంటే?

**జ**: శ్రమ చెయ్యకుండా ఇతరుల శ్రమతో జీవించడం! ఇతరుల శ్రమని దోచడం! యజమానులు, తమ స్వంత శ్రమలు లేకుండా, బానిసల శ్రమల తోనే జీవించడం! ఏ శ్రమా చెయ్యని మనుషులు కూడా జీవించగలుగుతున్నారంటే, ఇతరుల శ్రమని వాడుతున్నారని అర్థం.

**8**. బానిస యజమాని శ్రమ చెయ్యడు. బానిసలే శ్రమ చేస్తారు. అలాంటప్పుడు, బానిసలకూ, యజమానికీ వున్న సంబంధం, 'శ్రమ సంబంధం' ఎలా అవుతుంది?

**జ**: యజమాని శ్రమ చెయ్యకపోయినా, శ్రమతో వచ్చిన ఉత్పత్తుల్ని వాడుకోకుండా జీవించడు. బానిసల శ్రమనే వాడుకుంటాడు. కాబట్టి, ఆ ఇరు పక్షాలకూ వున్నది శ్రమ సంబంధమే. అయితే, ఇది దోపిడీ జరిగే శ్రమ సంబంధం. ఇరు పక్షాల వారూ శ్రమలు చేస్తూ ఒకరి ఉత్పత్తుల్ని ఒకరు మార్చుకుంటే, అదీ శ్రమ సంబంధమే ; ఒక పక్షం వాళ్ళు శ్రమ చెయ్యకుండా, రెండో పక్షం శ్రమని వాడుకుంటూ జీవిస్తే, అదీ శ్రమ సంబంధమే. మొదటిది, సమానుల మధ్య శ్రమ సంబంధం. రెండోది, యజమాని, బానిసల్ని దోపిడీ చెయ్యడం ద్వారా ఏర్పడే సంబంధం.

**9**. కొందరు మనుషులు ఏ శ్రమలూ చెయ్యరు. కానీ, వాళ్ళు కూడా అన్నం తింటారు. బట్టలు కడతారు. ఇళ్ళల్లో నివసిస్తారు. బళ్ళల్లో తిరుగుతారు. ఇది ఎలా సాధ్యం?

**జ**: ఇతరుల శ్రమలతో తయారయ్యే ఉత్పత్తుల ద్వారా. ★

# 37. పేద - ధనిక తేడాల కారణం!

శ్రమలు చేసే మనుషులకు 'కూలి ఇవ్వడం, జీతం ఇవ్వడం' అనే మాటలు, బానిసల కాలంలో ఇంకా ప్రారంభం కాలేదు. కానీ, 'కూలి' అనే మాట ఆ నాడు లేకపోయినా, బానిసల శ్రమలో నించి వారి పోషణ కోసం అందేదే వారికి 'కూలి' అవుతుంది.

ఈ విషయాలు ఇంత వివరంగా ఎందుకు చూస్తున్నామంటే, బానిసల కాలం తర్వాత కూడా అదే కొనసాగుతోంది. ఈ నాడు కూడా జరుగుతున్నది అదే. ఈ నాడు శ్రమలు చేసే వారికి, 'బానిసలు' అనే పేరు వుండదు. కానీ, మిగిలినదంతా అదే. 'శ్రమ దోపిడీ' ప్రారంభమైనది బానిసల కాలంలోనే కాబట్టి, దాన్ని సరిగా అర్థం చేసుకుంటే, తర్వాత, దశల్లో జరిగే విషయాలు తేలిగ్గా అర్థమైపోతాయి. అందుకే ఇక్కడ ఈ వివరాలన్నీ చూడాలి.

బానిసలు, యజమానికి ఏం ఇస్తారు? - రోజూ 18 గంటల శ్రమని ఇస్తారు. ఆ శ్రమ వల్ల తయారైన ఉత్పత్తుల రాసిని ఇస్తారు.

మరి, యజమాని బానిసలకు ఏం ఇస్తాడు? - బానిసలు తయారుచేసిన ఆ 18 గంటల ఉత్పత్తుల్లో నించే 2 గంటల ఉత్పత్తుల్ని తీసి బానిసలకు ఇస్తాడు.


ఇది, బానిసలకూ, యజమానికీ మధ్య జరిగే 'మారకమా?' - కాదు. ఇది 'మారకం' అవదు. 'మారకం' అంటే, 2 పక్కలా శ్రమ చేసే మనుషులు ఉండాలి. లేదా, వాళ్ళు తయారుచేసే వస్తువులు ఉండాలి. ఒక వేపు, రామయ్య చేసిన కుండా, ఇంకో వేపు సోమయ్య చేసిన చెప్పులూ వుంటే, అది 'మారకం'. లేదా, క్షవరాలు చేసే మనిషీ, వైద్యం చేసే మనిషీ, ఒకరి కోసం ఒకరు శ్రమ చేసి పెడితే, అది 'మారకం'. కానీ, బానిసకీ, యజమానికీ జరిగేది శ్రమల మారకమూ కాదు, వస్తువుల మారకమూ కాదు. శ్రమలు చేసేది ఎప్పుడూ బానిసలే. యజమాని చేసే శ్రమ ఏదీ వుండదు. యజమాని చేసేది ఏమిటంటే, బానిసలు చేసే ఉత్పత్తుల రాసినంతా మొదట తన ఆధీనంలోకి తీసుకుంటాడు. అందులో నించే చిన్న భాగం తీసి, దాన్ని బానిసలకు ఇస్తాడు. మిగిలినదంతా తన కోసం! ఇక్కడ జరిగేది, బానిసల శ్రమని లాగడమే. అంతేగానీ తన శ్రమని బానిసలకు ఇచ్చి, దానికి బదులుగా బానిసల శ్రమని తను తీసుకోవడం కాదు. ఇది, 'మారకం' కాదు.

బానిసలు చేసిన 18 గంటల శ్రమలో నించి, వారి పోషణ కోసం 2 గంటల శ్రమ పోగా, మిగిలిన 16 గంటల శ్రమకి ఒక పేరు వుంటుంది. దాన్ని వెనక పాఠంలో కూడా చూశాం. అది, 'అదనపు శ్రమ.' అదనంగా జరిగిన శ్రమ. 'అదనంగా' అంటే, దేని కన్నా అదనంగా? - వాళ్ళకు అందిన దాని కన్నా అదనంగా. 2 గంటల శ్రమ కన్నా అదనంగా వున్నది, 16 గంటల శ్రమ కదా? అదే, 'అదనపు శ్రమ.' ఆ 16 గంటల అదనపు శ్రమతో వచ్చే ఉత్పత్తులన్నీ, బానిసల యజమానికి 'ఆదాయం.' ఆ ఆదాయం, యజమానికి, స్వంత శ్రమ వల్ల వచ్చేది కాదు.

యజమానికి పోయిన ఆ 16 గంటల శ్రమలో నించి ఒక్క గంట శ్రమ అయినా, యజమానికి పోకుండా అది అంతా బానిసలకే అందితే, అప్పుడు వారి జీవితం ఎలా వుండేది? - అలా జరిగితే, అప్పుడు బానిసలు, బానిసలే అవరు. అప్పుడు వారు, అసలు అంత శ్రమ చెయ్యనక్కర లేదు. వారు, యజమానుల దగ్గిర, 2 గంటల శ్రమతోనే బతికి వుండగలుగు తున్నారు. కానీ ఆ బతకడం చాలా బికారిగా బతకడం. అలా గాక, కొంచెం సుఖంగా బతకడానికి రోజుకి 6 గంటల శ్రమ సరి పోతుందనుకుందాం. అప్పుడు, అంత శ్రమ చేస్తే చాలు. అంత కన్నా ఎక్కువ శ్రమ చెయ్యనక్కరలేదు.



యజమాని. శ్రమ చెయ్యని ధనికుడు



బానిస. ధాన్యం పండిస్తాడు. నిరుపేద


ఒక సంవత్సర కాలంలో బానిసలు చేసే శ్రమలన్నిటినీ కలిపి, 'ధాన్యం' రూపంతో చూద్దాం.

బానిసల శ్రమ అంతా - 100 బస్తాల ధాన్యం. బానిస కుటుంబాల పోషణకు అందేది - 10 బస్తాల ధాన్యం. యజమానికి పోయేది - 90 బస్తాల ధాన్యం.

బానిసల శ్రమ వల్ల వచ్చిన ధాన్యం అంతా బానిసలకే అందితే?

రోజూ 18 గంటల శ్రమ చేసి, అందులో నించి 16 గంటల శ్రమని పోగొట్టుకోవడం వల్లే, బానిసలు నిరుపేదలై బతుకుతారు. వారి పేదతనానికి కారణం, వారి శ్రమ అంతా వారికి అందకపోవడమే. బానిసల శ్రమ, యజమానికి అందడమే, యజమాని సిరి సంపదలకు కారణం.

బానిసలు చేసే శ్రమలో నించి, వారి పోషణకు అందే శ్రమ ఎంత వుండవచ్చో, ఒక బొమ్మ ద్వారా చూద్దాం.




ఇది అంతా బానిసలు ఒక రోజు చేసిన శ్రమ.
1. బానిసల ఒక రోజు పోషణ.
2. బానిసల ఒక రోజు అదనపు శ్రమ.

బానిసలు, తమకు కావలసినంత శ్రమ మాత్రమే చేసుకుంటే, వారి నించీ యజమానులకు ఏమీ రాదు కదా? అప్పుడు యజమానులు బతికేది ఎలాగ? - ఇంకా 'యజమానులు' ఏమిటి? బానిసలు, బానిసలు కానప్పుడు, యజమానులు కూడా యజమానులు కారు గదా? వాళ్ళు, బతకడానికి, వాళ్ళే శ్రమలు చేసుకోవాలి. వాళ్ళు కూడా శ్రమలు చేస్తే, వాళ్ళు ఇతరుల శ్రమని దోచే తప్పు చెయ్యనక్కరలేదు. వాళ్ళు ఇక యజమానులుగా వుండనక్కర లేదు. యజమానులుగా వుంటూ, తోటి మనుషుల్ని బానిసలుగా మార్చి, వాళ్ళని కొంటూ, అమ్ముతూ, చంపుతూ, క్రూర జంతువుల్లా బతకనక్కరలేదు.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**.బానిసల కాలంలో, యజమాని, బానిసలకు 'కూలి' ఇచ్చే పద్ధతి లేదు. బానిసలు ఎలా బతికారు?

**జ** : యజమాని, బానిసలకు కొంత ధాన్యమూ, కొన్ని ఇతర పదార్థాలూ →

ఇస్తాడు. అదే బానిసలకు పోషణగా ఉంటుంది. దానికి 'కూలి' అనే పేరు లేకపోయినా, అది కూలే. అది అందడం వల్లనే బానిసలు కొంత కాలమైనా జీవిస్తారు.

**2**. బానిసకూ, యజమానికీ మధ్య జరిగేది మారకమా?

**జ**: కాదు. 'మారకం' అంటే, రెండు వేపులా శ్రమలనో, వస్తువులనో, మార్చుకోవడం జరగాలి. బానిసలు, యజమానికి, రోజూ శ్రమ ఇస్తారు. దానికి బదులుగా, యజమాని బానిసలకు తన శ్రమనో, తను తయారుచేసిన వస్తువులనో ఇస్తాడా? యజమాని ఇచ్చేది ఏమీ ఉండదు. బానిసల శ్రమ వల్ల తయారైన ఉత్పత్తుల రాసి నించే, అతి చిన్న భాగాన్ని తీసి యజమాని, బానిసల పోషణ కోసం ఇస్తాడు. బానిసలు బతికి వుంటేనే మళ్ళీ శ్రమ చెయ్యగలుగుతారు కాబట్టి. బానిసలకు పోషణగా అందేది, బానిసల శ్రమలో భాగమే. అది పోగా మిగిలిన శ్రమ అంతా (ఆ ఉత్పత్తి అంతా) యజమానికే. బానిసలకూ యజమానికీ మధ్య జరిగేది, 'శ్రమల మారకం' కాదు ; శ్రమల దోపిడీ!

**3**. బానిసల కాలంలో యజమానుల ద్వారా ప్రారంభమైన 'శ్రమ దోపిడీ' గురించి బానిసలకూ, యజమానులకూ తెలుసా?

**జ**: ఎవరికీ తెలీదు. 'బానిసలు యజమాని ఆస్తి' అని యజమానులు అనుకున్నారు. బానిసలతో పనులు చేయించుకోవడం తమ హక్కు అనుకున్నారు. బానిసలకు కూడా అంత కన్నా తెలీదు. కానీ యజమానులకు, వాళ్ళు చేసే క్రూరత్వాలు వాళ్ళకి తెలుసు. ఆ క్రూరత్వాల వల్ల, బానిసలు భయంకరమైన బాధలు పడ్డారు.

**4**. పేదరికమూ, సిరి సంపదలూ - అనే వాటికి కారణం ఏమిటి?


**జ**: 'శ్రమ దోపిడీ'! ఒక బానిస చేసే శ్రమ వల్ల వచ్చే ఉత్పత్తి అంతా ఆ బానిసకే అందితే, ఆ ఉత్పత్తితో అతను ఎంతో హాయిగా ఉండగలడు. అంత ఉత్పత్తితో అవసరం లేకపోతే, శ్రమని తగ్గించుకోగలడు. కానీ, అతని శ్రమలో అత్యధిక భాగం, అతనికి దక్కకుండా పోతే, అతను తినడానికి ఏం ఉంటుంది? అదే పేదరికం. బానిసల పేదరికం, బికారుల స్థాయిలో ఉంటుంది. బానిసల శ్రమలతో తయారైన ఉత్పత్తి అంతా యజమానులకే అందుతూ వుంటే, అదే - సిరి సంపదలు! శ్రమ చేసే మనుషులు, పేదరికంలో వున్నారంటే - అక్కడ శ్రమ దోపిడీ ఉందని అర్థం. కొన్ని కుటుంబాల మనుషులు సిరి సంపదలతో ఉన్నారంటే, అక్కడ శ్రమ దోపిడీ ఉందని అర్థం!

**5**. ఒక ధనవంతుల ఇంట్లో, ఒక రాత్రి పూట దొంగ పడ్డాడు. కొంత డబ్బు ఎత్తుకు పోయాడు. అది శ్రమ దోపిడీయేనా?

**జ**: కాదు. అది, దొంగతనం. దొంగతనం కూడా, ఇతరుల శ్రమలతో తయారైన ఉత్పత్తులనో, డబ్బునో తీసుకోవడమే. స్వంత శ్రమ కాని దాన్ని తీసుకోవడమే. కాబట్టి, అది, నేరం. దొంగతనం చెయ్యడానికి ఎవరికీ హక్కు వుండదు. కానీ, 'శ్రమ దోపిడీ' అలాంటిది కాదు. దీన్ని పట్ట పగలే, బహిరంగంగానే చెయ్యవచ్చు. బానిసలతో శ్రమలు చేయించి, ఆ ఉత్పత్తులతోనే జీవించడానికి యజమాని కుటుంబానికి హక్కు ఉంటుంది. దొంగతనం ద్వారా కొంత డబ్బుని సంపాదిస్తే, కొన్నాళ్ళకి ఆ డబ్బు ఖర్చు అయిపోతుంది. కానీ శ్రమ దోపిడీ అలాంటిది కాదు. అది నిత్యం జరుగుతుంది. సంవత్సరాల తరబడీ, తరాల తరబడీ జరుగుతుంది. ★



# 38. శత్రు వర్గాలు!



కొందరు మనుషులు - బానిసలు.

కొందరు మనుషులు - యజమానులు.

మనుషులు ఇలా తేడాలుగా వుండడం, ప్రకృతి నియమం కాదు. అది, బానిస యజమానులుగా వున్న మనుషులు ఏర్పర్చిన నియమం.

బానిసలకూ, యజమానులకూ వుండే సంబంధం ఏమిటి? ఆ పక్షాల మధ్య వుండేవన్నీ శ్రమకు సంబంధించిన విషయాలే. కాబట్టి, అది, 'శ్రమ సంబంధం.'

యజమానుల వేపు జరిగేది - శ్రమని దోచడం.

బానిసల వేపు జరిగేది - శ్రమని పోగొట్టుకుంటూ, దోపిడీకి గురి అవడం.

ఈ సంబంధం, ఒక పూటతో, ఒక రోజుతో ఆగే వ్యవహారం కాదు. ఇది, 'వారసత్వపు హక్కు'గా ఉంటుంది. ఒక బానిస యజమాని మరణిస్తే, అతని ఆస్తి అంతా, అతని కుటుంబ సభ్యులకే చెందుతుంది. ఇక అప్పటి నించీ ఆ కుటుంబంలో వున్న కొడుకులూ కూతుళ్ళూ ఆ శ్రమ దోపిడీ సాగిస్తారు. బానిస స్త్రీ పురుషులు చచ్చిపోతే, వాళ్ళ పిల్లలు, బానిసత్వాన్ని కొనసాగిస్తారు.

యజమానుల కుటుంబాల ఆస్తి హక్కులూ, బానిసల బానిస జీవితాలూ, ఒక్క తరంతో అంతరించవు. అలా సాగుతూనే వుంటాయి.

బానిస సమాజంలో, శ్రమలు చేసే వారు బానిసలే కాబట్టి, ఆ బానిసల్ని 'శ్రామికులు' అని కూడా అనవచ్చు. వారు, ఆ కాలపు శ్రామికులు.

భూమీ, దాని మీద శ్రమలు చెయ్యడానికి కావలసిన పనిముట్లూ - అన్నిటి మీదా యజమానులదే హక్కు. ఆ పని ముట్లని చేసేది బానిసలే అయినా.

యజమానులందరూ కలిసి ఒక పక్షం. ఒక వర్గం. ఇది, శ్రమని దోచే వర్గం. బానిసలందరూ కలిసి - ఇంకో పక్షం. ఇంకో వర్గం. శ్రమనీ, ప్రాణాల్నీ పోగొట్టుకునే వర్గం. ఈ వర్గాలు, ఒక దానికి ఒకటి వ్యతిరేక వర్గాలు! ఈ వర్గాల మధ్య శత్రుత్వమే వుంటుంది. శ్రమ దోపిడీ వల్లనే, ఈ శత్రు వర్గాలు ఏర్పడతాయి.

ఈ శత్రుత్వాలు పోయి, మనుషులందరూ స్నేహ సంబంధాలతో జీవించాలంటే, శ్రమ దోపిడీయే పోవాలి. ప్రతి మనిషీ శ్రమ చెయ్యాలి. ఇతరుల శ్రమని దోచడం ద్వారా గాక, స్వంత శ్రమతో జీవించాలి. యజమాని తనాలూ, సేవకత్వాలూ వుండకూడదు. అప్పుడు, వాళ్ళ మధ్య శత్రుత్వం వుండదు. కానీ, మార్పు, శ్రామికులకు ఇష్టమవుతుంది గానీ, యజమానులకు ఇష్టం అవదు. బానిసలతో శ్రమలు చేయించుకుంటూ వుంటే, యజమానులు శ్రమలు చెయ్యకుండా జీవించవచ్చు కాబట్టి, వాళ్ళు శ్రమ దోపిడీని సాగించడానికే చూస్తారు.

యజమానులు, తమకు బానిసల వల్ల రోజూ దొరికే అనేక గంటల ఉత్పత్తుల్లో నించి కొన్నిటిని పోషణ కోసం వాడుకుంటారు. కొన్నిటిని ఇతర బానిస యజమానులకు అమ్మి, వాళ్ళ వస్తువుల్ని కొనుక్కుంటారు. కొంత డబ్బుతో ఆభరణాలూ, కొంత

డబ్బుతో విలాసాలూ, జూదాలూ, విహార యాత్రలూ చేస్తారు. అవన్నీ పోగా కూడా కొంత డబ్బుని బంగారు నాణాలుగా నిల్వ చేస్తారు. వాళ్ళ భూములూ, వాళ్ళ భవంతులూ, వాళ్ళ ఆభరణాలూ, వాళ్ళ బళ్ళూ గుర్రాలూ, వాళ్ళ ఇళ్ళల్లో దిట్టమైన సామానులూ, వాళ్ళ డబ్బు నాణాలూ, వాళ్ళ బానిసలూ - అవన్నీ కలిసే వాళ్ళ ఆస్తి!

ఒక బానిస యజమాని కుటుంబంలో వుండే బానిసలు, ఒకరో - ఇద్దరో కాదు. డజన్ల కొద్దీ, కొందరు యజమానుల దగ్గిర వందల కొద్దీ వుంటారు. యజమానుల భూమి ఆస్తి ఎంత పెద్దది అయితే, దాన్ని సాగు చెయ్యవలసిన బానిసల సంఖ్య అంత పెద్దదిగా వుంటుంది.

ఆ బానిసలు నిత్యం రాత్రింబవళ్ళూ శ్రమలు చేస్తూ వుంటే, ఆ శ్రమ, యజమానుల సిరి సంపదల్ని పెంచుతూ వుంటుంది. ఆ శ్రమని పోగొట్టుకోవడమే, బానిసల్ని బికారుల్ని చేస్తూ వుంటుంది. 'ధనికులూ - పేదలూ' అనే తేడాల రహస్యం అదే! అంటే, శ్రమ దోపిడీయే!

ఎవరి కోసం వాళ్ళే శ్రమ చేసుకుంటే, ఆ స్వంత శ్రమతో, సిరి సంపదలు కుప్ప తెప్పలుగా ఏర్పడవు. ఒక వ్యక్తి, తన దేహంతో, ఒక రోజులో చెయ్యగలిగే శ్రమ, ఒక్క రోజు సుఖంగా జీవించడానికే సరి పోతుంది. అది ఇంకా మిగిలిపోయి, దాని వల్ల ఆస్తులు కుప్ప తెప్పలుగా ఏర్పడేదేమీ వుండదు. అలా ఏర్పడడం ఎక్కడ జరుగుతుందంటే, 'యజమానులూ - శ్రామికులూ' అనే వర్గాలు వున్న చోటే జరుగుతుంది.

10 మంది శ్రామికుల్ని దోచుకుంటే, వాళ్ళ నించి వచ్చే అదనపు శ్రమ మరీ ఎక్కువ కాదు. ఆ శ్రామికులు 100 మంది అయితే, వారి నించి వచ్చే అదనపు శ్రమ ఇంకా ఎక్కువ. ఆ శ్రామికులు 1000 మంది అయితే, అది చాలా పెద్ద అదనపు శ్రమ. శ్రామికులు పెరిగిన కొద్దీ, వారి నించి వచ్చే అదనపు శ్రమ రాసి పెరుగుతుంది. అదే పెద్ద ఆస్తి అవుతుంది.

## ప్రశ్నలూ - జవాబులూ

**1**. చెట్లలో, వేప చెట్లు అనీ, మామిడి చెట్లు అనీ, అలా చాలా తేడాలు ఉంటాయి. మనుషుల్లో, బానిసలూ - యజమానులూ అనే తేడా, చెట్లలో తేడా లాంటి దేనా?

**జ**: కాదు. చెట్లలో తేడా, ప్రకృతి సహజమైన తేడా. మనుషుల్లోనూ, నల్లగా - తెల్లగా, వుండే తేడాలు, ప్రకృతి వల్ల వచ్చే తేడాలే. కానీ, బానిసలూ - యజమానులూ అనే తేడా, ప్రకృతి వల్ల వచ్చింది కాదు. ఇది, భూమిని ఆక్రమించుకోగలిగిన మనుషులు, యజమానులుగా మారి, శ్రమలు చెయ్యకుండా జీవించడం కోసం పెట్టిన నియమం.

**2**. బానిసలకు భూమి లేదా?

**జ**: మళ్ళీ మొదటికి వస్తే ఎలాగ? భూమి దాకా ఎందుకు, బానిసలకు వాళ్ళ ప్రాణాల మీదే వాళ్ళకు హక్కులు లేవు.

**3**. 'వర్గాలు' అంటే?

**జ**: వేరు వేరు పరిస్థితుల్లో వుండే మనుషుల బృందాలన్నిటినీ 'వర్గాలు' అనడం వుంది. దాని అర్థం వేరు వేరు 'పక్షాలు' అనీ, వేరు వేరు 'తరగతులు' అనీ. కానీ, ఇక్కడ మనం చెప్పుకునే వర్గాలు, 'శ్రమ దోపిడీ' వల్ల ఏర్పడే వేరు వేరు వ్యతిరేక పక్షాలు. శ్రమ చేసే బానిసలు - ఒక వర్గం. స్వంత శ్రమ లేని యజమానులు - ఇంకో వర్గం. ఇవి శత్రు వర్గాలు. ఈ వర్గాల మధ్య వున్న తేడా శతృత్వాలతో నిండినది. ★

# 39. 'ఆస్తి' గురించి రావలసిన ప్రశ్న!

'ఆస్తి' అనే దాన్ని గురించి ఎప్పుడూ ఒక ప్రశ్న రావాలి. ఆ ఆస్తి, స్వంత శ్రమ వల్ల ఏర్పడ్డదా, ఇతరుల శ్రమని దోచడం వల్ల ఏర్పడ్డదా? - అనే ప్రశ్న.

బానిస యజమానుల ఆస్తి అంతా, బానిసల శ్రమ వల్ల ఏర్పడేదే. స్వంత శ్రమ చేసే బానిసలకు ఏ ఆస్తీ వుండదు. భూమి గానీ, ఇతర పనిముట్లు గానీ, ఏమీ వుండవు. వాళ్ళ శరీరాలే వాళ్ళవి కావు.

**స్వతంత్ర ఉత్పత్తిదారులు :**

'బానిస సమాజం'లో వున్న జనాభా అంతా, 'బానిసలూ -యజమానులూ' అనే 2 రకాలుగానే వుంటారా? అలా కాని వాళ్ళు ఎవరూ అక్కడ వుండరా? బానిస సమాజం కన్నా వెనకటి కాలంలో, ఇంకా డబ్బే పుట్టని కాలంలో, కుండల రామయ్యా, చెప్పుల సోమయ్యా వంటి వాళ్ళని చూశాం కదా? అటువంటి కుటుంబాలు, బానిస సమాజంలో వుండవా? - అవి కూడా వుంటాయి. కానీ వాళ్ళ సంఖ్య చాలా తక్కువగానే వుంటుంది. వాళ్ళు బానిసలూ కారు, యజమానులూ కారు. వాళ్ళకి చిన్న చిన్న భూములూ, పనిముట్లూ వుంటాయి. వాళ్ళు బానిసలు కారు కాబట్టి, వాళ్ళ శ్రమలో నించి ఇతరులకు పోయేదేమీ వుండదు. వాళ్ళు యజమానులు కారు కాబట్టి ఇతరుల నించి వాళ్ళకి వచ్చే శ్రమ ఏమీ వుండదు. ఈ రకంగా, బానిసలుగా గానీ, యజమానులుగా గానీ వుండని మనుషులకు ఒక పేరు వుంది. 'స్వతంత్ర ఉత్పత్తిదారులు' అనే పేరు. అంటే, వారు స్వతంత్ర చేతి వృత్తుల వారు కావచ్చు ; చిన్న చిన్న భూములు వున్న స్వతంత్ర రైతులు కావచ్చు. వాళ్ళకి యజమానులు వుండరు కాబట్టి వాళ్ళు - స్వతంత్రులు. వాళ్ళు తమ కోసం కావలసినవి ఉత్పత్తి చేసుకుంటారు కాబట్టి, వాళ్ళు - ఉత్పత్తి దారులు. వారు, శ్రమలు చేసే మనుషులే కాబట్టి, వారిని 'శ్రామికులు' అని కూడా అనవచ్చు. కాకపోతే, వారు, 'స్వతంత్ర శ్రామికులు'.

అయితే, ఒక కుటుంబంలో వుండే ఏడెనిమిది మంది మనుషులు ఎంత శ్రమ చేసినా, వంద ఎకరాల మీదో, వెయ్యి ఎకరాల మీదో చెయ్యలేరు. భారీ భవంతులు కట్టలేరు. కాబట్టి, 'వాళ్ళు' చిన్న పొలాన్నే పండించుకుంటారు. చిన్న ఇల్లే కట్టుకుంటారు. నేత పనో, కుట్టు పనో కూడా చేసుకుంటారు. ఆ పనులు ఇతరుల కోసం కూడా చేసి పెడతారు. వాళ్ళు చేసే శ్రమలో నించి రోజువారీ పోషణ కోసం పోయేది పోగా ఇంకా మిగిలేది ఎక్కువగా వుండదు. అందుకే, స్వతంత్ర ఉత్పత్తి దారుల ఆస్తి ఎప్పుడూ చిన్నదిగానే వుంటుంది. అయినా వాళ్ళ శ్రమ ఎవరికీ పోదు కాబట్టి, వాళ్ళు బానిసల లాగ బికారులుగా వుండరు. వాళ్ళకి ఎవరి శ్రమా రాదు కాబట్టి, యజమానులు లాగ వాళ్ళు సిరి సంపదలతో వుండరు. కడుపు నిండా

తిని, కంటి నిండా నిద్రపోయి, సుఖంగా, నిరాడంబరంగా జీవించే విధానంతో వాళ్ళ జీవితాలు వుంటాయి.

బానిస సమాజంలో, స్వతంత్ర వుత్పత్తి దారుల కన్నా బానిసలే అధిక సంఖ్య. బానిస విధానం అనేది, 'శ్రమ దోపిడీ' ని కొత్తగా ప్రారంభించిన విధానం కాబట్టి, ఆ మార్పునే ( శ్రమ దోపిడీని ) సరిగా అర్థం చేసుకోవాలి.

ఒక కుటుంబ సభ్యుల స్వంత శ్రమలతో ఏర్పడే ఆస్తికి అయితే, ఒక హద్దు వుంటుంది. అది ఒక హద్దుని మించి పెరగదు. కానీ, యజమాని ఆస్తి, కుటుంబ సభ్యుల ద్వారా ఏర్పడేది కాదు. అది, ఇతరుల శ్రమల ద్వారా ఏర్పడేది. కాబట్టి, దానికి ఒక హద్దు వుండదు. వంద మంది బానిసల్ని దోచుకుంటే ఏర్పడే ఆస్తి కన్నా, 500 మంది బానిసల్ని దోచుకుంటే ఏర్పడే ఆస్తి 5 రెట్లు! ఎంత ఎక్కువ మందిని దోచుకుంటే అంత పెద్ద ఆస్తి! ఒక బానిస యజమాని ఆధీనంలో 5 వేల ఎకరాల భూమి వున్నదంటే, అక్కడ వేల కొద్దీ బానిసలు బికారులై, కుమిలిపోతూ బతుకుతున్నారని అర్థం. కాబట్టి, 'స్వంత ఆస్తి' అనే మాట విన్నప్పుడు, 'అది స్వంత శ్రమతో ఏర్పడినదా, దోచిన శ్రమతో ఏర్పడినదా?' అనే ప్రశ్న వెంటనే రావాలి.

'బానిస సమాజం' అనేది, ఏ దేశంలో, ఏ కాలంలో, ప్రారంభమైంది? కాలం అయితే, కొన్ని వేల సంవత్సరాల కిందటే. 'దేశం' అయితే, ఒకటే కాదు, అనేక దేశాల్లో.

"భారత దేశంలో బానినత్వం ఉండేదా?" అనే ప్రశ్నకి, వేరు వేరు పరిశీలకులు వేరు వేరు రకాలుగా చెపుతారు. "కొన్ని ప్రాంతాల్లో ఉండేది" అనీ, "ఎక్కడా లేదు" అనీ, "ఉండేది గానీ కొన్ని తేడాలతో ఉండేది" అనీ, ఇలా తేడాలుగా చెపుతారు.

బానిసత్వం లేకపోతే, స్వతంత్ర ఉత్పత్తి దారుల విధానమే ఉంటుంది. అందులో జరిగే మార్పు, చాలా దేశాల్లో బానిసత్వం గానే మారింది. అది వున్న చోట్ల, దాని లక్షణాలు ఎలా వున్నాయో తెలుసుకోవాలి. అది, భారత దేశంలో వున్నా, లేకపోయినా, ఆ సంబంధాల్ని అర్థం చేసుకోవాలి.

'బానిస సమాజం'లోనే, అంతకు పూర్వం లేని కొత్త విషయాలు అనేకం ప్రారంభమయ్యాయి. 'వర్తకం' అనేదీ, 'వడ్డీ వ్యాపారం' అనేదీ, 'రాజ్య పరిపాలన' అనేదీ - ఇలాంటి కొత్త విషయాలు, అప్పటి నించే ప్రారంభం!

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. 'ఆస్తి', ఎన్ని మార్గాల ద్వారా ఏర్పడుతుంది?

**జ** : 2 మార్గాల ద్వారా. ( 1 ) స్వంత శ్రమ ద్వారా. ( 2 ) దోపిడీ శ్రమ ద్వారా.

**2**. బానిసలు శ్రమ చేస్తారు. ఆ శ్రమతో వారికి ఆస్తి ఏర్పడుతుందా?

**జ** : బానిసలకు యజమాని ఉంటాడు. బానిసల శ్రమలో నించి, బానిసల పోషణకు అందే భాగమే అతి తక్కువ. అది వాళ్ళు బతకడానికే సరిపోదు. అంతే గాక, బానిసలే యజమానుల ఆస్తి! ఇక, బానిసలకు ఆస్తి ఏమిటి? ⟶


**3**. స్వంత శ్రమతో ఏర్పడే ఆస్తి ఎవరి దగ్గిర వుంటుంది?

**జ :** యజమానులు లేని, తాము యజమానులుగా లేని స్వతంత్ర శ్రామికులు, చిన్న ఆస్తిని ఏర్పర్చుకోగలుగు తారు. వాళ్ళ శ్రమలో నించి, వాళ్ళ పోషణ కోసం పోగా మిగిలినదే వారి ఆస్తిగా వుంటుంది.

**4**. స్వతంత్ర శ్రామికుడికి యజమాని వుండడు. అయినా, ఈ శ్రామికుడు చేసే శ్రమలో కూడా ' అదనపు శ్రమ' భాగం ఉంటుందా?

**జ :** ఇది, తర్వాత పాఠాల్లో వివరంగా తెలుస్తుంది. బానిసలు రోజూ 18 గంటలు పనిచేస్తూ, ఆ కాలంలో, 2 గంటల శ్రమని మాత్రమే తమ పోషణ కోసం అందుకుంటే, బానిస అదనపు శ్రమ - 16 గంటలు. స్వతంత్ర శ్రామికుడి ఉదాహరణ కూడా అలాగే వుంటే, అక్కడా అలాగే అవుతుంది. స్వతంత్ర శ్రామికుడు కూడా రోజుకి 18 గంటలు శ్రమ చేస్తూ, అదే కాలంలో తన పోషణ కోసం 2 గంటల శ్రమని మాత్రమే వాడుకుంటే, మిగిలిన 16 గంటలూ అదనపు శ్రమే కదా? అది, అతనికే అందుతుంది. లేదా, ఆ స్వతంత్ర శ్రామికుడే, 18 గంటలు శ్రమ చేస్తూ, తన పోషణ కోసం, 10 గంటల శ్రమని వాడుకుంటే, అప్పుడు అతని అదనపు శ్రమ 8 గంటలే అవుతుంది. లేదా, అతను చేసుకున్న శ్రమనంతా, పోషణకే సుఖంగా వాడేసుకుంటే, అదనపు శ్రమే వుండదు. అంటే, స్వతంత్ర శ్రామికుల విషయంలో కూడా అదనపు శ్రమ ఉంటుందా? - అనే ప్రశ్నకి జవాబు కావాలంటే, దానికి 2 వివరాలు కావాలి. ( 1 ) ఆ స్వతంత్ర శ్రామికుడు ఎన్ని గంటలు శ్రమ చేశాడు? ( 2 ) ఆ శ్రమ చేసిన కాలంలో, తన పోషణ కోసం ఎన్ని గంటల శ్రమ వాడుకున్నాడు? - ఈ 2 వివరాలూ వుంటే, తను వాడుకున్నంత శ్రమనే తిరిగి చేశాడా, దాని కన్నా ఎక్కువ శ్రమ చేశాడా? - అనేది తెలుస్తుంది. స్వతంత్ర శ్రామికుడి ఉదాహరణలో అదనపు శ్రమ లేదు - అని తేలితే, దాని అర్థం : అతను, తన పోషణ కోసం వాడుకున్నంత శ్రమనే తిరిగి చేసుకున్నాడు గానీ, అంత కన్నా ఎక్కువ శ్రమ చేసుకోలేదు - అని. లేదా, ' అదనపు శ్రమ ఉంది' అంటే, వాడుకున్న దానితో సమానమైన శ్రమ అంతా చేసి, కొంత ఎక్కువ శ్రమ కూడా చేశాడు - అని.

**5**. స్వతంత్ర ఉత్పత్తిదారుడి శ్రమలో, అదనపు విలువని చూపించండి!




**జ :** ఇది ఒక రోజు శ్రమ. పోషణ కోసం పోగా మిగిలేది, అదనపు విలువ. అదే ఆస్తిగా చేరుతుంది.




ఇది ఒక రోజు శ్రమ. రోజూ ఈ శ్రమ జరిగి, పోషణగా ఖర్చయిపోతుంది. అదనపు శ్రమ వుండదు.

**6**. వడ్రంగం శ్రమ చేసే స్వతంత్ర శ్రామికుడు ఉన్నాడు. అతనికి చిన్న ఆస్తి అయినా లేదు. కానీ, అతను కడుపునిండా తిని, కంటి నిండా నిద్రపోయి, సుఖంగానే ఉంటున్నాడు. దాని అర్థం ఏమిటి?

**జ :** అతను రోజూ శ్రమ చేసి, దాన్ని పూర్తిగా తన పోషణకి వాడేసుకుంటున్నాడు. ఎన్ని పదార్థాలు వాడుకుంటున్నాడో, అన్ని పదార్థాల్ని సంపాదించడానికి కావలసిన శ్రమనే తిరిగి చేసుకుంటున్నాడు. అందుకే, శ్రమ అంతా ఖర్చయిపోతోంది. ఏమీ →

మిగలడం లేదు. చేసుకున్న శ్రమలో నించి కొంత మిగలకపోతే ఆస్తి ఏర్పడదు.

**7**. బానిస యజమాని కుటుంబం, పోషణ కోసమూ, విలాసాల కోసమూ, చాలా ఎక్కువ శ్రమని వాడేస్తుంది. అయినా, ఇంకా పెద్ద ఆస్తి ఏర్పడుతోంది. ఇది ఎలా సాధ్యం?

**జ**: అంటే, దాని అర్థం, ఆ బానిస యజమానికి, బానిసల నించి వచ్చే 'అదనపు శ్రమ' అంత ఎక్కువగా ఉందన్నమాట! యజమాని కుటుంబ పోషణా + విలాసాలూ + ఆస్తీ - అంతా, బానిసల అదనపు శ్రమే. బానిసలు వందల సంఖ్యలో ఉంటారు కాబట్టి, యజమాని కుటుంబానికి అదంతా సాధ్యమవుతోంది.

**8**. అంత దోపిడీ జరుగుతోంటే, బానిసలు ఎలా బతికారు?

**జ**: వాళ్ళు అసలు ఏం బతికారు? కొంత కాలం రోగాలతో తీసుకుంటూ బతికి, యవ్వన కాలంలోనే చచ్చిపోతూ వుంటారు. అయినా, వాళ్ళ పిల్లలు మళ్ళీ యజమానుల సేవలోకి అందుకుంటారు. వాళ్ళూ చిన్న వయసులోనే చచ్చిపోతూ వుంటారు. **H**

## బానిస యజమానుల సమాజంలోనే
# 40. వర్తకమూ - వర్తక లాభమూ అప్పులూ - వడ్డీలూ!

బానిసలు తయారుచేసే ఉత్పత్తులన్నీ మొదట యజమాని చేతిలోకి వస్తాయి. యజమాని, ఆ ఉత్పత్తుల్లో నించి కొన్నిటిని అమ్మాలనుకుంటాడు. ఆ పని చేసిపెట్టే మనిషిని పిలిచి, ఉత్పత్తులు ఇస్తాడు. "వీటిని అమ్మి పెట్టు! వీటికి డబ్బు వస్తుంది కదా? అందులో నించి ఫలానా అంత నాకు ఇచ్చి, ఫలానా అంత నువ్వు తీసుకో!" అంటాడు.

ఆ ఉత్పత్తుల్ని అమ్మిపెట్టే మనిషి - వర్తకుడు. అతని పని అదే. అతను, ఒక బానిస యజమాని దగ్గిర ఉత్పత్తుల్ని కొంటాడు. అవి కావలసిన ఇతర యజమానులకు వాటిని అమ్ముతాడు. ఆ పని పేరు 'వర్తకం'. లేదా, 'వ్యాపారం'. అతను ఉత్పత్తుల్ని అమ్మినప్పుడు, వాటికి బదులుగా రావలసిన డబ్బు అంతా మొదట అతని చేతిలోకే వస్తుంది. అందులో నించి, ఆ ఉత్పత్తుల యజమానికి ఇవ్వవలసింది ఇచ్చి, తనకు రావలసింది తను తీసుకుంటాడు.

వర్తకుడు తీసుకున్న డబ్బులో నించి, వర్తకం పనుల కోసం అయిన ఖర్చులన్నిటినీ తీసివెయ్యాలి. ఇంకా కొంత మిగులుతుంది. అలా చివరికి మిగిలే డబ్బు పేరు - 'లాభం'. అది, వర్తకం వల్ల వచ్చింది కాబట్టి, అది, 'వర్తక లాభం'. ఆ లాభం, వర్తకుడికి 'ఆదాయం'.

అయితే, ఆ 'లాభం' ఏమిటి? వర్తకుడి శ్రమ ఫలితమా? - కాదు. వర్తకుడు చేసిన

పనులు ఏమిటి? అమ్మడాలూ, కొన డాలూ. అవి అసహజమైన పనులని గతం లోనే చూశాం. ఆ పనుల కోసం ఎవరు ఏ శ్రమ చేసినా, అది, వాళ్ళు అమ్మిన వస్తువు తయారీ కోసం జరిగిన శ్రమ అవదు. ఆ శ్రమ, ఆ వస్తువు విలువలోకి చేరదు. కానీ, వర్తకం పనులు చేసిన మనిషికి కొంత ఆదాయం రావాలి. ఆదాయం రాకపోతే ఆ పని చేసే వాళ్ళే వుండరు. కాబట్టి, వర్తకుడికి ఆదాయం ఎక్కడి నించి వస్తుం దంటే, అతని శ్రమ వల్ల కాదు, బానిసల శ్రమలో నించే వస్తుంది. ఎలాగంటే : బానిస యజమాని, బానిసలు తయారు చేసిన ఉత్పత్తులనే, అమ్మిపెట్టమని వర్తకు డికి ఇస్తాడు కదా? ఆ ఉత్పత్తుల్ని అమ్మి నప్పుడు, వాటికి బదులుగా డబ్బు వస్తుంది. ఆ డబ్బులో కొంత భాగం, బానిసల 'అదనపు శ్రమ' వల్ల వచ్చేదే. ఆ భాగంలో నించే యజమాని, వర్తకుడికి, కొంత ఇస్తాడు. ఆ భాగం తోనే వర్తకుడు, అమ్మకం పని చేసి పెడతాడు. వర్తకం పని కోసం కూడా కొన్ని ఉత్పత్తులు ఖర్చు అవుతాయి. ఆ ఖర్చు పోగా కూడా వర్తకు డికి కొన్ని ఉత్పత్తులు మిగులుతాయి. అది, వర్తకం వల్ల వచ్చే వర్తక లాభం.

ఈ 'లాభం' అనే మాట, మొట్ట మొదట బానిస సమాజంలోనే, వర్తక కార్య క్రమంలో నించే పుట్టుకొచ్చింది. వర్తకుడికి, వర్తకం వల్ల వచ్చే 'లాభం' అనే ఆదాయం, బానిసల అదనపు శ్రమలో భాగమే. అంటే, బానిస సమాజంలో వుండే వర్తకులు కూడా, బానిసల్ని దోచుకుంటూ జీవిస్తారు.

అయితే ఇక్కడ ఒక తేడా ఉంటుంది. ఆ వర్తకుడు, ఆ వర్తకం పనుల్ని తనే స్వయంగా చేస్తాడా ; బానిసల్ని పెట్టి ఆ పనులు చేయిస్తాడా ? - వర్తకుడు, ఆ పనులు తనే స్వయంగా చేసినట్టయితే, అతని ఆదాయం, అతని శ్రమకు బదు లుగా వచ్చినదే అవుతుంది. లేదా బానిసల్ని పెట్టి ఆ పనులు చేయించినట్టయితే, అది దోపిడీ ఆదాయం అవుతుంది.

[ ఈ విషయాలు ఇక్కడ అర్థం కావు. తర్వాత పాఠాలు కూడా చూడాలి. ప్రస్తుతా నికి ఇక్కడ అర్థం చేసుకోవలిసింది - 'వర్తక లాభం' అనేది, బానిసల అదనపు శ్రమ వల్ల వచ్చే ఆదాయమే అని.]

బానిస సమాజంలో, స్వతంత్ర ఉత్పత్తి దారులు కూడా వుంటారు కదా? వాళ్ళు కూడా తమ వస్తువుల్లో కొన్నిటిని అమ్ము కుంటారు. కొనుక్కుంటారు. ఆ పనులు వాళ్ళే స్వయంగా చేసుకుంటే, అది 'వర్తకం' అవదు. లేదా, ఆ పనుల్ని ఒక వర్తకుడికి అప్పజెపితే, ఆ వస్తువులకు బదు లుగా వచ్చే డబ్బులో నించి కొంత భాగాన్ని వర్తకుడికి ఇవ్వాలి. ఆ వస్తువుల్ని తయారు చేసిన స్వతంత్ర ఉత్పత్తిదారుడి శ్రమలో నించే కొంత భాగం వర్తకుడికి లాభంగా వెళ్తుంది.

[ ఈ విషయాలు అర్థం కాలేదని కంగారు పడకూడదు. తర్వాత అర్థమవుతాయి.]

## వడ్డీ

'దొర' అనే ఒక బానిస యజమాని దగ్గిర 10 మంది బానిసలు వున్నారు. అతను, ఇంకో బానిసని కొనదల్చు కున్నాడు. 100 రూపాయలు కావాలి. అతని

దగ్గిర 40 రూపాయలే వున్నాయి. అతను, సెట్టి అనే ఇంకో బానిస యజమాని దగ్గిరికి వెళ్ళాడు. " సెట్టీ! రెడ్డి దగ్గిర్నించి నేనో బానిసని కొందామనుకుంటున్నాను. 60 రూపాయలు కావాలి. నెల్లాళ్ళల్లో ఇచ్చేస్తాను" అని అడిగాడు. అది ' అప్పు' అడగడం. సెట్టి, డబ్బు తెచ్చి ఇస్తూ, " డబ్బు తిరిగి ఇచ్చేటప్పుడు, 10 రూపాయలు ఎక్కువగా వేసి ఇవ్వాలి, తెలుసా?" అన్నాడు.

" అయ్యో! ఎందుకు తెలీదూ? అలాగే ఇస్తాను" అన్నాడు దొర. అప్పు వెంటనే దొరికినందుకు సంతోషిస్తూ, ఆ డబ్బు తీసుకుని వెళ్ళిపోయాడు.

ఒక నెల రోజులు గడిచాక, దొర, 70 రూపాయలు పట్టుకుని, సెట్టి దగ్గిరికి వచ్చి డబ్బు ఇచ్చాడు. అందులో 60 ని, ' అసలు' అంటారు. ఆ పైన వున్న 10 ని, ' వడ్డీ' అంటారు. అంటే, ఎవరైనా కొంత డబ్బుని అప్పు తీసుకుంటే, దాన్ని తిరిగి ఇచ్చేటప్పుడు, కొంత ఎక్కువ డబ్బు ఇవ్వాలి. అది 'వడ్డీ'! ' వర్తక లాభం' అనేది ఎలాంటిదో, ఎక్కణ్ణించి వస్తుందో, 'వడ్డీ' కూడా అలాంటిదే ; అక్కణ్ణించే వస్తుంది. అంటే, బానిసల ' అదనపు శ్రమ'లో నించి. ఎలాగంటే :

60 రూపాయల్ని అప్పు తీసుకున్న యజమాని, ఆ డబ్బుని తిరిగి ఇవ్వడంలో ఆశ్చర్యం వుండదు. కానీ, 'వడ్డీ' గా ఇంకో 10 రూపాయలు కూడా ఇచ్చాడు కదా? దాన్ని ఎక్కణ్ణించి తెచ్చి ఇచ్చాడు?

తన ' ఆదాయం'లో నించే ఇస్తాడు. ఆ యజమాని ఆదాయం ఏమిటి? బానిసల నించి లాగిన ' అదనపు శ్రమే'. ఆ అదనపు శ్రమ వల్ల వచ్చిన ఉత్పత్తుల్లో నించి కొన్నిటిని అమ్మి, ఆ డబ్బులో నించి వడ్డీని చెల్లిస్తాడు. దాని వల్ల, అప్పు తీసుకున్న యజమాని తినవలసిన ఉత్పత్తులు తగ్గి, ఆ భాగం, అప్పు ఇచ్చిన వాడికి పోతుంది.

అప్పులు ఇచ్చి వడ్డీలు తీసుకునే మనిషికి, ఆ వడ్డీలు - ' ఆదాయం'. ఇక్కడ అప్పు ఇచ్చి, వడ్డీ సంపాదించిన మనిషి, సెట్టి అనే బానిస యజమాని కదా? ఈ యజమానికి, 2 రకాల ఆదాయాలు వుంటాయి. ( 1 ) తన బానిసల ద్వారా వచ్చే అదనపు శ్రమా, ( 2 ) వడ్డీల పేరుతో, ఇతర యజమానుల దగ్గిర వుండే బానిసల అదనపు శ్రమలో నించి కొన్ని భాగాలూ. - ఈ 2 భాగాలూ కూడా బానిసల అదనపు శ్రమే.

ఈ రకంగా, వర్తక లాభాలూ, వడ్డీలూ కూడా, బానిసల అదనపు శ్రమల వల్ల వచ్చే ఉత్పత్తులే. అంటే, ఇవి శ్రమ దోపిడీలే. ఇవి, బానిస యజమానుల సమాజంలోనే ప్రారంభమయ్యాయి.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ఉత్పత్తుల్ని కొని, అమ్మడం ద్వారా ' వర్తక లాభం' వస్తుంది. అప్పులు ఇవ్వడం వల్ల, ' వడ్డీ' వస్తుంది. ఇవి ఏ కాలంలో ప్రారంభమయ్యాయి?

**జ** : ఆ ఆదాయాలు, శ్రమ దోపిడీ ద్వారా వచ్చే ఆదాయాల్లో భాగాలు. కాబట్టి, అవి, బానిస యజమానుల సమాజంలోనే ప్రారంభమయ్యాయి - అని చెప్పుకోవచ్చు. శ్రమ దోపిడీ, అక్కడే ప్రారంభమైంది గనక.

⟶

**2**. బానిస సమాజం కన్నా వెనకటి ఆటవిక తెగల సమాజాల్లో, 'వర్తక లాభం' లేదనీ, 'వడ్డీ' లేదనీ ఎలా చెప్పగలం?

**జ**: అవి, శ్రమ దోపిడీ వల్ల వచ్చే ఆదాయాలు కదా? ఆటవిక తెగల్లో కూడా అవి వున్నాయంటే, శ్రమ దోపిడీ అనేది, ఆటవిక తెగల్లోనే ప్రారంభమైంది అనుకోవాలి. ఆ తెగల్లోనే శ్రమ దోపిడీ వుంటే, అంత కన్నా వెనకటి కాలంలో, అది వుండదు. శ్రమ దోపిడీ లేని కాలం అనేది ఒకటి వుంటుంది. ఆ కాలంలో, వర్తకమూ, వడ్డీ ఉండవు.

**3**. వెనకటి కాలంలో 'వడ్డీ లేని అప్పు' వుండడం సాధ్యం కాదా?

**జ**: సాధ్యమే. కుండల రామయ్య దగ్గిర కొత్త కుండలు ఇంకా తయారవలేదు. ఒక రోజు అతనికి వెంటనే చెప్పులు కావలసి వచ్చాయి. కుండని తర్వాత ఇస్తానని చెప్పి, చెప్పులు తెచ్చుకోవచ్చు. అది, అప్పు తెచ్చుకోవడమే. కుండ తయారైన వెంటనే దాన్ని ఇచ్చేస్తే, అప్పుని తీర్చేసినట్టే. అది వడ్డీ లేని అప్పే.

**4**. బానిసల సమాజంలో, సరుకుల అమ్మకాలూ, డబ్బు చలామణీ, ఎక్కువగా లేవు కదా? అప్పుడు, వర్తక లాభం, వడ్డీ - అనే ఆదాయాలు ఎలా సాధ్యం?

**జ**: అవి, ఎప్పుడూ డబ్బు ద్వారానే జరగనక్కర లేదు. ఆ నాటి వర్తకుడు, ఒక యజమాని ఉత్పత్తిని ఇంకో యజమానికి ఇచ్చి, ఆ ఇంకొకరి ఉత్పత్తిని మొదటి వ్యక్తికి ఇవ్వవచ్చు. ఆ పని చేసిపెట్టినందుకు, ఇద్దరి నించీ కొంచెం కొంచెం ఉత్పత్తినే తీసుకోవచ్చు. అలాగే, వడ్డీ విషయం కూడా. ఒక యజమాని, ఇంకో యజమానికో, వర్తకుడికో, తన ఉత్పత్తినే అప్పుగా ఇచ్చి, దాన్ని వెనక్కి తీసుకునేటప్పుడు, ఇంకా కొంత ఎక్కువ ఉత్పత్తిని వడ్డీగా తీసుకోవచ్చు. ఒక ధాన్యం బస్తాని అప్పుగా తీసుకుని తిరిగి ఇచ్చే టప్పుడు, బస్తా కన్నా ఎక్కువ ధాన్యం ఇస్తే, అది అప్పు తీర్చి, వడ్డీ ఇవ్వడమే. డబ్బు లేకుండా కూడా వర్తక లాభాలూ, వడ్డీలూ, సాధ్యమే.

**5**. ఒక యజమాని, ఇంకో యజమాని నించి ఒక ధాన్యం బస్తాని అప్పుగా తీసుకున్నాడు. దాన్ని తిరిగి ఇచ్చేటప్పుడు, కొంత ధాన్యం ఎక్కువగా ఇచ్చాడు. వీటిని బొమ్మలతో చూపించండి!

**జ**:



అప్పుగా తీసుకున్న అసలు ధాన్యం — వడ్డీగా ఇచ్చిన ధాన్యం

**6**. వడ్డీగా ఇచ్చిన ధాన్యం ఎక్కడిది?

**జ**: ఇది యజమానుల మధ్య వ్యవహారం. కాబట్టి, అసలు అయినా, వడ్డీ అయినా, బానిసల శ్రమే.

**H**

## బానిస యజమానుల సమాజంలోనే


# 41. 'రాజ్యపాలన' ప్రారంభం!

బానిసలు, యజమానుల దగ్గిర ఎన్ని శ్రమలు చేసినా, అదంతా బలవంతంగానే చేస్తారు గానీ, ఇష్టంతో చెయ్యరు. యజమాని ఆజ్ఞల్ని ధిక్కరించడానికే, ఎదురు తిరగడానికే ప్రయత్నిస్తారు. అడవుల్లోకి పారిపోవడానికి ప్రయత్నిస్తారు. కాబట్టి, బానిసల్ని అణిచి వుంచడానికి, యజమానులకు కొత్త కొత్త మార్గాలు అవసరమయ్యాయి. బానిసలు సరిగా పని చేసే లాగ వాళ్ళని భయపెట్టాలి.

బానిసలు పని చేసే చోట్ల, వాళ్ళు పని చేస్తున్నారో లేదో తణిఖీలు చేసే వాళ్ళు తయారయ్యారు. వాళ్ళు కూడా బానిసలే. వాళ్ళకి యజమాని, ఆ పని అప్పజెపుతాడు.




వాళ్ళు, యజమానికే అనుకూలంగానూ, బానిసలకు వ్యతిరేకం గానూ ప్రవర్తిస్తారు. ఆ తణిఖీల వాళ్ళు, పనిచేసే బానిసల మధ్య పెద్ద పెద్ద కొరడాలు ఈడ్చుకుంటూ తిరుగుతూ, పని చేసే బానిసల్ని అప్పుడప్పుడూ బాదుతూ, భయంతో అణిగి వుండే లాగ చేస్తారు.




బానిసలు పారిపోకుండా వుండడానికి వాళ్ళ కాళ్ళకి పెద్ద పెద్ద బండలు కడతారు. వాళ్ళు ఆ బండల్ని ఈడ్చుకుంటూనే పని చెయ్యాలి. చేతులకు కడియాలు బిగిస్తారు. పనులు లేనప్పుడు వాటికి సంకెళ్ళు వేస్తారు. మెడలకు దుప్పి కొమ్ముల్లాంటి పొడుచుకు వచ్చే కొమ్ములతో చేసిన కంటెలు బిగిస్తారు. ఆ బానిస, అడవుల్లోకి పారిపోతే, మెడ చుట్టూ పైకి లేచి వున్న కొమ్ములు, చెట్ల కొమ్మల్లో చిక్కుకుపోయి, పరిగెత్తే బానిస అక్కడే ఆగిపోతాడు. అప్పటికే యజమాని బంట్లు, ఏనుగు లంతంత కుక్కల్ని వెంట బెట్టుకుని, చేతుల్లో కత్తులతో, పారిపోయిన బానిసని గాలిస్తూ బైల్దేరతారు. చెట్టు కొమ్మల్లో చిక్కుకున్న బానిస, వాళ్ళ కంట పడగానే, అతన్ని కుక్కలతో పీకించడమో, కత్తులతో పొడవడమో చేసి చంపేస్తారు. లేకపోతే, అతన్ని యజమాని దగ్గిరికి లాక్కు వచ్చి, ఇక్కడ అంత కన్నా ఎక్కువ చిత్ర హింసలు పెడతారు. ఆ బానిస చేసిన నేరం, పారిపోవడానికి ప్రయత్నించడం!

బానిసల్ని అణగ్గొట్టటానికి, ఆ చిత్ర హింసల విధానాలు కూడా యజమానులకు సరిపోలేదు. ఇక అప్పుడు, 'రాజ్యాంగ యంత్రం' కావలసి వచ్చింది. <u>రాజ్యాంగ యంత్రం అంటే, బానిసల్ని అణిచివుంచే పరిపాలన.</u> బానిస యజమానుల్లో చాలా ఆస్తి గల వాడు, పరిపాలన చేసే 'రాజు' అవుతాడు. పెద్ద ఆస్తి అంటే, వేల ఎకరాల భూమీ, దాన్ని సాగు చెయ్యడానికి వందల కొద్దీ బానిసలూ! అదే ఆస్తి! పెద్ద ఆస్తి గల

వాడిని రాజుగా వుంచడానికి, యజమాను లందరూ ఒప్పుకుంటారు. ఆ రాజు చుట్టూ, మంత్రులూ గింత్రులూ చాలా మంది వుంటారు. వాళ్ళందరూ బానిస యజమా నులే. అందరూ ఆస్తిపరులే. వాళ్ళందరూ పడి చేసే పరిపాలన ఏమిటంటే, బానిసల్ని అణగ్గొట్టడమే. ఆ పరిపాలన, బానిసలకు బోధించే నీతి ఇలా వుంటుంది : " భూమి అంతా యజమానుల ఆస్తి! బానిసలు కూడా యజమానుల ఆస్తే! బానిసల కర్తవ్యం, యజమానులకు వినయ విధే యతలతో సేవలు చెయ్యడమే. అలా చెయ్యని వాళ్ళు రక రకాల శిక్షలు అనుభ వించాలి!"



ఆ రకమైన రాజు గారి పరిపాలన కోసం, రక్షక భటులూ (పోలీస్), న్యాయ స్థానాలూ ( కోర్టులు ), చెర సాలలూ ( జైళ్ళు ), ఉరి కొయ్యలూ, శిరచ్ఛేదాల బండలూ - ఇవన్నీ కొత్తగా పుట్టుకొచ్చాయి.



బానిసల్ని దండించే కత్తులూ, జైళ్ళూ

ఆ రాజ్యాంగ యంత్రంలో శాఖలన్నీ పని చెయ్యడానికి, కొన్ని ఉత్పత్తులు కావాలి. బానిస యజమానులే ఆ ఉత్పత్తు లన్నీ 'రాజు' కి చెల్లిస్తారు. వాటి పేరు 'పన్నులు'. యజమానులు, పన్నుల్ని ఎక్కడి నించి తెచ్చి చెల్లిస్తారు? - బానిసల 'అదనపు శ్రమ' భాగంలో నించే.

బానిస యజమానులు, తమ ఉత్ప త్తుల్ని అమ్ముకొనేటప్పుడు వర్తకులకు అందే లాభాలూ, అప్పులు తీసుకుంటే చెల్లించే వడ్డీలూ, ప్రభుత్వానికి చెల్లించే పన్నులూ, చివరికి, తమ కుటుంబాల పోషణలకూ, విలాసాలకూ పెట్టే ఖర్చులూ - ఇవి అన్నీ, బానిసల అదనపు శ్రమలో భాగాలే.

# ప్రశ్నలూ - జవాబులూ

**1.** 'రాజ్యపాలన' అంటే ఏమిటి? ఇది ఏ కాలంలో ఎందుకు ప్రారంభమైంది? ఇది లేని కాలం ఒకటి ఉందా?

**జ :** 'రాజ్యపాలన ఫలానా కాలంలో ప్రారంభమైంది' అని చెప్పుకుంటే, దాని కన్నా వెనకటి కాలంలో అది లేదని అర్థమే కదా? 'రాజ్యపాలన' అనేది, బానిస యజమానుల కాలంలోనే ప్రారంభమైంది. ఎందుకంటే, యజమానుల వర్గం, బానిసల వర్గాన్ని అణిచి వుంచడానికి. శ్రమ దోపిడీ వల్లనే శత్రు వర్గాల ప్రారంభం. బానిసల్ని భయ భక్తుల్లో అణిచి వుంచే చర్యలన్నీ కలిసినదే రాజ్య పాలన.

→

**2**. బానిసలు పనిచేసే చోట్ల తణిఖీ చేస్తూ, కొరడాలు పట్టుకుని తిరిగేవాళ్ళు ఎవరు?

**జ** : వాళ్ళూ బానిసలే. వాళ్ళని, యజమానులు, ఆ పనుల్లో పెట్టినప్పుడు, ఆ పనులు చెయ్యడం వాళ్ళకి తప్పదు. క్రమంగా వాళ్ళు, యజమానులకే అనుకూలంగానూ, శ్రమ చేసే బానిసలకు వ్యతిరేకంగానూ తయారవుతారు.

**3**. బానిసల అదనపు శ్రమతో వచ్చే ఉత్పత్తిని, యజమానులు, ఎలా ఖర్చుపెడతారు?

**జ** : (1) అదనపు ఉత్పత్తిలో నించి కొంత 'రాజు'కి, పన్నులుగా ఇస్తారు. (2) ఇతర యజమానుల నించి అప్పులు తీసుకుని వుంటే, దాన్ని తిరిగి ఇచ్చేటప్పుడు, 'వడ్డీ' కోసం కొంత ఎక్కువ ఉత్పత్తిని ఇస్తారు. అప్పులు తీసుకోకపోతే, 'వడ్డీ'గా పోయేదేమీ వుండదు. (3) కొంత ఉత్పత్తిని అమ్మదలిస్తే, దాన్ని అమ్మి పెట్టే వర్తకుడికి కొంత ఉత్పత్తిని ఇస్తారు. (4) ఇక మిగిలినదంతా యజమాని కుటుంబానికే. అందులో నించే, ఆ కుటుంబ పోషణా, విందులూ, విలాసాలూ, చివరికి కొన్ని నగలూ కూడా. ఇదంతా సంవత్సరానికి ఒక సారి జరుగుతుంది. **H**

## బానిసలకు, మత గ్రంధాలు బోధించిన
# 42. పాప పుణ్యాలూ, స్వర్గ నరకాలూ!

మనం, ఇంకా 'బానిస సమాజం' లోనే వున్నాం. బానిసలు, వెనకటి కాలంలో, స్వేచ్ఛగా జీవించిన మనుషులే. 'బానిసత్వం' ప్రారంభమైన కొత్తలో, ఆ మనుషులు, ఆ దుర్భర జీవితంలో ఇమడ లేక, దాని నించి బైటపడడం కోసం, ఎవరి సాహసాలతో వాళ్ళు ప్రయత్నించారు. ఏ శిక్షల్నీ లెక్క చెయ్యకుండా, ఎవరి ఎదిరింపులు వాళ్ళు ప్రారంభించారు.

అలాంటి మనుషుల్ని, పూర్తిగా అణిచి వుంచాలంటే, ఎంత సేపూ కత్తులతో కఠార్లతో దండించే పద్ధతులే సరిపోవని, యజమానులు 'చక్కగానే' అర్థం చేసుకున్నారు. అప్పుడు వాళ్ళు కనిపెట్టిన మార్గం - బానిసలు భయంతో అణిగి వుండడం గాక, ఇష్టంతోనే లొంగి వుండే లాగ వాళ్ళని తయారుచెయ్యాలని! దానికి, దేవుళ్ళ నమ్మకాలూ, మతాల బోధనలూ, పూర్తిగా పనిచేస్తాయని యజమానులు కనిపెట్టారు. "యజమానుల కోసం సేవలు చెయ్యండి, చెయ్యండి!" అని ఊక దంపుడు లాగ చెప్పడం గాక, అదే విషయాన్ని కథలుగా చెప్పడానికి, యజమానుల పక్షంలో నించే కవులూ, కళాకారులూ, బైల్దేరారు. వాళ్ళు కూడా బానిస యజమానులైన ఆస్తిపరులే.


ఆ కవులు, యజమానులకు ఆనందం కలిగించే రక రకాల కథలతో, పెద్ద పెద్ద మత గ్రంధాలు తయారుచేశారు. ఆ గ్రంధాలు చెప్పే కథలు ఎలా వుంటాయంటే : "పూర్వం కన్నయ్య అనే ఒక బానిస వుండేవాడు. అతడు చాలా ఉత్తముడు. యజమాని ఆజ్ఞల్ని ఎంతో అణకువతో, ఎంతో విశ్వాసంతో, ఎంతో విధేయతతో పాటించేవాడు. రాత్రింబవళ్ళూ

యజమాని కోసం ఒళ్ళు వంచి సేవలు చేస్తూ, యజమానికి ఎంతో ఆనందం కలిగించేవాడు. ఆ రకంగా, అతడు, యజమానికి సేవలు చేసి చేసి ఎంతో పుణ్యం సంపాదించుకున్నాడు. అతడు చచ్చిపోయినప్పుడు, భగవంతుడే స్వయంగా వచ్చి, ఆ పుణ్యాత్ముణ్ణి తన పక్కన రథంలో కూర్చోబెట్టుకుని స్వర్గానికి తీసుకువెళ్ళాడు. అక్కడ ఆ బానిస, రోజూ దేవతలందర్నీ చూస్తూ, అమృతం తాగుతూ, పూల తోటల్లో తిరుగుతూ, ఇప్పటికీ అక్కడ ఆనందంగా ఉంటున్నాడు.

కానీ, పోలయ్య అనే ఇంకో బానిస వుండేవాడు. వాడు పరమ దుష్టుడు. యజమాని అంటే, వినయ విధేయతలు చూపేవాడు కాదు. ఒళ్ళు వంచి పనులు చేసేవాడు కాదు. ఎప్పుడూ నిద్రతో జోగుతూ రాత్రుళ్ళు పని వదిలేసి నిద్రకి పడేవాడు. ఎప్పుడూ యజమాని దగ్గర్నించి పారిపోవాలని దొంగ ఎత్తులు వేస్తూ వుండేవాడు. వాడిని, ఎన్ని సార్లు కుక్కలతో పీకించినా బుద్ధి రాలేదు ; కత్తులతో పొడిపించినా సిగ్గు రాలేదు. చచ్చే దాకా యజమాని అంటే ద్వేషంతోనే తిరిగాడు. ఆ రకంగా వాడు, బోలెడు పాపం మూట కట్టుకున్నాడు. ఆ పాపం మూలాన్నే, చచ్చాక నరకానికి పోయాడు. అక్కడ యమ ధర్మరాజు భటులు, వాణ్ణి ఇప్పటికీ రోజూ నిప్పుల్లో కాలుస్తున్నారు. సల సల కాగే నూనె మూకుళ్ళలో పేలుస్తున్నారు. కొండల మీద నించి కిందకి దొర్లిస్తున్నారు. ఎన్నెన్నో నరక యాతనలు పెడుతున్నారు. వాడు ఇప్పుడు, 'అయ్యో, యజమానికి సేవలు చేసుకోలేకపోయానే!' అని రోజూ ఏడుస్తున్నాడు.

చూశారా? యజమానికి విశ్వాసంతో సేవలు చేసిన వాడికి స్వర్గం దొరికితే, ఈ దుష్టుడికి నరకం దొరికింది.'' - ఇలా వుంటాయి, మత గ్రంథాల్లో కథలు!

బానిసలకు చదువు రాదు. ఆ గ్రంథాల్ని వాళ్ళు చదవరు. వాళ్ళకి ఆ కథల్ని, పాటలతో, భజనలతో, బోధించడానికి, హరిదాసులూ - పౌరాణికులూ లాంటి వాళ్ళు బైల్దేరారు. వాళ్ళందరూ యజమానుల పక్షం వాళ్ళే. వాళ్ళు పిలకలూ, జంధ్యాలూ పెట్టుకుని, తాము గొప్ప పవిత్రులమని బానిసలకు చెప్పుకుంటారు. పగళ్ళంతా పనులు చేసి నిద్రలతో జోగుతూ వుండే బానిసల్ని రాత్రులంతా కూర్చోబెట్టి, ఆ కథలన్నీ



బాజాల దరువులతో, రాగాలతో వినిపిస్తారు. మధ్య మధ్య ఇంకా బోలెడు పిట్ట కథలు చెప్పుకొస్తారు. అవన్నీ యజమానుల నీతి బోధనలు!

బానిసలు వినే పురాణాలన్నీ అలాంటివే. దేవుళ్ళూ, పాపాలూ పుణ్యాలూ, స్వర్గాలూ నరకాలూ! వినగా వినగా వినగా, బానిస లందరికీ ఆ కథలూ, ఆ పాటలూ, బాగా వంటబడతాయి. స్వర్గ నరకాల మీద నమ్మకాలు పాతుకుపోతాయి. నరకం అంటే భయమూ, స్వర్గం అంటే ఆశా!

యజమానికి ఎదురు తిరిగితే పాపం

వస్తుందనీ, అణకువతో సేవలు చేస్తే పుణ్యం వస్తుందనీ బానిసలకు బోధించ డానికే మత గ్రంథాలు పుట్టాయి. ఏ మత గ్రంథం అయినా, వంద కత్తుల కన్నా పదునైనది! ఏ మత నీతి అయినా, బాని సల శరీరాల్ని చీలికలూ వాలికలూ చేసే వేట కుక్కల కన్నా క్రూరమైనది!

ఆఖరికి, ఒక నాటికి బానిసలు ఆ క్రూర మత గ్రంధాల మాయలకు లొంగి పోయారు. లొంగని వాళ్ళెవరైనా వుంటే, అప్పుడప్పుడూ అలజడులు సృష్టించేవారు. అలాంటి వారిని శిక్షించే పని, రాజు గారి రక్షక భటులు చూసుకునేవారు. శిక్షించడం అంటే, చంపెయ్యడమే.

## ప్రశ్నలూ - జవాబులూ


**1.** దేవుళ్ళ నమ్మకాలు, బానిసల్ని అణిచి వుంచడానికే పుట్టాయా?

**జ :** మనుషులకు, ఆటవిక దశలో వున్నప్పుడు, ప్రకృతి గురించి ఏ విషయాలూ తెలియవు. ఆకాశంలో ఉరుము ఉరిమితే, అక్కడ ఎవరో ఉన్నారనీ, వాళ్ళే అలా చప్పుళ్ళు చేస్తున్నారనీ, అనుకునేవారు. అలాంటి అజ్ఞానమే దేవుడి నమ్మకాలకు దారి తీసింది. అదంతా ఆకాశంలో ఉరుములు ఎందుకు వస్తాయో తెలియకపోవడం వల్లనే. ప్రకృతి గురించి తెలియనితనం వల్ల ఏర్పడిన పొరపాటు అభిప్రాయాలు, క్రమంగా ప్రకృతి గురించి తెలిసినప్పుడు పోతాయి. కానీ, స్వర్గాలూ నరకాలూ అనే అభిప్రాయాలు మాత్రం, కేవలం తెలియనితనంతో ఏర్పడినవే కాదు ; వాటి అసలు లక్ష్యం, బానిస వర్గాన్ని ఆ భయాలతో అణిచి వుంచడం. మత గ్రంథాల్లో వుండే కథల్ని చూస్తే, వాటిని బానిసల కోసమే తయారుచేసినట్టు స్పష్టంగా తెలుస్తుంది.

# 43. యజమానీ శ్రామిక సంబంధాలు!

బానిసకి, రాత్రింబవళ్ళూ పని చెయ్య గలిగినంత కాలమే పిడికెడు తిండి దొరుకు తుంది. శక్తి పోయిన బానిస అమ్మకానికి కూడా పనికిరాడు. పనిచెయ్యలేని బానిసకి తిండి పెట్టడం, వృధా ఖర్చు లాగ యజ మానులకు కనపడుతుంది. అలాంటి బానిసల్ని చంపేస్తారు. లేకపోతే, అడుక్కు తినమని వదిలేస్తారు.

బానిస విధానం ప్రారంభం కాక ముందు, యజమానితనం అనేది లేదు.




వెనకటి కాలపు మానవుల్లో ఎవరూ బాని సలూ కారు ; యజమానులూ కారు. అలా వుండే మానవ సంబంధాలు, శ్రమని దోచడం కోసం, యజమానీ బానిస సంబం

ధాలుగా మారిపోయాయి. ఆ నాటి సమాజంలో ప్రధాన సంబంధాలు, ఈ 2 వర్గాలకూ మధ్య ఏర్పడిన సంబంధాలే. ఆ సంబంధాలు, కొన్ని వేల సంవత్సరాల పాటు సాగాయి! ఆ కాలంలోనే మధ్య మధ్య బానిసలు చేసిన అనేక పోరాటాలు కూడా సాగాయి. ఆ పోరాటాలు అనేక సార్లు ఓడిపోయాయి. అలా తిరగబాట్లు చేసిన బానిసల కోసం, యజమానులు కనిపెట్టిన భయంకరమైన శిక్ష - శిలవ వెయ్యడం. బానిసని, ఒక చెక్క మీద పడేసి, ఆ శరీరాన్ని మేకులతో చెక్కకి కొట్టెయ్యడం! ఆ నిస్సహాయుడు, కొన్ని గంటల సేపు నరక యాతన అనుభవించి చివరికి కన్ను మూస్తాడు.

కానీ, దిగ్భ్రాంతి గొలిపే విషయం ఏమిటంటే, అంత భయంకరమైన శిక్షలు కూడా,



బానిసల్ని ఎదురు తిరగకుండా అణచలేకపోయాయి. యజమానుల దగ్గిర వారి బాధలు అలాంటివి కాబట్టి, వారు యజమానులకు ఎదురు తిరుగుతూనే వుండేవారు.

[ బానిసల తిరుగుబాట్లని చిత్రించే పుస్తకాల్లో అత్యద్భుతమైన పుస్తకం, 'స్పార్టకస్' అనే ఇంగ్లీషు నవల. దీన్ని హోవర్డ్ ఫాస్ట్ అనే అమెరికన్ రచయిత రాశాడు. ఇందులో కథ, 2 వేల సంవత్సరాల నాడు రోమ్ నగర ప్రాంతాల్లో ( ఇటలీ దేశం ) నిజంగా జరిగినది. రచయిత రాసిన అసలు పుస్తకం చాలా పెద్దది. దానికి, ఆకెళ్ళ కృష్ణమూర్తి గారు చేసిన తెలుగు అనువాదం వుంది. కానీ, దాన్ని చిన్న పిల్లలు ఓపిగ్గా చదవలేరు. అదే పుస్త కానికి పరిచయంగా నేను, 'స్పార్టకస్' పేరుతోనే క్లుప్తంగా రాసిన చిన్న పుస్తకం కూడా వుంది. అది పిల్లలు చదవగలరు. అది చదివితే, బానిసల దుర్భర జీవితాలూ, యజమానుల క్రూర విలాసాలూ, యజమానుల మీద బానిసల తిరుగుబాట్లూ, అన్నీ తెలుస్తాయి. మొదట 'పరిచయం' చదివి తర్వాత పెద్ద పుస్తకంగా వున్న తెలుగు అనువాదం చదవవచ్చు.]

బానిసల తిరుగుబాట్లు, 'శ్రమ దోపిడీ'కి వ్యతిరేకంగా కాదు. తమకు కూడా భూమి కావాలని కాదు. అసలు శ్రమ దోపిడీ గురించి బానిసలకు తెలియదు. యజమానులకూ తెలియదు. 'భూమి అంతా యజమానుల ఆస్తి' అన్నదే బానిసల నమ్మకం కూడా. కాబట్టి, వారి పోరాటాలు భూమి కోసం కాదు. బానిసత్వానికి

వ్యతిరేకంగా మాత్రమే.

బానిసల తిరుగుబాట్ల ఫలితంగా, క్రమ క్రమంగా బానిసత్వం రద్దు అయింది.

[ ఈ 'రద్దు అవడం' అనేది, ఒక రకంగా నిజమూ, ఇంకో రకంగా అబద్ధమూ కూడా. 'అబద్ధం' ఎలాగంటే, బానిసత్వం ఇంకా నిన్న మొన్నటి దాకా ప్రపంచంలో అక్కడక్కడా సాగుతూనే వుంది. 1865 దాకా అమెరికాలో వున్న బానిస త్వాన్ని చెప్పే ఇంగ్లీషు నవల ఒకటి వుంది. దాని పేరు '**అంకుల్ టామ్స్ కేబిన్**'. అది 1851లో వచ్చింది. దాన్ని రాసిన రచయిత్రి **హారియట్ బీషర్ స్టోవే.** ఈ నవల కూడా చాలా పెద్దది. దీనికి తెలుగు అనువాదం లేదు. కానీ, దీనికి కూడా నేను 'పరిచయం' రాశాను. దాని పేరు, '**టామ్ మామ ఇల్లు**'. దీన్ని చదివితే, బానిసత్వం అనేది, నిన్నటి దాకా కూడా ఎలా సాగిందో, బానిస యజమానులు ఎలా ప్రవర్తించారో, ఎన్నో వివరాలు తెలుస్తాయి.]

వెనకటి కాలపు బానిసల పోరాటాల వల్ల, కొన్ని దేశాల్లో బానిసత్వం రద్దు అయింది. ఆ తర్వాత, అప్పటి నించీ ఆ బానిస సమాజం, 'భూస్వాముల సమాజం'గా మారింది. దాన్ని తర్వాత చూస్తాం.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. బానిసల కాలంలో, బిచ్చమెత్తుకోవడం ప్రారంభమైందా?

**జ** : జబ్బులపాలైన బానిసల్నీ, వృద్ధులైపోయిన బానిసల్నీ, యజమాని, తిండి పెట్టకుండా వదిలేస్తాడనుకుందాం. బిచ్చమెత్తుకుని బతకడం తప్ప ఇంకేం మార్గం వుంటుంది?

**2**. బానిసలూ యజమానులూ వున్న కాలంలో, స్వతంత్ర శ్రామికులు కూడా వుంటే, ఆ సమాజాన్ని 'బానిసల సమాజం' అని ఎందుకు అనాలి?

**జ** : ఎందుకంటే: అప్పటి వరకూ వున్న సమాజం, సమాన శ్రమ సంబంధాలు గల సమాజం. అందులో, ఒక మార్పు ప్రారంభమైంది. సమాన శ్రమ సంబంధాలు, అసమాన క్రూర సంబంధాలుగా మారాయి. అంత పెద్ద మార్పు జరిగింది కాబట్టి, అది ఇక వెనకటి సమాజం కాదు. మార్పు జరిగింది కాబట్టి, ఆ సమాజానికి ఆ మార్పుని తెలిపే పేరే వస్తుంది.

**3**. బానిసల పోరాటం దేని కోసం?

**జ** : బానిసల పోరాటం దేని కోసం ఉంటుంది? 'బానిసత్వం' నించి బైట పడడం కోసం ఉంటుంది. వారు, శ్రమలు చెయ్యడానికి సిద్ధమే. కానీ 'యజమానుల ఆస్తి'గా ఉండడానికి సిద్ధం కాదు. దాని కోసమే పోరాటం.

**4**. బానిసల్ని హింసించిన క్రూర శిక్ష ఏది?

**జ** :



**5**. 'బానిసత్వం' అంటే, ఒక మానవుడు, ఇంకో మానవుడి ఆస్తిగా ఉండడం కదా? అది నీచత్వం అని తేలిగ్గానే తెలియదా? 'శ్రమ దోపిడీ' గురించి తెలియక →

పోయినా, ఒక మనిషిని అమ్మే - కొనే - చంపే హక్కులు ఇంకో మనిషికి ఉంటాయా? ఇంత చిన్న విషయం ఆ నాడు తెలియదా?

**జ :** 'తెలియడం' అంటే, కొన్ని భావాలు. కొన్ని అభిప్రాయాలు. 'శత్రు వర్గాలు' ఏర్పడిపోయిన తర్వాత, మనుషుల అభిప్రాయాలూ, తెలివీ, జ్ఞానం, తర్కం, అన్నీ వాళ్ళ వర్గ ప్రయోజనాలకు కావలసిన విధంగానే ఏర్పడతాయి. బానిస యజమానికి, బానిసత్వం వల్ల చాలా లాభం, సుఖం, ఆనందం, ఉంటాయి. ఆ యజమాని ఆలోచనలన్నీ తన వర్గ సుఖాల ప్రకారమే ఏర్పడతాయి. యజమాని ఆలోచనలు, తన 'వర్గ స్పృహ'ని దాటి సాగవు. యజమాని తర్కం అంతా, తన లాభం కోసమే సాగుతుంది. "బానిసలకు ఆస్తి లేదు కదా? వాళ్ళని నేను పోషించి బతికిస్తున్నాను. వాళ్ళు నా ఆస్తి. నా ఆస్తిని, నా ఇష్టమైనట్టు చేసుకుంటాను" అనుకుంటాడు యజమాని. వాళ్ళ వర్గానికి ఏది ప్రయోజనంగా ఉంటుందో, అదే వాళ్ళ తత్వం. యజమానుల అభిప్రాయాలే, వాళ్ళ తత్వ శాస్త్రం. వాళ్ళకి కావలసినదాన్నే వాళ్ళు నమ్ముతారు. - బానిసల వర్గం, 'బానిసత్వం' పట్లా, 'యజమాని వర్గం' పట్లా, తీవ్రమైన ద్వేషం తోనే ఉంటుంది. ఎదురు తిరగడానికి ప్రయత్నిస్తూనే వుంటుంది. కానీ, నిస్సహాయ పరిస్థితుల్లో అణిగి మణిగి వుంటుంది. సారాంశం ఏమిటంటే, మానవుల భావాలు - వారి వర్గాలతో సంబంధం లేకుండా విడిగా ఏర్పడవు. మానవుల్ని, 'వర్గ మానవులు'గా అర్థం చేసుకోవాలి. ఏదో ఒక వర్గానికి చెందని మానవులు ఉండరు. ఆ నాటి సమాజంలో, ఒక మనిషి, బానిస వర్గం మనిషిగా గానీ, యజమాని వర్గం మనిషిగా గానీ, ఉంటారు. ఆ రెండూ కాకపోతే, స్వతంత్ర ఉత్పత్తిదారులు. వర్గాల వల్ల ఏర్పడే భావాలు లేని మానవులు ఉండరు. అయితే ఈ భావాలు ఏర్పడడంలో కూడా ఇంకో విషయం వుంది. యజమానుల వర్గమే - పాలించే వర్గం. ఆ వర్గం, తన భావాలనే ప్రజలకు బోధిస్తూ వుంటుంది. ఆ సమాజంలో వున్న విద్యలూ, కళలూ, సంస్కృతీ అన్నీ, యజమానుల వర్గం బోధించే భావాలతోనే ఉంటాయి. శ్రామిక వర్గానికి, తన సమస్యల వల్ల ఏర్పడే తన వర్గ భావాలు కూడా వున్నా, యజమాని వర్గ భావాలే ప్రధానంగా వుంటాయి.

**6**. 'వర్గాల'తో సంబంధం లేకుండా,
'మానవులు' అనే మాటని ఎప్పుడు ఉపయోగించవచ్చు?

**జ :** క్రిమి కీటకాలూ, పక్షులూ, జంతువులూ - వంటి ఇతర ప్రాణులతో పోల్చినప్పుడు, "జంతువులు శ్రమలు చెయ్యవు ; మానవులు శ్రమలు చేస్తారు. జంతువులు మాట్లాడవు ; మానవులు మాట్లాడతారు" - ఇలా జంతువులకూ, మానవులకూ వుండే తేడా, ప్రకృతికి సంబంధించిన తేడా. జంతువులతో పోల్చినప్పుడు, మానవులందరూ ఒకటే. కానీ, మానవుల్ని మానవులతోనే పోలిస్తే, మానవులందరూ ఒకటి కాదు. అప్పుడు, మానవుల్లోనే వుండే సాంఘిక తేడాల్ని చూడాలి. మానవుల్లో తేడా, ప్రకృతికి సంబంధించిన తేడా కాదు. మానవులందర్నీ ఒకే రకమైన పరిస్థితుల్లో జీవించే వారిగా భావించకూడదు. మానవుల్లోనే, 'యజమాని - మానవులూ ; బానిస - మానవులూ' అనే తేడాలతో చూడాలి. అంటే, ఏ మానవుణ్ణి అయినా, 'ఏ వర్గానికి చెందిన మానవుడు? యజమాని వర్గమా, బానిస వర్గమా?' అనే వివరాలతో చూడాలి.


# 44. భూస్వాముల సమాజం

బానిస యజమానుల ఆస్తులు, 2 రకాలు కదా?

(1) భూమీ + ఇతర పనిముట్లూ,

(2) శ్రమలు చేసే బానిసలూ.

ఇప్పుడు, 'బానిసత్వం రద్దు' వల్ల, యజమానులకు, రెండో ఆస్తి హక్కు పోయింది. అంటే, బానిసల మీద హక్కు పోయింది. ఇప్పుడు బానిసలు, బానిసలు కారు ; వాళ్ళు ఇప్పుడు, యజమాని ఆస్తి కాదు. వారిని, కొనే - అమ్మే - చంపే హక్కులు ఇప్పుడు యజమానులకు వుండవు. - ఈ ఒక్క మార్పు తప్ప, మిగిలిన విషయాలన్నీ బానిస సమాజంలో వున్నవే. భూమి అంతా, ఇప్పుడు కూడా యజమానుల ఆస్తే. ఈ యజమాని ఇప్పుడు, 'బానిస యజమాని' కాడు. 'భూమి'కే యజమాని.



కాబట్టి, అతను ఇప్పుడు - భూమికి స్వామి. 'భూస్వామి'. బానిస యజమానే, పేరు మారి, భూస్వామి అయ్యాడు.

శ్రమ దోపిడీ కొనసాగడానికి, మొదటి ఆస్తి హక్కు చాలు. భూమికీ, ఇతర ఉత్పత్తి సాధనాలకూ యజమానిగా వుండడం చాలు. ఆ ఉత్పత్తి సాధనాలేవీ లేని వాళ్ళు, వాటి దగ్గిరికే వస్తారు. భూమి లేని వాళ్ళు భూమి దగ్గిరికే వస్తారు. భూస్వామిగా మారిన ఈ యజమాని ద్వారా కూడా శ్రమ దోపిడీ ఎలా సాగుతుందో ఇప్పుడు చూడండి!

ఇప్పుడు, బానిసలు, బానిసలు కారు గదా? భూస్వామి భూమి మీద ఇప్పుడు పంటలు ఎవరు పండిస్తారు? భూస్వామి కుటుంబం వాళ్ళే, వాళ్ళ తిండి కోసం స్వయంగా శ్రమలు చేసుకుంటారా? చేసినా, వెయ్యి ఎకరాల మీద చెయ్యలేరు కాబట్టి, 5 ఎకరాలే వుంచుకుని, మిగతా భూమిని వదిలేస్తారా?

[ ఇదేం ఊహ! యజమానుల వర్గాన్ని అర్థం చేసుకోలేని ఊహ! ]

భూస్వామి భూమి మీద శ్రమలు ఎవరు చేస్తారా? బానిసలకు బానిసత్వం పోయింది గానీ, భూమి రాలేదు కదా? భూమి లేని వాళ్ళు, తిండి కోసం పంటలు ఎక్కడ పండించుకోవాలి? భూమి ఎక్కడ వుందో అక్కడికే వెళ్ళాలి కదా? అంటే, భూమి ఎవరి ఆస్తిగా వుందో వాళ్ళ దగ్గిరికి.

ఇప్పుడు, భూమి లేని మనుషులు, భూమి వున్న మనుషుల దగ్గిరికి వెళ్తారు. అంటే, భూస్వాముల దగ్గిరికి. "అయ్యా గారూ! మీ భూముల్ని పండించి పెడతాము. అనుమతి ఇవ్వండి!" అని అడుగుతారు. భూస్వామి కుటుంబం వాళ్ళకి ఎలాగూ శ్రమలు చేసే మనుషులు కావాలి కదా? గొప్ప దయతో అంగీకరించినట్టు, "సరే, పండించండ్రా!" అంటాడు భూస్వామి.

వెనకటి బానిస యజమానే, ఈ

భూస్వామి. వెనకటి వెయ్యి ఎకరాలే, ఈ భూస్వామి ఆస్తి. వెనకటి బానిసలే, ఇప్పటి శ్రామికులు. ఈ శ్రామికుల్ని 'రైతులు' అందాం.

రైతులతో భూస్వామి ఇలా అంటాడు: "మీలో ఒక్కొక్క కుటుంబం వాళ్ళు ఫలానా కొంత కొంత భూమిని విడి విడిగా తీసుకుని పండించండి. ఆ పంటలో ఒక ఎకరంన్నర పంట, ఒక కుటుంబం తిండికి. అలాగే, సాగు ఖర్చులకు కొంత. మిగతా దంతా నాకు అప్పగించండి! అది నాకు 'కౌలు'. భూమి నా ఆస్తి. నా భూమిని, మీరు బతకడానికి ఇస్తున్నాను కాబట్టి మీరు నాకు కౌలు చెల్లించాలి. అదీ షరతు" అంటాడు.

ఆ రకంగా, వెనకటి బానిసలు, కౌలు రైతులు అవుతారు. వెయ్యి ఎకరాల పంట లెక్కలన్నీ వెనకటి లాగే వుంటాయి. మొత్తం 100 రైతు కుటుంబాలన్నిటి పోషణకూ కలిసి - 150 ఎకరాల్లో పంట. ఒక్కొక్క కుటుంబానికి, సంవత్సరానికి, ఎకరంన్నర పంట. విత్తనాలూ, ఎరువులూ పనిముట్లూ వంటి ఖర్చుల కోసం 50 ఎక రాల్లో పంట. ఆ రెండూ పోగా మిగిలినది 800 ఎకరాల్లో పంట. అది భూస్వామి కుటుంబానికి కౌలు!

బానిస యజమాని దగ్గిర ఏం జరి గిందో, భూస్వామి దగ్గిర కూడా అదే జరుగు



తుంది! అయితే, భూస్వామి కుటుంబానికి, 'కౌలు' పేరుతో పోయేది ఏమిటి?

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. 'బానిస యజమాని' అంటే?
'భూస్వామి' అంటే?

**జ** : బానిస యజమానికి, భూమి మీదే గాక, శ్రమలు చేసే బానిసల మీద కూడా ఆస్తి హక్కు ఉంటుంది. భూస్వామికి, భూమి మీదే గానీ, శ్రమలు చేసే వారి మీద హక్కు ఉండదు.

**2**. బానిస యజమానే భూస్వామిగా మారతాడా?

**జ** : అంతే. బానిసల మీద ఆస్తి హక్కు పోయిన తర్వాత, భూమి మీద హక్కు మాత్రమే ఉంటుంది. కాబట్టి, అప్పటి నించీ ఆ బానిస యజమాని, భూస్వామిగా మిగులుతాడు.

**3**. 'అభివృద్ధి' అనే దాన్ని ఎలా అర్థం చేసు కోవాలి? ఏ వర్గానికి జరిగేది 'అభివృద్ధి' అవుతుంది?

**జ** : ఏ వర్గానికైతే అన్యాయం జరుగుతూ వుంటుందో, ఆ అన్యాయాన్ని తగ్గించే ఎంత చిన్న మార్పు అయినా, అది నిజమైన అభివృద్ధి. బానిసల జీవితాల్లో నించి బాని సత్వం పోతే, అది ఆ నాటి మానవుల సంబం ధాల్లో, మంచి మార్పు. ఆ మార్పు, బానిస యజమానిని కూడా ఒక దుర్మార్గం ⟶

నించి బైటికి తేగలుగుతుంది. ఆ రకంగా, అది, ఆ నాటి సమాజానికంతటికీ అభివృద్ధి. కానీ, ఆ మార్పు యజమాని వర్గానికి నచ్చదు. వీలైతే, మళ్ళీ బానిస యజమానులుగా తయారవడానికే ఆ వర్గం కలలు కంటూ వుంటుంది.

**4**. భూస్వామ్య సమాజం, బానిస యజమానుల సమాజం కన్నా అభివృద్ధికరమైనదా?

**జ** : తప్పకుండా. బానిసలు, యజమానుల ఆస్తిగా వుండే పరిస్తితి పోయిందంటే, అది బానిసలకు అభివృద్ధే. అది యజమానులకూ అభివృద్ధే. కానీ అది యజ మానులకు అర్థం కాదు.

**5**. భూస్వాముల సమాజంలో, బానిసత్వం ఉండదు కదా? అప్పుడు కూడా 'శ్రమ దోపిడీ' ఉంటుందా?

**జ** : ఏమిటీ ప్రశ్న? ఇప్పుడు కూడా ఈ ప్రశ్న అడిగితే, ఇప్పటి దాకా చదివింది ఏం అర్థమైనట్టు? 'అదనపు శ్రమ' ని లాగడం వుంటే, శ్రమ దోపిడీ వున్నట్టు కాదా? 'యజమానీ శ్రామిక సంబంధం' వుందంటే, అక్కడ శ్రమ దోపిడీ వున్నట్టే.

**6**. భూస్వామి, కౌలు రైతులకు యజమానా?

**జ** : తప్పకుండా. ఆ సంబంధం, యజమానీ శ్రామికుల సంబంధమే.

**7**. 'యజమానీ శ్రామిక సంబంధాల' వల్ల ఏమీ ఉపయోగాలు ఉండవా?

**జ** : ఈ ప్రశ్నకి అర్థం ఏమిటో తెలుసా?

"శ్రమ దోపిడీ వల్ల ఏమీ ఉపయోగం ఉండదా?" అని అడగడం! 'దోపిడీ వల్ల ఉపయోగం ఎందుకు ఉండదూ? బోలెడు ఉపయోగం ఉంటుంది. కానీ ఎవరికీ? యజమానులకు! శ్రామికులకు కాదు. 'ఉపయోగం' అనే మాటనే కాదు, ఏ మాటని అయినా, 'వర్గ కోణం' లో చూడాలి - ఈ వర్గానికా, ఆ వర్గానికా - అనే దృష్టితో. **H**

# 45. 'భూమి కౌలు' అంటే, శ్రమ దోపిడీ!

"భూమి, నా ఆస్తి" అంటాడు భూస్వామి.

"అవును, భూమి భూస్వామి ఆస్తే. భూమికి యజమాని ఆయనే కదా?" అంటారు, కౌలు రైతులు కూడా.

భూమి, ఎవరి ఆస్తీ కాదు - అనే విషయం, ఆ 2 వేపుల వాళ్ళకీ తెలియదు. భూమి, ప్రకృతి సహజంగా ఏర్పడిన పదార్థం. దాన్ని భూస్వామి చెయ్యలేదు. శ్రామికులూ చెయ్యలేదు. ఏ మనిషీ చెయ్యలేదు. భూమి మీద వ్యవసాయం పనులు జరగడానికి అవసరమయ్యే పారలూ, గునపాలూ, నాగళ్ళూ వంటి పని ముట్లన్నీ, వెనకటి బానిసలూ, ఇప్పటి రైతులూ, వారిలోనే చేతి వృత్తుల వారూ, చేసేవి.

'భూమి' లో, భూస్వామి శ్రమ ఏమీ వుండదు. 'పనిముట్లలో' కూడా భూస్వామి శ్రమ వుండదు. భూమి మీద వ్యవసాయం పనులు జరగాలంటే, భూమిని దున్నడం దగ్గిర్నించీ పంటని గాదుల్లో నింపడం వరకూ, అనేక కొత్త శ్రమలు జరగాలి. ఆ పనుల్లో అయినా, భూస్వామి చేసేది ఏమీ వుండదు. చివరికి, తయారైన



భూస్వామి, చేను దగ్గిరికి వచ్చి నించోడు. కానీ, శ్రమ చేసే మనిషినీ, శ్రమ చెయ్యని మనిషినీ, ఒకే చోట చూడడానికి ఈ బొమ్మ చక్కగా పనికి వస్తుంది.

పంటని చూస్తే, దాని కోసం, భూస్వామి శ్రమ, 'పాత శ్రమ' లో గానీ, 'కొత్త శ్రమ' లో గానీ, ఏ సందర్భంలోనూ వుండదు.

ఆ భూమిలో పండిన పంట, ఏ యే శ్రమల ద్వారా తయారవుతుంది? (1) కౌలు రైతు కుటుంబాల జనం చేసే కొత్త శ్రమల తోటీ, (2) విత్తనాలూ, పని ముట్లూ, ఎరువులూ - వంటి వాటి ద్వారా చేరే పాత శ్రమల తోటీ తయారవుతుంది. ఎప్పుడూ గుర్తు పెట్టుకోవలసిన విషయం - 'పాత శ్రమ' అనే దాంట్లో, భూమి నించి చేరే శ్రమ ఏదీ వుండదు. భూమి అసలు శ్రమతో తయారైనది కాదు కాబట్టి, దాని నించి చేరే శ్రమ ఏదీ వుండదు.

మొక్కలు పెరిగి, పంట పండడానికి, సహజంగా దొరికే ఒక పనిముట్టుగా భూమి కూడా కారణమే. కానీ, ఆ పంట కోసం, తన ద్వారా కొంత శ్రమని చేర్చడానికి భూమి కారణం కాదు. ఆ పంట కోసం, ఒక నాగలి, తన శ్రమని చేర్చినట్టుగా, భూమి ఏ శ్రమనీ చేర్చదు.

నాగలి లేకపోతే పని ఆగిపోతుంది. భూమి లేకపోయినా పని ఆగిపోతుంది. 'కౌలు' లేకపోతే పని ఆగిపోదు. స్వతంత్ర రైతు భూమికి కౌలు వుండదు. కౌలుగా కొంత ఉత్పత్తిని ఎవరికీ చెల్లించనక్కర లేదు. అయినా, ఆ భూమిలో కూడా పంట చక్కగానే పండుతుంది. అంటే, పంట పండడానికి, నాగలీ, భూమీ, నిజమైన అవసరాలు. 'కౌలు' నిజమైన అవసరం కాదు. 'కౌలు' అనేది, పని స్థలంలోకి వచ్చే ఒక పనిముట్టూ కాదు, ఒక శ్రమా కాదు. పంట పండడానికి, కౌలు చేసేది ఏమీ వుండదు. కౌలుని తీసుకునే భూస్వామి చేసేది ఏమీ వుండదు. భూమి మీద భూస్వామికి వున్న హక్కు, శ్రమతో సంబంధం లేని హక్కు. అది అబద్ధపు హక్కు. కౌలు, అబద్ధపు అవసరం.

పంట కోసం అవసరమైన మొత్తం శ్రమ, పాత - కొత్త శ్రమలు చేసిన జనాలదే. ఆ శ్రమలో, భూస్వామి భాగం, ఏ అంశం లోనూ వుండదు.

మొత్తం వెయ్యి ఎకరాల్లో పండిన పంట వివరాలు చూద్దాం. ఏ ఉత్పత్తి తయారవ్వాలన్నా, పాత - కొత్త శ్రమలు వుండాలి కదా? ఆ పంట కోసం అవసరమైన మొత్తం శ్రమలో నించి, పాత శ్రమ భాగాన్ని, 50 ఎకరాల పంట - అనుకుందాం. దాన్ని ఒక పక్కకి తీసి వుంచాలి. అది మళ్ళీ కొత్త సంవత్సరపు వ్యవసాయం ఖర్చుల కోసం అవసరమవుతుంది. 'మొత్తం శ్రమ' లో నించి పాత శ్రమని తీసేస్తే, మిగిలేది - కొత్త శ్రమ. అది 950 ఎకరాల పంట. అది, 100 కౌలు రైతు కుటుంబాలు చేసిన కొత్త

శ్రమ. ఆ పంట, ఆ కుటుంబాలకే అందితే, వారి శ్రమ ఫలితం వారికే అందినట్టు అవుతుంది. కానీ, ఒక్కొక్క రైతు కుటుంబం, ఒకటిన్నర ఎకరాల పంటతో మాత్రమే బతకాలి. 800 ఎకరాల పంటని భూస్వామికి కౌళ్ళుగా చెల్లించెయ్యాలి.

భూస్వాముల సమాజంలో కూడా 'కూలి, జీతం, వేతనం' అనే మాటలు ఇంకా లేవు. కానీ, అక్కడ ఆ మాటలు లేకపోయినా, రైతు కుటుంబాలకు అందేదే వాళ్ళకు 'కూలి'.


**పంట వివరాలు :**

| | | |
|---|---|---|
| మొత్తం పంట | - | 1,000 ఎకరాల పంట. |
| సాగు ఖర్చు | - | 50 ఎకరాల పంట. |
| కౌలు రైతుల శ్రమ | - | 950 ఎకరాల పంట. |
| కౌలు రైతుల పోషణ | - | 150 ఎకరాల పంట. |
| భూస్వామికి కౌలు | - | 800 ఎకరాల పంట. |


ఇది, రైతు కుటుంబాల అదనపు శ్రమ.

ఆ కౌలే, భూస్వామి కుటుంబానికి ఆదాయం. ఆ కుటుంబం, ఇంటా బైటా ఏ శ్రమలూ చెయ్యకుండా సుఖ విలాసాలతో గడపడానికి అదే మార్గం.

భూమి మీద అసలు శ్రమలన్నీ చేసేది రైతులే. ఆ భూమి మీద భూస్వామికి వున్న 'ఆస్తి హక్కు' అన్యాయపు హక్కు. ఏదైనా శ్రమ చేస్తే ఆ శ్రమ ఫలితాన్ని పొందడం న్యాయమైన హక్కు. అలాంటి న్యాయమైన హక్కు భూస్వామికి వుండదు. పండిన పంటలో నించి, గుప్పెడు ఊక అయినా అతనికి వెళ్ళనక్కర లేదు. కానీ 'కౌలు' పేరుతో రైతు కుటుంబాల శ్రమ అంతా అతనికే పోతుంది. భూస్వామి వసూలు చేసే కౌలు, 'శ్రమ దోపిడీ' కి ( శ్రమలు చెయ్యకుండా జీవించడానికి ) ఒక మార్గం!



భూస్వామి భవనం



కౌలు రైతు కొంప

వెనకటి బానిస యజమానుల ద్వారా జరిగేదే, తర్వాత కాలపు భూస్వాముల ద్వారా జరిగేది కూడా. కౌళ్ళు చెల్లించే ఈ రైతుల్ని 'శ్రమలు చేసే కౌలు రైతులు' అనాలి. ఎందుకంటే, శ్రమలు చెయ్యని కౌలు రైతులు కూడా కనపడతారు తర్వాత పాఠాల్లో. కాబట్టి, ఈ రైతుల్ని ఇలాగే అర్థం చేసుకోవాలి.

ఇక్కడ మనకు కొన్ని ప్రశ్నలు వస్తాయి. రావాలి. 100 రైతు కుటుంబాల మనుషులందరూ కలిస్తే, ఒక్క భూస్వామి కుటుంబం వాళ్ళతో పోరాడలేరా? ఆ కుటుంబం వాళ్ళని బంధించి పారేసి, ఆ భూమినంతా రైతు కుటుంబాలు పంచుకోవచ్చు కదా? కొంత భూమిని భూస్వామి కుటుంబానికి కూడా వదలాలి. అప్పుడు, ఆ బంధాల్లో పెట్టిన వాళ్ళని వదిలిపెట్టి, "మీ కోసం ఇచ్చిన భూమి మీద మీరే స్వయంగా పనులు చేసుకోండి" అని చెప్పాలి. రైతులు అలా చేస్తే, అది న్యాయమే గానీ

అన్యాయం కాదు కదా? అంత మంచి మార్గం వుండగా, వాళ్ళు అలా ఎందుకు చెయ్యలేదు? రైతులు ఎన్నో శ్రమలు చేస్తూ, బికారితనాలతో ఎందుకు బాధలు పడ్డారు? - ఈ ప్రశ్నలు వస్తే, అది మనం ఆలోచిస్తున్నామనడానికి గుర్తు.

రైతులు అలా ఎందుకు చెయ్యలేదంటే, "అలా చెయ్యడం తప్పు" అని వాళ్ళ నమ్మకం. "భూమి, భూస్వామి ఆస్తే" అని రైతుల అభిప్రాయం కూడా. భూమి ఎవరి ఆస్తీ అవదు - అని వాళ్ళకి తెలియదు. "కౌళ్ళు ఎందుకు చెల్లించాలి?" అనే ప్రశ్న వాళ్ళకు రాలేదు. కౌళ్ళు చెల్లించవలిసిందే. కాకపోతే, అవి మరీ ఎక్కువగా వుండకూడదని మాత్రమే వాళ్ళు కోరుకుంటారు. కౌళ్ళని తగ్గించమంటే భూస్వామి ఒప్పుకోడని రైతులకు తెలుసు.

భూమి వున్న మనిషి ఒప్పుకోనప్పుడు, ఇక ఒప్పుకోవలిసింది భూమి లేని మనుషులే కదా? "భూమిని మీరు పండించి, నాకు కౌళ్ళు చెల్లించండి" అని భూస్వామి చెప్పిన దానికే రైతులు తలలు వంచి, "చిత్తం అయ్యా! కౌళ్ళు తమరు చెప్పినట్టే చెల్లిస్తాము" అంటారు. అంటారు గానీ, చెల్లించడం వాళ్ళకు సాధ్యం కాదు.

శ్రమలన్నీ చేసేది రైతులే అయినా, వాళ్ళ శక్తి వాళ్ళకు తెలియదు. ఆ భూమినంతా తామే ఆక్రమించి, దాని మీద స్వతంత్రంగా శ్రమలు చేసుకోవచ్చునని వాళ్ళకు తెలియదు. ఎందుకంటే, భూములన్నీ భూస్వాముల ఆస్తులుగా వుండడం వాళ్ళు చిన్నతనం నించీ చూస్తున్నారు. వాళ్ళ లోకజ్ఞానం వాళ్ళకి, ఆస్తి హక్కులకు లొంగి వుండడమే నేర్పింది. "కౌళ్ళు ఎందుకు చెల్లించాలి?" అనే ప్రశ్న వాళ్ళకి రాదు. "కౌలు అంటే శ్రమ దోపిడీ" అనే రహస్యం వాళ్ళకి తెలియదు. భూస్వాములకూ తెలియదు. 'శ్రమ దోపిడీ' గురించి తెలియనప్పుడు, మిగిలిన జ్ఞానం అంతా అజ్ఞానమే! ఇరు పక్షాలా అజ్ఞానమే.

బానిస సమాజంలోనే పుట్టిన వస్తువుల - వర్తకమూ, వడ్డీ వ్యాపారమూ, ఈ భూస్వాముల సమాజంలో, మరి కొంత విస్తరిస్తాయి.

ఇక్కడ, 'స్వతంత్ర రైతుల్ని' కూడా ఊహించవచ్చు. వారికి చిన్న చిన్న భూములూ, పనిముట్లూ వుంటాయి. వారు, కౌలు రైతులూ కారు ; భూస్వాములూ కారు.

కానీ, ఈ సమాజంలో ప్రధాన వర్గాలు 'భూస్వాములూ, కౌలు రైతులూ' అనేవే.

కౌలు రైతులు - శ్రమలు చేసే వర్గం.

భూస్వాములు - శ్రమలు దోచే వర్గం.

ఈ సమాజంలో ఇవి, శత్రు వర్గాలు.

ఇక్కడ కూడా శ్రమ దోపిడీతో జీవించే యజమాని వర్గానికి, తమని కాపాడే 'రాజ్యాంగ యంత్రం'తో అవసరం వుంటుంది. ఈ రాజ్యాంగ యంత్రం, బానిస యజమానుల రాజ్యాంగ యంత్రానికి కొనసాగింపే.

భూస్వాముల ప్రభుత్వంలో, ఒక పెద్ద భూస్వామే 'రాజు'గా వుంటాడు. ఆ రాజుని, మిగిలిన భూస్వాములందరూ అంగీకరిస్తారు. ఆ రాజు గారు చేసే పరిపాలన అంతా, భూస్వాముల వర్గపు ఆస్తి హక్కుల్ని రక్షించడమే. ఏ రైతు, కౌలు చెల్లించలేకపోయినా, అతని కోసం, చెరసాలలూ, ఉరి కొయ్యలూ సిద్ధంగా వుంటాయి. ఏ రాజు పరిపాలనలో

అయినా, కొన్ని వేల మంది కౌలు రైతులు ఉరి కంబాల మీద కళ్ళు మూసి వుంటారు. 'రాజు' అనేవాడు, ఏ కాలంలో అయినా, మొదట తను స్వయంగా దోపిడీదారుడు. తర్వాత, ఇతర దోపిడీదారుల సహచరుడూ, సహాయకుడూ! మత గ్రంథాల్లో కనపడే ఏ రాజు అయినా, ఇలాంటి వాడే!

బానిస సమాజంలో జరిగిందే ఇక్కడ కూడా జరుగుతుంది. అదే రకం రాజ రికాలు! అదే రకం నిబంధనలు! అదే రకం యజమానితనాలూ - శ్రామికత్వాలూ! అదే రకం మత బోధనలు! అదే రకం కళలూ - పాండిత్యాలూ! అదే రకం సిరి సంప దలూ - బికారితనాలూ! అంతా అదే రకం శ్రమ దోపిడీ!

బానిస సమాజంలో స్వతంత్ర ఉత్పత్తి దారులు కూడా ఉన్నట్టు ఊహించాం. అలాగే, భూస్వాముల సమాజంలో కూడా స్వతంత్ర చేతి వృత్తుల వారినీ, స్వతంత్ర రైతుల్నీ ఊహించాలి. ప్రతీ దేశానికీ ఒక చరిత్ర ఉంటుంది. ఆటవిక కాలం నుంచీ సరైన సమాచారం దొరికితే, ఏ కాలంలో ఎలాంటి వర్గాలు ఉన్నాయో, ఒక వర్గంలో ఎలాంటి భాగాలూ విభాగాలూ ఉన్నాయో తెలుస్తుంది. బానిసల కాలంలో గానీ, కౌలు రైతుల కాలంలో గానీ, స్వతంత్ర చేతి వృత్తుల వారూ, స్వతంత్ర రైతులూ వుంటే, వారి శ్రమ పరిస్థితులు ఎలా వుంటాయో ఊహించాలి. వారికి యజమా నులు ఉండరు కాబట్టి, వారి జీవితాలు, బానిసల జీవితాల కన్నా, కౌలు రైతుల జీవితాల కన్నా బాగుంటాయని అర్థం చేసుకోవాలి.

బానిస సమాజం లాగే ఈ భూస్వామ్య సమాజం కూడా, ప్రతీ దేశంలోనూ, అనేక వందల సంవత్సరాలు సాగింది.

ఆ కాలంలోనే మధ్య మధ్య కౌలు రైతుల పోరాటాలెన్నో సాగాయి.

ఈ భూస్వామ్య సమాజం కొనసాగుతూ వుండగానే, ఆ సమాజంలోనే మరో రకపు దోపిడీదారుల సమాజం ప్రారంభమైంది. అది, పెట్టుబడిదారుల సమాజం!

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. భూమి మీద పంటలు పండించాలంటే, మొదట భూమి మీద ఎన్నో శ్రమలు చెయ్యాలి. భూమిలో చెట్లని కొట్టి, రాళ్ళూ రప్పలూ ఏరి, ఎత్తు పల్లాల్ని చదును చేసి, భూమిని సిద్ధం చెయ్యాలి. ఆ శ్రమ అంతా, 'భూమి విలువ' అవదా? ఆ భూమి, 'సహజ పదార్థం' ఎలా అవుతుంది? భూమి విలువని భూస్వామి 'కౌలు' పేరుతో తీసుకోవడం, 'దోపిడీ' ఎలా అవుతుంది?

**జ** : భూమిని, 'ప్రకృతి సహజ పదార్థం' అనడం, దాని మీద ఏ శ్రమలూ జరగక ముందు వున్న భూమిని! ఏ శ్రమలూ జరగని భూమికి విలువ వుండదు. ఒక భూమి మీద ఏ శ్రమ అయినా జరిగి వుంటే, ఆ విలువ, ఆ శ్రమదే గానీ, ఆ భూమిది కాదు. ఆ శ్రమ, వ్యవసాయం కోసం జరిగింది కాబట్టి, అది వ్యవసాయ శ్రమలో భాగం అవు తుంది. భూస్వామి, కౌలు కోసం ఇచ్చిన భూమి మీద, అంతకు పూర్వమే కొంత శ్రమ జరిగి, ఆ భూమి, 'సాన' అంత చదునుగా తయారై వుంటే, ఆ శ్రమ అంతా చేసింది, భూస్వామి కుటుంబ సభ్యులు కాదు. వెనకటి బానిసలు గానీ, కౌలు రైతులు గానీ చేసిన శ్రమ అది. భూమిని చదునుగా చేసిన శ్రమ విలువని 10 అనుకుంటే, ఆ విలువ, వ్యవసాయ శ్రమలోకి చేరుతుంది గానీ, అది భూమి విలువ అవదు. ఆ 10 విలువ కూడా, ఆ భూమిలో తర్వాత పండే పంట ⟶

విలువలోకి చేరుతుంది. భూమి మీద జరిగే ఏ శ్రమా, భూస్వామిది కాదు ; శ్రమ జరగక ముందు వున్న సహజ భూమీ భూస్వామిది కాదు. కాబట్టి, కౌలు రైతుల శ్రమ ద్వారా పండే పంటలో నించి భూస్వామి తీసుకునే భాగం - శ్రమ దోపిడీయే.

**2**. వెనకటి చరిత్రలో వున్న రాజులందరూ భూస్వాములేనా?

**జ :** వాళ్ళు భూస్వాములే కాదు ; బానిస యజమానులు కూడా. బానిసల సమాజంలో కూడా రాజులు వున్నారు. వాళ్ళందరూ పెద్ద పెద్ద బానిస యజమానులూ, భూస్వాములూ కూడా. మనం మత గ్రంథాల్లో గొప్ప గొప్ప పాలకులుగా చూసే రాజులందరూ, పరమ కౄరులైన దోపిడీ దొంగలైన బానిస యజమానులూ ; భూస్వాములూనూ!

**3**. 'శ్రమ దోపిడీ' సంగతి వెనకటి కాలంలో, బానిస యజమానులకు గానీ, భూస్వాములకు గానీ తెలియదు కదా? అది వాళ్ళ తప్పు ఎలా అవుతుంది?

**జ :** ఆ నాటి యజమానులకు తాము చేసే దేమిటో తెలియకపోయినా, వాళ్ళు చేసింది అయితే శ్రమ దోపిడీ! ఎవరి శ్రమతో అయితే వాళ్ళు సుఖ భోగాలు అనుభవించారో, ఆ సేవకుల పట్ల వాళ్ళు భయంకరమైన కౄరత్వాలు ప్రదర్శించారు. ఆ కౄరత్వాలన్నీ తెలిసి చేసినవే. శ్రమ దోపిడీ గురించి ఆ నాడు తెలిస్తే, వాళ్ళు దాన్ని వదిలి పెట్టేసేవారా? ఆ నాడే వాళ్ళకి అంతా తెలిసినా వాళ్ళు దాన్ని వదిలి పెట్టేవారు కాదనడానికి, ఈ నాటి పెట్టుబడిదారులే రుజువు. తర్వాత పాఠాలు కూడా చూడండి!

**4**. ఒక కుటుంబానికి చిన్న స్వంత భూమి ఉంది. దాని మీద వాళ్ళే రక రకాల శ్రమలు చేసుకుంటారు. ఆ భూమికి వాళ్ళు యజమానులే కాబట్టి, వాళ్ళు 'భూస్వాములు' అవుతారా?

**జ :** అలా అవరు. వాళ్ళు స్వతంత్ర రైతులు. భూమిని కౌలుకి ఇచ్చి, స్వంత శ్రమ లేకుండా 'కౌళ్ళు' అనే ఆదాయాల ద్వారా జీవించే వాళ్ళే భూస్వాములు.

**5**. ఒక స్వతంత్ర రైతు, తన భూమిలో కొంత భాగాన్ని కౌలుకు ఇచ్చి, మిగిలిన భాగం మీద తనే శ్రమ చేసుకుంటాడు. అతనికీ కొంచెం కౌలు వస్తుంది. అతను భూస్వామి అవుతాడా?

**జ :** భూస్వామీ అవడు ; స్వతంత్ర రైతూ అవడు. అతను, తన శ్రమతో కొంతా, దోపిడీ శ్రమతో కొంతా జీవించే అర్ధ రైతూ, అర్ధ భూస్వామీ అవుతాడు.

**6**. ఈ బొమ్మలో ఏం కన పడుతోంది?



**జ:** ఇద్దరు మనుషులు ఉన్నారు. ఒకరు పని చెయ్యడం లేదు. ఒకరు పని చేస్తున్నారు. ఒక్కరి పనితోనే ఇద్దరూ జీవిస్తారు.

[ ఈ బొమ్మ, ఈ పుస్తకంలో బొమ్మలన్నీ వేసిన అప్పలరాజు గారిది కాదు. దీన్ని ఒక 'వయోజన వాచకం' నించి తీసుకున్నాను. ఈ బొమ్మ వేసిన చిత్రకారుడి పేరు దొరకలేదు.]

**7**. 'జమీందారు' అంటే ఎవరు?

**జ :** 'జమీన్' అంటే భూమి. జమీన్‌దార్ అంటే భూమి గల వాడు. అయితే, ఒకటో రెండో ఎకరాల భూమి వున్నవాడు జమీందారు అవడు. వేల ఎకరాలు వున్నవాడే జమీందారు. ఇతడి దగ్గిర చాలా ఆఫీసులూ, ఉద్యోగులూ, ఊళ్ళ వెంట తిరిగి రైతుల నించి కౌళ్ళని వసూలు చేసే యంత్రాంగమూ, అన్నీ వుంటాయి. 'జమీందారీ' అంటే, ఒక ప్రాంత ప్రభుత్వం. వంద ఎకరాల భూస్వామి విలాసాల్ని మించిన విలాస జీవిత విధానం ఇది.

# 46. పెట్టుబడిదారీ విధానం ప్రారంభం!

బానిస సమాజాన్ని చూశాం.

భూస్వామ్య సమాజాన్ని కూడా చూశాం.

ఇక, ఇప్పుడు, 'పెట్టుబడిదారీ సమాజాన్ని' చూడబోతున్నాం. ఈ నాడు, ప్రపంచ జనాభా అంతా వున్నది ఈ పెట్టుబడిదారీ విధానంలోనే!

[ 'సోషలిజం' పేరుతో వున్న చైనా, నిజానికి సోషలిజంగా లేదు. పెట్టుబడిదారీ సమాజంగానే వుంది. కాబట్టి, మొత్తం ప్రపంచం అంతా పెట్టుబడిదారీగా వున్నట్టే.]

'పెట్టుబడిదారీ విధానం' అంటే, కేవలం అమ్మకం కోసమే ఉత్పత్తుల్ని తయారు చేయించే విధానం. ఈ విధానం వల్ల, సరుకుల్ని ఉత్పత్తి చేయించే లాభం ( ఉత్పాదక లాభం ) వస్తుంది.

అమ్మకాల కోసమే సరుకుల్ని ఉత్పత్తి చేయించే ఈ రకమైన విధానం, బానిసల కాలంలో గానీ, కౌలు రైతుల కాలంలో గానీ లేదు. ఆ వెనకటి కాలాల్లో తయారయ్యే ఉత్పత్తులు, యజమానుల - శ్రామికుల కుటుంబాల వాడకాల కోసమే. అలా వాడుకోగా మిగిలే ఉత్పత్తులనే అమ్మకాల కోసం ఇచ్చేవారు. ఆ నాటి వర్తకులు, బానిస యజమానుల దగ్గిర గానీ, స్వతంత్ర ఉత్పత్తిదారుల దగ్గిర గానీ, సరుకుల్ని కొని, కావలసిన వారికి అమ్మి, వర్తక లాభం తీసుకునే వారు. భూస్వాముల కాలంలో కూడా అలాగే జరిగింది. ఆ కాలాల్లో, ఇంకా, అమ్మకం కోసమే ఉత్పత్తుల్ని తయారు చేయించి, వాటి ద్వారా 'ఉత్పాదక లాభం' పొందే విధానం ఇంకా లేదు. అదే ఇప్పుడు క్రమ క్రమంగా ప్రారంభమవుతోంది. దాన్నే ఇక నించీ చూస్తాం.

వెనకటి సమాజాల్లో, యజమానుల దగ్గిర శ్రమలు చేసిన బానిసలూ, కౌలు రైతులూ, రోజూ ఎంతెంత శ్రమలు చేసే వారో వారికి లెక్కలు తెలిసే మార్గం ఆ నాడు లేదు. ఆ మనుషులు చేసిన శ్రమలో నించి వారి పోషణ కోసం వారికి రోజూ ఎంత భాగం అందేదో దానికి కూడా లెక్కలు తెలిసే మార్గం లేదు. అక్కడ తయారైన ఉత్పత్తి రాసిలో, ఎక్కువ భాగం అమ్మకాలకు వెళ్ళేది కాదు. ఆ ఉత్పత్తి రాసికి ఎంత విలువ వుంటుందో, దానికీ లెక్కలు తెలియవు. ఆ సమాజాల్లో, ఉత్పత్తిలో ఏ అంశానికీ లెక్కలు తెలియడం సాధ్యం కాని పరిస్తితులే ఉండేవి. ఆ సమాజాల్లో శ్రమ దోపిడీ జరుగుతోన్నా దాన్ని అర్థం చేసుకోవడం, ఆ నాడు ఏ మేధావికీ సాధ్యం కాలేదు.

శ్రమ దోపిడీ ని గ్రహించడం సాధ్యం కావాలంటే, ఈ పరిస్తితులు వుండాలి :

( 1 ) యజమానుల దగ్గిర శ్రమలు చేసే వారికి, 'జీతం' ఇవ్వడం, అది కూడా డబ్బుతో ఇవ్వడం, ఉండాలి.

( 2 ) యజమానుల దగ్గిర తయారైన ఉత్పత్తిలో ఎక్కువ భాగం, అమ్మకంలోకి వెళ్ళిపోవాలి. - ఈ 2 రకాల పరిస్తితులూ ఏర్పడితే, 'విలువ' గురించి అర్థం చేసుకోవడం సాధ్యం అవుతుంది. 'విలువ'ని సరిగా అర్థం చేసుకుంటేనే, 'శ్రమ దోపిడీ'ని అర్థం చేసుకోవడం కూడా సాధ్యమవుతుంది.

క్రమంగా ఆ 2 రకాల పరిస్తితులూ ఏర్పడ్డాయి. పరిస్తితులు అయితే ఏర్ప డ్డాయి గానీ, ఆ తర్వాత కూడా 'శ్రమ దోపిడీ రహస్యాన్ని' కనిపెట్టడానికి వందల సంవత్సరాలు పట్టింది.

ఇప్పుడు మనం ఒక 'పెట్టుబడి దారుడి' తో ప్రారంభించాలి. దీని వల్ల, పెట్టుబడిదారీ సమాజం అంటే ఏమిటో తెలుస్తుంది. ఈ సమాజంలో అందరూ ఎలా జీవిస్తున్నారో తెలియాలి. మనం ఈ నాడు ఎలాంటి సంబంధాల్లో వున్నామో మనకు తెలియాలి. 'సారాంశం'లో అయితే, వెనకటి సమాజాలకూ, ఇప్పటి సమాజానికీ తేడా ఏమీ వుండదు. వెనకటి కాలపు శ్రమ దోపిడీనే ఇప్పుడు మళ్ళీ చూస్తాం. కానీ, దాన్ని చాలా వివరాల తోటీ, లెక్కల తోటీ చూస్తాం.

చలపతి అనే ఒక ధనికుడు వున్నాడు. "ఎక్కడ?" అంటారా? ఎక్కడైనా వున్నాడు. ధనికులు, అన్ని దేశాల్లోనూ వున్నారు కదా? చలపతి అయితే, భారత దేశంలోనే, తెలుగు రాష్ట్రంలోనే, అన్ని ఊళ్ళల్లోనూ వున్నాడు. ఈయన దగ్గిర చాలా డబ్బు వుంది. అది ఎలా చేరిందంటే, ఆయన ముత్తాతల ముత్తాతలు, బానిస యజ మానులుగా కొన్ని ఆస్తులు సంపాదించారు. భారత దేశంలో కూడా బానిసత్వం వుండేదా అని ఆశ్చర్యపోకండి! భారత దేశపు మత గ్రంథాల్లో, బానిసల్లాంటి వాళ్ళు బోలెడు మంది కనపడతారు. ఒక రాజు, ఇంకో రాజుకి కొందరు బానిసల్నీ గుర్రాల్నీ బహుమతులుగా పంపుతాడు. ధనవం తులు, తమ కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేసి అత్త వారింటికి పంపేటప్పుడు, ఆమెతో పాటు ఆడ బానిసల్ని కూడా పంపిస్తారు. ఇలాంటి కథలు బోలెడు!

'భారత దేశంలో బానిసత్వం ఉండేదా?' అనే విషయం మీద అనేక మంది మేధా వులు చేసిన పరిశోధనలు ఉన్నాయి. "భారత దేశంలో కూడా బానిసత్వం ఉండేది" అని కొందరు అంటారు ; "ఉండేది కాదు" అని కొందరు అంటారు. "ఉండేది గానీ, ఇతర దేశాల్లో ఉన్న లాంటిది కాదు. కొన్ని తేడాలతో ఉండేది" అని కొందరు అంటారు. ఈ నాడు మనకు తెలిసిన పరిస్తితుల్లో కూడా అక్కడక్కడా 'వెట్టి చాకిరీ' గాథలు వింటూ వుంటాం. వెట్టి చాకిరీ అంటే, జీతం లేకుండా శ్రమ చెయ్యడమే. అమ్మే - కొనే - చంపే హక్కులు ఉండవు. ఇది, భారత దేశంలో ఈ నాడు కూడా కనపడుతూనే వుంది.

ఏ విధానం అయినా ప్రతి చోటా ఒకే రకంగా ఉండకపోవచ్చు. కొన్ని లక్షణాలు తేడాగా వుంటాయి. ప్రధానంగా వుండే లక్ష ణాల్ని మొదట తెలుసుకుంటే, మార్పుల్ని కూడా తెలుసుకోవచ్చు. భారత దేశంలో బానిసత్వం వున్నా లేకపోయినా, కుప్ప తెప్పలుగా ధనం వున్నవాళ్ళయితే వున్నారు.

చలపతి ముత్తాతల మనవళ్ళు భూ స్వాములుగా మరిన్ని ఆస్తులు కూడ బెట్టారు. అంతే కాదు, ఆ వెనకటి వాళ్ళు, వస్తువుల్ని కొని అమ్మే వర్తకాలు కూడా చేశారు. అప్పులు ఇచ్చి వడ్డీలు లాగారు. ఆ రకంగా, తాతల నాటి నించీ, తండ్రుల నాటి నించీ, చలపతీ వాళ్ళ లోగిట్లో పద కొండు ఇనప్పెట్టెలు వున్నాయి. అలాంటి ధనవంతుల ఇంట్లో పుట్టినముని మన వడు ఈ చలపతి. అందుకే అతని దగ్గిర 'డబ్బు' వుంది. పన్నెండో ఇనప్పెట్టి కూడా చేయించాలని అతడికి చాలా కోరిక.

అసలు అతడి కడుపులో రహస్యంగా వున్న కోరిక అయితే, నూట పన్నెండో ఇనప్పెట్టి దాకా ఎదగాలని! తండ్రుల్నీ తాతల్నీ ముత్తాతల్నీ చూస్తూ పెరిగిన బాల్యంలో, ఈ బాలుడికి, ఆ పెద్దలందర్నీ మించి పోవాలని పదకొండో యేట నించే కోరిక బైల్దేరింది. పదకొండేళ్ళకి రెండేళ్ళ తర్వాత నించీ రక రకాల వ్యాపారాల గురించి వాకబులు చెయ్యడం మొదలుపెట్టాడు. చివరికి 23 డో యేట, సైను బట్టని తయారు చేయించే వ్యాపారం మొదలు పెట్టాలనుకున్నాడు. ఆ బట్టని తయారు చేయించి అమ్మాలి. అంతే. ఆ పని, ఏ నాటి నించో స్వతంత్ర చేతి వృత్తుల వాళ్ళు చేస్తూనే వున్నారు. కానీ, అదే వ్యాపారానికి, ఈ యువకుడు, 'పరిశ్రమ' అని పేరు పెట్టాడు. తన పేరులోకి 'పరిశ్రమ దారుడు' అనే మాట కూడా చేర్చుకున్నాడు.



అతనికి, ఏ శ్రమా రాదు.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. 'పెట్టుబడి దారుడు' అంటే?

**జ** : ఏదైనా ఒక ఉత్పత్తిని, అమ్మకం కోసం, కూలీల ద్వారా తయారు చేయించేవాడు. ఆ ఉత్పత్తి తయారీ కోసం అవసరమైన పెట్టుబడి పెట్టేవాడు.

**2**. 'పరిశ్రమ' అంటే?

**జ** : ఏదైనా ఉత్పత్తిని, అమ్మకం కోసం తయారు చేయించడమే - పరిశ్రమ. ఆ వ్యవహారం నడిపే వ్యక్తి - పరిశ్రమ దారుడు. పెట్టుబడిదారుడే పరిశ్రమదారుడు.

**3**. బానిస యజమాని గానీ, భూస్వామి గానీ, వాళ్ళు కూడా తమ చేతికి అందిన ఉత్పత్తిలో కొంత భాగాన్ని అమ్ముతారు కదా? పెట్టుబడిదారుడే ఉత్పత్తిని అమ్ముతాడు అనడం ఏమిటి?

**జ** : బానిస యజమానులూ, భూస్వాములూ అమ్మే ఉత్పత్తి చాలా తక్కువ. పెట్టుబడి దారుడి పరిశ్రమ, అలా ఉండదు. తర్వాత పాఠాల్లో చూడండి!

**4**. ఈ పెట్టుబడిదారులు ఎక్కణ్ణించి వచ్చారు?

**జ** : ఎక్కణ్ణించీ రాలేదు. వాళ్ళూ దేశంలో వున్న వాళ్ళే. బానిస యజమానుల కాలం నించీ వర్తకం ఉంది. వడ్డీ వ్యాపారం ఉంది. భూస్వాముల కాలంలో కూడా అదంతా ఉంది. ఆ వ్యాపారాల ద్వారా కొంత డబ్బు కూడ బెట్టడం ఉంటుంది. ఉత్పత్తుల్ని ఒక చోట కొని, ఇంకో చోట అమ్మే సాధారణ వర్తకులే క్రమంగా, ఉత్పత్తుల్ని తమ దగ్గిరే తయారు చేయించే పరిశ్రమలు మొదలు పెడతారు. ఒక వర్తకుడు, ఒక పరిశ్రమ పెట్టాడంటే, కొంచెం డబ్బు వున్న అనేక మంది, చక చకా అదే మార్గం తొక్కుతారు. డబ్బుని పెంచుకునే మార్గం కదా అది? కాబట్టి, పెట్టుబడిదారులు అంటే, వాళ్ళు ఎక్కడి నించో వచ్చారని కాదు. ఇక్కడి వర్తకుడే, పరిశ్రమ ప్రారంభిస్తాడు. వడ్డీల ద్వారా డబ్బు సంపాదించిన వాళ్ళయినా పరిశ్రమ ప్రారంభించగలరు.

**5**. పరిశ్రమదారుడు, ఏం శ్రమ చేస్తాడు?

**జ** : బానిస యజమాని ఏం శ్రమ చేస్తాడు? భూస్వామి ఏం శ్రమ చేస్తాడు? ఆ శ్రమే పరిశ్రమదారుడు కూడా చేస్తాడు.

# 47. పెట్టుబడి లక్ష్యం - లాభం!

సైను బట్ట పరిశ్రమ పెట్టిన పరిశ్రమ దారుడికి, ఏ శ్రమా రాదు. ఏదో కాస్త చదువు మిడికాడు. లెక్కలు బాగా చూసుకో గలడు. ఇతని చిన్నప్పుడు, ఒక దగ్గుల ముత్తాత కూడా ఇంట్లో వుండేవాడు. ఆయన ఎప్పుడూ చుట్టలు కాలుస్తూ, దగ్గుతూ, మంచం పక్కనే చీదుతూ, "పనులు చెయ్యడం మనకు తగదురా! అది నామోషీ పని. పనులన్నీ కూలి వాళ్ళు చెయ్యాలి" అని రోజూ బోధనలు చేసే వాడు. ఆ మాటలు, ఈ ముని మనవడికి, గొప్ప గొప్ప సూక్తుల్లాగ ఎంతో నచ్చేవి. ఈ నాటికీ ఆ మాటలే చెవుల్లో గింగిర్లెత్తుతూ వుంటాయి. ఏ శ్రమా రాని చలపతి, పరిశ్రమ దారుడయ్యాడు!

తన సైను బట్ట పరిశ్రమకి ఎంత డబ్బు కావాలో లెక్కలు వేసుకున్నాడు. ఒక్క రోజు అవసరాల కోసం మొత్తం 100 రూపాయలు కావాలని తేలింది. ఇనప్పెట్టిలో అలాంటి 100 లు చాలా వున్నాయి. ఒక 100 ని బైటికి తీశాడు. కొంత దారం కొన్నాడు. అది, ముడి పదార్థం. మగ్గాలూ, తట్టలూ, బుట్టలూ, కొన్నాడు. అవి, పని ముట్లు. ఇంకా కొన్ని కొన్నాడు. అవి, సహాయక పదార్థాలు. ఒక షెడ్డు లాంటి పని స్థలాన్ని కూడా ఏర్పాటు చేశాడు. ఆ స్థలం, ఆ కుటుంబానిదే. పని స్థలం లేకపోతే పని జరగదు కదా? కాబట్టి, అది కూడా ఒక పనిముట్టు. ఏదైనా ఒక ఉత్పత్తి తయారవ్వాలంటే, దాని కోసం ఏ యే వస్తువులు కావాలో, వాటన్నిటికీ కలిసి ఒక పేరు వుంటుంది కదా? 'ఉత్పత్తి సాధనాలు' అనే పేరు. ఉత్పత్తి తయారవడానికి అవన్నీ 'సాధనాలు' అన్నమాట.

పని స్థలం, భూమి మీదే వుంటుంది కదా? కాబట్టి, కొంత భూమి కూడా కావాలి. ఆ భూమి కూడా ఒక సాధనం. వ్యవసాయం జరగడానికే కాదు, ఏ 'పరిశ్రమ' జరగాలన్నా, ఏ 'వ్యాపారం' జరగాలన్నా, దాని కోసం కొంత భూమి కావాలి. అయితే, భూమి, శ్రమతో తయారైనది కాదు కాబట్టి, భూమికి 'విలువ' వుండదు. ఆ భూమి మీద వున్న షెడ్డుకో, బిల్డింగుకో అయితే, విలువ వుంటుంది. భూమి ఒక్కటే సహజంగా దొరికే సాధనం. మిగతావి అన్నీ, శ్రమల వల్ల తయారయ్యే సాధనాలే.


చలపతి పెట్టిన పరిశ్రమలో, ఉత్పత్తి సాధనాలన్నిటికీ కలిసి 80 రూ.లు అయింది. ఇది ఒక్క రోజు కోసం సాధనాల లెక్క.

ఇక తర్వాత ఇంకా ఏం కావాలి? బట్టని తయారుచెయ్యడం తెలిసిన మనుషులు కావాలి. వాళ్ళు 10 మంది కావాలని తేలింది. పరిశ్రమదారుడు, వాళ్ళని కూడా కుదుర్చుకున్నాడు.

[ ఆ మనుషులు ఎవరు? వాళ్ళు ఎలా దొరికారు? - దీన్ని తర్వాత చూస్తాం.]

పని చేసే మనుషులకు 'కూలి' ఇచ్చే పద్ధతి ఇటువంటి పరిశ్రమదారుల దగ్గిరే మొదలైంది. ఇక్కడ ఒక మనిషికి, ఒక

రోజుకి కూలి - 2 రూ.లు. చలపతికి కావలసిన 10 మంది కోసం మొత్తం కూలి 20 రూ.లు. ఇవన్నీ ఒక్క రోజు లెక్కలు.



ఒక రోజు పొద్దున్నే, ఆ మనుషులు, పని స్థలం లోకి వచ్చి ఎవరి చోట్లో వాళ్ళు కూర్చుని పని మొదలుపెట్టారు. రాత్రి అయ్యేటప్పటికి, 12 గంటల సేపు చేసి, ఆ రోజు పని పూర్తి చేశారు. దారం అంతా, బట్ట లాగా మారిపోయి ముద్దొస్తూ బల్ల మీదకి చేరింది.



అంత సేపూ పరిశ్రమదారుడు తన గదిలో, పరుపుల కుర్చీలో కూర్చుని, వార్తా పత్రికల్లో వ్యాపారాల శీర్షికలు తిరగేస్తూ, మధ్య మధ్య అల్పాహారాలూ పానీయాలూ సేవిస్తూ, అప్పుడప్పుడూ చిన్న చిన్న కునుకులు కూడా తీస్తూ, పరిశ్రమని నడిపాడు.

చివరికి, బట్ట తయారైందని తెలిశాక గంభీరంగా లేచి అక్కడికి వచ్చాడు. పని వాళ్ళకి 20 రూ.లు ఇచ్చి, "సరిపోయిందా? రేపు మళ్ళీ రండి!" అన్నాడు. పని వాళ్ళు అలిసిపోయి, నిరుత్సాహంగా వెళ్ళిపోయారు.

'డబ్బు - కూలి' తీసుకునే పద్ధతి మీద పనిచేసే పనివాళ్ళు - కార్మికులు.

[ బానిసలూ, కౌలు రైతులూ, కార్మికులూ - వీరందరూ శ్రామికులే. కానీ, ఆ పేర్లలో తేడాల వల్ల, ఎవరు ఏ సమాజంలో శ్రామికులో తెలుస్తుంది.]

చలపతి, కొత్త ఉత్పత్తి దగ్గిర ( బట్ట దగ్గిర ) నిలబడి మళ్ళీ లెక్కలు వేశాడు. దాని కోసం తను ఖర్చు పెట్టింది :

( 1 ) ఉత్పత్తి సాధనాల కోసం 80.
( 2 ) పని వాళ్ళ కూలి కోసం 20.
మొత్తం 100.

ఈ రెండు ఖర్చులకూ కలిసి ఒక పేరు వుంది. 'పెట్టుబడి' అనే పేరు. పెట్టుబడి పెట్టిన వ్యక్తి, పెట్టుబడిదారుడు. అంటే, చలపతి, ఒక పెట్టుబడిదారుడు. ఒక పరిశ్రమదారుడు. ఇతడు, వెనకటి బానిస యజమాని కాడు. భూస్వామి కాడు.

చలపతి ఇప్పుడు ఆ సైను బట్టని ఏం చేస్తాడు? తన ఇంట్లో వాడుకుంటాడా? అది, అతని ఇంటి అవసరాల కోసం కాదు. అమ్మడం కోసమే. అమ్మితే ఎవరు కొంటారు? - ఆ బట్ట కావలసిన వాళ్ళే కొంటారు. ఇతర పెట్టుబడిదారులూ, కార్మికులూ కూడా.

దాన్ని చలపతి ఎంత ధరతో అమ్ముతాడు? దాని కోసం 100 రూపాయలు ఖర్చుపెట్టాడు కదా? కాబట్టి, దాన్ని 100 రూపాయలకి అమ్ముతాడా? - అలా గైతే, అతను ఖర్చు పెట్టిందే అతనికి

వస్తుంది. పరిశ్రమ పెట్టింది, 100 ని ఖర్చు పెట్టి, మళ్ళీ దాన్ని వెనక్కి తీసుకోవడాని కేనా? అలాగైతే, ఆ పరిశ్రమ గోల ఎందుకు? ఆ 100 నే తన దగ్గిర వుంచుకో వచ్చు కదా?

కాబట్టి, అలా కాదు. పరిశ్రమ నడిపేది, ఖర్చు పెట్టినదాన్ని మాత్రమే వెనక్కి తీసుకోవడానికి కాదు. అది ఎలాగూ వెనక్కి రావలసిందే. కానీ, అంతే కాదు. దాని కన్నా 'ఎక్కువ' రావాలి. ఎక్కువ అంటే ఎంత 'ఎక్కువ'? ఎంత ఎక్కువ వచ్చినా అతనికి ఇష్టమే గానీ, ఎంత రావాలో, ఎంత వస్తుందో, అతనికి కూడా తెలీదు. కాస్సేపు బజార్లో విషయాలు ఆలోచించాడు. అతని లాంటి పెట్టుబడిదారులే ఇంకా కొందరు, అదే రకం సైను బట్టని తయారు చేయిస్తున్నారు. అమ్ముతున్నారు. వాళ్ళందరూ ఎంత ధరతో అమ్ముతున్నారో చూశాడు. తను కూడా అలాగే అమ్మాలి కదా? అంత కన్నా ఎక్కువ ధరతో అమ్మితే, కొనే వాళ్ళు, తన దగ్గిర ఎందుకు కొంటారు? తక్కువ ధరతో దొరికే చోటుకే పోతారు కదా? కాబట్టి, తను, ఇతర పెట్టుబడిదారుల కన్నా ఎక్కువ ధరతో అమ్మలేడు. అంతే ధరతో అమ్మాలి. కొంత తక్కువ ధరతో అయితే, మరీ మంచిది. అందరూ ఇక్కడికే వచ్చి కొంటారు. - ఆ రకంగా, చలపతి తెగ ఆలోచించి, తన బట్టకి 120 ధర నిర్ణయించాడు. అంటే, తను పెట్టిన 100 మీద, ఇంకో 20 ని వేసుకున్నాడు.

ఆ రాత్రి వెంటనే ఒక వర్తకుణ్ణి పిలిచాడు. "ఇదుగో వర్తకుడూ! ఈ బట్టని అమ్మి పెట్టు! 120 ధరకి అమ్ము! ఆ ధరతో అమ్ముడు పోకపోతే కావాలంటే అప్పుడు ధరని కొంచెం తగ్గించు. కానీ, వీలైతే 120 కి అమ్మడానికే చూడు! ఎంత వచ్చిందో మొదట ఆ డబ్బు నా దగ్గిరికి తీసుకురా! నీకు ఇచ్చేది అప్పుడు ఇస్తాను" అని చెప్పాడు.

వర్తకుడు, ఆ బట్టని, ఆ రాత్రే పట్టుకు పోయాడు. ఆ మర్నాడే అమ్మేశాడు. 120 కే. ఆ డబ్బు తెచ్చి పరిశ్రమదారుడుకి ఇచ్చాడు. వెంటనే చలపతి, ఆ 120 లో నించే ఒక 5 ని తీసి వర్తకుడికి ఇచ్చాడు. "ఇదుగో, నీ 'వర్తక కమిషన్' " అన్నాడు. - ఇవన్నీ ఒక్క రోజు లెక్కలే.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. 'ఉత్పత్తి సాధనాలు' అంటే?

**జ** : ఒక ఉత్పత్తి జరగాలంటే, దాని కోసం, ఏ యే సాధనాలు కావాలో అవన్నీ కలిసి - ఉత్పత్తి సాధనాలు. (1) ముడి పదార్థాలూ, (2) పనిముట్లూ, (3) సహాయక పదార్థాలూ. - ఈ 3 రకాలూ కలిసి ఉత్పత్తి సాధనాలు. కొన్ని శ్రమల్లో, ముడి పదార్థాలు వుండవు. మిగిలిన 2 అంశాలే, అక్కడ ఉత్పత్తి సాధనాలు.

**2**. భూమి, ఉత్పత్తి సాధనమా, కాదా?

**జ** : ఏ ఉత్పత్తి తయారవ్వాలన్నా భూమి మీదే జరగాలి. వ్యవసాయం, భూమి మీదే ; పరిశ్రమలు అయినా భూమి మీదే. కాబట్టి, ఏ ఉత్పత్తికైనా, భూమి కూడా ఉత్పత్తి సాధనమే.

⟶

**3**. భూమి శ్రమతో తయారైనది కాదు కదా? అది ఆస్తి అవుతుందా?



**జ** : అవదు. కానీ, అది ఉత్పత్తి సాధనం. అది లేకపోతే ఏ పనీ జరగదు. కాబట్టి, అది వుంటే, ఉత్పత్తి సాధనం ఉన్నట్టే. కానీ, అది, ఏ వ్యక్తికీ స్వంత ఆస్తి కాదు. దాన్ని స్వంత శ్రమతో ఉపయోగించుకోవాలి. అంతే.

**4**. భూమి, ఉత్పత్తి సాధనాల్లో ఏ కోవలోకి వస్తుంది? ముడి పదార్థమా, పనిముట్టా, సహాయక పదార్థమా?

**జ** : భూమి - కొత్త ఉత్పత్తి శరీరంలోకి చేరదు. కాబట్టి అది ముడి పదార్థం కాదు. ఉత్పత్తి తయారయ్యేటప్పటికి భూమి కనపడ కుండా పోదు. కాబట్టి, అది సహాయక పదార్థం కాదు. ఇక మిగిలింది - పనిముట్టే. భూమి ఎప్పుడూ పనిముట్టే.

**5**. భూమి .................... కారణమే.
భూమి .................. కారణం కాదు. దీన్ని వివరించండి!

**జ** : ఏ ఉత్పత్తి తయారవడానికైనా, ఏ పని జరగడానికైనా, భూమి కూడా కారణమే. కానీ, ఆ ఉత్పత్తి కోసం అవసరమయ్యే శ్రమకి, భూమి కారణం కాదు. కాబట్టి, ఏ ఉత్పత్తి ' విలువ' కీ భూమి కారణం కాదు.

**6**. ' ఉత్పత్తి క్రమం' అంటే? ' శ్రమ క్రమం' అంటే?

**జ** : కొత్త ఉత్పత్తిని తయారుచేసే క్రమం అంతా - ఉత్పత్తి క్రమం. శ్రమ చేసే క్రమం - శ్రమ క్రమం. చొక్కాలూ, కుర్చీలూ - వంటి నిర్జీవ వస్తువుల్ని తయారుచేసే టప్పుడు, ' ఉత్పత్తి క్రమం' అన్నా, ' శ్రమ క్రమం' అన్నా, రెండూ ఒకటే. కానీ వ్యవసాయ ఉత్పత్తుల్లో, అవి రెండూ ఒకటి కాదు. భూమిని దున్నడం మొదలుపెట్టిన దగ్గిర్నించీ, పంటని కోసే దాకా ఉన్న కాలమంతా - ఉత్పత్తి క్రమం. అది, ఉత్పత్తి పెరిగే కాలం. కానీ, ఆ కాలం అంతా శ్రమ జరగదు. ఆ కాలంలో అప్పుడప్పుడూ మాత్రమే శ్రమ జరుగుతుంది. శ్రమ జరిగే కాలమే, శ్రమ కాలం. కానీ చాలా పరిశ్రమల్లో, ఉత్పత్తి కాలమూ, శ్రమ కాలమూ, రెండూ ఒకటే.

**7**. ' పెట్టుబడి' అంటే?

**జ** : (1) ' ఉత్పత్తి సాధనాల' కోసమూ, (2) శ్రామికుల జీతాల కోసమూ పెట్టేది - పెట్టుబడి. ( ఇందులో చాలా పెద్ద రహస్యాలు ఉన్నాయి. తర్వాత పాఠాల్లో చూస్తాం.)

**8**. పెట్టుబడిదారుడు, పరిశ్రమని నడపడం అంటే, ఏం చేస్తాడు?

**జ** : మొదట తన పరిశ్రమ కోసం 'ప్లాన్' చేసుకుంటాడు. అంటే, ఉత్పత్తి సాధనాల్ని చవగ్గా ఎక్కడ కొనాలో, శ్రామికుల్ని ఎంత తక్కువ జీతాలతో కుదుర్చుకోవాలో, చివరికి తయారైన ఉత్పత్తిని ఎంత ఎక్కువ ధరతో ఎక్కడ అమ్మాలో, ఆ ఉత్పత్తి ద్వారా తనకు ఎంత లాభం మిగులుతుందో - అవన్నీ ఆలోచిస్తూ, చివరి లాభం కోసం కలలు కంటూ వుంటాడు. - అదీ పరిశ్రమని నడపడం!

**9**. తయారైన ఉత్పత్తిని అమ్మే పని, పరిశ్రమ దారుడే చేయిస్తాడా ; ఆ పని ఇంకొకరికి అప్పచెపుతాడా?

**జ** : ఎలా కావాలంటే అలా చేస్తాడు.

**10**. ఒక పెట్టుబడిదారుడు అమ్మించే సైను బట్టని కార్మికులు కొనవచ్చు గానీ, ఇతర పెట్టుబడిదారులు ఎందుకు కొంటారు?

**జ** : సైను బట్టతో, ఆస్పత్రులకో, కొన్ని రకాల ఆఫీసులకో అవసరమైన ఉత్పత్తుల్ని తయారు చేయించవచ్చు. సైను బట్టని ముడి పదార్థంగా వాడే పరిశ్రమల కోసం ఇతర పెట్టుబడిదారులు దాన్ని కొంటారు.

# 48. పాత శ్రమా + కొత్త శ్రమా = మొత్తం శ్రమ

## ఉత్పత్తి సాధనాల విలువ + సజీవ శ్రమ విలువ = సరుకు విలువ

ఇప్పుడు ఇక్కడ కాస్సేపు ఆగి బట్ట ధర గురించి చర్చించాలి. ఆ బట్ట కోసం పెట్టుబడిదారుడు ఖర్చు పెట్టింది 100 రూపాయలే కదా? ఆ బట్టని అమ్మితే 120 రూ.లు ఎలా వచ్చాయి? ఎక్కణ్ణించి వచ్చాయి? ఆ బట్టకి అసలు, 100 విలువ వుందా, 120 విలువ వుందా? - 100 ఖర్చుతో తయారైన దానికి, 100 కన్నా ఎక్కువ విలువ ఎలా వుంటుంది? కానీ, 100 విలువే వుంటే, దానికి బదులుగా 120 రాదు కదా? 120 విలువ వుంటేనే, 120 డబ్బు వస్తుంది. 2 వస్తువులకు మారకం జరిగిందంటే, ఇటూ అటూ విలువలు సమానంగా వుంటేనే ఆ మారకం జరుగుతుందని వెనక పాఠాల్లో చెప్పుకున్నాం. అది 'విలువ సూత్రం' కదా? కాబట్టి, ఆ బట్టని అమ్మితే 120 వచ్చిందంటే, ఆ బట్టకి నిజంగానే 120 విలువ వుందన్నమాట! అలా వుండడం వల్లనే, దానికీ, 120 రూపాయలకీ, మారకం జరిగిందన్నమాట!

అయితే, ఇంతకు ముందు ప్రశ్నే మళ్ళీ ఎదురవుతుంది. ఆ బట్ట కోసం, పరిశ్రమదారుడు ఖర్చు పెట్టింది 100 రూ.ల విలువే. అంతే ఖర్చుతో తయారైన బట్టకి, అంత కన్నా ఎక్కువ విలువ ఎలా వచ్చింది?

పెట్టుబడిదారుడు పెట్టింది - వందే. కానీ, ఆ బట్ట కోసం <u>నిజంగా ఖర్చయింది</u> 100 మాత్రమే కాదు. ఇంకో 20 కూడా ఖర్చయింది.

[ ఆ సంగతి, పెట్టుబడిదారుడికి కూడా తెలీదు. శ్రామికులకు ఎలాగూ తెలీదు.]

పెట్టుబడిదారుడు ఏమీ ఖర్చు పెట్టకుండానే ఇంకో 20 విలువ, బట్టలోకి ఎలా చేరింది? ఈ 'వింత' ఎలా జరిగిందో చూడాలంటే, బట్టని తయారు చెయ్యడానికి పని స్థలంలోకి వచ్చిన అంశాల్ని మళ్ళీ చూడాలి.

**పని స్థలంలో అంశాలు :**

1) ఉత్పత్తి సాధనాలు. వీటి విలువ 80.
2) శ్రామికులు. వీరికి జీతం 20.

ఈ 2 అంశాలే బట్టని తయారు చేశాయి. మూడో అంశం ఏదీ అక్కడికి రాలేదు. కాబట్టి, ఆ 2 అంశాల్లోనే ఏదో ఒక అంశం, తన విలువ కన్నా ఆ ఎక్కువ 20 విలువని కూడా ఇచ్చి వుండాలి. లేదా, 2 అంశాలూ కూడా కొంత కొంత ఎక్కువ విలువని ఇచ్చి వుండాలి. అంతే కదా? ఏ అంశమూ, 'ఎక్కువ'ని ఇవ్వకపోతే, ఆ ఎక్కువ ఎలా వస్తుంది? కాబట్టి, ఆ అంశాలనే ఇప్పుడు మళ్ళీ చూడాలి.

**మొదటి అంశం :** ఉత్పత్తి సాధనాలన్నీ - నిర్జీవ వస్తువులు. అవి, ఈ పని స్థలంలోకి రాక ముందే వేరే చోట్ల తయారై వున్నాయి. అవి అన్నీ, శ్రమలతో తయా

రైనవే. అదంతా, పాత శ్రమ. జరిగిపోయిన శ్రమ. ఆ పాత శ్రమ విలువ 80. ఆ వస్తువుల్ని, వేరే పని స్థలాల్లో వున్న శ్రామికులు చేశారు. ఇక్కడ బట్టని తయారుచేసే శ్రామికులకు, ఆ పాత శ్రమతో సంబంధం లేదు. ఆ పాత శ్రమ, ఈ శ్రామికులు చేసింది కాదు. ఆ 80 విలువ గల ఉత్పత్తి సాధనాలు, వేరే చోట తయారై, బట్ట తయారయ్యే పని స్థలం లోకి వచ్చాయి ; ఇక్కడ బట్ట కోసం ఖర్చయ్యాయి. ఆ 80 విలువ, బట్టకి 'బదిలీ' అయింది. 'బదిలీ అవడం' అంటే, ఆ వస్తువులు ఇక్కడ ఖర్చవుతాయి కాబట్టి, వాటి శ్రమ కూడా ఇక్కడ లెక్కలోకి వస్తుంది. ఆ శ్రమ ఇక్కడ మళ్ళీ కొత్తగా జరగదు. ఒక పని కోసం ఒక వస్తువు ఖర్చయినప్పుడు, దాని విలువ ఎంత అయితే అంతే, ఆ పనిలో లెక్కకి వస్తుంది. అలాగే, ఇక్కడ, 80 విలువ గల ఉత్పత్తి సాధనాలు ( కొన్ని వస్తువులు ) ఖర్చయినప్పుడు, ఆ 80 య్యే లెక్కలోకి వస్తుంది. అది, అంత కన్నా ఎక్కువా అవదు, తక్కువా అవదు. దీని అర్థం, ఉత్పత్తి సాధనాలు, తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వవు - అని. అంటే, కొత్త బట్టలోకి 20 ఎక్కువ విలువ చేరడం, ఉత్పత్తి సాధనాల ద్వారా జరగలేదన్నమాట! - ఈ మొదటి అంశం తేలింది. ఇంకా మిగిలింది రెండో అంశం. ఎక్కువ విలువ ని ఇవ్వడం, మొదటి అంశం ద్వారా జరగలేదంటే, అది, రెండో అంశం ద్వారా జరిగినట్టే అర్థం కదా? కానీ, అది ఎలా జరిగిందో చూడాలి.

**రెండో అంశం :** బట్టని తయారుచేసే పనులన్నీ, 10 మంది శ్రామికులు చేశారు. 12 గంటల సేపు చేశారు. వాళ్ళందరూ కలిసి చేసిన శ్రమ కాలం, 10 × 12 = 120 గంటలు. ఇది నేత శ్రమ. రూపం వున్న శ్రమ. ఇది ఈ పని స్థలం లోనే జరిగిన శ్రమ కాబట్టి, ఇది కొత్త శ్రమ. ఇది సజీవ శ్రమ. ( బట్ట తయారైపోయాక ఇది కూడా పాత శ్రమ అయిపోతుంది. ) ఈ కొత్త శ్రమ గంటల్ని లెక్క పెట్టడం చాలా తేలిక. 10 మంది శ్రామికులు చేసిన శ్రమ, 120 గంటలు - అని స్పష్టంగా తెలిసిపోతోంది. కానీ, ఈ కొత్త శ్రమ, ఇంకా 'విలువ' లెక్కలోకి మారాలి.

'పాత శ్రమ' అయితే, విలువగా మారే వుంది. ఉత్పత్తి సాధనాల్ని 80 డబ్బుతో కొన్నారంటే, ఆ శ్రమ, విలువగా మారి వున్నదే. అలాగే, కొత్త శ్రమ కూడా విలువగా మారాలి. అయితే, కొత్త శ్రమకి ఎంత విలువ వుంటుందో అది, ఆ శ్రమ జరిగే పని స్థలం లోనే కనపడదు. ఆ సరుకుని అమ్మిన తర్వాత, కొన్ని లెక్కల ద్వారా, కొత్త శ్రమ విలువని కనిపెట్టాలి.

ఏ ఉత్పత్తి విలువ అయినా, దాని కోసం ఖర్చయిన మొత్తం శ్రమదే అని వెనక పాఠాల్లో చూశాం. - చలపతి దగ్గిర తయారైన కొత్త బట్టని అమ్మితే ఎంత డబ్బు వచ్చింది? - 120 వచ్చింది. ఆ బట్టకి అంత విలువ వుండబట్టే, ఆ డబ్బు వచ్చింది. ఆ 120 విలువలో, కొత్త శ్రమ భాగం ఎంత వుందో ఎలా తెలుస్తుంది?

**ఎలా తెలుస్తుందంటే :** పాత శ్రమా, కొత్త శ్రమా కలిసే, వస్తువుకి పట్టే మొత్తం శ్రమ కదా? కాబట్టి, ఆ మొత్తంలో నించి పాత శ్రమని తీసేస్తే, కొత్త శ్రమ తెలుస్తుంది.

బట్ట విలువలో నించి పాత శ్రమ విలువని తీసెయ్యండి! కొత్త శ్రమ విలువ తెలుస్తుంది.


| | |
|---|---|
| బట్ట విలువ - | 120 రూ.లు. |
| పాత శ్రమ విలువ - | 80 రూ.లు. |
| కొత్త శ్రమ విలువ - | 40 రూ.లు. |

అంటే, బట్టని తయారుచేసిన శ్రామికుల శ్రమ విలువ, 40 అన్నమాట! వాళ్ళ శ్రమ విలువ వాళ్ళకే అందాలంటే, ఆ శ్రామికులకు 40 వెళ్ళాలి. కానీ వాళ్ళకి, ‘ కూలి’ పేరుతో 20 య్యే అందింది. ఇంకో 20 అందలేదు.

శ్రామికులకు 20 య్యే అందింది కాబట్టి, అదే వాళ్ళ శ్రమ విలువ అవుతుందా? - కాదు, శ్రామికులకు యజమాని, ఎంత కూలి ఇస్తే, అదే వాళ్ళ శ్రమ విలువ అవదు. అసలు కూలే ఇవ్వకుండా యజమాని ఎగ్గొట్టాడనుకుందాం. శ్రామికులకు ఏమీ అందలేదనుకుందాం. ఏమీ అందకపోతే, శ్రామికులు అసలు శ్రమే చెయ్యలేదనీ, శ్రమ లేకుండానే ఆ బట్ట తయారైందనీ అర్థం వస్తుందా? - అలా రాదు కదా? కాబట్టి, శ్రామికుల శ్రమ విలువని అర్థం చేసుకోవలిసింది, వాళ్ళకి కూలి పేరుతో అందే దాన్ని బట్టి కాదు, ఒక వస్తువుని అమ్మినప్పుడు వచ్చే విలువలో నించి, పాత శ్రమ భాగాన్ని తీసివేస్తే మిగిలేది కొత్త శ్రమ భాగమే. లెక్క చూడడం అలా వుండాలి. బట్ట విలువ అయిన 120 లో నించి, 80 ని తీసి వేస్తే, 40 మిగిలింది. అదే, కొత్త శ్రమ విలువ. బట్ట ఉదాహరణలో, శ్రామికులు చేసిన శ్రమ, 40 విలువ గలది కాకపోతే ( కొత్త శ్రమ విలువ, 40 కాకపోతే ), బట్ట విలువ, 120 అయ్యేది కాదు. కాబట్టి, ఈ ఉదాహరణలో, కొత్త శ్రమ విలువ 40. 20 కాదు.

శ్రామికులకు అందే కూలే, జీతమే, వాళ్ళ శ్రమ విలువ కాదు. అంటే, ‘ కూలి’ ఇస్తే, శ్రామికుల శ్రమ విలువని శ్రామికులకు ఇచ్చినట్టు కాదు.

చొక్కా తయారైంది. అందులో పాత, కొత్త శ్రమల్ని గుర్తు చేసుకుందాం.




[ ఈ పాఠంలో ఎక్కువ ప్రశ్నలు వస్తాయి.
వాటిని, ప్రత్యేక పాఠంగా తర్వాత చూడండి! ]

H

# 49. 'ధర' గురించి కొన్ని అంశాలు

## [ ఈ పాఠం, 'ప్రశ్నలూ - జవాబులూ'గా ఉంటుంది ]

**1** . ఒక సరుకుని అమ్మినప్పుడు, దానికి బదులుగా వచ్చే ' డబ్బు' ఏమిటి?

**జ** : సరుకుని అమ్మినప్పుడు, దానికి బదులుగా ఇంకో సరుకు వచ్చినా, డబ్బు వచ్చినా, ఏది వచ్చినా, అది, అమ్మిన సరుకుకి విలువే.

**2** . కొంత పెట్టుబడి ఖర్చుతో సరుకు తయారైనప్పుడు, ఆ ఖర్చే, ఆ సరుకుకి విలువ అవుతుందా ; ఆ ఖర్చు కన్నా, విలువ ఎక్కువగా వుంటుందా?

**జ** : పెట్టుబడి ద్వారా తయారైన సరుకుకి విలువ, పెట్టుబడి ఖర్చు కన్నా ఎక్కువగా వుండి తీరుతుంది, కానీ, ఆ సరుకు కోసం ఖర్చయిన మొత్తం శ్రమ విలువ కన్నా ఆ ఉత్పత్తి విలువ ఎక్కువగా వుండదు.

**3** . పెట్టుబడిదారుడు, తన సరుకుకి, ' ధర ' ని ఎలా నిర్ణయిస్తాడు?

**జ** : మొదట తను పెట్టిన ఖర్చులన్నీ కలుపుతాడు. ఆ ఖర్చుల్లో, ఉత్పత్తి సాధనాల ఖర్చులూ, శ్రామికులకు ఇచ్చిన జీతాలూ మాత్రమే కాకుండా, ' కౌలు' పేరు తోటీ, ' వడ్డీ' పేరు తోటీ కూడా కొన్ని అంశాలు కలుపుతాడు. ఆ తర్వాత, తనకు రావలసిన ' లాభాన్ని' కూడా కలిపి, ఆ మొత్తాన్ని సరుకుకి ' ధర ' గా నిర్ణయిస్తాడు.

**4** . ' ధర ' ని అలా నిర్ణయించడం సరైనదా, కాదా?

**జ** : ధరని నిర్ణయించే వాడు, పెట్టుబడిదారుడు. అతనికి, అది సరైనదే.

**5** . పరిశ్రమల పెట్టుబడిదారులు ఇంకా ప్రారంభం కాని కాలంలోనే, బానిస సమాజంలో కూడా స్వతంత్ర ఉత్పత్తిదారులు ఉన్నారు కదా? వాళ్ళు కూడా, తమ సరుకుల్ని అమ్ముకునేవారు కదా? ఆ సరుకులకు ధరల్ని ఎలా నిర్ణయించేవారు?

**జ** : స్వతంత్ర ఉత్పత్తిదారులు అంటే, వాళ్ళు ప్రారంభంలో వేరు వేరు తెగల వారు. ఎంతో కాలం దాకా వాళ్ళు బార్టరు పద్ధతులతోనే మారకాలు చేసుకున్నారని ఊహించాలి. అసలు, ' ధర'ని నిర్ణయించడం అనేది, బానిస సమాజపు వర్తకుల ద్వారానే ప్రారంభమైంది. ' బరువు' ని తూచినట్టుగా ' విలువ' ని తూచడం సూటిగా సాధ్యం కాదు. సరుకుని అమ్మినప్పుడు, ఖర్చులే వెనక్కి వస్తే వర్తకుడికి చాలదు. అంత కన్నా ' కొంత ఎక్కువ' రావాలి. కాబట్టి వర్తకులు, ' కొంత లాభాన్ని' కూడా, కలిపి, ధరని నిర్ణయించే పద్ధతి కనిపెట్టారు. స్వతంత్ర ఉత్పత్తిదారులు, తమ ఉత్పత్తుల్ని బార్టరు పద్ధతిలోనే మారకాలు చేసుకుంటూ, అప్పుడప్పుడూ డబ్బుతో కూడా మారకాలు చేసుకుంటే, వర్తకుల పద్ధతినే పాటిస్తారు. ' ఖర్చులూ + లాభమూ' పద్ధతిని. ' ఖర్చులు' అంటే, అందులో, వారి పోషణ ఖర్చు కూడా ఉంటుంది. ' లాభం' అనేది వారి

'అదనపు శ్రమ'. అలా, నిర్ణయించే ధర వల్ల, వారి శ్రమ విలువ వారికి అందుతుంది. బానిస సమాజం నాటి నించీ వర్తకులు గానీ, స్వతంత్ర ఉత్పత్తిదారులు గానీ, ఈ నాటి పెట్టుబడిదారులు గానీ, అందరూ, 'ధర' ని నిర్ణయించే పద్ధతి అదే. ఖర్చులూ + లాభమూ.

**6** . ధరని నిర్ణయించేది, పెట్టుబడిదారుడా, స్వతంత్ర ఉత్పత్తిదారుడా అనేది తీసుకోవద్దు. అసలు ఉత్పత్తికి ధరని నిర్ణయించే సరైన పద్ధతి ఏమిటి?

**జ** : ఉత్పత్తి తయారవడానికి, (1) ఉత్పత్తి సాధనాలూ, (2) సజీవ శ్రమా - ఈ 2 అంశాలే ఖర్చవుతాయి. ఈ 2 ఖర్చుల్నీ కలిపినదే - సరైన ధర. అయితే, బానిస యజమానుల కాలంలో ధరని ఎలా నిర్ణయించేవారో ఊహించాలి. బానిస యజమాని, తన బానిసలు తయారుచేసిన ఉత్పత్తుల్లో కొన్నిటిని, అమ్మకం కోసం, వర్తకుడికి ఇస్తాడు. ఆ ఉత్పత్తుల్లో కొంత అదనపు విలువ వుంటుందని, బానిస యజమానికి గానీ, వర్తకుడికి గానీ ఎలా తెలుస్తుంది? - తెలియదు. ధరని నిర్ణయించేది అది తెలిసి కాదు. 'ఖర్చులు వెనక్కి వచ్చి, దాని మీద ఇంకా కొంత ఎక్కువగా రావాలి' అనే ఆలోచనే ఉంటుంది. అలా చెయ్యడమే సరైన ధర లాగ వాళ్ళకు కనపడుతుంది. నిజానికి, యజమాని దగ్గిర తయారైన ఉత్పత్తికి, ఖర్చుల మీద కొంత ఎక్కువని వేసుకుని నిర్ణయించే ధర, సరైన ధరే. ఎందుకంటే, అందులో, 'అదనపు విలువ' తప్పకుండా ఉంటుంది కాబట్టి. కానీ, ధరని అలా నిర్ణయించడం, అదనపు విలువ గురించి తెలిసి చేసే పని కాదు. అసలు, ఆ నాడు, డబ్బుతో మారకాలూ, డబ్బు ధరలూ, చాలా తక్కువ. ఎక్కువ మారకాలు బార్టరు మారకాలే. బార్టరు మారకాల్లో, 'సరైన ధర' అనే ప్రసక్తే వుండదు.

**7** . ఒక సరుకు (వస్తువు) విలువలో, 'అదనపు విలువ ఉండడం' అంటే ఏమిటి? 'అదనపు విలువ లేకపోవడం' అంటే ఏమిటి?

**జ** : అదనపు విలువ వుండడం అంటే, సరుకుని తయారుచేసిన వ్యక్తి శ్రమలో కొంత భాగం వడ్డీ లాభాలూ వగైరాలుగా బైటికి పోవడం. ఇది యజమానీ శ్రామిక సంబంధంలో తప్పనిసరి. 'అదనపు విలువ లేకపోవడం' అంటే స్వతంత్ర వుత్పత్తి దారుడికి, అతని శ్రమ అంతా అతనికే అందే సందర్భాలూ వుంటాయి; లేదా, అతను కూడా వడ్డీలూ - వర్తక కమిషన్లూ చెల్లించే సందర్భాలూ వుంటాయి.

**8** . ఒక వస్తువు తయారైంది. అది చొక్కా. దాని కోసం జరిగిన 'సజీవ శ్రమ' లో, అదనపు శ్రమ వుంటే, ఆ వస్తువు విలువ ఎక్కువగానూ ; సజీవ శ్రమలో అదనపు శ్రమ లేకపోతే, ఆ వస్తువు విలువ తక్కువగానూ ఏర్పడుతుందా?

**జ** : ఇలాంటి సందేహం కలిగిందంటే, 'విలువ' గురించి ఇంకా సరిగా అర్థం కాలేదని అర్థం. చొక్కానే తీసుకుందాం. అది తయారవడానికి, 'మొత్తం ఎంత శ్రమ' కావాలో

అదే దాని విలువ. దాన్ని 120 అనుకుందాం. పాత శ్రమ 80 + కొత్త శ్రమ 40. ఆ 2 అంశాలూ అలా వుంటేనే, ఆ రకం చొక్కా తయారవుతుంది. వాటిలో ఏది తగ్గినా, ఆ చొక్కా తయారవదు. ఆ 120 విలువలో, 'అదనపు విలువ' వుందా లేదా అనేది, వేరే విషయం. ఆ చొక్కాని తయారుచేసిన కార్మికుడి సజీవ శ్రమ 40 కదా? ఆ విలువ అంతా అతనికే అందితే, చొక్కా విలువ ఎలా ఉంటుంది? లేదా, ఆ 40 లో, అతనికి 20 మాత్రమే అంది, ఇంకో 20 అందకపోతే, అప్పుడు చొక్కా విలువ ఎలా ఉంటుంది? చొక్కాని తయారుచేసిన వ్యక్తికి అతని శ్రమ విలువ అంతా అందినా, అందకపోయినా, చొక్కా విలువలో మార్పు రాదు. చొక్కాని తయారుచేసిన వ్యక్తికి, అతని శ్రమ విలువలో నించి కొంత భాగం అందకపోయినా, అసలు ఏమీ అందకపోయినా, చొక్కా విలువ 120 గానే వుంటుంది. దాని కోసం అంత శ్రమ పట్టింది కాబట్టి.

అదనపు విలువ వుంటే, ఆ వస్తువుకి విలువ ఎక్కువ గానూ, అదనపు విలువ లేకపోతే వస్తువుకి విలువ తక్కువ గానూ వుండదు. వస్తువు విలువ, దాని కోసం ఖర్చయిన మొత్తం శ్రమని బట్టే వుంటుంది గానీ, శ్రామికుడు ఇచ్చిన శ్రమ విలువ అంతా శ్రామికుడికి అందిందా లేదా అనే దాన్ని బట్టి కాదు.

**9**. ఒక మీటరు బట్ట కోసం 10 విలువ గల ఉత్పత్తి సాధనాలూ, 20 విలువ గల సజీవ శ్రమా, ఖర్చయ్యాయి. సజీవ శ్రమలో, సగ భాగం అదనపు శ్రమే. ఆ బట్టకి ధర ఎలా ఉంటుంది? సజీవ శ్రమలో అదనపు శ్రమ జరగకపోతే, అప్పుడు, ఆ బట్ట ధర ఎలా ఉంటుంది?

**జ** : **అదనపు శ్రమ వున్న ధర** : ఉత్పత్తి సాధనాల 10 + సజీవ శ్రమలో మొదటి భాగం 10 + అదనపు శ్రమ భాగం 10 = 30. ఇది, ఒక మీటరు బట్ట ధర.

**అదనపు శ్రమ లేని ధర** : అదనపు శ్రమ 10 జరిగి వుండకపోతే, ఉత్పత్తి సాధనాల్లో సగం ఖర్చు కావు. అప్పుడు వాటి ఖర్చు 5 మాత్రమే. అప్పుడు ధర = ఉత్పత్తి సాధనాల 5 + సజీవ శ్రమ 10 = 15. ఇది, అర మీటరు బట్ట ధర. 30 ఖర్చుతో తయారైనంత ఉత్పత్తి, 15 ఖర్చుతో తయారవదు. అందులో సగమే తయారవుతుంది. అదనపు శ్రమ జరగకపోతే, ఉత్పత్తి సైజు తగ్గుతుంది.

**10**. తన ఉత్పత్తికి పెట్టుబడిదారుడు 120 ధరని నిర్ణయించాడు. ఆ ఉత్పత్తిని అమ్మితే 120 ధర ప్రకారమే డబ్బు వచ్చింది. ఆ ఉత్పత్తి, దాని విలువకే అది అమ్ముడుపోయింది. అంటే, పెట్టుబడిదారుడు, ఉత్పత్తికి ధరని సరిగానే నిర్ణయించాడని అర్థం కదా? అతను చేసిన తప్పు ఏమిటి?

**జ** : తప్పు, అతను చేసే ధర నిర్ణయంలో కాదు. తప్పు అంతా, అతను చూపించే వివరాల్లో వుంటుంది. "వడ్డీ కోసం ఇంత చెల్లించాను. కౌలు కోసం ఇంత చెల్లించాను. నా లాభం కోసం ఇంత వేసుకున్నాను. ఇవన్నీ ఉత్పత్తి కోసం జరిగిన ఖర్చులు. అన్నీ

కలిసి ఈ ధర అయింది" అంటాడు. 'ఖర్చులు' అని అతను చెప్పిన ఆ అంశాలు, ఉత్పత్తి తయారీకి సంబంధం లేని అంశాలు. ధర, 120 అవడానికి కారణం, ఆ అంశాలన్నీ కలవడం కాదు. అది గ్రహించకపోవడమే పెట్టుబడిదారుడి తప్పు.

**11** . పెట్టుబడిదారుడు, ఆ 'కౌలు' నీ, 'వడ్డీ' నీ, నిజంగా బైటికి చెల్లించి వుంటే?

**జ** : చెల్లించినా సరే, అవి, ఆ ఉత్పత్తి కోసం అయిన ఖర్చులు అవవు. ఒక వేళ, ఆ కౌలునీ, వడ్డీనీ, బైటికి చెల్లించకపోతే, ధరని తక్కువగా నిర్ణయిస్తాడా? - అలా చెయ్యడు. అతను నిర్ణయించే ధరలో కౌలూ - వడ్డీలు వుండవలిసిందే. ఆ పేర్లతో ఆ భాగాల్ని అతనే ఉంచుకుంటాడు. అంటే, ఆ అంశాలు నిజంగా ఖర్చు కాలేదని అర్థం. లేదా, వాటిని బైటికి చెల్లిస్తే, ఆ ఆదాయాల్ని బైటి వాళ్ళు తింటారు గానీ, అవి, ఉత్పత్తి కోసం అయిన ఖర్చులు కావు. అలాగే, 'లాభం' పేరు గలది కూడా ఉత్పత్తి కోసం అవసరమయ్యే ఖర్చు కాదు.

**12** . ఒక సరుకు విలువ 120. పాత శ్రమ 80. ఆ సరుకుని అమ్మి, ఆ 120 లో నించి 80 ని తీసేస్తే, కొత్త శ్రమ విలువ 40 అని, తేలింది. అయితే, ఇది, సరుకుని అమ్మిన తర్వాత తెలిసింది. సరుకుని అమ్మక ముందే, "కార్మికుల శ్రమ విలువ 40" అని తెలుసుకునే మార్గం లేదా?

**జ** : మార్గం వుంది. వెనకటి అనుభవాల్ని బట్టే దాన్ని తెలుసుకోవాలి. పరిశ్రమదారులు ఎప్పుడూ, ఒకే రకం ఉత్పత్తుల్ని తయారుచేయిస్తూ, అమ్ముతూ వుంటారు. నిన్న అమ్మిన బట్ట వల్ల, 1 గంట నేత శ్రమ విలువ ఎంత వుంటుందో తెలుసుకోవడం సాధ్యమే. ఇవ్వాళ తయారైన బట్టని ఇంకా అమ్మకపోయినా, నేత శ్రమ విలువ తెలుస్తుంది. నిన్న అమ్మిన కొత్త బట్ట విలువలో నించి ఉత్పత్తి సాధనాల విలువని తీసివేస్తే, 40 మిగిలిందనుకుందాం. ఆ బట్టని ఇద్దరు మనుషులు 10 గంటల్లో చేశారు. 1 మనిషి శ్రమ విలువ 20. 1 గంట శ్రమ విలువ 2. ఇదంతా, నిన్నటి మొన్నటి అనుభవాల వల్ల తెలిసేది. అయితే, ఇది కూడా నిన్నటి ఉత్పత్తుల్ని అమ్మడం వల్ల తెలిసినదే కదా? అలాంటి అనేక అనుభవాల వల్ల, సరైన లెక్కల వల్ల, ఏ శ్రమ విలువ ఎలా వుంటుందో తెలుసుకోవచ్చు. కానీ, అది తెలిసేది అయినా, గతంలో ఉత్పత్తుల్ని అమ్మడం వల్లే కదా? అమ్మకమే జరగకపోతే, అంటే మారకమే జరగకపోతే, విలువ ఎలా తెలుస్తుంది? అమ్మకం అంటే మారకమే. అది జరిగితేనే, ఏ శ్రమకైనా విలువ తెలుస్తుంది.

**13** . 1 మీటరు బట్ట ధర 30. అందులో, ఉత్పత్తి సాధనాల విలువ 10 + సజీవ శ్రమ విలువ 20. ఇదే సరుకుని, (1) పెట్టుబడిదారీ సరుకు గానూ ; (2) స్వతంత్ర ఉత్పత్తిదారుడి సరుకు గానూ, చూపించండి!

**జ** : **పెట్టుబడిదారీ సరుకు :**

ఉత్పత్తి సాధనాల ఖర్చు 10 + జీతం 10 + అదనపు విలువ 10 = 30. పాత శ్రమ

విలువా, కొత్త శ్రమ విలువా కలిసే, ఆ వస్తువుకి విలువగా ( ధరగా ) అయింది. అది 30. అయితే, ఇది పెట్టుబడిదారీ సరుకు కాబట్టి, ఇందులో ఎంతో కొంత అదనపు విలువని తీసుకోవాలి. 20 కొత్త శ్రమలో, 10 ని అదనపు విలువగా తీసుకున్నాం. దాన్ని పెట్టుబడిదారుడు కార్మికులకు చెల్లించడు. అదనపు విలువని చెల్లించినా, చెల్లించకపోయినా, ఆ ఉత్పత్తి విలువ 30 గానే ఉంటుంది.

**స్వతంత్ర ఉత్పత్తిదారుడి ధర :**

ఇతను కూడా అదే రకం బట్టని తయారుచేశాడు. ఖర్చులు అదే రకంగా అయ్యాయి. ఉత్పత్తి సాధనాల కోసం 10 + సజీవ శ్రమ 20 = 30. ఇతని పోషణ 10 మాత్రమే అయితే, మిగిలినది ఇతని అదనపు విలువ. అయితే, ఈ వ్యక్తి స్వతంత్ర ఉత్పత్తిదారుడు కాబట్టి, ఇతని పోషణ, కార్మికుడి పోషణలాగే, 10 గా మాత్రమే ఉండాలనే రూలు లేదు. రోజూ 20 శ్రమ చేసే ఇతను, అందులో నించి తన పోషణ కోసం 10 కన్నా ఎక్కువనే వాడుకోగలడు. ఆ ఉత్పత్తిని తయారుచేసే కాలంలో ఇతను, తన పోషణ కోసం 15 ని వాడుకుంటాడనుకుందాం. 15 పోషణని వాడుకుంటూ 20 శ్రమ చేశాడంటే, ఇతని అదనపు శ్రమ 5 మాత్రమే అవుతుంది. కార్మికుడి విషయంలో లాగ, అతని అదనపు శ్రమ 10 గా ఉండదు. అప్పుడు, ఇతని సరుకులో, లోపలి వివరాలు ఇలా ఉంటాయి : ఉత్పత్తి సాధనాలు 10 + అవసర శ్రమ 15 + అదనపు శ్రమ 5 = 30.

అదే రకం బట్ట, అదే పరిమాణం గలది తయారవ్వాలంటే, ఎవరు చేసినా, దాని కోసం 30 విలువ ఖర్చు అవ్వాలి. స్వతంత్ర ఉత్పత్తిదారుడి దగ్గిర కూడా 30 ఖర్చు అవుతుంది. సజీవ శ్రమలో భాగాలు ఇటూ అటూ మారతాయి.

ఇతని ఉదాహరణని ఇంకో రకంగా చూద్దాం. ఆ ఉత్పత్తి తయారయ్యే కాలంలో ఇతని పోషణ 15 కాదు ; 20. పోషణ కోసం 20 ని వాడి, మళ్ళీ 20 శ్రమ చేశాడు. అప్పుడు, ఆ ఉత్పత్తిలో వివరాలు : ఉత్పత్తి సాధనాల 10 + అవసర శ్రమ 20 + అదనపు శ్రమ లేదు = 30. పోషణ కోసం 20 ఖర్చు పెట్టి, ఆ 20 మాత్రమే తిరిగి చేశాడు. అదనపు శ్రమ చెయ్యలేదు. అదనపు శ్రమ లేకపోయినా, 30 విలువ గల ఉత్పత్తి తయారైంది.

**ఇంకో ఉదాహరణ :** ఈ ఉత్పత్తిదారుడే, పోషణ కోసం 20 వాడుకుంటూ, ఇంకో 4 విలువ గల అదనపు శ్రమ కూడా చేశాడనుకుందాం. అప్పుడు తయారైన ఉత్పత్తికి విలువ ఎంత ఉంటుంది? - పాత శ్రమ 10 గానూ, కొత్త శ్రమ 20 గానూ వున్నప్పుడు సరుకు విలువ 30. అలాంటప్పుడు, 4 అదనపు శ్రమ జరిగింది. అంటే, అప్పుడు విలువ 30 + 4 = 34 అవుతుందా? అలా కాదు. సజీవ శ్రమ పెరిగిందంటే, ఉత్పత్తి సాధనాలు కూడా పెరగాలి. 20 సజీవ శ్రమ జరగడానికి, 10 ఉత్పత్తి సాధనాలు కావాలి కాబట్టి, అదే పాళ్ళతో, 4 అదనపు శ్రమ జరగడానికి, ఉత్పత్తి సాధనాలు

2 పెరగాలి. అప్పుడు, ఆ సరుకు విలువ ఇలా ఉంటుంది : ఉత్పత్తి సాధనాల ఖర్చు 12 + ఉత్పత్తిదారుడి పోషణ శ్రమ 20 + అదనపు శ్రమ 4 = 36. అంటే, ఇతను 20 ని పోషణ ఖర్చు కోసం వాడుతూ, అదే కాలంలో 24 శ్రమ చేశాడు.

వేరే ఉదాహరణలో, 30 విలువతో, మీటరు బట్ట తయారైతే, ఇప్పుడు 36 ఖర్చుతో మీటరు కన్నా కొంత ఎక్కువ బట్ట తయారవుతుంది. కానీ, ఇప్పుడు కూడా మీటరు ధర 30 య్యే. మిగిలిన 6 తో, ఇంకా కొంత బట్ట తయారవుతుంది.

పెట్టుబడిదారీ సరుకులో అదనపు శ్రమ తప్పనిసరిగా వుంటుంది. స్వతంత్ర ఉత్పత్తిదారుడి సరుకులో అదనపు శ్రమ వుందా లేదా అనేది, అతను పోషణ కోసం వాడేదాన్ని బట్టీ, తిరిగి శ్రమ చేసే దాన్ని బట్టీ వుంటుంది. స్వతంత్ర ఉత్పత్తిదారుడి పోషణ కూడా శ్రామికుల పోషణ లాగ మాత్రమే వుంటే, ఇతని సరుకులో కూడా అదనపు శ్రమ వుంటుంది. ఎవరి ధర అయినా, దాని కోసం జరిగే మొత్తం శ్రమ ఖర్చుల్ని బట్టే.

**14** . ఒక సరుకు ధర 30. కానీ, ఒక పెట్టుబడిదారుడు, ఆ ధరతో అమ్మలేక ఆ సరుకుని 25 కే అమ్మాడు. ఆ సరుకు ధర 30 అవుతుందా, 25 యే అవుతుందా?

**జ** : ధరలో ఆ మార్పు, ఆ శాఖలో అందరి దగ్గిరా జరిగితే, అసలు ధరే తగ్గిందని అర్థం. లేదా, ఒక్క పెట్టుబడిదారుడి దగ్గిరే అలా జరిగితే, అతని దగ్గిర, ఆ సరుకుని కొనే వాళ్ళు ఎక్కువ మంది లేకపోవడం వల్ల, అక్కడ ధర అలా తగ్గి వుంటుందని అర్థం. కానీ, అప్పుడు కూడా ఆ సరుకు ధర 30 య్యే. దాన్ని 25 తో కొన్న వాళ్ళకి అది 5 చవకగా దొరికిందని అర్థం.

**15** . కార్మికుడి శ్రమ విలువ 40. దానికి పెట్టుబడిదారుడు ఇచ్చిన జీతం 20. ఇది, సమాన విలువ మారకం ఎలా అవుతుంది? ఏ మారకం అయినా, సమాన విలువల మధ్యే జరగాలి కదా? అది విలువ సూత్రం కదా?

**జ** : సమాన విలువల మారకాలు, స్వతంత్ర ఉత్పత్తిదారుల మధ్యనే ఉంటాయి. ఇద్దరూ స్వతంత్ర వుత్పత్తిదారులే అయినప్పుడు, వాళ్ళ మధ్య మారకాలు జరుగుతాయి. అవి సమాన విలువల మధ్యే జరుగుతాయి. కానీ, యజమానీ శ్రామిక సంబంధాల్లో అసలు 'మారకమే' ఉండదు. యజమాని, శ్రామికుడి నించి లాగేదే గానీ, తన శ్రమని శ్రామికుడికి ఇచ్చేదేమీ ఉండదు. మారకమే వుండని చోట, 'సమాన విలువలు' అనే ప్రశ్నకే అవకాశం ఉండదు. యజమానీ శ్రామిక సంబంధాల్లో జరిగేది మారకం కాదు ; శ్రమ దోపిడీ!

[ 'ధర' గురించి ఇంకా వేరే పాఠాల్లో కూడా చూడాలి తర్వాత. ]

**H**

# 50. 'అదనపు శ్రమ' ఎలా జరుగుతుంది?

బట్ట కోసం పెట్టుబడి 100. కానీ, బట్ట విలువ 120. ఇది ఎలా జరిగిందో ఇప్పుడు తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. ఉత్పత్తి సాధనాల ద్వారా 80 విలువా, శ్రామికుల ద్వారా 40 విలువా, చేరాయి. ఆ 2 అంశాలూ అలా వున్నాయి కాబట్టే, మొత్తం విలువ, 120 అయింది. బట్టకి, అంత విలువ వుంది కాబట్టే, దాన్ని అమ్మితే అంత డబ్బు వచ్చింది.

పెట్టుబడి 100, వెనక్కి వచ్చేసింది. దానిపైన 20 అదనంగా కూడా వచ్చింది. అదనంగా వున్న 20 కోసం, పెట్టుబడి దారుడు ఏమీ పెట్టలేదు. పెట్టకుండానే అది వచ్చింది!

పెట్టుబడిదారుడు, శ్రామికులకు ఇచ్చే డబ్బుని, రోజుల లెక్క తోనో, వారం లెక్క తోనే ఇస్తే, అది 'కూలి'. నెలకో సారి ఇస్తే, అది 'జీతం'. 2 అర్థాలూ వుండే పేరు - 'వేతనం'. అన్నీ ఒకటే. మాటలే తేడా. ఇప్పటి నించీ, 'జీతం' అనే మాటే వాడదాం. జీతాల పద్ధతిలో పని చేసే వారిని 'కార్మికులు' అనాలి. కానీ, 'శ్రామికులు' అంటే కూడా తప్పు అవదు. వీరు 'బానిసలు' కారు, 'కౌలు రైతులు' కారు.

శ్రామికులు, తమ 'జీతం' డబ్బుతో ఏం చేస్తారు? తమ పోషణకు కావలసిన 'నిత్య జీవితావసర వస్తువులు' కొనుక్కుంటారు (వేరు వేరు పెట్టుబడిదారుల దగ్గర). తిండీ, బట్టా, నివాసం, మందులూ, అన్నీ, 'జీతం' లో నించే కొనాలి. రోజూ ఆ పోషణ అందితే, శ్రమ చేసే శక్తి నిలిచి వుంటుంది. అంటే, 'జీతం' అనేది, శ్రమ శక్తి ని నిలిపి వుంచడానికి అవసరమయ్యే కనీసపు విలువ. అది, 'శ్రమ శక్తి - విలువ'. అది అందకపోతే, శ్రమ చేసే మనిషి, జీవించి వుండడం సాధ్యం కాదు.

శ్రామికులు, పని స్థలాల్లో చేసేది - 'శ్రమ'. దానికి కొంత 'విలువ' వుంటుంది. ఆ 'శ్రమ - విలువ' కన్నా, శ్రామికులకు అందే 'శ్రమ శక్తి - విలువ' తప్పనిసరిగా చాలా తక్కువగా వుంటుంది.

బట్ట ఉదాహరణలో :

శ్రమ శక్తి - విలువ = జీతం 20

శ్రమ - విలువ = జీతం 20 + అదనపు విలువ 20 = 40

బట్ట కోసం పని చేసిన శ్రామికులు 10 మంది. ప్రతి ఒక్కరూ 12 గంటల సేపు పని చేశారు.

| | |
|---|---|
| ఒక శ్రామికుడి శ్రమ విలువ | 4 |
| అతని జీతం | 2 |
| అతని అదనపు విలువ | 2 |
| 10 మంది జీతం | 20 |
| 10 మంది అదనపు విలువ | 20 |
| 10 మంది శ్రమ విలువ | 40 |

ప్రతి ఒక్కరూ శ్రమ విలువలో సగం భాగాన్ని పోగొట్టుకున్నారు. ఒక రోజు అయినా, ఒక నెల అయినా, జరిగేది ఇదే!

'జీతం' అనేది, 'కొంత డబ్బు' గా

కనపడుతుంది గానీ, జీతానికి అసలు అర్థం - కొన్ని పోషణ వస్తువులు. 'జీతం డబ్బు' తో కొంటే, ఎన్ని వస్తువులు వస్తాయో అన్ని వస్తువులే జీతం.

**ఒక ప్రశ్న :** 'వస్తువు' అనేది, తన విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వదు కదా? ఒక పని కోసం ఉత్పత్తి సాధనాలు ఖర్చయినప్పుడు, అవి, తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వవు. 'జీతం' పేరుతో వుండేవి కూడా వస్తువులే కదా? అవి, తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఎలా ఇస్తాయి?

**జవాబు :** శ్రామికుల పోషణ వస్తువులు కూడా వస్తువులే. కానీ, పని స్తలం లోకి వచ్చేవి అవి కాదు. పని స్తలం లోకి వచ్చి పని చేసేది, శ్రామికులు. వారు, అక్కడ కొత్త శ్రమ చేస్తారు. తమ పోషణ వస్తువుల కోసం అవసరమయ్యే శ్రమ కన్నా ఎక్కువ శ్రమ చేస్తారు. ఉత్పత్తి సాధనాలైతే, అవి పని స్తలం లోకి వచ్చినా, అవి మనుషుల్లాగ పని చెయ్యవు. శ్రామికులు చేసే శ్రమ కోసం అవి ఖర్చవుతాయి. అవి వస్తువులు కాబట్టి, అవి తమ పాత శ్రమ విలువ ఎంత వుంటే అంత విలువనే ఇస్తాయి. ఎక్కువని ఇవ్వలేవు. శ్రామికులు మనుషులు కాబట్టి, వారి సంగతి వేరు.

ఈ బట్ట ఉదాహరణలో, శ్రామికులు పని చేసింది నేత శ్రమలో. ఈ నేత శ్రమలో 6 గంటల కాలాన్ని, జీతంగా తీసుకున్నారు. ఈ 6 గంటల విలువ, 2 రూ.లు. ఒక శ్రామికుడు, ఒక రోజులో, పోషణ కోసం వాడే వస్తువుల విలువ 2. ఆ పోషణ వస్తువులన్నీ తయారైన కాలం 6 గంటలు. (ఆ వస్తువుల తయారీకి ఏ యే శ్రమలు అవసరమో ఆ వేరు వేరు శ్రమలన్నీ కలిసి, ఈ 6 గంటల నేత శ్రమతో సమానం అని అర్థం). అంటే, 6 గంటల శ్రమతో తయారైన వస్తువుల్ని పోషణ కోసం వాడే శ్రామికుడు, ఆ శరీరంతో, యజమాని పని స్తలంలో, 12 గంటల కాలం పని చేశాడు.

**ఇక్కడ గ్రహించవలసిన విషయం :** మనుషులు చేసే శ్రమ పరిమాణం (శ్రమ సైజు), వాళ్ళు పోషణ కోసం వాడే శ్రమ పరిమాణాన్ని బట్టి వుండదు.

శ్రమ చెయ్యడంలో, 2 రకాల షరతులు వున్నాయి.

**1) యజమాని లేని స్వతంత్ర శ్రామికుల పరిస్తితి ఇది :** రోజూ పోషణ కోసం వాడే శ్రమ 8 గంటలు అయితే, ఆ మనిషి ప్రతి రోజూ చేసే శ్రమ 8 గంటలుగా వుండి తీరాలి. అలా అయితే, రోజూ పోషణ ఒకే స్థాయిలో వుంటుంది. పోషణ కన్నా, తిరిగి చేసే శ్రమ కొంత ఎక్కువగా వుంటే, ఆ ఎక్కువ భాగం, నిల్వగా కూడుతుంది. పోషణ ఖర్చు కన్నా, చేసే శ్రమ తక్కువ అయితే, పోషణ తగ్గిపోతుంది. స్వతంత్ర ఉత్పత్తిదారులైనా, పోషణతో సమానమైన శ్రమ చేసుకుంటూనే వుండాలి.

**2) యజమానులు గల శ్రామికుల పరిస్తితి ఇది :** వీరు, తమ పోషణ ఖర్చు కన్నా, తిరిగి చేసే శ్రమ తప్పనిసరిగా చాలా ఎక్కువగా వుండాలి. రెండూ సమానం అయితే, వారి పోషణ కోసం పోగా పెట్టుబడిదారుడికి మిగిలేదేమీ వుండదు. పోషణ కన్నా ఎక్కువగా చేసే శ్రమ, ఏదో కాస్త ఎక్కువ అయితే చాలదు. అది చాలా

ఎక్కువగా వుండాలి. ఎందుకంటే, 'అదనపు శ్రమ', అనేక పేర్లతో పంపకాలవ్వాలి. శ్రమ చెయ్యకుండా బతికే అనేక మంది, అదనపు శ్రమ తోనే బతకాలి. రాజ్యాంగ యంత్రంలో వుండే పోలీసూ, సైన్యమూ వంటి శాఖలన్నీ ఈ అదనపు శ్రమతోనే నడవాలి. కాబట్టి, ప్రతి శ్రామికుడూ అదనపు శ్రమని చాలా ఎక్కువగా ఇవ్వాలి. ఈ శ్రామికుడు, 2 గంటల శ్రమతో తయారయ్యే పోషణతో, పని స్థలంలో 12 గంటల శ్రమ చెయ్యగలడు. చారెడు గంజి తాగిన శక్తితో, రోజంతా పని చేస్తాడు.

శ్రామికుల శరీరాలు, అలా శ్రమలు చేస్తూ వుంటే, యజమానుల శరీరాలు దానికి పూర్తిగా విరుద్ధం. యజమాని శరీరం, రోజుకి 100 గంటల శ్రమని పోషణ కోసం వాడుతూ, అణువంత శ్రమ అయినా చెయ్యకుండా వుండగలదు.

'వస్తువు' అయితే, ఒక పని కోసం ఖర్చయినప్పుడు, అది ఎంత శ్రమతో తయారైందో అంత శ్రమని మాత్రమే చేర్చగలదు. ఆ శ్రమ కన్నా ఎక్కువనీ చేర్చదు, తక్కువనీ చేర్చదు. కానీ, మనిషి దేహం, అలా కాదు. అది, 'నిర్జీవమైన వస్తువు' కాదు. అది, తన కోసం వాడుకున్న శ్రమ కన్నా ఎక్కువనీ ఇవ్వగలదు ; తక్కువనీ ఇవ్వగలదు ; అసలు ఇవ్వకుండానూ వుండగలదు.

ఒక ఉత్పత్తి సాధనాన్ని ( ఒక వస్తువుని ) కొనాలంటే, అది తన ద్వారా ఎంత పాత శ్రమని ఇస్తుందో, ( అది ఎంత శ్రమతో తయారై వుందో ) అంత శ్రమకీ పూర్తిగా చెల్లించాలి. దాని శ్రమ విలువ 4 అయితే, ఆ 4 ని పూర్తిగా ఇవ్వాలి. అంత కన్నా తక్కువని చెల్లిస్తే, ఆ వస్తువు రాదు. ఆ తక్కువ విలువతో, ఆ ఉత్పత్తి సాధనం మళ్ళీ తయారవదు. కానీ, ఒక శ్రామికుణ్ణి పనిలో పెట్టాలంటే, అతని దేహం ఇచ్చే సజీవ శ్రమ కోసం పూర్తిగా చెల్లించనక్కర లేదు. ఆ శరీరానికి కనీసపు పోషణ జరిగేలాగ చెల్లిస్తే చాలు. అయినా, ఆ మనుషులు మళ్ళీ దొరుకుతారు, మళ్ళీ శ్రమలు చేస్తారు. అదే పోషణతో బతికే వుంటారు. కానీ నిరుపేదలుగా, బికారులుగా.

బట్ట ఉదాహరణలో, శ్రామికులకు, 1 రోజులో 12 గంటలు శ్రమ చేస్తే, దానికి జీతంగా 6 గంటల శ్రమే అందింది. ఇంకో 6 గంటల శ్రమ అందలేదు. వారికి అందని శ్రమ - వారి అదనపు శ్రమ. అదనపు శ్రమ విలువ, అదనపు విలువ. అది అదనపు ఉత్పత్తి. అది అదనపు డబ్బు. అది, పెట్టుబడిదారుడికి పోతుంది.

ఒక పెట్టుబడిదారుడి దగ్గర జరిగేదే ప్రతీ పెట్టుబడిదారుడి దగ్గిరా జరుగుతుంది.

శ్రామిక వర్గం - శ్రమలు చేసే వర్గం!
పెట్టుడిదారీ వర్గం - శ్రమని దోచే వర్గం!

ఇదంతా మళ్ళీ వెనకటి చరిత్రే! వెనకటి యజమానుల దగ్గిర ఏం జరిగిందో, ఇక్కడా అక్షరాలా అదే జరుగుతుంది. అక్షరాలా 'శ్రమని దోచడమే'. ఇక్కడ జరిగేది కూడా యజమాని వర్గాన్ని, శ్రామిక వర్గం పోషించడమే. ఇక్కడ కూడా - శత్రు వర్గాలే! ఇక్కడ కూడా నిరుపేదతనాలూ, సిరి సంపదలూ! ఇక్కడ కూడా అక్కడివే.


# ప్రశ్నలూ - జవాబులూ

**1**. శ్రమని ఇవ్వడంలో, నిర్జీవ వస్తువుకీ, మానవ దేహానికీ తేడా ఏమిటి?

**జ** : వస్తువు, శ్రమ చెయ్యదు, మనిషి దేహం స్వయంగా శ్రమ చేస్తుంది. ఒక పని కోసం ఒక వస్తువుని వాడినప్పుడు, ఆ వస్తువు ఎంత శ్రమతో తయారయ్యిందో అంత శ్రమ మాత్రమే ఆ వస్తువు వల్ల చేరుతుంది. కానీ, మనిషి దేహం అలా కాదు. దాని పోషణ కోసం ఖర్చయ్యే శ్రమ సైజుకీ, తిరిగి ఆ దేహం చెయ్యగలిగే శ్రమ సైజుకీ, సంబంధం ఉండదు. మొదటి దాని కన్నా రెండోది ఎక్కువగా ఉండవచ్చు ; తక్కువగా ఉండవచ్చు ; అసలే ఉండక పోవచ్చు. అది రక రకాల సంబంధాల్ని బట్టి ఉంటుంది.

**2**. ఒక శ్రామికుడి అదనపు విలువని చూపించండి.

**జ** :




అది అంతా శ్రామికులు ఒక రోజు చేసిన శ్రమ.
1. శ్రామికుల ఒక రోజు పోషణ.
2. శ్రామికుల ఒక రోజు అదనపు శ్రమ.

**3**. ఏ మనిషి అయినా రోజూ ఎంత కాలం శ్రమ చెయ్యాలో, దాని కేదైనా సహజ నియమం ఉందా?

**జ** : ఆ మనిషి పోషణ కోసం, అన్ని అంశాలకూ కలిసి నిత్యం ఎంత శ్రమ అవసర మవుతుందో అంత శ్రమ చెయ్యాలి. విశ్రాంతిగా గడిపే రోజులూ, అనారోగ్యాలూ ఉన్న కాలాల్లో పని జరగదు కాబట్టి, ఆ పని కూడా, పనిచేసే రోజుల్లోనే జరగాలి. కానీ, యజమానీ శ్రామిక సంబంధంలో అయితే, ఈ నియమం పనికి రాదు. శ్రమ చేసే వ్యక్తి, తనకు కావలసినంత శ్రమే కాదు ; యజమాని కోసం కూడా శ్రమ చెయ్యాలి. యజమాని పోషణా, విలాసాలూ అన్నీ తీరేటంత శ్రమ శ్రామికులే ఇవ్వాలి. అది, యజమానీ శ్రామిక సంబంధంలో వున్న నియమం.

**4**. ఒక స్వతంత్ర శ్రామికుల కుటుంబంలో, అందరూ రోజంతా శ్రమలు చేస్తారు. ఒక వ్యక్తి పోషణ కోసం, అన్ని అంశాలకూ కలిసి, 8 గంటల శ్రమ అవసరమవుతుంది. కానీ, ఆ ఇంట్లో ఒక కొడుకు, 5 గంటల కన్నా ఎక్కువ కాలం పని చెయ్యడు. అతని పోషణ ఎలా జరుగుతుంది?

**జ** : అతని శ్రమ ద్వారా కొంతా, కుటుంబంలోని ఇతరుల శ్రమ ద్వారా కొంతా.

**5**. బానిసలు, కౌలు రైతులు, కార్మికులు. - వీరి మధ్య పోలిక లేమిటి? తేడా లేమిటి?

**జ** : **పోలికలు:** అందరూ శ్రామికులే. అందరూ ఉత్పత్తిదారులే. అందరూ యజమానుల కింద సేవకులే. అందరూ ఉత్పత్తి సాధనాలు లేని వారే. అందరూ శ్రమ దోపిడీకి గురి అయ్యేవారే. అందరూ పేదలే.

**తేడాలు:** బానిసలు - తమ ప్రాణాల మీద కూడా హక్కులు లేనివారు.

కౌలు రైతులు - భూమి మీద ఆస్తి హక్కు లేకపోయినా, చిన్న భూమి గల వారు.

కార్మికులు - తమ పోషణని 'జీతం' రూపంలో పొందగలవారు.

# 51. 'అదనపు విలువ' ని ఎవరెవరు తింటారు?

బట్ట ఉదాహరణలో, 20 అదనపు విలువ వచ్చింది కదా? దాన్ని పెట్టుబడిదారుడు ఏం చేస్తాడు?

ఇలా పంపకాలు చేస్తాడు :

ఇవన్నీ ఒక్క రోజు లెక్కలు.

**( 1 ) వర్తక కమిషన్ కోసం 3:**

ఇది, బట్టని అమ్మిపెట్టిన వర్తకుడి చేతికి వెళ్తుంది. కానీ అందులో కొంత, 'వర్తకం పనుల కోసం' ఖర్చవుతుంది. ఆ ఖర్చు పోగా మిగిలేది 'వర్తక లాభం'. ఈ లాభం, శ్రమ చెయ్యకుండా దొరికే భాగం. కానీ, ఇందులో చాలా వివరాలు తెలియాలి. 'వర్తకుడు' గా వుండే వ్యక్తి, వర్తకం పనులు, స్వయంగా చేసే వర్తకుడు కావచ్చు. లేదా, ఆ పనులు శ్రామికులతో చేయించే వర్తక పెట్టుబడిదారుడు కావచ్చు. ఆ వర్తకుడు ఏ రకం వాడైనా, 'వర్తక కమిషన్' అంతా, ఆ వర్తకుడు అమ్మే సరుకు తాలూకు అదనపు విలువలోదే. చాలా వివరాలు తెలిస్తేనే ఇది అర్థమవుతుంది.

**( 2 ) 'వడ్డీ' కోసం 1 :**

పెట్టుబడి అప్పు తెచ్చింది అయితే, వడ్డీ, బైటికి పోతుంది. అప్పు తెచ్చింది కాకపోతే, వడ్డీని, పెట్టుబడిదారుడే తీసుకుంటాడు. తన డబ్బుని తనకే అప్పు ఇచ్చుకున్నట్టు రాసుకుంటాడు. దానికి వడ్డీ చెల్లించినట్టు కూడా రాసుకుంటాడు. వడ్డీ అనేది, శ్రమ చెయ్యకుండా దొరికే డబ్బే.

**( 3 ) భూమి కౌలు 1 :**

ఇది, పని స్థలంగా వున్న షెడ్డు సంగతి కాదు. ఆ షెడ్డు, శ్రమలతో తయారైన 'ఉత్పత్తి సాధనాల' లెక్క లోకి వెళ్తుంది. దాని సంగతి కాదు. ఇది, ఆ షెడ్డు కింద వున్న భూమి సంగతి. ఆ భూమి, పెట్టుబడిదారుడి ఆస్తే అయినా, తన భూమిని తనకే కౌలుకి ఇచ్చుకుంటాడు. కౌలు చెల్లించినట్టు కూడా రాసుకుంటాడు. అది పెట్టుబడిదారుడికే వుండిపోతుంది. కౌలు, శ్రమ చెయ్యకుండా దొరికే డబ్బే.

**( 4 ) ప్రభుత్వానికి కట్టే పన్నులు 2 :**

పెట్టుబడిదారుల రాజ్యాంగ యంత్రం కూడా వెనకటి రాజ్యాంగ యంత్రాల కొనసాగింపే. ఇక్కడ కూడా ఆస్తిపరుల ఆస్తి హక్కులన్నీ గతంలో లాగే వుంటాయి. భూస్వాములు, భూమికి స్వంతదారులుగా వుండవచ్చు. భూమి ద్వారా 'కౌలు' సంపాదించవచ్చు. అలాగే, పెట్టుబడి దారులందరూ, ఉత్పత్తి సాధనాలకు స్వంతదారులుగా వుండవచ్చు. వాటి ద్వారా 'వడ్డీ - లాభాలు' సంపాదించవచ్చు. ఈ రాజ్యాంగ యంత్రంలో చట్టాలన్నీ, ఈ ఆదాయాలనే సమర్థిస్తాయి ; కార్మికుల ద్వారా తిరగబాట్లు రాకుండా ఈ ఆస్తి హక్కుల్ని రక్షిస్తాయి. కాబట్టి, ఈ రాజ్యాంగం కూడా, వెనకటి రాజ్యంగాల లాంటిదే. కాకపోతే, ఇక్కడ సింహాసనం మీద 'రాజు' వుండకపోవచ్చు. ( మహా పెద్ద పెట్టుబడిదారీ దేశం

అయిన ఇంగ్లాండులో, ఈ నాటికీ సింహా సనం మీద యువ రాజులూ రాణులూ వున్నారు! ) ' రాజు' లేకపోయినా, రాజుల్ని మించిన ప్రెసిడెంట్లూ, గవర్నర్లూ, ప్రధాన మంత్రులూ వంటి పేర్ల వాళ్ళు ఈ రాజ్యాం గంలో వుంటారు. వాళ్ళందరూ స్వయంగా పెద్ద పెద్ద ఆస్తి పరులు. అందుకే వాళ్ళు, దేశంలో వున్న ఆస్తిపరులందరికీ ప్రతి నిధులు.

ఈ రాజ్యాంగంలో, ' ప్రజాస్వామ్యం' అనే కొత్త మాట ఒకటి బైల్దేరుతుంది. ఈ ప్రజాస్వామ్యం, మొత్తం జనాభా అంతటికీ సంబంధించినదిగా పైకి కనపడుతుంది. కానీ, ఇది ఆస్తిపరులకే ఉపయోగపడే ప్రజాస్వామ్యం. ఈ రాజ్యాంగంలో వుండే చట్టాల్ని నిలబెట్టాలంటే, శ్రామిక వర్గాన్ని అణిచి వుంచడానికి, బోలెడు పోలీసూ, బోలెడు కోర్టులూ, జైళ్ళూ, కావాలి. ఆ ఖర్చుల కోసం, ఆస్తిపరులందరూ ప్రభు త్వానికి పన్నులు కట్టాలి. ఆ డబ్బుని వాళ్ళు, ఎక్కణ్ణించి తెస్తారు? భూస్వాములైతే, తమకు వచ్చే కౌళ్ళలో నించి చెల్లిస్తారు. పెట్టుబడిదారులైతే, తాము ఉత్పత్తి చేయించే సరుకుల ద్వారా వచ్చే అదనపు విలువల్లో నించి చెల్లిస్తారు.

ఈ రాజ్యాంగం, శ్రామికుల అవసరం కాదు. ఆస్తిపరుల అవసరమే. కానీ, ఆ పన్నులు చెల్లించవలసిన ఆస్తిపరులు, తమ జమా ఖర్చుల్లో ఎన్నో తప్పుడు లెక్కలు చూపించి, పన్నుల్లో ఎంతో భాగాన్ని ఎగ్గొడ తారు. ఎగ్గొట్టిన భాగాలన్నీ ప్రభుత్వానికి వెళ్ళకుండా, ఎగ్గొట్టిన వాళ్ళకే వుండి పోతాయి.

కార్మికుల్లో మేధాశ్రమల వాళ్ళు కూడా తమ ఆదాయాలలో నించి పన్నులు కట్టాలి. ఆ ఆదాయాలన్నీ జీతాల రూపంతో ఖచ్చితమైన లెక్కలతో వుంటాయి. కాబట్టి, తప్పుడు లెక్కలు చూపించడానికి వీరికి అవకాశాలు వుండవు.

**( 5 ) అనుత్పాదక ఖర్చులూ, లంచాలూ 1 :**
( వీటిని వేరే పాఠాల్లో చూస్తాం )

**( 6 ) పెట్టుబడిదారుడి జీతం ? :**

పెట్టుబడిదారుడు, తన సరుకు తయారీలో ఏదైనా శ్రమ చేస్తే దానికి ఎంత జీతం రావాలో అంత తీసుకోవచ్చు. దాని అదనపు విలువని కూడా తీసుకోవచ్చు. శ్రమ చేసి జీతం తీసుకుంటే అది సమస్య కాదు. కానీ, పెట్టుబడిదారుడు చాలా చిన్న పెట్టుబడి గల చిన్న స్థాయి వాడైతేనే, శ్రామికులతో కూడా కలిసి కొంచెం శ్రమ చేస్తాడు. పెద్ద పెట్టుబడి గల పెద్ద పెట్టుబడిదారుడు, ఏ శ్రమా చెయ్యడు. నిర్వహణ శ్రమ లాంటిది కూడా చెయ్యడు. ఆ పని, మేధా శ్రమల ఉద్యోగులు చేస్తారు. పెట్టుబడిదారుడు, ఏ శ్రమా చెయ్యకుండానే పెద్ద జీతం తీసుకుంటాడు. తన జీతాన్ని తనే నిర్ణయించుకుంటాడు. శ్రమ చెయ్యకుండా తీసుకునే జీతం, పెద్దదైనా చిన్నదైనా, అది శ్రామికుల అదనపు విలువలో నించి తీసేదే. ( పెట్టుబడిదారుడి జీతం సంఖ్యని ఇక్కడ ఇవ్వడం లేదు. )

**( 7 ) పారిశ్రామిక లాభం 10 :**

పరిశ్రమ పెట్టినందుకు పెట్టుబడిదారుడుకి చివరికి మిగిలే భాగం ఇది. పెట్టుబడిదారుడికి, స్వంత పని స్థలమూ, స్వంత పెట్టుబడీ వుంటే, కౌలూ, వడ్డీ, పెద్ద జీతాలూ, పారిశ్రామిక లాభమూ అన్నీ

అతని సంచిలోనే పడతాయి.

బట్ట ఉదాహరణలో, శ్రామికుల అదనపు విలువ 20, ఇన్ని పేర్లతో, ఇన్ని మార్గాల్లో పంపకాలవుతుంది.

ప్రతీ సరుకు నించీ ఇదే జరుగుతుంది. మొత్తం సరుకుల రాసి అంతటి నించీ ఇదే జరుగుతుంది.

ఈ కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ అనేవి, శ్రామికుల అదనపు విలువని పంచుకునేవే - అనే విషయం తేలిగ్గా అర్థం అవడానికి, దీన్ని ఇంకో రకంగా చూద్దాం. అదనపు విలువలో జరిగే పంపకాలన్నిటికీ ఉదాహరణగా 'వడ్డీ' ని తీసుకుందాం. మిగతా వాటి సంగతి కూడా ఇలాంటిదే. వస్తువు తయారీకి, వడ్డీ అవసరమో, అనవసరమో చూడాలి. ఏదైనా ఒక 'ఉత్పత్తి సాధనాన్ని' కూడా తీసుకోవాలి. 'మగ్గాన్ని' తీసుకుందాం. మగ్గానికీ, వడ్డీకీ వుండే తేడాని అర్థం చేసుకోవాలి.

నేత పనిలో, మగ్గం ఒక పనిముట్టు. అది ఉత్పత్తి సాధనాల్లో భాగం. అది, పని స్థలంలో వుండి తీరాలి. మగ్గం విలువ, 6 అనుకుందాం. ఆ విలువ, బట్టకి చేరుతుంది. ( అలాగే, ఇతర ఉత్పత్తి సాధనాల విలువ అంతా బట్టకి చేరుతుంది )

**బట్ట విలువలో అంశాలు :**

| | | | |
|---|---|---|---|
| (1) | ఉత్పత్తి సాధనాలు | - | 80 విలువ |
| (2) | జీతాలు | - | 20 విలువ |
| (3) | అదనపు శ్రమ | - | 20 విలువ |
| | మొత్తం | - | 120 విలువ |

బట్టని అమ్మేశారు. 120 డబ్బు వచ్చింది. మగ్గం విలువ వెనక్కి రావాలంటే, బట్ట విలువలో నించే రావాలి. ఏ భాగంలో నించి వస్తుంది? అది, 'ఉత్పత్తి సాధనాల' భాగంలోకి చేరి వుంది కాబట్టి, ఆ భాగంలో నించే వెనక్కి వస్తుంది. ఏ ముడి పదార్థం విలువ అయినా, ఏ పని ముట్టు విలువ అయినా, బట్టకి చేరడమూ, వెనక్కి రావడమూ జరుగుతాయి.

వడ్డీ సంగతి కూడా ఉత్పత్తి సాధనాల లాగే జరుగుతుందా?

'వడ్డీ' సంగతి చూడండి! పెట్టుబడిదారుడు, పెట్టుబడి మీద వడ్డీ కోసం 1 ని చెల్లించాలి. ఆ 1 ని సరుకు విలువలో నించే తియ్యాలి. వడ్డీ 1, సరుకులోకి చేరి వుందా? ఏ భాగంలోకి చేరి వుంది? దాన్ని ఏ భాగంలో నించి బైటికి తియ్యాలి? ఉత్పత్తి సాధనాల 80 లో నించి తియ్యాలా? - అలా సాధ్యం కాదు.

వడ్డీ అనేది ఒక ఉత్పత్తి సాధనం కాదు. అది పని స్థలంలోకి రాలేదు. అది, కొత్త బట్ట కోసం ఖర్చవలేదు. కాబట్టి, ఉత్పత్తి సాధనాల 80 లో నించి 1 ని తీసి, దాన్ని వడ్డీ కోసం చెల్లించడం సాధ్యం కాదు.

అయితే, దాన్ని జీతాల 20 లో నించి తీసి చెల్లించాలా? - అదీ సాధ్యం కాదు. వడ్డీ, ఒక శ్రామికుడిలా పని స్థలంలోకి వచ్చి తన శ్రమని ఇవ్వలేదు. కాబట్టి, అది, జీతాల్లో భాగం కూడా కాదు.

మరి, వడ్డీని ఎలా చెల్లించాలి? - ఇంకెలాగ? సరుకులో, 'అదనపు విలువ' భాగం ఒకటి వుంది కదా? అది, శ్రామికులకు ఏమీ చెల్లించకుండా వచ్చిన విలువ. అందులో నించే వడ్డీని చెల్లించడం సాధ్యం.

ఉత్పత్తి సాధనం విషయం అయితే, అది, సరుకు కోసం ఖర్చవుతుంది. ఆ సరుకుని అమ్మినప్పుడు, ఆ ఖర్చు అంతా

డబ్బుగా వెనక్కి వచ్చేస్తుంది. కానీ వడ్డీ సంగతి అలా కాదు. అది, సరుకు కోసం ఖర్చవదు. అయినా, దాన్ని సరుకులో నించే చెల్లించాలి. సరుకు కోసం ఖర్చవని దాన్ని సరుకులో నించి తియ్యాలి. సరుకు విలువలో వున్న ఏ భాగంలో నించి తియ్యాలి? - 'అదనపు విలువ' భాగంలో నించే తియ్యాలి.

'కౌలు' సంగతీ అలాగే.

'లాభం' సంగతీ అలాగే.

'ఉత్పత్తి సాధనం' కానిదీ, శ్రామికుల పోషణ వస్తువు కానిదీ - ఈ 2 అంశాలకూ చెందని ఏ విషయం అయినా, శ్రమని దోచే మార్గమే. కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ అనే పేర్లు, శ్రామికుల శ్రమని దోచడం ద్వారా వచ్చే ఆదాయాలే.

# ప్రశ్నలూ - జవాబులూ

**1.** ప్రభుత్వానికి కట్టే పన్నుల్ని కూడా శ్రామికుల అదనపు విలువగా లెక్క కట్టడం సరైనదేనా? ప్రభుత్వం, ధర్మాసుపత్రుల్ని నడుపుతుంది. అక్కడ, కార్మికులు కూడా వైద్యం చేయించుకుంటారు. ప్రభుత్వం, ఉచిత పాఠశాలల్ని నడుపుతుంది. అక్కడ, కార్మికుల పిల్లలు చదువుతారు. ప్రభుత్వం వేయించే రోడ్ల మీద కార్మికులు కూడా నడుస్తారు. అలాంటప్పుడు, కార్మికుల శ్రమలో నించి కొంత భాగం, ప్రభుత్వానికి పన్నులుగా వెళ్ళడంలో తప్పేముంది?

**జ :** ప్రభుత్వానికి పన్నులుగా వెళ్ళే విలువ అంతా కార్మికుల శ్రమే. ఆ పన్నుల విలువలో నించి కార్మికుల కోసం కూడా ఉపయోగపడేది ఏదైనా వుంటే, అది సముద్రంలో నత్త గుల్ల అంత! పన్నుల విలువతో ప్రభుత్వం చేసే పరిపాలన అంతా, పోలీసునీ, సైన్యాన్నీ, కోర్టుల్నీ, జైళ్ళనీ, చివరికి ఉరికంబాల్నీ నడపడానికే. ఆ పరిపాలన కార్మిక వర్గాన్ని అణిచి వుంచడానికే. ఆ పరిపాలన కార్మికుల - క్షేమం కోసం కాదు కాబట్టి, ఆ ఖర్చుని కార్మిక వర్గం, తన శ్రమతో భరించనక్కరలేదు. ఆ పన్నుల విలువ అంతా, కార్మిక వర్గం పోగొట్టుకునే అదనపు విలువలో భాగమే అవుతుంది.

**2.** మానవ సమాజంలో అనేక రకాలైన కళాకారులు ఉంటారు. కవులూ, గాయకులూ చిత్రకారులూ, నాట్యకారులూ - వంటివారు. అలాంటి వారికి ప్రభుత్వం, ఎన్నో బహుమతులు ఇస్తుంది. ఎంతో ఖర్చు పెట్టి సన్మానాలు చేస్తుంది. కళాకారుల కోసం అలాంటి చాలా ఖర్చుల్ని తన పన్నులలో నించే పెడుతుంది. ఆ ప్రభుత్వ బహుమతులూ, సన్మానాలూ పొందే కళాకారులు, ఏ కోవలోకి వస్తారు?

**జ :** ఒక గాయకుడు, ఒక జన సమూహంలో తన గానం వినిపించి, దానికి బదులుగా, కొంత ప్రతిఫలాన్ని తీసుకుంటే, అలా తీసుకోవడానికి హక్కు ఉంటుంది. ఏ కళాకారుడికైనా, తన కళని ప్రదర్శించిన చోట, తన శ్రమకూ, తన కళకూ బదులుగా కొంత ప్రతిఫలం పొందే హక్కు ఉంటుంది. ప్రభుత్వానికి వుండే పన్నుల ఆదాయంలో నించి, బహుమతుల పేరుతో, సన్మానాల పేరుతో, కొంత విలువని →

తీసుకోవడం అనేది, శ్రమకు బదులుగా పొందే ఆదాయం అవదు. దోపిడీ వర్గ ప్రభుత్వాలు, కార్మిక వర్గంలో నించి, ఉన్నత మేధాశ్రమల వారినీ, కళాకారుల్నీ, తమకు సమర్ధకులుగా చేసుకోవడానికే, బిరుదుల - బహుమానాల - సన్మానాల సంస్కృతిని (సాంప్రదాయాల్ని) పోషిస్తూ వుంటాయి. దాని కోసం కొంత ఆదాయాన్ని ఖర్చు పెడుతూ వుంటాయి. ప్రభుత్వాల నించి కళాకారులు పొందే అలాంటి ఆదాయాలు, కార్మిక వర్గపు అదనపు విలువలో భాగాలే.

**3**. ప్రభుత్వానికి ఆదాయం కేవలం పన్నులేనా?

**జ**: కేవలం పన్నులే కాదు. ప్రభుత్వం కూడా కొన్ని పరిశ్రమలు నడుపుతుంది. అంటే, ప్రభుత్వం కూడా ఒక పెట్టుబడిదారుడే. అది నడిపే పరిశ్రమల ద్వారా, అది కూడా ఆ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల అదనపు విలువని సంపాదిస్తుంది. ఆ అదనపు విలువ కూడా ప్రభుత్వానికి ఆదాయంగా ఉంటుంది.

**4**. పెట్టుబడిదారుడి జీతాన్ని పెట్టుబడిదారుడే నిర్ణయించుకుంటే, అది 'న్యాయం' ఎలా అవుతుంది?

**జ**: 'న్యాయం' కావాలా పెట్టుబడిదారుడికి? పెట్టుబడిదారుడు ఎవరు? బానిస యజమానికీ, భూస్వామికీ, వారసుడు! శ్రమ దోపిడీని కొనసాగించే ఆధునికుడు! అలాంటి దోపిడీదారుడి న్యాయం, దోపిడీ పక్షాన్నే ఉంటుంది. ఒక వేళ, పెట్టుబడిదారుడు, అదనపు విలువలో నించి, జీతాన్ని తక్కువగా తీసుకున్నా, మిగిలింది ఎటూ పోదు. అది, ' లాభం' లోకి చేరుతుంది. అది అతనికే అందుతుంది.

**5**. కార్మికుల జీతాల్ని కార్మికుల్నే నిర్ణయించుకోమంటే?

**జ**: దాని వల్ల తేడా ఏమీ రాదు. కార్మికులు నిర్ణయించుకున్న జీతాల్నే పెట్టుబడిదారుడు ఇస్తాడనుకుందాం. ఆ జీతాలన్నిటినీ కలిపి, దాని పైనే 'లాభం' వేసుకుంటాడు. అప్పుడేమవుతుంది? వేసుకున్నది కూడా కలిసినదే విలువ అవుతుంది. ఆ సరుకులో నించే కొంత భాగాన్ని లాభంగా తీసుకుంటాడు. జీతాల కన్నా అదనంగా ఏది కలిసినా, అది కార్మికుల అదనపు విలువే.

**6**. 'అదనపు విలువ'ని తేలిగ్గా లెక్కపెట్టడం ఎలాగ?

**జ**: సరుకుని అమ్మగా వచ్చిన డబ్బులో నించి, ఉత్పత్తి సాధనాల విలువనీ, ఆ సరుకుని తయారుచేసిన కార్మికుల జీతాల విలువనీ - ఈ రెంటినీ తీసేస్తే, మిగిలినదంతా అదనపు విలువే. మొత్తం సరుకుల రాసిలో అదనపు విలువని కూడా ఇలాగే తెలుసుకోవాలి. ఒక పెట్టుబడిదారుడి దగ్గిర గానీ, ఒక శాఖలో గానీ, ఒక దేశంలో గానీ, ఎక్కడైనా అదనపు విలువని తెలుసుకునే విధానం అదే.

H

# 52. అదనపు శ్రమ అదనపు విలువ అదనపు ఉత్పత్తి

ఈ 3 విషయాలూ ఒకటే. ఒకే విషయానికి అవి వేరు వేరు రూపాలు.

**అదనపు శ్రమ** : యజమాని దగ్గిర పని చేసే ఒక శ్రామికుణ్ణి తీసుకోవాలి. అతను రోజూ 10 గంటలు పని చేస్తాడు. కొన్ని ఉత్పత్తులు తయారుచేస్తాడు. ఆ శ్రామికుడికి, యజమాని ద్వారా రోజూ అందే పోషణ, 5 గంటల శ్రమతో తయారయ్యే పదార్థాలు - అనుకుందాం. శ్రామికుడి శ్రమలో నించి అతనికి అందే శ్రమ - 'అవసర శ్రమ'. అది, అతను తన పోషణ కోసం చేసుకోవలిసిన శ్రమ. దాని కన్నా ఎక్కువగా జరిగే శ్రమ - 'అదనపు శ్రమ'. అది అతనికి అందని శ్రమ. ఈ ఉదాహరణలో, అదనపు శ్రమ - 5 గంటలు. అది, యజమానికే!

**అదనపు విలువ** : అదనపు శ్రమకు వుండే విలువే - అదనపు విలువ. శ్రామికుడు చేసిన 10 గంటల శ్రమ విలువని, 10 రూ.లు అనుకుందాం. అతని జీతాన్ని 5 రూ.లు అనుకుందాం. శ్రామికుడి శ్రమని, యజమాని అమ్మినప్పుడే ఆ శ్రమకి, విలువ లెక్కలు తెలుస్తాయి. అయితే, యజమాని, శ్రామికుడి శ్రమని మాత్రమే విడిగా అమ్మడం కుదరదు. ఆ శ్రామికుడు తయారుచేసిన 'ఉత్పత్తి'నే అమ్మాలి. ఆ ఉత్పత్తిలో, శ్రామికుడి శ్రమ ఒక్కటే ఉండదు. దానికి, 'ఉత్పత్తి సాధనాల' ద్వారా చేరే పాత శ్రమ కూడా ఉంటుంది. ఆ పాత శ్రమ విలువని 8 అనుకుందాం. అప్పుడు, ఆ ఉత్పత్తికి నిజంగా వుండే మొత్తం విలువ, పాత శ్రమ 8 + కొత్త శ్రమ 10 = 18 అవుతుంది. అయితే, ఆ ఉత్పత్తిని తయారు చేయించిన యజమానికి, ఉత్పత్తి సాధనాల కోసం పెట్టిన 8 ఖర్చూ, జీతాల కోసం పెట్టిన 5 ఖర్చూ మాత్రమే తెలుస్తాయి. అవి రెండూ కలిసి, 8 + 5 = 13. ఈ 13 ఖర్చు మీద, యజమాని, ఇంకా 'కొంత ఎక్కువ'ని వేసుకుంటాడు. "నేను కౌలూ, వడ్డీ, చెల్లించాలి కదా? నాకూ 'లాభం' రావాలి కదా?" అంటాడు. 13 ఖర్చు మీద, ఇంకా ఎంత ఎక్కువ వేసుకోవచ్చో యజమానికి 'అమ్మకాల అనుభవం' ద్వారా తెలుస్తుంది. యజమాని, 13 ఖర్చు మీద, 5 ఎక్కువని కలిపాడనుకుందాం. ఆ ఉత్పత్తిలో, 5 విలువ గల అదనపు శ్రమ వుంది కాబట్టే, యజమాని, 13 కి, ఇంకో 5 ని కలప గలుగుతాడు. చివరికి, ఆ ఉత్పత్తి విలువ, 13 + 5 = 18 అవుతుంది. దాన్ని అమ్మితే, 18 డబ్బు వస్తుంది. ఉత్పత్తి సాధనాల 8, వెనక్కి వచ్చేస్తుంది. జీతం 5, వెనక్కి వచ్చేస్తుంది. ఆ పైన, '5 అదనపు

విలువ' దొరుకుతుంది. ఆ ఉత్పత్తిలో వున్న అదనపు శ్రమ విలువే - అదనపు విలువ.

**అదనపు ఉత్పత్తి** : శ్రామికుడి అదనపు విలువని 5 రూ.లు అనుకున్నాం. ఆ 5 విలువ, ఎంత ఉత్పత్తికి వుంటుందో, ఆ ఉత్పత్తే - అదనపు ఉత్పత్తి. దీన్ని కొంచెం వివరంగా చూడాలి. శ్రామికుడు, శ్రమ చేసిన కాలం - 10 గంటలు. ఆ 10 గంటల కాలాన్ని ఒక 'పని దినం' అనాలి. ఆ కాలంలో అతను, 18 వస్తువులు (యూనిట్లు) తయారుచేశాడు అనుకుందాం. అయితే, ఆ 18 వస్తువులూ అతని శ్రమే అవవు. ఆ వస్తువుల్లో, ఉత్పత్తి సాధనాల నించి చేరే 8 విలువ కూడా ఉంటుంది. కాబట్టి, ఆ వస్తువుల్లో నించి, పాత శ్రమ భాగానికి ఎన్ని వస్తువులు వెళ్తాయో, కొత్త శ్రమ భాగానికి ఎన్ని వెళ్తాయో మొదట చూడాలి. 18 వస్తువుల విలువ - 18 రూ.లు. 1 వస్తువు, 1 రూ.

ఉత్పత్తి సాధనాల విలువ 8 కాబట్టి, ఆ భాగానికి 8 వస్తువులు వెళ్తాయి. శ్రామికుడి శ్రమ విలువ 10 కాబట్టి, ఆ భాగం 10 వస్తువులు అవుతాయి. అంటే, శ్రామికుడి శ్రమ ఫలితం అంతా శ్రామికుడికి అందాలంటే, అతనికి 10 వస్తువులు అందాలి. కానీ, అలా జరగదు. అతనికి జీతంగా 5 వస్తువులే అందుతాయి. అతనికి అందని ఉత్పత్తి - అదనపు ఉత్పత్తి. అది 5 వస్తువులు. దాని విలువ 5రూ.లు.

అదనపు శ్రమా, అదనపు విలువా, అదనపు ఉత్పత్తీ - అన్నీ ఒకటే.

'శ్రమ' అన్నప్పుడు, దాన్ని గంటల లెక్కతో చూస్తాం. 'విలువ' అన్నప్పుడు, దాన్ని డబ్బు లెక్కతో చూస్తాం. 'ఉత్పత్తి' అన్నప్పుడు, దాన్ని వస్తువుల లెక్కతో చూస్తాం.

యజమానికి అందే అదనపు శ్రమ, 'కొంత ఉత్పత్తి'గా అయినా అందుతుంది ; 'కొంత డబ్బు'గా అయినా అందుతుంది. కొన్ని సందర్భాల్లో, 'కొంత పని' గానే అందుతుంది.

బానిసల కాలంలోనూ, కౌలు రైతుల కాలం లోనూ, యజమానులకు అందే అదనపు శ్రమ, ప్రధానంగా, అదనపు ఉత్పత్తిగానే అందేది. పెట్టుబడిదారుల కాలం నించీ, వాళ్ళకు అందే అదనపు శ్రమ, అదనపు విలువగా ( అదనపు డబ్బుగా ) అందుతుంది.

ఇక్కడ, ఉదాహరణ చాలా తేలిగ్గా వుండడం కోసం, శ్రామికుడి జీతం, అతని శ్రమలో సగ భాగంగా వున్నట్టూ, మిగతా సగం అదనపు శ్రమగా వున్నట్టూ, చూశాం. కానీ, బానిసల కాలం నించీ వాస్తవంగా వున్న జీవితాల్లో శ్రమ దోపిడీ, నూటికి 99 పాళ్ళు దాటిపోయి వుంటుంది. అంటే, శ్రామికుడికి అందే పోషణ, అతని శ్రమలో 1% కూడా ఉండదు. అంత దోపిడీ జరగక పోతే, దోపిడీ వర్గం, స్వంత శ్రమ లేకుండానే పొందే సుఖాలూ, విలాసాలూ ; వాళ్ళు నడిపే రాజ్యాంగ యంత్రంలో పోలీసూ, సైన్యమూ వంటి వాటి ఖర్చులూ - అసాధ్యం. పెట్టుబడిదారీ సమాజంలో, ఈ దోపిడీ లెక్కలన్నీ తేలిగ్గా తియ్యవచ్చు.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. పని దినం ( శ్రామికుడి పని కాలం ) 10 గంటలు. దాని విలువ 10 రూ.లు. జీతం 5. శ్రామికుడు చేసిన వస్తువులు 18. ఉత్పత్తి సాధనాల విలువ 8. - ఈ ఆధారాలతో, (1) 'అదనపు శ్రమ' నీ, (2) 'అదనపు విలువ' నీ, (3) అదనపు ఉత్పత్తినీ, గీతల ద్వారా చూపించండి!

**జ :** పని దినం 10 గంటలు, 2 భాగాలవుతుంది. మొత్తం వస్తువులు 18. ఉత్పత్తి సాధనాల భాగానికి 8 వస్తువులు వెళ్తాయి. అవి పోగా, శ్రామికుడి శ్రమ భాగం - 10 వస్తువులు. అవి, జీతం గానూ, అదనపు ఉత్పత్తి గానూ అవుతాయి.

**శ్రామికుల పని దినం :**

(1)

| అవసర శ్రమ | అదనపు శ్రమ |
|---|---|
| 5 గంటలు | 5 గంటలు |

(2)

| జీతం 5 రూ.లు | అదనపు విలువ 5 రూ.లు |
|---|---|
| 5 గంటలు | 5 గంటలు |

(3)

| శ్రామికుడి పోషణ వస్తువులు 5 | యజమానికి పోయే అదనపు వస్తువులు 5 |
|---|---|
| 5 గంటలు | 5 గంటలు |

**2**. మొదటి ప్రశ్నలో వున్న వివరాలనే తీసుకోండి. అక్కడ ఒక శ్రామికుడి ద్వారా తయారైన 18 వస్తువుల్ని, ఉత్పత్తి సాధనాల భాగానికీ, జీతాల భాగానికీ, అదనపు విలువ భాగానికీ విడదియ్యండి. ఏ భాగానికి ఎన్ని వస్తువులు వస్తాయి?

**జ :** ఉత్పత్తి సాధనాల విలువ 8 రూ.లు. జీతం 5 రూ.లు. అదనపు విలువ 5 రూ.లు. 1 పని దినంలో, 1 శ్రామికుడి ద్వారా తయారైన మొత్తం వస్తువులు 18. 1 వస్తువు విలువ, 1 రూపాయి.

**18 వస్తువుల్ని 3 భాగాలు చేస్తే :**

| ఉత్పత్తి సాధనాల భాగం | జీతం భాగం | అదనపు విలువ భాగం |
|---|---|---|
| 8 వస్తువులు | 5 వస్తువులు | 5 వస్తువులు |

**3**. 1 వ, 2 వ ప్రశ్నల్లో వున్న సమాచారం ప్రకారం, అదనపు శ్రమ ఎంత? అదనపు ఉత్పత్తి ఎంత? అదనపు విలువ ఎంత?

**జ :** అదనపు శ్రమ 5 గంటలు. అదనపు ఉత్పత్తి 5 వస్తువులు. అదనపు విలువ 5 రూ.లు.

→

**4**. యజమానికి, శ్రామికుల ద్వారా అందేది, అదనపు ఉత్పత్తిగా అందుతుందా, అదనపు డబ్బుగా అందుతుందా?

**జ**: బానిసల, కౌలు రైతుల కాలాల్లో అయితే, యజమానులకు, అదనపు ఉత్పత్తులే అందుతాయి. అందులోనే కొంత వర్తకుడికీ, కొంత వడ్డీకీ, అలా అందుతాయి. కానీ, సరుకుల అమ్మకాల పద్ధతి పెరిగిన తర్వాత, యజమానికి అందేది డబ్బుగానే అందుతుంది. 5 అదనపు డబ్బుతో, బజార్లో వేరే వేరు వస్తువుల్ని కొనవచ్చు. అది, ఆ యజమాని శ్రామికుల అదనపు విలువ వల్ల వచ్చిన ఉత్పత్తి. యజమానికి అందిన 5 అదనపు డబ్బులో నించి, వడ్డీగా ఎవరికైనా 1 చెల్లిస్తే, ఆ వడ్డీని పొందిన మనిషి, ఆ 1 తో, బజార్లో ఏదైనా ఉత్పత్తిని కొనుక్కుంటాడు.

**5**. ఒక వడ్డీ పెట్టుబడిదారుడికి, బట్ట పెట్టుబడిదారుడి నించీ 5 రూ.ల వడ్డీ అందింది. వడ్డీల వాడు ఆ డబ్బుతో ధాన్యం కొన్నాడు. ధాన్యాన్నే వాడుకున్నాడు. అయితే, ఆ వడ్డీల వాడికి అందిన 5 విలువ, బట్ట శ్రామికుల నించి వచ్చిన అదనపు విలువా, ధాన్యం శ్రామికుల నించి వచ్చిన అదనపు విలువా?

**జ**: ఆ వడ్డీని చెల్లించిన వాడు, బట్ట పెట్టుబడిదారుడే. ఆ వడ్డీ, బట్టని తయారుచేసిన శ్రామికుల అదనపు విలువలోదే. బట్ట పని స్థలంలో తయారైన అదనపు విలువని పంచుకున్న వాళ్ళు, ఆ విలువతో, బట్టనీ కొనవచ్చు ; ఇతర ఉత్పత్తుల్నీ కొనవచ్చు. వడ్డీ డబ్బుతో దేన్ని కొన్నారు - అనే దాన్ని బట్టి కాదు ; ఆ వడ్డీ, ఎక్కడి నించి వచ్చింది - అనే దాన్ని బట్టి, అది ఎవరి అదనపు విలువో తెలుస్తుంది.

**6**. ఒక పని స్థలంలో, 5 గురు శ్రామికులు కొంత కాలంలో 50 మీటర్ల బట్టని తయారుచేశారు. ఆ బట్టలో నించి ఉత్పత్తి సాధనాల భాగానికి ఎంత వస్తుందో లెక్కలు చూస్తే, 10 మీటర్ల బట్ట వస్తుందని తేలుతుంది. అయితే, ఆ 10 మీటర్ల బట్టే, కొత్త ఉత్పత్తి సాధనాలుగా ఉపయోగపడుతుందా?

**జ**: అలా కాదు. ఆ 10 మీటర్ల బట్టని అమ్మితే ఎంత విలువ ( ఎంత డబ్బు ) వస్తుందో, ఆ విలువతో, కొత్త ఉత్పత్తి సాధనాలు వస్తాయి. బట్టని తయారుచేసే పని స్థలంలో దారమూ, మగ్గమూ వంటివి కావాలి గానీ, బట్టే ఉత్పత్తి సాధనంగా పనికి రాదు. బట్టని, ముడి పదార్థంగా ఏ పరిశ్రమల్లో వాడతారో వాళ్ళు ఆ బట్టని కొని డబ్బు ఇస్తారు. ఆ డబ్బు రావడం అంటే, మొదట ఖర్చయిన ఉత్పత్తి సాధనాల విలువ వెనక్కి వచ్చేసిందని అర్థం. ఆ విలువతోనే కొత్త ఉత్పత్తి సాధనాలు వస్తాయి.

**7**. ఒక పని స్థలంలో, ఇద్దరు మేధా శ్రామికులూ, 10 మంది శారీరక శ్రమల శ్రామికులూ వున్నారు. పని దినం అందరికీ ఒకటే. జీతాలు కొన్ని తేడాలతో ఉన్నాయి. అందరి శ్రమలతోనూ కలిసి ఒక యంత్రం లాంటి ఉత్పత్తి తయారైంది. అది, 1 రోజులోనా, వారం రోజుల్లోనా అనేది అనవసరం. ఆ ఉత్పత్తి విలువలో, మొత్తం 12 మంది శ్రామికుల శ్రమ ఉంటుంది. అందులోనే అదనపు శ్రమ ఉంటుంది. అయితే,

→

ఆ ఉత్పత్తిలో ఏ శ్రామికుడి అదనపు శ్రమ ఎంత ఉంటుందో ఎలా తెలుస్తుంది?

**జ :** ఆ ఉత్పత్తిని అమ్మితే కొంత డబ్బు వస్తుంది. ఆ డబ్బులో నించి మొదట ఉత్పత్తి సాధనాల భాగాన్ని తీసెయ్యాలి. ఇక మిగిలినదంతా 12 మంది శ్రామికుల శ్రమ. అందులో నించి జీతాల భాగాన్ని తీసెయ్యాలి. మిగిలింది, 12 మంది అదనపు విలువ. ఇప్పుడు జీతాల్నీ, అదనపు విలువనీ పోల్చాలి. జీతాల మొత్తం 50 అయితే, అదనపు విలువ మొత్తం కూడా 50 అనుకుందాం. అంటే, పని దినంలో, సగం కాలం అవసర శ్రమా, రెండో సగం కాలం అదనపు శ్రమా అన్నమాట. లేదా, ఇంకో ఉదాహరణలో, జీతాల మొత్తం 50 అయితే, అదనపు విలువ మొత్తం 100 అనుకుందాం. ఇది, పని దినంలో, అవసర శ్రమ 1 భాగం అయితే, అదనపు శ్రమ 2 భాగాలు. ఈ రకంగా, మొదట, పని దినంలో అవసర శ్రమకీ, అదనపు శ్రమకీ వున్న పాళ్ళని తెలుసుకోవాలి. ఈ పాళ్ళు, జీతం 1 అయితే, అదనపు విలువ 2 అనుకుందాం. ఈ పాళ్ళు ప్రతీ శ్రామికుడికీ వర్తిస్తాయి. ఒక శ్రామికుడి జీతం 4 అయితే, అతని అదనపు విలువ 8 అవుతుంది. జీతం 6 అయితే, అదనపు విలువ 12 అవుతుంది. ఈ రకంగా, ఏ శ్రామికుడి అదనపు విలువ ఎంత వుందో తెలుసుకోవచ్చు. పెట్టుబడిదారుడి దగ్గిర వున్న లెక్కల తోనే, ఇదంతా చాలా తేలిగ్గా చెయ్యవచ్చు.

**8 .** శ్రామికుడి జీతాన్ని శ్రామికుడే నిర్ణయించుకుంటాడా, యజమాని నిర్ణయిస్తాడా?

**జ :** యజమానే నిర్ణయిస్తాడు. ఒక వేళ, శ్రామికుడే నిర్ణయించుకుని, " నాకు ఇంత జీతం కావాలి" అని అడిగినా, అది ' శ్రమ విలువ' అవదు. అదే రకం శ్రమ చేసే ఇతర శ్రామికులకు, ఇతర యజమానులు ఎంత జీతం ఇస్తున్నారో తెలిసి, ఈ శ్రామికుడు కూడా అలా అడుగుతాడు. జీతం ఎంత ఎక్కువ ఇచ్చినా, దాని పైన మళ్ళీ ' లాభం వేసుకోవడం' ఉంటుంది. అలా వేసుకున్న దానితో కలిసే ' శ్రమ విలువ' అవుతుంది. అంటే, జీతం అనేది, శ్రమ విలువ కాదు.

**9 .** శ్రామికుడు, యజమానికి, తన ' శ్రమ' ని అమ్ముతాడా ; ' శ్రమ శక్తి' ని అమ్ముతాడా?

**జ :** తను ఏది అమ్ముతాడో శ్రామికుడికి తెలీదు. పని ఇమ్మని అడుగుతాడు. చెయ్యమన్న పని చేస్తాడు. జీతం తీసుకుంటాడు, అంతే. యజమానికి వచ్చే లాభం, తన శ్రమలో నించే వస్తుందని శ్రామికుడికి తెలీదు.

**10 .** శ్రామికులకు అదనపు విలువ సంగతి కూడా తెలీదు. అయినా, దాన్ని ఆ పేరుతో చెప్పుకుంటున్నాం. అలాగే, శ్రామికులకు, తాము దేన్ని అమ్ముతున్నారో తెలియక పోయినా, వారు అమ్మే దాన్ని ఏ పేరుతో చెప్పుకోవాలి?

**జ :** దాన్ని ' శ్రమ శక్తి' అనే అనాలి.

**11 .** శ్రామికుడు అమ్మేది ' శ్రమ శక్తి'. పెట్టుబడిదారుడు కొనేది అదే. దాని కోసం ఇచ్చేది, దాని విలువే. ఇక, పెట్టుబడిదారుడు చేసే తప్పు ఏమిటి?

**జ :** ' శ్రమ శక్తి కి ఇంత విలువే వుంటుంది' అని నిర్ణయించింది ఎవరు? - యజమానే.

⟶

భూమిని దున్నే మనుషులు, గంజి తాగుతూ, గుడిసెల్లో నివసిస్తూ వుండడం అందరూ చూస్తున్నారు. వారి శ్రమ శక్తికి విలువగా, గంజినీ - గుడిసెనీ, నిర్ణయించింది ఎవరు? యజమానులందరూ విశాలమైన భవనాల్లో, పంచ భక్ష్య పరమాన్నాలు తింటూ జీవించడం కూడా అందరూ చూస్తారు. వారి పోషణకు అంత విలువని నిర్ణయించింది ఎవరు? - ఇవన్నీ, యజమానీ శ్రామిక సంబంధాల్లో ఏర్పడిన నిర్ణయాలు. శ్రమ చేసే మనిషికి అందవలసిన విలువ, ఆ శ్రమ విలువే. అతని శ్రమ విలువ అంతా అతనికి అందాలి. అంతేగానీ, అతనికి అందవలసింది, శ్రమ శక్తి విలువ కాదు. కానీ శ్రామికుడు గుడిసెలోనో, చిన్న ఇరుకు గదిలోనో అర్ధాకలితో, తీరని అవసరాలతో జీవించడానికి సరిపోయేదే అందుతుంది. ఆ నిర్ణయం యజమాని చేసేది. అందులో వున్నదంతా తప్పే.

**12 .** శ్రామికుడి పని దినం 10 గంటలు. అందులో అవసర కాలం 5 గంటలు. అయితే, శ్రామికుడు, పని మొదలుపెట్టిన తర్వాత, 5 గంటల వరకే పని చేసి, తర్వాత పని మానేస్తే? అప్పటికి అతని పోషణ కోసం చేసే శ్రమ అంతా అయిపోతుంది కదా?

**జ :** కానీ, అది యజమానీ శ్రామిక సంబంధం కదా? ఆ శ్రామికుడు, తన పోషణ కోసమే గాక, యజమాని కోసం కూడా శ్రమ చెయ్యాలి కదా? మొత్తం 10 గంటలు పని చెయ్యాలి - అనే ఒప్పందం మొదటే ఉంటుంది కదా? ఆ ఒప్పందానికి శ్రామికుడు ఒప్పుకొనే పనిలోకి వస్తాడు కదా? అసలు, ఈ లెక్కలేవీ శ్రామికులకు తెలీవు. ఒప్పందం ప్రకారం పని చేస్తారు. జీతం తీసుకుంటారు. అంత కన్నా వారికి తెలీదు. ఒక వేళ శ్రామికులు, తమ పోషణ కోసం అవసరమైనంత కాలమే పని చేస్తే, అప్పుడు యజమానులందరూ వాళ్ళ కోసం వాళ్ళే శ్రమలు చేసుకోవాలి. యజమానీ శ్రామిక సంబంధాలే అంతరిస్తాయి. అసలు జరగవలసింది అదే. కానీ అది, యజమానీ శ్రామిక సంబంధాల్లో జరగదు.

**13 .** " 'సరుకులో అదనపు విలువ భాగం ఉంటుంది' అని వాదించడానికి తగిన విధంగానే మీరు మీ లెక్కలు చూపిస్తున్నారు. అంతే గానీ, అది నిజం కాదు" అని ఎవరైనా అంటే?

**జ :** 'ఎవరైనా' అనడం ఎందుకు? ఆ మాట మీరే అనండి! " సరుకులో అదనపు విలువ భాగం ఉండదు" అనే విధంగా మీ లెక్కలు మీరు చూపించండి. కౌలూ - వడ్డీ - లాభం అనేవి సరుకులో నించి ఎలా వస్తాయో, ఆ ఆదాయాల్ని వాడే వాళ్ళు, ఆ సరుకు కోసం ఏ యే శ్రమలు చేస్తారో మీరు వివరించండి! దారం లేకపోయినా, మగ్గం లేకపోయినా, బట్ట తయారవడం ఆగిపోయినట్టుగా, కౌలూ - వడ్డీ - లాభమూ లేకపోతే బట్ట తయారవడం ఎలా ఆగిపోతుందో ఉదాహరణలతో చూపించండి! మీరు అలా చెయ్యగలిగితే, 'సరుకులో అదనపు విలువ ఉండదు' అని చక్కగా రుజువవుతుంది. మీ ప్రయత్నం మీరు చెయ్యండి మరి!

**H**

# 53. 'పెట్టుబడి' బ్రహ్మాండమైన అబద్ధం!

**[ ఈ పాఠం, ఇతర పాఠాల కన్నా చాలా పెద్దది. ఇందులో విషయాలన్నీ ఒక్క పాఠంలోనే వుండాలి. దీన్ని చిన్న చిన్న పాఠాలుగా చెయ్యడం కన్నా ఇలాగే చదవడం బాగుంటుంది. దీని ప్రశ్నలు వేరే పాఠంగా వుంటాయి.]**

'పెట్టుబడిదారీ విధానం' గురించి ఇంకా చాలా విషయాలు ఉన్నాయి. వాటిలో కొన్నిటిని అయినా తర్వాత పాఠాల్లో చూస్తాం. కానీ, అంత కన్నా ముందు ఇక్కడ వెంటనే **3** రహస్యాలు చెప్పేసుకోవాలి.

పెట్టుబడిదారుడు, 'పెట్టుబడి' ని తన డబ్బుతో పెడతాడని అనుకుంటాం కదా? 'ఉత్పత్తి సాధనాల' కోసం తన డబ్బే పెడతాడనీ, కార్మికులకు జీతాల్ని తన డబ్బుతోనే ఇస్తాడనీ, తన కష్టానికి బదులుగానే లాభాన్ని తీసుకుంటాడనీ - ఇలా నమ్ముతూ వుంటాం. కానీ, ఇవన్నీ పచ్చి అబద్ధాలు! వీటిలో ఒక్కటి కూడా నిజం కాదు. ఈ విషయాలు, సరిగా అర్థం చేసుకుంటే, 'ఆర్థిక శాస్త్రం' అంతా అర్థం అవుతుంది.

పెట్టుబడిదారులు తయారుచేయించే ఏ ఉత్పత్తి విలువ అయినా, **3** అంశాలుగా వుంటుంది.

బట్ట విలువ = ఉత్పత్తి సాధనాల 80 + జీతాల 20 + అదనపు విలువ 20 = 120.

ఈ మూడూ, 3 రహస్యాలు!

**మొదటి రహస్యం :**

ఇందులో, 3 వ అంశం అయిన 'అదనపు విలువ', పెట్టుబడి దారుడిది కాదు. ఇది, ఒక రహస్యం. దీన్ని ఇప్పటికే చూశాం. అంతే కాదు, మొదటి 2 అంశాలూ కూడా పెట్టుబడిదారుడివి కావు.

## జీతం సంగతి ఇంకో రహస్యం!

"పెట్టుబడిదారుడు, కార్మికులకు, అదనపు శ్రమ కోసం అయితే, ఏమీ చెల్లించడనేది నిజమే. కానీ, 'జీతం' కోసం అయితే, ప్రతి సారీ తన డబ్బు చెల్లిస్తూ వుంటాడు" అనుకుంటాం. కానీ, ఇది పూర్తిగా తప్పు! జీతంగా ఇచ్చే విలువ పెట్టుబడిదారుడిది కాదు. అది కార్మికుల శ్రమ విలువలో భాగమే. - జీతం ఇవ్వడాన్ని, వరసగా 3 సార్లు చూద్దాం.

(1) పెట్టుబడిదారుడు, జీతాలు ఇవ్వడం కోసం మొదట జేబులో 20 రూ. పెట్టుకున్నాడు. ఆ 20 డబ్బు, పెట్టుబడి దారుడి స్వంత శ్రమతో వచ్చినదా, లేదా ఏ వడ్డీ ద్వారానో, కౌలు ద్వారానో వచ్చినదా - అనేది వేరే సంగతి. దాన్ని బట్టి, తర్వాత జరిగే విషయాల్లో తేడా ఏమీ రాదు.

ఒక రోజు ఆ పని స్థలంలో కార్మికులు 40 శ్రమ చేసి, సరుకుని తయారుచేశారు. పెట్టుబడిదారుడు, జేబులో నించి 20 ని తీసి, కార్మికులకు జీతాలుగా ఇచ్చాడు. కార్మికులు ఆ రోజుకి వెళ్ళిపోయారు. పెట్టుబడిదారుడు సరుకుని అమ్మేశాడు.

( ఆ రాత్రే అమ్మాడా, మర్నాడు అమ్మాడా - అనేది అనవసరం. ఎప్పుడో అప్పుడు అమ్ముతాడు. ) సరుకు విలువ అంతా, పెట్టుబడిదారుడి చేతికి వచ్చింది. అందులో, కార్మికుల శ్రమ విలువ 40. ఈ 40 ని 2 భాగాలుగా చూడాలి. జీతాల 20 + అదనపు విలువ 20. ఇందులో, అదనపు విలువ 20 సంగతి అనవసరం. అది, జీతాలు ఇవ్వకుండా అందిన విలువ లాగ స్పష్టంగానే తెలుస్తుంది. ఇక్కడ జీతం సంగతి మాత్రమే చూడాలి.

పెట్టుబడిదారుడు, కార్మికుల శ్రమ విలువగా వచ్చిన 40 లో నించి, జీతం 20 ని తీసి, మళ్ళీ జీతాలుగా ఇవ్వడానికి జేబులో పెట్టుకున్నాడు. అంటే, మొదట జీతాలుగా ఇచ్చిన డబ్బు పెట్టుబడిదారుడికి, వెనక్కి వచ్చేసింది. ఇచ్చిన విలువ వెనక్కి రావలసిందే, వచ్చింది. అది ఎక్కడికీ పోలేదు. పెట్టుబడిదారుడి డబ్బు, పెట్టుబడిదారుడికే వచ్చేసినా, కార్మికులకు జీతాలు ఇచ్చేసినట్టు అయిపోయింది. పెట్టుబడిదారుడు, కార్మికులకు జీతాలుగా ఇచ్చిన 20 విలువ ఎక్కడిది? - కార్మికులు చేసిన అవసర శ్రమ భాగమే అది. అంటే, అది, కార్మికుల శ్రమ విలువ అయిన 40 లోదే. వాళ్ళ శ్రమలో భాగమే వాళ్ళ జీతం.

(2) కార్మికులు, మళ్ళీ పని లోకి వచ్చారు. నిన్న చేసిన రకం సరుకు కోసం, మళ్ళీ 40 శ్రమ చేశారు. పెట్టుబడిదారుడు, జేబులో నించి 20 ని తీసి జీతాలుగా ఇచ్చాడు. కార్మికులు వెళ్ళిపోయారు. తర్వాత పెట్టుబడిదారుడు మళ్ళీ ఆ కొత్త సరుకుని అమ్మేశాడు. కార్మికుల 40 శ్రమ, డబ్బుగా, పెట్టుబడిదారుడి చేతిలోకి వచ్చింది. అందులో నించి, 20 ని తీసి, జేబులో మళ్ళీ పెట్టుకున్నాడు, మళ్ళీ జీతాలు ఇవ్వడానికి. అంటే, పెట్టుబడిదారుడు, 2 వ సారి జీతాలుగా ఇచ్చిన డబ్బు, ఎక్కడికీ పోలేదు. వెనక్కి వచ్చేసింది. పెట్టుబడిదారుడి డబ్బు పెట్టుబడిదారుడికే వచ్చేసింది. అయినా, అతని డబ్బుతోనే జీతాలు ఇచ్చినట్టు అయింది. కానీ కార్మికులకు జీతాలు ఎక్కడి నించి అందాయి? - వాళ్ళు 2 వ సారి చేసిన 40 శ్రమలో నించే అందాయి. వాళ్ళ శ్రమలో నించే వాళ్ళ జీతం.

(3) కార్మికులు మళ్ళీ పనిలోకి వచ్చారు. కిందటి, ఆ కిందటి రోజుల్లో చేసిన రకం సరుకునే 40 శ్రమతో మళ్ళీ చేశారు. పెట్టుబడిదారుడు తన జేబులో నించి 20 ని తీసి, 3 వ సారి జీతాలుగా ఇచ్చాడు. కార్మికులు వెళ్ళిపోయారు. తర్వాత పెట్టుబడిదారుడు, కొత్త సరుకుని అమ్మేశాడు. కార్మికుల 40 శ్రమ, డబ్బుగా పెట్టుబడిదారుడి చేతిలోకి వచ్చింది. అందులో నించి 20 ని తీసి మళ్ళీ జీతాల కోసం జేబులో పెట్టుకున్నాడు. అంటే, 3 వ సారి జీతాలుగా ఇచ్చిన 20 డబ్బు ఎక్కడికీ పోలేదు. మళ్ళీ పెట్టుబడిదారుడి చేతికే వచ్చేసింది. ఇచ్చిన విలువ వెనక్కి రావలసిందే, వచ్చింది. జీతాల డబ్బు మళ్ళీ పెట్టుబడిదారుడికే వచ్చేసినా, పెట్టుబడిదారుడి డబ్బుతోనే కార్మికులకు జీతాలు ఇచ్చినట్టు అయింది.

**'జీతం' సంగతిని కార్మికుల వేపు నించి చూస్తే :** ఒక్క సారి చేసిన శ్రమ వల్లనే ప్రతీ సారీ జీతం రాదు. మళ్ళీ శ్రమ చేస్తేనే మళ్ళీ

జీతం. రెండో సారి చేస్తే, రెండో జీతం. మూడో సారి చేస్తే, మూడో జీతం. ప్రతీ సారీ, చేసిన శ్రమలో నించే కొంత భాగం జీతం.

**'జీతం' సంగతిని పెట్టుబడిదారుడి వేపు నించి చూస్తే :** జీతం కోసం 20 డబ్బుని (కొంత డబ్బుని) ఒక్క సారి జేబులో పెట్టుకుంటే చాలు. ప్రతీ సారీ కొత్త డబ్బు అక్కరలేదు. జీతంగా మొదటి సారి ఇచ్చిన డబ్బునే మళ్ళీ మళ్ళీ మళ్ళీ జీతంగా ఇస్తూ వుండవచ్చు. ఇది ఎలా సాధ్యమంటే : ఏ వ్యక్తి అయినా, కొంత విలువని ఇతరులకు ఇస్తే, దానికి బదులుగా అంత విలువని వెనక్కి తీసుకోవచ్చు. జీతం వరకే చూస్తే, పెట్టుబడిదారుడు కార్మికులకు 20 జీతం ఇచ్చి, దానికి బదులుగా ఆ 20 ని వెనక్కి తీసుకుంటాడు. కానీ, వెనక్కి వచ్చిన డబ్బుని, పెట్టుబడిదారుడు తన ఇంటి అవసరాల కోసం వాడుకోడు. కార్మికులైతే తమకు వచ్చిన జీతం డబ్బుని పోషణ అవసరాల కోసం వాడేస్తారు. కానీ పెట్టుబడిదారుడు, జీతం డబ్బు వెనక్కి వచ్చినప్పుడు, దానితో మళ్ళీ ఇంకో సారి జీతాలు ఇవ్వడం కోసం ఆ డబ్బుని అలాగే వుంచుతాడు. అయితే, ఆ డబ్బుని వాడుకోకపోతే, పెట్టుబడిదారుడి ఇంటి అవసరాలు ఎలా తీరుతాయి? - జీతంగా వెళ్ళిన డబ్బు, తను తిరిగి వచ్చేటప్పుడు, తనతో పాటు అదనపు విలువని తెస్తుంది కదా? దాన్ని వాడుకుంటాడు. పెట్టుబడిదారుడు, జీతం డబ్బుని ఉత్పత్తి రంగంలోకి పంపేది, అదనపు విలువని తెమ్మనే. అది అలాగే తెస్తుంది. పెట్టుబడిదారుడు, అదనపు విలువని వాడుకుంటూ, జీతం డబ్బుని మళ్ళీ జీతంగానే ఉపయోగిస్తాడు. అది, రంగంలోకి వెళ్ళిన ప్రతీ సారీ, అదనపు విలువని వెంటబెట్టుకుని వస్తూ వుంటుంది. పెట్టుబడిదారుడు, జీతాల డబ్బునే పోషణ కోసం వాడేస్తే, అదనపు విలువని ఎలా సంపాదిస్తాడు?

ఇక్కడ, స్వతంత్ర ఉత్పత్తిదారుల మారకాల్ని ఒక సారి గుర్తు చేసుకోవాలి. వాళ్ళ మధ్య మారకాలు జరుగుతూ వుంటే, ప్రతీ సారీ రెండు వేపులా ఆ విలువలు (ఆ వస్తువులు) ఖర్చయిపోతూ వుంటాయి. కుండల రామయ్య, కుండని ఇచ్చి (లేదా, డబ్బుని ఇచ్చి) చెప్పులు తీసుకుంటే, అతని విలువ అతనికి తిరిగి వచ్చేసినట్టే. అది సమాన విలువల మారకంగానే వుంటుంది. అలా, మారకంలో వచ్చిన వస్తువుని (లేదా, డబ్బుని) అతను వాడేసుకుంటాడు. చెప్పుల సోమయ్య కూడా, తన చెప్పులకు బదులుగా వచ్చిన కుండని (లేదా డబ్బుని), వాడేసుకుంటాడు. ఒక మారకం ద్వారా డబ్బు వస్తే, ఆ డబ్బుతో ఏదో ఒక వస్తువుని కొని దాన్ని వాడేసుకుంటారు. ఇద్దరి విషయంలోనూ ప్రతీ సారీ వాళ్ళ శ్రమలు ఖర్చయిపోతూ వుంటాయి. ఇచ్చిన విలువ కన్నా ఎక్కువ విలువ ఎవరికీ రాదు. మారకం ద్వారా వచ్చిన వస్తువునో, డబ్బునో వాడుకోకపోతే, దాన్ని అలాగే వుంచితే, వాళ్ళు జీవించడమే సాధ్యం కాదు.

కుండల రామయ్య, ఒక మారకం అయిన తర్వాత, ఇంకో వస్తువు ఏదైనా కావాలంటే, ఇంకో సారి శ్రమ చేసి, ఇంకో వస్తువునో డబ్బునో ఇచ్చి, కావలసిన వస్తువుని తెచ్చుకుని దాన్ని వాడుకోవాలి. ఇరు

పక్షాల మనుషులూ స్వంత శ్రమలతో ఉత్పత్తులు తయారు చెయ్యడమూ, వాటిని మారకాలు చేసుకోవడమూ, అలా వచ్చిన విలువల్ని వాడేసుకోవడమూ జరుగుతూ వుంటేనే, ఇరు పక్షాల వాళ్ళూ బతుకుతూ వుంటారు.

కానీ, పెట్టుబడిదారుడి విషయంలో ఏం జరుగుతుంది? జీతాల వరకే చూస్తే, అది మారకం లాగే కనపడుతుంది. పెట్టుబడిదారుడు ఇచ్చిన జీతాల 20 కీ, కార్మికులు ఇచ్చిన అవసర శ్రమ 20 కీ, మారకం జరిగినట్టు!

కానీ కార్మికులు ఇచ్చే మొత్తం శ్రమలో నించి 'అవసర శ్రమ' ని మాత్రమే విడదీసి, దానితో మారకం జరిగినట్టు చూడడం అర్థం లేని పని. పెట్టుబడిదారుడు ఇచ్చే జీతాలకీ, కార్మికుల నించి తీసుకునే మొత్తం శ్రమకీ జరిగేది మారకం అవదు. పెట్టుబడిదారుడు జీతాల కోసం 20 ఇచ్చి, కార్మికుల నించి 40 ని తీసుకుంటే, ప్రతీ రోజూ అదే జరుగుతూ వుంటే, అది మారకం అవదు.

జీతం అనేది, అదనపు విలువని లాక్కొచ్చే సాధనం. జీతాలు ఇవ్వడమూ, ఆ డబ్బుని వెనక్కి తీసుకోవడమూ - అనేవి, అదనపు విలువని సంపాదించడం కోసం జరిగే సాంకేతిక చర్యలు. తేలిగ్గా చెప్పుకోవాలంటే, అదంతా ఒక నాటకం.

'జీతాల' కథని ఎన్ని వందల సార్లు చూసినా, అదే మళ్ళీ మళ్ళీ మళ్ళీ జరుగుతుంది. ఒక్క 20 డబ్బుతో, పెట్టుబడిదారుడు, ఎన్ని వందల సార్లయినా జీతాలు ఇవ్వగలడు. ప్రతీ సారీ కొత్త డబ్బు అక్కర లేదు. అది మళ్ళీ మళ్ళీ అతని జేబులోకే వస్తూ వుంటుంది.

ఆ పెట్టుబడిదారుడు, సరుకునంతా అమ్మేసి, ఆ పరిశ్రమనే ఆపేస్తే, అంత కాలమూ జీతాలుగా ఇచ్చిన 20 డబ్బు, అతని చేతిలోనే వుండిపోతుంది. కొత్త సరుకు లేదు కాబట్టి, కొత్త జీతాలుగా ఆ 20 ని ఇచ్చే అవసరం వుండదు. అంటే, ఆ 20 డబ్బు, అసలు ఖర్చు కానే లేదన్న మాట! మరి అన్నాళ్ళూ జీతాలుగా ఇచ్చింది ఏమిటి? - ప్రతీ సారీ కార్మికులు చేసిన 40 శ్రమలో నించి 20 భాగమే జీతాలు.

పెట్టుబడిదారుడికీ, కార్మికులకూ మధ్య జరిగేది మారకం కాదనే సంగతి సరిగా అర్థం చేసుకోవాలి.

**ఇంకో ఉదాహరణ :**

ఒక స్వతంత్ర ఉత్పత్తిదారుడు, తన స్వంత శ్రమతో కొంత డబ్బుని కూడబెట్టి, ఆ స్వంత డబ్బుతోనే ఒక పరిశ్రమ మొదలు పెట్టాడనుకుందాం. కార్మికులకు జీతాల కోసం తన స్వంత శ్రమతో వచ్చిన డబ్బులో నించే 20 ని జీతాలుగా ఇచ్చాడనుకుందాం. కార్మికులు పని చేస్తారు. సరుకు తయారవుతుంది. దాన్ని అమ్మితే, పెట్టుబడి పెట్టిన డబ్బు వెనక్కి వచ్చేస్తుంది. అందులో జీతాల 20 వెనక్కి వచ్చేస్తుంది. జీతాలుగా ఇచ్చిన విలువకు బదులుగా, ఆ విలువ వెనక్కి వచ్చెయ్యడం సరైనదే. పెట్టుబడిదారుడిగా మారిన స్వతంత్ర ఉత్పత్తిదారుడు, ఆ జీతాల విలువని తన అవసరాల కోసం వాడడు. దాన్ని అలాగే వుంచి, అదనపు విలువనే వాడతాడు. జీతాల డబ్బుని మళ్ళీ మళ్ళీ జీతాల కోసమే పెడతాడు.

అంటే, జీతాలుగా ఇచ్చే డబ్బు, పెట్టు

బడిదారుడికి స్వంత శ్రమతో వచ్చింది అయినా, దోపిడీ ద్వారా వచ్చింది అయినా, రెండూ ఒకటే. ఆ డబ్బు, ఏ రకంగా పుట్టినది అయినా, అది జీతాల రూపం ఎత్తిందంటే, అది ప్రతీ సారీ అదనపు విలువని వెంటబెట్టుకుని వెనక్కి వస్తూ వుంటుంది. పరిశ్రమ ఆగిపోతే, చివరికి అది పెట్టుబడిదారుడి చేతిలోనే వుండిపోతుంది.

జీతాల ఉదాహరణని ఇంకో రకంగా చూస్తే, అసలు రహస్యం మరింత తేలిగ్గా బోధపడుతుంది. కార్మికులు, పని చేసిన తర్వాత, పెట్టుబడిదారుడు ఏ రోజు కారోజే జీతాలు ఇవ్వడు. వారానికో సారో, నెలకో సారో ఇస్తాడు. జీతాలు ఇచ్చేటప్పటికే ఆ సరుకుని అమ్మేస్తాడు. సరుకుని అమ్మి, ఆ డబ్బులో నించే జీతాలు ఇస్తాడు. అసలు జరిగేది అదే. కార్మికులు, ఒక రోజు 40 శ్రమ చేశారు. పెట్టుబడిదారుడు వెంటనే జీతాలు ఇవ్వలేదు. కార్మికులు వెళ్ళిపోయారు. పెట్టుబడిదారుడు సరుకుని అమ్మేశాడు. కార్మికుల 40 శ్రమ, పెట్టుబడిదారుడికి డబ్బుగా అందింది. అందులో నించే 20 ని తీసి వుంచి, తర్వాత కార్మికులు వచ్చినప్పుడు, "ఇదిగో, కిందటి వారం జీతాలు" అని ఆ డబ్బు ఇచ్చాడు. సరుకుని అమ్మి, ఆ డబ్బులో నించే జీతాల్ని ఇవ్వడం వల్ల, 'జీతం' అనేది, కార్మికుల శ్రమలోదే - అనే సంగతి ఇక్కడ స్పష్టంగా తెలుస్తుంది.

జీతాల్ని, సరుకుని అమ్మకముందే ఇచ్చినా, అమ్మేశాక ఇచ్చినా, రెండూ ఒకటే. జీతాలుగా ఇచ్చేది, పెట్టుబడిదారుడి డబ్బు కాదు. అది పెట్టుబడిదారుడి శ్రమ కాదు.

జీతాలుగా ఇచ్చేది 20 కాకపోతే, 200 కావచ్చు ; 2,000 కావచ్చు. అది 'ఎంత' అనేది ప్రశ్న కాదు. ఎంత అయినా, అది పెట్టుబడిదారుడి శ్రమలో నించి తీసి ఇచ్చే డబ్బు కాదు.

పెట్టుబడిదారుడు, కార్మికులకు, ప్రతి సారీ తన డబ్బుతో జీతాలు ఇస్తాడనుకోవడం, చెప్పలేనంత అజ్ఞానం! జీతంగా పెట్టుబడిదారుడు ఇచ్చేది ఏమీ ఉండదు - అనే నిజం, 'అదనపు విలువ' రహస్యాన్ని మించిన రహస్యం!

## ఇక, 'ఉత్పత్తి సాధనాల' రహస్యం!

బట్ట ఉదాహరణలో, 'ఉత్పత్తి సాధనాల' విలువ 80. పెట్టుబడిదారుడు, ఉత్పత్తి సాధనాల్ని తన డబ్బుతోనే కొన్నట్టు, పైకి కనపడుతుంది. కానీ ఉత్పత్తి సాధనాల మీద పెట్టిన ఆ 80 డబ్బు, పెట్టుబడిదారుడికి ఎలా వచ్చింది? - దీనికి సంబంధించి మొదట ఒక విషయం చూడాలి.

పెట్టుబడిదారుడికి ప్రతి రోజూ కొంత 'పారిశ్రామిక లాభం' వస్తూ వుంటుంది. బట్ట ఉదాహరణలో, ఆ లాభం 12. అందులో నించి పెట్టుబడిదారుడు, తన కుటుంబ ఖర్చుల కోసం కొంత వాడి, మిగిలినదాన్ని పెట్టుబడికి చేరుస్తాడు. ఒక సంవత్సరం పాటు వచ్చే 'లాభం' లో నించి కొంత భాగాన్ని పెట్టుబడికి చేరిస్తే, పెట్టుబడి పెరుగుతుంది. అది కొంత కాలానికి 500 అవుతుంది. తర్వాత 800 అవుతుంది. ఈ విధంగా, అదనపు విలువలో

నించి కొంత భాగం ఎప్పుడూ పాత పెట్టుబడికి చేరుతూనే వుంటుంది. అంటే, పెట్టుబడిదారుడు, మొదట ఉత్పత్తి సాధనాల కోసం పెట్టిన 80 కూడా అలా వెనకటి కాలపు శ్రామికుల అదనపు శ్రమలో నించి చేరి పెరుగుతూ వచ్చినదే అన్నమాట!

పెట్టుబడిదారుడి కుటుంబానికి, వెనకటి కాలంలోనే 'భూమి కౌలు' ద్వారా గానీ, 'వర్తక లాభం' ద్వారా గానీ, 'వడ్డీ వ్యాపారం' ద్వారా గానీ, కొంత డబ్బు పోగుపడి వుంటుంది. వాటిలో ఏ మార్గం ద్వారా వచ్చిన డబ్బు అయినా, వెనకటి శ్రామికులదే గానీ, పెట్టుబడిదారుడి కుటుంబానిది కాదు.

ఏ మనిషి అయినా శ్రమ చేస్తూ వుంటే, ఆ శ్రమకు బదులుగా వచ్చే విలువ, స్వంత పోషణ కోసమే ఖర్చయిపోతూ వుంటుంది. ఆ వ్యక్తి స్వతంత్ర ఉత్పత్తిదారుడే అయినా, అతను వేతన శ్రామికుడి కన్నా కొంచెం సౌకర్యంగా బతకగలడే గానీ, పెట్టుబడులు పెట్టగలిగేటంత ఎక్కువగా డబ్బుని కూడబెట్టలేడు. స్వంత శ్రమలతో పెట్టుబడులు పెట్టడం అసాధ్యం. శ్రమ దోపిడీ ద్వారా కూడబెట్టిన డబ్బుతోనే ఆస్తులూ, పెట్టుబడులూ కూడతాయి.

ఒక వేళ, ఒక పెట్టుబడిదారుడు, ఉత్పత్తి సాధనాల కోసం కావలసిన ఆ 80 డబ్బుని, అప్పుగా తెచ్చాడనుకుందాం. అప్పు ఇచ్చిన వాడికి, ఆ డబ్బు ఎలా వచ్చింది? - ఏదో ఒక శ్రమ దోపిడీ మార్గం ద్వారా వచ్చేదే. అది, అలా ఏదో ఒక దోపిడీ మార్గం ద్వారా చేరుతూ పెరిగేదే.

'అదనపు శ్రమ' శ్రామికులదే అయినప్పుడు, అందులో నించే ఏర్పడే 'ఉత్పత్తి సాధనాల రాసి' అంతా శ్రామికులదే! ఇది కూడా ఒక పెద్ద రహస్యం!

'పెట్టుబడి' గురించి చివరికి తేలేది ఏమిటి? - 'సరుకు విలువ' లో వుండే ఏ అంశమూ పెట్టుబడిదారుడి శ్రమ కాదు.

ఒక్క రోజులో తయారైన బట్టనే తీసుకుంటే, ఆ 'బట్ట విలువ' లో వున్న అదనపు విలువ 20, పెట్టుబడిదారుడిది కాదు.

జీతం 20 - పెట్టుబడిదారుడిది కాదు.

ఉత్పత్తి సాధనాల 80, పెట్టుబడిదారుడిది కాదు.

మొత్తంగా ఆ ఉత్పత్తే పెట్టుబడిదారుడిది కాదు. ఏ ఉత్పత్తి సంగతైనా అంతే!

పెట్టుబడిదారుల ఆస్తులుగా వుండే ఉత్పత్తి సాధనాలన్నీ, గత కాలపు శ్రామికుల అదనపు శ్రమల వల్లా, ప్రస్తుత కాలపు శ్రామికుల అదనపు శ్రమల వల్లా, ఏర్పడినవే. తర్వాత కాలంలో పెరిగే ఉత్పత్తి సాధనాలు కూడా, 'అదనపు శ్రమ' ద్వారా పెరిగేవే.

అంటే, పెట్టుబడిదారుల ఆస్తులు, వాళ్ళ తండ్రులవీ, తాతలవీ కావు. అవి, శ్రామికుల తల్లితండ్రులవీ, తాతలవీ, ముత్తాతలవీనూ!

పెట్టుబడిదారుడు తయారుచేయించే 'సరుకు విలువ' లో వున్న 3 అంశాలూ, 3 రహస్యాలు! 'పెట్టుబడి పెట్టుబడిదారుడిది' అనేది, బ్రహ్మాండమైన అబద్ధం!

[ ఈ పాఠంలో ప్రశ్నలు,
తర్వాత పాఠంలో ఉంటాయి. ]

H

# 54. లాభం వచ్చేది, పెట్టుబడికా, పెట్టుబడిదారుడికా?

పెట్టుబడిదారీ మేధావులు, "పెట్టుబడి పెడితే లాభం రావాలి" అంటారు. అంటే, 'లాభం వచ్చేది పెట్టుబడికే' అన్నట్టు! కానీ, లాభం వచ్చేది పెట్టుబడికి కాదు, పెట్టుబడిదారుడికి!

'పెట్టుబడి' అంటే ఏమిటి? ఉత్పత్తి సాధనాలూ, శ్రామికుల జీవితావసర వస్తువులూ. ఈ రెండూ కలిసినదే - పెట్టుబడి.

ఒక వస్తువు తయారైనప్పుడు, దాని కోసం, (1) కొన్ని ఉత్పత్తి సాధనాలూ, (2) కొంత కొత్త శ్రమా - ఖర్చవుతాయి.

ఆ వస్తువుని వాడుకునే వాళ్ళు, ఆ శ్రమ అంతా మళ్ళీ చేసుకోవాలి. లేకపోతే, ఆ వస్తువు మళ్ళీ వుండదు.

ఆ వస్తువుని కొనే వాళ్ళు, దాని విలువ నంతా ( ఆ శ్రమ నంతా ) చెల్లించి తీరాలి. ఆ విలువతో, ఆ వస్తువు మళ్ళీ తయారవుతుంది.

ఆ వస్తువు, పెట్టుడిదారుడు తయారు చేయించి అమ్మేది అయితే, దాని విలువ అంతా పెట్టుబడిదారుడికి అందుతుంది. ఆ విలువలోదే కొంత భాగం - లాభం.

ఆ లాభం, దేని కోసం? ఆ లాభం రాకపోతే, ఆ వస్తువు మళ్ళీ తయారవదా?

ఒక టన్ను బరువు గల దుస్తుల తయారీ కోసం, 10 విలువ గల కత్తెర, పూర్తిగా వాడకం అయ్యి, పాడైపోయింది. ( కత్తెరే గాదు, ఇతర పనిముట్లు కూడా కొన్ని ఖర్చయిపోతాయి. అయినా కత్తెర సంగతి చూస్తే చాలు. మిగిలినవీ అంతే. )

ఒక కత్తెర విలువ 10. ఒక సరుకు తయారీలో అది పూర్తిగా పాడైంది. ఆ కత్తెర ద్వారా, ఆ సరుకులోకి 10 విలువే చేరుతుంది గానీ, అంత కన్నా ఎక్కువ విలువ చేరదు. ఆ సరుకుని అమ్మినప్పుడు, ఆ కత్తెర విషయం వరకే చూస్తే, దాని 10 విలువే వెనక్కి వస్తుంది. కత్తెర ద్వారా 10 కన్నా ఎక్కువ విలువ చేరలేదు కాబట్టి, దాని కోసం ఎక్కువ విలువ వెనక్కి రాదు.

ఆ 10 విలువ గల కత్తెర ద్వారా తయారైన సరుకు వల్ల, 10 కన్నా ఎక్కువ విలువ వచ్చిందంటే, ఆ ఎక్కువతో ఆ కత్తెరకు సంబంధం వుండదు. కొత్త కత్తెర రావడానికి, ఆ ఎక్కువ విలువతో అవసరం వుండదు. దాని పాత విలువతోనే అది మళ్ళీ తయారవుతుంది.

అంటే, కొత్త కత్తెర రావాలంటే, పాత కత్తెర విలువ వెనక్కి వస్తే చాలు. కొత్త కత్తెర తయారీలోకి, పాత విలువ కన్నా ఎక్కువ విలువ చేరదు.

సరుకు ద్వారా వచ్చే ఎక్కువని లాభం అనుకుంటే, ఆ లాభంతో కత్తెరకు అవసరం వుండదు. దానికి లాభం అక్కరలేదు. లాభాన్ని అది తనలో ఇముడ్చుకోదు. అది, లాభాన్ని తన కోసం వాడుకోదు.

ఏ ఉత్పత్తి సాధనం సంగతైనా అంతే. ఉత్పత్తి సాధనం ద్వారా సరుకులోకి దాని విలువ కన్నా ఎక్కువ విలువ చేరక

పోయినా, అది తిరిగి తయారవడానికి సమస్యేమీ వుండదు. దాని విలువతోనే అది తయారవుతుంది. అంటే, సరుకు ద్వారా వచ్చే లాభం, ఉత్పత్తి సాధనాల కోసం కాదన్నమాట! లాభంతో వాటికి అవసరం ఉండదన్నమాట!

ఒక 100 పెట్టుబడిలో, ఉత్పత్తి సాధ నాల భాగం 80, శ్రామికుల పోషణ ( జీతాల ) భాగం 20 - అనుకుందాం. ఆ 100 పెట్టుబడితో తయారైన సరుకు వల్ల, ఆ పెట్టుబడి వెనక్కి వచ్చి, ఇంకో 20 విలువ ఎక్కువగా వస్తే, అది, ఆ ఉత్పత్తి సాధనాల ద్వారా గానీ, శ్రామికుల పోషణ వస్తువుల ద్వారా గానీ, వచ్చింది కాదు. ఆ ఉత్పత్తి సాధనాలు మళ్ళీ, రావడానికి ( మళ్ళీ తయారవడానికి ), 80 విలువ చాలు. శ్రామికుల పోషణ వస్తువులు మళ్ళీ రావడానికి 20 విలువ చాలు. ఆ పెట్టుబడి ద్వారా అదనంగా వచ్చిన 20, ఆ పెట్టుబడిలో ఏ అంశానికీ, అక్కర లేదు. 100 పెట్టుబడితోనే, మళ్ళీ 100 పెట్టుబడి తయారవుతుంది. దాని కోసం అంత కన్నా ఎక్కువ విలువ అక్కర లేదు.

అంటే, పెట్టుబడి ద్వారా లాభం వచ్చేది, పెట్టుబడి కోసం కాదు. " పెట్టుబడికి లాభం రావాలి" అంటారు. లాభం రావలసింది, పెట్టుబడి కోసం కాదు. పెట్టుబడికి లాభంతో అవసరం లేదు.

అయితే, లాభం ఎవరి కోసం - పెట్టుబడిదారుడి కోసం! అతనికి లాభం ఎందుకు? - తను పని చెయ్యకుండా, తన స్వంత శ్రమ లేకుండా, బతకడం కోసం!

'కౌలు' సంగతి కూడా అలాంటిదే. కౌలు, భూమి కోసం కాదు. కౌలుని, 'ఉత్పత్తి'గా చూసినా, 'డబ్బు'గా చూసినా, దాన్ని భూమి వాడుకోదు. అది భూస్వామి కోసం. స్వంత శ్రమ లేకుండా బతకడం కోసం.

వడ్డీ సంగతి కూడా అలాంటిదే. అది, అప్పు కోసం కాదు. అప్పుగా వెళ్ళేది, కొంత ఉత్పత్తి అయినా, కొంత డబ్బు అయినా, వడ్డీ లేకుండానే అప్పు వుండవచ్చు. తీసుకున్న ఉత్పత్తినో, డబ్బునో, తిరిగి ఇచ్చినప్పుడు, ఇచ్చినంత విలువ, వెనక్కి వచ్చేస్తుంది. ఆ విలువ వెనక్కి రావడానికి వడ్డీతో అవసరం లేదు.

వడ్డీతో అవసరం అప్పుకి కాదు; అప్పు ఇచ్చిన పెట్టుబడిదారుడికి. తన స్వంత శ్రమ లేకుండా, ఆ వడ్డీతో బతకడానికి.

" పెట్టుబడికి లాభం రావాలి. భూమికి కౌలు రావాలి. అప్పుకి వడ్డీ రావాలి" అనే సూత్రాల్లో వున్న తప్పు లేమిటో సరిగా అర్థం చేసుకోకపోతే, సమాజంలో మనుషుల మధ్య వున్న శ్రమ సంబంధాలు అర్థం కావు. అంతా సరిగా వున్నట్టే కనపడుతుంది.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ఒక కత్తెర విలువ 10, కొంత సరుకు తయారీలో అది పూర్తిగా పాతబడిపోయింది. ఆ కత్తెరని మళ్ళీ కొనేటప్పటికి, దాని ధర 12 అయింది. పాత కత్తెర ద్వారా 10 మాత్రమే వెనక్కి వస్తే, ఆ విలువతో కొత్త కత్తెర ఎలా వస్తుంది?

**జ** : పాత కత్తెర ధర 10. అది ఖర్చయిపోయింది. సరుకు అమ్మకం ద్వారా, →

ఆ 10 మాత్రమే వెనక్కి వస్తుంది. ఆ తర్వాత, కొత్త కత్తెర ధర 12 అయితే దాన్ని కొనడానికి, పాత 10 విలువ మీద ఇంకో 2 ని కూడా కలిపి, 12 తో కొత్త కత్తెరని కొనాలి. ఆ కొత్త కత్తెర ద్వారా సరుకులోకి 12 చేరుతుంది; అదే వెనక్కి వస్తుంది. ఆ వెనక్కి వచ్చిన 12 తోనే, మళ్ళీ కొత్త కత్తెర వస్తుంది. ఉత్పత్తి సాధనాల ధరలు పెరిగితే పెరిగిన ధరలే, తగ్గితే తగ్గిన ధరలే, లెక్కలోకి వస్తాయి. వాటి కోసం, వాటి ధరల్ని మించిన లాభాలు వాటి ద్వారా రావు; ఆ లాభాలతో వాటికి అవసరం వుండదు.

**2**. పంట పండించాలంటే, భూమిలో ఎరువులు జిమ్ముతారు. ఆ సారం భూమిలోకి పోతుంది. ఆ ఉత్పత్తిని భూమి తీసుకున్నట్టు కాదా?

**జ**: కాదు. ఆ భూమిలో ఏ పంట పండుతుందో, ఆ పంట కోసం అవసరమైన ఉత్పత్తి సాధ నాల ఖర్చులోకి ఆ ఎరువుల ఖర్చు చేరుతుంది. ఆ సారంతో మొక్కలు పెరుగుతాయి. ఆ ఎరువు పంట కోసం అవసరం గానీ, భూమి కోసం అవసరం కాదు. భూమిని దున్నినా అంతే.

**3**. వడ్డీలు లేకుండా అప్పులు ఎవరు ఇస్తారు?

**జ**: ఎవరూ ఇవ్వక్కర లేదు. మనుషుల మధ్య శ్రమ దోపిడీ సంబంధాలు వుండడం వల్లనే, వడ్డీలతో అవసరం ఏర్పడుతుంది. 'వడ్డీ లేని అప్పు ఎవరు ఇస్తారు?' అని ప్రశ్నించుకోవడం కాదు; 'ఉత్పత్తి తయారవడానికి, వడ్డీ అవసరమా?' అని ఆలోచించి చూడాలి. - అవసరం లేదని తెలుతుంది. అయితే, ఇప్పుడు వడ్డీల విధానం ఎందుకు వుంది? - అని ఇంకో ప్రశ్న వస్తుంది. ' స్వంత శ్రమ లేకుండా బతకడానికి' అని జవాబు వస్తుంది. ' అసలు, అప్పులు ఇచ్చే వాళ్ళకి ఆ డబ్బు ఎలా వచ్చింది?' అని కూడా ప్రశ్నించుకోవాలి.

**4**. ఒక స్వతంత్ర ఉత్పత్తిదారుడు, తన కుటుంబ సభ్యుల స్వంత శ్రమతో, 100 రూ.లు. కూడబెట్టుకున్నాడు. దాన్ని ' పెట్టుబడి' గా పెట్టి, కార్మికుల్ని పెట్టి, ఒక చిన్న పరిశ్రమ పెట్టాడు. అతని పెట్టుబడి, అతని స్వంత శ్రమే కదా? అతనికి లాభాన్ని తీసుకునే హక్కు ఉండదా?

**జ**: ఉండదు. అతని 100 పెట్టుబడి అతని స్వంత శ్రమే కాబట్టి, ఆ 100 ని వెనక్కి తీసుకోవడానికి మాత్రమే అతనికి హక్కు ఉంటుంది. ఆ పరిశ్రమ ద్వారా అతనికి రోజూ ' 20 అదనపు విలువ' వస్తుందనుకుందాం. అలా, 5 రోజుల వరకూ వచ్చే అదనపు విలువ 100 అవుతుంది. ఆ 100, అతనికి అందేటప్పటికి, అతని 100 పెట్టుబడి అతనికి, వెనక్కి వచ్చేసిందని అర్థం. ఇక, ఆ తర్వాత, ఆ ఉత్పత్తి సాధనాలు అతనివి కావు. ఈ ఉదాహరణలో ఉన్న 100 పెట్టుబడి, స్వతంత్ర ఉత్పత్తిదారుడి స్వంత శ్రమ కాబట్టి, ఆ విలువని వెనక్కి తీసుకోవడానికి అతనికి హక్కు వుంటుంది. కానీ, ఆ పెట్టుబడి, స్వంత శ్రమ లేని వ్యక్తి పెట్టిన పెట్టుబడి అయితే, దాని ద్వారా ఏ విలువని తీసుకోవడానికీ అతనికి హక్కు ఉండదు.

**5**. పెట్టుబడిదారుడు, కార్మికులకు జీతాలు ఇవ్వడం ముందు జరుగుతుందా ; కార్మికులు, పెట్టుబడిదారుడికి శ్రమ ఇవ్వడం ముందు జరుగుతుందా?

**జ**: శ్రామికులు, శ్రమని ఇవ్వడమే ముందు జరుగుతుంది. ముందు ఇచ్చినా, తర్వాత ఇచ్చినా, విలువ లెక్కల విషయంలో అయితే రెండూ ఒకటే. జీతాల్ని, కార్మికులు పని చెయ్యక ముందే ఇవ్వాలంటే, పెట్టుబడిదారుడు, జేబులో జీతాల డబ్బుని ⟶

మొయ్యాల్సి వస్తుంది. అలా గాక, సరుకుని అమ్మేశాకే జీతాల్ని ఇచ్చేటట్టయితే, జీతాల డబ్బుని జేబులో పెట్టుకోనక్కరలేదు.

**6**. ఒక వస్తువు విలువ 12. పాత శ్రమ 8. కొత్త శ్రమ 4. కొత్త శ్రమలో అదనపు శ్రమని 2 అనుకుందాం. ఈ అదనపు శ్రమ 2 - లేకపోతే ఆ వస్తువు తయారవుతుందా?

**జ** : ప్రశ్న అలా వుండకూడదు. ఈ ఉదాహరణలో, అదనపు శ్రమ 2 లేకపోతే ఆ వస్తువు తయారవుతుందా - అని కాదు ; మొత్తం శ్రమ 12 లేకపోతే ఆ వస్తువు తయారవుతుందా - అని వుండాలి. అది, స్వతంత్ర ఉత్పత్తిదారుడి వస్తువు అయితే, 4 కొత్త శ్రమ జరిగే కాలంలో, అతని పోషణ కోసం వాడేది కూడా 4 అయితే, అదనపు శ్రమ లేకుండానే ఆ వస్తువు తయారైనట్టు అర్థం. లేదా, అతని పోషణ 3 అయితే, అదనపు శ్రమ 1. వస్తువు విలువ 12. అదే వస్తువు, యజమానీ శ్రామిక సంబంధంలో తయారయ్యేది అయితే, అప్పుడు కూడా దాని కోసం 4 కొత్త శ్రమ జరుగుతుంది. అందుకే ఆ వస్తువు విలువ 12 అవుతుంది. కొత్త శ్రమలో నించి ఎంత భాగం, అదనపు శ్రమగా పోతుందో అది తర్వాత జరిగే సంగతి.

**7**. 'డబ్బు అంటే మారకాల సాధనం' అని ఇప్పుడు తెలుసు. మరి, 'నల్ల డబ్బు, నల్ల బజారు ( బ్లాక్ మనీ, బ్లాక్ మార్కెట్ )' అంటే?

**జ** : లెక్కల్లో కనపడని డబ్బే నల్ల డబ్బు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో గాక రహస్యంగా ఎక్కువ ధరలతో అమ్మేది, నల్ల బజారు. ఏ పెట్టుబడిదారుడైనా, తన పరిశ్రమలో జరిగే సరుకుల లెక్కల్నీ, తన ఆదాయం లెక్కల్నీ సరిగా చూపించాలి కదా? కానీ అలా చూపించరు. ప్రతీ చోటా తప్పు లెక్కలూ దొంగ లెక్కలూ చూపిస్తారు. చివరికి ఆదాయం చాలా తక్కువగా మిగిలినట్టు చూపిస్తారు. ఆదాయం పన్ను ఎంత కట్టాలో అంత కట్టకుండా చాలా పన్నుని తప్పించుకుంటారు. దొంగ లెక్కల ద్వారా పన్ను కట్టకుండా మిగుల్చుకున్న డబ్బే నల్ల డబ్బు ( బ్లాక్ మనీ ). సరుకుల్ని అమ్మేటప్పుడు, కొన్ని సార్లు, సరుకుని కొన్నాళ్ళు దాచేసి, 'సరుకు లేదు' అనే భయం కల్పించి, దాచిన సరుకుని బైటికి తీసి ఎక్కువ ధరలతో అమ్ముతారు. ప్రతీ సారీ అది సాధ్యం కాదు. సరుకు సప్లై కాస్త తగ్గినప్పుడే అది జరుగుతుంది.

**8**. వస్తువుని వాడడం అంటే, ఆ వస్తువుని ఉపయోగించుకుంటాం. 'డబ్బు' ని వాడడం అంటే? డబ్బు ఖర్చవదు కదా?

**జ** : ఎందుకు ఖర్చవదు? ఒక మనిషి, డబ్బుని ఇచ్చి ఏదైనా వస్తువుని కొనుక్కుంటే, ఆ డబ్బు ఇంకా ఆ మనిషి దగ్గిర ఎక్కడ వుంటుంది? ఆ మనిషి, డబ్బుని వాడేసినట్టే కదా? ఆ వస్తువుని వాడేస్తే, ఆ శ్రమ ఖర్చయి పోయినట్టే.

**9**. జీతాల కోసం ఒక్క సారి పెట్టిన డబ్బు ఎప్పటికీ ఖర్చవకుండా, అదే డబ్బుని మళ్ళీ మళ్ళీ ఉపయోగించడం ఎలా సాధ్యం?

**జ** : సాధ్యమే. ఆ డబ్బు గల మనిషి, దాన్ని తన కోసం వాడుకుంటేనే కదా అది ఖర్చయ్యేది? జీతాల కోసం ఇవ్వడం కూడా ఆ డబ్బుని వాడుకున్నట్టే. కానీ, అది మళ్ళీ వెనక్కి వచ్చేస్తుంది కదా? దానితో మళ్ళీ జీతాలు ఇస్తే, మళ్ళీ ఖర్చవుతుంది. కానీ మళ్ళీ వెనక్కి వచ్చేస్తుంది. దాన్ని పెట్టుబడిదారుడు, ఇతర అవసరాల కోసం వాడుకోకుండా ఎప్పుడూ జీతాల కోసమే వాడితే, అది వెనక్కి వచ్చేస్తూనే వుంటుంది.

**H**

# 55. భూస్వామ్య కౌలు, 2 భాగాలైంది!

ఏడుకొండలు అనే ఒక భూస్వామి ఉన్నాడు. "ఎక్కడా?" అనకండి. ప్రపంచంలో, భూస్వామి, ఎక్కడైనా వున్నాడు. అతని ఆధీనంలో వెయ్యి ఎకరాల భూమి వుంది. దాన్ని 100 రైతు కుటుంబాలకు కౌలుకి ఇచ్చాడు. కౌలు పద్ధతి, అతని ముత్తాతల నాటి నించీ సాగుతూనే వుంది. ఇప్పుడు ఏడుకొండలు గారి హయాం వచ్చింది.

ఇప్పటికి, డబ్బుని బాగా పోగు చేసుకున్న చలపతి లాంటి పరిశ్రమల పెట్టుబడిదారులు కొందరు తయారయ్యారు. ఒక రోజు చలపతి, ఏడుకొండలు దగ్గిరికి



వచ్చాడు. "చూడు భూస్వామీ! నీ దగ్గిర వెయ్యి ఎకరాల భూమి వుంది. దాన్ని వంద కుటుంబాలకు ఇచ్చావు. వాళ్ళు నీకు కౌళ్ళు సరిగా చెల్లించక చాలా యాతన పడుతున్నావు. నేనో మాట చెపుతాను విను! ఆ భూమి అంతా నాకే కౌలుకి ఇయ్యి! దాని మీద నేనే నీకు కౌలు చెల్లిస్తాను" అన్నాడు.

భూస్వామి ఆశ్చర్యపోయాడు. "నువ్వెలా కౌలు చెల్లిస్తావు? ఆ రైతులైతే అంత మంది పడి వ్యవసాయం చేస్తారు. నువ్వు ఒక్కడివే ఏం చేస్తావు?" అన్నాడు.

"అదే మరి, నా తెలివికీ, నీ తెలివికీ తేడా! భూమిని నేను తీసుకుంటే, ఆ రైతులందరికీ భూమి పోయినట్టే కదా? అప్పుడు వాళ్ళు నా దగ్గిరికే వస్తారు, పనులు ఇవ్వమని. ఆ భూమి మీద ఇప్పుడెలా చేస్తున్నారో అప్పుడూ అలాగే చేస్తారు. అప్పటి నించీ వాళ్ళు, నీ రైతులు కారు, నా కూలీలు అవుతారు" అని చక్కగా వివరించాడు చలపతి.

భూస్వామి మళ్ళీ ఆశ్చర్యపోయాడు. "అవును సుమా! మంచి ఆలోచనే. వీళ్ళందరి దగ్గిర్నించీ కౌళ్ళు వసూలు చెయ్యలేక నా తల ప్రాణం తోక కొస్తోంది. ఏటా సగం కౌలు ఎగ్గొడుతున్నారనుకో. మంచి ఆలోచనే చేశావు. ఎలాగైనా మా కన్నా మీ పెట్టుబడిదారులు తెలివైన వాళ్ళు కదా? నువ్వు అన్నట్టే చేద్దాం" అని భూస్వామి సంతోషంగా ఒప్పుకున్నాడు.

చలపతి మళ్ళీ అన్నాడు. "అయితే ఒక మాట! నీ రైతు లందరూ నీకు ఎంత కౌలు ఇస్తారు? నేను అంత ఇవ్వను. వాళ్ళయితే, వాళ్ళ బతుకుదెరువుకి పోగా మిగిలిందంతా నీకు అప్పగిస్తున్నారు. నేను కూడా వాళ్ళ బతుకుదెరువు కోసం వాళ్ళకు కూలి ఇచ్చి, మిగిలిందంతా నీకు అప్పజెప్పేస్తే, మరి నా 'లాభం' మాటేమిటి? 'లాభం' ఎలా రావాలి? కాబట్టి, నాకు కాస్త లాభం రావాలంటే, నీ కౌలు తగ్గాలి!"

భూస్వామి మళ్ళీ ఆశ్చర్యపోయాడు. "అయితే ఎంత తగ్గిస్తానంటావ్? సగం అన్నా ఇస్తావా?"

"అయ్యో! సగం ఎందుకివ్వనూ? కూలి పోగా మిగిలిందాంట్లో నాకు సగం, నీకు సగం అనుకో!"

ఏడుకొండలు ఆలోచనలో పడ్డాడు. కాస్సేపటికి, "సరే, కానియ్యి! వాళ్ళ దగ్గిర్నించి నా కసలు సగం కౌలన్నా వచ్చి చస్తోందా? అంతా వాళ్ళే మింగుతున్నారు, వాళ్ళ తాతలు ఇచ్చిన భూముల్లాగ" అంటూ రైతుల్ని తల్చుకుని రుస రుస లాడాడు.

"పని వాళ్ళతో అదే గోల. ఎప్పుడూ ఈసురోమంటూ వుంటారు. ఎంత తిన్నా చాలదు వాళ్ళకి. అది సరే గానీ, వాళ్ళు కౌళ్ళు చెల్లించకపోతే ఏం చేసేవాడివి నువ్వు?"

"ఏం చేస్తాను? అదంతా చూసుకునే వాళ్ళున్నారులే. కౌళ్ళు ఎగ్గొట్టిన వాళ్ళని లాక్కొచ్చి ఎర్రటి ఎండలో పడేసి వీపుల మీద రాళ్ళెత్తుతారు వాళ్ళు. చెట్లకొమ్మలకి తల్లకిందులుగా వేళ్ళాడేస్తారు. లేకపోతే బండికి కట్టేసి రాళ్ళ మీద ఈడుస్తారు. అబ్బే, ఎన్ని చేసినా వాళ్ళకి సిగ్గుండదయ్యా! 'లేదు మొర్రో, పొలం పండలేదు మొర్రో' అని తెగ అబద్ధాలాడతారు. పొలం ఎందుకు పండదయ్యా? బంగారం లాంటి భూమి మాది."

చలపతి ఉత్సాహంగా అందుకున్నాడు. "పొలం పండిందో లేదో నీ కెందుకు? మొదట ఒప్పుకున్నట్టు నీ కౌలు నీకు ఇవ్వాలి, అంతే. నే నైతే, పొలం పండినా ఎండినా, నీ కౌలు నీకిస్తాను. పండకపోతే ఆ బాధలేవో నేను పడతాను."

"మంచి మాటన్నావు. ఆ వెధవల దగ్గిర్నించి పొలాలు లాగెయ్యాలని, ఎన్ని సార్లనుకున్నానో! లాగేస్తే ఎలాగ? వేరే వాళ్ళకి ఇచ్చినా వాళ్ళూ అలాంటి వెధవలే. 'పండలేదు - పండలేదు, అంత ఇవ్వలేం - ఇంత ఇవ్వలేం' అని ఎప్పుడూ ఏడుపులే."

"భూస్వామీ! నీకీ గోలలన్నీ ఎందుకు? ఇన్నాళ్ళూ వాళ్ళతో పడ్డావు. ఇక నాకు అప్పజెప్పు నీ భూమి" అన్నాడు కాబోయే కౌలు రైతు.

అంతలో, లోపలి నించి వంట మనిషి పెద్ద వెండి పళ్ళెంలో పెట్టుకుని నాలుగు వెండి గిన్నెల నిండా ఘుమ ఘుమ లాడే పరిమళాలతో ఏవేవో తెచ్చింది. ఆమె, ఒక కౌలు కుటుంబం మనిషి. ఆమె, భూస్వామి ఇంట్లో రోజూ వంట చేస్తుంది.

ఆ గిన్నెల్లో రెండు వెండి గిన్నెల నిండా పరమాన్నం మెరుస్తోంది నెయ్యి తేలుతూ. ఆ గిన్నెల్లో బంగారపు గరిటెలు వున్నాయి. ఒక వెండి గిన్ని నిండా జున్ను, ఘుమ ఘుమలతో! అందులోనూ బంగారపు గరిటె వుంది. నాలుగో వెండి గిన్నిలో వలిచిన సపోటాలూ, పనస తొనలూ వున్నాయి.

అవి రాగానే చలపతి వాటి మీద పడ్డాడు. మొదట జున్ను గిన్ని ఎత్తుకున్నాడు, "నాకు జున్ను భలే ఇష్టం" అంటూ.

"మాకు అస్తమానూ దొరుకుతుంది ఇది. తినీ తినీ విసుగొచ్చింది. నే నసలు ముట్టుకోను" అంటూ భూస్వామి, ఆకలి లేని నిరుత్సాహంతో పరమాన్నం గిన్ని అందుకున్నాడు.

అప్పటికి చలపతి, జన్ను తర్వాత పర

మాన్నం గిన్ని కూడా ఖాళీ చేసేసి పనస తొనల పని పట్టిస్తున్నాడు. " అబ్బా! ఎంత కమ్మగా వున్నాయో! మీ వాళ్ళు పనస తోటకి ఎరువులూ అవీ బాగా వేస్తారను కుంటా" అనేసి ఆ ఖాళీ గిన్ని కూడా కింద పడేశాడు.

" ఈ పనస తోట వాడే మూడేళ్ళ నించీ కౌలు ఎగ్గొడుతున్నాడు. ఇక వీడి పని ఇలా కాదని, మొన్న ఖైదులో పెట్టించాను" అన్నాడు భూస్వామి.

" మంచి పని చేశావు" అంటూ లేచాడు కాబోయే కౌలు రైతు.



# ప్రశ్నలూ - జవాబులూ

**1**. భూస్వామ్య కౌలు ( ఫ్యూడల్ రెంట్ ) అంటే? దాన్ని ఎవరు చెల్లిస్తారు?

**జ** : స్వయంగా శ్రమ చేసే కౌలు రైతులు చెల్లించే కౌలు అది. మొత్తం పంటలో నించి ఉత్పత్తి సాధనాల భాగాన్ని పక్కనపెట్టి, రైతుల శ్రమ భాగాన్నే చూడాలి. ఆ శ్రమ భాగానికి వచ్చే ఉత్పత్తిని 4 భాగాలు చేద్దాం. అందులో 3 భాగాల్ని ( 75% ) కౌలు అనీ, 1 భాగాన్ని ( 25% ) రైతుల పోషణ అనీ అనుకుందాం.

**2**. భూస్వామ్య కౌలు, 2 భాగాలైంది. ఎప్పుడు? ఎందుకు?

**జ** : భూస్వామి నించి భూమిని కౌలు కోసం, పెట్టుబడిదారుడు తీసుకున్నాడు. గత కాలపు శ్రమ చేసే రైతులే ఇప్పటి వ్యవసాయ కార్మికులు. పండిన పంటలో నించి, కార్మికుల శ్రమ భాగాన్ని ఒక పక్కకి తియ్యాలి. అందులో నించే ఆ కార్మికులకు జీతాలు ఇవ్వాలి. జీతాల భాగం పోగా మిగిలిన దాన్ని భూస్వామికి కౌలుగా చెల్లించాలంటే, పెట్టుబడిదారుడికేం మిగులుతుంది? కాబట్టి, గతంలో కౌలుగా వుండే భాగమే, ఇప్పుడు భూస్వామికి ' కౌలు' గానూ, పెట్టుబడిదారుడికి ' లాభం' గానూ, అందాలి. అందుకే, గతంలో కౌలుగా వుండే భాగం, ఇప్పుడు 2 భాగాలవుతుంది.

**3**. గత కాలపు కౌలు రోజుల్లో, ' అదనపు శ్రమ' ఏది?
పెట్టుబడిదారీ కౌలు రోజుల్లో, ' అదనపు శ్రమ' ఏది?

**జ** : గత కాలపు రోజుల్లో భూస్వామికి అందే కౌలే - రైతుల అదనపు శ్రమ. పెట్టుబడిదారీ కౌలు రైతు ప్రారంభమైన తర్వాత, ' భూస్వామికి కౌలూ + వ్యవసాయ పెట్టుబడికి లాభమూ' - రెండూ కలిసినది, వ్యవసాయ కార్మికుల అదనపు శ్రమ.

**4**. భూస్వామి వడ్డీలు చెల్లిస్తే, అది ఏమిటి? శ్రమ చేసే రైతులు వడ్డీలు చెల్లిస్తే? పెట్టుబడిదారీ రైతు వడ్డీలు చెల్లిస్తే?

**జ** : భూస్వామి - వడ్డీల్ని అయినా, వర్తకుడికి ఇచ్చే దాన్ని అయినా, ఇంకే ఖర్చుని అయినా, తనకు అందే కౌలులో నించి ఇవ్వవలసిందే. పెట్టుబడిదారీ కౌలు రైతు, వడ్డీలు చెల్లించవలసి వస్తే, అదనపు విలులో నించి కౌలు పోగా తనకు అందే భాగంలో నించే చెల్లించాలి. వడ్డీలు చెల్లించే అవసరం లేకపోతే, అది అతనికే మిగులుతుంది. ⟶

శ్రమ చేసే రైతుల విషయంలో అయితే, వడ్డీలు చెల్లించవలసి వస్తే, తమ పోషణ భాగంలో నించే చెల్లించాలి. దాని వల్ల వారి పోషణ తగ్గిపోతుంది. వడ్డీలు చెల్లించడం వల్ల నష్టం, శ్రామికులకు వున్నట్టు, భూస్వామికి గానీ, పెట్టుబడిదారుడికి గానీ, వుండదు.

**5**. భూస్వామి, తన భూమిని, శ్రమ చేసే రైతుల నించి వెనక్కి తీసుకుని, పెట్టుబడిదారీ రైతుకి ఇస్తే, అప్పటి దాకా వస్తూ వున్న కౌలు తగ్గుతుంది కదా? దానికి భూస్వామి ఎలా అంగీకరిస్తాడు?

**జ** : అది జరిగిన నాడు, అదంతా స్పష్టంగా ఆ వర్గాలకు అర్థమయ్యే పద్ధతిలో ఉండదు. ఆ మార్పు జరిగేది ఒకటి రెండు సంవత్సరాల్లో కాదు, వందల సంవత్సరాల కాలంలో జరుగుతుంది. శ్రమ సంబంధాల్లో ఒక అతి చిన్న మార్పు జరిగేటప్పటికి, మనుషుల తరాలే మారిపోతూ వుంటాయి. ' భూమిని పెట్టుబడిదారీ రైతుకి ఇస్తే, కౌలు తగ్గుతుంది' అనే విషయం, భూస్వామి కుటుంబం వాళ్ళకి తెలియనే తెలియదు. ఎందుకంటే, వెనకటి కాలపు పంటలూ, పెట్టుబడిదారీ వ్యవసాయంలో పంటలూ ఒకే పరిమాణాలతో వుండవు. వెనకటి కాలపు రైతుల శ్రమ భాగం - 100 బస్తాల ధాన్యం అనుకుందాం. అందులో నించి కౌలు - 75 బస్తాలు. ఈ కౌలు, 75%. పెట్టుబడిదారీ వ్యవసాయంలో, అదే భూమిలో, అదే శ్రమతో వచ్చే పంట, 200 బస్తాలు అనుకుందాం. అందులో నించి కౌలు 80 బస్తాలు - అనుకుందాం. 200 పంటలో నించి 80 కౌలు అంటే, ఇది 40%. అంటే, వెనకటి పంటలో నించి వచ్చే కౌలు భాగం కన్నా, పెట్టుబడిదారీ పంటలో నించి వచ్చే కౌలు భాగం చాలా తక్కువ. కానీ, వెనకటి కాలపు కౌలు 75 బస్తాలు అయితే, పెట్టుబడిదారీ కౌలు 80 బస్తాలుగా వుంటుంది కాబట్టి, ఈ కౌలే ' ఎక్కువగా వున్నట్టు' కనపడుతుంది. అసలు ఈ మార్పులూ, ఈ లెక్కలూ, భూస్వామికి గానీ, పెట్టుబడిదారుడికి గానీ, వ్యవసాయ కార్మికులకు గానీ, తెలియకుండానే జరిగిపోతాయి. ఇదంతా, శ్రమ దోపిడీని గ్రహించి, ఆ తర్కం ద్వారా తెలుసుకోవలిసిందే.

**6**. శ్రమ చేసే కౌలు రైతు, కొన్ని అత్యవసర సందర్భాల్లో, ఒకరో ఇద్దరో కూలీల్ని కూడా పెట్టుకుంటాడనుకుందాం. చిన్న స్థాయి పెట్టుబడిదారుడు, కూలీల్ని పెట్టుకున్నప్పుడు, కొంత శ్రమ దోపిడీ చేసేవాడే అవుతాడు కదా? అలాగే, శ్రమ చేసే కౌలు రైతు కూడా కూలీల్ని పెట్టుకుంటే, ఆ రైతు, కొంత శ్రమ దోపిడీ చేసినట్టు అవుతుందా, అవదా?

**జ** : ఇది చాలా జాగ్రత్తగా ఆలోచించవలసిన విషయం. చిన్న స్థాయి పెట్టుబడిదారుడి విషయంలో జరిగినట్టుగా, శ్రమ చేసే కౌలు రైతు విషయంలో జరగదు. వ్యవసాయ కూలీల అదనపు శ్రమ, శ్రమ చేసే కౌలు రైతుకి రాదు.

**ఎలాగంటే : ఉదాహరణని ఇలా అనుకుందాం :**

ఆ రైతు ( కుటుంబం ) చెయ్యవలసిన శ్రమ, స్వంత పోషణ కోసం 20 + కౌలు కోసం 40 = 60. ఏ కూలీలూ లేకుండా, శ్రమ అంతా కౌలు రైతే చేసుకుంటే, అది, 20 + 40 = 60 గా ఉంటుంది. కూలీల్ని పెట్టుకుంటే, ఆ 60 లోనే కొంత శ్రమని కూలీలు

→

చేస్తారు. దాని వల్ల, రైతు చేసే శ్రమ తగ్గుతుంది. ఆ మార్పులు ఎలా జరుగుతాయో ఇప్పుడు చూడాలి. ఆ కౌలు రైతు, ఒక సారి ఇద్దరు కూలీల్ని పెట్టుకున్నాడు. ఆ ఇద్దరికీ కలిసి జీతం 5. వారి అదనపు శ్రమ 5. అయితే, ఆ కూలీలకు 5 జీతాన్ని, కౌలు రైతు, ఎలా ఇవ్వాలి? ఆ 5 జీతం, పంటలోని ఏ భాగంలో నించి వస్తుంది? - జీతం అనేది, సజీవ శ్రమ లోదే. ఆ 5 జీతం, రైతు పోషణ అయిన 20 లో నించే వస్తుంది. ఈ 20 పోషణ సంగతినే చూస్తే, అందులో 5 శ్రమ కూలీలదీ ; 15 శ్రమ కౌలు రైతుదీ. కూలీల పోషణ కోసం 5. రైతు పోషణ కోసం 15. రెండూ కలిసి 20. ఆ 20 తోనే, అక్కడ అవసర శ్రమ జరుగుతుంది. రైతు కుటుంబానికి 5 శ్రమ తగ్గడం వల్ల, 5 పోషణ కూడా తగ్గింది.

అయితే, కూలీలు చేసిన శ్రమ 5 మాత్రమే కాదు ; ఇంకో 5 అదనపు శ్రమ కూడా వుంది. దాని కోసం వారికి ఏమీ అందలేదు. కూలీల అదనపు శ్రమ ఏమైంది? అది కౌలు రైతుకి అందిందా? - ఇప్పుడు, కూలీల అదనపు శ్రమ సంగతి చూడాలి. - కూలీలు లేకపోతే, కౌలు రైతు చెయ్యవలసిన శ్రమ : పోషణ 20 + అదనపు శ్రమ 40 = 60. కూలీలు వచ్చి 10 శ్రమ చేస్తే, రైతు శ్రమలో నించి అది తగ్గుతుంది. అప్పుడు రైతు శ్రమ, పోషణ 15 + అదనపు శ్రమ 35 = 50 అవుతుంది.

భూస్వామికి చెల్లించవలసిన కౌలు 40. కానీ, రైతు అదనపు శ్రమ 35 మాత్రమే వుంది. దానితో 40 కౌలు ఎలా చెల్లించాలి? కూలీల 5 అదనపు శ్రమని కూడా ఇవ్వడమే దానికి మార్గం. కౌలు రైతు అదనపు శ్రమ 35 + కూలీల అదనపు శ్రమ 5 = 40. దీన్ని భూస్వామికి అప్పగించాలి. కూలీల అదనపు శ్రమ, మొదట కౌలు రైతుకి అందిన మాట నిజమే. కానీ, అది ఆ రైతు వాడకానికి వెళ్ళదు. అది కూడా భూస్వామికే అందుతుంది. - అయితే, కౌలు రైతుకీ, అతని కూలీలకూ మధ్య ఏం జరిగింది? - కూలీల వల్ల కౌలు రైతుకి 10 శ్రమ తగ్గింది. కూలీలు 10 శ్రమ చేసి, అందులో 5 ని, తమ పోషణ కోసం తీసుకున్నారు. అది, కౌలు రైతుకి అందినట్టు కాదు. కూలీల అదనపు శ్రమ, భూస్వామికి పోయింది గానీ, దాన్ని కౌలు రైతు వాడలేదు. కూలీల్ని, కౌలు రైతు చేసిన 'శ్రమ దోపిడీ' ఏమీ లేదు. అలాంటి సంఘటన ఎప్పుడు జరుగుతుందంటే, కౌలు చెల్లించడం కోసం కౌలు రైతు పోగొట్టుకునే అదనపు శ్రమ స్థాయి (శాతం) కన్నా, కూలీల అదనపు శ్రమ స్థాయి ఎక్కువగా వుంటే, శ్రమ దోపిడీ అనదగ్గది కొంత జరుగుతుంది. కానీ, స్వయంగా శ్రమ చేసే కౌలు రైతుల దగ్గిర ఒకరిద్దరు కూలీలు పని చేసినా, అందరి అదనపు శ్రమలూ భూస్వామికే కౌలుగా పోతాయి.

**7.** 'స్వతంత్ర రైతు', కూలీల్ని పెట్టుకుంటే?

**జ :** అప్పుడు అతను స్వతంత్ర రైతు అవడు. కొంత తన శ్రమ మీదా, కొంత దోపిడీ మీదా జీవించే రైతు అవుతాడు. అతను కౌలు చెల్లించనక్కరలేదు కాబట్టి, కూలీల అదనపు శ్రమ అతనికే అందుతుంది. **H**

[13]

# 56. శ్రమ ఎరగని కౌలు రైతు!



శ్రమ ఎరగని భూస్వామికీ, శ్రమతో సంబంధం లేని కౌలు రైతుకీ, ఇటూ అటూ పది మాటలు జరిగేటప్పటికి, మానవ చరిత్ర ఒక అడుగు ముందుకు వేసింది. అందరి జీవితాలూ కొత్త దారులు పట్టాయి.

భూస్వామి, ఇంకా భూస్వామిగానే వున్నా, 100 కుటుంబాల నించి కౌళ్ళు వసూలు చేసుకునే బెడద తప్పించు కున్నాడు.

చలపతి ఇప్పుడు, 'పారిశ్రామిక పెట్టుబడిదారుడు' మాత్రమే కాదు ; 'వ్యవసాయ పెట్టుబడిదారుడు' కూడా అయ్యాడు!



అంతే కాదు, ఇప్పుడు ఇతగాడు, కౌలు రైతు! పెట్టుబడిదారీ కౌలు రైతు! శ్రమ చెయ్యని కౌలు రైతు!

ఇప్పటి దాకా శ్రమ చేసే కౌలు రైతులు, ఇక 'వ్యవసాయ కూలీలు'! వ్యవసాయ శ్రామికులు! వ్యవసాయ కార్మికులు! ఎలా అన్నా ఒకటే. - ఈ మార్పు వీరికీ, ఒక రకంగా మంచిదే. కౌళ్ళు చెల్లించే బాధలూ, చెల్లించకపోతే శిక్షలూ, తప్పుతాయి. పెట్టుబడిదారుడి దగ్గిరే పొలం పనులు చేస్తే, కూలి డబ్బులు చేతుల్లో పడతాయి. దానితో, పోషణ ఎప్పట్లాగే జరుగుతుంది. కానీ, ఆ మార్పులో వారికి కొన్ని సమస్యలు కూడా వున్నాయి. ఇన్నాళ్ళూ భూమి తమ చేతుల్లోనే వుంది కదా అని అందులో పాకలు వేసుకున్నారు. కూరగాయలు పండించుకుంటున్నారు. కోళ్ళనీ గేదెల్నీ మేపుకుంటున్నారు. ధాన్యం పంట కొంచెం వుండనే వుంటుంది. ఏదీ కొనే పని లేదు. కానీ, వ్యవసాయ కూలీలుగా మారితే, ఈ సదుపాయాలన్నీ పోతాయి. కూలి డబ్బు తోనే ప్రతీదీ కొనాలి. పొలాల్లో వేసుకున్న పాకలన్నిటినీ కొత్త యజమాని, ఖాళీ చెయ్యమంటాడు. లేకపోతే పాకలకు అద్దెలు కట్టమంటాడు. ప్రతీ దానికీ డబ్బు లెక్కలతో నడవాలి. అయితే అయిందిలే. కౌళ్ళు చెల్లించే బాధలు పోతే, అదే పది వేలు. తర్వాత సంగతి తర్వాత చూసు కోవచ్చు.

వెనకటి కాలంలో, బానిసలు, కౌలు రైతులుగా మారడం, బానిసలకు అభివృద్ధే. అలాగే, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులుగా మారడం, ఆ రైతులకూ అభివృద్ధే.

'సంపూర్ణమైన అభివృద్ధి' అయితే, శ్రమ దోపిడీని వదిలించుకున్నప్పుడే జరగాలి. యజమానితనాల నించి బైట పడ్డప్పుడే జరగాలి. కానీ అది చాలా దూరం! ఎంత దూరం అయినా ఈ ప్రయాణం అక్కడికే! బానిసలు తలలెత్తిన నాడే ఈ ప్రయాణం ప్రారంభమైంది. ఇవన్నీ దారిలో మజిలీలు. ఈ మజిలీలన్నీ దాటవలసిందే.

శ్రమ చెయ్యని పెట్టుబడిదారీ కౌలు రైతు చలపతి, శ్రమ చేసే భూస్వామ్య కౌలు రైతుల్ని తన కూలీలుగా మార్చుకున్నాడు. తర్వాత, అంతా ఎప్పటి చరిత్రే. వ్యవసాయంలో శ్రమలన్నీ కూలీలే చేస్తారు. పంటలు పండుతాయి. పెట్టుబడిదారుడు తన కుటుంబానికి కావలసిన వాటిని వుంచుకుని, మిగిలిన వాటినన్నిటినీ అమ్మేస్తాడు. డబ్బు వస్తుంది. పెట్టుబడిని (ఉత్పత్తి సాధనాల ఖర్చుల్నీ, జీతాల్నీ) వెనక్కి తీసుకుంటాడు. 'అదనపు విలువ' బయట పడుతుంది. అందులో నించి కౌలు చెల్లిస్తాడు. అవసరమైతే వడ్డీ చెల్లిస్తాడు. చివరికి మిగిలేదాన్ని, 'వ్యవసాయ లాభం' పేరుతో సంచిలో వేసుకుంటాడు.

'పరిశ్రమలు' పెట్టిన ప్రారంభంలో అయితే, పెట్టుబడిదారులకు పనివాళ్ళు దొరకడం కష్టం అయ్యేది. కౌళ్ళు చెల్లించే బాధలు పడలేక పొలాల్ని వదిలేసిన వాళ్ళే అప్పుడు పనుల కోసం వచ్చేవారు. చారెడేసి స్వంత పొలాల మీద సాగులు చేసుకునే వాళ్ళు కూడా కొందరు, కూలి డబ్బులకు ఆశ పడి, పరిశ్రమల్లోకి వచ్చేవారు. పెట్టుబడిదారులకు అలాంటి వాళ్ళు దొరికినా, వాళ్ళు కూడా సరిపోయేవారు కాదు. కానీ, పెట్టుబడిదారులే, పొలాల్ని కౌళ్ళకు తీసుకున్న తర్వాత, కూలీల సమస్య తీరిపోయింది. పొలాలు పోయిన వాళ్ళందరూ, అటు పరిశ్రమల్లోకీ, ఇటు వ్యవసాయంలోకీ కూడా కూలీలుగా దొరకడం మొదలైంది.

కొన్నేళ్ళు అలా సాగాక, ఏడుకొండలు భూస్వామికి, నూతన జ్ఞానం ఒకటి కలిగింది, తన భూమి మీద తనే 'స్వంత సాగు' చేయించుకోవాలని. తన భూమిని చలపతికి ఇవ్వడం ఎందుకు? ఆ కూలీల్ని తన దగ్గిరే పెట్టుకుని వ్యవసాయం చేయించుకోవచ్చు. అలాగైతే, చలపతికి పోయే వ్యవసాయ లాభం, తనకే అందుతుంది కదా? - ఇలా ఆలోచించాడు.

తర్వాత, అదీ జరిగింది.

భూస్వామి, 'స్వంత సాగు' మొదలు పెట్టాడు. అంటే, స్వంత శ్రమ చేస్తాడని కాదు. భూస్వామి, ఇక్కడ పుల్ల తీసి అక్కడ పెట్టడు. ఏ శ్రమా చెయ్యడు. శ్రమలన్నీ కూలీలే చేస్తారు. పంట పండుతుంది. కూలీలందరికీ 'కూలి' ఇచ్చాక, మిగిలినదంతా భూస్వామికే. అయితే, ఆ ఆదాయాన్ని 2 పేర్లతో తీసుకుంటాడు. భూస్వామిగా వున్నందుకు 'భూమి కౌలు' తీసుకుంటాడు. వ్యవసాయానికి పెట్టుబడి పెట్టాడు కాబట్టి, ఆ పేరుతో, 'వ్యవసాయ లాభం' తీసుకుంటాడు. ఆ 2 పేర్లతో, ఆ ఆదాయాల్ని చాలా న్యాయంగా తీసుకుంటున్నాను - అనుకుంటాడు!

క్రమంగా, భూస్వాములు, డబ్బు కూడబెట్టి, పరిశ్రమల్లో కూడా పెట్టుబడిదారులు అయ్యారు.

పరిశ్రమల పెట్టుబడిదారులు, డబ్బు కూడబెట్టి, భూములు కొని, భూస్వాములు

కూడా అయ్యారు.

చిన్న స్థాయి పెట్టుబడిదారుల్లో కొందరు, ప్రారంభంలో తమ శ్రామికులతో పాటే పని చేస్తూ వుండేవారు. అలాంటి వాళ్ళల్లో కొందరు, శ్రమని పూర్తిగా వదిలేసే పెద్ద పెట్టుబడిదారులయ్యారు.

చిన్న వర్తకుల్లో కొందరు, 'వర్తక పెట్టు బడిదారుల'య్యారు.

వడ్డీల వాళ్ళు, 'వడ్డీ పెట్టుబడిదారుల' య్యారు.

మేధా శ్రమల కార్మికుల్లో గుప్పెడు మంది, కార్మిక జీవితం వదిలేసి, పెట్టుబడి దారులుగా 'ఎదిగారు'! ఎదిగీ, ఎదిగీ, శ్రమని దోచే శత్రు వర్గంలో చేరారు.

కానీ, శ్రామిక జనాభాలో, నూటికి 99 మంది, ఎప్పుడూ శ్రామికులే! వారు, తర తరాలుగా శత్రు వర్గానికి సేవకులే! నిరు పేదలే!

'పరిశ్రమల పెట్టుబడి' నించి వచ్చేది
'పారిశ్రామిక లాభం!'

'వ్యవసాయ పెట్టుబడి' నించి వచ్చేది
'వ్యవసాయ లాభం!'

'వర్తక పెట్టుబడి' నించి వచ్చేది -
'వర్తక లాభం!'

'అప్పులు ఇచ్చే డబ్బు పెట్టుబడి'
నించి వచ్చేది - 'వడ్డీ'.

'భూమి' నించి వచ్చేది - 'కౌలు!'

అవి అన్నీ కలిసి, - అదనపు విలువ.

యజమానుల ఆదాయాలకు పేర్లే తేడా! అన్నీ ఒకటే. అన్నీ శ్రామికుల అదనపు విలువలో భాగాలే. అన్నీ శ్రమని దోచే మార్గాలే! ఆ మార్గాల యజమానులందరూ కలిసి, శ్రమని దోచే వర్గం!

భూస్వామ్య సమాజంలోనే పెట్టుబడి దారీ విధానం ప్రారంభమైంది. భూస్వాములూ, పెట్టుబడిదారులూ కలిసే వుంటారు. శ్రామికులకు జీతాలూ, పని గంటలూ, సెలవలూ, సరుకుల తయారీలూ, అమ్మకాల మార్కెట్లూ - వంటి మార్పులతో, క్రమంగా ఆ సమాజం, పెట్టుబడిదారీ సమాజంగా మారింది.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. పెట్టుబడిదారీ కౌలు రైతు, 'వ్యవసాయ పెట్టుబడి' ని ఏ యే అంశాల మీద పెడతాడు?

జ : పరిశ్రమల్లో ఎలా జరుగుతుందో ఇక్కడా అలాగే.

(1) ఉత్పత్తి సాధనాల మీదా ( విత్తనాలూ, ఎరువులూ, పనిముట్లూ వగైరాల మీద ) ;

( 2 ) వ్యవసాయ కూలీల జీతాల మీదా.

**2**. వ్యవసాయ పెట్టుబడిదారుడు, వ్యవసాయ ఉత్పత్తుల ధరల్ని ఎలా నిర్ణయిస్తాడు?

జ : పరిశ్రమల్లో లాగే ఇక్కడ కూడా. ఖర్చులూ + లాభమూ. 'ఖర్చులు' అనే లెక్కల్లో, ఉత్పత్తి సాధనాల ఖర్చూ, జీతాల ఖర్చుతో పాటు, కౌళ్ళూ, వడ్డీలూ, వర్తక కమిషన్లూ, పన్నులూ అన్నీ ఉంటాయి. వాటిపైన 'లాభం' కూడా.

**3**. భూస్వామి కూడా ప్రభుత్వానికి పన్నులు కడతాడా?

జ : భూస్వామి గానీ, పెట్టుబడిదారీ కౌలు రైతు గానీ, ఎవరో ఒకరు వ్యవసాయం పన్ను కట్టాలి. అది వాళ్ళ ఒప్పందాన్ని బట్టి వుంటుంది. లేకపోతే, వాళ్ళ పోలీసులూ, జైళ్ళూ ఎలా నడుస్తాయి?

**4**. ' స్వంత సాగు ' అంటే? భూస్వామి కుటుంబమే వ్యవసాయ శ్రమలు చేసుకుంటుందా?

**జ** : అలా కాదు. భూస్వామి, తన భూమిని ఎవరికీ కౌలుకి ఇవ్వడు. కూలీల్ని ( కార్మికుల్ని ) తన దగ్గిరే పెట్టుకుని, వాళ్ళకు జీతాలు ఇచ్చే పద్ధతి మీద, వారితో వ్యవసాయం చేయిస్తాడు. అంటే, భూస్వామి ఇప్పుడు, భూస్వామిగా వుంటూనే, వ్యవసాయ పెట్టుబడిదారుడు కూడా అవుతాడు. ఇప్పుడు, కార్మికుల అదనపు శ్రమ, అంతా భూస్వామికే. ' భూమి కౌలు ' పేరుతో కొంతా, ' వ్యవసాయ లాభం ' పేరుతో కొంతా!

**5**. భూస్వామి, తన భూమిని శ్రమ చేసే కౌలు రైతులకు ఇచ్చినప్పుడు, ఉత్పత్తి సాధనాల ఖర్చుని భూస్వామే పెడతాడు కదా? భూస్వామి, వ్యవసాయ శ్రామికులతో స్వంత సాగు చేయించినప్పుడు కూడా ఉత్పత్తి సాధనాల ఖర్చు భూస్వామే పెడతాడు. స్వంత సాగు సందర్భంలో, అతను వ్యవసాయ పెట్టుబడిదారుడు ఎలా అవుతాడు?

**జ** : అది, శ్రమ సంబంధాల్లో తేడాని బట్టి వచ్చే మాటలు.
**మొదటి సంబంధం** : భూస్వామీ × శ్రమ చేసే కౌలు రైతులూ.
**రెండో సంబంధం** : వ్యవసాయ పెట్టుబడిదారుడూ × వ్యవసాయ శ్రామికులూ.
ఉత్పత్తి సాధనాల ఖర్చుని, ఏ సంబంధంలోనూ యజమాని పెట్టేదేమీ వుండదు. పంటలో కొంత భాగమే ఆ ఖర్చు. సంబంధాల్లో తేడాని బట్టి ఆ మాటలు.

**6**. కార్మికులందరూ పెట్టుబడిదారులు అవగలరా?

**జ** : మేధాశ్రమల కార్మికుల్లో నూటి కొకరు అలా అయితే అవగలరు. అసలు ఏ కార్మికుడైనా పెట్టుబడిదారుడిగా మారితే, ఆ కొత్త పెట్టుబడిదారుడి దగ్గిర కూడా కార్మికులు ఉండొద్దూ? కార్మికులు లేకుండా పెట్టుబడిదారుడెలా వుంటాడు? మొత్తం కార్మికులందరూ పెట్టుబడిదారులైపోతే, వాళ్ళు ఎవర్ని దోచుకుంటారు? ఒక పేద వాడు ధనికుడైపోయి, కంపెనీలు పెట్టేసినట్టు సినిమాల్లో చూపిస్తారు. కార్మికులు లేని పెట్టుబడిదారులు గానీ, పేదలు లేని ధనికులు గానీ, వుండరు. ఒక కొత్త పెట్టుబడిదారుడు తయారయ్యాడంటే, అక్కడ తయారవవలసిన సరుకు కోసం శ్రమలు చెయ్యడానికి కార్మికులు కూడా ప్రత్యక్షమవుతారు.

**7**. శ్రమ చెయ్యని కౌలు రైతు భవనం ఎలా వుండవచ్చు?

**జ** : శ్రమ చెయ్యని మనిషి, భూస్వామి గానీ, పెట్టుబడిదారుడు గానీ, అవుతాడు. వాళ్ళ నివాసాలు గతంలో చూసిన భవనాలుగానే వుంటాయి.



శ్రమని ఎరగని యజమానుల భవనాలు ఇలాగే వుంటాయి.



శ్రమ చేసే కౌలు రైతు కొంప



శ్రమ చేసే బానిసల గుడిసెలు

**H**

# 57. శ్రమ దోపిడీ, ఈ నాటికీ ప్రపంచమంతటా సాగుతూనే వుంది!

'శ్రమ దోపిడీ' బానిసల కాలంలో పుట్టి, ఆ నాటి నించీ కూడా వుంది. కానీ దాన్ని గ్రహించడం, పెట్టుబడిదారీ విధానం ప్రారంభమయ్యాకే, నిన్న మొన్న జరిగింది. ఇంత ఆలస్యం ఎందుకు జరిగింది?

ఎందుకంటే : వెనకటి సమాజాల్లో డబ్బు లెక్కలు చాలా తక్కువ. అక్కడ, శ్రామికులకు 'జీతాలు' ఇచ్చే పద్ధతే లేదు. ఉత్పత్తి సాధనాలు బజార్లలో కొనేవి కావు. దేనికీ విలువ లెక్కలు వుండవు. ఉత్పత్తుల్లో కొంత భాగాన్ని అమ్మడాలు జరిగినా, అది చాలా తక్కువ. శ్రామికులు ఎంత శ్రమ చేశారో, అందులో నించి వారికి ఎంత అందిందో, ఆ లెక్కలేవీ అక్కడ వుండవు. అసలు, 'శ్రమ' అనే విషయమే అప్పటికి తెలీదు.

పెట్టుబడిదారీ విధానంలో అయితే, శ్రామికులకు 'జీతాల' పద్ధతి ఏర్పడింది. ఇక్కడ ప్రతి అంశానికీ డబ్బు లెక్కలు వుంటాయి. అన్ని శ్రమల విలువలూ, అన్ని వస్తువుల విలువలూ, డబ్బు లెక్కలతో వుంటాయి.

పెట్టుబడిదారుడు, ఒక ఉత్పత్తిని, 'అమ్మకం కోసమే' తయారు చేయించేటప్పుడు, దానికి అవసరమైన ఉత్పత్తి సాధనాలన్నిటినీ డబ్బుతోనే కొంటాడు. వాటి విలువలన్నీ స్పష్టంగా తెలుస్తూ వుంటాయి. దాన్ని 80 అనుకుందాం. అలాగే, ఇక్కడ శ్రామికులకు ఇచ్చే జీతాలు కూడా డబ్బు లెక్కలతో వుంటాయి. దాన్ని 20 అనుకుందాం. ఆ ఉత్పత్తి కోసం అవసరమైనవి, ఆ 2 అంశాలే. అక్కడ మూడో అంశం ఏదీ వుండదు. ఆ 2 అంశాలూ కలిసి - పెట్టుబడి. అది, 80 + 20 = 100. అంటే, పెట్టుబడిగా ఎంత ఖర్చయిందో కూడా తెలుస్తూ వుంటుంది. ఆ ఉత్పత్తిని అమ్మితే ఎంత డబ్బు వచ్చిందో అది కూడా తెలుస్తుంది. అది 120 అనుకుందాం. లెక్కలన్నీ ఇలా వున్నప్పుడు, శ్రామికులు చేసిన శ్రమకి ఎంత విలువ వుండవచ్చో తెలుసుకోవడం చాలా తేలిక. కొత్త ఉత్పత్తి విలువలో నించి ( 120 లో నించి ), ఉత్పత్తి సాధనాల ఖర్చుని తీసివేస్తే ( 80 ని తీసివేస్తే ), మిగిలేది ఎంత? - 40. ఇదే, పని స్థలంలో శ్రామికులందరూ కలిసి చేసిన శ్రమకు విలువ. అందులో నించి శ్రామికులకు అందిన జీతాల్ని తీసివేస్తే ( 20 ని తీసివేస్తే ), మిగిలేది, శ్రామికుల అదనపు విలువ. అది 20.

ఉత్పత్తి సాధనాలకీ, శ్రామికుల పోషణకీ, డబ్బు లెక్కలు లేవనుకోండీ. తయారైన కొత్త ఉత్పత్తుల్ని అమ్మడం కూడా లేదనుకోండీ. శ్రామికుల శ్రమ విలువని గానీ, అందులో నించి వారికి అందే భాగాన్నీ, అందని భాగాన్నీ, లెక్క కట్టడం ఎలా సాధ్యం? - సాధ్యం కాదు. శ్రామికులకు జీతాల పద్ధతి ఏర్పడే దాకా, 'విలువ'ని అర్థం చేసుకోవడం సాధ్యమే

కాదు. డబ్బు లెక్కలు వుంటేనే, 'శ్రమ దోపిడీ'ని కనిపెట్టడానికి తగిన పరిస్థితులు ఏర్పడినట్టు అర్థం. అది మొట్ట మొదట వుండవలసిన పరిస్థితి. కానీ, అదే చాలదు.

అసలు 'శ్రమ' అంటే ఏమిటో తెలియాలి. 'మనుషులు చేసేదే శ్రమ' అనీ, 'పనిముట్లు శ్రమ చెయ్యవు' అనీ, తెలియాలి. 'భూమి, శ్రమతో తయారైనది కాదు' అని తెలియాలి. 'కౌలూ - వడ్డీ - లాభం అనేవి, తమ ద్వారా, కొత్త ఉత్పత్తికి, ఏ శ్రమనీ చేర్చవు' - అని తెలియాలి. ఉత్పత్తి సాధనాలన్నీ వస్తువులే కాబట్టి, వాటి ద్వారా చేరే శ్రమ ఎలాంటిదో, పని స్థలంలో మనుషులు చేసే శ్రమ ఎలాంటిదో, ఆ తేడా తెలియాలి. ఈ అంశాలన్నిటినీ హేతుబద్ధమైన తర్కం ద్వారా గ్రహించాలి.

ఒక్క పెట్టుబడిదారుడినే కాదు, ఒక ఊళ్ళో వున్న పెట్టుబడిదారుల్నీ, భూస్వాముల్నీ, అందర్నీ తీసుకోండి! ఒక్క ఊరునే కాదు, మొత్తం దేశాన్ని తీసుకోండి! ఒక్క దేశాన్నే కాదు. మొత్తం ప్రపంచాన్ని తీసుకోండి! ప్రపంచ చరిత్ర అంతా శత్రు వర్గాల చరిత్రే! ప్రపంచ జనాభా అంతా, ఏ నాటి నించో ఈ నాటికీ, శత్రు వర్గాలుగా విడిపోయి వుంది. శ్రమలు చేసే వర్గమూ, శ్రమల్ని దోచే వర్గమూ - అనే ప్రధాన వర్గాలుగా. మనం కూడా ప్రపంచ జనాభాలోనే, ఒక దేశ జనాభాలోనే వున్నాం కదా? అంటే, మనం కూడా ఏదో ఒక వర్గంలో వున్నాం - శ్రమలు చేసే వర్గంలో గానీ, శ్రమల్ని దోచే వర్గంలో గానీ! మనం, ఏ వర్గంలో వున్నామో మనల్ని మనం తెలుసుకోవాలంటే, ఇంకా కొన్ని విషయాలు చూడాలి.

# ప్రశ్నలూ - జవాబులూ

**1.** శ్రమ దోపిడీ బానిసల కాలం నించీ వుంది కదా? దాన్ని ఆ నాటి మేధావులే ఎందుకు గ్రహించలేదు?

**జ :** శ్రమ దోపిడీ విషయం బయట పడాలంటే, తప్పనిసరిగా కొన్ని లెక్కలు కనపడాలి. (1) బానిసలు ఏ పని చేసినా, అక్కడ ఖర్చయిన ఉత్పత్తి సాధనాల విలువ ఎంత? (2) బానిసల పోషణ కోసం ఖర్చయిన పదార్థాల విలువ ఎంత? (3) బానిసల శ్రమలతో తయారైన మొత్తం ఉత్పత్తుల విలువ ఎంత? - ఈ 3 లెక్కలూ తెలిస్తే, శ్రమ దోపిడీని కనిపెట్టడానికి కొంచెం మార్గం ఏర్పడుతుంది. ప్రతీ శ్రమనీ, ప్రతీ ఉత్పత్తినీ, ఒకే సాధనంతో కొలిచే విధానం ఉండాలి. 'డబ్బు' అనేది, ఏ నాడో ప్రారంభమైనా, డబ్బుతో జరిగే మారకాలు అతి తక్కువగా వుంటే, దాని వల్ల ఏ ఉత్పత్తికీ డబ్బు లెక్క ఉండదు. బానిసల కాలంలో, ఇంకా 'జీతం' పద్ధతే లేదు. వాళ్ళు చేసిన శ్రమకి ఎంత విలువ వుంటుందో, వాళ్ళ పోషణ కోసం ఎంత విలువ ఖర్చయిందో - ఆ వివరాలేవీ ఉండవు. అలాంటి కాలంలో, శ్రమ దోపిడీని గ్రహించడం ఎంత మేధావికైనా ఎలా సాధ్యం?

**2.** భారత దేశంలో కూడా శ్రమ దోపిడీ వుందా?

**జ :** అయ్యో, ఇదేం ప్రశ్న? భారత దేశంలో, కౌళ్ళూ, వడ్డీలూ, లాభాలూ వున్నాయా లేవా?

# 58. బూర్జువా మాంత్రికుడు!

పెట్టుబడిదారుడు, తను తయారు చేయించిన కొత్త ఉత్పత్తికి ' ధర ' ని నిర్ణయించే పద్ధతి ఎలా వుంటుందో ఇప్పుడు మళ్ళీ చూడాలి.

పని స్థలానికి ' కౌలు' గానీ, పెట్టుబడి మీద ' వడ్డీ - లాభాలు' గానీ, ' కొత్త ఉత్పత్తి' కోసం అయ్యే ఖర్చులు కావు. కౌలునీ, వడ్డీనీ పెట్టుబడిదారుడు, బైటి వాళ్ళకి చెల్లించినా సరే, ఆ ఖర్చులు, ఉత్పత్తి తయారీ కోసం జరిగినవి కావు. కాబట్టి అవి ఉత్పత్తి విలువలోకి చేరేవి కావు.

ఉత్పత్తి తయారైన తర్వాత, దాన్ని అమ్మడానికి, వర్తకుడికి వెళ్ళే ' వర్తక కమిషన్ ' కూడా, ఆ ఉత్పత్తి తయారీకి అవసరమైన అంశం కాదు. ఆ ఖర్చు, ఉత్పత్తి విలువలోకి చేరదు. దీన్ని గురించి తర్వాత పాఠాల్లో ఇంకా కొంత చూస్తాం.

అసలు, ఉత్పత్తి విలువలోకి ఏది చేరుతుందో, ఏది చేరదో, అదంతా పెట్టుబడిదారుడికి తెలీదు. తను తయారు చేయించిన ఉత్పత్తిలో నించే కౌలు రావాలి. వడ్డీ రావాలి. లాభం రావాలి. వర్తక కమిషన్ రావాలి. పన్నులు రావాలి. ఇంకా కూడా కొన్ని ఖర్చులు రావాలి. ఉత్పత్తి తయారవడానికి, ముడి పదార్థాలూ, పని ముట్లూ, ఎంత అత్యవసర అంశాలుగా కనపడతాయో, ' కౌలూ - వడ్డీ లాభాలూ' వంటివన్నీ కూడా పెట్టుబడిదారుడికి అంత అత్యవసర అంశాలుగానే కనపడతాయి. అందుకే, వాటిని కూడా ఉత్పత్తి కోసం అయిన ఖర్చులుగా తన లెక్కల్లో చూపిస్తాడు. చివరికి, పెట్టుబడిదారుడు, తన ఉత్పత్తికి ' ధర ' ని నిర్ణయించే పద్ధతి ఇలా వుంటుంది :

**బట్ట కోసం ఖర్చులు :**
( ఒక్క రోజు లెక్కలు )

| | |
|---|---|
| **1)** ఉత్పత్తి సాధనాల కోసం - | 80రూ.లు |
| **2)** జీతాల కోసం - - - - - | 20 |
| **3)** (1) పని స్థలానికి 'కౌలు'<br>(2) పెట్టుబడి మీద 'వడ్డీ'<br>(3) పెట్టుబడికి 'లాభం'<br>(4) ప్రభుత్వానికి 'పన్నులు<br>(5) వర్తకుడికి కమిషన్<br>(6) కొన్ని ఇతర ఖర్చులు | 20 |
| బట్ట ధర - 120 | |

బట్టని అమ్మారు. 120 డబ్బు వచ్చింది. ఆ డబ్బులో నించి, ఉత్పత్తి సాధనాల 80, వెనక్కి వచ్చింది. ఆ డబ్బుతో, మళ్ళీ కొత్త ఉత్పత్తి సాధనాలు పని స్థలంలోకి వస్తాయి. జీతాల 20 కూడా వెనక్కి వచ్చింది. దానితోనే మళ్ళీ కొత్త జీతాలు ఇవ్వవచ్చు. ఈ 2 అంశాలూ (80 + 20), పెట్టుబడిదారుడి చేతిలో మళ్ళీ మళ్ళీ తిరుగుతూ వుంటాయి. అవి ప్రతీ సారీ వెనక్కి వస్తూ వుంటాయి. ఉత్పత్తి సాధనాల మీద ఒక్క సారి పెడితే చాలు. ఆ విలువే మళ్ళీ మళ్ళీ ఉపయోగపడుతూ వుంటుంది. ఇందులో ఆశ్చర్యం లేదు. కానీ, పెట్టుబడిదారుడి చేతిలో,

జీతాల సంగతి కూడా అంతే. జీతాల మీద ఒక్క సారి 20 డబ్బు పడితే, అదే మళ్ళీ మళ్ళీ వెనక్కి వస్తూ వుంటుంది. జీతాల మీద మళ్ళీ రెండో సారి పెట్టనక్కరలేదు. ( మొదటి సారి పెట్టిన జీతాల 20 కూడా పెట్టుబడిదారుడిది కాదు, అది వేరే సంగతి. )

' ధర ' లో 3 వ అంశంగా వున్న 20, ఎప్పుడూ వెనక్కి రాదు. అది ఎప్పటికప్పుడు పంపకాలైపోతూ వుంటుంది. ఆ 20 లో నించి, కౌలునీ, వడ్డీనీ, లాభాన్నీ, పన్నుల్నీ, వర్తక కమిషన్‌నీ, ఇంకా చాలా వాటిని తియ్యవచ్చు!

ఎంత ఆశ్చర్యం! ' ఉత్పత్తి తయారీ' తో సంబంధం లేని అంశాలన్నీ ఆ ఉత్పత్తిలో నించే బైటికి వస్తాయి! ' ఉత్పత్తి విలువ' లోకి చేరని ఖర్చులన్నిటినీ, ఆ ఉత్పత్తి విలువలో నించే తియ్యడం సాధ్యమవుతుంది. ఆ 20 రాసి, అనేక పేర్లతో పంపకాలై, ఖర్చయిపోతుంది. మళ్ళీ మర్నాడు కొత్త ఉత్పత్తి తయారవుతుంది. దానికి డబ్బు వస్తుంది. అందులో నించి మళ్ళీ కొత్త కౌలూ, కొత్త వడ్డీ, కొత్త లాభం - అన్నీ మళ్ళీ కొత్తగా పంపకాలవుతాయి. ఖర్చయిపోతాయి. ప్రతి రోజూ అలాగే. ఉత్పత్తి విలువలో నించే కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ సంపాదించడం సాధ్యమవుతూనే వుంటుంది.

దీన్ని చూస్తే, పెట్టుబడిదారుడికి ఏమనిపిస్తుంది? " ఉత్పత్తికి ధరని నిర్ణయించడంలో నా లెక్కలన్నీ సరైనవే" అనిపిస్తుంది. '' ఏ ఉత్పత్తి అయినా, భూస్వామికి కౌలునీ, పెట్టుబడిదారుడికి వడ్డీ లాభాల్నీ, చక్కగా అందిస్తుంది'' అనిపిస్తుంది.

కానీ, ' అసలు నిజం' ఏమిటి? పెట్టుబడిదారుడి లెక్కల్లో కొన్ని భాగాలు, తప్పుడు లెక్కలే. బట్ట ఉదాహరణలో, పెట్టుబడిదారుడు చూపించిన ఖర్చుల్లో, 1 వ, 2 వ భాగాలు మాత్రమే సరైన ఖర్చులు. 3 వ భాగంలో చూపించిన అంశాలన్నీ తప్పు లెక్కలు. అవి, బట్ట తయారీతో సంబంధం లేని అంశాలు. అయినా, అవి బట్ట విలువలో నించే బైటికి వచ్చాయంటే, దానికి వేరే కారణం వుంది.

ఏ ఉత్పత్తి అయినా, యజమానీ శ్రామిక సంబంధాల్లో తయారైనప్పుడు, అలాంటి ఉత్పత్తిలో, ' అదనపు శ్రమ' భాగం ఒకటి తప్పకుండా వుంటుంది. అది కూడా శ్రామికుల శ్రమే. యజమాని, శ్రామికుల నించి దోచుకోగలిగే శ్రమ అది. ఉత్పత్తిలో ఆ భాగం వుండబట్టే, దాన్ని అనేక అబద్ధపు పేర్లతో పంచుకోవడం సాధ్యమవుతుంది. అసలు రహస్యం అదీ! శ్రామికుల శ్రమని దోచి పంచుకోవడమే అది.

ఆ పంపకాలన్నీ కలిసిన మొత్తం, ' అదనపు శ్రమ' భాగానికి సరిపోయే లాగ వుంటుంది. బట్ట ఉదాహరణలో అదనపు విలువ 20 య్యే కాబట్టి, కౌలూ - వడ్డీ - లాభాలూ వంటి వన్నీ కలిసి, ఆ 20 నే పంచుకోగలవు. ఉత్పత్తి సాధనాల 80 లో నించి గానీ, జీతాల 20 లో నించి గానీ, ఎవరూ ఏమీ లాగలేరు.

యజమానులు, శ్రామికుల నించి కొంత శ్రమని లాగడం, వేల సంవత్సరాల నించీ, బానిస యజమానుల కాలం నించీ సాగుతోంది. భూస్వాములందరూ, పెట్టుబడిదారులందరూ చేస్తున్నదంతా ఇదే.

ఏ సరుకుని తయారుచేయించడం

అయినా, ఒక ' పరిశ్రమే'. ' బట్ట' ని చేయిస్తే అది బట్ట పరిశ్రమ. సారాలు చేయిస్తే, అది ' సారా పరిశ్రమ'. తుపాకులు చేయిస్తే, అది ' తుపాకీ పరిశ్రమ'. బస్సుల్నీ, రైళ్ళనీ తయారుచేయిస్తే, అది ఒక పరిశ్రమ, డ్రైవర్లని పెట్టి వాటిని నడిపించే పనులు చేయిస్తే, అది ఇంకో పరిశ్రమ. ఏ సరుకుని చేయించినా ఒక పరిశ్రమే. ఆఖరికి, పెట్టుబడిదారుడు వ్యవసాయం చేయిస్తే అది, ' వ్యవసాయ పరిశ్రమ.'

పెట్టుబడిని ఏ పరిశ్రమలో పెట్టినా ఒకటే. అది వెనక్కి వస్తూ, తన వెంట ' అదనపు విలువ' ని తీసుకురావాలి. దాన్ని అందుకుని పంచుకునే బృందాలు సిద్ధంగా వుంటాయి.

పెట్టుబడిని, ఏ వ్యాపారంలో పెట్టినా, ' వడ్డీ వ్యాపారం' లో పెట్టినా, ' సరుకుల్ని అమ్మే వర్తకం' లో పెట్టినా, ఎక్కడ పెట్టినా, ఆ వ్యక్తి పెట్టుబడిదారుడే. కానీ, ' సరుకుల్ని ఉత్పత్తి చేయించే' పెట్టుబడి దారుడికి, ' బూర్జువా' అని ఒక ప్రత్యేకమైన పేరు వుంటుంది. ఈ బూర్జువా బైల్దేరినప్పటినించే ' పెట్టుబడిదారీ విధానం' ప్రారంభం. ఈ విధానంలో, బూర్జువాయే, శ్రామికుల



నించి ' అదనపు విలువ' ని లాగ గలిగే మాంత్రికుడు! ఆ విలువని, అందరికీ డబ్బుగా అందించగలిగే దాన కర్ణుడు!

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. పెట్టుబడిదారుడి పరిశ్రమలో తయారయ్యే ఉత్పత్తి స్వంత వాడకానికా, పూర్తిగా అమ్మకానికా, కొంత వాడకానికీ - కొంత అమ్మకానికీనా?

**జ** : పూర్తిగా అమ్మకానికే. ఆ పరిశ్రమ ఉద్దేశ్యమే అమ్మకం. పరిశ్రమలో తయారయ్యే వేల యూనిట్ల సరుకులో 1, 2 యూనిట్లని స్వంతానికి వాడినా, అది లెక్కలోకి రాదు.

**2**. స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా తమ ఉత్పత్తిలో కొంత భాగాన్ని అమ్ముకుంటారు కదా? కుండల రామయ్య, కొన్ని కుండల్ని అమ్ముకుంటాడు. చెప్పుల సోమయ్య కూడా కొన్నిటిని అమ్ముకుంటాడు, పెట్టుబడిదారుడూ అదే చేస్తాడు. పెట్టుబడిదారుడు సరుకుని అమ్మకం కోసమే చేయిస్తాడు - అనవచ్చునా?

**జ** : ' అనవచ్చునా' కాదు ; అలాగే అనాలి. కుండల రామయ్య కొన్ని కుండల్ని అమ్మినా, వాటితో చెప్పులూ, ధాన్యమూ వంటి వాటిని తెచ్చుకుని, వాటిని కూడా పోషణ కోసమే వాడేసుకుంటాడు. కుండల రామయ్య లాంటి స్వతంత్ర ఉత్పత్తిదారుడి శ్రమ, అత్యల్పంగా ఉంటుంది. దానిలో నించి, పోషణ కోసం పోగా మిగిలే డబ్బు, అతి స్వల్పం. కానీ, పెట్టుబడిదారుడి సరుకు సంగతి అలా కాదు. అది డజన్ల - వందల - వేల కార్మికుల శ్రమతో తయారవుతుంది. ఆ సరుకు వందల, వేల టన్నుల

→

పరిమాణంలో వుంటుంది. రోజూ లక్ష పత్రికలు ప్రింటు చేయించే పెట్టుబడిదారుడు, తన స్వంతానికి ఎన్ని పత్రికలు వాడతాడు? రోజూ 100 టన్నుల సిమ్మెంటుని ఉత్పత్తి చేయించేవాడు, రోజూ, తన స్వంతానికి ఎంత సిమ్మెంటు వాడతాడు? రోజూ వెయ్యి దుప్పట్లు ఉత్పత్తి చేయించేవాడు, తన స్వంతానికి రోజూ ఎన్ని కొత్త దుప్పట్లు వాడతాడు? - కొన్ని ఉత్పత్తులు అసలు, కుటుంబంలో వాడకానికి పనికిరావు. ఏ సబ్బుల లాంటి వాటినో, రోజూ ఒకటి వాడినా, రోజూ తయారయ్యే 10 వేల సబ్బుల్లోంచి ఒక్క సబ్బుని వాడితే, అది లెక్కలోకి రాదు. పెట్టుబడిదారీ సరుకు అంతా, అమ్మకానికే. దాని వల్ల 'లాభం' వస్తుంది. ఆ లాభం డబ్బుతో, స్వంత పోషణ కోసం కావలసిన సరుకులన్నీ కొనాలి. ఆ పోషణ కోసం ఎంత విలాసంగా వాడినా, ఇంకా డబ్బు కుప్పతెప్పలుగా మిగులుతుంది. దానితో, 'పెట్టుబడి' పెరుగుతుంది. పెరిగిన పెట్టుబడి మరింత లాభాన్ని తెస్తుంది. స్వతంత్ర ఉత్పత్తిదారుడి సరుకు అమ్మకానికీ, పెట్టుబడిదారుడి సరుకు అమ్మకానికీ, స్వభావాల్లో సంబంధమే ఉండదు. మొదటిది - స్వంత పోషణ కోసం. రెండోది - డబ్బు రాసిని పెంచుకోవడం కోసం.

**3**. పెట్టుబడిదారీ సరుకులో, 'అదనపు విలువ' ఎంత వుందో చూడాలంటే, ఎలా చూడాలి?

**జ**: పెట్టుబడిదారుడు, సరుకు గురించి లెక్కలు చూపిస్తాడు. అవి మంచి లెక్కలైనా, తప్పు లెక్కలైనా, వాటి ఆధారంతోటే అదనపు విలువని తెలుసుకోవచ్చు. (1) 'ఉత్పత్తి సాధనాల' ఖర్చుగా చూపించిన దాన్నీ, (2) కార్మికుల 'జీతాల' ఖర్చుగా చూపించిన దాన్నీ - ఈ రెంటినీ కలపాలి. ఇవి మాత్రమే సరుకుకి విలువగా చేరే ఖర్చులు. ఇవి గాక, మిగతా ఖర్చులేవీ సరుకు కోసం అవసరమయ్యేవి కావు. కౌలూ - వడ్డీ - లాభం - ఇంకా చాలా పేర్లు కనపడతాయి. అవి అన్నీ కలిపితే ఆ మొత్తమే, అదనపు విలువ. పెట్టుబడిదారుడు తీసుకునే భారీ జీతంలో నించి కూడా చాలా భాగాన్ని అదనపు విలువలోకి కలపాలి. పెట్టుబడిదారుడి లెక్కలు మన ముందు వుంటే, అదనపు విలువని తేలిగ్గా తెలుసుకోవచ్చు. ఉత్పత్తి సాధనాల కోసం చూపించిన లెక్కల్లో చాలా అబద్దపు ధరలు కనపడితే, నిజమైన ధరల్ని సంపాదించవచ్చు. ఆ అబద్దపు ధరల్లో నించి కూడా కొన్ని భాగాల్ని, అదనపు విలువ లోకే చేర్చాలి.

**4**. పెట్టుబడిదారుల్లో మంచివాళ్ళే వుండరా?

**జ**: యజమానుల్లో 'మంచి తనం' అంటే, కొంచెం 'దయ' గల గుణం. బానిస యజమానుల్లోనూ మంచి వాళ్ళు వుంటారు. అయినా, ఆ యజమాని కూడా బానిసల శ్రమ తోనే జీవిస్తాడు. తన స్వంత శ్రమతో కాదు. బానిసల్ని అమ్ముతాడు, కొంటాడు. వాళ్ళని కొంచెం దయగా చూస్తాడు. భూస్వాముల్లోనూ మంచి వాళ్ళు వుంటారు. అయినా, కౌలు రైతుల శ్రమలతోనే జీవిస్తాడు. తన శ్రమతో కాదు. కౌళ్ళ వసూలులో కొంచెం దయ చూపిస్తాడు. పెట్టుబడిదారుల్లోనూ మంచి వాళ్ళు వుంటారు. అయినా, కార్మికుల అదనపు విలువతోనే జీవిస్తారు. కాకపోతే, పని స్థలాల్లో, కార్మికుల కోసం, మంచి నీళ్ళ ఏర్పాట్లూ అవీ చేయిస్తాడు. యజమానీ శ్రామిక సంబంధాల్లో, యజమాని దయకి, అంత కన్నా అర్థం ఏమీ వుండదు. మంచి వాడు కూడా శ్రమ దోపిడీ మీదే జీవిస్తాడు; ఆస్తి సంపాదిస్తాడు. **H**

# 59. 'ధర' గురించి ప్రధాన సందేహం!

ధర ని ( విలువ ని ) అర్థం చేసుకోవడంలో అనేక సందేహాలు వస్తాయి.

' ధర ', అనేక ప్రత్యేక సందర్భాల మీద ఆధారపడి కొంత ఇటూ అటూ మారుతూ కూడా వుంటుంది. కాబట్టి, 'ధర' ని అర్థం చేసుకోవడానికి ఆ పరిస్తితులు మరీ గందరగోళ పరుస్తాయి. కానీ, ఏ అంశాన్ని అర్థం చేసుకునేటప్పుడైనా, మొదట సమస్త పరిస్తితులకూ వర్తించే దాన్ని ( జనరల్ పరిస్తితిని ) అర్థం చేసుకోవాలి. దాని మీద ప్రత్యేక పరిస్తితులు కలుస్తాయి.

> ' ధర ' గురించి సాధారణంగా వచ్చే సందేహం ఒకటి వుంటుంది. కార్మికులకు జీతంగా వారి ' శ్రమ విలువ అంతా' ఇచ్చేసి, ఆ పైన ' కొంత ఎక్కువని ఊరికే వేసుకుంటే' తప్పేమిటి? - అనే సందేహం!

దీన్ని ఒక ఉదాహరణతో చూడాలి.

చొక్కా సంగతి తీసుకుందాం. దానికి ఉత్పత్తి సాధనాల విలువ 80. కార్మికుల జీతం 20. అదనపు విలువ 20. మొత్తం 120. అయితే, పెట్టుబడిదారుడు, కార్మికులకు జీతంగా 20 ని గాక, మొత్తం 40 నీ ఇచ్చేస్తాడనుకుందాం. ( వెంటనే ఇస్తాడని కాదు; సరుకు అమ్మకం తర్వాతే ఇస్తాడు. ) కార్మికుల శ్రమ విలువని అంతా ఇచ్చేసి, దాని మీద ఇంకో 20 ని ఊరికే వేసుకుని, ఆ సరుకుని, 120 + 20 = 140 కి అమ్ముతాడనుకుందాం. పెట్టుబడిదారుడు, ఆ ' ఊరికే వేసుకున్న 20' లో నించే కౌలూ వడ్డీల్నీ చెల్లించి, తన లాభాన్ని తీసుకుంటాడు. ఊరికే వేసుకున్న 20, కార్మికుల ' అదనపు శ్రమ' ఎలా అవుతుంది? కార్మికుల 40 శ్రమ విలువలో నించి కొంత ఇవ్వకపోతే అది అదనపు శ్రమ అవుతుంది గానీ, 40 ని పూర్తిగా ఇచ్చేస్తే, కార్మికుల అదనపు శ్రమ ఇంకా ఎలా మిగులుతుంది? - ఇదీ ప్రశ్న! దీనికి జవాబు చెప్పుకోలేకపోతే, ' విలువ' గురించి ఇంత వరకూ చదివింది ఏమీ అర్థం కాలేదని అర్థం. కాబట్టి, ఈ జవాబుని సరిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి.

**జవాబు** : చొక్కా ఉదాహరణలో, కార్మికుల శ్రమ విలువ 40 - అని, ఎప్పుడు తేలింది? - ఆ సరుకు విలువ 120 గా ఉన్నప్పుడు! ఆ 120 లో, ఉత్పత్తి సాధనాల విలువ 80 గా ఉన్నప్పుడు! పాత శ్రమ 80 అవడం వల్ల, కొత్త శ్రమ 40 అయింది. ఆ 120 విలువ గల సరుకు మీద, కొత్త శ్రమ ఏదైనా చేరితే, ( 120 విలువ గల చొక్కా మీద ఎంబ్రాయిడరీ పని లాంటిది ఏదైనా జరిగితే ), ఆ 120 విలువ పెరుగుతుంది. కానీ, ఆ సరుకు మీద ఏ కొత్త శ్రమా జరగకుండానే, ఆ 120 విలువని, 140 గా, నిష్కారణంగా ( కారణం లేకుండా ), పెంచి అమ్మగలిగితే, అది ఎప్పుడైనా ఎక్కడైనా జరిగే ' వ్యాపార మోసం' మాత్రమే అవుతుంది. అది ఒక

ప్రత్యేక సందర్భం మాత్రమే అవుతుంది. వ్యాపార మోసాలు, వీలైనప్పుడల్లా, తక్కువ స్థాయి లోనో, ఎక్కువ స్థాయి లోనో జరుగు తూనే వుంటాయి. అలాంటి మోసం జరిగి నప్పుడు, ఆ వ్యాపారికి, ఆ సరుకు ద్వారా, అసలు రావలసిన లాభం కన్నా ఎక్కువ లాభమే వస్తుంది. ఆ ఎక్కువ లాభాన్ని, 'సెకండరీ లాభం' అనాలి. ఆ రెండో లాభం, ఆ సరుకుని కొన్న వారి దగ్గిర్నించి వస్తుంది. వ్యాపార మోసాలు జరిగినప్పు డల్లా, ఆ సరుకుల్ని కొన్న వాళ్ళ డబ్బే, అసలు కన్నా ఎక్కువగా పోతూ వుంటుంది.

అయితే, 'అసలు విలువ మీద ఊరికే ఎక్కువని వేసుకోవడం' అనే పని, వ్యాపార మోసం వంటిది కాకుండా, సరుకుని ఉత్పత్తి చేయించే పెట్టుబడిదారులే చేస్తే, 'విలువ' సంగతి ఎలా మారుతుందో ఇప్పుడు చూడాలి. 'అసలు విలువ' మీద ఊరికే ఎక్కువ వేసుకోవడం, ఒక్క శాఖలో ఒక్క పెట్టుబడిదారుడే చేస్తాడా, ఆ శాఖలో పెట్టుబడిదారులందరూ చేస్తారా, మొత్తం అన్ని శాఖల్లోనూ అందరూ చేస్తారా? - మొదట ఇది తేల్చుకోవాలి.

ఆ పని ఒక్క పెట్టుబడిదారుడే చెయ్యా లంటే, అది అసాధ్యం. ఒక శాఖలో పెట్టు బడిదారులందరూ చెయ్యాలన్నా అదీ అసాధ్యమే. మొత్తం అన్ని శాఖల్లోనూ, పెట్టుబడిదారులందరూ ధరల్ని అలా పెంచాలనుకుంటే, అది సాధ్యమే. కానీ, అందరూ చేస్తే, ఆ మార్పు, అసలు జరగని దానితో సమానం అవుతుంది. అంటే, 'అసలు విలువ' మీద కొంత ఎక్కువని ఊరికే చేర్చడం సాధ్యమే కాదని దీని అర్థం.

**ఆ పని ఒక్క పెట్టుబడిదారుడే చేస్తే :**

చొక్కాల శాఖలో, ఎవరో ఒక్క పెట్టు బడిదారుడే, 120 గా వుండే చొక్కా విలువని 140గా పెంచితే, ఆ పెంచిన విలువతో ఆ సరుకుని ఆ పెట్టుబడిదారుడు అమ్మలేడు. ఎందుకంటే, ఆ శాఖలో ఇతర పెట్టుబడి దారులందరూ అదే రకం చొక్కాల్ని 120 కే అమ్ముతారు కాబట్టి. అంటే, సరుకు విలువని నిష్కారణంగా పెంచడం, ఏ విడి పెట్టుబడిదారుడికీ సాధ్యం కాదు.

**ఆ పని, ఒక శాఖలో అందరూ చేస్తే :**

ఒక శాఖలో పెట్టుబడిదారు లందరూ కూడబలుక్కున్నా, 120 ని, నిష్కారణంగా పెంచడం సాధ్యం కాదు. ఎందుకంటే, ఆ శాఖకి, ఇతర శాఖల సరుకులతో సంబం ధాలు వుంటాయి. ప్రతీ పెట్టుబడిదారుడూ కేవలం తన సరుకుల్ని అమ్మే అమ్మకం దారుడే కాదు ; ఇతర శాఖల నించి ఉత్పత్తి సాధనాల్ని కొనవలసిన కొనుగోలుదారుడిగా కూడా వుంటాడు. చొక్కాల పెట్టుబడి దారుడు, తన సరుకు తయారీ కోసం ఉత్పత్తి సాధనాల్ని, అనేక ఇతర శాఖల నించీ కొనాలి. సరుకు ధరని నిష్కారణంగా పెంచే హక్కు ఒక శాఖలో వాళ్ళకు వుంటే, అదే హక్కు అన్ని శాఖలకూ వుంటుంది. ఒక పెట్టుబడిదారుడికి వర్తించే సూత్రం, అన్ని శాఖల పెట్టుబడిదార్లకూ వర్తిస్తుంది.

ఒక శాఖలో పెట్టుబడిదారుడు, తన సరుకు విలువని, తన ఇష్టప్రకారం, 50% పెంచి అమ్మితే, అతను కొనవలసిన ఉత్పత్తి సాధనాల్నీ, తన పోషణ వస్తువుల్నీ అన్నిటినీ, 50% పెరిగిన ధరలతో కొనాలి.

ఒక్క శాఖకే ప్రత్యేక సూత్రాలూ, ప్రత్యేక

హక్కులూ వుండవు కాబట్టి, 'లేని విలువ' ని వేసుకుని ధరని పెంచడం ఒక్క శాఖకే సాధ్యం కాదు.

**ఆ పని, అన్ని శాఖలూ చేస్తే :**

పెట్టుబడిదారులందరూ కూడబలుక్కుంటే, ధరల్ని నిష్కారణంగా పెంచడం సాధ్యమే. దీనికీ ఒక సమస్య వుంటుంది. సరుకుల్ని కొనే వాళ్ళందరూ పెట్టుబడిదారులే కాదు; కార్మికులు కూడా. కార్మికులకు జీతాలు పెరగకుండా, సరుకుల ధరలు మాత్రమే పెరిగితే, వాటిని కార్మికులు కొనలేరు. ఆ సరుకుల్ని అమ్మడం సాధ్యం కాదు. అయినప్పటికీ, అన్ని శాఖల పెట్టుబడిదారులూ కూడబలుక్కుని, ''అందరం 10% చొప్పున ధరల్ని పెంచుదాం'' అనుకుంటే, అలాగే చెయ్యవచ్చు. అప్పుడు ప్రతి పెట్టుబడిదారుడూ, తన సరుకుని 10% ఎక్కువకి అమ్మి, ఇతర పెట్టుబడిదారుల నించి కొనే ఉత్పత్తి సాధనాల్నీ, తన పోషణ వస్తువుల్నీ - విలాస వస్తువుల్నీ అన్నిటినీ, 10% ఎక్కువతో కొనాలి. అంటే, ఆ మార్పు అసలు జరగని దానితో సమానం అవుతుంది. అన్ని శాఖలూ విలువని నిష్కారణంగా పెంచితే ఏం జరుగుతుందో ఇప్పుడు చూడాలి.

చొక్కాకి నిజమైన విలువ 120. దానికి ఇంకో 20 లేని విలువని కలపాలంటే, మొదట అది ఎంత శాతం పెరిగిందో చూడాలి. ఎందుకంటే, ప్రతీ పెట్టుబడిదారుడూ ఆ లెక్కనే తన విలువని పెంచుకుంటాడు కాబట్టి, ఆ లేని విలువ శాతాన్ని చూడాలి.

120 కి, ఇంకో 20ని కలిపితే,
100 కి...................... ఎంత?

$$\frac{20}{120} \times 100 = 17\%.$$

ప్రతి పెట్టుబడిదారుడూ, ఈ 17% లెక్కనే, లేని విలువని కలుపుతాడు అనుకోవాలి. ఉత్పత్తి సాధనాల శాఖల్లోనూ, కార్మికుల పోషణ వస్తువుల శాఖల్లోనూ, ప్రతీ చోటా ఈ లెక్కనే ధరలు ఏర్పడతాయి.

చొక్కా విషయంలో 120 అసలు విలువ, 140 గా పెరిగినప్పుడు, 120 లో వున్న అంతర్గత అంశాలు కూడా పెరుగుతాయి. చొక్కాలో ఉత్పత్తి సాధనాల విలువ ఇప్పుడు 80 కాదు ; అది, 17% లెక్కతో పెరిగి, 93 అవుతుంది. అలాగే, కార్మికుల శ్రమ విలువ ఇప్పుడు 40 కాదు ; అది కూడా అలాగే పెరిగి, 47 అవుతుంది. ఆ 2 అంశాలూ కలిపి, 93 + 47 = 140. చొక్కాని 140 కి అమ్మి, అందులో నించి, ఉత్పత్తి సాధనాల 93 ని వెనక్కి తీస్తే, కార్మికుల శ్రమ విలువ 47. అంటే, చొక్కా విలువని 140 గా పెంచినప్పుడు, కార్మికుల శ్రమ నంతా కార్మికులకు ఇవ్వాలంటే, అప్పుడు ఇవ్వవలసింది 40 కాదు ; 47.

చొక్కా విలువ 140 గా పెరిగినప్పుడు, కూడా అందులో, 'లేని విలువ' అనేది వుండదు. 140 అంతా, వున్న విలువే.

ఉత్పత్తి సాధనాల కోసం 93 పెట్టి, కార్మికుల కోసం 47 ఇస్తే, ఇంకా మిగిలేది ఏమిటి? 140 లో నించి పెట్టుబడిదారుడు 20 ని తీసుకోవడం ఎలా సాధ్యం? 140 లో, 'లేని విలువ' కి చోటు ఏది? అంటే,

అసలు విలువని నిష్కారణంగా పెంచడం వల్ల ఏం జరిగింది? ఆ పెరిగిన విలువే అసలు విలువ అయిపోయింది! అసలు విలువకి రూపం మారింది. 120 అనే సంఖ్య, 140 అనే సంఖ్యగా మారింది, అంతే. 120 లో, కౌలూ - వడ్డీ - లాభాలకు చోటు లేనట్టే, పెరిగిన 140 లో కూడా ఆ అంశాలకు చోటు వుండదు. 140 లో నించి కూడా వాటిని లాగాలంటే, కార్మికుల శ్రమ విలువ అయిన 47 లో నించి, కొంత అదనపు విలువని సంపాదించగలగాలి. అంటే, 47 లో కొంత భాగానికి చెల్లించకుండా వుండాలి.

పోనీ, కార్మికులకు 47 ని పూర్తిగా చెల్లించేసి, ఆ 140 విలువ మీద ఇంకో 30 ని ఊరికే వేసుకుని, సరుకు విలువని 170 గా పెంచితే? ఆ 170 లో నించే పెట్టుబడిదారుడు, 30 అదనపు విలువని తీసుకుంటే? - అది మళ్ళీ పాత కథే అవుతుంది. ఆ పెరిగిన 170 య్యే అసలు విలువ అయిపోతుంది.

'అసలు విలువ' మీద, కొంత లేని విలువని ఊరికే వేసుకోవడం' అనేది, ఎంత భ్రమో తెలుసుకోకపోతే, విలువ గురించి 'అ ఆ' లు అయినా తెలిసినట్టు కాదు. 'విలువ' అనేది, (1) పాత శ్రమ ద్వారానూ, (2) కొత్త శ్రమ ద్వారానూ - ఈ 2 అంశాల ద్వారా మాత్రమే చేరుతుంది.

140 ని నిష్కారణంగా 170 గా పెంచినప్పుడు, ఉత్పత్తి సాధనాల విలువ 93 కన్నా పెరుగుతుంది. కార్మికుల శ్రమ విలువ కూడా 47 కన్నా పెరుగుతుంది. ఆ పాత - కొత్త శ్రమలు రెండూ కలిసే 170 అవుతుంది. కార్మికుల శ్రమ నంతా కార్మికులకు ఇవ్వాలంటే, ఇప్పుడు ఇవ్వవలసింది 47 కాదు ; ఇంకా ఎక్కువ ఇవ్వాలి. అప్పుడు, ఆ సరుకులో నించి, పెట్టుబడిదారుడు వేసుకున్న 'లేని విలువ' ని తీసుకోవడానికి అవకాశమే వుండదు. 170 అంతా ఉన్న విలువే అవుతుంది.

'చొక్కా'కి బదులు, 'ధాన్యం' ఉదాహరణని తీసుకుంటే, అందులో భాగాలు తేలిగ్గా తెలుస్తాయి. ఒక బస్తా ధాన్యం విలువ 120. అందులో, ఉత్పత్తి సాధనాల భాగం 80 + జీతాల భాగం 20 + అదనపు విలువ 20 = 120. ఈ ధాన్యం, ఉత్పత్తి సాధనాల భాగానికీ, శ్రామికుల భాగానికీ మాత్రమే చెందాలి. కానీ, అదనపు విలువ భాగానికి తప్పనిసరిగా ఆ ధాన్యంలో నించి 4 వ వంతు ధాన్యం పోతుంది. ఆ భాగాన్ని ఆ ధాన్యం కోసం ఏ శ్రమా చెయ్యని వాళ్ళు తింటారు.

ఆ ధాన్యం విలువని 120 గా గాక, దాని మీద ఇంకో 20 ని వూరికే కలిపి, దాన్ని 140 గా పెంచి అమ్మితే, ఆ 140 విలువ కూడా ఉత్పత్తి సాధనాల భాగానికీ, శ్రామికుల భాగానికీ మాత్రమే అందాలి కదా? కానీ, ఆ 140 కూడా 3 భాగాలు అవుతుంది. ఊరికే వేసుకున్న 20 భాగానికి కూడా, ఆ ధాన్యంలో నించే, కొంత భాగం వస్తుంది. దాన్ని, ఆ ధాన్యం కోసం ఏ శ్రమా చెయ్యని వాళ్ళు తింటారు.

ఊరికే వేసుకున్న విలువ, ఆ ధాన్యంలో భాగాన్ని తీసుకోకుండా వుండదు. అది కూడా, ఆ సరుకులో నించే కొంత భాగాన్ని లాగుతుంది. 'కొంత విలువని ఊరికే వేసుకోవడం' అనేది, తయారై సిద్ధంగా

వున్న సరుకుల మీదే జరుగుతుంది గానీ, సరుకులతో సంబంధం లేకుండా, గాలిలో జరగదు. ఊరికే వేసుకున్న విలువ భాగానికి కూడా సరుకుల రాసిలో నించే కొంత భాగం వెళ్ళిపోతూ వుంటుంది.

సరుకు విలువని, ఎన్ని రకాలుగా పెంచినా, అదే ' అసలు విలువ' అయి పోతూ వుంటుంది. అది, పాత - కొత్త శ్రమలే, ఆ 2 అంశాలే కలిసినది అవుతుంది.

పెట్టుబడిదారుడు, ఉత్పత్తి సాధనాల ఖర్చుని అయితే, పూర్తిగా పెట్టకుండా తప్పించుకోవడం సాధ్యం కాదు. సూది విరిగితే, కొత్త సూదిని తెచ్చే దాకా పని ఆగిపోయి వుంటుంది. సూది కోసం పెట్టవలసిన ఖర్చులో అణువంత భాగాన్ని కూడా తప్పించుకోలేడు. అలా తప్పించుకుంటే, సూది ఏ పరిశ్రమలో తయారు కావాలో, అక్కడ తయారు కాదు. కార్మికుల విషయంలోనే కొంత శ్రమకి చెల్లించకుండా ఎగ్గొట్టడం సాధ్యం. సరుకు విలువలో, ఆ చెల్లించని భాగం కొంత వుంటుంది కాబట్టే, పెట్టుబడిదారుడు అనేక తప్పుడు పేర్లతో కొంత కొంత వేసుకోగలుగుతాడు. అలా వేసుకునేది, 'లేని విలువ' కాదు, ఉన్న విలువే. పెట్టుబడిదారుడు, ఖర్చుల మీద 20 విలువని వేసుకున్నాడంటే, ఆ సరుకు కోసం, ఆ ఖర్చులే గాక, ఆ 20 శ్రమ కూడా జరిగి వుందన్నమాట! అందుకే ధర లోకి ఆ 20 ని కూడా కలపడం సాధ్యమవుతుంది. - 'విలువ' విషయం సరిగా అర్థం చేసుకుంటే, " లేని విలువని వేసుకుంటే, అది కార్మికుల అదనపు విలువ ఎలా అవుతుంది" అనే ప్రశ్న రాదు. లేని విలువని కలపడం సాధ్యమే కాదని తెలుస్తుంది. ఆ 'లేని విలువ' గా వున్నదే అదనపు విలువ అని తెలుస్తుంది.

ఒక సరుకు ధర ఎంత అనే ప్రశ్న ముఖ్యం కాదు. ఆ ధరలో నించి, కౌలునీ వడ్డీల్నీ చెల్లించడమూ, చివరికి లాభాన్ని తీసుకోవడమూ సాధ్యమైందంటే, ఆ ధరలో అదనపు విలువ భాగం లేకపోతే అది సాధ్యం కాదు. కౌళ్ళూ, వడ్డీ, లాభాలూ వున్న చోటల్లా అదనపు విలువ వుందని అర్థం. ఆ పేర్లని మార్చేసి వేరే పేర్లు పెడితే, ఆ పేర్లని కూడా పరిశీలించి చూడాలి.

ధర గురించి తెలుసుకునేటప్పుడు, ఉత్పత్తిసాధనాల విలువ ఎలా బదిలీ అవుతుందో కూడా ఎంతో స్పష్టంగా అర్థం చేసుకోవాలి. కానీ దాన్ని చూడాలంటే, "ఉత్పాదక - అనుత్పాదక శ్రమలు" అనే విషయాలు తెలిసి వుండాలి. కాబట్టి, ఆ శ్రమలకు సంబంధించిన పాఠం ("ఉత్పత్తి శక్తి" పేరుతో వున్న పాఠం ) అయిన తర్వాతే, " ఉత్పత్తి సాధనాల విలువ బదిలీ" సంగతి చూస్తాం.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. పెట్టుబడిదారుడు, సరుకుకి ధరని నిర్ణయించేటప్పుడు, తప్పకుండా ' లాభం' పేరుతో కొంత వేసుకుంటాడు. దాన్ని తీసుకోగలుగుతాడు కూడా. సరుకులో ' లాభం' అనేది లేకపోతే, పెట్టుబడిదారుడు సరుకులో నించి దాన్ని ఎలా తీసుకోగలుగుతున్నాడు?

**జ** : సరుకులో వున్నది ' అదనపు విలువ' భాగం. దాన్నే లాభం పేరుతో తీసుకోగలుగుతాడు.

→

పెట్టుబడిదారుడు తీసుకునేది, సరుకులో వున్న విలువనే. లేని విలువని కాదు.

**2**. పెట్టుబడిదారుడు 'లాభం' పేరుతో ఎంత విలువని కలిపినా, అది ఉన్న విలువేనా?

**జ :** పెట్టుబడిదారుడు నిర్ణయించిన ధర తోనే ఆ సరుకు అమ్ముడుపోతే, అది ఉన్న విలువే. కానీ, ఇక్కడ ఒక మాట చెప్పాలి. 'ధర' ల విషయంలో, ఈ పుస్తకంలో చూసేది చాలదు. దీన్ని 'కాపిటల్ - పరిచయం' లో, 'జనరల్ లాభం రేటు' చాప్టరులో చూడాలి. అక్కడే అనేక సందేహాలకు జవాబులు దొరుకుతాయి. అదంతా ఇక్కడ సాధ్యం కాదు.

**3**. పెట్టుబడిదారుడు 20% లాభం వేసుకున్నాడు. ఇతర పెట్టుబడిదారులందరూ అలాగే లాభం తీసుకోగలిగారు. కానీ, ఒక పెట్టుబడిదారుడు, సరుకుని సరిగా అమ్మలేక 10% లాభం మాత్రమే తీసుకున్నాడు. అతను నష్టపోయినట్టేనా?

**జ :** కాదు. నష్టపోవడం అంటే, ఒక్క శాతం అయినా లాభం రాకపోతేనే, అది నష్టపోవడం. 10% లాభం వచ్చిందంటే, అది నష్టపోవడం కాదు. ఇతరులకు వచ్చినంత లాభం ఇతనికి రాలేదంటే, ఇతనికి 'లాభం తగ్గింది' అని మాత్రమే అర్థం. అయితే, లాభం తగ్గింది అంతే. లాభం తగ్గడమే నష్టం కాబట్టి, ఆ రకంగా అది నష్టమే మరి.

**4**. ఒక పెట్టుబడిదారుడు నిజంగా నష్టపోయాడు. కార్మికులు అదనపు విలువని ఇచ్చినట్టేనా?

**జ :** తప్పకుండా ఇచ్చినట్టే. కార్మికులు, ఆ సరుకు కోసం, వాళ్ళు చెయ్యవలసిన శ్రమ అయితే చేశారు కదా? సరుకుని తయారు చేశారు కదా? ఆ సరుకులోనే అదనపు విలువ ఉంటుంది. అది పెట్టుబడిదారుడికి అందకపోతే, ఆ సరుకుని చవక ధరలతో కొన్నవాళ్ళకి ఆ విలువ అందిందని అర్థం. కార్మికులు శ్రమ చెయ్యడం ఎప్పుడో అయిపోయింది. పెట్టుబడిదారుడు నష్టపోయాడంటే, దానికి వేరే కారణాలు వుంటాయి. కార్మికులు అదనపు శ్రమ చెయ్యలేదని అర్థం కాదు. వాళ్ళ పని దినం లోనే అదనపు శ్రమ కాలం వుంటుంది. పెట్టుబడిదారుడు నష్టపోతే, అది కార్మికుల తప్పు కాదు. దానికి కార్మికుల బాధ్యతేమీ వుండదు.

**5**. కార్మికులు నష్టపోవడం ఎప్పుడు జరుగుతుంది?

**జ :** ఇదేం ప్రశ్న? కార్మికులు నష్టపోవడం రోజూ జరుగుతూనే వుంటుంది కదా? యజమాని, జీతాలు ఇవ్వడం పూర్తిగా ఎగ్గొడితే, అది, పూర్తి నష్టం అవుతుంది.

**6**. ఒక సరుకు ధర 10. దాన్ని అదే ధరతో అమ్మితే దాని వల్ల వర్తకుడికి 2 వర్తక లాభం వస్తుంది. కానీ వర్తకుడు, ఆ సరుకుని ఒక మోసంతో 11 కి అమ్మాడు. దాని వల్ల అతని లాభం 1 పెరిగింది. అతనికి లాభాలు ఏ యే మార్గాల వల్ల వచ్చాయి?

**జ :** సరుకు విలువ 10. దాన్ని ఆ ధరకే అమ్మితే వచ్చే 2 లాభం, ఆ సరుకు ఉత్పత్తి చేసిన →

కార్మికుల అదనపు విలువలో నించి వస్తుంది. ఆ సరుకుని, 10 ధరతో గాక, 11 తో అమ్మి సంపాదించిన 1 లాభం, ఆ సరుకుని కొన్న వ్యక్తి నించి వస్తుంది. ఆ సరుకుని కొన్న వ్యక్తి, కార్మికుడైనా కావచ్చు, పెట్టుబడిదారుడైనా కావచ్చు. - ఆ కొన్న వ్యక్తి, 10 విలువ గల సరుకు కోసం 11 ఇచ్చాడు. 1 ని నష్టపోయాడు. అది వర్తకుడికి లాభం. ఆ సరుకుని కొన్న వ్యక్తి కార్మికుడైతే, అతని పోషణలో నించి 1 తగ్గుతుంది. ఆ కొన్న వ్యక్తి పెట్టుబడిదారుడైతే, అతని లాభంలో నించి 1 తగ్గుతుంది. సరుకుల్ని అసలైన ధరలతో అమ్మడం వల్ల వచ్చే లాభాలు, కార్మికుల అదనపు విలువలలో నించి వస్తాయి. సరుకుల్ని తక్కువగా తూచడమూ, ఎక్కువ ధరని లాగడమూ - వంటి మోసాల ద్వారా వచ్చే లాభాలు, సరుకుల్ని కొన్న వాళ్ళ నించి వస్తాయి.

**7**. పెట్టుబడిదారుడు, 'ఖర్చుల' మీద 'వేసుకునేదాన్ని' 'లాభం' అనాలా, 'అదనపు విలువ' అనాలా?

**జ :** పెట్టుబడిదారుడు దాన్ని 'లాభం' అనే అంటాడు. ఎందుకంటే, కౌలూ - వడ్డీ - పన్నులూ - వర్తక కమిషనూ వంటివన్నీ 'ఖర్చులు' జాబితాలోనే వుంటాయి. ఇక తనకు రావలసింది, తన లాభమే కాబట్టి, 'లాభం' పేరుతోనే ఇంకా కొంత కలుపు తాడు. కానీ, మనం తెలుసుకోవలసింది 'అదనపు విలువ' గురించి. పెట్టుబడిదారుడు చూపించే ఖర్చుల్లో, మనం తీసుకోవలసిన ఖర్చులు రెండే. ఉత్పత్తి సాధనాలూ, కార్మికుల జీతాలూ. మిగిలిన ఖర్చులన్నీ అదనపు విలువే. అందుకే మనం, అదనపు విలువనే లెక్క కడతాం. లాభం అనేది, అదనపు విలువలో కొంత భాగం. మొత్తం అదనపు విలువ అంతా లాభం కాదు.

**8**. పెట్టుబడిదారులు కొన్ని సార్లు నష్టపోతూ వుంటారు కదా? కాబట్టి, 'లాభం' తీసుకోవడంలో తప్పేముంది?

**జ :** పెట్టుబడిదారుడు నష్టపోతే, అది అతని స్వంత శ్రమని నష్టపోవడం కాదు. లాభంగా తీసుకునేది అతని స్వంత శ్రమ కాదు. పెట్టుబడి దారుడి దగ్గిర సరుకుని తయారుచేశాకే కార్మికులు బైటికి వెళ్తారు. వాళ్ళు శ్రమ చెయ్యడం జరిగాకే. ఆ సరుకుని పెట్టుబడిదారుడు సరిగా అమ్ముకోలేకపోతే, అది కార్మికుల నేరం కాదు. పెట్టుబడి దారుడు నష్టపోతాడు కాబట్టి లాభం తీసుకోవచ్చు - అనేది వికృత వాదం. పెట్టుబడి దారుడు లాభపడిన సందర్భంలోనూ, నష్టపోయిన సందర్భంలోనూ, రెండు రకాల సందర్భాల్లోనూ, కార్మికుల అదనపు శ్రమ పోతూ వుంటుంది. అంటే, కార్మికులు అయితే, ఎప్పుడూ నష్టపోతూనే వుంటారు. అసలు, గ్రహించవలసిన విషయం అదీ!

**H**

# 60. 'విలువ' గురించి పరిశోధన
## 2 వేల సంవత్సరాల కిందట ప్రారంభమైంది!

" వస్తువుకి వుండే ' విలువ' అనేది ఏమిటి? వస్తువుని ఇస్తే ' డబ్బు' ఎందుకు వస్తుంది? డబ్బు అంటే ఏమిటి?" అనే ప్రశ్నలు, ఎలాంటి ప్రశ్నలో తెలుసా? ఈ ప్రశ్నలు మనకు ఇవ్వాళ చాలా తేలికైన ప్రశ్నలు. వస్తువుకి వుండే విలువ, దాని కోసం ఖర్చయిన మొత్తం శ్రమే. వస్తువుని ఇస్తే, దాని విలువకి బదులుగానే డబ్బు వస్తుంది. డబ్బు అంటే, తన విలువతో, వస్తువుల విలువల్ని కొలిచే ఏకైక సాధనం. ఈ రకంగా, ఆ ప్రశ్నలకు జవాబులు మనం ఎంతో తేలిగ్గా చెప్పుకోగలం.

కానీ, వెనకటి రోజుల్లో, ఆ ప్రశ్నలు మహా కష్టమైన ప్రశ్నలు. ఆ జవాబులు తెలుసుకోవాలని, అనేక మంది మేధా వులు, ఆలోచించి ఆలోచించి, ఆలోచించి నప్పుడల్లా ఓడిపోతూ వచ్చారు.

' లాభాన్ని' అర్థం చేసుకోవాలని ప్రయ త్నించిన వాళ్ళు కొందరు, వాళ్ళ ఊహలకు ఎలా తోస్తే అలా చెప్పారు.


" పనిముట్లే బోలెడు పనులు చేస్తాయి. వాటి వల్ల ఎంత లాభం అయినా వస్తుంది" అని కొందరూ!

" వస్తువుని అమ్మినప్పుడు, దాన్ని కొనే వాళ్ళే లాభాన్ని కూడా ఇస్తారు" అని కొందరూ!

అలాంటి అవాకులూ చవాకులూ కాకుండా, మంచి మాటలు చెప్పినవాళ్ళు కూడా వున్నారు. వాళ్ళు, ' విలువ' ని అర్థం చేసుకోలేకపోయినా, వాళ్ళకి అర్థమైన ఇతర విషయాల గురించి, ఇక్కడో ముక్కా, అక్కడో ముక్కా మంచి మంచివే చెప్పారు. ఒకాయన చెప్పిన మంచి ముక్కల సాయం తో, ఇంకో ఆయన ఇంకా ఆలోచిస్తాడు. ఆలోచన ఎప్పుడూ మంచిది. ఆయన కూడా ఇంకో మంచి ముక్క కనిపెడతాడు.

ఎవరు ఎలాంటి మంచి మాటలు చెప్పినా, ప్రతి వారూ ఇటు తిరిగీ అటు తిరిగీ చివరికి తేల్చేది, " భూమికి కౌలు రావాలి! పెట్టుబడికి వడ్డీ లాభాలు రావాలి!" అంతకన్నా వాళ్ళకి తెలీదు.

ఆ కాలంలో మేధావులందరూ ( ఈ కాలంలో కూడా ), భూస్వాముల నించే నేర్చుకుంటారు. పెట్టుబడిదారుల నించే నేర్చుకుంటారు. వర్తకుల నించే, వడ్డీ వ్యాపారుల నించే నేర్చుకుంటారు. వాళ్ళు చెప్పే మాటలే వీళ్ళు చెపుతారు! సారాం శంలో తేడా ఏమీ వుండదు.



అరిస్టాటిల్



రికార్డో

ఆ రకంగా, ' విలువ' ని తెలుసుకోవా లనే పరిశోధన, గ్రీకు మేధావి అయిన

అరిస్టాటిల్‌తో ప్రారంభమై (క్రీస్తు పూర్వం 384 - 322), ఇంగ్లండు మేధావి అయిన రికార్డో ద్వారా (1772-1823), 2 వేల సంవత్సరాల పాటు సాగింది.

రికార్డో తన వెనకటి వాళ్ళ కన్నా మంచి మాటలు చెప్పాడు. "విలువ అంటే శ్రమే. శ్రమ వల్ల కాకపోతే, విలువ ఎలా వస్తుంది?" అన్నాడు. ఇది చాలా మంచి అవగాహన. దీన్ని ఇంకా సరిగా అర్థం చేసుకుంటే, ఇదే మార్గంలో, 'శ్రమ దోపిడీ' ని పట్టుకోవడం దాకా వెళ్ళవచ్చు. కానీ, రికార్డో ఆ మంచి మాటలు అన్నాడు గానీ, అలా అన్న తర్వాత, ఆయన మళ్ళీ అనుమానాల అగాధంలో పడిపోయాడు. ఆయన చెప్పిన దాని మీద ఆయనకే బోలెడు ప్రశ్నలు వచ్చాయి. "విలువ అనేది శ్రమే అయితే, సరుకులో నించి పెట్టుబడిదారుడి చేతిలోకి 'లాభం' పేరుతో వచ్చే భాగం కూడా శ్రమే అవ్వాలి కదా? పెట్టుబడిదారుడు కూడా శ్రమ చేస్తే, అది 'జీతం'గా వుండాలి గానీ, 'లాభం' గా కూడా ఎందుకు వుంటోంది? లాభం కూడా పెట్టుబడిదారుడి శ్రమేనా?" - ఈ పద్ధతిలో తర్కించుకుంటూ రికార్డో, చాలా ఆశ్చర్యంలో మునిగాడు.

కానీ, కొన్నాళ్ళకి ఆ ఆశ్చర్యం అంతా సర్దుకుంది. "'లాభం' వచ్చేది పెట్టుబడిదారుడికి కాదు, 'పెట్టుబడి'కి కదా? మరి, పెట్టుబడి పెడితే, దానికి 'లాభం' రావలసిందే కదా? లాభం రాకపోతే పెట్టుబడి ఎవరు పెడతారు? ఎవరూ పెట్టుబడి పెట్టకపోతే, ఉత్పత్తులు ఎలా తయారవుతాయి? ఉత్పత్తులు లేకపోతే, మనుషులు ఎలా బతుకుతారు? పెట్టుబడికి లాభం రాకపోతే, అంతా తలకిందులవుతుంది." - ఈ రకంగా రికార్డో, తన తెలివైన సందేహాల్నీ, తన ఆశ్చర్యాల్నీ, తనే అణగ్గొట్టుకున్నాడు. 'శ్రమ దోపిడీ' ని పట్టుకోగలిగే 'సత్యశోధన' ద్వారం దాకా వెళ్ళి, చప్పున వెనక్కి తిరిగాడు. చివరికి, "పెట్టుబడికి లాభం రావలసిందే మరి. లాభం రాకపోతే పెట్టుబడే వుండదు కదా? పెట్టుబడికి లాభం రావాలి కాబట్టి, శ్రామికులకు అందేది తగ్గుతుంది మరి, తప్పదు మరి" అని నిట్టూర్పులతో తేల్చాడు.

"పెట్టుబడికి లాభం రావాలి" అనే విషయంలో, రికార్డో, తన వెనకటి వాళ్ళ కన్నా కొత్త విషయం ఏమీ చెప్పలేదు. కానీ, లాభానికీ, శ్రామికులకు అందే దానికీ, సంబంధం వున్నట్టు చెప్పాడు కాబట్టి, అది అద్భుత పరిశీలన! ఆ ఆధారంతో, ఎంత దూరం అయినా వెళ్ళవచ్చు. చివరికి, 'విలువ' గురించి ఎవరు సరిగా అర్థం చేసుకున్నారో తెలుసా?

# ప్రశ్నలూ - జవాబులూ

**1.** పెట్టుబడిదారుడు, పరిశ్రమల్ని స్థాపించడానికీ, వాటిని నడపడానికీ చాలా శ్రమ చేస్తాడు కదా? అతను శ్రమ చెయ్యడని ఎందుకు అనాలి? అతనికి అందే దాన్ని శ్రమ దోపిడీ అని ఎందుకు అనాలి?

**జ:** శ్రమ చేస్తే, దానికి వచ్చే జీతం తీసుకోవాలి. ఆ జీతానికి సంబంధించిన అదనపు

→

విలువని కూడా తీసుకోవచ్చు. శ్రమ చేస్తే, దాని విలువని తీసుకోవడానికి ఎవరికైనా న్యాయమైన హక్కు వుంటుంది. ' శ్రమ దోపిడీ' అనడం, అతని జీతాన్ని కాదు. పెట్టుబడిదారుడు తీసుకునేది జీతం ఒక్కటే కాదు ; కౌలూ - వడ్డీ - లాభం అన్నీ! శ్రమదోపిడీ అనడం, ఆ ఆదాయాలనే. పెట్టుబడిదారుడు, ' జీతం' గా తీసుకునేది కూడా, ఏదో చిన్నా చితకా జీతం కాదు. ఒక మేనేజర్‌కి ఇచ్చేటంత జీతం అయినా కాదు. పెట్టుబడిదారుడు, దానికి 100 రెట్లు ఎక్కువ జీతం తీసుకుంటాడు. తన జీతాన్ని తనే నిర్ణయించుకుంటాడు. ఆ జీతంలో కూడా చాలా భాగం కార్మికుల అదనపు శ్రమే. " పెట్టుబడిదారుడు శ్రమ చేస్తాడు కదా?" అని అడిగే వాళ్ళకి, " పెట్టుబడిదారుడికి, ' జీతం' ఒక్కటే కాకుండా 'లాభం' కూడా ఎందుకు వస్తోంది?" అనే ప్రశ్న కూడా రావాలి. ఆ ప్రశ్న ఎందుకు రావడం లేదో ఆలోచించాలి.

**2**. ఒక రోజులో, కార్మికులు శ్రమ చెయ్యవలసిన కాలానికీ, స్వతంత్ర ఉత్పత్తి దారులు శ్రమ చెయ్యవలసిన కాలానికీ ఏమైనా తేడా ఉంటుందా?

**జ** : తేడా తప్పకుండా ఉంటుంది. స్వతంత్ర ఉత్పత్తిదారులకు యజమాని ఉండడు. కాబట్టి, తమ పోషణకు సుఖంగా సరిపోయేటంత, శ్రమ చేసుకుంటే చాలు. పోషణ కన్నా ఎక్కువ శ్రమ, ఒక రోజున జరగవచ్చు ; ఇంకో రోజున జరక్కపోవచ్చు. ఎక్కువ శ్రమ జరిగిన రోజున కొన్ని ఎక్కువ ఉత్పత్తి సాధనాలు ఖర్చవుతాయి. దాని వల్ల ఎక్కువ కొత్త ఉత్పత్తి తయారవుతుంది. రోజూ అలాగే జరగాలని రూలు ఉండదు. కానీ, కార్మికుల సంగతి అలా కాదు. వారికి యజమాని ఉంటాడు. యజమాని కోసం కార్మికులు తప్పనిసరిగా ప్రతీ పని దినం లోనూ అదనపు శ్రమ చెయ్యాలి. కార్మికుల పని దినం అదనపు శ్రమ గంటలతో నిర్ణయమైపోయి వుంటుంది. బానిసలూ, కౌలు రైతులూ కూడా అంతే.

**3**. కార్మికులకు సెలవు దినాలు ఉంటాయి. బానిసలకూ, కౌలు రైతులకూ సెలవు దినాలు ఎప్పుడు?

**జ** : బానిసలకు సెలవు లేమిటి? వాళ్ళు రాత్రింబవళ్ళూ పని చెయ్యాలి. చచ్చిపోయినప్పుడే సెలవు! కౌలు రైతుల సంగతా? వాళ్ళు రాత్రుళ్ళయినా కాస్త నిద్రపోతారు కదా?

**4**. బానిసల కాలంలో ఎలాంటి డబ్బు వుండి వుంటుంది?

**జ** : వెండితో, బంగారంతో నాణాలే. కాయితం నోట్లు కాదు.



H

# 61. మేధావుల అజ్ఞానాలు!

'శ్రమ' గురించి సరైన అవ గాహన వెనకటి మేధావులకు లేదు. [ అనేక మందికి, ఈ నాటికీ లేదు. యూనివర్సిటీల ప్రొఫెసర్లకే లేదు. అది వేరే సంగతి. ]

"పనిముట్లు కూడా శ్రమలు చేస్తాయి" అనే తప్పు అవగాహన వెనకటి ఆర్థిక వేత్త లందరికీ వుంది. [ ఈ నాటికీ వుంది. ] అలాంటి అవగాహన వున్న వాళ్ళు, 'పెట్టుబడి కన్నా ఎక్కువగా వచ్చే దాన్ని' ఎలా అర్థం చేసుకుంటారు? ఆ 'ఎక్కువ విలువని పనిముట్లే ఇస్తాయి' అని అర్థం చేసుకుంటారు. ఆ 'ఎక్కువ', శ్రామికుల ద్వారా వస్తుందా? - అనే సందేహం గతంలో ఏ మేధావికీ రాలేదు. "శ్రామికులకు పెట్టుబడిదారుడు జీతాలు ఇచ్చేస్తాడు కదా? వాళ్ళ నించి ఎక్కువ ఎలా వస్తుంది? పనిముట్లే బోలెడు పని చేస్తాయి. ఎంత ఎక్కువ విలువ అయినా వాటి నించి రావలసిందే" అనుకున్నారు.

"భూమి, భూస్వామి ఆస్తే" అని సాధారణ జనం నమ్మినట్టే, మేధావులు కూడా నమ్మేవారు. [ ఇప్పటికీ ప్రొఫెసర్లు కూడా దీన్ని నమ్ముతారు. సమర్థిస్తారు. ] ఇలా నమ్మేవాళ్ళకి, భూస్వాములు కౌళ్ళు తీసుకోవడం ఎంతో సహజంగా, ఎంతో న్యాయంగా, కనపడుతుంది.

వెనకటి మేధావులు, తాము నివసించే ఊళ్ళల్లో, దేన్ని చూస్తే దాన్నే, ఎలా చూస్తే అలాగే, వాటిని సరైన విషయాలుగానే భావించేవారు. "అలాంటి వాళ్ళు మేధావులు ఎలా అవుతారు?" అనే ప్రశ్న వస్తుంది. ఎలా అవుతారంటే, వాళ్ళు కూడా ఒక తర్కంతో చెపుతున్నట్టే మాట్లాడతారు. వాళ్ళ తర్కం ఇలా వుంటుంది : "భూస్వామికి కౌలు వస్తోంది. ఎందుకు వస్తోంది? భూమి, ఆయనదే కాబట్టి వస్తోంది. భూమి లేని వాళ్ళకి కౌలు వస్తోందా? రాదు కదా? భూమి వున్న వాళ్ళకే కౌలు వస్తోంది. కౌలుని చెల్లించే వాళ్ళు, దాన్ని చెల్లించాలి కాబట్టే చెల్లిస్తున్నారు. కాబట్టి, భూమికి కౌలు రావడం సరైనదే. అలా రావడం సరైనది కాబట్టే, అలా జరుగుతోంది!" - వెనకటి మేధావులు ఇలాగే తర్కించారు. ఈ నాటికీ ఇలాగే.

ఇలాంటి మేధావి నమ్మేదానికీ, సాధారణ జనం నమ్మేదానికీ, తేడా ఏమైనా వుందా? - ఏమీ లేదు. భూస్వామి ఎలా అనుకుంటాడో, కౌలు రైతు ఎలా అనుకుంటాడో, ఆ నాటి మేధావి కూడా అలాగే అనుకున్నాడు. "భూమికి కౌలు రావాలి" అనేది గొప్ప తర్కం అయినట్టూ, ఆ తర్కాన్ని తను తెలుసుకున్నట్టూ, ఆ మేధావి భావించాడు.

పెట్టుబడులు పెట్టే వాళ్ళకి లాభాలు రావడం చూశాడు మేధావి. అప్పులు ఇచ్చే వాళ్ళకి వడ్డీలు రావడం చూశాడు మేధావి. అతనికి, అవి అన్నీ సరైనవే. సరైనవి కాబట్టే జరుగుతున్నాయి - అని అతని భావం. లేకపోతే ఎందుకు జరుగుతాయి? సమాజంలో జరుగుతున్నదంతా సరైనదే. యజ

మానితనాలు సరైనవే. సేవకత్వాలూ సరైనవే. సిరి సంపదలూ, పేదరికాలూ, అన్నీ సరైనవే. - ఇవీ, ఆ నాటి మేధావుల తర్కాలూ, అవగాహనలూ!

ఇంకా వెనకటి కాలంలో అయితే, "బానిసలు యజమానుల ఆస్తే" అని బానిస యజమానులు అనుకున్నట్టే, ఆ కాలం నాటి మేధావులు అనుకునేవారు. యజమాని దృష్టికి, బానిసత్వం సరైనదే కాబట్టి, ఆ నాటి మేధావికి కూడా బానిసత్వం సరైనదే. ఆ మేధావి కూడా ఒక బానిస యజమానే.

ఆ తర్వాత నించీ ఈ నాటి వరకూ, మేధావులందరికీ, 'కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ' పూర్తిగా సరైనవే.

కానీ, ఇవన్నీ ఘోరమైన తప్పులు! ఈ తప్పులు, 'తప్పుడు శ్రమ సంబంధాల' వల్లే జరుగుతున్నాయి. ఈ తప్పుల్ని అర్థం చేసుకోగలిగినదీ, శ్రమ దోపిడీ జరుగుతోందని తెలుసుకున్నదీ, ఎవరో తెలుసా?

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. "పనిముట్లు కూడా శ్రమలు చేస్తాయి" అని, మేధావులు ఈ నాటికీ భావిస్తున్నారా?

**జ :** 100 మందిలో 99 మంది, ఈ నాటికీ అలాగే భావిస్తారు. 'నూటికి నూరు మందీ' అనలేము కాబట్టి, '99 మంది' అంటున్నాను. అసలు, మేధావులు అనే వాళ్ళు, వాళ్ళు చదివిన సబ్జెక్టుని తప్ప ఇక దేన్నీ నేర్చుకోరు ; పట్టించుకోరు. లెక్కల మేష్టారు, వడ్డీ లెక్కలు ఎంతో చక్కగా చెపుతారు - బారు వడ్డీలూ, చక్ర వడ్డీలూ - అంటూ. 'వడ్డీ' అంటే ఏమిటో ఆయన కేమాత్రమూ తెలీదు. సైన్సు మేష్టారు, భూమి ఆకర్షణ శక్తిని చక్కగా వర్ణిస్తారు. కానీ, భూమి ఎవరికి వుందో, ఎవరికి లేదో, ఆయనకి పట్టదు. ఏ మేధావికీ, 'యజమానీ సేవక సంబంధాలు' న్యాయమైనవో - అన్యాయమైనవో తెలీదు. ఒక గాయకుడు, విషాద గీతాలు గొప్పగా పాడతాడు. ఒక చిత్రకారుడు, నిరుపేద ప్రజల బొమ్మలు ముచ్చటగా గీస్తాడు. కానీ ఆ విషాదాలూ, ఆ పేదరికాలూ, వాళ్ళని కదిలించవు. పైగా, అవే ఎంతో సహజంగా వారికి కనపడతాయి. తమ పాటలూ, తమ బొమ్మలూ, పెద్ద ధరలతో అమ్ముడైతే చాలు వాళ్ళకి. బహుమతులూ, సన్మానాలూ కావాలి వాళ్ళకి. 'పనిముట్లు శ్రమలు చేస్తాయో లేదో' తెలియాలంటే, భగవద్గీతలు చదివితే పనికిరాదు. 'మార్క్సు - కాపిటల్' చదివితే కళ్ళు తెరుచుకుంటాయి. కానీ, ఈ మేధావులందరూ పెట్టుబడిదారీ పాఠాలు మాత్రమే చదివి ఎదిగినవాళ్ళు. ఈ కళాకారులందరూ, బానిస యజమానుల కాలం నాటి కళల్ని మోసుకుంటూ తిరుగుతోన్నవాళ్ళు. వీరెవరికీ 'తర్కం' నచ్చదు. అసలు ఈ మేధావులు, మేధల్ని ఉపయోగించరు. తమ డిగ్రీ చదువుల్లో ఏం వుంటే దాని దగ్గరే ఆగిపోతారు.

దోపిడీ సమాజాల విద్యలన్నీ, దోపిడీ సంబంధాల్నే కీర్తించే, వాటినే సమర్థించే విద్యలే. కాబట్టి, పెద్ద పెద్ద డిగ్రీలూ, పెద్ద పెద్ద ఉద్యోగాలూ వుండడమే చూసి వాటినే మేధావితనాలుగా భావించకూడదు. యూనివర్సిటీల ప్రొఫెసర్లకి కూడా పనిముట్లకీ, శ్రామికులకూ తేడా ఏమిటో తెలీదు.

→

**2**. భూస్వామి, " భూమి నా ఆస్తి. భూమికి కౌలు రావాలి" అంటాడు. పెట్టుబడిదారుడు, " ఉత్పత్తి సాధనాలు నా ఆస్తి. నాకు వడ్డీ లాభాలు రావాలి" అంటాడు. మేధావులు కూడా అదే అంగీకరిస్తే, భూస్వామి చెప్పేదే, పెట్టుబడిదారుడు చెప్పేదే తిరిగి చెప్పినట్టు అవుతుంది కదా? ఆ విషయాల మీద మేధావుల పరిశీలన ఉండదా?


**జ** : మేధావులు, శ్రామిక వర్గంలో నించి కూడా వుంటారు. దోపిడీ వర్గపు మేధావులకు దోపిడీ మీద ' పరిశీలనలు' చెయ్యవలసిన అవసరం ఎలాగూ ఉండదు. శ్రామిక వర్గపు మేధావులకే ఆ అవసరం ఉంటుంది. వారు, దోపిడీ వల్ల నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలన్నిటినీ భరిస్తూనే వుంటారు. తక్షణ పోరాటాలు చేస్తూనే వుంటారు. కానీ, వారు కూడా ' శ్రమ దోపిడీ' అనే మూలాన్ని పట్టించుకోరు. మానవ సంబంధాల మీద దృష్టి పెట్టరు. పరిశీలనల విషయంలో, అది ఏ వర్గ మేధావుల బాధ్యతగా వుండాలో వాళ్ళు దాన్ని పట్టించుకోరు. ఇంకా ఇప్పటి పరిస్తితి అదే! ఎప్పుడో నేర్చుకుంటారు. ఇంకా ఎప్పుడో! అజ్ఞానానికి మరో పేరు మూఢ నమ్మకం! ఇంకా మూఢ నమ్మకాల్లోనే వున్నారు.

**3**. మేధావులు ఎన్నో మంచి సూచనలు చేస్తారు. పర్యావరణాన్ని పాడు చెయ్య కూడ దంటారు. సమాజంలో అవినీతి వుండకూడదంటారు. మానవ హక్కుల్ని కాపాడా లంటారు. ఇలాంటి ఎన్నో మంచి విషయాలు చెపుతారు. వారు బాధ్యత లేనివారు అవుతారా?

**జ** : ' పర్యావరణాన్ని పాడు చెయ్యకూడదు' అనే వాళ్ళు మొట్ట మొదట, పర్యావరణాన్ని ఎవరు పాడు చేస్తున్నారో తెలుసుకోవాలి. ఉత్పత్తి క్రమాలన్నీ పెట్టుబడిదారుల చేతుల్లో వున్నాయి. పర్యావరణం, పెట్టుబడిదారుల చర్యల వల్ల పాడవుతోందా, కార్మికుల వల్ల పాడవుతోందా అని మొదట ప్రశ్నించుకోవాలి. పెట్టుబడిదారీ విధానం, లాభాన్ని పెంచుకోవడానికి చేసే పనులే ప్రకృతిని ధ్వంసం చేస్తూ వుంటాయి. అలాంటప్పుడు, ' పర్యావరణం, పర్యావరణం' అని మాట్లాడేవాళ్ళు ఏం చెయ్యాలి? పెట్టుబడిదారీ విధానాన్ని అర్థం చేసుకుని దాన్ని విమర్శించాలి. అలాగే, ' అవినీతి' అంటే ఏమిటి? రాజకీయాల్లో వాళ్ళందరూ, పెట్టుబడిదారుల నించి లంచాలు తినడం. పెట్టుబడి దారులు, ఆ లంచాలు దేని కోసం ఇస్తారు? ఎక్కణ్ణించి తెచ్చి ఇస్తారు? స్వంత శ్రమలో నించి తెచ్చి, లక్షలూ - కోట్లూ లంచాలుగా ఇస్తారా? ' అవినీతి' మీద కేకలు వేసే వాళ్ళు, మొదట పెట్టుబడిదారీ విధానం మీద కళ్ళెర్రజెయ్యాలి. అలాగే, ' మానవ హక్కులు' అని మాట్లాడే వాళ్ళు, ఏ మానవులకు హక్కులు లేకుండా ఏ మానవులు చేస్తున్నారో, దాన్ని అర్థం చేసుకోవాలి. సమస్యల మీద పోరాడే మేధావులు, ఆ సమస్యల కారణాలు ఎంత స్పష్టంగా కనిపిస్తోన్నా, అటు వేపు మొహాలు తిప్పరు. శ్రమ దోపిడీ గురించి కిక్కురు మనరు. పై పైకి మాత్రం చాలా నీతి సూత్రాలు చెపుతారు. ఈ రకం మేధావులు బాధ్యతతో ప్రవర్తిస్తున్నట్టే అర్థమా? **H**

# 62. శ్రమ దోపిడీ రహస్యాన్ని కనిపెట్టింది ఎవరు?

శ్రమ దోపిడీ, వేల సంవత్సరాల నించీ సాగుతోంది. 'విలువ' మీద పరిశోధన ప్రారంభమై 2 వేల సంవత్సరాల తర్వాతే శ్రమ దోపిడీ సంగతి మానవ మేధస్సుకి అందింది!



చివరికి శ్రమ దోపిడీని అర్థం చేసుకునే పని జర్మన్ ఆర్థిక వేత్త అయిన **మార్క్సు** ద్వారా జరిగింది 1867 లో.

వెనకటి మేధావులందరూ, రికార్డోతో సహా, ఏ 'కౌళ్ళనీ - వడ్డీల్నీ - లాభాల్నీ' వదల్లేకపోయారో, ఆ ఆదాయాల్ని మార్క్సు, 'తప్పుడు ఆదాయాలు'గా తేల్చాడు. దాన్ని 'శ్రమ దోపిడీ' గా తన తర్కంతో, తన విలువ లెక్కలతో, రుజువు చేశాడు. దాని కోసం "కాపిటల్ (పెట్టుబడి)" అనే 4 సంపుటాల పుస్తకం రాశాడు. అందులో వెనకటి మేధావుల వాదనలన్నీ చూపించాడు. ఎవర్ని ఎక్కడ ప్రశంసించాలో, ఎక్కడ ఖండించాలో, అన్నీ చేశాడు.

'శ్రమ దోపిడీ' ని పట్టుకోవడం అంటే, దాన్ని తీసివెయ్యాలని చెప్పడమే. దోపిడీ సంబంధాల్ని మార్చాలని చెప్పడమే.

## మార్క్సు వివరణ ఇలా ఉంటుంది :

'విలువ' అనేది శ్రమే. కానీ, ఏ ప్రత్యేక శ్రమా, దానికదే విలువ కాదు. మారకాల వల్లనే ప్రత్యేక శ్రమలు, విలువ లెక్కలలోకి మారతాయి.

శ్రమలు చేసేది మనుషులే ; పని ముట్లు కాదు.

భూమి, శ్రమతో తయారైనది కాదు. దానికి విలువ వుండదు. అది, ఎవరి స్వంతమూ కాదు, ఎవరి ఆస్తీ కాదు.

భూమిని స్వంత శ్రమతో ఉపయోగించుకోవడానికి మానవు లందరికీ హక్కు వుంటుంది. భూమికి ఏ విలువనీ చెల్లించ నక్కరలేదు.

యజమానీ శ్రామిక సంబంధాలు, 'తప్పుడు సామాజిక సంబంధాలు' ('ఫాల్టీ సోషల్ రెలేషన్స్'). 'శ్రమ దోపిడీ' వల్లనే, తప్పుడు సంబంధాలు ప్రారంభమయ్యాయి.

యజమానీ శ్రామిక సంబంధాల్లో, శ్రామికులు చేసే శ్రమ అంతా శ్రామికులకు అందదు. అందులో నించి చాలా ఎక్కువ భాగం యజమానికి పోతుంది. అది, 'అదనపు శ్రమ' భాగం.

'జీతం' అనేది, 'శ్రమ విలువ' కాదు. అది, శ్రామికుల పోషణకు కనీసంగా అవసరమయ్యే 'శ్రమ శక్తి విలువ' మాత్రమే.

మనుషులు, ఉత్పత్తుల్ని తయారు

చెయ్యడానికి, (1) ఉత్పత్తి సాధనాలూ, (2) మనుషులు చేసే సజీవ శ్రమలూ - ఈ 2 అంశాలే అవసరం. మూడో అంశం ఏదీ అవసరం లేదు. 'ఉత్పత్తి సాధనాలు' అంటే, అవి 'పెట్టుబడి' కాదు. ఉత్పత్తులు తయారవ్వాలంటే, పెట్టుబడి గానీ, పెట్టుబడిదారులు గానీ అక్కరలేదు. ఉత్పత్తి సాధనాలూ, శ్రమ చేసే మనుషులూ మాత్రమే కావాలి.

ఉత్పత్తుల్ని తయారుచెయ్యడానికి గానీ, వాటిని వాడుకోవడానికి గానీ, 'కౌలూ - వడ్డీ - లాభం' అనే అంశాలేవీ అక్కరలేదు. అవి, ఉత్పత్తితో సంబంధం లేని తప్పుడు విషయాలు.

శ్రామికుల అదనపు శ్రమ, శ్రమ చెయ్యని బృందాల్లో, అనేక తప్పుడు పేర్లతో పంపకాలవుతుంది.

'శ్రమ దోపిడీ' అనే కారణంతో, ఉత్పత్తి సాధనాలన్నీ, దోపిడీ వర్గపు ఆస్తి అయ్యాయి. మనుషుల శ్రమ సంబంధాలు, శత్రు సంబంధాలయ్యాయి. మనుషులు శత్రు వర్గాలుగా విడిపోయి వున్నారు. శ్రామికుల 'అదనపు శ్రమ' తో జీవించే బృందాలన్నీ, శ్రమ దోపిడీ చేస్తూ జీవిస్తున్నాయని అర్థం.

భూమి, ప్రకృతి సహజ పదార్థం. దాని మీద భూస్వామి హక్కు అబద్ధపు హక్కు.

పెట్టుబడిదారుడి ఆస్తిగా కనపడే ఉత్పత్తి సాధనాలన్నీ, తర తరాల శ్రామికుల అదనపు శ్రమలో నించి ఉత్పత్తి సాధనాలుగా మారినవే. అలా మారుతూ వున్నవే.

'భూమి' మీద హక్కూ, 'పెట్టుబడి' మీద హక్కూ, యజమానుల స్వంత శ్రమలతో ఏర్పడిన హక్కులు కావు. శ్రమ దోపిడీ ద్వారా ఏర్పడిన అబద్ధపు హక్కులే.

యజమానుల ఆధీనంలో వున్న ఉత్పత్తి సాధనాల్ని స్వాధీన పరుచుకోవడానికి, శ్రామిక వర్గానికి, ఏ నిముషంలోనైనా న్యాయమైన హక్కు వుంటుంది.

ఇంత వరకూ సమాజంలో వున్న రాజ్యాంగాలన్నీ దోపిడీ వర్గం పెట్టుకున్న రాజ్యాంగాలు. 'రాజ్యాంగం' అనేది, దోపిడీదారుల ఉమ్మడి వ్యవహారాలు చూసే సంఘం. అది, శ్రమ దోపిడీనే నిలబెడుతుంది.

మనుషులు, జీవించాలంటే, పెట్టుబడులు పెట్టే పెట్టుబడిదారులు అక్కర లేదు. 'పెట్టుబడి' అంటే, ఉత్పత్తి సాధనాలూ + శ్రమలు చేసే మనుషుల పోషణ వస్తువులూ. ఈ 2 అంశాలూ సమాజంలో, సిద్ధంగానే వుంటాయి. ఉత్పత్తులు కావాలంటే, మనుషులందరూ, పోషణ వస్తువుల్ని వాడుకుంటూ, ఉత్పత్తి సాధనాల మీద, శ్రమలు చేస్తే చాలు. 'పెట్టుబడి' ని పెట్టే పెట్టుబడిదారులు అక్కరలేదు. అసలు, వాళ్ళు పెట్టుబడులు పెట్టడం అబద్ధం. ("పెట్టుబడి బ్రహ్మాండమైన అబద్ధం" చాప్టరులో దీన్ని చూశాం.)


యజమానులందరూ, శ్రామికులతో పాటు కలిసి శ్రమలు చెయ్యాలి. అప్పుడు, ఎవరి శ్రమతో వారు జీవిస్తారు. కౌళ్ళూ - వడ్డీ లాభాలూ అనే తప్పుడు ఆదాయాలూ, తప్పుడు ఆస్తి హక్కులూ, తప్పుడు శ్రమ సంబంధాలూ, అంతర్ధానమవుతాయి. యజమానీ శ్రామిక సంబంధాలతో ఏర్పడే శత్రు వర్గాలు అంతర్ధానమవుతాయి.


శ్రమదోపిడీ సాగుతోందంటే, మానవుల సంబంధాలు తల్లకిందులుగా వున్నాయని అర్థం. వాటిని తిన్నగా తిప్పాలి.

ఆ పని, శ్రామిక వర్గమే చెయ్యాలి. శ్రమ దోపిడీని ఆపివెయ్యడానికి, యజమాని వర్గం సుముఖంగా వుండదు. పైగా, అది శ్రామిక వర్గ పోరాటాల్ని అణచడానికే చూస్తుంది. కాబట్టి, శ్రమ దోపిడీ నించి తనని విముక్తి చేసుకోవలసిన అవసరం శ్రామిక వర్గానిదే. అది, యజమాని వర్గం మీద పోరాటాల ద్వారానే తన విముక్తిని సాధించాలి. కార్మిక వర్గం తన పోరాటాల ద్వారా శ్రమ దోపిడీనీ, దాని సంస్కృతినీ నిర్మూలించినప్పుడు, అది ' కమ్యూనిజం' అవుతుంది. కార్మిక వర్గం, తన లక్ష్య సాధన కోసం ఒక పార్టీని ( సంఘాన్ని ) ప్రారంభించాలి. కమ్యూనిజాన్ని సాధించే పార్టీ కమ్యూనిస్టు పార్టీ. ఆ పార్టీ ద్వారానే కార్మిక వర్గం తన పోరాటాలు సాగించాలి.

కార్మిక వర్గం, దోపిడీ ఆదాయ మార్గాల్ని తీసివేసినప్పుడు, దోపిడీ వర్గం, తన కోసం తను శ్రమ చేసుకునే జీవితంలోకి మారుతుంది. శతృత్వాలు లేని శ్రమ సంబంధాలు ఏర్పడతాయి. - ఇదీ, మార్క్స్ వివరణ. ఇది, ' నీతి బోధ' కోసం కాదు. సమాజాన్నంతా ఉద్ధరించాలని కాదు. యజమాని వర్గం ద్వారా శ్రమ దోపిడీ జరుగుతోందని, తను గ్రహించాడు గనక, శ్రామిక వర్గానికి ఆ నిజం చెప్పడం ఇది.

# ప్రశ్నలూ - జవాబులూ





**1**. ' శ్రమ దోపిడీ' అంటే ఏమిటో అర్థమవుతోందా?

**జ** : అర్థమవుతోంది. అయినా, సందేహాలు వున్నాయి.

**2**. శ్రమ దోపిడీ మంచిదా, చెడ్డదా?

**జ** : దోపిడీ చేసే వాళ్ళకు మంచిదీ ; దోపిడీకి గురి అయ్యే వాళ్ళకు చెడ్డదీ.

**3**. అందరికీ ఒకే రకంగా మంచి అయ్యే విషయం ఉండదా?

**జ** : ఎందుకు ఉండదు? ప్రతి వ్యక్తీ తన స్వంత శ్రమతో జీవించాలి. అప్పుడు, ఎవ్వరూ దోపిడీ చేసే వాళ్ళు అవరు.

**4**. అది ఎలా జరగాలి?

**జ** : ఇంకా మిగిలిన పాఠాలన్నీ చూడాలి. అంతే కాదు, ' కాపిటల్ పరిచయం' కూడా చదవాలి!



**5** . ఇది ఏమిటి?

**జ** : బానిసని దండించే వాడు, బానిసతో, తన కాళ్ళకు దణ్ణం పెట్టించుకుంటున్నాడు. పాదాలకు దణ్ణాలు పెట్టడం, బానిస సమాజంలోనే ప్రారంభమై వుంటుంది.

**6**. కొంత భూమి మీద ఒక కుటుంబ సభ్యులు తమ స్వంత శ్రమలతో జీవిస్తున్నారు. ఆ భూమి ఆ కుటుంబం ఆస్తి అవదా?

**జ** : అవదు. భూమిని స్వంత శ్రమతో ఉపయోగించుకోవచ్చు. భూమిని ఉపయోగించుకోకపోతే, జీవించడానికే అవకాశం ఉండదు కాబట్టి. కానీ, భూమి మీద, ఒక వ్యక్తికి గానీ, ఒక కుటుంబానికి గానీ, వారసత్వపు హక్కు ఉండదు.

**H**

# 63. ఉత్పాదక శ్రమలూ, అనుత్పాదక శ్రమలూ

'శ్రమ దోపిడీ' అనేది, వెనకటి సమాజాల్లో కూడా వుంది. అది, పెట్టుబడిదారీ విధానానికే ప్రత్యేకమైనది కాదు.

కానీ, పెట్టుబడిదారీ విధానానికే ప్రత్యేకమైన విషయాలు ప్రధానంగా 4 వున్నాయి. (1) శ్రమల్లో, ఉత్పాదక - అనుత్పాదక తేడాలు. (2) వేరు వేరు పెట్టుబడిదారుల మధ్య సరుకుల్ని అమ్ముకోవడంలో పోటీ! (3) సరుకుల రూపాల్ని మార్చేసే ఎత్తుగడలు. (4) సంక్షోభాలు. - ఇవి గాక ఇంకా అనేక వింతలు వున్నా, కనీసం ఈ విషయాలైనా తెలియకపోతే, పెట్టుబడిదారీ విధానం గురించి తెలిసినట్టు కాదు.

'డబ్బు - అంటే శ్రమ' అని మనకు తెలుసు. వస్తువు తయారీకి అవసరమయ్యే ఉత్పత్తి సాధనాల పాత శ్రమ అయినా, పని స్తలంలో శ్రామికులు చేసే కొత్త శ్రమ అయినా, అదంతా శ్రమే. 'శ్రమ' అంతా తర తరాల శ్రామికులదే కాబట్టి, 'డబ్బు' అనేది శ్రామికులదే.

అయితే, ఆ శ్రామికుల్లోనే మళ్ళీ తేడా వుంది. ఈ తేడా, 'శారీరక శ్రమలూ - మేధా శ్రమలూ' అనే తేడా కాదు. ఇది, 'ఉత్పాదక శ్రమలూ - అనుత్పాదక శ్రమలూ' అనే తేడా! ఈ తేడా, శారీరక శ్రమల్లోనూ వుంటుంది ; మేధా శ్రమల్లోనూ వుంటుంది. ఈ తేడా, పెట్టుబడిదారీ విధానానికే వర్తించే తేడా. ఇది, పెట్టుబడిదారుల దృష్టిలో వుండే తేడా. ఈ తేడాని, చూసే ముందు, దీని ఫలితాన్ని మొదట చెప్పేసుకుందాం. అంత విచిత్రమైన ఫలితం అది!

శ్రామికులు అందరూ శ్రమలు చేసే వాళ్ళే. అయినా, సమాజంలో వున్న డబ్బు అంతా ఉత్పాదక శ్రామికుల శ్రమే. 'డబ్బు' అనేది, అనుత్పాదక శ్రామికుల శ్రమ కాదు! - ఈ సంగతి మొదట విన్నప్పుడు, చాలా అపనమ్మకం కలుగుతుంది. తర్వాత వివరాలు తెలిశాక, "సంగతి ఇదా!" అని అపనమ్మకం, విభ్రాంతిగా మారుతుంది.

శ్రామికులందరూ, యజమానుల దగ్గిర శ్రమలు చేసేవారే. అదనపు శ్రమలు కూడా చేసేవారే. శ్రమ దోపిడీకి గురి అయ్యేవారే. కానీ, యజమాని డబ్బుని పెంచేదే - 'ఉత్పాదక శ్రమ.' యజమాని డబ్బుని ఖర్చు చేసేది - అనుత్పాదక శ్రమ. దీన్ని వేరే మాటల్లో చెప్పుకుంటే, యజమానికి ఉత్పాదక శ్రమే, డబ్బుగా మారుతుంది. అనుత్పాదక శ్రమ, డబ్బుగా మారదు.

పెట్టుబడిదారుడి పని స్తలంలో ఉత్పాదక శ్రమలూ, అనుత్పాదక శ్రమలూ కూడా వుంటాయి. పెట్టుబడిదారుడి ఇంటి దగ్గిర, అనుత్పాదక శ్రమలు మాత్రమే వుంటాయి.

**వివరాలు చూద్దాం.**

చలపతి పరిశ్రమలో, అమ్మకం కోసమే రోజూ బట్ట తయారవుతూ వుంటుంది. వెనకటి చాప్టర్లలో చూసిన బట్ట ఉదాహరణని, ఇక్కడ ఒకసారి గుర్తు చేసుకోవాలి.

బట్ట విలువలో **3** అంశాలు వున్నాయి.

| | | |
|---|---|---|
| (1) | ఉత్పత్తి సాధనాలు 80 | ( పాత శ్రమ ) |
| (2) | జీతాలు 20 | ( కొత్త శ్రమ ) |
| (3) | అదనపు విలువ 20 | ( కొత్త శ్రమ ) |
| | బట్ట విలువ 120 | (మొత్తం శ్రమ) |

బట్టని అమ్మేశారు. బట్ట వెళ్ళిపోయి, 120 డబ్బు వచ్చింది. పాత శ్రమా, కొత్త శ్రమా, మొత్తం శ్రమ అంతా, డబ్బుగా మారింది.

ఉత్పత్తి సాధనాల మీద పెట్టిన 80 డబ్బు, వెనక్కి వచ్చేసింది.

జీతాల మీద పెట్టిన 20 డబ్బు, వెనక్కి వచ్చేసింది.

ఆ 2 అంశాలూ కలిసిన 100 పెట్టుబడి, వెనక్కి వచ్చేసింది.

అయితే, పెట్టుబడిదారుడికి కావలసింది, పెట్టుబడి వెనక్కి రావడమే కాదు. దాని కన్నా ఎక్కువ డబ్బు రావాలి. పెట్టుబడి వెనక్కి వస్తూ, అది తనతో పాటు ఎక్కువ డబ్బుని తీసుకు రావాలి.

బట్టని అమ్మడం వల్లే అది జరిగింది. 100 పెట్టుబడి వెనక్కి వస్తూ, అది ఇంకో 20 డబ్బుని కూడా తీసుకువచ్చింది. దీని వల్ల, పెట్టుబడిదారుడి డబ్బు పెరిగింది.

పెట్టుబడిదారుడి దగ్గిర 'సరుకుల్ని' ఉత్పత్తి చేసే శ్రమ - ఉత్పాదక శ్రమ. సరుకుల్ని అమ్మితే డబ్బు వస్తుంది. అందులో, 'అదనపు డబ్బు' వుంటుంది. ఆ రకంగా, <u>పెట్టుబడిదారుడి డబ్బుని పెంచే శ్రమ - ఉత్పాదక శ్రమ. ఆ కార్మికులు - ఉత్పాదక కార్మికులు.</u>

తర్వాత, అనుత్పాదక శ్రమల్ని చూద్దాం. ఈ కార్మికులు కూడా, యజమానుల దగ్గిర శ్రమలు చేసేవాళ్ళే. కానీ, ఈ శ్రమలు గానీ, ఈ శ్రమలతో తయారయ్యే ఉత్పత్తులు గానీ, యజమానులకు 'సరుకులు'గా వుండవు.

అనుత్పాదక శ్రమల్ని చూడడానికి మొదట, పెట్టుబడిదారుడి ఇంటికి వెళ్ళాలి. కానీ, ఇంటి దగ్గిర పనిచేసే కార్మికులకు యజమానితో వుండే సంబంధం, పెట్టుబడిదారుడితో వుండే సంబంధం కాదు. ఇది, 'ఇంటి యజమానితో వుండే సంబంధం.' ఆ యజమాని, బయట, పెట్టుబడిదారుడిగా ఉన్నవాడైనా కావచ్చు, అలా కానివాడైనా కావచ్చు. అది, ఇంటి పని మనుషులకు అనవసరం. బయట కార్మికుడిగా వుండే మనిషి కూడా ఇంట్లో పని మనుషుల్ని పెట్టుకోవచ్చు. అలాంటప్పుడు, ఆ కార్మికుడే, ఇంటి పని మనుషులకు 'యజమాని' అవుతాడు. కాబట్టి, ఇంటి పని మనుషులకు, ఆ ఇంటి వాళ్ళతో వుండే సంబంధం, 'పెట్టుబడిదారుడితో వుండే సంబంధం' కాదు.

యజమాని అయిన చలపతి ఇంట్లో 4 గురు శ్రామికులు వున్నారు. ఒక వంట మనిషీ, ఒక పని మనిషీ, ఒక తోటమాలీ, ఒక బండి మనిషీ! వంట మనిషినే తీసుకుందాం. ఆమె పేరు రాజమ్మ. ఆమె విషయంలో జరిగేదే, మిగతా శ్రామికుల విషయంలో కూడా జరుగుతుంది.



రాజమ్మ, ఆ ఇంట్లో వంటలు చేస్తుంది. వంటలు చెయ్యడానికి ముడి పదార్థాలూ, పనిముట్లూ, సహాయక పదార్థాలూ అన్నీ కావాలి. అవన్నీ కలిసి, 'వంట శ్రమ' జరగ డానికి కావలసిన ఉత్పత్తి సాధనాలు. ఆ వంటలు తయారవ్వాలంటే ఆ సాధనాలు వుండాలి. ఆ సాధనాల ఖర్చుని 3 అను కుందాం. రాజమ్మకి, 1 రోజుకి జీతం 2. 1 రోజులో రాజమ్మ చేసే శ్రమ విలువ 4 అనుకుందాం. ( జీతం కన్నా 'శ్రమ విలువ' ని ఎప్పుడూ కొంత ఎక్కువగానే తీసుకోవాలి. కనీసం రెట్టింపుగా. )

ఇవన్నీ 1 రోజు లెక్కలు. 1 రోజులో జరిగే వంటల ఖర్చు = ఉత్పత్తి సాధనాలు 3 + వంట మనిషి జీతం 2 + ఆమె అద నపు శ్రమ 2 = 7. కానీ, ఆ వంటల కోసం, ఆ ఇంటి వాళ్ళు ఖర్చు పెట్టింది 7 కాదు ; 5 మాత్రమే. అలా తయారైన వంటల్ని, ఆ ఇంటి వాళ్ళు బైటికి అమ్మరు. అవి, 'సరుకులు' కావు. వాటిని, అమ్మకం కోసం చేయించలేదు. వాటిని వాళ్ళే స్వంతానికి వాడుకుంటారు. ఆ పదార్థాలన్నీ ఇంట్లోనే ఖర్చయిపోతాయి.

ఇక్కడ ఏం జరిగింది? వంటల కోసం వాళ్ళు ఎంత డబ్బు ఖర్చు పెట్టారు? ఉత్పత్తి సాధనాల 3 + జీతం 2 = 5 డబ్బు ఖర్చు పెట్టారు. ఆ వంటల్ని అమ్మలేదు కాబట్టి, ఆ డబ్బు వెనక్కి రాలేదు. ఆ డబ్బు, ఉపయోగపు విలువల కోసం ఖర్చయి పోయింది.

ఆ యజమాని, ఇంట్లో వంటల కోసం ఖర్చు పెట్టిన 3 + 2 = 5 డబ్బు ఎక్కడిది? - ఆ యజమాని, అమ్మకానికి బట్టని ఉత్పత్తి చేయించే పెట్టుబడిదారుడు. ఆ బట్ట ద్వారా, 20 అదనపు విలువ వచ్చిం దని చూశాం. అందులో నించి, అతని పారిశ్రామిక లాభం 12. ఆ లాభమే అతని ఆదాయం. ఆ లాభంలో నించే అతను ఇంటి అవసరాల కోసం ఖర్చు పెడతాడు. ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, మొత్తం 20 అదనపు విలువ అంతా అతని దగ్గిరే వున్నట్టు చూద్దాం.

[ ఆ అదనపు విలువని, కొందరు పంచుకుంటే, వాళ్ళు కూడా, తమ వాటా లలో నించే ఇంటి ఖర్చులకు వాడతారు. ఆ అదనపు విలువని అందరూ వాడినా, బట్ట పెట్టుబడిదారుడు ఒక్కడే వాడినా, ఆ 20 ని మాత్రమే వాడగలరు. కాబట్టి, 20 నే దృష్టిలో పెట్టుకోవాలి. చలపతి ఇంట్లో జరిగే ఖర్చుల్ని, అందరికీ సంబం ధించిన ఖర్చులుగా అనుకోవాలి.]

రాజమ్మ శ్రమకి ఏం పేరు వుంటుంది? ఈ శ్రమ, యజమానికి అదనపు విలువని ఇస్తుందా లేదా? - ఈ విషయాలు తర్వాత పాఠంలో చూస్తాం.

[ ఈ పాఠంలో ప్రశ్నలు లేవు. తర్వాత పాఠంలో ఇంకా కొన్ని విషయాలు తెలిసిన తర్వాతే, ప్రశ్నలు వుంటాయి. ]

**H**

# 64. అనుత్పాదక శ్రామికులు అదనపు విలువ ఇస్తారా?

చలపతి ఇంట్లో వంట మనిషి, 4 విలువ గల శ్రమ చేసి, జీతంగా, 2 తీసుకుంది కదా? ఆమె 'అదనపు శ్రమ' మాట ఏమిటి? అది ఏమైంది? అది, యజమాని కుటుంబానికి అందిందా లేదా? - సుబ్బరంగా అందింది. కానీ అది డబ్బుగా గాక, వంట శ్రమగానే అందింది. యజమాని ఇంటికి కావలసిన 'ఉపయోగపు విలువ'గా.

ఆ కుటుంబానికి, 2 డబ్బుతో, 4 విలువ గల వంట శ్రమ దొరికింది. అంటే, '2 అదనపు శ్రమ' దొరికింది.

కానీ, ఆ వంటలు, 'సరుకులు' కావు. వాటిని బైటికి అమ్మలేదు. వాటి కోసం పెట్టిన ఉత్పత్తి సాధనాల ఖర్చు వెనక్కి రాలేదు. జీతం ఖర్చు వెనక్కి రాలేదు. యజమానికి, 'అదనపు శ్రమ' దొరికింది గానీ, అది డబ్బుగా అందలేదు. మొత్తం ఆ వంటల ఖర్చు అంతా, ఆ ఇంటి అవసరానికి, వంట శ్రమ గానే ఖర్చయి పోయింది. ఇలా ఖర్చయ్యే శ్రమ, పెట్టుబడిదారుడైన యజమానికి, 'అనుత్పాదక శ్రమ'. అంటే, 'ఉత్పత్తి చెయ్యని' శ్రమ. దేనిని ఉత్పత్తి చెయ్యని శ్రమ? 'డబ్బుని ఉత్పత్తి చెయ్యని' శ్రమ. అదనపు శ్రమని ఇచ్చినా, అది అదనపు విలువగా మారని శ్రమ. మొదటి డబ్బుని పెంచని శ్రమ.

వంట మనిషి శ్రమ, ఆహార పదార్థాలన్నిటినీ ఉత్పత్తి చేసింది. అయినా, అవి అమ్మకంలోకి వెళ్ళకపోవడం - అనే కారణం వల్ల, ఆ శ్రమ, అనుత్పాదక శ్రమ అయింది. యజమానికి, ఆ వంట మనిషి, అనుత్పాదక శ్రామికురాలు. ఆ వంటల కోసం ఖర్చయిన ఉత్పత్తి సాధనాలన్నీ - 'అనుత్పాదక ఖర్చులు.'

ఆ కుటుంబానికి మళ్ళీ మర్నాడు, కొత్త వంటలు కావాలి. పాత వంటల డబ్బు వెనక్కి రాదు కాబట్టి, మళ్ళీ కొత్త డబ్బు కావాలి. బయట, ఉత్పాదక కార్యక్రమంలో, కొత్త బట్ట ( కొత్త సరుకు ) తయారై, దాని ద్వారా కొత్త అదనపు విలువ రావాలి. అందులో నించే యజమాని, ఇంటి వంటల కోసం, మళ్ళీ కొత్తగా డబ్బుని తీసి ఖర్చుపెడతాడు. అప్పుడు కూడా ఇంటి వంట మనిషి ద్వారా మళ్ళీ '2 అదనపు శ్రమ' కొత్తగా దొరుకుతుంది. మళ్ళీ ఆ వంటలన్నీ ఖర్చయిపోతాయి. మళ్ళీ ఇంటి అవసరం తీరుతుంది. యజమానికి, ఖర్చయిన డబ్బు తిరిగి రాదు. డబ్బు పెరగదు.

ఈ వంట మనిషే గనక, ఒక పెట్టుబడిదారుడు నడిపే భోజనాల హోటల్లో పనిచేస్తే, అక్కడ ఆమె చేసిన వంటల్ని సరుకులుగా అమ్ముతారు. ఆమె అదనపు శ్రమ, యజమానికి, అదనపు డబ్బుగా అందుతుంది. అంటే, ఆమె అక్కడ

ఉత్పాదక కార్మికురాలు అవుతుంది. అంటే, ఒక చోట ఉత్పాదక శ్రమగా వున్న శ్రమే, ఇంకో చోట అనుత్పాదక శ్రమగా వుంటుంది.

యజమాని ఇంట్లో పనిచేసే వంట మనిషి లాగే, ఆ ఇంట్లో పనులు చేసే ఇతర పని మనుషులు కూడా అనుత్పాదక కార్మికులే. ఆ ఇంటి తోటమాలీ, ఆ ఇంటి బండి మనిషీ, కూడా అంతే.

యజమాని ఇంట్లో, వంట మనిషి చేసిన వంటల్ని, యజమాని అమ్ము కున్నాడా లేదా, ఆ శ్రమ అతనికి డబ్బుగా మారిందా లేదా - అనేది, వంట మనిషికి అనవసరం. ఆమె అయితే, 4 విలువ గల శ్రమ చేసింది. 2 ని మాత్రమే జీతంగా అందుకుని, 2 ని పోగొట్టుకుంది. ఈ అనుత్పాదక కార్మికురాలు కూడా శ్రమ దోపిడీకి గురి అయింది. అంటే, ఉత్పాదక కార్మికులకు జరిగేదే, అనుత్పాదక కార్మికు లకు కూడా జరుగుతుంది.

ఒక ప్రశ్న: వంట మనిషి శ్రమకు బదులుగా ఆమెకు 2 డబ్బు ( జీతం ) వచ్చింది కదా? ఆమె శ్రమ, డబ్బుగా మారినట్టు కాదా? - కాదు. ఆమె అదనపు శ్రమ, అమ్మకంలోకి వెళ్ళనట్టే, ఆమె జీతంగా తీసుకున్న అవసర శ్రమ కూడా అమ్మకంలోకి వెళ్ళలేదు. ఆమె చేసిన 4 శ్రమలో ఏ భాగమూ డబ్బుగా మారలేదు. అయినా, ఆమెకు జీతంగా 2 డబ్బు అందింది. ఆ డబ్బు ఎక్కడిది? ఆ 2 డబ్బు, యజమానికి, ఉత్పాదక కార్మికుల నించి వచ్చిన 20 అదనపు విలువలోది. ఆ అదనపు విలువలో నించే యజమాని, 2 డబ్బుని తీసి వంట మనిషికి జీతంగా ఇచ్చాడు. - వంట మనిషికి డబ్బు రావడం, ఆ రకంగా జరిగింది గానీ, ఆమె శ్రమే, డబ్బుగా మారడం వల్ల కాదు.

**ఇంకో ప్రశ్న:** వంట మనిషి శ్రమ విలువ 4. కానీ ఆమెకి జీతంగా 2 డబ్బు మాత్రమే అందింది. యజమాని జేబులో, మొదట 20 ఆదాయం వుంది. అది, ఉత్పాదక కార్మికుల అదనపు విలువ. యజమాని, వంట మనిషికి, ఆమె శ్రమ విలువ అంతా ఇచ్చేస్తే, అతని జేబులో నించి 4 వెళ్ళి పోయి, ఇంకా 16 మిగలాలి. కానీ వంట మనిషికి 2 మాత్రమే వెళ్ళడం వల్ల, యజమాని జేబులో 18 మిగిలింది. వంట మనిషికి, ఇంకో 2 వెళ్తే, యజమాని జేబులో డబ్బు ఇంకా తగ్గి, 16 యే వుండేది. ఇప్పుడు 18 వుందంటే, అందులో 2, వంట మనిషికి వెళ్ళవలసిన డబ్బే కదా? వంట మనిషి చేసిన వంటల్ని సరుకులుగా బైటికి అమ్మలేదనేది నిజమే. అయినా, ఆమెకు వెళ్ళవలసిన 2 డబ్బు, యజమాని జేబు లోనే వుంది కదా? కాబట్టి, వంట మనిషి అదనపు శ్రమ, యజమానికి 2 డబ్బుగా అందినట్టే అవదా?

**జవాబు:** అలా అవదు. ఎందుకంటే, వంట మనిషి చేసిన వంటలేవీ డబ్బుగా మారనప్పుడు, వాటిలో వున్న ' అదనపు శ్రమ భాగం' ఒక్కటే డబ్బుగా మారదు. యజమానికి, వంట మనిషి అదనపు శ్రమ ద్వారా కూడా 2 డబ్బు రావడం నిజం అయితే, అది, ఉత్పాదక కార్మికుల అదనపు విలువతో సంబంధం లేకుండా, విడిగా కనపడాలి.

ఎలాగంటే : యజమాని జేబులో మొదట 20 ఆదాయం వుంది. అందులో నించి, వంటల ఉత్పత్తి సాధనాల కోసం 3 తీశాడు. ఆ 3 సంగతి పట్టించుకోవద్దు. వంట మనిషి శ్రమ సంగతే చూద్దాం. యజమాని జేబులో మొదట వున్న 20 ఏమిటి? అది, ఉత్పాదక కార్మికుల అదనపు విలువ. అందులో నించి వంట మనిషి జీతం కోసం 2 తీశాడు. ఇంకా 18 మిగిలింది. ఈ 18 ఏమిటి? - ఉత్పాదక కార్మికుల అదనపు విలువే. వంట మనిషి అదనపు శ్రమ కూడా 2 డబ్బుగా వచ్చి వుంటే, అది విడిగా, ఆ 18 పక్కన వుండాలి. అంటే, జేబులో మళ్ళీ 20 వుండాలి. అలా జరిగిందా? - లేదు. జేబులో వున్న 18 లో నించే, ఒక 2 ని, వంట మనిషి డబ్బు అనుకుంటే, అప్పుడు, ఉత్పాదక కార్మికుల నించి వచ్చిన అదనపు విలువలో 2 తగ్గి పోయి కనపడుతుంది.

ఇన్ని లెక్కలు అనవసరం. వంట మనిషి అదనపు శ్రమ ద్వారా యజమానికి 2 డబ్బు వచ్చి వుంటే, యజమాని జేబులో మొత్తం 20 + 2 = 22 డబ్బుకి లెక్కలు కనపడాలి. కానీ, లెక్క, 20 డబ్బుకే గానీ, 22 డబ్బుకి దొరకదు.

అసలు జరిగింది ఏమిటంటే, వంట మనిషి అదనపు శ్రమ వల్ల, యజమానికి, 'డబ్బు పెరగడం' కాదు ; 'ఖర్చు తగ్గడం' జరిగింది. ఇంట్లో జరిగే శ్రమలన్నీ, ఆదాయాన్ని ( డబ్బుని ) ఖర్చుపెట్టే క్రమాలే. వంట పనీ, తోట పనీ, బండి తోలే పనీ, ఏ పని జరగాలన్నా, అప్పటికే వున్న డబ్బు ఖర్చవుతుంది. 4 ఖర్చుతో దొరికేటంత వంట శ్రమ, 2 ఖర్చుతోనే దొరికిందంటే, అర్థం ఏమిటి? ఇంకో 2, ఖర్చవకుండా, ఆ ఖర్చు తగ్గిందని అర్థం. ఎక్కువ ఖర్చుతో దొరికే శ్రమ, తక్కువ ఖర్చుతోనే దొరికింది. దొరికిన శ్రమ అంతా వంట శ్రమగానే వాడకం అయిపోయింది. వంట మనిషి విషయంలో లాగే, ఇంట్లో ఇతర పని మనుషుల అదనపు శ్రమల వల్ల కూడా ఖర్చులు తగ్గడమే జరుగుతుంది.

ఉత్పాదక కార్మికుల ద్వారా కూడా ఎక్కువ ఖర్చుతో దొరకవలసిన శ్రమ, తక్కువ ఖర్చుతోనే దొరుకుతుంది. అయితే అక్కడ, మొదట పెట్టిన పెట్టుబడి ఖర్చు అంతా మళ్ళీ డబ్బుగా వెనక్కి వచ్చి, దాని పైన ఇంకా కొంత అదనపు డబ్బు కూడా వస్తుంది. ఆ రకంగా మొదటి డబ్బు పెరుగుతుంది. తక్కువ డబ్బుతో, ఎక్కువ డబ్బు!

అనుత్పాదక కార్మికుల ద్వారా అయితే, మొదట పెట్టిన జీతాల డబ్బు వెనక్కి రాదు. ఖర్చయిపోతుంది. దానికి బదులు, ఆ డబ్బుతో సమానమైన ఇంటి పనులే గాక, ఇంకా ఎక్కువ పనులు దొరుకుతాయి. తక్కువ డబ్బుతో, ఎక్కువ ఇంటి పనులు!

యజమానికి, ఉత్పాదక కార్మికుల ద్వారా, డబ్బు పెరుగుతుంది. అనుత్పాదక కార్మికుల ద్వారా, ఖర్చు తగ్గుతుంది. 2 చోట్లా అదనపు శ్రమ దొరకడం వల్లనే ఆ ఫలితాలు!

**ఇంకో ప్రశ్న :** వంట మనిషి జీతం, ఉత్పాదక కార్మికుల అదనపు విలువలో నించి తీసి ఇచ్చిందే కదా? అంటే, ఈ అను

త్పాదక కార్మికురాలు కూడా, ఉత్పాదక కార్మికుల అదనపు విలువని పంచుకుంటుందని అర్థమా?

**జవాబు** : కాదు. ఇలాంటి సందేహం వస్తే, మనం బొత్తిగా సరిగా ఆలోచించడం లేదని అర్థం. వంట మనిషికి జీతం ఎందుకు వచ్చింది? ఆమె, శ్రమ చేసింది కాబట్టి వచ్చింది. శ్రమ చేసి, దానికి బదులుగానే జీతం తీసుకుంది. యజమాని, ఆ జీతం డబ్బుని, తన స్వంత శ్రమ లోంచి ఇచ్చాడో, దోచుకున్న శ్రమ లోంచి ఇచ్చాడో, అది ఆమెకి అనవసరం. తను శ్రమ చేసినందుకే జీతం తీసుకుంది. అదనపు శ్రమని పోగొట్టుకుంది కూడా. కాబట్టి, ఆమె, ఉత్పాదక కార్మికుల అదనపు విలువని తిన్నట్టు అర్థం కాదు.

**జీతాల మాయ** : ఈ జీతాల విషయం, అమితాశ్చర్యకరమైన విషయం! యజమాని, ఉత్పాదక కార్మికులకు జీతాలు ఇచ్చినప్పుడు గానీ, అనుత్పాదక కార్మికులకు జీతాలు ఇచ్చినప్పుడు గానీ, వారి శ్రమల్ని తను తీసుకుని, తన శ్రమని ( తన డబ్బుని ) వారికి ఇచ్చినట్టు కనపడుతుంది. కానీ ఇది 2 చోట్లా పూర్తిగా అబద్ధం!

**ఉత్పాదక కార్మికులకు జీతాలు :**

శ్రమలు అమ్మకంలోకి వెళ్తాయి కాబట్టి, ఆ కార్మికుల శ్రమని అమ్మగా వచ్చిన డబ్బులో భాగమే వారి జీతం. ఆ డబ్బు, యజమాని డబ్బు కాదు ; యజమాని శ్రమ కాదు.

**అనుత్పాదక కార్మికులకు జీతాలు :**

యజమాని, ఈ కార్మికుల శ్రమని తను తీసుకుని, ఉత్పాదక కార్మికుల శ్రమలో నించి ( వారి అదనపు విలువలో నించి ) కొంత ముక్కని తీసి, దాన్ని అనుత్పాదక కార్మికులకు జీతాలుగా ఇస్తాడు. ఆ డబ్బు, యజమాని డబ్బు కాదు ; యజమాని శ్రమ కాదు.

జీతాలు ఇచ్చే ఏ సందర్భంలోనూ అది పెట్టుబడిదారుడి శ్రమ కాదు. కానీ, కార్మికులకు జీతాలు ఇచ్చే సందర్భాల్లో, యజమాని శ్రమకూ, కార్మికుల శ్రమకూ 'మారకం' జరుగుతున్నట్టూ, అది చాలా సక్రమంగా జరుగుతున్నట్టూ, కనపడుతుంది.

బట్ట ఉదాహరణలో, పెట్టుబడిదారుడికి, ఉత్పాదక కార్మికుల ద్వారానూ, అనుత్పాదక వంట మనిషి ద్వారానూ వచ్చిన మొత్తం అదనపు శ్రమ ఎంత?

| | |
|---|---|
| ఉత్పాదక కార్మికుల ద్వారా ( డబ్బుగా ) | - 20 |
| అనుత్పాదక కార్మికురాలి ద్వారా ( ఉపయోగపు విలువగా ) | - 2 |
| మొత్తం అదనపు శ్రమ | - 22 |

ఈ యజమాని, తన ఇంట్లో పనిచేసే తోటమాలికీ, బండి మనిషికీ కూడా, తన ఆదాయంలో నించే జీతాలు ఇస్తాడు. వారి నించి కూడా అదనపు శ్రమల్ని తీసుకుంటాడు.

వంట మనిషి రాజమ్మ, ఈ యజమాని ఇంట్లోనే గాక, ఇంకో యజమాని ఇంట్లో కూడా వంట పని చేస్తోందనుకుందాం. ఆ రెండో యజమాని, ఒక ఇంజనీరు. అతను, ఒక పెట్టుబడిదారుడి దగ్గిర మేధా శ్రమ

చేసే ఉత్పాదక కార్మికుడు. అతనికి వచ్చే జీతం, అతని శ్రమే. అతను కూడా యజమాని దగ్గిర 'అదనపు శ్రమ' ని పోగొట్టుకుంటాడు. ఒక పెట్టుబడిదారుడి ఇంట్లో పనిచేసే రాజమ్మ, అనుత్పాదక కార్మికురాలు కదా? అలాగే, ఒక ఉత్పాదక కార్మికుడి ఇంట్లో పనిచేస్తే అక్కడ కూడా ఆమె అనుత్పాదక కార్మికురాలే. ఉత్పాదక కార్మికుడే ఆమెకి యజమాని. అక్కడ కూడా ఆమె శ్రమ 4 అనీ, ఆమె జీతం 2 అనీ, అనుకుందాం. అప్పుడు, ఆ యజమానిగా వున్న ఉత్పాదక కార్మికుడు, తన దగ్గిర పనిచేసే అనుత్పాదక కార్మికురాలి నించీ 2 అదనపు శ్రమ తీసుకుంటున్నాడని అర్థం. అంటే, ఇద్దరూ కార్మికులే అయినా, వారి మధ్య 'యజమానీ శ్రామిక సంబంధం' వుంటే, యజమాని ద్వారా తప్పకుండా శ్రమ దోపిడీ జరుగుతుంది.

అనుత్పాదక కార్మికులు, అనుత్పాదక కార్మికుల దగ్గిరే పనిచేసే సందర్భాలు కూడా వుంటాయి. (వీటిని తర్వాత చూస్తాం.)

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ఒక ఇంటికి ఒక శ్రామికురాలు వచ్చి వంట చేసిపెడుతుంది. ఆమె శ్రమ కూడా ఆ వంటల తయారీకి అవసరమా కాదా?

**జ** : తప్పకుండా అవసరం. వంట పదార్థాలు తయారవడానికి, ముడి పదార్థాల మీద ఆమె శ్రమ జరిగితేనే అవి తయారవుతాయి. ఆ పదార్థాల్ని అమ్మితే, పాత - కొత్త శ్రమలు రెండూ కలిసే వాటి విలువ అవుతుంది. వాటిని అమ్మరు కాబట్టి విలువ లెక్కలు వుండవు.

**2**. 'ఉత్పాదక శ్రమ' అంటే? 'అనుత్పాదక శ్రమ' అంటే?

**జ** : పెట్టుబడిదారుడి పరిశ్రమలో, 'సరుకుల్ని' ఉత్పత్తి చేసేది ఉత్పాదక శ్రమ. పెట్టుబడిదారుడు మొదట పెట్టిన డబ్బుకి, ఎక్కువ డబ్బుని చేర్చేది - ఉత్పాదక శ్రమ. పెట్టుబడిదారుడి ఆదాయాన్ని ఖర్చుపెట్టే క్రమంలో, ఖర్చుని తగ్గించేది - అనుత్పాదక శ్రమ.

**3**. డబ్బుని అప్పుగా ఇచ్చే పెట్టుబడిదారుడి దగ్గిర కూడా మొదట పెట్టిన డబ్బు పెరుగుతుంది. 100 డబ్బుని అప్పుగా ఇస్తే, అది తిరిగి వచ్చేటప్పుడు ఇంకో 5 డబ్బు వడ్డీగా వచ్చింది. ఈ పెట్టుబడిదారుడి దగ్గిర గుమాస్తాగా ఒక కార్మికుడు పని చేస్తున్నాడు. వడ్డీ వ్యాపారపు పనులన్నీ అతనే చూస్తాడు. వడ్డీ పెట్టుబడిదారుడి డబ్బు పెరిగింది, అతని కార్మికుడి పనుల వల్లే కదా?

**జ** : కాదు. ఆ కార్మికుడు, అనుత్పాదక కార్మికుడు. అతని అదనపు శ్రమ, వడ్డీ పెట్టుబడిదారుడి ఖర్చుని తగ్గించడానికి పనికి వస్తుంది. వడ్డీల వాడికి వచ్చిన 5 వడ్డీ, ఎక్కడో వున్న ఉత్పాదక కార్మికుల అదనపు విలువలో భాగం.

**ఆ ఉత్పాదక కార్మికులు ఎవరంటే** : వడ్డీ పెట్టుబడిదారుడు ఇచ్చిన అప్పు, ఏ ఉత్పాదక పెట్టుబడిదారుడి దగ్గిరికి వెళ్ళిందో, అక్కడి సరుకుని తయారు చేసే కార్మికులు వారు. లేదా, ఆ అప్పు, ఒక వర్తక పెట్టుబడిదారుడు →

తీసుకుంటే, ఆ వర్తకుడు, ఏ సరుకుని అమ్మిస్తాడో ఆ సరుకుని తయారుచేసిన ఉత్పాదక కార్మికులు. అప్పు, ఎవరి దగ్గిరికి వెళ్ళిందో, దానితో వాళ్ళు ఏం చేశారో అది చూడాలి.

**4**. ఉత్పాదక కార్మికుడి ఇంటిలో ఉత్పాదక కార్మికులు ఉంటారా?

**జ**: అలాంటి సంబంధం ఉండదు. ఒకరి ఇంటి పనుల్లో పనిచేసే మనుషులు అనుత్పాదక కార్మికులే అవుతారు.

**5**. అనుత్పాదక కార్మికుడి ఇంట్లో అనుత్పాదక కార్మికులు?

**జ**: ఇంటి పనివాళ్ళు ఎప్పుడూ అనుత్పాదక కార్మికులే. ఆ ఇంటి యజమాని, బయట ఉత్పాదక కార్మికుడిగా అయినా ఉండవచ్చు. అనుత్పాదక కార్మికుడిగా అయినా ఉండవచ్చు.

**6**. 'ఉత్పాదక శ్రమ'లో ఖర్చయ్యే ఉత్పత్తి సాధనాలకీ, 'అనుత్పాదక శ్రమ'లో ఖర్చయ్యే ఉత్పత్తి సాధనాలకీ, తేడా వుంటుందా?

**జ**: ఉత్పత్తి సాధనాల స్వభావంలో తేడా లేమీ వుండవు ; వాటి ద్వారా తయారయ్యే ఉత్పత్తులు ఏ సంబంధాల్లో ఉన్నాయో, ఆ సంబంధాల్లో తేడాలు ఉంటాయి. భోజనాల హోటల్లో ఖర్చయ్యే ఉత్పత్తి సాధనాల ఖర్చు - ఉత్పాదకమైన ఖర్చు. వాటి 'విలువ', ఖర్చవదు. అది, ఎప్పుడూ వెనక్కి వస్తూ వుంటుంది. అవే ఉత్పత్తి సాధనాలు, ఇంటి వంటల్లో ఖర్చయితే, అది - అనుత్పాదకమైన ఖర్చు. ఆ సాధనాలూ వాటి విలువా కూడా ప్రతీ సారీ ఖర్చయిపోతూ వుంటాయి. ఒక ముడి పదార్థం గానీ, ఒక పనిముట్టు గానీ, ఏ సందర్భంలో ఖర్చవుతుందో, దాన్ని బట్టి అది ఉత్పాదకమో - అనుత్పాదకమో అవుతుంది.

**7**. అనుత్పాదక శ్రామికులు అదనపు విలువని ఇస్తారా? - ఈ ప్రశ్నకి క్లుప్తంగా జవాబు ఏమిటి?

**జ**: 'అదనపు విలువ'ని ఇవ్వరు. 'అదనపు శ్రమ'ని ఇస్తారు.

**8**. ఇంట్లో పనులన్నీ ఆ ఇంటి వాళ్ళే చేసుకుంటే, అవి శ్రమలేనా? అవి ఎలాంటి శ్రమలు?

**జ**: అవి శ్రమలే. అవి ఎలాంటి శ్రమలు అవుతాయో, "కుటుంబ శ్రమలు" అనే పాఠంలో చూడండి!

**9**. స్వతంత్ర ఉత్పత్తిదారుల శ్రమలకు ఏదైనా పేరు వుంటుందా?

**జ**: ఇది కూడా తర్వాత పాఠాల్లోనే దొరుకుతుంది.

**10**. అనుత్పాదక కార్మికుల విముక్తి ఎలా జరగాలి? ఉత్పాదక కార్మికులైతే, పెట్టుబడిదారుల దగ్గిర పని చేస్తారు. అక్కడ ఎక్కువ మంది కార్మికులు కలిసి వుంటారు. అందరూ ఒక మాట మీద వుండగలరు. ఇంటి పని మనుషులు ఎలా పోరాడగలరు?

**జ**: గృహ శ్రామికులు కూడా సంఘాలు పెట్టుకుని, జీతాలూ - పని గంటలూ - పని పరిస్తితులూ వంటి వాటి గురించి యజమానులకు షరతులు పెట్టవచ్చు. కానీ అసలు, సమాజంలో, గృహ సేవకుల విధానం శాశ్వితంగా ఉండ దగ్గది కాదు. ఎవరి ఇంటి పనులు వాళ్ళే చేసుకునే లాగ మార్పులు జరగాలి. యజమానులకు, ఉత్పాదక శ్రామికుల నించి అదనపు విలువ రావడం ఆగితే తప్ప, గృహ శ్రామికుల విధానం ఆగదు. అంటే, అనుత్పాదక శ్రామికుల విముక్తే, ఉత్పాదక శ్రామికుల విముక్తి మీదే ఆధారపడి వుంటుంది. దీన్ని గురించి ఇంకా చాలా తెలియాలి. **H**

# 65. పెట్టుబడిదారుడి పని స్థలంలో అనుత్పాదక శ్రమలు

పెట్టుబడిదారుడి ఇంటి పని మనుషుల శ్రమలు, ఆ ఇంటికి అవసరమైన శ్రమలే. వంట పదార్థాలు తయారవ్వాలంటే, వంట పని అవసరం. తోటలో చెట్లు పెరగాలంటే, తోట పని అవసరం. ఇవన్నీ ఉత్పత్తుల కోసం అవసరమైన శ్రమలే. కానీ, ఆ ఉత్పత్తులు అమ్మకంలోకి వెళ్ళవు కాబట్టి, ఆ కారణం వల్ల ఆ శ్రమలు, అనుత్పాదక శ్రమలు అవుతాయి.

కానీ, ఒక శ్రమ, అనుత్పాదక శ్రమ అవడానికి ఇక్కడ చూడబోయే కారణం వేరు. ఇక్కడ, 'ఉత్పత్తి తయారీ'తో సంబంధం లేని శ్రమలు కొన్ని వుంటాయి. అలాంటి ఏ శ్రమ అయినా అనుత్పాదక శ్రమే అవుతుంది. అవి కూడా అమ్మకంలోకి వెళ్ళవు. ఆ అనుత్పాదక ఖర్చులన్నీ, అక్కడ తయారయ్యే ఉత్పత్తి తాలూకు అదనపు విలువలోవే.

పెట్టుబడిదారుడి పని స్థలంలో, సూపర్‌వైజర్లూ, మేనేజర్లూ చేసే శ్రమలు, 2 రకాల స్వభావాలతో వుంటాయి.

(1) ఉత్పత్తి తయారీకి అవసరమైన ఏర్పాట్లన్నీ చేసే నిర్వహణ శ్రమ. ఇది ఉత్పాదక కోవలోకి వస్తుంది.

(2) కార్మికుల మీద పెత్తనం చేసే శ్రమ. ఇది, ఉత్పత్తి తయారీకి అవసరం లేనిది. ఇది, అనుత్పాదక శ్రమ అవుతుంది.

పని స్థలంలో అక్కడక్కడా, 'కాపలా మనుషులు' వుంటారు. ఈ కాపలా శ్రమ, ఉత్పత్తి తయారీకి అవసరం లేని అనుత్పాదక శ్రమ.



ఫ్యాక్టరీ వాచ్‌మేన్

పెట్టుబడిదారుడికీ, కార్మికులకూ మధ్య ఎప్పుడైనా కోర్టు కేసులు నడుస్తాయి. కోర్టు ఖర్చులూ, లాయరు ఖర్చులూ వంటివి, అనుత్పాదక ఖర్చులు. జడ్జీకి లంచం ఇస్తే, అదీ అనుత్పాదక ఖర్చే. - ఈ రకంగా, పని స్థలంలో కొన్ని అనుత్పాదక ఖర్చులు వుంటాయి. వాటిని, సరుకుల అదనపు విలువలో నించే ఖర్చు పెట్టాలి.

'అదనపు విలువ'ని లెక్క కట్టాలంటే, పెట్టుబడిదారుడి ద్వారా జరిగే ఈ రకం పద్దుల్ని కూడా అందులోకి చేర్చాలి.

## ప్రభుత్వ సంస్థల్లో అనుత్పాదక శ్రమలు :

ప్రభుత్వం కూడా ఒక పెట్టుబడిదారుడే. ప్రభుత్వం కూడా కొన్ని ఉత్పాదక పరిశ్రమల్ని నడుపుతుంది. ఆ సరుకుల్ని అమ్ముతుంది. ఉదా: కరెంటూ, నీళ్ళ

సరఫరా, బస్సులూ రైళ్ళూ నడపడం వంటి వాటిని. వాటి ద్వారా 'అదనపు విలువ' సంపాదిస్తుంది. అవే గాక, కొన్ని అనుత్పాదక సంస్థల్ని కూడా నడుపుతుంది.

ప్రభుత్వం, కొన్ని ధర్మాసుపత్రుల్నీ, కొన్ని ధర్మ పాఠశాలల్నీ నడుపుతుంది. రోగుల నించీ, విద్యార్థుల నించీ, ఫీజులు వసూలు చెయ్యదు. ఆ ఆస్పత్రుల ఖర్చునీ, ఆ పాఠశాలల ఖర్చునీ ప్రభుత్వం, తనకు ఆదాయం అయిన పన్నులలో నించే పెడుతుంది. ఆ ఆస్పత్రుల, పాఠశాలల పనులు ప్రభుత్వాదాయాన్ని ఖర్చు చేసే పనులే గానీ, ప్రభుత్వానికి డబ్బుని పెంచే పనులు కావు. కాబట్టి, అవి అనుత్పాదక శ్రమలు. ప్రభుత్వ ధర్మాసుపత్రిలో పని చేసే అందరూ, డాక్టర్లతో సహా, అనుత్పాదక కార్మికులే.

అలాగే, ప్రభుత్వ ధర్మ పాఠశాలల్లో పనిచేసే టీచర్లతో సహా అందరూ కూడా అంతే. ఈ అనుత్పాదక కార్మికులైన డాక్టర్ల, టీచర్ల ఇళ్ళల్లో కూడా అనుత్పాదక పని మనుషులు వుంటారు.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ఒక డాక్టరు, అనుత్పాదక కార్మికుడిగా ఎప్పుడు అవుతాడు?

**జ** : ఆ డాక్టరు, ప్రైవేటు పెట్టుబడిదారుడి ఆస్పత్రిలో పనిచేస్తే, అక్కడ రోగుల నించి వైద్యం ఖర్చు తీసుకునే విధానం తప్పకుండా వుంటుంది. అక్కడ డాక్టరు శ్రమ, సరుకుగానే మారుతుంది కాబట్టి, అక్కడ అతను ఉత్పాదక శ్రామికుడే. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా ఖర్చుని వసూలు చేసే పరిస్తితి వుంటే, అక్కడ కూడా అంతే. ప్రభుత్వ ధర్మాసుపత్రుల్లో రోగుల నించి డబ్బు తీసుకోరు. అక్కడ శ్రమలు చేసే వారందరూ అనుత్పాదక శ్రామికులే అవుతారు. డాక్టరు కూడా అంతే అవుతాడు.

**2**. ఒక డాక్టరు - అనుత్పాదక కార్మికుడు. అతని ఇంట్లో ఒక పని మనిషి ఉంది. మొదటి కార్మికుడు ( డాక్టరు ), యజమాని అవుతాడు. అతనికి, పనిమనిషి నించి అదనపు శ్రమ వస్తుంది. అలా జరగకుండా ఉండాలంటే, ఏం చెయ్యాలి? ఆ పనిమనిషినే పెట్టుకోకపోతే, ఆమెకి పని లేకుండా పోతుంది కదా?

**జ** : ఇంటి పని మనిషికి మంచి జీతం ఇవ్వాలి. ఆమె మీద యజమానితనం చూపించకుండా తోటి కార్మికురాలితో ప్రవర్తించినట్టు ప్రవర్తించాలి. ప్రస్తుత సమాజంలో, ఇంటి పని మనుషుల్ని తీసివెయ్యడం, ఆ పని మనుషులకు విముక్తి కాదు. వారికి ఎక్కువ జీతాలు ఇస్తే, వారి అదనపు శ్రమ విలువ, వారికే అందుతుంది. వారితో మర్యాదగా ప్రవర్తిస్తే, యజమానితనం వల్ల అనుభవించే హింస తప్పుతుంది. ప్రస్తుతానికి అదే పరిష్కారం.

**3**. ఒక టీచరు ప్రైవేటు పాఠశాలలో పని చేసే ఉత్పాదక కార్మికుడు. అతను, తన అదనపు విలువని పోగొట్టుకుంటూ వుంటాడు. అతను, తన ఇంట్లో పనిమనిషికి ఎక్కువ జీతం ఇవ్వాలా? తన అదనపు విలువని పోగొట్టుకుంటున్న వాడు, తన ఇంటి పనిమనిషి అదనపు శ్రమని తీసుకోకూడదా?

**జ** : తీసుకోకూడదు. ఒక కార్మికుడు, తన అదనపు విలువని పోగొట్టుకుంటే, ⟶

దానికి పరిష్కారం, అతను ఇంకొకర్ని దోపిడీ చెయ్యడం కాదు. ఇంటి పని మనిషిని పెట్టుకోగలిగిన యజమానికి కొంచెం మెరుగైన జీతం వుంటుంది. ఇంటి పనిమనిషి శారీరక శ్రామికురాలు అవుతుంది. ఆమెకి కొంచెం మంచి జీతం ఇవ్వగలిగే పరిస్థితి యజమానికి వుంటుంది. కాబట్టి, అలాగే ఇవ్వాలి. యజమాని కూడా, బయట ఒక కార్మికుడే అయినప్పుడు, తన ఇంటి పని మనిషిని, తోటి కార్మికురాలిగా చూడాలి.

**4**. ఒక కుట్టు మనిషి, ఉత్పాదక శ్రామికుడు. అతను, తన ఇంటి దగ్గిర కూడా ఒక కుట్టు మనిషిని పెట్టుకుని చిన్న దుకాణం నడిపిస్తాడు. ఇది, ఒక ఉత్పాదక కార్మికుడు, తన దగ్గిర ఇంకో ఉత్పాదక కార్మికుణ్ణి పెట్టుకున్నట్టు అవుతుందా?

**జ**: అలా అవదు. మొదటి వ్యక్తి ఉత్పాదక కార్మికుడిగా వుండేది - తన యజమాని దగ్గిర. అది, తను పనిచేసే చోట. అది అక్కడి సంబంధం. తన ఇంటి దగ్గిర పెట్టుకున్న స్వంత దుకాణంలో, అతనే యజమాని. ఇంటి దగ్గిర కూడా అతను, తన కార్మికులతో పాటు అప్పుడప్పుడూ కుట్టు పని చేస్తే, ఆ సంబంధంలో అతను చిన్న పెట్టుబడిదారుడు ( పెటీ బూర్జువా ) అవుతాడు.

**5**. స్వతంత్ర ఉత్పత్తిదారుల శ్రమలు, ఉత్పాదక శ్రమలా, అనుత్పాదక శ్రమలా?

**జ**: ఉత్పాదక - అనుత్పాదక విభజన, స్వతంత్ర ఉత్పత్తిదారులకు వర్తించదు. ఎందుకంటే, వీరి విషయంలో, యజమానీ శ్రామిక సంబంధం వుండదు. తమ అదనపు శ్రమని గానీ, అదనపు విలువని గానీ, యజమానికి అప్పజెప్పడం వుండదు. అయితే, వీరు కూడా అమ్మకం కోసం సరుకుల్ని ఉత్పత్తి చేస్తారు కాబట్టి, ఆ శ్రమల్ని ఉత్పాదక శ్రమలు అనీ, స్వంతం కోసం చేసుకునే శ్రమల్ని అనుత్పాదక శ్రమలు అనీ విభజించు కోవచ్చు. కానీ, వీరి విషయంలో ఇది సరైన విభజన అవదు. తమ అదనపు శ్రమ ద్వారా వచ్చే అదనపు డబ్బుని కూడా వారే వాడుకుంటారు కాబట్టి, వారి శ్రమ అంతా వారిదే.

**6**. ప్రభుత్వ ధర్మాసుపత్రిలో పనిచేసే ఒక డాక్టరు ఇంట్లో, ఒక వంట మనిషి పనిచేస్తోంది. ఆమెకు జీతంగా వచ్చే డబ్బు ఎక్కడిది?

**జ**: ఆ వంట మనిషి అనుత్పాదక కార్మికురాలు. కాబట్టి, ఆమె జీతం, ఆమె శ్రమ, డబ్బుగా మారడం వల్ల వచ్చేది కాదు. డాక్టరు జీతంలో నించి వచ్చేది. అయితే, ఆ డాక్టరు కూడా అనుత్పాదక కార్మికుడే. అతని జీతం అతని శ్రమ డబ్బుగా మారడం వల్ల వచ్చేది కాదు. అది, ప్రభుత్వ ఆదాయంలో నించి వచ్చేది. ఆ ప్రభుత్వ ఆదాయం, పన్నుల ద్వారా వచ్చేది. ఆ పన్నులు, దేశంలో వున్న ఉత్పాదక కార్మికుల అదనపు విలువలో భాగం. ఈ రకంగా, అనుత్పాదక డాక్టరు ఇంట్లో పనిచేసే అనుత్పాదక వంట మనిషి జీతం వెనక, అంత కథ వుంటుంది!

**7**. ఒక టీచర్‌కి గానీ, డాక్టర్‌కి గానీ, తాము ఉత్పాదక శ్రామికులో, అనుత్పాదక శ్రామికులో తెలుస్తుందా?

**జ**: ఉత్పాదక - అనుత్పాదక విషయాల గురించి ఇప్పుడు మనం ఎలా చూస్తున్నామో, ఇదంతా తెలిసినవాళ్ళకే, తమ గురించి తెలుస్తుంది. లేకపోతే లేదు. **H**

# 66. 'ఉత్పత్తి సాధనాల విలువ' బదిలీ!

ఇక్కడ, ఉత్పత్తి సాధనాల విలువ సంగతి ఎందుకు? - అని ఆశ్చర్యపడకండి! 'విలువ' గురించి సరిగా తెలియాలంటే, ఉత్పత్తి సాధనాల సంగతి స్పష్టంగా తెలియాలి.

'ఉత్పాదక - అనుత్పాదక' తేడాలు తెలిసిన తర్వాతే, ఉత్పత్తి సాధనాల విషయాలు సరిగా అర్థం చేసుకోగలం. అందుకే ఉత్పత్తి సాధనాల విషయాలు ఇప్పుడు మళ్ళీ చూస్తున్నాం.

ఏ పని స్థలంలో అయినా, కొత్త ఉత్పత్తులు తయారవ్వాలన్నా, కొన్ని పనులు జరగాలన్నా, ఉత్పత్తి సాధనాలు ఖర్చయి పోతూ వుంటాయి. అయితే, ఆ సాధనాలు ఖర్చయిపోయినప్పుడల్లా, వాటి విలువలు కూడా ఖర్చయిపోతాయా? - ఈ విషయాలు తెలిసిన తర్వాత 'ధర' గురించి కూడా మళ్ళీ చూస్తాం.

ఏ కొత్త వస్తువు తయారవ్వాలన్నా, ఉత్పత్తి సాధనాలూ, సజీవ శ్రమా - రెండూ కావాలి. కానీ, ఇక్కడ సజీవ శ్రమ గురించి కాదు, 'ఉత్పత్తి సాధనాల' సంగతి మాత్రమే చూస్తాం.

కొత్త వస్తువులు తయారయ్యేటప్పుడు, ఉత్పత్తి సాధనాల 'శరీరాలు' ఖర్చయి పోతాయి. కానీ వాటి 'విలువ' ఖర్చవడం, 'ఉత్పాదక - అనుత్పాదక' సంబంధాల్ని బట్టి వుంటుంది.

ఉత్పత్తి సాధనాల శరీరాలు ఖర్చవడం ఏ శ్రమలోనైనా జరుగుతుంది. సాధనాల శరీరాలు ఖర్చయితే, వాటి విలువలు కూడా ఖర్చయిపోయినట్టే. అయితే, ఆ ఖర్చయిపోయిన విలువ, వెనక్కి రావడం అనుత్పాదక శ్రమల్లో జరగదు ; ఉత్పాదక శ్రమల్లోనే జరుగుతుంది.

ఉత్పాదక శ్రమల్లో, ఉత్పత్తి సాధనాల విలువ వెనక్కి వచ్చేస్తూ వుంటుంది కాబట్టి, అది అసలు ఖర్చవని దానితో సమానంగా వుంటుంది. ఆ విలువని ఎప్పుడూ కొత్తగా పెట్టనక్కర లేదు. ఈ విషయాలే ఇప్పుడు చూస్తాం.

ఒక 'చొక్కా' తయారవ్వాలి. దానికి ముడి పదార్థం - బట్ట. (దారమూ, గుండీలూ కూడా ముడి పదార్థాలే. బట్ట సంగతి వాటికి కూడా వర్తిస్తుంది కాబట్టి, బట్టని చూస్తే చాలు.) బట్ట విలువ 50 అనుకుందాం. ఆ బట్టతో చొక్కా తయారైతే, బట్ట విలువ చొక్కాకి బదిలీ అయినట్టే.

బట్ట, చొక్కాగా తయారైపోతే, బట్ట శరీరం ఖర్చయిపోయినట్టే. ఇక బట్ట ఉండదు. ఇంకో చొక్కా తయారవ్వాలంటే, ఇంకో కొత్త బట్ట కావాలి. మొదటి బట్టే మళ్ళీ మళ్ళీ ఉపయోగపడదు. (బట్టే కాదు ; ఇతర ముడి పదార్థాల శరీరాలూ ఖర్చయిపోయినట్టే.)

ముడి పదార్థాల సంగతే కాదు ; పని ముట్ల శరీరాల సంగతీ అంతే. ఒక చొక్కా తయారయ్యేటప్పటికి, సూదీ, కత్తెరా లాంటి పనిముట్లన్నీ కొంత కొంత అరిగి

పోతాయి. సూది అయితే, 2, 3 చొక్కాలకే పాడైపోతుంది. కత్తెర అయితే 50 చొక్కాల దాకా పనికి రావచ్చు. లేదా, 100 చొక్కాల దాకా. ప్రతీ పనిముట్టూ ఎంతో కొంత కాలానికి పనికి రాకుండా పోతుంది. ఉత్పత్తి సాధనాల్లో ప్రతీ దాని శరీరం సంగతీ అలాగే జరుగుతుంది. ఏది ఖర్చయిపోతే దాన్ని కొత్తగా తెచ్చి పని స్థలంలో పెట్టాలి.

అయితే, ఉత్పత్తి సాధనాల 'విలువ' సంగతి ఏమిటి? అది కూడా ప్రతీ సారీ ఖర్చయిపోతూ వుంటుందా? ప్రతీ సారీ కొత్త విలువని తెచ్చి పెట్టాలా? లేకపోతే, ఒక్క సారి పెట్టిన విలువే, ఎప్పటికీ ఖర్చవకుండా వుండిపోతుందా? - ఇది ఆ ఉత్పత్తి సాధనాలు ఖర్చయ్యే సందర్భాల్ని బట్టి వుంటుంది.

అమ్మకాల కోసం సరుకుల్ని ఉత్పత్తి చేసే సందర్భాల్లో అయితే, ఉత్పత్తి సాధనాల కోసం ఒక్క సారి విలువ (డబ్బు) పెడితే చాలు. ఇక అది ఎప్పటికీ ఖర్చవదు. అదే మళ్ళీ మళ్ళీ వెనక్కి వస్తూ వుంటుంది. 'అనుత్పాదక' సందర్భాల్లో అయితే, ఉత్పత్తి సాధనాల శరీరాలతో పాటే వాటి విలువలు కూడా ఖర్చయిపోతూ వుంటాయి. వాటి కోసం ప్రతీ సారీ కొత్త డబ్బు పెట్టాలి.

అమ్మకం కోసం తయారైన చొక్కాని చూద్దాం. దాని ముడి పదార్థం అయిన బట్ట విలువ 50. ఉత్పత్తి సాధనాలన్నీ కలిసిన విలువ 80. (ఇక్కడ ఉత్పత్తి సాధనాల విలువనే గానీ, సజీవ శ్రమ సంగతి చూడడం లేదు.)

తయారైన చొక్కాని పెట్టుబడిదారుడు, తన స్వంతానికి వాడడు. అమ్మేస్తాడు. దానికి బదులుగా డబ్బు వస్తుంది. ఉత్పత్తి సాధనాల 80, వెనక్కి వచ్చేస్తుంది. అందులోనే బట్ట విలువ 50 కూడా ఉంటుంది. బట్ట విలువ సంగతే చూస్తే, వెనక్కి వచ్చిన 50 డబ్బుతోనే పెట్టుబడిదారుడు ఇంకో చొక్కా కోసం, మళ్ళీ కొత్త బట్ట కొంటాడు. (బట్ట, ఇతర పెట్టుబడిదారుల దగ్గిర తయారవుతూ వుంటుంది.) అలాగే, సూది ఖర్చయిపోయేటప్పటికి, దాని విలువ అంతా వెనక్కి వచ్చేస్తుంది. ఆ డబ్బుతోనే కొత్త సూది వస్తుంది. కత్తెర ఖర్చయేటప్పటికి, దాని విలువ అంతా వెనక్కి వచ్చేస్తుంది. ఆ డబ్బుతోనే కొత్త కత్తెర వస్తుంది. అంటే, చొక్కాకి అమ్మకం జరిగినప్పుడు, దాని ఉత్పత్తి సాధనాల 80 విలువ అంతా, వెనక్కి వచ్చేస్తుంది. ఆ డబ్బుతోనే మళ్ళీ కొత్త ఉత్పత్తి సాధనాలు వస్తాయి. అంతే గానీ, కొత్త ఉత్పత్తి సాధనాల కోసం, ఇంకో కొత్త 80 డబ్బు అవసరం లేదు.

ఒక చొక్కా తయారయ్యే క్రమాన్ని ఒక 'ఉత్పత్తి క్రమం' అందాం. ఆ చొక్కా అమ్ముడైపోయి, అదే డబ్బు వెనక్కి వచ్చి, వెనక్కి వచ్చిన డబ్బుతో ఇంకో చొక్కా తయారయ్యే క్రమాన్ని 'పునరుత్పత్తి క్రమం' ('మళ్ళీ జరిగే ఉత్పత్తి క్రమం') అనాలి.

ఉత్పత్తి క్రమాలు నిత్యం జరుగుతూనే వుంటాయి. ప్రతీ ఉత్పత్తి క్రమమూ, నిన్నటి దానితో పోలిస్తే పునరుత్పత్తి క్రమమే. ప్రతీ ఉత్పత్తి క్రమంలోనూ ఉత్పత్తి సాధనాల విలువ, కొత్త ఉత్పత్తికి బదిలీ అయ్యి, అదే

వెనక్కి వచ్చి, దానితో కొత్త ఉత్పత్తి సాధనాలు వస్తాయి. వాటి విలువ, పునరుత్పత్తి క్రమంలోకి మళ్ళీ బదిలీ అవుతుంది ; మళ్ళీ వెనక్కి వస్తుంది. అది అలా ఎప్పుడూ జరుగుతూనే వుంటుంది.

కొత్త వస్తువు ( కొత్త చొక్కా ) తయారవ్వాలంటే, ప్రతీ సారీ ఉత్పత్తి సాధనాల శరీరాలు కొత్తవి కావాలి. కానీ, వాటి కోసం అవసరమయ్యే విలువ, కొత్తది అక్కర లేదు. ఒక్క సారి పెట్టిన విలువే, మళ్ళీ మళ్ళీ ఉపయోగపడుతూ వుంటుంది.

కొంత ఖర్చుతో తయారైన చొక్కాని ( ఒక వస్తువుని ), స్వంతానికి వాడకుండా ఇతరులకు ఇచ్చెయ్యడం వల్ల ( అమ్మెయ్యడం వల్ల ), ఆ ఖర్చు అంతా వెనక్కి రావడంలో 'వింత' ఏమీ లేదు. అదే వస్తువుని తయారు చేయించి అమ్మడం ఎన్ని వేల సార్లు జరిగినా, ఉత్పత్తి సాధనాల మీద ఒక్క సారి పెట్టిన 80 విలువే చాలు. అది ఎప్పుడూ ఖర్చవదు. అదే మళ్ళీ మళ్ళీ తిరుగుతూ వుంటుంది.

'విలువ - ఖర్చవడం' అంటే, 'శ్రమ' ఖర్చవడమే. ఉత్పత్తిని <u>వాడినప్పుడే</u> దాన్ని తయారుచేసిన శ్రమ ఖర్చవుతుంది.

చొక్కాల పెట్టుబడిదారుడు, ఒక చొక్కాని తన స్వంతానికి వాడితే, దాని ఉత్పత్తి సాధనాల విలువ, వెనక్కి రాదు. ఖర్చయిపోతుంది.

ఒక చొక్కాని కొన్న మనిషిని చూద్దాం. 120 డబ్బుతో చొక్కాని కొంటాడు. దాన్ని వాడుకోవడం మొదలుపెడతాడు. కొన్నాళ్ళకి అది పాతబడిపోతుంది. పనికి రాకుండా పోయేటప్పటికి, దాని విలువ అంతా, ( దాన్ని చేసిన పాత - కొత్త శ్రమలన్నీ ) ఖర్చయిపోయిందని అర్థం.

ఒక భోజనం విలువ, 5 రూ.లు. దాన్ని తయారుచేసి అమ్మితే, ఆ ఖర్చు వెనక్కి వచ్చేస్తుంది. అదే ఖర్చుతో మళ్ళీ కొత్త భోజనం తయారు చెయ్యవచ్చు. దాన్ని తయారుచేసిన స్వతంత్ర ఉత్పత్తిదారుడే దాన్ని తినేస్తే, ఆ భోజన పదార్థాలూ, వాటి విలువా అన్నీ, ఖర్చయిపోతాయి. కొత్త భోజనం కావాలంటే, కొత్త ఉత్పత్తి సాధనాలూ, వాటి మీద సజీవ శ్రమా కావాలి.

కత్తెర - ఒక పనిముట్టు. అది పనిముట్టుగా ఉపయోగపడే చోట దాని ద్వారా అదనపు విలువ రాదు. కానీ, కత్తెరలు తయారయ్యే పరిశ్రమలో, అది - కొత్త సరుకు. అక్కడ దాని ద్వారా అదనపు విలువ వస్తుంది. ప్రతి ఉత్పత్తి సాధనమూ, తను తయారయ్యే చోట, పెట్టుబడిదారుడికి అదనపు విలువని ఇచ్చి, ఆ తర్వాతే, బైటికి వచ్చి, ఎక్కడో అక్కడ ఉత్పత్తి సాధనంగా స్థిర పడుతుంది.

ప్రతీ పెట్టుబడిదారుడూ, తనకు కావలసిన ఉత్పత్తి సాధనాల్ని, ఇతర పెట్టుబడిదారుల దగ్గిర కొంటూ వుంటాడు. ఉత్పత్తి సాధనాలు తయారవడానికి కూడా ఉత్పత్తి సాధనాలు కావాలి. ప్రతీ పని స్థలంలోనూ ఉత్పత్తి సాధనాల శరీరాలు ఖర్చయిపోతూనే వుంటాయి, కానీ ఏ పని స్థలంలోనూ ఉత్పత్తి సాధనాల విలువ ఖర్చవదు. ఒక్క సారి పెట్టిన విలువే మళ్ళీ మళ్ళీ వెనక్కి వస్తూ వుంటుంది.

చొక్కాల పెట్టుబడిదారుడు, కొంత కాలానికి తన పరిశ్రమని ఆపేశాడనుకుందాం. అప్పటికి తయారై వున్న సరుకునంతా అమ్మేసి, ఇక కొత్త సరుకుని

తయారు చేయించడం ఆపేశాడు. అయినా, అతను ఉత్పత్తి సాధనాల మీద పెట్టిన డబ్బు ఎక్కడికీ పోదు. ఆ డబ్బు అంతా వెనక్కి వచ్చేసి అతని దగ్గిరే వుంటుంది. అంటే, పెట్టుబడిదారుడు పరిశ్రమని నడిపినా, ఆపేసినా, అతను ఉత్పత్తి సాధనాల కోసం ఖర్చు పెట్టేదేమీ వుండదు. పరిశ్రమ నడిచేటప్పుడైతే, ఉత్పత్తి సాధనాల విలువ ప్రతీ సారీ వెనక్కి వచ్చేస్తూ వుంటుంది. పరిశ్రమ ఆగిపోయినప్పుడైతే, ఉత్పత్తి సాధనాల డబ్బు అంతా అతని దగ్గిరే ఉంటుంది.

ఒక పని స్థలంలో, ఒక సరుకు కోసం అవసరమైన ఉత్పత్తి సాధనాల విలువ 80 అయితే, ఆ ఉత్పత్తి సాధనాలు కూడా 3 అంశాలతో తయారై వుంటాయి. వాటిని ఇలా అనుకుందాం: (1) వాటి కోసం అవసరమైన ఉత్పత్తి సాధనాల విలువ 50, (2) జీతం 15, (3) అదనపు విలువ 15. ఈ 3 అంశాలూ కలిసినదే ఆ 80. అయితే, ఆ 80 లో వున్న ఉత్పత్తి సాధనాల 50 విలువని చూస్తే, అది కూడా 3 అంశాలతో ఏర్పడి వుంటుంది. అందులో వున్న ఉత్పత్తి సాధనాల విలువ 30 అనుకుందాం. ఆ 30 కూడా, 3 అంశాలతో ఏర్పడి వుంటుంది. ఈ రకంగా, ఇప్పటి 80 విలువ గల ఉత్పత్తి సాధనాలు, వెనకటి ఉత్పత్తి సాధనాల మీద సజీవ శ్రమ చేరుతూ తయారై వుంటాయి.

ప్రతీ పని స్థలంలోనూ కొత్త సజీవ శ్రమ జరుగుతూనే వుంటుంది. కానీ, అక్కడ ఉత్పత్తి సాధనాల విలువ బదిలీ అవుతూనే వుంటుంది.

ఒక్క పని స్థలంలో జరిగేదే మొత్తం అన్ని పని స్థలాల్లోనూ, అంటే, మొత్తం సమాజానికంతటికీ జరుగుతుంది. మొత్తం సమాజంలో ఒక సంవత్సర కాలాన్ని చూస్తే, ఆ కాలంలో అవసరమైన ఉత్పత్తి సాధనాల విలువ అంతా, వెనక సంవత్సరం నించి బదిలీ అయ్యేదే. ఆ వెనకటి ఉత్పత్తి సాధనాలకే మరి కొన్ని సాధనాలు చేరి, ఉత్పత్తి సాధనాల రాసి పెరుగుతూ, ఆ రాసి విలువ గతం కన్నా పెరుగుతూ వుంటుంది.

ఏ సమాజంలో వున్న ఉత్పత్తి సాధనాలు, ఆ సమాజంలో వున్న శ్రామికులు చేసేవే. వాటి విలువ, పాత -కొత్త శ్రమలు కలిసినదే. ఏ సరుకు విలువని చూసినప్పుడైనా, అందులో వున్న కొత్త శ్రమని అర్థం చేసుకుంటే, పాత శ్రమని కూడా అర్థం చేసుకున్నట్టే. చొక్కాలో కుట్టు శ్రమ విషయాలు అర్థం చేసుకుంటే, (కుట్టు శ్రమ జరిగేటప్పుడు, కొన్ని ఉత్పత్తి సాధనాలు ఖర్చవుతాయనీ, వాటి పాత శ్రమ, కొత్త వస్తువులోకి మారుతుందనీ అర్థం చేసుకుంటే,) ముడి పదార్థాల విషయాలూ, పనిముట్ల విషయాలూ అన్నీ అర్థం చేసుకున్నట్టే.

ఉత్పత్తి సాధనాల నించి బదిలీ అయ్యే పాత శ్రమ గురించీ, మనుషులు చేసే సజీవ శ్రమ గురించీ తెలిస్తేనే, విలువ గురించి తెలుస్తుంది.

ఉత్పత్తి సాధనాల గురించి అర్థం చేసుకోవడం అంటే, ఏదో ఒక్క వస్తువు విషయంలో జరిగేదాన్ని తెలుసుకోవడమే కాదు. మొత్తం సమాజంలో, అన్ని పని స్థలా ల్లోనూ, ఒక సంవత్సర కాలంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలి.

ఈ విషయాలేవీ వెనకటి కాలపు ఆర్థిక వేత్తలకు తెలియవు.

[ ఇప్పటి వాళ్ళకీ తెలీవు.]

**ఉత్పత్తి సాధనాల విలువ గురించి తప్పు అభిప్రాయం ఎలా వుంటుందంటే** : ఉత్పత్తి సాధనాలు ప్రతీ సారీ కొత్తవి తయా రవుతూనే వుంటాయి కాబట్టి, వాటి కోసం శ్రమ అంతా ప్రతీ సారీ జరుగుతూనే వుంటుంది - అని తప్పుగా అనుకుంటారు. కానీ, కొత్త ఉత్పత్తి సాధనాలు తయారయ్యేటప్పుడు, వాటి కోసం మొత్తం శ్రమ అంతా కొత్తగా జరగదు. అప్పుడు కూడా, పాత శ్రమ బదిలీ అయ్యేదిగానే వుంటుంది. ప్రతీ సారీ సజీవ శ్రమే కొత్తగా జరుగుతూ వుంటుంది.

ఒక సంవత్సరం మొత్తంలో, ఒక 'ఉత్పత్తుల రాసి' తయారైందంటే, దాని కోసం ఖర్చయిన ఉత్పత్తి సాధనాలన్నీ, ఆ రాసి లోనే తయారై వుంటాయి. ఆ ఉత్పత్తి సాధనాల భాగాన్ని ఒక పక్కకి పెట్టాలి. మిగిలినది సజీవ శ్రమ భాగం. అది 2 భాగాలుగా చీలుతుంది. మొదటి భాగం శ్రామికుల పోషణ కోసమూ, రెండో భాగం, యజమానుల పోషణ కోసమూ ఖర్చవుతాయి.

ఆ రాసిలో వున్న ఉత్పత్తి సాధనాలతో, కొత్త ఉత్పత్తి క్రమం మళ్ళీ జరుగుతుంది. ఉత్పత్తి సాధనాలన్నీ ఖర్చయిపోవడమూ, వాటి విలువ బదిలీ అవడమూ - మళ్ళీ జరుగుతాయి. ప్రతీ సారీ అదే.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. బట్టతో చొక్కాని కుట్టాలి. అక్కడ ఏ యే శ్రమలు జరుగుతాయి?

**జ** : బట్టని కత్తిరించే శ్రమా, కుట్టే శ్రమా మాత్రమే జరుగుతాయి. బట్టని నేసే శ్రమ గానీ, కుట్టు మిషన్‌ని తయారుచేసే శ్రమ గానీ, అక్కడ జరగవు. అవి, అంతకు ముందే జరిగి, ఆ ఉత్పత్తి సాధనాలు సిద్ధంగా వున్న తర్వాతే, వాటితో కుట్టు శ్రమ జరుగుతుంది.

**2**. కత్తెర విలువ 10. ఒక ఉత్పత్తి క్రమంలో అది ఖర్చయిపోయి, దాని విలువ వెనక్కి వచ్చింది. కాని, అప్పటికి, అదే రకపు కొత్త కత్తెర విలువ 12 అయింది. పాత 10 విలువతో, కొత్త కత్తెర ఎలా వస్తుంది?

**జ** : రాదు. పాత కత్తెర వల్ల, దాని విలువ ఎంత అయితే అంతా వెనక్కి వస్తుంది. కొత్త కత్తెర విలువ 2 పెరిగి వుంటే, పాత కత్తెర విలువ మీద ఇంకో 2 ని కలిపి కొత్త కత్తెర కొనాలి. అప్పటి నించీ ఆ 12 విలువే, బదిలీ అవుతూ, వెనక్కి వస్తూ వుంటుంది. ఏ ఉత్పత్తి సాధనం విలువ ఎలా మారినా, అప్పటి నించీ ఆ మారిన విలువే లెక్కలోకి వస్తూ వుంటుంది. పాత విలువ గురించి చూసిందే, కొత్త విలువకీ వర్తిస్తుంది.

**3**. ఒక కార్మికుడు చొక్కాని కొని, దాన్ని వాడుకుంటున్నాడు. అతను చొక్కా కోసం పెట్టిన ఖర్చుని, 'అనుత్పాదకమైన ఖర్చు' అనాలా?

**జ** : 'ఉత్పాదక - అనుత్పాదక' అర్థాలు, పెట్టుబడిదార్ల విషయంలో వర్తించే అర్థాలు. కార్మికుడు, తన వాడకం కోసం పెట్టే ఖర్చు, 'పోషణ ఖర్చు' అవుతుంది. చొక్కాని వాడుకునే మనిషి, చొక్కా విలువని చెల్లించి, చొక్కా వల్ల దొరికే ఉపయోగపు విలువని తీసుకుంటాడు. ఇక్కడ ఉత్పాదక - అనుత్పాదక తేడాలు వర్తించవు. ⟶

**4**. పని స్థలాల్లో వుండే ఉత్పత్తి సాధనాల విలువ ఎప్పటికీ ఖర్చు అవదు - అంటే, ఒక 100 సంవత్సరాల కిందటి ఉత్పత్తి సాధ నాల విలువ ఈ నాటికీ ఉంటుందా?

**జ** : 100 సంవత్సరాల కిందటి విలువే కాదు, వెయ్యి సంవత్సరాల కిందటి విలువ కూడా ఈ నాటికీ ఉంటుంది. పెట్టుబడిదారీ విధానం ప్రారంభమైన తర్వాత, 'అదనపు విలువ'లో కొంత భాగం ఉత్పత్తి సాధనాలకు చేరుతూ వాటి స్థాయీ పరిమాణాలూ పెరుగుతూ వుంటాయి.

**5**. ఒక సంవత్సరంలో మొత్తం సమాజంలో, తయారైన ఉత్పత్తి రాసిని తీసుకుందాం. ఆ రాసిలో, ఏమేమి వుంటాయి?

**జ** : కొత్త ఉత్పత్తి సాధనాలుగా అవసరమయ్యే వస్తువుల భాగమూ, పోషణ వస్తువుల భాగమూ - ఈ 2 రకాలూ వుంటాయి. అంటే, ఆ రాసిలో, కొత్త రైళ్ళూ, కొత్త బస్సులూ, కొత్త ఇళ్ళూ, కొత్త బట్టా, కొత్త దారం, కొత్త చొక్కాలూ, కొత్త ధాన్యం - అన్నీ. వస్తువులుగా వుండే ఉత్పత్తులే కాదు ; చదువు చెప్పడం, బళ్ళు తోలడం, వైద్యం చెయ్యడం - వంటి సరుకులు కూడా ఉంటాయి. అన్ని రకాల సరుకులతో నిండిన రాసి అది. **H**

# 67. వర్తక కార్మికులు అనుత్పాదక కార్మికులే !

వర్తకం శ్రమలు - అంటే, ఉత్పత్తుల్ని ఒక చోట కొని, ఇంకో చోట అమ్మే శ్రమలు. ఇవి, వస్తువులకూ - డబ్బుకీ మారకాలు చేసే శ్రమలు. ఈ శ్రమలు, ఉత్పత్తుల్ని తయారు చెయ్యడానికి గానీ, వాటిని వాడకానికి సిద్ధం చెయ్యడానికి గానీ, అవసరమయ్యే శ్రమలు కావు. ఈ శ్రమల విలువలు, ఉత్పత్తులకు చేరవు.

మారకాల శ్రమలు, ఉత్పత్తుల విలువల్ని పెంచవు - అని వెనక పాఠాల్లో చూశాం.

వర్తక కార్మికులు చేసే శ్రమలన్నీ మారకాలకు సంబంధించిన శ్రమలే. ఈ బట్ట పెట్టుబడిదారుడికి మొదట ఉత్పత్తి సాధనాలు కావాలంటే, వర్తక పెట్టుబడిదారుడి కార్మికులు, ఆ ఉత్పత్తి సాధనాలన్నిటినీ వేరు వేరు పెట్టుబడిదారుల దగ్గిర కొని, బట్ట పెట్టుబడిదారుడికి అందిస్తారు. అలాగే, బట్ట పెట్టుబడిదారుడి దగ్గిర తయారైన బట్టని కొని, వేరు వేరు పెట్టుబడి దారులకూ, కార్మికులకూ అందిస్తారు.



బట్టని అమ్మే షాపులో పనిచేసే కార్మికుడు, బట్టని కొనడానికి వచ్చే వాళ్ళ కోసం బట్టని విప్పి చూపించడమూ, దాన్ని

గురించి చెప్పడమూ, దాన్ని కొలిచి పొట్లం కట్టి ఇవ్వడమూ, డబ్బు తీసుకోవడమూ, మిగిలిన బట్టని మళ్ళీ సర్దడమూ, ఇలా, షాపులోకి ఒక మనిషి వచ్చినప్పుడల్లా చెయ్యాలి. ఈ పనులే గాక, మారకాలకు సంబంధించి ఇంకా చాలా రకాల పనులు వుంటాయి. ఈ పనులన్నీ మారకం శ్రమలే. ఈ శ్రమలు, ఉత్పత్తుల విలువల్ని పెంచవు కాబట్టి, ఇవి అనుత్పాదక శ్రమలు. ఈ కార్మికులు, అనుత్పాదక కార్మికులు.

ఇక మిగిలినదంతా అనుత్పాదక వంట మనిషి విషయంలో జరిగినట్టే ఇక్కడా జరుగుతుంది. వర్తక కార్మికుల జీతాలు కూడా 'శ్రమశక్తి - విలువే' గానీ, 'శ్రమ - విలువ' కాదు. ఈ కార్మికులు కూడా, తమ యజమాని అయిన వర్తక పెట్టుబడిదారుడికి 'అదనపు శ్రమ' ఇస్తారు.

షాపుల ఖర్చూ, కార్మికుల శ్రమలూ - అన్నీ కలిసి, మారకం ఖర్చు. లేదా, వర్తకం ఖర్చు.

వర్తకం ఖర్చుకి, 'వర్తక కమిషన్' అనే పేరు వుంటుంది. ఇది ఆశ్చర్యకరమైన పేరు. కౌలూ - వడ్డీ - లాభం లాంటి విచిత్రమైన పేరే ఇది కూడా.

వర్తకం ఖర్చు, ఉత్పత్తి విలువకి చేరదు - అనే విషయాన్ని బట్ట ఉదాహరణ ద్వారా చూడాలి. బట్ట విలువ 120. అంటే బట్ట, అంత విలువతో (అంత శ్రమతో), తయారై వుంది. అది తయారైన తర్వాతే, దాని కోసం అమ్మకం పని జరుగుతుంది. ఆ అమ్మకం పనుల ఖర్చుని 5 అనుకుందాం. ఆ ఖర్చు, బట్ట తయారైన తర్వాతే జరుగుతుంది. కాబట్టి, ఆ 5 ఖర్చు కూడా బట్ట విలువలోకి చేరి (120 కి చేరి), ఆ విలువ 125 గా పెరగాలి కదా? బట్టని 125 కి అమ్మాలి కదా? - కానీ అలా జరగదు. మారకం ఖర్చు ఎంత అయినా, అది బట్ట విలువకి చేరదు. బట్ట విలువ, మారకం ఖర్చుల తర్వాత కూడా, బట్ట పెట్టుబడి దారుడు నిర్ణయించినంతే, 120 గానే వుంటుంది. దాన్ని వర్తకుడు ఆ విలువకే అమ్మాలి.

బట్టని 120 కే అమ్మి, ఆ డబ్బుని బట్ట పెట్టుబడిదారుడికే ఇచ్చేస్తే, మరి వర్తక పెట్టుబడిదారుడు, తన వర్తకం ఖర్చు 5 ని, ఎక్కణ్ణించి తెచ్చిపెట్టాలి? అందుకే, బట్ట పెట్టుబడిదారుడు, ఆ బట్టని, వర్తకుడికి ఇచ్చేటప్పుడు, దాని ధరని తగ్గించి ఇస్తాడు. వర్తకం ఖర్చుని 5 అనుకున్నాం కదా? కాబట్టి, ఈ ఉదాహరణలో, వర్తక కమిషన్ 5. అంటే, ఆ బట్ట, వర్తకుడికి, 115 కే వస్తుంది. వర్తకుడు, ఆ బట్టని తీసుకుపోయి, అది తనకు ఏ ధరతో వచ్చిందో ఆ ధర మీద (115 మీద) వర్తక కమిషన్‌ని కలిపి (5 ని కలిపి), దాన్ని 120 కే అమ్ముతాడు. ఆ 120 లో నించి తన 5 కమిషన్‌ని తను తీసుకుని, బట్ట యజమానికి 115 ఇస్తాడు.

బట్ట పెట్టుబడిదారుడు, ఆ బట్ట తయారీ కోసం మొదట పెట్టిన పెట్టుబడి 100 మాత్రమే కాబట్టి, దాని మీద అదనంగా అతనికి 15 వస్తుంది. (అసలైతే అదనంగా వచ్చింది 20. కానీ, అందులో నించి వర్తక కమిషన్‌గా 5 పోయింది కాబట్టి, ఇప్పుడు 15 మిగిలింది.) బట్ట పెట్టుబడిదారుడికి, అదనంగా వచ్చిన ఆ 15, కౌలూ - వడ్డీ - లాభం వగైరాలుగా పంపకాలవుతుంది.

అయితే, ' వర్తక కమిషన్ 5' ఏమిటి? - కౌలు ఏమిటో, వడ్డీ ఏమిటో, ఉత్పాదక లాభం ఏమిటో, అలాగే ఇది కూడా. ఆ బట్ట విలువలో 20 అదనపు విలువ వుంది. అందులో నించి వచ్చిందే వర్తక కమిషన్ 5 కూడా.

కానీ, ఒక **సందేహం** : ఇక్కడ వర్తక కమిషన్ గురించి ఇంకో రకంగా చూద్దాం. ఆ బట్ట తయారైనప్పుడు దాని విలువ 120 కాదేమో, 115 మాత్రమే నేమో! వర్తకుడు దాన్ని, బట్ట యజమాని దగ్గిర కొన్నప్పుడు, దాని పూర్తి విలువతోనే 115 కి కొన్నాడు. తర్వాత, వర్తకం పనుల కోసం 5 ఖర్చ యింది. కాబట్టి, ఆ 5 ని కూడా కలిపి, దాన్ని 120 కి అమ్మాడు. వర్తకం ఖర్చు కూడా బట్ట విలువలోకి చేరింది. అందుకే దాని విలువ 120 గా పెరిగింది. ఇలా ఎందుకు చూడకూడదు? వర్తకం ఖర్చు, బట్టకి చేరలేదని ఎందుకు అనుకోవాలి? బట్ట తయారైనప్పుడు, దాని మొదటి విలువ 115 మాత్రమే - అని ఎందుకు అనుకోకూడదు? - ఇదీ ప్రశ్న.

**జవాబు** : బట్ట తయారైనప్పుడు దాని విలువ, 115 మాత్రమే అయితే, బట్ట పెట్టుబడిదారుడు దాన్ని ఎవ్వరికైనా ఆ విలువతోనే ఇవ్వాలి కదా? అలా ఇస్తాడా? - ఇవ్వడు. వర్తకులకు అయితేనే ఆ తగ్గించిన ధరతో ( కమిషన్‌తో ) ఇస్తాడు.

బట్టకి అసలు విలువ 115 యే అయితే, దాన్ని వర్తకుడు కొనేటప్పుడు, ' వర్తక కమిషన్ ' అనే మాట ఎందుకు ఉండాలి? ఒక మనిషి, ఒక షాపులోకి వెళ్ళి ఒక వస్తువుని కొనేటప్పుడు, అక్కడ వర్తక కమిషన్ అనే మాట ఉంటుందా? షాపులోకి వచ్చే ప్రతీ మనిషికీ, ప్రతీ వస్తువునీ, షాపు మనిషి, కమిషన్‌తో ఇస్తాడా? అలా జరగదు కదా? మరి, ఉత్పాదక పెట్టుబడిదారుల దగ్గిర వర్తకులు సరుకుల్ని కొనేటప్పుడు, ' వర్తక కమిషన్ ' అనే మాట ఎందుకు ఉంటుంది? పెట్టుబడిదారుడు, తన సరుకుని వర్తకులకే తక్కువ ధరతో ( కమిషన్‌తో ) ఇస్తాడు గానీ, ఆ సరుకుని వాడకం కోసం కొనే వాళ్ళకి, అందరికీ అదే ధరతో ఎందుకు ఇవ్వడు? - ఎందుకు ఇవ్వడంటే, ఆ బట్ట అందరికీ 115 కే దొరికితే, వర్తకుడు దాని మీద వర్తకం ఖర్చులు కూడా పెట్టి, 120 కి ఎలా అమ్మ గలుగుతాడు? - ఏ ఉత్పత్తి అయినా, ఒక చోట తక్కువ ధరతో దొరుకుతోంటే, ఇంకో చోట ఎక్కువ ధరతో ఎలా అమ్ముడవుతుంది? అంటే, ఏ <u>ఉత్పత్తికి అయినా, వర్తకుడు కొనే విలువే దాని అసలు విలువ కాదు. వర్తకుడు అమ్మే విలువే, దాని అసలు విలువ.</u> వర్తకుడు, ఆ బట్టని 115 కే తీసుకున్నా, దాని విలువ 115 కాదు. ఆ 115 మీద వర్తకుడు తర్వాత ఇంకో 5 ని కలిపినట్టు లెక్కలు వేసుకున్నా, ఆ వర్తక కమిషన్, బట్ట విలువలోకి తర్వాత చేరిందని అర్థం కాదు. బట్టకి, మొదట్లోనే 120 విలువ వుంది కాబట్టే, దాన్ని వర్తకుడు 120 కి అమ్మగలుగుతాడు. అందులో నించి, తన కమిషన్‌ని తీసుకోగలుగుతాడు. ఆ కమిషన్ 5, బట్ట తాలూకు అదనపు విలువలోదే. ఆ రకంగా, బట్టకి చేరని వర్తకం ఖర్చు 5, బట్ట విలువలో నించి బైటికి వచ్చింది. - ఇదీ జవాబు.

అయితే, వర్తక కార్మికుల ' అదనపు శ్రమ' ఏమవుతుంది? - అనుత్పాదక వంట

మనిషి అదనపు శ్రమ ఏమవుతుందో, ఇదీ అదే అవుతుంది. ఏ అనుత్పాదక శ్రమ అయినా, అది ఏ రూపంతో జరిగిందో, ఆ రూపంతోనే ఖర్చయిపోతుంది. డబ్బుగా మారదు.

వర్తక పెట్టుబడిదారుడి చేతిలోకి కమిషన్‌గా వచ్చిన 5 డబ్బుని ఆ వర్తకుడు, వర్తకం పనుల కోసం ఖర్చు పెట్టాలి. ( ఇది, ఆ ఉత్పత్తిని తయారుచేసిన ఉత్పాదక కార్మికుల అదనపు విలువలోది - అని మర్చిపోకూడదు. )

వర్తక కార్మికుల శ్రమని చూడాలంటే, వర్తక కమిషన్‌గా వచ్చిన 5 డబ్బుని వర్తకుడు ఏ యే అంశాల మీద ఖర్చు చేస్తాడో చూడాలి.

కమిషన్ 5, 3 భాగాలుగా అవుతుంది.

( 1 ) వర్తకం పనులు జరగడానికి కావలసిన షాపూ, బల్లలూ, మీటరు బద్దలూ లాంటి సాధనాల ఖర్చు 1
( 2 ) కార్మికుల జీతాల ఖర్చు 2
( 3 ) కార్మికుల అదనపు శ్రమ విలువ 2.

( ఇవన్నీ ఒక్క సరుకులో వున్న కమిషన్ లెక్కలు. )

వర్తకుడు, 5 కమిషన్‌లో నించి వర్తక సాధనాల కోసం 1 ని ఖర్చు పెడతాడు. తన కార్మికులకు జీతాలుగా 2 ఇస్తాడు. ఆ రకంగా, వర్తకుడు, 5 కమిషన్‌లో నించి, మొదటి 2 అంశాల కోసం,1 + 2 = 3 ని మాత్రమే ఖర్చుపెడతాడు. కానీ, ఆ వర్తకం పని జరిగేది, ఆ 3 ఖర్చుతోనే కాదు, వర్తక కార్మికుల 2 అదనపు శ్రమ కూడా ఆ పని కోసమే ఖర్చవుతుంది. అందుకే వర్తక కమిషన్, 5 గా వుంది. కానీ, వర్తకుడు, తన కార్మికుల అదనపు శ్రమ కోసం ఏమీ ఇవ్వడు. ఆ ఇవ్వని 2 డబ్బే వర్తకుడికి, 'వర్తక లాభం' గా మిగులుతుంది. వర్తక కమిషన్ 5 గా వుండకపోతే, 3 గా మాత్రమే వుంటే, వర్తకుడికి, 'లాభం' మిగిలే ప్రశ్న వుండదు.

వర్తకం పనుల కోసం 5 ఖర్చయింది గానీ, ఆ విలువ, సరుకు విలువ లోకి చేరలేదు. అందుకే ఆ 5, అమ్మకం లోకి వెళ్ళలేదు. అది, వర్తకం పనులుగానే ఖర్చయింది.

వర్తక పెట్టుబడిదారుడికి, తన కార్మికుల నించి 2 విలువ గల అదనపు శ్రమ దొరికింది గానీ, అది డబ్బుగా మారలేదు. కార్మికులకు జీతాలుగా ఇచ్చిన 2 తో, వారి నించి 4 శ్రమ దొరికింది. తక్కువ డబ్బుతో, ఎక్కువ శ్రమ దొరికింది. వర్తక కార్మికుల అదనపు శ్రమ వల్ల, వర్తకుడికి డబ్బు రావడం జరగలేదు ; ఖర్చు తగ్గడం జరిగింది.

'వర్తక లాభం 2' ఏమిటి? అది, కమిషన్‌లో నించి మిగిలిన భాగం. ఆ కమిషన్ అంతా, ఉత్పాదక కార్మికుల అదనపు విలువలోదే. కాబట్టి, 'వర్తక లాభం' కూడా ఆ అదనపు విలువలోదే.

ఈ బట్ట ఉదాహరణలో, బట్ట పెట్టుబడిదారుడి దగ్గిరా, అతని ఉత్పాదక - అనుత్పాదక కార్మికుల దగ్గిరా ( వర్తక కార్మికుల్ని కూడా కలుపుకుని ), వున్న మొత్తం డబ్బు ఎంత? అది ఎవరి శ్రమ?

" 'డబ్బు' అనేది ఉత్పాదక కార్మికుల శ్రమే ; అనుత్పాదక శ్రామికుల శ్రమ కాదు" అని మొదట్లో చెప్పుకున్నాం. దీన్నే తర్వాత చూస్తాం.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. వర్తక కార్మికులు చేసే పని ఏమిటి?

**జ** : తయారై వున్న సరుకుల్ని అమ్ముతారు. వాళ్ళు, ఏ సరుకునీ ఉత్పత్తి చెయ్యరు.

**2**. వస్తువుల్ని కొనే - అమ్మే వర్తకం శ్రమలు ఎంతో అవసరమైన శ్రమలే కదా? అవి సరుకు విలువలోకి ఎందుకు చేరవు?

**జ** : అవి, అవసరమైన శ్రమలు కావు కాబట్టే చేరవు. అవి అవసరమైన శ్రమలే అయితే, పెట్టుబడిదారుడు, తన సరుకుని వర్తకుడికి ఇచ్చేటప్పుడు, కొంత తగ్గింపు ధరతో ఎందుకు ఇవ్వవలసి వస్తుంది? పెట్టుబడిదారుడు, సరుకుని, వర్తకుడికే తగ్గింపు ధరతో ఇస్తాడు గానీ, వాడకందార్లందరికీ అలాగే ఎందుకు ఇవ్వడు? వర్తకం శ్రమలు, సరుకు విలువ లోకి చేరేటట్టయితే, పెట్టుబడిదారుడు తన సరుకుని వర్తకుడికి ఇచ్చే ధరే, దాని అసలు ధర అవ్వాలి. ఆ ధరతోనే పెట్టుబడిదారుడు ఆ సరుకుని అందరికీ ఇవ్వాలి. అలా జరగ దంటే, అది ఎందుకు జరగదో అర్థం చేసు కుంటే, మారకం శ్రమలు ఉత్పత్తి తయారవ డానికి అవసరమైన శ్రమలు కావని అర్థ మవుతుంది.

**3**. వర్తకం శ్రమలు జరగడానికి కొన్ని ఖర్చులు అవడం నిజమే కదా? ఆ ఖర్చులు అవసరమైన ఖర్చులు కాకపోతే, వాటిని ఎలా భరించాలి?

**జ** : ఏ ఉత్పత్తుల్ని అయితే అమ్ముతారో వాటి విలువలలో నించే మారకం ఖర్చుల్ని భరించాలి. స్వతంత్ర ఉత్పత్తిదారుడైనా, తన ఉత్పత్తుల్ని వర్తకుడి ద్వారా అమ్మిస్తే, ఆ ఖర్చు కోసం తన ఉత్పత్తి విలువలో నించే కొంత భాగాన్ని వదులుకోవాలి.

**4**. వర్తకం ఖర్చులు లేకుండా మారకాలు ఎలా జరుగుతాయి?

**జ** : మారకాలనేవి వుంటే, వర్తకం ఖర్చులు లేకుండా అవి జరగవు. మారకాలు జరగా లంటే, ఆ ఖర్చుల్ని భరించవలసిందే. అసలు మారకాలే అక్కరలేని పరిస్థితుల్ని ఏర్పర్చు కుంటే, ఆ అనవసరపు ఖర్చులు జరగవు. బట్ట ఉదాహరణలో, మారకాలే లేవను కుంటే, ఆ మారకం పనుల కోసం, బట్ట విలువలో నించి 5 విలువని, ఆ పనుల మీద వృధా చేసుకోనక్కర లేదు. వర్తకం పనుల్లో, షాపుల వంటి వాటి కోసం అవసరమయ్యే స్థలాల్నీ ఖర్చుల్నీ, ఎవరూ తిన్నట్టు కాదు. ఆ ఖర్చుల్ని ఆఖరికి, వర్తక పెట్టుబడిదారుడు కూడా తినడు. బట్ట ఉదాహరణలో, కమిషన్ 5 లో, కార్మికులు 2 ని జీతాలుగా వాడతారు. కానీ, అది వాళ్ళ శ్రమ డబ్బుగా మారడం వల్ల కాదు. వర్తక పెట్టుబడిదారుడు, 2 ని, లాభంగా సంపాదిస్తాడు. అది అతని శ్రమ కాదు. ఈ 2 అంశాలూ ఇలా వుంటే, షాపు ఖర్చుగా 1, ఎవరూ తినకుండా పోతుంది. ఇది, ఒక్క సరుకు సంగతి. అన్ని శాఖల్లోనూ, మొత్తం సంవత్సరంలో ఉత్పత్తి అయ్యే సరుకుల రాసిని ఊహించండి. దాని మారకాల కోసం, కోట్ల విలువా, షాపుల కోసం అనేక లక్షల గజాల భూమీ కావాలి. ఆ ఖర్చులు వృధా ఖర్చులు. కానీ, సరుకుల సమాజం అయిన పెట్టుబడిదారీ విధానంలో, మారకాల ఖర్చు కూడా అత్యవసర ఖర్చే!

**5**. మారకాలే అక్కరలేని పరిస్థితులు ఎలా ఏర్పడతాయి?

**జ** : వాటిని ఇక్కడ చర్చించలేము. 'కాపిటల్ పరిచయం' చూడాలి.

**6**. వర్తక కార్మికులు కూడా కార్మిక వర్గంలో వారు అవుతారా?

**జ** : తప్పకుండా అవుతారు. శ్రమ దోపిడీకి గురి అయ్యేది, ఉత్పాదక - అనుత్పాదక సెక్షన్లన్నీ కలిసే.

**H**

# 68. దేశంలో వున్న డబ్బు అంతా ఉత్పాదక కార్మికుల శ్రమలదే!

దేశంలో, స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా వుంటారు. వారు కూడా కొన్ని రకాల సరుకుల్ని ఉత్పత్తిచేసి అమ్ముతారు. చిన్న రైతు కుటుంబం వారు, కొంచెం ధాన్యమూ, కూరగాయలూ, పాలూ వంటి వాటిని అమ్ముతారు. కుట్టు మనిషి, ఇతరులకు బట్టలు కుట్టిపెట్టి డబ్బు తీసుకుంటాడు. వడ్రంగం మనిషి, చెక్క పనులు చేసిపెడతాడు. - ఈ రకంగా, స్వతంత్ర ఉత్పత్తిదారుల శ్రమలూ, వారు తయారు చేసే వస్తువులూ కూడా డబ్బుగా మారతాయి ; వాటికి డబ్బు వస్తుంది. అంటే, దేశంలో వున్న డబ్బులో, స్వతంత్ర ఉత్పత్తిదారుల శ్రమల వల్ల వచ్చే డబ్బు కూడా వుంటుంది.

కానీ, పెట్టుబడిదారీ సమాజాన్ని చూసేటప్పుడు, స్వతంత్ర ఉత్పత్తిదారుల సంఖ్య అతి స్వల్పం. అది లెక్కలోది కాదు. వారి డబ్బు పరిమాణం కూడా లెక్కలోది కాదు. ఆ డబ్బు కూడా వుంటుంది గానీ, దాని సంగతి ఇక్కడ తీసుకోవద్దు.

చాలా చిన్న స్థాయి పెట్టుబడిదారులు కూడా, తమ సరుకుల ఉత్పత్తిలో, కార్మికులతో పాటు కొన్ని పనులు చేస్తారు. అలాంటి పెట్టుబడిదారుల శ్రమల వల్ల వచ్చే డబ్బు కూడా దేశంలో వుంటుంది. [ వారి సాధారణ జీతాలూ, వాటి అదనపు విలువలూ మాత్రమే ఆ పెట్టుబడిదారుల శ్రమ. వారి పెద్ద పెద్ద జీతాలూ, లాభాలూ వంటివి వాళ్ళ శ్రమ కిందకి రావు. ]

చిన్న పెట్టుబడిదారుల శ్రమ సంగతి కూడా ఇక్కడ తీసుకోవద్దు.

స్వతంత్ర ఉత్పత్తిదారుల డబ్బునీ, చిన్న స్థాయి పెట్టుబడిదారుల శ్రమ భాగానికి సంబంధించిన డబ్బునీ - ఈ రెండు రకాల్నీ వదిలేసి, మిగిలే డబ్బునే చూస్తాం.

పెట్టుబడిదారీ సమాజంలో, ఏ శ్రమా చెయ్యని పెద్ద పెట్టుబడిదారుల వర్గాన్నీ, కార్మిక వర్గాన్నీ మాత్రమే తీసుకుని, ఆ వర్గాల మధ్య వుండే సంబంధాల్ని చూడాలి. పెట్టుబడిదారీ దేశంలో ఎక్కువ జనాభా, ఈ 2 వర్గాల్లోనే వుంటారు.

మొదట ఒక పెట్టుబడిదారుణ్ణీ, అతని ఉత్పాదక - అనుత్పాదక కార్మికుల్నీ తీసుకోవాలి. ప్రతీ పెద్ద పెట్టుబడిదారుడి దగ్గిరా అదే జరుగుతుంది.

బట్ట పెట్టుబడిదారుడి ఇంటి పని మనుషులందరూ అనుత్పాదక కార్మికులే. వారి శ్రమలు జరగడానికి కావలసిన సాధనాల ఖర్చులు గానీ, ఆ కార్మికుల జీతాలు గానీ, ఏవీ అమ్మకాలలోకి వెళ్ళవు ; డబ్బుగా మారవు. ఆ ఖర్చులన్నీ, ఉత్పాదక కార్మికుల అదనపు విలువలో భాగాలే.

సరుకుల్ని ఉత్పత్తి చేయించే వ్యక్తి - ఉత్పాదక పెట్టుబడిదారుడు. ఆ సరుకులు, వ్యవసాయ సరుకులైనా కావచ్చు ; పారిశ్రామిక సరుకులైనా కావచ్చు. ఒక సరుకులో వుండే అంశాలే ప్రతీ సరుకు

లోనూ వుంటాయి. ఒక ఉత్పాదక పెట్టుబడిదారుడి ద్వారా జరిగేదే, ప్రతీ ఉత్పాదక పెట్టుబడిదారుడి ద్వారానూ జరుగుతుంది.

వర్తక పెట్టుబడిదారులూ, వడ్డీ పెట్టుబడిదారులూ వంటి వాళ్ళు, ఉత్పాదక పెట్టుబడిదారులు కారు. వాళ్ళు సరుకుల్ని ఉత్పత్తి చేయించరు. (ఉత్పాదక పెట్టుబడిదారుల ద్వారా తయారైన సరుకులతోనే వాళ్ళు సంబంధాలతో వుంటారు.)

దేశంలో వుండే డబ్బు అంతా ఏమిటో ఒక సరుకు ఉదాహరణ ద్వారా చూద్దాం.

బట్ట - ఒక సరుకు. దాని విలువ 120. దాని లోపలి అంశాలు : ఉత్పత్తి సాధనాల 80 + జీతాల 20 + అదనపు విలువ 20 = 120.

ఈ బట్ట ఉదాహరణలో, బట్ట పెట్టుబడిదారుడి దగ్గిరా, అతని ఉత్పాదక - అనుత్పాదక కార్మికుల దగ్గిరా, బట్టలోని అదనపు విలువని పంచుకునే వాళ్ళందరి దగ్గిరా వుండే ' మొత్తం - డబ్బు' ఎంత? అది ఎక్కడిది? - ఈ ఒక్క సరుకులో విషయాలు అర్థం చేసుకుంటే, డబ్బు సంగతులన్నీ అర్థమవుతాయి.

ఈ బట్ట తయారీ కోసం, ఉత్పాదక కార్మికులు 40 విలువ గల శ్రమ చేశారు. బట్టని అమ్మినప్పుడు, ఉత్పత్తి సాధనాల 80 తో పాటు కార్మికుల 40 శ్రమ కూడా డబ్బుగా మారింది. ఆ కార్మికుల్లో, శారీరక శ్రమల వాళ్ళూ, మేధా శ్రమల వాళ్ళూ, అందులో మళ్ళీ నైపుణ్యాలు గల వాళ్ళూ, నైపుణ్యాలు లేని వాళ్ళూ - ఇలా రక రకాల కార్మికులు వుండవచ్చు. వాళ్ళందరి జీతాలూ కలిసి 20 కాబట్టి, వాళ్ళందరి దగ్గిరా వుండే డబ్బు 20. ( ఇది ఒక్క సరుకు లెక్క. )

ఈ ఉత్పాదక కార్మికుల అదనపు విలువ ఇంకో 20. ఇది ఎన్ని పేర్లతో పంపకాలవుతుందో మనకు తెలుసు. వీటిని ఇంకో సారి చూద్దాం.


**కౌలు :** అదనపు విలువలో నించే 'కౌలు' భాగం భూస్వామికి వస్తుంది. భూస్వామి, ఒక భూమిని 'పరిశ్రమ' కోసం ఇస్తే, 'పరిశ్రమ - సరుకుల' నించి కౌలు వస్తుంది. భూమిని వ్యవసాయం కోసం ఇస్తే, 'వ్యవసాయ - సరుకుల' నించి కౌలు వస్తుంది. భూస్వామి ఆదాయంగా వుండే కౌలు డబ్బు, ఆ సరుకుల్ని తయారు చేసిన ఉత్పాదక కార్మికుల శ్రమలోదే. ఆ కౌలు డబ్బుతోనే భూస్వామి కుటుంబ పోషణా, గృహ సేవకుల జీతాలూ వెళ్తాయి. ఆ సేవకుల ద్వారా దొరికే అదనపు శ్రమలు, డబ్బు ఖర్చుని తగ్గిస్తాయి. ఆ కౌలు డబ్బులో నించే ఇంట్లో ఆడవాళ్ళకు నగలూ, ఆడంబరాల బట్టలూ, భవనాలూ, అప్పుడప్పుడూ కొత్త భూముల కొనుగోళ్ళూ, రోజువారీ విలాసాలూ అన్నీ. భూస్వామి కుటుంబ జీవితం, ( 1 ) ఉత్పాదక కార్మికుల అదనపు విలువ తోనూ, ( 2 ) గృహ సేవకుల అదనపు శ్రమల తోనూ, సాగుతుంది. స్వంత శ్రమ గానీ, ఆ శ్రమ వల్ల వచ్చే డబ్బు గానీ, లేకుండా!


**వర్తక లాభం :** ఆ బట్టని ( ఆ సరుకుని ), తన కార్మికుల ద్వారా అమ్మించే వర్తక పెట్టుబడిదారుడి కథ కూడా భూస్వామి కథ లాంటిదే. ఇతనికి చివరికి అందే 'వర్తక లాభం' ఎలా వస్తుందో మనకు తెలుసు. ఇతని కుటుంబ పోషణా, భోగాలూ, 3 అంశాల మీద ఆధారపడ

తాయి. ( 1 ) తను ఏ సరుకుల్ని అమ్మిస్తాడో ఆ సరుకుల్ని తయారుచేసే ఉత్పాదక కార్మికుల అదనపు విలువా, ( 2 ) తన దగ్గిర పనిచేసే వర్తక కార్మికుల అదనపు శ్రమలూ, ( 3 ) గృహ సేవకుల అదనపు శ్రమలూ - ఈ 3 అంశాలతో! తన స్వంత శ్రమ వల్ల వచ్చే డబ్బు లేకుండా!

**స్వతంత్ర వర్తకుల ఆదాయం** : ఇక్కడ, 'స్వతంత్ర వర్తకుల' ఆదాయాన్ని కూడా అర్థం చేసుకోవాలి. ఈ ఆదాయానికి కూడా ఉత్పాదక కార్మికుల అదనపు విలువతో సంబంధం ఉంటుంది. తనకు యజమాని లేకుండా, తను యజమానిగా లేకుండా, వర్తకం పనులు స్వయంగా చేసుకునే వ్యక్తి, స్వతంత్ర వర్తకుడు. ఇతను, మొదట సరుకుల్ని ఎక్కడ కొంటాడు? - ఉత్పాదక పెట్టుబడిదారుల దగ్గిర గానీ, వర్తక పెట్టుబడిదారుల దగ్గిర గానీ, స్వతంత్ర ఉత్పత్తిదారుల దగ్గిర గానీ, కొంటాడు. వాటినే అమ్ముతాడు. ఇతను వర్తకుడు కాబట్టి, సరుకుల్ని ఎక్కడ కొన్నా అవి, తగ్గింపు ధరతోనే ( కమిషన్‌తోనే ) దొరుకుతాయి. స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా తమ సరుకుల్ని వర్తకులకు తగ్గింపు ధరలతో ఇవ్వవలిసిందే.

స్వతంత్ర వర్తకుడు వర్తకం పనులన్నీ స్వయంగా చేసుకుంటాడు. ఇతనికి కూడా వర్తకం పనుల కోసం కొన్ని ఖర్చులు అవుతాయి. 'కమిషన్' లో నించే వాటిని ఖర్చు పెట్టాలి. సరుకుల్ని అమ్మేశాక చివరికి 'వర్తక లాభం' మిగులుతుంది. అదే స్వతంత్ర వర్తకుడి ఆదాయం. అది, 'వర్తక కమిషన్' లో నించి మిగిలినదే. అంటే, ఆ లాభం, ఆ సరుకుల్ని తయారుచేసిన




ఉత్పాదక కార్మికుల అదనపు శ్రమ లోదే.

అయితే, స్వతంత్ర వర్తకుడు చేసిన 'వర్తకం శ్రమ' ఏమవుతుంది? - అనుత్పాదక కార్మికుల శ్రమ ఏమవుతుందో, ఇదీ అదే అవుతుంది. స్వతంత్ర వర్తకుడు, అనుత్పాదక కార్మికుడు కాడు. కానీ, ఇతని శ్రమ కూడా మారకాల శ్రమే కాబట్టి, ఆ శ్రమ, సరుకు విలువలోకి చేరదు. అది డబ్బుగా మారదు. అయితే, ఇతనికి చివరికి అందే వర్తక లాభం, ఏ శ్రమా చెయ్యకుండా తీసుకునేది కాదు. తను చేసిన శ్రమకు బదులుగానే అది అందుతుంది. కాబట్టి, స్వతంత్ర వర్తకుడు, తన శ్రమతో జీవించే వ్యక్తే గానీ, వర్తక పెట్టుబడిదారుడి లాగ, శ్రమ దోపిడీతో జీవించే వ్యక్తి కాడు.

**వడ్డీ** : బట్ట విలువలో నించే వడ్డీని సంపాదించే వడ్డీ పెట్టుబడిదారుడి కథ కూడా, ఇతర పెట్టుబడిదారుల కథల లాంటిదే. వడ్డీల తోనే కుటుంబ పోషణా, సేవకులూ, విలాసాలూ! అంతే కాదు, వడ్డీల ద్వారా వచ్చే ఆదాయంలో నించి కొంత డబ్బుని 'వడ్డీ పెట్టుబడి' కి కలిపి దాన్ని ఇంకా పెంచడం కూడా!

**పన్నులు** : బట్ట అదనపు విలువలో నించే ప్రభుత్వానికి 'పన్నులు' వెళ్తాయి. ఆ పన్నుల తోనే, ప్రభుత్వ ఆఫీసుల ఖర్చులూ, మంత్రుల భారీ జీతాలూ, పోలీసూ, సైన్యమూ, కోర్టులూ, జైళ్ళూ అన్నీ నడుస్తాయి!

పోలీసులూ, సైనికులూ కూడా అనుత్పాదక కార్మికులే. కానీ, వీరు, పెట్టుబడిదారీ వర్గం చేసే శ్రమ దోపిడీనే రక్షించే కార్మికులు. ఈ కార్మికులు, కార్మిక వర్గానికే వ్యతిరేకమైన, కార్మికుల పోరాటాల్ని అణిచే శ్రమలు చేసే స్థానాల్లో వుంటారు. వెనకటి బానిస సమాజాల నించీ కూడా ఈ పనులు జరుగుతున్నాయి.

**ఉత్పాదక లాభం** : అదనపు విలువలో నించి అన్ని పంపకాలూ అయ్యాక, చివరికి బట్ట పెట్టుబడిదారుడికి 'ఉత్పాదక లాభం' (సరుకుని ఉత్పత్తి చేయించినందుకు వచ్చే లాభం), మిగులుతుంది. దానితో అతని కుటుంబ పోషణా, గృహ సేవకులూ, అన్నీ! లాభంలో కొంత భాగాన్ని పాత పెట్టుబడికి కలిపితే, పెట్టుబడి పెరుగుతూ వుంటుంది కూడా. ఉత్పాదక పెట్టుబడిదారుడి జీవితాన్ని (1) ఉత్పాదక కార్మికుల అదనపు విలువా, (2) పని స్థలంలో వుండే అనుత్పాదక కార్మికుల అదనపు శ్రమలూ, (3) గృహ సేవకుల అదనపు శ్రమలూ - ఈ 3 అంశాలూ కలిసి, ఆనందమయం చేస్తూ వుంటాయి.

ఇప్పటి దాకా, జీతాల 20 నీ, అదనపు విలువ 20 నీ, చూశాం.

జీతాల 20 డబ్బు ఉత్పాదక కార్మికుల చేతుల్లో వుంటుంది. అదనపు విలువ 20 డబ్బు, దాన్ని పంచుకున్న వాళ్ళ చేతుల్లో, వాళ్ళ ఆదాయాలుగా వుంటుంది. వీళ్ళు, అనుత్పాదక శ్రామికులకు జీతాలు, తమ ఆదాయాల్లో నించే ఇస్తారు కాబట్టి, ఆ రకంగా కొంత డబ్బు, అనుత్పాదక శ్రామికుల చేతుల్లో వుంటుంది.

ఉత్పాదక శ్రామికుల చేతుల్లో వున్న డబ్బు, వారి శ్రమే. దోపిడీదారుల ఆదాయాలుగా వున్న డబ్బు కూడా ఉత్పాదక శ్రామికుల శ్రమే. అనుత్పాదక శ్రామికుల చేతుల్లో జీతాలుగా వున్న డబ్బు కూడా, ఉత్పాదక శ్రామికుల శ్రమే! - ఇప్పటికి, బట్ట విలువ అయిన 120 లో, ఉత్పాదక కార్మికుల 40 విలువ గురించి చూశాం. మరి, ఉత్పత్తి సాధనాల 80 విలువ సంగతి ఏమిటి? ఆ డబ్బు ఎవరి శ్రమ? ఆ డబ్బు కూడా సమాజంలో వుంటుంది కదా?

**ఉత్పత్తి సాధనాల 80** : బట్ట విలువలో, ఉత్పత్తి సాధనాల 80 డబ్బుని బట్ట పెట్టుబడిదారుడి డబ్బుగా అనుకుంటాం. కాని ఇది అతని శ్రమ కాదని గతంలోనే చూశాం. ఉత్పత్తి సాధనాల 80 విలువ - బట్టలోకి చేరిన పాత విలువ. ఈ శ్రమ, గతంలోనే జరిగి, డబ్బు లెక్కలోకి మారి వున్నది.

ఉత్పత్తి సాధనాల 80 లో కూడా, వెనకటి పాత శ్రమా - కొత్త శ్రమా కలిసి వుంటాయి. ఆ వెనకటి 'పాత శ్రమ' ని

తీసుకుంటే, అది కూడా పాత - కొత్తలతో కలిసి వుంటుంది. ఆ రకంగా, వెనక్కి వెనక్కి వెళ్తే, పాత శ్రమే లేని దశ ఒకటి వుంటుంది. ఆ నాటి నించీ జరిగి సజీవ శ్రమ తోనే ఉత్పత్తి సాధనాలు ఏర్పడ తాయి. ఆ నాటి నించీ శ్రమ అంతా శ్రామికులు చేసినదే.

ఒక పని స్తలంలో, పాత ఉత్పత్తి సాధ నాలు ఖర్చయిపోయేటప్పటికి, వేరే పని స్తలాల్లో కొత్త ఉత్పత్తి సాధనాలు తయారై సిద్ధంగా వుంటాయి. ఆ పని స్తలాల్లో శ్రమలు చేసేది ఉత్పాదక కార్మికులే.

వెనకటి ఉత్పత్తి సాధనాల్ని చూసినా, కొత్తగా తయారైవున్న ఉత్పత్తి సాధనాల్ని చూసినా, ఆ విలువ అంతా శ్రామికుల శ్రమదే.

బట్ట, ఉదాహరణలో, ఉత్పాదక కార్మి కుల శ్రమని (40 ని) చూసేటప్పుడు ఉత్పత్తి సాధనాల విలువ సంగతి అన వసరం. ఎందుకంటే, బట్ట విలువలో, ఉత్పత్తి సాధనాల 80 ని చూస్తూ వెనక్కి వెళ్తే, బట్ట కార్మికుల శ్రమని చూడడం గాక, వెనకటి కార్మికుల శ్రమల్ని చూస్తూ వెళ్ళి నట్టు అవుతుంది. కాబట్టి ఉత్పత్తి సాధ నాల్ని ఇక్కడ చూడనక్కరలేదు. ఇక్కడ బట్ట కార్మికుల కొత్త శ్రమనే చూడాలి. అదే ప్రతీ వస్తువుకీ వర్తిస్తుంది.

ఒక ఉత్పాదక పెట్టుబడిదారుడికి ఎంత అదనపు విలువ వచ్చిందో లెక్క కట్టా లంటే, అతని లెక్కల్లో కనపడే కౌలూ - వడ్డీ - పన్నులూ - వర్తక కమిషనూ - అతని ఉత్పాదక లాభమూ వగైరా అంశాలన్నిటినీ కలిపితే చాలదు. పని స్తలంలో వున్న జీతాల్లో, వాచ్‌మేన్ వంటి వాళ్ళ జీతాల్నీ, మేనేజర్ల జీతాల్నీ,పెట్టుబడిదారుడి జీతాల్నీ కూడా కలపాలి. అవి అనుత్పాదక జీతాలే కాబట్టి. అనుత్పాదక ఖర్చులూ, అనుత్పా దక జీతాలూ అన్నీ కలిసినదే - ఆ సరుకు వల్ల వచ్చే అదనపు విలువ.

ఒక్క సరుకులో జరిగేదే అన్ని సరుకు లకూ జరుగుతుంది. ఒక్క ఉత్పాదక పెట్టు బడిదారుడి పని స్తలంలో జరిగేదే మొత్తం సమాజం అంతా జరుగుతుంది.

**చివరికి తేలేది :**

పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి అయ్యే 'డబ్బు' అంతా, ఉత్పాదక కార్మి కుల శ్రమే. అందులో, అనుత్పాదక కార్మి కుల శ్రమ వల్ల వచ్చే డబ్బు ఏమీ వుండదు. ఆ శ్రమ, డబ్బుగా మారదు కాబట్టి.

ఆ సమాజంలో, చిన్న స్థాయి పెట్టు బడిదారులూ, స్వతంత్ర ఉత్పత్తిదారులూ కూడా వుంటారు కాబట్టి, వారి శ్రమ వల్ల వచ్చే డబ్బు కూడా కొంత వుంటుంది.

కానీ, భూస్వాములు చేసే శ్రమ గానీ, పెద్ద పెట్టుబడిదారులు చేసే శ్రమ గానీ వుండవు కాబట్టి, వాళ్ళ డబ్బు ఒక్క పైసా అయినా వుండదు.

ఉత్పాదక కార్మికుల జీతాలుగా వున్న డబ్బు అంతానూ, భూస్వాముల చేతుల్లో వున్న డబ్బు అంతానూ, ఉత్పాదక - వర్తక - వడ్డీ పెట్టుబడిదారుల చేతుల్లో వున్న డబ్బు అంతానూ, ప్రభుత్వం చేతుల్లో వున్న డబ్బు అంతానూ, అనుత్పాదకంగా ఖర్చయ్యే సాధనాల విలువ అంతానూ, అనుత్పాదక కార్మికుల జీతాలుగా వున్న డబ్బు అంతానూ, - ఈ రకంగా, సమా జంలో డబ్బుగా కనపడేది అంతా, మొత్తం దేశంలో అన్ని శాఖల్లోనూ వున్న కోట్ల కొద్దీ ఉత్పాదక కార్మికుల శ్రమే.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. శ్రమలు డబ్బుగా మారడం ఎప్పుడు జరుగుతుంది? ఎప్పుడు జరగదు?

**జ** : ఆ శ్రమలు గానీ, ఆ శ్రమలతో తయారైన ఉత్పత్తులు గానీ, అమ్మకంలోకి వెళ్ళి నప్పుడే, ఆ శ్రమలు డబ్బుగా మారడం జరుగుతుంది; లేకపోతే లేదు.

**2** . ఒక వ్యక్తి, ఒక ఉత్పత్తిని అమ్మాడు. దాని విలువ అంతా డబ్బుగా అందింది. అది, ఏ సందర్భంలో జరుగుతుంది? ఆ వ్యక్తి, స్వతంత్ర ఉత్పత్తిదారుడా, పెట్టుబడి దారుడా, కార్మికుడా?

**జ** : కార్మికుడైతే కాదు. కార్మికుడు, తన శ్రమని అమ్ముతాడు గానీ, ఏ ఉత్పత్తినీ అమ్మడు. ఉత్పత్తుల్ని అమ్మే వ్యక్తి స్వతంత్ర ఉత్పత్తిదారుడైనా కావచ్చు ; పెట్టుబడిదారుడైనా కావచ్చు.

**3** . కుట్టు పని చేసే ఒక కార్మికుడు, తన ఇంటి దగ్గిర కూడా కుట్టు పని చేసి, ఆ దుస్తుల్ని అమ్మితే?

**జ** : ఇంటి దగ్గిర బట్టలు కుట్టిపెట్టే సందర్భంలో గానీ, దుస్తుల్ని కుట్టి అమ్మే సందర్భంలో గానీ, అతను కార్మికుడు అవడు, స్వతంత్ర ఉత్పత్తిదారుడు అవుతాడు.

**4** . ఒక చిన్న పిల్ల, చిన్న డబ్బు నాణెంతో రేగు పళ్ళు కొనుక్కుంది. ఆ డబ్బు ఏమిటి? అది ఎవరి శ్రమ?

**జ** : ఆ చిన్న పిల్లకి, ఆ నాణెం ఎవరు ఇచ్చారో మొదట తెలియాలి. తల్లిదండ్రులు ఇచ్చారా, మేనత్త ఇచ్చిందా? ఆ డబ్బుని ఇచ్చిన వాళ్ళు కార్మికులా వర్తకులా, కార్మికులైతే ఉత్పాదక కార్మికులా అనుత్పాదక కార్మికులా? ఇన్ని వివరాలు తెలిస్తే, ఆ డబ్బు, ఏమిటో ఎటు నించి వచ్చిందో తెలుస్తుంది. అది 'వడ్డీ' లోది కావచ్చు ; 'లాభం' లోది కావచ్చు ; 'కౌలు' లోది కావచ్చు. 'జీతం' లోది కావచ్చు. 'డబ్బు' అనేది, ఏ పేరుతో వచ్చినా, అది ఉత్పాదక కార్మికుల శ్రమల విలువే.

**5** . అనుత్పాదక శ్రామికుడు, యజమాని దగ్గిర పని చేస్తాడు. జీతం తీసుకుంటాడు. అతను, తన శ్రమ అమ్ముకున్నట్టేనా?

**జ** : అమ్ముకున్నట్టే. అయితే, ఆ శ్రమని యజమాని, బైటికి అమ్మడు.

**6** . ప్రభుత్వానికి పన్నులుగా అందే డబ్బులో, అనుత్పాదక కార్మికుల శ్రమ విలువ కూడా వుంటుందా?

**జ** : ఉండదు. ప్రభుత్వ ధర్మాసుపత్రుల్లాంటి ఉచిత సంస్థల్లో పనిచేసే అనుత్పాదక కార్మికుల్లో మేధా శ్రమల వాళ్ళు కూడా 'ఆదాయం పన్ను' కడతారు. దాన్ని తమ జీతాల్లో నించే కడతారు. కానీ, ఆ జీతాలు, వారి శ్రమలు డబ్బుగా మారడం వల్ల వచ్చేవి కావు. ఆ జీతాల్ని, ప్రభుత్వం, రక రకాల పన్నుల వల్ల వచ్చే ఆదాయం నించే ఇస్తుంది. ఆ పన్నులన్నీ ఉత్పాదక కార్మికుల అదనపు విలువలో నించి పెట్టుబడిదారులు కట్టేవే. కాబట్టి, పన్నులుగా వున్నది, ఉత్పాదక కార్మికుల శ్రమ విలువే. అనుత్పాదక కార్మికులు కూడా పన్నులు కట్టినా, అది వారి శ్రమ నించి మారిన డబ్బు కాదు.


**7** . ఒక దేశంలో, ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి అయ్యే అదనపు విలువ →

రాసిని లెక్క కట్టాలంటే, కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ - పన్నులూ - అనుత్పాదక ఖర్చులూ - వంటి వాటినన్నిటినీ లెక్క కట్టాలని చెప్పారు. అలా లెక్క కడితే, అది కోట్ల కోట్ల కోట్ల రూపాయల రాసి అవుతుంది. ఉత్పాదక కార్మికులు ఇచ్చే అదనపు విలువ అంత ఎక్కువగా ఉంటుందా?

**జ :** అలా లెక్క కట్టగా వచ్చిన రాసి, చాలా ఎక్కువగా వున్నట్టు కనపడితే, " ఇంత ఎక్కువ శ్రమ దోపిడీ జరుగుతోందా?" అని ఆశ్చర్యపోవాలి. అంత ఎక్కువ అదనపు విలువ లేకపోతే, ప్రభుత్వ ఆఫీసులూ, పోలీసూ, సైన్యమూ, వాటి కోసం భవనాలూ, వాటి కోసం ఆయుధాలూ, అవన్నీ ఎలా వస్తున్నాయి? సైన్యం అంటే, అది నేల మీదా, నీటి మీదా, ఆకాశంలోనూ తిరుగుతుంది. భూస్వాముల కుటుంబాలకూ, పెట్టుబడిదారుల కుటుంబాలకూ, ఆకాశానికి అందేటంత ఎత్తు సిరి సంపదలు ఎక్కణ్ణించి వస్తున్నాయి? దేశం నిండా తిరిగే లంచాల ధనం ఎక్కణ్ణించి వస్తోంది? " అదనపు విలువ అంత ఎక్కువగా వుంటుందా?" అనే ప్రశ్న కన్నా ముందు, " అదనపు విలువ - అంటే ఏమిటి? శ్రమ దోపిడీ - అంటే ఏమిటి?" అనే ప్రశ్నలు వేసుకుని వాటిని అర్థం చేసుకోవాలి. అది అర్థమైతే, సిరి సంపదలు ఎలా కూడుతున్నాయో, రాజ్యాంగంలో శాఖలన్నీ ఎలా నడుస్తున్నాయో అర్థమవుతుంది.

**8**. ఒక సరుకుని తీసుకుని, దాని అంతర్గత భాగాల ద్వారా, ఉత్పాదక - అనుత్పాదక విభజనని చూపించండి!

**జ :**




అదనపు విలువని ఎవరెవరైతే తింటారో వాళ్ళల్లో ప్రతి ఒక్కరి దగ్గిరా గృహ సేవలు చేసే అనుత్పాదక కార్మికులు ఉంటారు. 'కౌలు'లో నించి కొంత భాగం అనుత్పాదక ఖర్చు. 'వడ్డీ'లో నించి కొంత భాగం అనుత్పాదక ఖర్చు. అలాగే, ప్రతీ ఒక్క ఆదాయంలో నించీ కొంత భాగం అనుత్పాదక ఖర్చులే. మేధాశ్రమల కార్మికుల ఇళ్ళల్లో కూడా అనుత్పాదక కార్మికులు ఉంటారు.


**H**

# 69. ఉత్పత్తి తయారైన తర్వాత కూడా చేరే విలువలు!


ఇక్కడ మనం, 'సరుకు విలువ' గురించి, ఇంకా కొన్ని విషయాలు చూడాలి. బట్ట, ఒక ఉత్పత్తి స్థలంలో తయారైనప్పుడు దాని విలువ 120 కదా? దాన్ని మనం ఏదైనా ఒక బట్టల షాపులో కొనాలంటే, ఆ విలువ 120 గా మాత్రమే వుండదు. ఆ సరుకు అక్కడికి చేరేటప్పటికి దానికి ఇంకా కొన్ని అత్యవసర విలువలు కలిసి, ఆ విలువ 120 కన్నా కొంత పెరుగుతుంది. ముఖ్యంగా దానికి రవాణా శ్రమా, స్టోరు శ్రమా వంటివి కలుస్తాయి.

**రవాణా శ్రమ :**

ఒక ఉత్పత్తి స్థలంలో తయారైన వస్తువు, వాడకందార్లకు చేరాలంటే, అది ఆ ఉత్పత్తి స్థలంలో నించి బైటికి రావాలి. దాన్ని బండి మీదో బస్సు మీదో, బైటికి తీసుకురావాలి. అది, రవాణా శ్రమ. అది అవసరమైన శ్రమే. రవాణా శ్రమ వల్ల, ఆ వస్తువు శరీరం మీద మార్పేమీ జరగదు. కానీ, ఆ వస్తువు ఒక చోటు నించి ఇంకో చోటుకి చేరుతుంది. ఆ రవాణా శ్రమే జరగకుండా ఆ వస్తువు ఉత్పత్తి స్థలంలోనే వుండిపోతే, దాన్ని వాడడమే సాధ్యం కాదు.



రవాణా శ్రమ




రవాణా శ్రమ

రవాణా శ్రమ, వస్తువుని తయారుచేసే శ్రమ కాకపోయినా, వస్తువుని వాడకందార్ల దగ్గిరికి చేర్చడానికి అవసరమయ్యే శ్రమ. కాబట్టి, అది ఉత్పాదక శ్రమే. రవాణా కార్మికులు, ఉత్పాదక కార్మికులే. 120 విలువ గల బట్టని ఒక షాపు దగ్గిరికి చేర్చడానికి రవాణా శ్రమ కోసం, 4 ఖర్చయిందనుకుందాం. ఆ విలువ, 120 కి చేరుతుంది. అయితే, ఆ రవాణా 4 విలువ కూడా, 3 భాగాలుగా వుంటుంది. ఆ రవాణా శ్రమ జరగడానికి అవసరమయ్యే ఉత్పత్తి సాధనాలూ + రవాణా కార్మికుల జీతాలూ + ఆ కార్మికుల అదనపు విలువా. ఈ 3 అంశాలూ కలిసినదే ఆ రవాణా 4 విలువ.

**స్టోరు చేసే శ్రమ :**

రవాణా శ్రమ విలువ లాగే, ప్రతీ ఉత్పత్తికీ 'స్టోరు శ్రమ' విలువ కూడా కలుస్తుంది. ఏ ఉత్పత్తి విషయంలో అయినా, అది తయారైన తర్వాత, వెంటనే మరుక్షణంలోనే దాన్ని వాడెయ్యడం జరగదు. వాడకం అయ్యే వరకూ దాన్ని ఒక చోట నిలవచేసి సంరక్షిస్తూ వుండాలి. 'పాల' ని అయితే, మర్నాటి దాకా నిలవ వుంచాలి. 'కూరగాయల్ని' అయితే, వారం రోజులైనా నిలవ వుంచాలి. ధాన్యాన్ని అయితే, ఒక సంవత్సరం దాకా నిలవ వుంచాలి. - ఈ రకంగా, ప్రతీ ఉత్పత్తికీ, దాని వాడకం పూర్తి



అయ్యే లోగా, కొన్ని స్టోరు ఖర్చులు అవుతాయి. అది సహజమైన అవసరమే. ఆ పనుల కోసం కూడా కార్మికులు వుండాలి. స్టోరు ఖర్చులు కూడా ఉత్పత్తి విలువలోకి చేరి, ఆ విలువ పెరుగుతుంది.

**ప్యాకింగ్ శ్రమ :**

ఉత్పత్తుల్ని 'ప్యాక్ చేసే' శ్రమ కూడా ఉత్పాదక శ్రమే. పొలంలో పండిన ధాన్యాన్ని ఒక స్టోరులో వుంచాలన్నా, లేదా రవాణాలో పంపాలన్నా, దాన్ని బస్తాల్లో కట్టి వుంచాలనుకుందాం. ఆ బస్తాల ఖర్చు కూడా అవసరమైన ఖర్చే. బస్తా ఖర్చు కూడా ధాన్యం విలువకి చేరుతుంది. - ఈ రకంగా, సహజ అవసరాల ఖర్చులన్నీ ఉత్పత్తి విలువకి చేరతాయి.



**అడ్వర్టయిజ్‌మెంట్ శ్రమ :**

సరుకుల గురించి ప్రకటనలు చేసే ఖర్చులు, పూర్తిగా అనుత్పాదక ఖర్చులు. ఒక ఉత్పత్తి గురించి అడ్వర్టయిజ్ చేసే శ్రమ, ఆ ఉత్పత్తి తయారీకి గానీ, దాని వాడకానికి గానీ, అవసరమైన ఖర్చు కాదు. ఈ ప్రకటనలు లేకుండానే వస్తువుల్ని తయారు చెయ్యవచ్చు; వాడుకోవచ్చు. ఈ విలువ, ఉత్పత్తికి చేరదు. అంటే, ఈ ఖర్చు అంతా, ఉత్పత్తి తాలూకు అదనపు విలువలో భాగమే.

సమాజంలో తయారయ్యే ఉత్పత్తుల రాసిలో ఎంత అదనపు విలువ వుందో లెక్క కట్టాలంటే, మొత్తం అడ్వర్టయిజ్‌మెంట్ ఖర్చుల్ని కూడా అందులో కలపాలి.

శ్రమల్లో, ఉత్పాదక - అనుత్పాదక విభజన, వెనకటి కాలాల్లో లేదు. ఇది పెట్టుబడిదారీ విధానానికే ప్రత్యేకం.

బానిస సమాజంలో, బానిసలు, యజమాని భూమిలో అనేక పంటలు పండిస్తారు. ఆ పంటల్లో నించి యజమాని, కొంత భాగాన్నే అమ్ముతాడు, ఎక్కువ భాగాన్ని అమ్మడు. అమ్మిన పంట మాత్రమే డబ్బుగా మారుతుంది. మిగిలిన పంట డబ్బుగా మారదు. ఆ పంటలు పండించిన బానిసలు, ఉత్పాదక శ్రామికులు అవుతారా, అనుత్పాదక శ్రామికులు అవుతారా? రెండూ అవుతారా? - రెండూ అవుతారు. అంటే, ఏదీ అవరు. అక్కడ, ఆ విభజన కుదరదు.

అలాగే, కౌలు రైతుల సంగతి కూడా. వాళ్ళు పండించే పంటల్లో నించి కొంత భాగం కౌలుగా పోయి, కొంత భాగం రైతు కుటుంబాలకు మిగులుతుంది. ఆ పంటలో ఎక్కువ భాగం, అమ్మకంలోకి వెళ్ళదు. డబ్బుగా మారదు. కొంత భాగానికే అలా జరుగుతుంది. కౌలు రైతులు, ఉత్పాదక శ్రామికులు అవుతారా, అనుత్పాదక శ్రామికులు అవుతారా? రెండూ అవుతారా? - ఇక్కడ కూడా ఆ విభజన కుదరదు.

కానీ, పెట్టుబడిదారీ విధానంలో అయితే, పెట్టుబడిదారుడు తయారు చేయించే సరుకు అంతా పూర్తిగా అమ్మకం లోకి వెళ్ళిపోతుంది. అంతా డబ్బుగా మారుతుంది. సైను బట్ట పెట్టుబడి దారుడు, రోజూ వెయ్యి మీటర్ల బట్టని ఉత్పత్తి చేయిస్తే, నెలకి, 30 వేల మీటర్లు అవుతుంది. సంవత్సరానికి, 3 లక్షల 60 వేల మీటర్ల బట్ట. (సెలవ రోజుల్ని తీసేస్తే, బట్ట కొంచెం తగ్గుతుంది.) ఇందులో నించి, ఆ పెట్టుబడిదారుడి కుటుంబం, తన స్వంత అవసరాల కోసం, సంవత్సరానికి ఎంత సైను బట్టని వాడు తుంది? - ఒక్క మీటరు కూడా వాడక పోవచ్చు. లేదా, వంటింట్లో మసి గుడ్డల లాంటి వాటి కోసం వాడితే సంవత్సరానికి 10 మీటర్లు వాడవచ్చు. అంటే, 3 లక్షల 60 వేల మీటర్లలో నించి, 10 మీటర్లని తీసేస్తే, మిగిలిన బట్టనంతా అమ్మెయ్యాలి. ఆ డబ్బంతా వస్తే, మళ్ళీ కొత్త ఉత్పత్తి సాధనాలు కొనాలి. జీతాలు డబ్బుతో ఇవ్వాలి. కౌళ్ళూ, వడ్డీలూ, పన్నులూ కట్టాలి. ప్రతీ లెక్కా డబ్బుతో జరగాలి. అందుకే, మొత్తం సరుకునంతా అమ్మేసి డబ్బుగా మార్చాలి.

ఒక పెట్టుబడిదారుడు, సిమ్మెంటుని ఉత్పత్తి చేయిస్తాడు. రోజుకి 500 బస్తాలు. నెలకి ఎంత? సంవత్సరానికి ఎంత? అందులో నించి తన ఇంటి అవసరానికి ఎంత వాడతాడు? - గుప్పెడు కూడా వాడడు. అన్ని వేల బస్తాలూ అమ్మెయ్యాలి.

ఒక పెట్టుబడిదారుడు దిన పత్రికలు ఉత్పత్తి చేయిస్తాడు. రోజుకి లక్ష కాపీలు. అందులో నించి తన స్వంతానికి ఎన్ని కాపీలు వాడతాడు? మహా అయితే 2. ఆ 2 తప్ప, మిగిలిన లక్ష కాపీల్నీ అమ్మెయ్యాలి.

ఈ రకంగా, ప్రతీ పెట్టుబడిదారుడూ, తన సరుకునంతా అమ్మెయ్యాలి. మళ్ళీ, పని స్థలంలోకీ, ఇంటిలోకీ కావలసిన వస్తువులన్నిటినీ కొనుక్కోవాలి. అందుకే పెట్టుబడిదారీ విధానానికి, '**సరుకు ఉత్పత్తి విధానం**' అనే ఇంకో పేరు కూడా వుంటుంది. అందుకే, శ్రమల్లో 'ఉత్పాదక - అనుత్పాదక విభజన' అనేది, పెట్టుబడిదారీ విధానానికే ప్రత్యేక లక్షణం అవుతుంది. సరుకుల్ని ఉత్పత్తి చేసి, డబ్బుని పెంచేది - ఉత్పాదక శ్రమా, డబ్బుని ఖర్చు చేసేది అనుత్పాదక శ్రమా అవుతాయి.

ఉత్పాదక కార్మికులూ, అనుత్పాదక కార్మికులూ కూడా అదనపు శ్రమలు పోగొట్టుకుంటూ శ్రమ దోపిడీకి గురి అవుతారని చూశాం. అయితే, ఇందులో, అనుత్పాదక కార్మికుల విముక్తి, ఉత్పాదక కార్మికుల విముక్తి మీదే ఆధారపడి వుంటుంది. పెట్టుబడిదారీ వర్గానికి, ఉత్పాదక కార్మికుల ద్వారా వచ్చే అదనపు విలువ ఆగిపోతే, ఆ వర్గం, అనుత్పాదక శ్రమల మీద ఖర్చు పెట్టడం సాధ్యం కాదు. ఉత్పాదక కార్మికుల ద్వారా వచ్చే అదనపు విలువ పెరుగుతూ, పెట్టుబడులు పెరుగుతూ, అదనపు విలువ ఇంకా పెరుగుతూ వుంటే, యజమాని వర్గం, అనుత్పాదక సేవల్ని మరింత ఎక్కువ స్థాయిలో వాడుతూ వుంటుంది. కాబట్టి, యజమాని వర్గానికి అదనపు విలువ అందడం ఆగి పోయినప్పుడే, ఉత్పాదక - అనుత్పాదక కార్మికులందరికీ విముక్తి!

పెట్టుబడిదారీ విధానంలో వున్న మరొక ప్రత్యేక లక్షణం - పెట్టుబడిదారుల మధ్య పోటీ! దీన్ని చూసే ముందు, ఇంకో ముఖ్య విషయం చూడాలి. 'ఇంటి పని' విషయం!

ఇంటి పనుల్ని ఇంటి వాళ్ళే చేసుకుంటే, ఆ పనులకు ఏం పేరు వుంటుంది?

[ ఈ పాఠంలో ఎక్కువ ప్రశ్నలు ఉన్నాయి. వాటిని తర్వాత పాఠంగా చూడండి! ] **H**

---

# 70. ఉత్పత్తి తయారైన తర్వాత

[ ఈ పాఠం, 'ప్రశ్నలూ - జవాబులూ'గా ఉంటుంది. ]

## ప్రశ్నలూ - జవాబులూ

**1**. 'ఉత్పాదక లాభం' అంటే?

**జ** : ఉత్పాదక శ్రమల వల్ల వచ్చే లాభం. సరుకుల్ని తయారుచేయించే శ్రమల వల్లా, తయారైన తర్వాత కూడా చేరే శ్రమల వల్లా వచ్చే లాభం. ఇది, పారిశ్రామిక లాభం అయినా కావచ్చు; వ్యవసాయ లాభం అయినా కావచ్చు. సరుకుల అమ్మకాల వల్ల వచ్చేది - వర్తక లాభమే గానీ ఉత్పాదక లాభం అవదు. అను త్పాదక శ్రమల వల్ల తగ్గే ఖర్చు, డబ్బుగా అందే ఉత్పాదక లాభం అవదు.

**2**. ఉత్పాదక పెట్టుబడిదారుడు అంటే?

**జ** : ఉత్పాదక శ్రమలు చేయించి, ఉత్పాదక లాభం సంపాదించేవాడు.

**3**. 'రవాణా శ్రమ'లో ముడి పదార్థం ఏది?

**జ** : ఏదీ ఉండదు. రవాణా అయ్యే ఉత్పత్తులు గానీ, మనుషులు గానీ, 'ముడి పదార్థాలు' కావు.

**4**. ఒక కుటుంబానికి సంవత్సరానికి, 6 బస్తాల బియ్యం కావాలి. ఆ బియ్యాన్ని ఆ కుటుంబం ఒక్కసారే కొని, తమ ఇంటిలోనే నిల్వచేసుకుంటే, వాటి ధర కొంచెం తక్కువగా వుంటుంది. లేదా, ప్రతీ నెలా కొన్ని బియ్యం చొప్పున కొంటే, వాటి ధర కొంచెం ఎక్కువగా వుంటుంది. ఎందుకు?

**జ** : సంవత్సరానికి కావలసిన 6 బస్తాల బియ్యాన్నీ ఒక్క సారే కొని ఇంటికి తెస్తే, బస్తాల్ని పెట్టడానికి ఇంట్లో చోటు కావాలి. వాటి సంరక్షణ శ్రమలన్నీ ఇంటి వాళ్ళే చేసుకోవాలి. లేదా, ఆ బస్తాల్ని ఒక్క సారే కొనక పోతే, ఆ చోటూ, ఆ ఖర్చూ అంతా బియ్యాన్ని అమ్మే షాపు వాళ్ళు చెయ్యాలి. స్టోరు శ్రమలు అవకముందే సరుకుల్ని కొంటే, వాటి ధర కొంచెం తక్కువ. లేదా, స్టోరు శ్రమలు జరిగాక సరుకుల్ని కొంటే, ఆ ధర కొంచెం ఎక్కువ.

**5**. స్టోరు పనులు చేయించే పెట్టుబడిదారుడికి 'అదనపు విలువ', అతను ఏ సరుకుల్ని స్టోరు చేయిస్తాడో ఆ సరుకుల్ని ఉత్పత్తి చేసే ఉత్పాదక కార్మికుల నించి వస్తుందా, లేక, స్టోరు కార్మికుల నించి వస్తుందా?

**జ** : స్టోరు కార్మికుల నించే వస్తుంది. స్టోరు శ్రమలన్నీ, ఉత్పాదక శ్రమలే. ఆ శ్రమల విలువ, సరుకుకి చేరి అమ్మకంలోకి ⟶

వెళ్తుంది. దానికి డబ్బు వస్తుంది. అందులో నించే, స్టోరు కార్మికులకు జీతాలూ + అదనపు విలువా.

**6**. ఇంట్లో అన్నాలూ కూరలూ తయారయ్యాక వాటిని, ఉట్టి లోనో, అలమార్ల లోనో పెడతాం. తినగా మిగిలిన వాటిని కొన్ని గంటల వరకైనా నిల్వ చేస్తాం. అవి స్టోరు ఖర్చులేనా?

**జ**: అంతే. తయారైన పదార్థాల్ని ఒక చోట పెట్టి వుంచే ఏర్పాట్లు లేకపోతే, ఆ పనులు జరగకపోతే, అవి కొన్ని గంటల దాకా అయినా అవి ఎక్కడ వుంటాయి? ఉట్టి కూడా స్టోరు పని కోసం అవసరమయ్యే సాధనం కిందకే వస్తుంది.

**7**. స్టోరు ఖర్చు లేకుండా ఉత్పత్తుల్ని వాడుకోవడం ఏ సందర్భంలోనూ జరగదా?

**జ**: కాఫీని తయారుచేసిన వెంటనే తాగేస్తే, దానికి స్టోరు ఖర్చు వుండదు. కానీ, కాఫీ పొడినీ, పాలనీ, పంచదారనీ నిల్వ చేసి వుంచుతాం. ఆ ఖర్చులో కొంత, ఒక కప్పు కాఫీ లోకి కూడా చేరుతుంది. అడవిలో జామ చెట్టు కింద నిలబడి ఒక కాయని కోసుకుని తింటే, దానికి స్టోరు ఖర్చు లేనట్టే.

**8**. సరుకుల్ని ప్యాక్ చేసే ఖర్చులు, సరుకు విలువలోకి చేరతాయి. అయితే, ఆ ప్యాకింగులు, తళ తళ లాడే రంగు రంగుల కాయితాల్లోనే, చాలా ఎక్కువ ఖర్చుతోనే జరగాలా?

**జ**: అవన్నీ వ్యాపార ఎత్తుగడలు. ప్యాకింగులు తళ తళ లాడుతూ వుంటేనే అవి, కొనే వాళ్ళకు ఆకర్షణీయంగా వుంటాయనీ, వాళ్ళు తప్పకుండా కొంటారనీ, అమ్మే వాళ్ళు భావిస్తారు. కొనే వాళ్ళు కూడా ఆ తళ తళల వలల్లో పడిపోతారు. బిస్కట్లని పరిశుభ్రమైన తెల్లని సాదా అట్ట పెట్టెల్లో పెట్టడం గాక, తళతళల రంగుల - షోకుల అట్టల్లో పెడితే, ఆ బిస్కట్ల నాణ్యతేమీ పెరగదు. షోకుల ప్యాకింగ్ వల్ల ఖర్చు పెరుగుతుంది. ఆ సరుకుని కొనే వాళ్ళు, ప్యాకింగ్ కోసం ఎక్కువ ఖర్చుని చెల్లించవలసి వస్తుంది.

**9**. ఒక సరుకుకి ప్యాకింగ్ కోసం, అవసరానికి తగినంత అట్టని మాత్రమే వాడితే, 2 విలువ ఖర్చవుతుందనుకుందాం. కానీ అదే ప్యాకింగ్ కోసం, రంగుల - షోకుల వస్తువుల్ని ఉపయోగిస్తే, ప్యాకింగ్ విలువ 3 అయిందనుకుందాం. ప్యాకింగ్ కోసం అదనంగా ఖర్చయిన 1 విలువ, ఏ సరుకు కోసం అయితే, ఆ ప్యాకింగ్ జరిగిందో ఆ సరుకు అదనపు విలువలో భాగం అవుతుందా?

**జ**: అలా అవదు. ప్యాకింగ్ అనేది - ఉత్పాదక శ్రమ. ఒక షోకుల ప్యాకింగ్ కోసం ఎక్కువ ఖర్చు అయినా, అది నిజంగా జరిగిన ఖర్చే. అంత ఖర్చు పెట్టకపోతే ఆ షోకులు రావు. ఆ షోకుల ఖర్చుని, ఆ సరుకుని కొనే వాళ్ళు చెల్లించి తీరాలి. ఆ ప్యాకింగు, నిరాడంబరంగా వుంటే, కొనే వాళ్ళకి ఖర్చు తగ్గుతుంది. కానీ ఇదంతా వాళ్ళకి తెలీదు. వాళ్ళకి షోకులే అలవాటైపోయి, వాటికే ఎగబడతారు.

**10**. సరుకుల గురించి 'అడ్వర్టయిజ్మెంట్లు' లేకపోతే, వాటి గురించి వాడకందార్లకు ఎలా తెలుస్తుంది? 'ప్రకటనలు' అవసరం కాదా?

**జ**: ప్రకటనలు, 2 రకాల స్వభావాలతో సాగవచ్చు. పెట్టుబడిదారీ విధానంలో సాగే అడ్వర్టయిజ్మెంట్లన్నీ - వ్యాపార ప్రకటనలు. అవి, వాడకందార్లని మోసం చేసే రక రకాల ఎత్తుగడలతో సాగు తాయి. ఒక ఉత్పత్తి గురించి ప్రజలకు తెలియాలంటే, వ్యాపార ప్రకటన లాంటిది అక్కరలేదు. 'సమాచారాన్ని తెలిపే వార్త' లాంటిది చాలు. ⟶

వార్తా పత్రికల్లో, అనేక అత్యవసర సమాచారాలు అందినట్టే ఇదీ అందుతుంది. వ్యాపార ప్రకటనల కోసం జరుగుతోన్న ఖర్చు, పోలీసు యంత్రాంగం కోసం జరిగే ఖర్చు కన్నా విపరీతమైన ఖర్చు. అడ్వర్టయిజ్ మెంట్ల కోసం ఖర్చయ్యే ఉత్పత్తి అంతా, కార్మిక వర్గపు అదనపు ఉత్పత్తి రాసిలో భాగమే.

**11**. ఒక పెట్టుబడిదారీ కంపెనీ వాళ్ళు, ఒక రకం సబ్బునో, టూత్ పేస్టునో అమ్మడం మొదలుపెట్టి దాదాపు 40 ఏళ్ళు దాటింది. ఆ సరుకుల సంగతి అందరికీ తెలుసు. అయినా, ఆ కంపెనీ వాళ్ళు, ఆ సరుకుల గురించే ప్రకటనలు ఇస్తూ వుంటారెందుకు?

**జ** : వీళ్ళ ప్రకటనలు ఆగిపోయి, కొత్త కంపెనీల వాళ్ళ ప్రకటనలే కనపడుతూ వుంటే, జనం ఎప్పుడూ వాడే సరుకుల్ని మర్చిపోతారని, ఆ కంపెనీ వాళ్ళ భయం. వర్తకాల ప్రపంచంలో అదీ నిజమే. కొత్త సరుకుల ప్రకటనలు మాత్రమే కనపడుతూ వుంటే, జనం వాటి వేపు మొగ్గుతారు. పాత సరుకుల ప్రకటనలు కూడా కనపడుతూ వుంటేనే అవి నిలబడతాయి కదా? ఇదంతా వ్యాపారాల గోల.

**12**. వ్యాపారాల ఎత్తుగడలు లేకుండా, అందరూ కలిసి, కొన్ని రకాల మంచి సబ్బుల్నీ, మంచి పేస్టుల్నీ ఉత్పత్తి చేస్తే చాలదా? అందరూ అవే కొంటారు కదా?

**జ** : వ్యాపారం ఎందుకు? లాభం కోసం. ఎవరి లాభం వాళ్ళది కదా? అందరూ ఎందుకు కలుస్తారు? పెట్టుబడిదారులందరూ కలిస్తే అది మరీ ప్రమాదం. వాళ్ళు ఎంత తుక్కు సరుకుని ఇచ్చినా, ఎంత ధరతో ఇచ్చినా, కార్మికులు దాన్నే కొనాలి. పెట్టుబడిదారులు విడి విడిగా వుంటేనే, సరుకుల్ని కొంచెమైనా జాగ్రత్తగా తయారు చేయిస్తారు.

**13**. పెట్టుబడిదారులు ఎన్ని పేర్లతో వుంటారు? అందరికీ ఒకే పేరు ఎందుకు ఉండదు?

**జ** : డబ్బు సంపాదించడం కోసం, ఎవరు ఏ వ్యవహారం నడుపుతారో దాన్ని బట్టి వాళ్ళ పేర్లు ఉంటాయి. వ్యవసాయంలో అయినా, పరిశ్రమల్లో అయినా, సరుకుల్ని, కార్మికుల ద్వారా తయారు చేయించేవాడు - ఉత్పాదక పెట్టుబడిదారుడు. అలా తయారైన ఉత్పత్తుల్ని, తన కార్మికుల ద్వారా అమ్మించేవాడు - వర్తక పెట్టుబడిదారుడు. ఉత్పాదక పెట్టుబడిదారుడికి గానీ, వర్తక పెట్టుబడి దారుడికి గానీ, డబ్బుని అప్పులు ఇచ్చే వాడు - వడ్డీ పెట్టుబడిదారుడు. ఉత్పాదక పెట్టుబడిదారుడికీ, వర్తక పెట్టుబడిదారుడికీ, వడ్డీ పెట్టుబడిదారుడికీ, భూముల్ని అద్దెలకు ఇచ్చే వాడు భూస్వామి. వీళ్ళందరూ రక రకాల పేర్లతో ఆదాయాలు సంపాదించేది, తమ స్వంత శ్రమలతో కాదు. అందరి ఆదాయాలూ, ఉత్పాదక పెట్టుబడిదారుడి దగ్గిర తయారయ్యే సరుకులో నించి వచ్చేవే.

**14**. 'కాంట్రాక్టరు' అంటే ఎవరు? అతని కార్యక్రమం ఏమిటి?

**జ** : ఏదైనా ఒక పని చేయించడానికి 'కాంట్రాక్టు' తీసుకునేవాడు - కాంట్రాక్టరు. కాంట్రాక్టరు కూడా పెట్టుబడి దారుడే. ప్రభుత్వం, ఒక కాలవని తవ్వించాలనో, వంతెన కట్టించాలనో, రోడ్డు వేయించాలనో, అనుకుంటుంది. ఒక పెట్టుబడిదారుణ్ణి పిలిచి, ఆ పని అప్ప చెపుతుంది.
అంటే, అతనికి కాంట్రాక్టు ఇస్తుంది. ఆ కాంట్రాక్టరు, కార్మికుల్ని పెట్టి ఆ పని చేయిస్తాడు. ఆ కాంట్రాక్టు వల్ల, ఆ కాంట్రాక్టరుకి, చివరికి 'లాభం' వస్తుంది కాబట్టి, అందులో నించి, ప్రభుత్వంలో మంత్రులకూ, →

ఇంజనీర్లకూ లంచాలు ఇస్తాడు. ఒక కాంట్రాక్టు ద్వారా లాభం సంపాదించే అవకాశమే లేక పోతే, ఆ వ్యక్తి, లంచాలు ఇచ్చే అవకాశమే ఉండదు. మొదట లాభం సంపాదించడం, ఒక అవినీతి. ఆ లాభంలో నించి కొందరు లంచాలు సంపాదించడం ఇంకో అవినీతి. లంచాల అవినీతికి మూలం - అదనపు విలువ అవినీతే.

**15**. ఇనుము, సిమ్మెంటు, పెట్రోలు, బస్సులు, రైళ్ళు - ఇంకా ఏ సరుకుని అయినా పెట్టుబడిదారులు ఉత్పత్తి చేయిస్తారు. ఆ సరుకులో వాళ్ళు, స్వంత కుటుంబం కోసం వాడేది ఎంత భాగం?


**జ** : కొన్ని సరుకుల విషయంలో, పెట్టుబడిదారీ కుటుంబం, తను తయారు చేయించే సరుకులో నించి, తన స్వంతానికి వాడేది ఏమీ వుండదు. అంతా అమ్మకానికే. తన వాడకానికి కావలసిన సరుకుల్ని, ఇతర పెట్టుబడిదారుల నించి కొంటుంది. కొన్ని సరుకుల విషయంలో, తను తయారు చేయించే సరుకులో నించి కొంతని స్వంతా నికి వాడుతుంది. కానీ, అది చాలా తక్కువ. బైటి నించి కొనేదే ఎక్కువ. పెట్టుబడిదారులందరూ చేసేది, తమ సరుకుల రాసుల్ని అమ్మెయ్యడమూ, ఇతర పెట్టుబడిదారుల నించి కొనడమూ చేస్తారు.

ఒక పెట్టుబడిదారుడి సరుకు



అంతా అమ్మకానికే.

ఇంకో పెట్టుబడిదారుడి సరుకు



చుక్క భాగమే ఆ పెట్టుబడిదారీ కుటుంబంలో స్వంత వాడకానికి. మిగిలినదంతా అమ్మకానికే.

**16**. సబ్బుల పెట్టుబడిదారుడు రోజుకి 5 వేల సబ్బులు తయారు చేయిస్తాడు. నెలకి, 1,50,000 సబ్బులు. అయితే, ఆ పెట్టుబడిదారుడు తన ఇంటిలో, 1 రోజుకి, ఎన్ని సబ్బులు వాడతాడు? బైటికి ఎన్ని అమ్ముతాడు?

**జ** : ఇంట్లో రోజుకి ఒక్క సబ్బు కూడా ఖర్చు వదు. ఇంటి కోసం, నెలకి 10 సబ్బులు అను కుందాం. అంటే, 1 లక్షా, 50వేల సబ్బుల్లో నించి, 10 సబ్బుల్ని తీసేస్తే, మిగతావి అన్నీ అమ్మాలి. బిస్కట్ల వాడూ అలాగే. బట్టల వాడూ, చెప్పుల వాడూ, అందరూ అలాగే.

**17**. పెట్టుబడిదారులు లంచాలు ఎవరికి ఇస్తారు?

**జ** : తమ సరుకు కోసం ఆర్డర్లు సంపాదించడానికి, ప్రభుత్వాధికార్లకూ, ఇతర కంపెనీల అధికార్లకూ, లంచాలు ఇవ్వొచ్చు. ఇతర పెట్టుబడిదార్లతో గానీ, కార్మికులతో గానీ, కేసులు వచ్చినప్పుడు, జడ్జీలకు లంచాలు ఇవ్వవచ్చు. కార్మికుల సమ్మెల్ని భగ్నం చేసే పోలీసు అధికార్లకు లంచాలు ఇవ్వవచ్చు. ఇంకా అనేక సందర్భాల్లో.

H

# 71. మారకం శ్రమలు విలువలుగా మారవు

ఉత్పత్తి తయారైపోయిన తర్వాత కూడా ఇంకా కొన్ని శ్రమలు ( స్టోరూ, రవాణా వంటి శ్రమలు ) జరుగుతాయనీ, ఆ శ్రమల విలువలు కూడా ఆ ఉత్పత్తి విలువలోకి చేరతాయనీ, వెనక పాఠంలో చూశాం.

ఉత్పత్తిని 'అమ్మే పని' కూడా, ఉత్పత్తి తయారైన తర్వాత జరిగేదే. అమ్మే పని అంటే, ఉత్పత్తిని ఇచ్చి డబ్బు తీసుకోవడం. సరుకుకీ, డబ్బుకీ, మారకం జరగడం అది. ఆ మారకం పని కోసం కూడా కొన్ని ఖర్చులు అవుతాయి. కొంత పాత శ్రమా, కొంత కొత్త శ్రమా ఖర్చవుతాయి. కానీ, ఆ ఖర్చు లేవీ ఆ సరుకు విలువలోకి చేరవు. ఆ విలువని పెంచవు.

"మారకం పనులూ, మారకం విలువా అసహజమైనవి" అని వెనకటి పాఠాల్లోనే చెప్పుకున్నాం. దాన్నే ఇక్కడ వివరంగా అర్థం చేసుకోవాలి.

ఉత్పత్తి తయారైన తర్వాత కూడా జరిగే శ్రమల్ని చూసే సందర్భం ఇది. అందుకే, మారకం శ్రమ సంగతి ఇక్కడ చూస్తున్నాం.

ఒక కుండ తయారై వుంది. తయారైనప్పుడు దాని శ్రమ కాలం 2 గంటలు. అది, 2 రూ.లు. దాన్ని రవాణాలో ఇంకో చోటుకి తీసుకువెళ్ళారు. దాని కోసం అర్ధ రూపాయి ఖర్చు అయింది. అప్పుడు, ఆ కుండ విలువ 2 $^1/_2$ రూ.లు. అంటే, రవాణా విలువ కూడా కుండ విలువలో కలిసిందని అర్థం.

తర్వాత ఆ కుండని అమ్మాలి. సరుకులన్నిటినీ ఒక చోట పెట్టి అమ్మడానికి కొంత స్థలమూ, దాని మీద చిన్న కట్టడమూ ఉండాలి. అమ్మకాల కోసం బేరసారాలు జరగాలి. కుండకి సంబంధించి, ఆ అమ్మకం ఖర్చుని ఒక అర్ధ రూపాయి అనుకుందాం. ఈ అమ్మకం విలువ కూడా కుండ విలువలోకి చేరుతుందా? అమ్మకం తర్వాత కుండ విలువ, 3 రూ.లు అవుతుందా? - అలా జరగదు. అప్పుడు కూడా కుండ విలువ 2 $^1/_2$ గానే వుంటుంది.

ఒక వేళ, కుండ మనిషి, ఆ కుండని, నిజంగా 3 రూ.లకు అమ్మాడనే అనుకుందాం. అలా అమ్మినా, మారకం ఖర్చు అర్ధ రూపాయి కుండ విలువకి చేరిందనీ, అందుకే కుండ విలువ 3 రూ.లు అయిందనీ అర్థం కాదు. దానికి ఇంకేదో కారణం వుంటుంది.

ఒక బట్ట మీద కుట్టు శ్రమ జరిగి, అది చొక్కాగా మారితే, ఆ బట్ట విలువ కన్నా చొక్కా విలువ పెరిగి వుంటుంది. విలువ పెరిగిందని ఎలా చెప్పగలమంటే, బట్టని కొన్నంత డబ్బుతోనే చొక్కా రాదు. చొక్కా కోసం ఎక్కువ డబ్బు ఇవ్వాలి.

ఆ చొక్కా మీద రవాణా శ్రమ జరిగితే, అప్పుడు కూడా చొక్కా విలువ పెరుగుతుంది.

కానీ, ఆ చొక్కా మీద మారకం శ్రమ

జరిగితే కూడా చొక్కా విలువ పెరుగుతుందా? మారకం శ్రమ, చొక్కా విలువకి చేరుతుందా? - అలా జరిగితే, మారకం పూర్తి అయిన తర్వాత, ఆ చొక్కా విలువ పెరిగి వుండాలి. మారకం విలువ కూడా సరుకుకి చేరితే, ఏ సరుకు విషయంలో అయినా, మారకం తర్వాత, ఆ సరుకు విలువ పెరిగి వుండాలి.

ఈ ఉదాహరణ చూడండి :

ఒక కుండా, ఒక చెప్పుల జతా, ఒక బుట్టెడు ధాన్యం - ఈ 3 సరుకుల విలువలూ సమానం. ప్రతి దాని విలువా 2 గంటల శ్రమ. అది, 2 రూ.లు. కుండని ఇస్తే, చెప్పుల జత వస్తుంది. లేదా, ఆ బుట్టెడు ధాన్యం వస్తుంది.

కుండకీ, చెప్పుల జతకీ మారకం జరిగింది. మారకం పూర్తయిన తర్వాత చూస్తే, ఆ సరుకుల విలువలు పెరిగి వుంటాయా? కుండ విలువ, 2 కన్నా పెరిగి వుంటుందా? చెప్పుల జత విలువ కూడా పెరిగి వుంటుందా? - వాటి విలువలు పెరిగి వున్నాయో లేదో తెలియాలంటే, వాటిని ఇతర సరుకులతో మారకం చేసి చూడాలి.

కుండ సంగతే చూద్దాం. కుండకి, చెప్పులతో జరిగిన మారకం వల్ల, దాని విలువ 2 రూ.ల కన్నా పెరిగిందనుకుందాం. ఆ కొత్త కుండనే మళ్ళీ ఇంకో సరుకుతో మారకం చేస్తే, దానికి బదులుగా 2 కన్నా ఎక్కువ విలువ గల సరుకు రావాలి కదా? అలా జరుగుతుందా?

చెప్పుల మనిషి మొదట కుండని తీసుకున్నాడు కదా? అతనికి వెంటనే ధాన్యం కావలసి వచ్చిందనుకుందాం. తన చేతిలో వున్న కొత్త కుండని ఇచ్చి ధాన్యం తీసుకుంటే, ఆ కుండకి బదులుగా వెనకటి లాగ, బుట్టెడు ధాన్యమే వస్తుందా, ఇంకా కొంత ఎక్కువ ధాన్యం వస్తుందా? కుండకి, చెప్పులతో జరిగిన మొదటి మారకం వల్ల, దాని విలువ, 2 కన్నా పెరిగి వుంటే, దానికి రెండో మారకం జరిగినప్పుడు, దానికి బదులుగా 2 కన్నా ఎక్కువ విలువ గల సరుకు రావాలి కదా? - కానీ అలా జరగదు. ఆ కొత్త కుండకి మళ్ళీ మళ్ళీ ఎన్ని మారకాలు జరిగినా, ఆ మారకాల కోసం ఎంత శ్రమ జరిగినా, దాని విలువ 2 గానే వుంటుంది గానీ, పెరగదు.

కుండకి ఒక మారకం జరిగిన తర్వాత దాని విలువ పెరగలేదంటే, ఆ మారకం పని కోసం జరిగిన ఏ ఖర్చూ, మొదటి విలువ మీద చేరలేదన్నమాట! చెప్పుల సంగతి అయినా అంతే ; ధాన్యం సంగతి అయినా అంతే ; ఏ సరుకు సంగతి అయినా అంతే.

ఈ ఉదాహరణ చూడండి :

ఒక బట్ట విలువ 5. ఆ బట్టని ఇచ్చి 5 రూ.లు తీసుకున్నాం. అంటే, బట్టకీ, 5 డబ్బుకీ మారకం జరిగింది. బట్ట వెళ్ళిపోయింది. దాని సంగతి అనవసరం. 5 రూ.లు వచ్చాయి. దీని సంగతి చూద్దాం. మారకం ఖర్చు కూడా ఆ డబ్బుకి చేరితే, ఆ 5 రూ.లకు, విలువ కొంత పెరగాలి కదా? అలా పెరుగుతుందా? ఆ 5 రూ.లు ఇస్తే ఇప్పుడు, 5 కన్నా ఎక్కువ విలువ గల సరుకు వస్తుందా? - అలా జరగదు. 5 డబ్బుకి, ఎన్ని మారకాలు జరిగినా, అది

ఎన్ని సరుకులతో మారినా, అది 5 గానే వుంటుంది.

ఒక సరుకుకి ( ఒక ఉత్పత్తికి ) మారకం జరగక ముందు ఎంత విలువ వుంటుందో, మారకం పూర్తి అయిన తర్వాత కూడా అంత విలువే, వుంటుంది. అంటే, మారకం శ్రమ, విలువగా మారదన్నమాట! అది, ఆ సరుకుకి చేరదన్నమాట! ఎందుకంటే, మారకం అనేది, ఉత్పత్తిని తయారు చెయ్యడానికి గానీ, దాన్ని వాడకానికి గానీ, సహజంగా అవసరమైనది కాదు గనక.

ఉత్పత్తుల తయారీకి గానీ, వాటి వాడకానికి గానీ తప్పనిసరిగా అవసరమయ్యే శ్రమలే - సహజ శ్రమలు. సహజ శ్రమ జరిగినప్పుడే, అది విలువ అవుతుంది. లేకపోతే, అది విలువ కాదు.

బుట్టెడు ధాన్యం విలువ 2. రూలు. ఆ ధాన్యం మీద, దాన్ని బియ్యంగా దంచే శ్రమ జరిగితే, ఆ బియ్యం విలువ, మొదటి ధాన్యం విలువ కన్నా ఎక్కువగా వుంటుంది. కానీ, ధాన్యం మీద మారకం శ్రమ జరిగితే మాత్రం ఆ ధాన్యం విలువ పెరగదు.

భోజనాల కోసం వంట పదార్థాలన్నీ తయారై సిద్ధంగా వున్నాయి. అప్పటి వరకూ జరిగిన శ్రమ, ఆ పదార్థాల తయారీ కోసం. ఇక ఆ పదార్థాల్ని వాడుకోవాలంటే, ఇంకో శ్రమ జరగాలి. - ఆ పదార్థాల్ని ఆకుల్లోనో, పళ్ళాల్లోనో వడ్డించే ( వడ్డించుకునే ) శ్రమ జరగాలి. ' వడ్డించడం' అనే ఆ పని, భోజన పదార్థాల రూపాల్ని మార్చదు. కొత్త పదార్థాల్ని తయారుచెయ్యదు. తయారై వున్న పదార్థాల్ని వాడుకోవడానికి వీలయ్యే లాగ చేస్తుంది. ఆ పని ఎవరికి వాళ్ళే చేసుకుంటారా, ఇతరులు చేస్తారా అనేది వేరే సంగతి. ఎవరు చేసినా అది శ్రమే. ఆ వడ్డింపు పని జరగకపోతే, ఆ పదార్థాల్ని వాడుకోవడం సాధ్యం కాదు.

వంట శ్రమ లేకపోతే, బియ్యం, అన్నంగా తయారవదు. వడ్డింపు శ్రమ లేకపోతే, అన్నాన్ని వాడుకోవడం జరగదు. ఏ శ్రమలు లేకపోతే ఉత్పత్తుల తయారీలు గానీ, వాడకాలు గానీ సాధ్యం కావో, ఆ శ్రమలు - సహజ శ్రమలు. మారకం శ్రమ అలాంటిది కాదు.

నేతనో కుట్టునో వంటనో తీసివేసి ఉత్పత్తులు తయారు చెయ్యడం సాధ్యం కాదు. కానీ, అమ్మకం శ్రమలు తీసివేసి, ఉత్పత్తుల్ని తయారుచెయ్యడమూ, వాటిని వాడుకోవడమూ సాధ్యమే.

కానీ, దానికి తగిన పరిస్తితులు సమాజంలో ఏర్పడినప్పుడే అది సాధ్యం. ' తగిన పరిస్తితులు' అంటే, అందరూ శ్రమ చెయ్యడమూ, యజమానీ శ్రామిక సంబంధాలు పోవడమూ, స్వతంత్ర ఉత్పత్తిదారుల సంబంధాలు కూడా సమిష్టి శ్రమ సంబంధాలుగా మారడమూ, శ్రమ సంబంధాలు సమాన శ్రమ సంబంధాలుగా ఏర్పడడమూ - వంటి మార్పులు జరగడం. అప్పుడు మారకాలతో అవసరం వుండదు. మారకాలు లేకుండానే ఉత్పత్తుల్ని తయారు చేసుకోవడమూ, వాటిని అవసరాలకు తగినట్టుగా వాడుకోవడమూ సాధ్యం. ఇదంతా, శ్రమ దోపిడీ సంబంధాల్ని మార్చడం మీదే ఆధారపడి వుంటుంది.

ఆటవిక సమాజాల కాలం నించే వేరు

వేరు తెగల మధ్య మారకాల పద్ధతి వుంది. కానీ, అప్పటి మారకాలు అతి తక్కువ సంఖ్యలో వుండేవి. రోజు మొత్తంలో ఒక్క మారకంతో కూడా అవసరం లేకుండా తెగలో తయారు చేసుకునే తక్కువ ఉత్ప త్తుల తోనే కాలం గడిచేది.

కానీ, ఈ నాటి పెట్టుబడిదారీ సమాజం నాటికి, మారకాలు నిముష నిముషానికీ అవసరమయ్యేటంతగా ఆ పద్ధతి విస్తరించి వుంది.

ఏ శ్రమ జరగడానికైనా అందులో పాత - కొత్త శ్రమల కోసం, అనేక ఖర్చులు అవుతాయి. అలాగే, అమ్మకాల శ్రమలు జరగడానికి కూడా కొన్ని ఖర్చులు అవుతాయి.

మొదట, సరుకుల్ని అమ్మే దుకాణం కోసం కొంత భూమి కావాలి. దాని మీద ఒక కట్టడం, చిన్నదో పెద్దదో, కావాలి. అందులోకి బోలెడు సామాన్లు కావాలి. అక్కడ నిలబడి సరుకుల్ని అమ్మే మను షులు కావాలి. వారికి పోషణ కావాలి. - ఈ మారకం పనులే లేకపోతే, ఆ మను షులు, పాఠశాలల పనులో, ఆస్పత్రుల పనులో, రవాణాల పనులో, అటువంటి సహజ శ్రమలు చేస్తూ తమ పోషణ చేసు కుంటారు. వారు సహజ శ్రమల లోకి మార డానికి వీలవుతుంది.

ఒక బట్టల షాపులో, ఒక సంవత్సర కాలంలో, 50 వేల మీటర్ల బట్టని అమ్ము తారనుకుందాం. దాని కోసం అయ్యే మొత్తం ఖర్చులో నించి, 1 మీటరు బట్ట అమ్మకం కోసం అయ్యే ఖర్చుని లెక్క కడితే, అది 1 రూపాయి - అనుకుందాం. ఆ అమ్మకం విలువ, ఆ బట్ట విలువకి చేరదు. అందుకే, 'వర్తక కమిషన్' అవసరమవుతుంది.

సరుకుల్ని అమ్మే వాళ్ళకి, సరుకు విలువలోకి ఏ ఖర్చు చేరుతుందో, ఏ ఖర్చు చేరదో, ఆ రహస్యాలేవీ తెలియవు. కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ వంటి వాటి గురించి తెలియనట్టే, ఈ వర్తక కమిషన్ గురించి కూడా తెలీదు.

ఒక చెప్పుల షాపుని తీసుకోండి. అక్కడ వేల జతల చెప్పులు తయారైపోయి వుంటాయి. తయారైపోయిన చెప్పులు, వెంటనే వాడకంలోకి ఎందుకు వెళ్ళవు? - వాటికి ఇంకా మారకాలు జరగాలి.

ఒక పళ్ళ తోట విరగ కాసి వుంది. మారకం అనే మాట లేకుండా ఆ పళ్ళని, ఆ ప్రాంతం జనాభా అందరూ వాడుకోవడా నికి ఏమిటి అభ్యంతరం? - ఆ తోట, ఒకరి ఆస్తి! ఆ పంట కోసం ఎంతో శ్రమ జరిగి వుంటుంది. ఆ పళ్ళని తీసుకోదల్చిన వాళ్ళు, ఆ పంట కోసం జరిగిన శ్రమ విలువల్ని తిరిగి ఇవ్వాలి. మారకాలు జరగాలి.

ఒకటి రెండు షాపుల సంగతే కాదు ; మొత్తం ఒక దేశంలో, అమ్మకాల కోసం వుండే స్థలాలన్నిటినీ, షాపులన్నిటినీ కలిపి చూడండి! దాని కోసం ఎన్ని స్థలాలూ, ఎన్ని బిల్డింగులూ, ఎందరు మనుషులూ అవ సరమవుతారో చూడండి! ఆ అమ్మకాల అవసరమే లేకుండా, అందరూ డ్యూటీల ప్రకారం శ్రమలు చేస్తూ, ఉత్పత్తుల్ని తయారు చేసుకోవడమూ, అవసరాన్ని బట్టి వాడుకోవడమూ జరిగితే, అమ్మకాల స్థలాలూ ఆ బిల్డింగులూ, ఆ అసహజ

త్వాల నించి విముక్తి అవుతాయి.

కానీ, ఇప్పుడు వున్న మానవ సంబంధాలు, యజమానీ శ్రామిక సంబంధాలుగా వున్నాయి. ప్రతీ అవసరానికీ మారకాలు అవసరమయ్యే సంబంధాలుగానే వున్నాయి. సంబంధాలు ఇలా వున్నప్పుడు, మారకాల్ని తీసివెయ్యడం సాధ్యం కాదు. కానీ, మారకాలు ఇప్పుడు అవసరంగానే వున్నాయి కాబట్టి, అవి ఎప్పటికీ వుండ వలసిన సహజ అవసరాలే - అని అర్థం కాదు.

ప్రతీ సరుకు అమ్మకం కోసమూ కొంత ఖర్చు అవుతుంది. కానీ ఆ అమ్మకం ఖర్చు, సరుక్కి చేరడమూ వెనక్కి రావడమూ జరగదు. కాబట్టి, ఆ ఖర్చుని, ఆ సరుకుకి వుండే అసలు విలువలో నించే తీసి ఖర్చు పెట్టాలి. అంటే, ఆ సరుకులో వున్న అదనపు విలువలో నించి! ఆ సరుకు, స్వతంత్ర ఉత్పత్తిదారుల సరుకు అయినా, దాని విలువలో నించే అమ్మకం ఖర్చుని భరించాలి.

అమ్మకం ఖర్చు ఎవ్వరూ ఉపయోగించుకోలేని వృధా ఖర్చు. మానవ సమాజం, మారకాల కోసం, ఏ నాటి నించో, ఏటా, ఎంతో భూమినీ శ్రమనీ వృధాగా పోగొట్టుకుంటోంది. మారకాల కోసం, ఆ భూమినీ, ఆ కట్టడాన్నీ, ఆ శ్రమనీ పోగొట్టుకోకుండా వుంటే, మనుషులు శ్రమ చేసే కాలం చాలా తగ్గుతుంది.

సమాజంలో, ఏదైనా అసహజమైన ఖర్చులు జరుగుతున్నాయి అంటే, శ్రమ సంబంధాల్లో ఏవో వైరుధ్యాలు వున్నాయని అర్థం. సంబంధాలు, హేతుబద్ధంగా లేవని అర్థం.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. మారకాల శ్రమలు జరిగేటప్పుడు ఖర్చయ్యే పాత - కొత్త శ్రమలు ఏవి?

**జ**: సరుకుల్ని అమ్మే షాపూ, అందులో వస్తువులూ - అన్నీ పాత శ్రమ కిందకి వస్తాయి. ఆ పనులు చేసే మనుషుల శ్రమ, కొత్త శ్రమ అవుతుంది.

**2**. బియ్యం ఇంకా తయారుగా లేవు, కానీ, అన్నం తయారవడం సాధ్యమేనా?

**జ**: సాధ్యం కాదు. ఒక సహజ శ్రమ జరగాలంటే, దానికి కావలసిన ఉత్పత్తి సాధనాలు లేకుండా అది జరగదు.

**3**. సరుకు ఇంకా తయారు కాలేదు. కానీ, దాని అమ్మకం జరిగింది. సరుకు మనిషికి, డబ్బు అందింది. ఇది ఎలా సాధ్యం?

**జ**: మారకం శ్రమ, సహజ శ్రమ కాదు కాబట్టే ఇది సాధ్యం. సరుకు మనిషి, ఆ సరుకుని తర్వాత తయారుచేసి ఇస్తాడు. డబ్బు ఇచ్చిన మనిషి, ఆ సరుకుని తర్వాత తీసుకుంటాడు.

**4**. ఉత్పత్తి తయారవలేదు. దాని రవాణా జరుగుతుందా?

**జ**: జరగదు. వస్తువే లేకపోతే, దాని రవాణా ఎలా జరుగుతుంది? రవాణా - సహజ శ్రమ. అది జరగాలంటే, వస్తువులు వుండి తీరాలి.

**H**

# 72. కుటుంబ శ్రమలు!

ఉత్పాదక - అనుత్పాదక శ్రమల్ని చూసిన తర్వాత, వెంటనే చూడవలసిన విషయం - కుటుంబ శ్రమలు.

ఇంటి పనుల్ని ఇంట్లో మనుషులే చేసుకుంటే, అవి ఉత్పాదక శ్రమలూ అవవు; అనుత్పాదక శ్రమలూ అవవు. వాటి పేరు - 'ఇంటి పని'. అవి, కుటుంబ శ్రమలు.

యజమానీ కార్మిక సంబంధం వున్నప్పుడే, అక్కడ జరిగే శ్రమ, ఉత్పాదక శ్రమ గానీ, అనుత్పాదక శ్రమ గానీ, అవుతుంది. యజమాని, కార్మికులకు జీతాలు ఇచ్చే సంబంధం అది. ఆ సంబంధాల్లో కూడా, 'సరుకుల్ని' ఉత్పత్తి చేసే శ్రమలే ఉత్పాదక శ్రమలు ; అలా కానివి అనుత్పాదక శ్రమలు. ఈ రెండు సంబంధాల్లోనూ, కార్మికులు, యజమాని దగ్గిరికి వచ్చి, అక్కడ చెయ్యవలసిన పని కొన్ని గంటల పాటు చేసి, ఆ కాలం అయిపోయాక వెళ్ళిపోతారు.

కానీ, ఇంట్లో మనుషుల మధ్య సంబంధాలు, యజమానీ కార్మిక సంబంధాలు కావు. 'జీతాల' సంబంధాలు కావు.

ప్రతీ కుటుంబంలోనూ ఇంటి పనులన్నీ ఆడవాళ్ళే చేస్తారు. చాలా వెనకటి కాలం నించీ, ప్రతీ దేశంలోనూ, ఆడ వాళ్ళకీ, మగ వాళ్ళకీ మధ్య, ఒక 'శ్రమ విభజన' వుంది. ఆడ వాళ్ళకు ఇంటి పనీ, మగ వాళ్ళకు బైటి పనీ - అనే శ్రమ విభజన అది. 'బైటి పని' అంటే, బైట ఒక యజమాని దగ్గిర చేసే పని.

ఒక ఇంట్లో, భార్యాభర్తలూ, ఇద్దరు పిల్లలూ, ఇద్దరు వృద్ధులూ, ఉన్నారనుకుందాం. భర్త, బైటికి వెళ్ళి ఒక పెట్టుబడిదారుడి దగ్గిర శ్రమ చేస్తాడు. ఆ శ్రమ, ఉత్పాదక శ్రమ అయినా కావచ్చు, అనుత్పాదక శ్రమ అయినా కావచ్చు. దానికి జీతం ( కొంత డబ్బు ) వస్తుంది. ఆ జీతం డబ్బుతో అతను, ఇంటికి కావలసిన పోషణ వస్తువులు బజార్లో కొని తెస్తాడు.

భార్య, భర్త తెచ్చిన పోషణ వస్తువులతో, ఇంట్లోకి కావలసిన పనులన్నీ చేస్తుంది.





పిల్లల్ని పెంచే పనులూ, వృద్ధుల సంరక్షణ పనులూ కూడా, ఇంటి పనులే అవుతాయి. ( ఆ ఇంటికి వచ్చి పనులు చేసే అనుత్పాదక కార్మికులెవరూ లేరనుకుందాం. ) ఆ ఇంట్లో, భార్య చేసే శ్రమలన్నీ ఇంటి స్వంత అవసరాలకే ఉపయోగపు విలువలుగా ఖర్చవుతాయి. ఆ పనుల్ని బైటికి అమ్మరు కాబట్టి, ఆ పనులకు డబ్బు రాదు. ఆమె శ్రమ, విలువగా మారదు.

భార్యా భర్తల మధ్య వుండే ఈ

సంబంధం, ' కుటుంబ సంబంధం'. ఇది, యజమానీ కార్మిక సంబంధం కాదు. భర్త, భార్య మీద అనేక విషయాల్లో పెత్తందారు గానే ప్రవర్తించినా, భర్త, భార్యకి జీతం ఇచ్చే రకపు యజమాని కాడు. భార్య చేసే ఇంటి శ్రమకు బదులుగా జీతం రాదు కాబట్టి, ఆమె ఉత్పాదక కార్మికురాలూ కాదు, అనుత్పాదక కార్మికురాలూ కాదు.

లేకపోతే, ఆమె ' స్వతంత్ర శ్రామికు రాలు' అవుతుందా? - అది కూడా కాదు. ' స్వతంత్ర శ్రామికులు' అంటే, వాళ్ళు, సరు కుల్ని ఉత్పత్తి చేసి అమ్ముకోవాలి. కానీ, కుటుంబంలో భార్య చేసే ఉత్ప త్తులూ, శ్రమలూ, ' సరుకులు' కావు. తన ఇంటి పని తను చేసుకునే మనిషి, ' స్వతంత్ర శ్రామికురాలు' అనే కోవలోకి కూడా రాదు. ఆమె శ్రమ పేరు - కుటుంబ శ్రమే.

ఇంటి పనులు, ఇంటి మగ వాళ్ళు చేసినా, అవి ఇంటి పనులే. మగ వాళ్ళు చేసినా, ఆ శ్రమల్ని సరుకులుగా అమ్మరు కాబట్టి, అవి డబ్బుగా మారవు. ఆ పనులు ఎవరు చేసినా అవి డబ్బుగా మారవు.

ఆడ వాళ్ళలో, పేద కుటుంబాల వారు, స్వంత ఇంటి పనులు చేసుకుంటూనే, బైటి కూలి పనులు కూడా చేస్తారు. అది, వెనకటి కాలం నించీ కూడా వుంది.

బానిసల కాలంలో, బానిస కుటుంబా లలో ఆడ వాళ్ళు, తమ గుడిసెల్లో స్వంత పనులు చేసుకుంటూనే, యజమాని ఇంటి పనులన్నీ చేస్తారు. యజమాని భూమిలో వ్యవసాయం పనులు కూడా చేస్తారు.

భూస్వామ్య సమాజంలో, కౌలు రైతుల కుటుంబాల్లో ఆడ వాళ్ళు కూడా, తమ ఇంటి పనులు చేసుకుంటూనే, కౌలు భూముల్లో వ్యవసాయం పనులు చేస్తారు.

పెట్టుబడిదారీ సమాజంలో కూడా పేద కార్మిక కుటుంబాల్లో ఆడ వాళ్ళు, ఇంటి పనులన్నీ చేసుకుంటూనే, బైట యజ మానుల దగ్గిర కూలి పనులు కూడా చేస్తారు.

బైటి పనులు చేసే మగ వాళ్ళ లాగే, బైటి పనులు చేసే ఆడ వాళ్ళు కూడా ' కార్మికులు' అవుతారు. ' ఉత్పాదక ' గానీ, ' అనుత్పాదక ' గానీ. వారికి జీతాలు కూడా వస్తాయి. మేధా శ్రమలు చేసే మగ వాళ్ళకు లాగే, ఆ రకం శ్రమలు చేసే ఆడ వాళ్ళకు కూడా ఎక్కువ జీతాలు వస్తాయి.

భార్యా భర్త లిద్దరూ కూలి పనులు చేసే కుటుంబాల్లో, ఇద్దరికీ జీతాలు వస్తాయి. ఇద్దరి నించీ యజమానులకు ' అదనపు శ్రమలు' పోతాయి. కూలి పనులు చేసే కార్మికులకు, ఆ పనులు, సంవత్సరం పొడుగునా వుండవు. భార్యా భర్త లిద్దరికీ బైటి కూలి పనులూ, జీతాలూ వున్నా కూడా, ఆ కుటుంబం పేదతనంలోనే వుంటుంది. అది వేరే సంగతి.

' ఆడ వాళ్ళు' అన్నప్పుడు, అందులో కూడా, 2 వర్గాల వాళ్ళు వుంటారు. కౌళ్ళతో, వడ్డీ లాభాలతో జీవించే కుటుం బాల్లో, ఇంటి పనులన్నీ పని మనుషులే చేస్తారు.



ఆ కుటుంబాల్లో ఆడ వాళ్ళు, ఇంటి పనులు

చెయ్యడం చాలా తక్కువ. పిల్లల పెంపకం పనులు కూడా వాళ్ళు చెయ్యరు.

ధనవంతుల్లో కొంచెం తక్కువ స్థాయి కుటుంబాల్లో ఆడ వాళ్ళు, కొన్ని ఇంటి పనులు చేస్తారు. కానీ, దాని కన్నా, అక్కడ కూడా, పని మనుషులు చేసే పనులే ఎక్కువ.

ఇంటి పనులు చెయ్యడం, మగ వాళ్ళ బాధ్యతగా ఎప్పుడూ లేదు. కానీ, ఆడ వాళ్ళ విషయంలో అయితే, వాళ్ళు బైటి పనులు కూడా చేసినా, ఇంటి పనులన్నీ వాళ్ళ బాధ్యతే. ఇంటి పనీ, బైటి పనీ కూడా చేసే ఆడ వాళ్ళు, మగ వాళ్ళ కన్నా ఎక్కువ శ్రమ చేస్తున్నారని అర్థం.

మేధా శ్రమలు చేసే కార్మిక స్త్రీల కుటుంబాల్లో కూడా, ఇంటి పనుల్లో ఎక్కువ భాగం, పని మనుషులే చేస్తారు.

మగ వాళ్ళయినా, ఆడ వాళ్ళయినా, ప్రతీ మనిషీ, శ్రమ చెయ్యాలి. ఆ శ్రమలు చెయ్యడంలో న్యాయమైన నియమాలు వుండాలి. 'న్యాయమైన' అంటే, అందరికీ సమానమైన హక్కులూ, సమానమైన బాధ్యతలూ వుండడం అని. ఆ నియమాలు, సమాజంలో ఇంకా ఈ నాటి వరకూ లేవు.

స్త్రీ పురుషులిద్దరూ, బైటి పనీ, ఇంటి పనీ, రెండూ చెయ్యాలి.

ఇద్దరూ బైటి పనులు చేస్తే, ఇద్దరి శ్రమలకూ డబ్బు వస్తుంది. ఇద్దరూ స్వతంత్ర ఆర్థిక శక్తితో వుంటారు. ఇద్దరూ కుటుంబ పోషణ చెయ్యగలుగుతారు. ఇద్దరూ ఒకే పరిస్థితిలో వుంటారు.

అలాగే, ఇద్దరూ ఇంటి పనులు సమాన బాధ్యతతో చెయ్యాలి. దీని వల్ల ఇద్దరికీ డబ్బు రాదు. ఇద్దరూ ఒకే పరిస్థితిలో వుంటారు.

స్త్రీ పురుషుల మధ్య ఈ నాటి వరకూ సాగుతోన్న శ్రమ విభజనలో, చాలా అక్రమం వుంది. దాని వల్ల, ప్రధానంగా స్త్రీలకు అనేక సమస్యలు వున్నాయి.

బైటి పని లేకుండా, ఇంటి పనిలో మాత్రమే వుండిపోయే ఆడ వాళ్ళు, పోషణ కోసం పూర్తిగా మగ వాళ్ళ మీద ఆధారపడి వుండాలి. అతను బియ్యం తెచ్చాకే ఈమె వండాలి; తినాలి. అలాగే, బైటి పని మాత్రమే చేసే మగ వాళ్ళు, ఇంటి పనుల కోసం ఎప్పుడూ ఆడ వాళ్ళ మీదే ఆధారపడి వుండాలి. ఆమె వండాకే అతను తినాలి. ఇది ఇద్దరికీ సమస్యే.

మగ వాళ్ళు ఇంటి పని చెయ్యకుండా, ఆడ వాళ్ళే ఇంటి పనీ బైటి పనీ కూడా చేస్తే, అది ఆడ వాళ్ళకి ఎక్కువ శ్రమ అవుతుంది. ఇది స్త్రీల ప్రత్యేక సమస్య.

'సమస్య' వుందంటే, దానికి తప్పని సరిగా 'పరిష్కారం' వుంటుంది. సమస్యని అర్థం చేసుకుంటే, పరిష్కారం కూడా అర్థమవుతుంది.

స్త్రీ పురుషుల్లో,
ఇద్దరికీ - బైటి పనీ,
ఇద్దరికీ - ఇంటి పనీ!

ఇద్దరికీ - హక్కులూ,
ఇద్దరికీ - బాధ్యతలూ!

ఇద్దరికీ - సమాన పరిస్థితులు!

సమాజంలో, ఒక రోజున, 'మొత్తం ఎంత శ్రమ' జరిగింది?- అని చూస్తే, అందు

లోకి, ( 1 ) ఉత్పాదక శ్రమలూ, ( 2 ) అనుత్పాదక శ్రమలూ, ( 3 ) స్వతంత్ర శ్రమలూ, ( 4 ) కుటుంబ శ్రమలూ - ఈ 4 స్థితుల్లో వున్న శ్రమలూ వస్తాయి.

సమాజంలో, ఒక రోజున, 'ఎంత విలువ ( ఎంత డబ్బు )' ఉత్పత్తి అయింది? - అని చూస్తే, 1 వ అంశమూ, 3 వ అంశమూ మాత్రమే లెక్కలోకి వస్తాయి. 2 వ, 4 వ శ్రమలు, విలువలుగా మారవు.

## పెట్టుబడిదారీ సమాజంలో, శ్రమల సంబంధాలు :

| ఏం శ్రమ? | ఆ శ్రమ చేసే వ్యక్తికి ఎవరితో సంబంధం? | ఆ శ్రమ వల్ల ఏం జరుగుతుంది? | ఆ శ్రమ విలువగా మారుతుందా? |
|---|---|---|---|
| ఉత్పాదక శ్రమ | ఉత్పాదక పెట్టుబడిదారుడైన యజమానితో సంబంధం | ఉత్పత్తుల్ని తయారుచేస్తుంది. ఉత్పత్తుల రూపంలో వుండని పనులు చేస్తుంది. | విలువగా మారుతుంది. |
| అనుత్పాదక శ్రమ | యజమానితో సంబంధం | ,, | విలువగా మారదు. |
| స్వతంత్ర శ్రమ | యజమానితో సంబంధం ఉండదు | ,, | విలువగా మారుతుంది. |
| కుటుంబ శ్రమ | జీతం ఇచ్చే యజమాని కాకపోయినా, యజమానిగానే ఆధిక్యతతో ప్రవర్తించే భర్తతో సంబంధం | ,, | విలువగా మారదు. |

ఏ శ్రమలూ చెయ్యని వర్గం ఒకటి వుండగా,
సమాజంలో జరిగే శ్రమల వివరాలు ఇవి.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ' ఆడ వాళ్ళకు ఇంటి పనీ - మగ వాళ్ళకు బైటి పనీ' అనే శ్రమ విభజన వల్ల కుటుంబాలు శాంతిగా నడుస్తాయని వెనకటి కాలపు పెద్ద వాళ్ళు అనుకుని అలా పెట్టారా?

**జ** : ఏ సాంప్రదాయాన్నీ కొందరు పెద్ద వాళ్ళు కూర్చుని, అనుకుని పెట్టరు. అది ఆ నాటి పరిస్థితుల్లో ఎలాగో ప్రారంభమవుతుంది. కానీ, ఏ సాంప్రదాయం అయినా అందరికీ సమానంగా మేలు చెయ్యాలి. ఈ శ్రమ విభజన సాంప్రదాయం, ఆడ వాళ్ళకీ మగ వాళ్ళకీ కూడా సమస్యలు సృష్టించినా, ఆడ వాళ్ళ సమస్యే చాలా పెద్దది. వాళ్ళు, పోషణ కోసం, మగ వాళ్ళ మీద ఆధారపడే లాగ అది చేస్తుంది.

**2**. బానిసల కాలం నించీ ఆడ వాళ్ళందరూ బయటి శ్రమలు చేశారా?

**జ** : సేవక కుటుంబాల ఆడ వాళ్ళే, అంటే పేద కుటుంబాల వాళ్ళే అలా చేశారు. ధనిక కుటుంబాల మొగ వాళ్ళూ, ఆడ వాళ్ళూ కూడా బయటి పనులు చేసిందేమీ లేదు. ఇంటి పనుల్లో కూడా ఎక్కువ భాగంపనులు, పని మనుషులవే.

**3**. ' కుటుంబం' అంటే ఎవరెవరు?

**జ** : బానిస యజమానుల సమాజంలో బానిసలు కూడా యజమాని కుటుంబానికి చెందిన సేవకులుగా, ఆ కుటుంబపు ఆస్తిగా వుండేవారు. ఈ నాటి భారత దేశపు కుటుంబాన్ని చూస్తే, భార్యాభర్తలూ, వారి పిల్లలూ, భర్త తల్లిదండ్రులూ కలిసి ఒక కుటుంబం అవుతారు.



**4**. ఇది ఏమిటి?

**జ** : ఆమె వంట చేస్తోంది. అతను కూర్చున్నాడు. వాళ్ళిద్దరూ ఏమవుతారో తెలీదు.

**5**. తల్లిదండ్రులు వృద్ధులయ్యాక, వారిని పోషించే బాధ్యత కొడుకులదే అవుతుంది. ఆ బాధ్యత కూతుళ్ళకు ఎందుకు వుండదు?

**జ** : ఆ కూతుళ్ళు, వాళ్ళని వాళ్ళే పోషించుకోలేరు. వాళ్ళు, భర్తల పోషణ కిందే వుంటారు. ఆడ వాళ్ళు కూడా బయట శ్రమలు చేసే నిరుపేద కుటుంబాల్లో కూడా, మొగ వాళ్ళకు వున్న ఆదాయం, ఆడ వాళ్ళకు వుండదు. అలాంటి కారణాల వల్ల, వృద్ధులైన తల్లిదండ్రుల బాధ్యత, కొడుకుల మీదే వుంటుంది.

**6**. ' కుటుంబ సంబంధాలు' అంటే, అవి కూడా శ్రమ సంబంధాలేనా?

**జ** : ఇవి, శ్రమ సంబంధాలు మాత్రమే కాదు; రక్త సంబంధాలు కూడా. కానీ, రక్త సంబంధాలు - అనేవి, అన్ని ప్రాణులకూ వుంటాయి. చీమలకూ, దోమలకూ అన్నిటికీ. కాబట్టి, వాటి సంగతి అనవసరం. కుటుంబంలో శ్రమ సంబంధాలనే ఇక్కడ చూస్తున్నాం.

**7**. తల్లిదండ్రులు, బిడ్డల్ని పెంచి పెద్ద చేస్తారు. ఆ బిడ్డలు పెద్దవారై, అప్పటికి వృద్ధులైన తల్లిదండ్రుల్ని చూసుకోవాలి - అంటాము. బిడ్డలు నిర్వహించవలసిన →

ఈ బాధ్యత కూడా, శ్రమ సంబంధాల కిందకే వస్తుందా?

**జ :** అవును, అలాగే వస్తుంది. కానీ, దానితో పాటు, మానవులకే ప్రత్యేకమైన సంబంధం కూడా ఇక్కడ వుంటుంది. పక్షులూ, జంతువులూ వంటి ప్రాణుల్లో, తల్లి, బిడ్డల్ని కొంత కాలం వరకూ పోషించడం వుంటుంది. కానీ, ఆ బిడ్డలు, పెద్దవిగా అయ్యి, వృద్ధులైన తల్లిదండ్రుల్ని సంరక్షించడం ఎక్కడా వుండదు. బిడ్డలకు పసితనం దాటే వరకే వాటికి తల్లితో సంబంధాలు వుంటాయి. కానీ, మనుషుల సంగతి అది కాదు. మనుషుల్లో వున్న ప్రత్యేక లక్షణం - శ్రమ సంబంధాలు. వాటితో పాటు, 'మానవ సంస్కృతి' అనేది కూడా ఒకటి వుంటుంది. తల్లిదండ్రులు, బిడ్డల్ని పెంచి పెద్ద చేస్తే, ఆ బిడ్డలు పెద్దవారై, తల్లిదండ్రుల్ని వృద్ధాప్యంలో సంరక్షించాలి. ఇది, మానవుల్లో మాత్రమే సాధ్యమయ్యే సంస్కృతి. జంతువులకు సాధ్యం కానిది. ఈ రకంగా, మానవులకు అనేక సంబంధాలు ప్రత్యేకంగా వుంటాయి.

**8**. తల్లిదండ్రులు, బిడ్డల్ని పెంచుతారు. ఆ బిడ్డలు, తల్లిదండ్రుల్ని సంరక్షిస్తారు. ఇవి బాధ్యతలే గానీ, శ్రమ సంబంధాలు ఎలా అవుతాయి?

**జ :** బాధ్యతల్ని నిర్వహించాలంటే, దాని కోసం రక రకాల శ్రమలు చెయ్యాలి. కాబట్టి, అవి శ్రమ సంబంధాలే. కానీ, దీన్ని ఇంకా తార్కికంగా అర్థం చేసుకోవాలి. బిడ్డలు, చిన్నతనంలో శ్రమలు చెయ్యరు. పెద్ద వయసులోనే చేస్తారు. మళ్ళీ వృద్ధాప్యంలో చెయ్యరు. అయినా, వాళ్ళు ఇతరుల శ్రమలతో బతికినట్టు అర్థం కాదు. వాళ్ళూ, వాళ్ళ బిడ్డల కోసం శ్రమలు చేస్తారు. వృద్ధులైన తల్లిదండ్రుల కోసం శ్రమలు చేస్తారు. అంటే, శ్రమలు చేసే వర్గంలో ప్రతి మనిషీ, తల్లిదండ్రుల శ్రమల మీద గాక, తన శ్రమ మీదే తను జీవిస్తున్నట్టు అర్థం. కాకపోతే, తల్లిదండ్రుల శ్రమలు బిడ్డలకూ, బిడ్డల శ్రమలు తల్లిదండ్రులకూ అందుతూ వుంటాయి.

**9**. వృద్ధులైన తల్లిదండ్రుల్ని బిడ్డలే సంరక్షిస్తున్నారా?

**జ :** తల్లిదండ్రులు బాధ్యతగా లేని సందర్భాలూ వున్నాయి; బిడ్డలు బాధ్యతగా లేని సందర్భాలూ వున్నాయి. కానీ, సాధారణంగా వుండే మంచి కుటుంబ సంబంధాల్ని చెప్పుకోవాలంటే, తల్లిదండ్రులూ, బిడ్డలూ, ఎవరి బాధ్యతలతో వారు వుండాలి. సాధారణంగా జరిగేది, తల్లిదండ్రులు బాధ్యతగా వుంటే, బిడ్డలు కూడా బాధ్యతగా వుంటారు.

**10**. కొందరు తల్లిదండ్రులు, వృద్ధాప్యంలో పిల్లలతో వుండడం ఇష్టపడరు. అది మంచిదేనా?

**జ :** వాళ్ళకి అది మంచిదేనేమో. మంచిదో, కాదో వాళ్ళు నిర్ణయించుకోవాలి. కానీ, ఆ తల్లిదండ్రులే, తమకి ఏదైనా ఆస్తి వుంటే, దాన్ని ఆ పిల్లలకే అప్పజెపుతారు.

**11**. ధనిక వర్గంలో, వృద్ధుల సంరక్షణ ఎలా జరుగుతుంది?

**జ :** ఇదేం ప్రశ్న? ఆ వర్గంలో, ఇంటి పనులన్నీ ఎవరి ద్వారా జరుగుతాయో, వృద్ధుల పనులూ వారి ద్వారానే జరుగుతాయి. కుటుంబ సేవకుల ద్వారా. **H**

# 73. పోటీ! అసహ్యమైన మాట!

పెట్టుబడిదారీ విధానంలో, కొత్తగా ప్రారంభమైన ఒక ప్రత్యేక విషయం - పోటీ! పెట్టుబడుల మధ్య పోటీ! అంటే, పెట్టుబడిదారుల మధ్య పోటీ!

పోటీ ఎందుకు? - సరుకుల అమ్మకానికి. ఏ సరుకుని ఉత్పత్తి చేయించడానికైనా ఒక్క పెట్టుబడిదారుడే వుండడు. అనేక మంది పెట్టుబడిదారులు వుంటారు. ఎవరికి వాళ్ళే, ఇతరుల కన్నా ఎక్కువ సరుకుని అమ్ముకోవాలని చూస్తారు.

ఒక ప్రాంతంలో, సైను బట్ట పెట్టుబడిదారులు నలుగురైదుగురు వున్నారనుకుందాం. ప్రతి ఒక్కరి దగ్గిరా, ప్రతి రోజూ వందల, వందల మీటర్ల బట్ట తయారవుతూ వుంటుంది. ఆ బట్ట నంతా అందరూ ఎప్పటికప్పుడు అమ్మేస్తూ వుండాలి. తయారైన బట్ట అమ్ముడైపోయి డబ్బు వస్తూ వుంటేనే, పెట్టుబడి వెనక్కి వస్తుంది. దాన్ని మళ్ళీ ఉపయోగించడం సాధ్యమవుతుంది. అంతే కాదు, సరుకు అమ్ముడైతేనే పెట్టుబడి కన్నా ఎక్కువ డబ్బు వచ్చి, దాన్ని వడ్డీలుగా, లాభాలుగా పంచుకోవడానికి వీలవుతుంది.

'బట్ట' లాంటి సరుకు, కొన్నాళ్ళు అమ్ముడు కాకపోయినా పాడైపోయేదేమీ వుండదు. కానీ, అది ఒక మూల పడి వుంటే, దాన్ని అమ్మకపోతే, కార్మికులకు జీతాలు ఇవ్వడం సాధ్యం కాదు. అది ఆర్నెల్ల దాకా అమ్ముడు కాకపోతే, అప్పటి దాకా దాన్ని స్టోరులో పెట్టి సంరక్షిస్తూ వుండడానికి బోలెడు ఖర్చు అవుతుంది. అందులో వున్న లాభం, చేతికి అందకపోతే, పెట్టుబడిదారుడి విలాసాలకు గండి పడుతుంది. మళ్ళీ కొత్త ఉత్పత్తిని చేయించడాన్ని ('పునరుత్పత్తి' ని) ఆపి వేసి, కార్మికుల్ని తగ్గించి వెయ్యవలసివస్తుంది. అంతా గందరగోళం అయిపోతుంది. కాబట్టి, ఎంత పాడు అవని సరుకు అయినా, కొత్త సరుకు తయారయ్యేటప్పటికి పాత సరుకు అమ్ముడైపోతూ వుండాలి.

స్వతంత్ర ఉత్పత్తిదారుల విషయంలో అయితే, అమ్మకాలు కొంచెం తగ్గి, ఆదాయం తగ్గినా, కొన్నాళ్ళ వరకూ ఇంటి ఖర్చులు కొంచెం తగ్గించుకుంటే సరిపోతుంది. కొత్త సరుకుని తయారుచేసే పని కొన్నాళ్ళు ఆపి, విశ్రాంతి కూడా తీసుకోవచ్చు. కానీ, పెట్టుబడిదారుల విషయం అలా వుండదు. అమ్మకాలు తగ్గితే లాభం తగ్గుతుంది కాబట్టి, అది పెట్టుబడిదారుడికి జీవన్మరణ సమస్యగా వుంటుంది.

మొత్తం సమాజంలో (లేదా, ఒక ప్రాంతంలో), సైను బట్ట కోసం ఎంత అవసరం వుందో దాన్ని సరిగా అంచనా వేసి, అంత బట్టనే తయారుచేయిస్తే, అది తేలిగ్గానే అమ్ముడవుతుంది. 'బట్ట' నే కాదు, ఏ సరుకుని అయినా, దాన్ని ఉత్పత్తి చేయించే వాళ్ళందరి మధ్యా ఒక 'ప్లాను' వుండాలి. అలా వుంటే, అది 'సమిష్టి ప్లాను' అవుతుంది. కానీ, సరుకుల్ని చేయించే వాళ్ళందరూ ప్రైవేటు పెట్టుబడి

దారులు. వాళ్ళు, ఎవరికి వారుగా వ్యక్తిగత ఆస్తుల్ని కూడబెట్టుకునే దోపిడీదారులు. వాళ్ళు, ఒకరి కన్నా ఒకరు ఎక్కువ ఆస్తిని సంపాదించాలనే దృష్టితో వుంటారు. అలాంటి వాళ్ళ మధ్య 'సమిష్టి ప్లాను' సాధ్యం కాదు. (కానీ, వాళ్ళు అలాంటి సమిష్టి ప్లాను ఏర్పర్చుకునే దశ కూడా ఒకటి వుంటుంది. అది ఇప్పుడే కాదు.)

పెట్టుబడిదారులందరికీ కూడా ప్లానులు వుంటాయి. కానీ, ఎవరి ప్లాను వాళ్ళదే. ఒకరి ప్లాను, ఒకరికి తెలీదు. ఎవరి దగ్గిర ఎంత పెట్టుబడి వుంటే అంత సరుకుని తయారు చేయించేస్తారు. దాన్ని అమ్మగలమనే అనుకుంటారు. కొన్ని సార్లు అమ్మగలరు కూడా. కానీ, అనేక సార్లు సమస్యల్లో పడతారు.

సైను బట్టని తయారుచేయించే పెట్టుబడిదారులందరి దగ్గిరా కలిసి ఒక్క రోజులో తయారయ్యే బట్ట, 500 మీటర్లు అనుకుందాం. దీన్ని 'సరుకు సప్లై' అనాలి. (ఇది ఒక్క రోజు సప్లై.) బజార్లో, ఒక్క రోజులో ఎంత బట్ట తేలిగ్గా అమ్ముడు పోయే పరిస్తితి వుందో దాన్ని 'మార్కెట్ డిమాండ్' అనాలి. బట్ట సప్లై 500 మీటర్లు అయినప్పుడు, డిమాండ్ కూడా 500 మీటర్ల కోసమే అయితే, ఆ రెంటికీ సరిపోతుంది. ఆ సరుకంతా తేలిగ్గా అమ్ముడైపోతుంది. కానీ ఏ సరుకు విషయంలోనూ సమిష్టి ప్లాను వుండదు కాబట్టి, సరుకుల సప్లై - డిమాండ్లు ఎప్పుడూ ఒక దాని కొకటి సరిపోవు. అవి ఎప్పుడూ ఎగుడు దిగుళ్ళుగానే వుంటాయి.

సైను బట్టని తయారుచేయించే పెట్టుబడిదారులందరూ - ఒక ఉత్పత్తి శాఖ. ఆ శాఖలో, వేరు వేరు పెట్టుబడిదారుల 'కంపెనీలు' వుంటాయి. ఒక్కొక్క రకం సరుకుని చేసేది - ఒక్కొక్క శాఖ. ప్రతీ శాఖలోనూ ఎక్కువ తక్కువ స్థాయిల పెట్టుబడిదారులు వుంటారు. ఎక్కువ పెట్టుబడులతో ఎక్కువ సరుకుని తయారుచేయించే పెద్ద పెట్టుబడిదారుల మధ్యే, వాళ్ళ కంపెనీల మధ్యే, పోటీలు నడుస్తాయి. తమ సరుకునే ఎక్కువగా అమ్ముకోవాలనీ, ఇతర పెట్టుబడిదారుల సరుకు అమ్ముడు పోకూడదనీ, ప్రతీ పెట్టుబడిదారుడూ కలలు కంటాడు. ఉత్త కలలు కనడమే కాదు, దానికి తగ్గ ఏర్పాట్లన్నీ చేసుకుంటాడు. ఎలాగంటే: సరుకుని, తయారుచేయించే ఖర్చుని కొంచెం తగ్గించగలిగితే, దాన్ని తక్కువ ధరతో అమ్మవచ్చు. ధరని కాస్త తగ్గిస్తే, ఇతరుల కన్నా ఎక్కువ సరుకుని అమ్మవచ్చు. - ప్రయత్నం అంతా దీని కోసం.

అయితే, సరుకు కోసం అయ్యే, ఖర్చుని తగ్గించాలంటే, దాన్ని తయారుచేసే ఉత్పత్తి శక్తిని పెంచాలి. '**ఉత్పత్తి శక్తి**' అనే దాన్ని మనం ఇప్పటి దాకా చూడలేదు. ఇది కొత్త మాట.

పోటీయే ఉత్పత్తి శక్తుల్ని పెంచే మార్గాన్ని కనిపెడుతుంది. కానీ ఆ మార్గమే పోటీకి కాళ్ళ బంధాలు వేస్తూ కూడా వుంటుంది.

మొదట 'ఉత్పత్తి శక్తి'ని అర్థం చేసుకోవాలి.

**[ ఈ పాఠంలో ప్రశ్నలు లేవు ]** **H**

# 74. ఉత్పత్తి శక్తి

ఒక చొక్కాని చేతి కుట్టుతో కుట్టడానికి సగటున 10 గంటల కాలం పడుతుందనుకుందాం. ఆ చొక్కాని 10 గంటల కన్నా తక్కువ కాలంలో, 9 గంటల్లోనే కుట్ట గలిగితే, కుట్టు శ్రమలో ఉత్పత్తి శక్తి (ఉత్పత్తి చేసే శక్తి) పెరిగిందని అర్థం. అయితే, కుట్టు పని చేతి కుట్టుతోనే జరుగుతూ వుంటే, శ్రమ కాలాన్ని తగ్గించడం ఎలాగ? (1) 'పనిముట్ల'లో మార్పులు జరగాలి. (2) శ్రమ చేసే మనిషికి, ఆ మారిన పనిముట్లతో శ్రమ చేసే కొత్త శక్తి తెలియాలి.

ఒక సరుకుని తయారు చెయ్యడానికి, పాత శ్రమా, కొత్త శ్రమా కలిసి, మొత్తం 5 గంటల శ్రమ పడుతుందనుకుందాం. ఆ శ్రమని 5 గంటల కన్నా తగ్గించగలిగితే, ఆ వస్తువుని తయారుచేసే ఉత్పత్తి శక్తి పెరిగిందని అర్థం. ఒకవేళ, ఆ వస్తువుని తయారుచెయ్యడానికి 5 గంటల శ్రమ కన్నా ఎక్కువ శ్రమ పడితే, దాని ఉత్పత్తి శక్తి తగ్గిందని అర్థం.

'ఉత్పత్తి శక్తి' అనేది, శ్రమ చేసే మనుషుల మీదా, వారు ఉపయోగించే శ్రమ పనిముట్ల రకాల మీదా, ఆధారపడి వుంటుంది.

చొక్కాని, చేతి కుట్టుతో కుట్టడం కన్నా, చిన్న చేతి మిషన్‌తో కుడితే, ఆ పని చాలా తొందరగా జరుగుతుంది. 'కుట్టు శ్రమ' లో ఉత్పత్తి శక్తి కొంత పెరుగుతుంది. చేతి మిషనుతో కూడా కాకుండా, కరెంటు మిషనుతో చొక్కాని కుడితే, ఆ పని మరింత తొందరగా జరుగుతుంది. కుట్టు శ్రమలో ఉత్పత్తి శక్తి ఇంకా పెరుగుతుంది.

నేత పని, చేతి మగ్గం మీద గాక కరెంటు మగ్గం మీద జరిగితే, నేత శ్రమలో ఉత్పత్తి శక్తి పెరుగుతుంది.

పొలాన్ని దున్నే పని, నాగలితో కాకుండా ట్రాక్టర్‌తో చేస్తే, దున్నే శ్రమలో ఉత్పత్తి శక్తి పెరుగుతుంది.

ఈ ఉత్పత్తి శక్తుల్ని పెంచే విషయం, పెట్టుబడిదారీ విధానంలోనే పోటీలతో జరుగుతుంది. మొదట ఒకరిద్దరు పెద్ద పెట్టుబడిదారుల దగ్గిర. ఎందుకంటే, సరుకు తయారీకి పట్టే ఖర్చుని తగ్గించి, ధరని కొంచెం తగ్గించి, ఇతర పెట్టుబడిదారుల కన్నా చాలా ఎక్కువ సరుకుని అమ్మి, ఎక్కువ లాభం సంపాదించాలని!

ఉత్పత్తి శక్తి పెరగడం, పనిముట్ల మార్పు ద్వారానే జరుగుతుందా? అందులో కార్మికుల పాత్ర ఏమీ వుండదా? - ఉండేదంతా కార్మికుల పాత్రే. మెరుగైన పరికరాల్ని తయారుచేసేది, మేధా శ్రమల కార్మికులు. పెట్టుబడిదారుల దగ్గిర పనిచేసే ఇంజనీర్లూ, సైంటిస్టులూ కూడా కార్మికులే. వాళ్ళు మేధా శ్రమలతో చేసే పరిశోధనల వల్లనే కొత్త పరికరాలు తయారవుతాయి. వాటిని ఉపయోగిస్తూ పనిచెయ్యాలంటే, సాధారణ కార్మికులు కొత్త ట్రయినింగులతో, కొత్త సాంకేతిక విషయాలు నేర్చుకుని, కొత్త శ్రమ శక్తులు గల వాళ్ళవుతారు. నాగలితో పొలం దున్నే కార్మికుడు, ట్రాక్టర్‌తో దున్నడం నేర్చుకున్నాడంటే, అతని

శ్రమ శక్తి ఇంకో రకంగా మారిందని అర్థం. అక్కడ ఉత్పత్తి శక్తి పెరగడానికి ట్రాక్టరు మాత్రమే కారణం కాదు. ట్రాక్టర్ని తయారు చేసిన వాళ్ళూ, ట్రాక్టర్ని నడిపేవాళ్ళూ, ప్రధాన కారణం. ఉత్పత్తి శక్తి పెరగడం, కార్మికుల వల్లనే జరుగుతుంది.

ఉత్పత్తి శక్తి పెరగడం వల్ల, సరుకుకి పట్టే శ్రమ ( ఖర్చు ) ఎలా తగ్గుతుందో ఇప్పుడు చూడాలి. ఇక్కడ, పనిముట్ల సంగతీ, కార్మికుల సంగతీ మాత్రమే తీసు కుంటాం. ముడి పదార్థాల సంగతి వది లేస్తాం. 1 మీటరు సైను బట్ట కోసం, ఉత్పత్తి శక్తి పెరగక ముందూ, పెరిగిన తర్వాతా, ఉదాహరణలు ఎలా వున్నాయో మొదట చూడాలి.

**ఉత్పత్తి శక్తి పెరగక ముందు :**

బట్టకి, ' చేతి మగ్గం' ద్వారా చేరే పాత శ్రమ 1. కార్మికుల సజీవ శ్రమ 5. పాత శ్రమా, కొత్త శ్రమా కలిసి 6. బట్ట ధర 6 రూ.లు.

**ఉత్పత్తి శక్తి పెరిగిన తర్వాత :**

అంతే బట్టకి, కరెంటు మగ్గం ద్వారా చేరే పాత శ్రమ 3. కార్మికుల సజీవ శ్రమ 2. రెండు శ్రమలూ కలిసి - 5. బట్ట ధర 5 రూ.లు.

బట్ట కోసం అవసరమయ్యే మొత్తం శ్రమ తగ్గింది. బట్ట కోసం నిజంగా అయ్యే ఖర్చు తగ్గింది.

ఖర్చు తగ్గడం ఎలా జరిగింది? సరుకులో పాత శ్రమ తగ్గిందా, కొత్త శ్రమ తగ్గిందా? - పాత శ్రమ తగ్గలేదు ; పైగా అది పెరిగింది. కొత్త శ్రమే తగ్గింది.

పాత శ్రమ తగ్గడం ఎప్పుడూ జరగదు. ఎందుకంటే, ఉత్పత్తి శక్తి పెరగాలంటే, గతం కన్నా మెరుగైన శ్రమ పరికరాలు పని స్థలంలోకి రావాలి. అవి, గత పనిముట్ల కన్నా చాలా ఎక్కువ శ్రమతో తయారైనవిగా వుంటాయి. వాటి నించి సరుకుకి చేరే శ్రమ, గత పనిముట్ల ద్వారా చేరే శ్రమ కన్నా తప్పనిసరిగా ఎక్కువగా వుంటుంది. కాబట్టి, ఉత్పత్తి శక్తి పెరగాలంటే, శ్రమ పరికరాల నించి చేరే శ్రమ పెరగడమే గానీ తగ్గడం జరగదు. కొత్త పరికరం ద్వారా చేరే శ్రమ, పాత పరికరం ద్వారా చేరే శ్రమతో సమానంగా ఉండడం అయినా జరగదు.

అయితే, ఒక శాల్తీ సరుకుకి, పాత రకం పనిముట్ల ద్వారా చేరే శ్రమ కన్నా, కొత్త రకం పనిముట్ల ద్వారా చేరే శ్రమ ఎక్కువగా వుంటే, ఎక్కువ శ్రమని చేర్చే పనిముట్లని తేవడం ఎందుకు? - ఎందుకంటే, వాటి వల్ల ఒక శాల్తీకి అవసరమయ్యే సజీవ శ్రమ తగ్గుతుంది. దాని వల్ల మొత్తం శ్రమ తగ్గుతుంది. ఆ కొత్త పనిముట్లు, వాటి నిర్మాణం వల్ల, స్పీడుగా తిరుగుతాయి. ఆ స్పీడు పనిముట్ల కదలికలకు తగ్గట్టుగానే కార్మికుల శరీరాలు కదులుతాయి. ఆ స్పీడు వల్ల, ఒక వస్తువు, గతంలో కన్నా తక్కువ సమయంలో, తయారవుతుంది. ఒక పని దినంలో, గతంలో కన్నా ఎక్కువ శాల్తీలు తయారై, ఒక శాల్తీకి పట్టే మొత్తం శ్రమ కాలం తగ్గి, దాని విలువ తగ్గుతుంది. కాబట్టి, కొత్త రకం పనిముట్ల వల్ల ఒక వస్తువుకి చేరే శ్రమ పెరిగినా, అది పెట్టుబడిదారుడికి, సమస్యగా ఉండదు. అసలు, ఈ శ్రమల తేడాల సంగతులు పెట్టుబడిదారుడికి తెలీవు. కొత్త రకం పనిముట్లు స్పీడుగా తిరుగుతాయనీ, వాటి

వల్ల గతంలో కన్నా ఎక్కువ శాల్తీలు తయారవుతాయనీ - అదే అతనికి తెలుస్తుంది. పెట్టుబడిదారుడికి, ఏది తెలిసినా, ఏది తెలియక పోయినా, పనిముట్లని మార్చినప్పుడల్లా, అతనికి కావలసిందే జరుగు తుంది.

ఒక సరుకులో పాత శ్రమ 1; కొత్త శ్రమ 5; మొత్తం శ్రమ 6. - ఉదాహరణ ఇలా వున్నప్పుడు, పాత శ్రమ 3గా పెరిగినా, 'మొత్తం శ్రమ' 6 కన్నా తగ్గాలి. అది ఎలా జరగాలి? - సరుకులో వుండే రెండో అంశం ఏమిటి? - కొత్త శ్రమే. కాబట్టి, అదే తగ్గాలి. కొత్త శ్రమ తగ్గడం అంటే, ఏదో కొంచెం తగ్గడం కాదు. ఆ బట్ట ఉదాహరణని మళ్ళీ చూడండి! ఉత్పత్తి శక్తి పెరిగిన ఉదా హరణలో, పాత శ్రమ 2 పెరిగితే, కొత్త శ్రమ 3 తగ్గింది. అంటే, పాత శ్రమలో పెరుగుదల కన్నా, కొత్త శ్రమలో తగ్గుదల ఎక్కువగా వుండాలి. 'మొత్తం శ్రమ' తగ్గడం, అలాగే జరుగుతుంది. మొత్తం శ్రమ తగ్గుతుంది కాబట్టి, సరుకు విలువ తగ్గుతుంది.

సరుకులో, కొత్త శ్రమ తగ్గడం అంటే, ఆ సరుకుని తయారుచేసే కార్మికుల సంఖ్య తగ్గడమే. కొంత భూమిని, నాగళ్ళతో దున్నాలంటే, 10 నాగళ్ళూ, 10 మంది మనుషులూ, కావాలనుకుందాం. అదే పని, అదే కాలంలో, ట్రాక్టర్ ద్వారా జరగాలంటే, ఒక్క మనిషి చాలు. అంటే, అక్కడ ఏం జరుగుతుంది? ఆ దున్నే శ్రమ కోసం ఖర్చు, గతం కన్నా తగ్గుతుంది. 10 నాగళ్ళ ద్వారా చేరే పాత శ్రమ కన్నా, ట్రాక్టర్ ద్వారా చేరే పాత శ్రమ పెరిగి తీరుతుంది. అది పెరిగినా, 10 మంది కార్మికుల శ్రమలో నించి 9 మంది కార్మికుల శ్రమ తగ్గిపోతుంది. ఆ రకంగా, ఆ దున్నే పని కోసం పెట్టే 9 జీతాల ఖర్చు తగ్గుతుంది. అది, 'దున్నే శ్రమ'లో ఉత్పత్తి శక్తి పెరగడం.



కొంత భూమిని
నాగళ్ళతో దున్నడానికి 10 మంది కావాలి.



అదే భూమిని, ట్రాక్టర్‌తో దున్నడానికి
ఒక్క మనిషి చాలు.

ఇప్పుడు, తక్కువ కాలం పడుతుంది. తక్కువ ఖర్చు అవుతుంది. దీని అర్థం, దున్నే శ్రమలో ఉత్పత్తి శక్తి పెరిగిందని.



చేతి కుట్టు




మిషను కుట్టు

దుస్తుల్ని కుట్టడానికి, చేతి కుట్టుతో కన్నా మిషను కుట్టుతో పట్టే కాలం చాలా తగ్గుతుంది.



దీని అర్థం ఏమిటి?
ఈ రోలు - చేతి పనిముట్టు.
పప్పు, నీళ్ళూ - ముడి పదార్థాలు.
ఇవి - పాత శ్రమలు.
రుబ్బిన శ్రమ - కొత్త శ్రమ.
తయారైన పిండి - కొత్త ఉత్పత్తి.



రుబ్బే శ్రమలో,
ఉత్పత్తి శక్తి పెరిగింది.
రుబ్బడానికి పట్టే కాలం
చాలా తగ్గుతుంది.

వంట శ్రమలో ఉత్పత్తి శక్తిని చూద్దాం.





కట్టెల పొయ్యి మీద కన్నా గ్యాస్ పొయ్యి మీద
వంట తొందరగా జరుగుతుంది.
ఇది వంట శ్రమలో ఉత్పత్తి శక్తి పెరగడం.



కొంత భూమి మీద ఒక ఇల్లు కట్టడం కన్నా, అదే భూమి మీద ఇన్ని ఇళ్ళు కడితే, ప్రతి ఇల్లూ తక్కువ ఖర్చుతో తయారవుతుంది.
కానీ దాన్ని ఎక్కువ ధరతో అమ్మితే, కావలసినంత లాభం!

ఏ శ్రమలో అయినా ఉత్పత్తి శక్తి పెరుగుతూనే వుంటుంది.

ఏ సరుకు తయారీలో అయినా, కార్మికుల సంఖ్య తగ్గడం అంటే, ఆ కార్మికుల ఉద్యోగాలు పోవడమే. ట్రాక్టరు వల్ల, దున్నే శ్రమలో, 9 జీతాలు తగ్గాయి అంటే, ఆ 9 మంది కార్మికుల నించి వచ్చే అదనపు శ్రమ కూడా లేకుండా పోతుంది. అయితే, పనిలో వున్న తక్కువ మంది కార్మికుల ద్వారా వచ్చే అదనపు శ్రమ, తగ్గిపోయిన అదనపు శ్రమ కన్నా ఎక్కువగా వుంటుంది. ఎందుకంటే, కొత్త శ్రమ పరికరాల మీద జరిగే కొత్త శ్రమ శక్తి వల్ల, వెనకటి పొడవు గల పని దినం లోనే, వెనకటి కన్నా అనేక రెట్ల యూనిట్ల ఉత్పత్తి తయారవుతుంది. కార్మికులు, తమ జీతం కోసం చేసుకోవలసిన అవసర శ్రమ కాలం చాలా తగ్గిపోతుంది. ఆ తగ్గిన అవసర కాలంలో వచ్చే ఉత్పత్తే కార్మికుల పోషణ కోసం, గతంలో లాగే, గతంలో కన్నా కొంత ఎక్కువగా కూడా కార్మికులకు అందుతుంది. కానీ అది, అవసర కాలం తగ్గి, అదనపు కాలం పెరగడమే.

అయితే, ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు, తక్కువ మంది కార్మికుల శ్రమలో నించే అదనపు శ్రమ భాగం పెరగడం అనేది, ఉత్పత్తి శక్తి ఇంకా ఇంకా పెరిగేకొద్దీ క్రమ క్రమంగా తగ్గిపోతూ వుంటుంది. ఇది, క్రమంగా పెట్టుబడిదారుల కొంప ముంచుతుంది. కానీ, ఈ విషయం పెట్టుబడిదారులకు అర్థం కాదు.

వాళ్ళకి 'లాభం' అనేది ఎలా వస్తుందో తెలీదు. లాభం అనేది కార్మికుల అదనపు శ్రమ వల్లనే వస్తుందని తెలీదు. 'ఖర్చుల' మీద 'ఊరికే కొంత వేసుకుంటే', అదే లాభంగా వస్తుందని వాళ్ళు అనుకుంటారు. కాబట్టి, ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడల్లా, ఉత్పత్తిలోకి చేరే అదనపు శ్రమ సైజులో మార్పులు జరుగుతాయనే సంగతి వాళ్ళకి అసలే తెలీదు.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. పాత ఉత్పత్తి శక్తినీ, కొత్త ఉత్పత్తి శక్తినీ తీసుకుని, 'అదనపు శ్రమ'లో మార్పుని చిన్న ఉదాహరణ ద్వారా చూపించండి.


**జ :** పాత ఉత్పత్తి శక్తి లోనూ, కొత్త ఉత్పత్తి శక్తి లోనూ, పని దినం పొడవు ఒకటే. అది 12 గంటలు అనుకుందాం. పాత ఉత్పత్తి శక్తిలో, కార్మికులు 4 గురు. ప్రతి కార్మికుడికీ అవసర శ్రమ 10 గంటలు. అదనపు శ్రమ 2 గంటలు. 4 గురు కార్మికుల ద్వారా వచ్చే అదనపు శ్రమ కాలం, 4 × 2 = 8 గంటలు. కొత్త ఉత్పత్తి శక్తిలో కార్మికులు 3 గ్గురు. పని దినం అదే. ఒక్కొక్కరి అవసర శ్రమ కాలం 8 గంటలు. అదనపు శ్రమ కాలం 4 గంటలు. 3 గ్గురు కార్మికుల నించీ మొత్తం అదనపు శ్రమ కాలం 3 × 4 = 12 గంటలు. అదనపు శ్రమ పెరిగితే, లాభం ( అదనపు విలువ ) పెరుగుతుంది. మొదటి అదనపు శ్రమ 8 గంటలు అయితే, రెండో అదనపు శ్రమ 12 గంటలు. ఈ పెరుగుదలని శాతంగా చూస్తే, అది 50%. ఉత్పత్తి శక్తి మళ్ళీ పెరిగినప్పుడు, అదనపు శ్రమ కాలం 12 గంటల కన్నా పెరుగుతుంది. కానీ, ఆ పెరుగుదల శాతం 50% గా ఉండదు. దాని కన్నా తగ్గి, 49% గా గానీ, ఇంకా తక్కువగా గానీ వుంటుంది. - ఈ లెక్కలో వున్న విషయాన్నే అర్థం చేసుకోవాలి. సంఖ్యల్ని ఇలాగే తీసుకోకూడదు. 'అదనపు శ్రమ' లో జరిగే పెరుగుదలలూ, ఆ పెరుగుదలలో తగ్గుదలలూ - ఇదంతా పెట్టుబడిదారులకు తెలీదు.

**2**. ఇదంతా పెట్టుబడిదారుల ఆర్థికవేత్తలు, పెట్టుబడిదారులకు చెప్పరా?

**జ :** ఆ ఆర్థికవేత్తలకు అసలే తెలీదు. పెట్టుబడిదారీ ఆర్థికవేత్తకి గురువు - పెట్టుబడిదారుడే కదా? పెట్టుబడిదారుడుకి తెలిసేది మాత్రమే ఆర్థిక వేత్తకి తెలుస్తుంది. అంత కన్నా తెలీదు. పెట్టుబడిదారుడి జ్ఞానం అంతా 'పెట్టుబడికి వడ్డీ లాభాలు రావాలి' అనేదే. అతని ఆర్థికవేత్తకి తెలిసేది కూడా అదే.

**3**. రవాణా శ్రమలో, ఉత్పత్తి శక్తి పెరగడాన్ని చూపించండి.

**జ :** 5 కిలో మీటర్ల దూరం వెళ్ళాలంటే, ఎడ్లబండి కన్నా సైకిలు తొందరగా వెళ్తుంది. దాని కన్నా బస్సూ, బస్సు కన్నా రైలూ, రైలు కన్నా విమానమూ వేగంగా వెళ్తాయి.





# 75.పాలించే వర్గ భావాలే ప్రజల భావాలు!

ఈ నాటి వరకూ సాగిన, సాగుతూవున్న సమాజాల్లో, పాలించే వర్గం - యజమాని వర్గం. ఇది దోపిడీ వర్గం.

దోపిడీకి గురి అయ్యే వర్గం - శ్రామిక వర్గం. ఇదే ప్రజల వర్గం. ప్రజలు, పాలకులు కారు.

పాలించే వర్గ భావాలే, ప్రజల భావాలుగా ఉంటున్నాయి. భూమికి - కౌలూ, పెట్టుబడికి - వడ్డీ లాభాలూ - అనేవి, పాలించే వర్గ భావాలు. అవే ప్రజల భావాలు కూడా. ప్రజలకు ఆ భావాలు ఎలా వచ్చాయి? పాలించే వర్గం నించే వచ్చాయి. బానిస యజమానుల కాలం నించీ, ఎంత పెద్ద అంశంలో అయినా, ఎంత చిన్న అంశంలో అయినా, ప్రజల భావాలకు మూలం, వారి జీవన పరిస్తితుల్లో యజమాని వర్గం అందించే భావాలే.

పెట్టుబడిదారీ విధానంలో, కేవలం అధిక లాభం దృష్టితో ఉత్పత్తి శక్తుల్ని పెంచుతూ పోవడమూ, పీకలు కోసేసుకునే దృష్టితో పోటీలు పడడమూ సాగుతూ వుంటాయని చూశాం. అలాంటి వికృత లక్షణాలు ఇంకా అనేకం ఉన్నాయి. ' షేర్ల అమ్మకాల' వికృతం పూర్తిగా పెట్టుబడిదారీ సృష్టే. కానీ దాన్ని ఇక్కడ చూడలేము. దాన్ని వదిలేసి ఇంకో దాన్ని చూద్దాం. ఉత్పత్తుల రూపాల్ని చీటికీ మాటికీ మార్చేసే వికృతం ఇది. ఎప్పుడూ కొత్త రూపాలే, సరికొత్త రూపాలే! ఇవ్వాల్టి సరికొత్త మోడలే రేపటికి పాతదై పోతుంది. మళ్ళీ అది కూడా మాయమై ఆ మర్నాటికి ఇంకో కొత్త మోడలు దిగిపోతుంది. సరుకుల మోడళ్ళని ఎప్పుడూ కొత్త కొత్తగా ఇస్తూ వుంటే, జనం వాటిని ఎగబడి కొంటారని అమ్మేవాళ్ళ శాస్త్రం! ఒకే రకం సరుకుని, ఇతర పెట్టుబడిదార్ల దగ్గిర దొరికే మోడలుతో గాక ఇంకో మోడలుతో జనం ముందుపెడితే, జనం మరింత ఎగబడి కొంటారని! కొంటారు కూడా! సరుకుల్ని కొనే వాళ్ళు, పెట్టుబడిదారీ జనమే కాదు, కార్మిక జనం కూడా. కార్మిక జనం కూడా కొత్త మార్పులకే ఎగబడతారు.

ఒక ఉపాధ్యాయుడి ఇంట్లో 4 కుర్చీలు ఉన్నాయి. వాటిల్లో ఒకటి వెదురు బద్దల అల్లిక కుర్చీ. దాన్ని కొని ఏడాదే అయింది. బజార్లో పోతూ దాన్ని చూసీ చూడగానే జేబులో డబ్బు లేకపోయినా, అందాకా కొంచెం అడ్వాన్స్ ఇచ్చి ఇంటికి పరిగెత్తుకొచ్చి, మళ్ళీ పరిగెత్తుకెళ్ళి ఆ కుర్చీని కొనేశాడా ఉపాధ్యాయుడు. ఆ ఇంట్లో ఎవరన్నా కుర్చీలో కూర్చోవాలంటే, ఆ కుర్చీలో కూర్చోడానికే సరదా పడతారు.

వాళ్ళింటికి యాభై యేళ్ళ చుట్టాలావిడ అన్నపూర్ణమ్మ వచ్చింది ఒక సారి. ఆవిడ, నడుం నొప్పుల మనిషి. ఏ కుర్చీలూ ఆవిడికి పడవు. ఎందులో కూర్చున్నా నొప్పులు ఎక్కువవుతాయి. బల్ల మీదో, బల్ల మంచం మీదో మాత్రమే పడుకుంటూ

వుంటుంది. అలాంటి నొప్పులావిడ ఆ ఇంట్లోకి రాగానే ఎదురుగా కనపడ్డ ఆ వెదురు బద్దల కుర్చీ మీదే, మర్యాద కోసం అన్నట్టు కూర్చుంది. ఇంటావిడతో మాటల్లో పడిపోయింది. గంట సేపు దాటిపోయింది.

"అన్నాలు తిందాం, లే వొదినా" అంటూ ఇంటావిడ సుభద్ర లేస్తోంటే, నొప్పు లావిడ కూడా కుర్చీలో నించి లేడి పిల్లలా ఛెంగున లేచింది. చక చకా నడి చింది. అప్పటికి గానీ ఆవిడికి నడుం మాట గుర్తు రాలేదు. అసలు నొప్పే లేనట్టనిపిం చింది. నిర్ఘాంతపోతూ, "ఇదేమిటి? ఆ కుర్చీలో కూర్చుంటే ఇంత బాగుంది నాకు! అసలు కుర్చీల్లో అంతసేపు కూర్చోగలనా నేను? ఆ కుర్చీలో నొప్పే పోయింది" అంటూ ఆవిడ మళ్ళీ ఆ కుర్చీ దగ్గిరికి వెళ్ళి దాన్ని ముట్టుకుని పరిశీలించి మళ్ళీ అందులోనే కూర్చుంది. "అన్నం ఇక్కడే తింటాను" అంది.

సుభద్ర అన్నం పళ్ళాలు అక్కడికే తెచ్చింది. "మీ అన్నయ్య ఎప్పుడూ ఈ కుర్చీలోనే కూర్చుంటారు" అంటూ ఆ కుర్చీని పొగుడుతూ చెప్పింది.

"అయితే, ఇలాంటి కుర్చీ ఒకటి కొను క్కుని పట్టుకుపోతాను. ఎక్కడ దొరుకు తుంది?" అని నొప్పులావిడ తెగ ఆతృత పడింది.

ఆ సాయంత్రమే వాళ్ళిద్దరూ ఆ కుర్చీ కోసం బజార్లోకి బైల్దేరారు. ఆ షాపులోకే వెళ్ళారు. అక్కడ చాలా రకాల కుర్చీలూ బెంచీలూ ఉన్నాయి - చెక్కవీ, రేకువీ, ప్లాస్టిక్‌వీ, ఇవీ అవీ, నగిషీల్తో, వొంపుల్తో, సొంపుల్తో, షోకుల్తో! కానీ ఆ రకం లేదు.

"ఏడాది కిందట ఇక్కడే కొన్నాం. ఇంత ఎత్తు వుంటుంది. వెనక్కి కొంచెం వాలినట్టు వుంటుంది. ఆ కుర్చీయే కావాలి మాకు" అన్నారు వీళ్ళు.

షాపులో కార్మికుడు అర్థం చేసుకు న్నాడు. ఆ కుర్చీ మోడల్ పేరు కూడా చెప్పాడు. అన్నీ చెప్పి చివరికి, "అబ్బే! అది పాత రకం. ఏడాది కిందటి రకం ఇప్పు డెక్కడ దొరుకుతుందమ్మా? కొత్త కొత్త మోడళ్ళు చాలా వచ్చాయి. ఇవన్నీ చూడండి" అన్నాడు.

అన్నపూర్ణమ్మ ఏ కుర్చీ వేపూ తల తిప్ప లేదు. "కాదు, మాకు ఆ కుర్చీయే కావాలి. అదే రకం మాకు చేయించి ఇస్తారా?" అంది.

"ఆ మోడల్‌ని చేసే యంత్రాలే మారి పోయి వుంటాయి. ఆ పనివాళ్ళు ఇప్పుడెక్క డుంటారు?" అన్నాడు ఈ పనివాడు.

అన్నపూర్ణమ్మ డీలా పడిపోయింది.

వేరే షాపుల్లో చూడాలని బజారంతా తిరిగారు. ఎన్నో షాపులు చూశారు. షాపుల నిండా దొంతర్ల దొంతర్ల సరుకు! కుర్చీలు, కుర్చీలు, కుర్చీలు, బెంచీలు! ఆ మోడలు ఎక్కడా లేదు. అన్ని షాపుల్లోనూ కార్మికులు ఒకటే మాట! "అది పాత రకం కదా? ఏడాది నాటి రకం కదా? పాత రకాల్ని మార్చెయ్యాలి కదమ్మా? షాపులోకి ఏది వస్తే అదే అమ్ముతాం. కొత్తదే మంచిది కదా? పాత రకం ఎందుకు?"

ఒక షాపులో కార్మికుడు పెద్ద వయసు

ఆయన. " మీ రైతే పాత మోడలే కావాలంటున్నారు గానీ, వచ్చే వాళ్ళందరూ రాగానే, ' ఏవైనా కొత్త మోడల్స్ వచ్చాయా?' అని అడుగుతారు. కొత్తవే చూపించినా, ఇంకా కొత్తవి కావాలంటారు. నేను బట్టల షాపుల్లో, చెప్పుల షాపుల్లో, చాలా చోట్ల పని చేశాలెండి. అన్ని చోట్లా కొత్తవే అడుగుతారు. పాత మోడల్స్‌ని చూడనే చూడరు. అందరికీ అదే అలవాటైపోయింది లెండి. అయినా ఇవన్నీ చాలా మంచివమ్మా! ఎంత ఫేషన్‌గా వున్నాయో చూడండి!" అంటూ చాలా మాట్లాడాడు.

అన్నపూర్ణమ్మకి ఏడుపు ఒక్కటే తక్కువ.

సుభద్ర, ఆవిణ్ణి ఓదారుస్తూ, " ఫర్వా లేదులే వొదినా, మా కుర్చీ తీసుకు పోదువు గానిలే వొదినా!" అంది.

" అయ్యో! మీకు మాత్రం ఉండొద్దూ అంత మంచి వస్తువు కొత్త రకం, కొత్త రకం అంటారేమిటి? మంచి రకం వస్తువులు ఎప్పుడూ దొరకొద్దూ?" అని నొప్పు లావిడ చాలా విసుక్కుంది. కొట్ల వెంట తిరిగి తిరిగి నడుం కి కూడా సహనం పోయింది. " కొత్త రకాలట, కొత్త రకాలు" అని నొప్పు లావిడ మళ్ళీ విసుక్కుంది.

" బాగా చెప్పావు. మొన్న నేను అట్ల పెనం కొందామని వెళ్తే, పాత రకం దొరకనే లేదు. చుట్టూ నగిషీలతో కొత్తది చూపించారు. ' ఇప్పుడివే వస్తున్నాయండీ' అన్నారు. ఇంకేం చెయ్యను? అదే పట్టుకొచ్చాను. పైగా ఖరీదెక్కువ. మా పక్కింటి వాళ్ళు దాన్ని చూసి, పరిగెత్తుకెళ్ళి అది తెచ్చుకున్నారు. కొత్త రకాలంటే నిజంగానే అందరూ ఎగబడతారు వొదినా! మా చిన్నప్పుడు జడ చివర ఊలు ముక్కలు కట్టుకునేవాళ్ళం. మా పిల్లలకి రిబ్బన్నులు కొన్నాం. ఇప్పుడు అవీ లేవు. అన్నీ రబ్బరు బేండ్లే. కుంకాలు పోయాయి. అందరూ స్టిక్కర్ బొట్లే!"

" ఏడిసినట్టే వుంది" అని పదో సారి విసుక్కుంది అన్నపూర్ణమ్మ.

సుభద్ర ఏదో గుర్తొచ్చినట్టు నడుస్తూనే చెప్పకొచ్చింది. " మీ అన్నయ్య ఇది వరకు అక్షరాల డిజైన్ల చొక్కాలు ఎప్పుడన్నా వేసుకున్నారా? మొన్న అలాంటిది కొనుక్కొచ్చారు. పిల్లలకి పాఠాలు చెప్పే టీచరు అలాంటి చొక్కా వేసుకుంటే ఏం బాగుంటుంది వొదినా? ఆ మాట అంటే, ' నువ్వు స్టిక్కర్ బొట్టు పెట్టుకోటం లేదా' అన్నారు. నేనే నోరు మూసుకున్నాను."

బజారుకి పిచ్చెక్కినట్టనిపించింది అన్మపూర్ణమ్మకి. " ఏవిటో కాలం మారి పోతోంది" అంది నిరుత్సాహంగా.

ఆవిడికి తెలీదు గానీ, మారిపోయేది కాలం కాదు. కాలంలో, సూర్యుడి నడకలో, కోటి సంవత్సరాల్లో ఒక్క సెకన్ అయినా మారదు. మారేది పెట్టుబడిదారీ మార్కెట్టే! పిచ్చెక్కేది దానికే! దానికి లాభం పిచ్చి! ఎక్కువ లాభం పిచ్చి! జనాలకు సరుకుల్ని అంటగట్టే పిచ్చి! జనాల్ని పిచ్చి వాళ్ళని చేసే పిచ్చి! ఆ పిచ్చి వాళ్ళు సృష్టించే మార్కెట్టు అది!

10 రకాల చొక్కాలు వున్న అబ్బాయి, పదకొండో చొక్కాతో అవసరం లేక పోయినా, షాపులో కొత్త రకాలు కనపడ్డా

యంటే, ఇంకో 2 రకాలు కొనేస్తాడు. కొత్త మోడళ్ళు కాకపోతే, ఆ మనిషి, అవసరం లేకుండానే కొత్త వాటిని ఎందుకు కొంటాడు? మోడల్ కొత్తది! రోడ్డు మీద పోయే వాడెవడో అది వేసుకున్నాడు. అది కావాలి!

చొక్కాలే కాదు, లాగులే కాదు ; చేతి రుమాళ్ళ దగ్గిర్నించీ, దుప్పట్ల దాకా ; సూది దగ్గిర్నించీ ఓడ దాకా, ప్రతీ వస్తువూ ఎంతో కొంత మారిపోతూ వుండవలసిందే. మారిన పద్ధతి గతం కన్నా సౌఖ్యమైనదా అంటే, అదేం వుండదు. షోకుల్లోనే మార్పు! అదే దాని కొత్తదనం!

పెన్సిళ్ళు చూడండి! పాత పెన్సిళ్ళు నిప్పు లాగ రాసేవి. ఇప్పటి పెన్సిళ్ళు నీళ్ళతో రాసినంత వెల వెలబోతూ రాస్తాయి. వాటిని చెక్కుతూ వుంటే, పెన్సిలు ముల్లు చీపురు పుల్ల లాగ ముక్కలైపోతూ వుంటుంది. కానీ, ఆ పెన్సిల్ మీదే - రంగులూ, ఇంగ్లీషు అక్షరాలూ, డిజైన్లూ షోకులూ, బోలెడు!

ఇదీ అదీ అని లేదు. ఇంట్లో వాడేది అయినా, బైట వాడేది అయినా, ప్రతీ సరుకు రూపమూ మారిపోతూ వుండాలి. అది, మరింత నాణ్యత కోసం కాదు. ఉపయోగపు విలువ దృష్టితో కాదు. మరింత లాభం కోసం! మారకం విలువ దృష్టితో! ప్రతీ పెట్టుబడిదారుడికీ లక్ష్యం, ఇతర పెట్టుబడిదారుల కన్నా తనే ఎక్కువ సరుకుని అమ్మాలి. 'ఎక్కువ నాణ్యతతో అమ్మాలి' అని కాదు. ఏదో ఒక మోసంతో అమ్మాలి. ఎక్కువ సరుకు వల్ల ఎక్కువ లాభం! ఎక్కువ సరుకుని అమ్మాలంటే, జనం ఎగబడి కొనే లాగ దాని షోకుల్ని మార్చేస్తూ వుండాలి. కొత్త షోకు కనపడితే జనం అవసరం లేని సరుకుని కూడా కొనేస్తారనీ, జనాల్ని అంత పిచ్చి వాళ్ళ లాగ తయారుచెయ్యడం చాలా తేలిక అనీ, పెట్టుబడిదారీ వ్యాపారికి తెలుసు.

సరుకుల్ని తయారు చేయించేది - యజమానులు. వాళ్ళు పెట్టుబడిదారులు. సరుకుల రకాల్ని నిర్ణయించేది వాళ్ళే. అందులో కార్మికుల పాత్ర ఏమీ వుండదు. యజమానులు నిర్ణయించే రకాల్ని చెయ్యడమే కార్మికుల పని. అది అంతటితో పోదు. కార్మికుల జీవితాల్లో వాడవలసిన ఉత్పత్తులన్నీ, యజమానుల వ్యాపార ఎత్తుగడల ద్వారా తయారైనవే. యజమానులు, ఎలాంటి పదార్థాలు తయారు చేయించినా, ఎంత కల్తీలతో తయారు చేయించినా, వాటినే కార్మికులు తినాలి. యజమానులు తయారుచేయించే బట్టల రకాలే కార్మికులు కట్టాలి. యజమానులు తయారుచేయించే రోత పత్రికలే కార్మికులు చదవాలి. యజమానులు తయారు చేయించే వికృత సినిమాలే కార్మికులు చూడాలి.

కార్మికులు ఏ రకం పదార్థాలు తినాలో, ఏ ఫేషన్ బట్టలు కట్టాలో, ఏది చదవాలో, ఏది చూడాలో, ప్రతీదీ యజమానులే నిర్ణయిస్తారు. వాళ్ళు తయారుచెయ్యమన్న వస్తువులే కార్మికులు తయారుచెయ్యాలి, అవే తమ జీవితాల్లో వాడుకోవాలి. ఇక కార్మికులకు వేరే అభిరుచులు ఏర్పడే

అవకాశం ఎక్కడ వుంది?

తమకు ఎలాంటి వస్తువులు కావాలో నిర్ణయించుకునే అవకాశమే కార్మికులకు వుండదు. కార్మికుల అభిరుచులు, యజమానులు తయారుచేయించే వస్తువులకే అనుగుణంగా మారిపోతూ వుంటాయి. మోడల్ మారిపోయినప్పుడల్లా, కార్మికుల అభిరుచులు కూడా ఉత్సాహంగా మారిపోతూ ఉంటాయి. ' ఇది మంచిదా కాదా? ఇది వాడవచ్చా లేదా' అనే ఆలోచనకే చోటు వుండదు.

కార్మికులు తమకు వచ్చే జీతాలతో, తమకు ఏది కావాలో దాన్నే, తమ స్వంత ఇష్టాలతోనే వస్తువుల్ని కొంటారన్నట్టు కనపడుతుంది. కాని అది చాలా భ్రమ. మార్కెట్టులో వున్నదాన్నే కొంటారు. అక్కడ దొరికేదాన్నే కొంటారు. ఆ దొరికేది, ఎంత నగిషీలతో తళ తళ లాడితే అంత ఉత్సాహంగా కొంటారు.

మేధా శ్రమల కార్మికులు, ఇళ్ళని రక రకాల వస్తువులతో నింపేస్తారు. నేల నిండా, గోడల నిండా, గోడల మూలల నిండా, టాపుల నిండా, అలమార్ల నిండా, షోకుల అట్టలూ రేకులూ బొమ్మలూ దిమ్మలూ! ఇంటిని అలా ముస్తాబు చెయ్యడం గొప్ప విలువ! ఇంట్లోకి నాలుగు షోకుల సామాన్లు చేరెయ్యగానే తమ ఇరుకు కొంపలు కూడా యజమాని భవనం అంత గొప్పవి అయిపోయినట్టు ఊహ!

యజమానుల కుటుంబాలు అనుభవించే విలాసాలన్నీ తామూ చవిచూస్తూ వుండాలి. హోటళ్ళ వెంటబడి తినాలి. ఊళ్ళ వెంటబడి తిరగాలి. అక్కడికి పోయి చూసేవన్నీ దేవుళ్ళ గుళ్ళూ, నగల దుకాణాలూ! అక్కడ ఫ్యాక్టరీలు ఎలా వున్నాయో, అక్కడి కార్మికులు ఎలా ఉన్నారో, అదేమీ ఈ కార్మికులకు పట్టదు. వాళ్ళు ఇటు వేపు వస్తే, వాళ్ళూ అంతే. రోడ్లూ, షాపులూ, పార్కులూ, హోటళ్ళూ, సినిమాలూ! అన్నీ చూసి కొంపలకు తిరిగి వచ్చేస్తే, దేవుడి గుళ్ళ కోసం ఖర్చులు పెట్టేసి కొంపలకి చేరితే, చాలా ఆనందంగా జీవిస్తున్నామనే భ్రమ!

ఈ భావాలన్నీ స్వంతానివే. కార్మిక వర్గానికి కూడా స్వంత భావాలూ, స్వంత సంస్కృతీ ఉన్నట్టే కనపడుతుంది. కానీ ఆ ' స్వంతం', యజమానుల తుక్కు భావాల నించి తర తరాలుగా నేర్చుకున్నది. యజమాని వర్గానికి ఏది గొప్ప విలువో, ఏది విలాసమో, ఏది భేషజమో, అవే, రోజు వారీ కూలి పని చేసుకునే బికారి కార్మికులకు కూడా లక్ష్యాలూ, ఆదర్శాలూ! ' శ్రమ దోపిడీ' గురించీ, ' యజమానీ శ్రామిక సంబంధాల' గురించీ తెలియనప్పుడు, కార్మిక జనాలకు స్వంత భావాలూ, స్వతంత్ర భావాలూ, స్వంత వ్యక్తిత్వాలూ, స్వంత సంస్కృతీ అన్నీ అబద్ధం! యజమాని భావాల్ని అనుకరించడమే అసలైన నిజం!

యజమాని భావాల అనుకరణకు, వెనకటి కాలపు బానిసల్ని తప్పు పట్టకూడదు. వెనకటి కాలపు కౌలు రైతుల్ని తప్పు పట్టకూడదు.

ఈ నాటి మేధా శ్రమల సెక్షన్లనే, వీళ్ళ

కూడా అంత వెనకబడి వున్నందుకే, తప్పు పట్టాలి. వీళ్ళు, తమ బతుకుదెరువుల గురించి తెలుసుకోకుండా వున్నందుకే తప్పు పట్టాలి.

శ్రామిక జనం ఎంత కాలం పాటు ఇలా వుంటారో, అంత కాలమూ, ఆ శ్రామిక జనం భావాలు, పాలించే వర్గం నించి నేర్చుకునే తప్పుడు భావాలే!

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ఒక కౌలు రైతుని, "నువ్వు వ్యవసాయం చేసే భూమికి కౌలు ఎందుకు చెల్లిస్తున్నావు?" అని అడగండి! అతనేం చెపుతాడు?

**జ**: "అయ్యో, భూమి భూస్వామి గారిది కదా? కౌలు చెల్లించకపోతే ఎలాగ?" అంటాడు.

"కౌలుగా ధాన్యం ఇస్తావు. ఆ ధాన్యాన్ని భూస్వామి వాడుకుంటాడు గానీ, భూమి వాడుకుంటుందా? భూమికి కౌలు ఎందుకు - అని ఆలోచించి చూడు!"

"కొత్తగా ఆలోచించేదేముంది? భూమి, భూస్వామిదే కదా? ఆ భూమిని ఇచ్చి, కౌలు తీసుకోకపోతే, భూస్వామి కుటుంబం ఎలా బతుకుతుంది?"

"మీ కౌలు రైతుల కుటుంబం ఎలా బతుకుతోంది? మీరు భూమి మీద శ్రమలు చేసుకుంటున్నారు కదా? అలాగే, భూస్వామి కుటుంబం కూడా కొంత భూమి మీద మీ లాగే శ్రమ చెయ్యవచ్చు కదా? అసలు అందరూ కలిసి భూమిని పండించి, ఆ ధాన్యాన్ని పంచుకుని సుఖంగా వాడుకోవచ్చు కదా? అలా ఆలోచించి చూడండి!"

"అబ్బే, అదేం మాట? అంత ఆస్తి వున్న వాడు, పొలం లోకి వొంగి పని చేస్తాడా?"

"'చేస్తాడా' అనొద్దు. మనిషి అన్న వాడు, ఏదో ఒక పని చెయ్యడం మంచిదా కాదా? అలా ఆలోచించండి."

"పొలమూ పుట్రా లేని వాళ్ళకి అదంతా మంచిది గానీ, అంత భూమి వున్న వాడు పనెందుకు చేస్తాడు?"

"అసలు ఆ భూమి అతనికి ఎలా వచ్చింది? భూమి నీ కెందుకు రాలేదు?"

"ఆయన తాతలూ తండ్రులూ సంపాదించి ఆయనకి ఇచ్చారు. మా వాళ్ళు మాకేం ఇచ్చి చచ్చారు?"

"అతని తండ్రులూ తాతలూ ఎలా సంపాదించారు అంత భూమిని?"

"ఏమో, ఏ నాడో కష్టం చేసి సంపాదించి వుంటారు."

ఎంతసేపైనా ఇలాగే సాగుతుంది.

**2**. పెట్టుబడిదారుల దగ్గిర పని చేస్తోన్న ఏ కార్మికుణ్ణయినా (కార్మికురాలినైనా) అడగండి, "పెట్టుబడిదారుడికి లాభం ఎందుకు రావాలి? అతను కూడా మీ లాగే కొంత జీతం తీసుకోవచ్చు కదా? లాభం కూడా ఎందుకు తీసుకోవాలి?" అని అడగండి! ఆ కార్మికులేం చెపుతారు?

**జ**: "ఆయన చాలా పెట్టుబడి పెడతాడు కదా? మరి, పెట్టుబడికి లాభం రావొద్దూ?" అంటారు. →

"పెట్టుబడి పెడితే, సరుకుని అమ్మగానే పెట్టుబడి అంతా వెనక్కి వచ్చేస్తుంది కదా? ఆ పెట్టుబడితో మళ్ళీ కొంటే, ఖర్చయి పోయిన ఉత్పత్తి సాధనా లన్నీ వచ్చేస్తాయి. వాటితో మళ్ళీ కొత్త సరుకు తయారవుతుంది. పెట్టుబడిదారుడు కూడా పని చేస్తే, దానికి జీతం వస్తుంది. ఇంకా అతనికి 'లాభం' ఎందుకు రావాలి?"

"అదేంటి? పెట్టుబడికి లాభం రావద్దూ? లాభం రాకపోతే పెట్టుబడి ఎవరు పెడతారు?" అంటారు.

**3**. 'వడ్డీ' గురించి కూడా అడగండి. ఏం చెపుతారు?

**జ**: "అప్పు తీసుకుంటే, వడ్డీ కూడా ఇవ్వొద్దూ?" అంటారు.

**4**. శ్రామిక జనాభాకి, ఈ భావాలన్నీ ఎలా వచ్చాయి?

**జ**: యజమాని వర్గం నించే. పాలించే వర్గం నించే. భావాల్ని ప్రచారం చేసే సాధనా లన్నీ యజమాని వర్గం చేతుల్లో వుంటాయి. అంటే, ఉత్పత్తి సాధనాలు ఎవరి చేతుల్లో వుంటాయో, భావాల్ని నేర్పే సాధనాలూ వాళ్ళ చేతుల్లోనే వుంటాయి.

**5**. పెట్టుబడిదారులు, పాత సరుకుల రూపాల్ని మార్చేసే ఉదాహరణ ఏదైనా ఇవ్వండి!

**జ**:




**పురాతన డిజైన్లకు కొత్త రూపు**

బెంగళూరు (ఆన్‌లైన్): దీపావళిని పురస్కరించుకుని కీర్తిలాల్ జువెలర్స్, వినూత్న ఆభరణాలను మార్కెట్లోకి విడుదల చేసింది. ఇందులో భాగంగా అత్యంత పురాతన సంప్రదాయ నగలను ఆధునిక డిజైన్లతో మెరుగులు దిద్దటంతో పాటు, సరికొత్త మోడల్ ఆభరణాలను పురాతన శైలికి మార్చినట్లు కీర్తిలాల్స్ ప్రాంతీయ మేనేజర్ జి.కె.శ్రీపతిరావు చెప్పారు.

(ఆంధ్రజ్యోతి, 9-10-2009)

ప్రతీ సరుకు రూపాల్నీ ఇలాగే మార్చేస్తూ వుంటారు. కొత్త వాటిని పాతగా, పాత వాటిని కొత్తగా! ఈ రూపాల మార్పులు అవసరాల కోసం కాదు. అమ్మకాల కోసం. కొత్త రూపాలతో వస్తే, మళ్ళీ కొంటారని. ఇది బిజినెస్ ఎత్తుగడ! కొంటారు కూడా! ఆ వస్తువులతో అవసరాలు లేకపోయినా కొనేస్తారు! ఆ బొమ్మలో మేనేజర్‌గారు చేసే ఉద్యోగం ఏమిటంటే, టయ్యీ అదీ కట్టుకుని, ట్రిమ్ముగా నిలబడి, ఒక నగని చూపించడం! అదీ ఆయన చేసే శ్రమ!

ఇలాంటి వాతావరణంలో, సాధారణ కార్మిక ప్రజలు, ఇవే భావాల్ని గాక, ఇంకేం నేర్చుకుంటారు?

# 76. భారీ యంత్రాలూ, విమానాలూ, కంప్యూటర్లూ, అన్నీ పనిముట్లే! 'సూది' లాంటివే!

ఒక శాఖలో, ఉత్పత్తి శక్తి పెరగడం, అక్కడ వున్న పెట్టుబడిదారు లందరి దగ్గిరా ఒకే సారి జరగదు. మొదట, ఒకరిద్దరు పెద్ద పెట్టుబడిదారుల దగ్గిరే జరుగుతుంది. వాళ్ళ దగ్గిర ఎక్కువ పెట్టుబడి వుంటుంది కాబట్టి వాళ్ళు పాత పనిముట్లని తీసేసి ( వాటిని, చిన్న స్థాయి పెట్టుబడిదారులకు అమ్మేసి ), మెరుగైన పనిముట్లని పని స్థలంలో పెట్టగలుగుతారు. కార్మికులకు కొత్త ట్రయినింగులు అవసరమవుతాయి. లేదా, కొత్త శ్రమ పరికరాల మీద పని చెయ్యడం తెలిసిన కొత్త కార్మికులే అవసరమవుతారు. ఈ కొత్త శ్రమ శక్తి గల కార్మికుల జీతాలు, గతం కన్నా కొంత పెరుగుతాయి.

ఉత్పత్తి శక్తి పెరగడానికి, ( 1 ) గత పనిముట్ల కన్నా మెరుగైన పనిముట్లూ, ( 2 ) గత శ్రమ శక్తి కన్నా సాంకేతికంగా మెరుగైన శ్రమ శక్తి గల కార్మికులూ - రెండూ కలిసి వుండాలి.

సైను బట్ట శాఖలో, ఒక్క పెట్టుబడిదారుడి దగ్గిరే ఉత్పత్తి శక్తి పెరిగిందనుకుందాం. అతని దగ్గిర, ఇంతకు ముందు చూసిన ఉదాహరణలో, 1 మీటరు బట్టకి ఖర్చు తగ్గింది. ఉత్పత్తి శక్తి పెరగక ముందు, ఆ బట్టకి మొత్తం శ్రమ 6. ఉత్పత్తి శక్తి కొంత పెరిగాక, మొత్తం శ్రమ 5. అయితే, ఖర్చు తగ్గింది కాబట్టి, ఆ పెట్టుబడిదారుడు, బట్ట ధరని తప్పకుండా తగ్గిస్తాడా? వీలైతే తగ్గించకుండానే, అందరూ అమ్మే 6 ధరకే, అమ్మడానికి చూస్తాడు. అలా అమ్మగలిగితే, లాభం గతం కన్నా పెరుగుతుంది. లేదా, ధరని, 6 కన్నా కొంచెం తగ్గిస్తే, ఇతర పెట్టుబడిదారుల కన్నా ఎక్కువ సరుకుని అమ్మగలుగుతాడు. దాని వల్ల కూడా లాభం, గతం కన్నా పెరుగుతుంది. పాత ధరనే వుంచడం గానీ, దాన్ని కొంచెం తగ్గించడం గానీ, ఎలా వీలైతే అలా చేస్తాడు. ఎలా చేసినా, ఉత్పత్తి శక్తిని మొదట పెంచుకున్న వాడి దగ్గిర, ఆ ఉత్పత్తి శక్తి లేని ఇతర పెట్టుబడిదారుల కన్నా ఎక్కువ లాభం వుంటుంది. ఉత్పత్తి శక్తిని పెంచడం, లాభాన్ని పెంచుకోవడానికే. అలా ఎంత కాలం సాగుతుందంటే, ఆ పెరిగిన ఉత్పత్తి శక్తిని ఆ శాఖలో ఇతర పెట్టుబడిదారులు కూడా పట్టుకోనంత కాలమే. అప్పటి దాకా మాత్రం, కొత్త ఉత్పత్తి శక్తి వున్న పెట్టుబడిదారుడు చాలా లాభం సంపాదిస్తూ వుంటాడు.

కానీ అది ఎంతో కాలం సాగదు. ఆ శాఖలో ఇతర పెట్టుబడిదారుల్లో చాలా మంది, త్వరలోనే, ఆ కొత్త ఉత్పత్తి శక్తిని సంపాదిస్తారు.

అందరి దగ్గిరా కొత్త ఉత్పత్తి శక్తి వున్నప్పుడు, అందరూ కార్మికుల్ని తగ్గించి వెయ్యగలుగుతారు. అందరి దగ్గిరా ఉత్పత్తి ఖర్చు తగ్గుతుంది. ఆ శాఖలో పెట్టుబడి

దారులందరూ ఎవరికి వారే ఎక్కువ సరుకుని అమ్ముకోవాలనే దృష్టితో, పోటీలు పడి సరుకు ధరని వీలైనంత తగ్గిస్తారు. అందరి దగ్గిరా పాత ఖర్చూ, పాత ధరా, తగ్గిపోతాయి. క్రమంగా ఆ సరుకుకి, తగ్గిన ధరే అసలు ధర అవుతుంది. అప్పటి దాకా ఒకరిద్దరు పెద్ద పెట్టుబడిదారులకు మాత్రమే అందే అధిక లాభం మాయమవుతుంది. తర్వాత ఉత్పత్తి శక్తి ఇంకా పెరిగితే, ఖర్చు ఇంకా తగ్గి, ధర ఇంకా తగ్గుతుంది.

'ఉత్పత్తి శక్తి' గురించి చాలా విషయాలు సరిగా, జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

(1) ఉత్పత్తి శక్తి పెరగడం మంచిదా, చెడ్డదా?

(2) ఉత్పత్తి శక్తి పెరగడం వల్ల వచ్చే ఎక్కువ లాభం, కొత్త శ్రమ పరికరాల నించి వస్తుందా?

(3) ఉత్పత్తి శక్తి ఎంత వరకూ పెరుగుతుంది? ఎక్కడ ఆగుతుంది?

ఇటువంటి ప్రతీ సందేహానికీ జవాబులు అర్థం చేసుకోవాలి.

సరుకుల్ని అమ్మడంలో పోటీ - అనేది, వెనకటి సమాజాల్లో లేదు. అంటే, వెనకటి సమాజాలు చాలా మంచివి- అని చెప్పడం కాదు. పోల్చి చెప్పాలంటే, వెనకటి సమాజాలు మరింత కౄరమైనవి. బానిస, భూస్వామ్య సమాజాల కన్నా పెట్టుబడిదారీ సమాజం తప్పనిసరిగా అభివృద్ధికరమైనది. అయితే, అన్నీ శ్రమ దోపిడీ సమాజాలే కాబట్టి, అన్నిటికీ ఉమ్మడి దుర్గుణాలు వున్నాయి. ఆ ఉమ్మడి దుర్గుణాలతో పాటు, దేని ప్రత్యేక దుర్గుణాలు దానికి వున్నాయి. 'పోటీ' అనేది, పెట్టుబడిదారీ విధానంలో పుట్టిన ప్రత్యేక దుర్గుణం. వెనకటి సమాజాలు, సరుకుల్ని ఉత్పత్తి చేయించే సమాజాలు కావు కాబట్టి, అక్కడ పోటీల దుర్గుణం లేదు.

పెట్టుబడిదారీ విధానానికి ఏకైక లక్ష్యం - పెట్టుబడితో లాభం సంపాదించడం! అంటే, కొంత డబ్బుతో, ఎక్కువ డబ్బు సంపాదించడం, ఒక్క సారి పెట్టిన డబ్బుతోనే ( ఆ పెట్టుబడితోనే ), మళ్ళీ మళ్ళీ మళ్ళీ ఎన్ని సార్లయినా, అంతం లేకుండా 'లాభం' సంపాదించడం! ఏదో కొంచెం లాభం కాదు. కుప్పతెప్పల లాభం రావాలి! దానికి మార్గం - ఇతర పెట్టుబడిదారులతో పోటీ! ఇతరుల కన్నా ఎక్కువ సరుకుని అమ్మగలగాలి. అది జరగాలంటే, సరుకు ధరని తగ్గించాలి. అది జరగాలంటే, సరుకుని తయారుచేసే ఖర్చుని తగ్గించాలి. అది జరగాలంటే, ఉత్పత్తి శక్తిని పెంచాలి. ఇతరుల దగ్గిర లేని కొత్త ఉత్పత్తి శక్తి తన దగ్గిర ఉండాలి.

కానీ ప్రతీ శాఖలోనూ మొదట ఒకరిద్దరు పెట్టుబడిదారుల దగ్గిర మాత్రమే పెరిగిన ఉత్పత్తి శక్తి, కొంత కాలానికి ఆ శాఖలో అందరి దగ్గిరికీ చేరుతుంది. అందరి దగ్గిరా సరుకు ధర తగ్గి, అదే స్థిర పడుతుంది. అప్పటి దాకా ఎక్కువ లాభం సంపాదించగలిగిన వాళ్ళ పరిస్తితి మళ్ళీ మొదటి కొస్తుంది. అందరి లాభ శాతమూ ఒకే రకంగా అవుతుంది. ఉత్పత్తి శక్తిని పెంచుకోవడం వల్ల కొంత కాలం నించీ వస్తూ వున్న ఎక్కువ లాభం మాయమవుతుంది.

ఇక అప్పుడు, ఆ పెద్ద పెట్టుబడిదారులు చేసేది, ఉత్పత్తి శక్తిని మళ్ళీ

పెంచడం! మరింత మెరుగైన శ్రమ పరికరాలూ, మెరుగైన శ్రమ శక్తి గల కొత్త కార్మికులూ, పాత కార్మికుల బర్తరఫ్‌లూ! మళ్ళీ ఎక్కువ లాభాలూ!


కానీ, కొన్నాళ్ళకి ఆ పెరిగిన కొత్త ఉత్పత్తి శక్తి కూడా అందరికీ అందుబాటులోకి వస్తుంది. దాన్ని మొదట పెంచిన వాళ్ళ దగ్గిర, అది కూడా పాత ఉత్పత్తి శక్తి అయిపోతుంది. వాళ్ళ దగ్గిర పెరిగే లాభం మాయమవుతుంది. - అప్పుడు మళ్ళీ జరిగేది, ఉత్పత్తి శక్తిని మళ్ళీ పెంచడం! ఇక దానికి అంతం వుండదు.

పెట్టుబడిదార్లకు ఏ సమస్యకీ కారణం అర్థం కాదు. అర్థమైనా వాళ్ళకి ఆ కారణం నచ్చదు. కొత్త లాభం తగ్గినప్పుడల్లా, ఉత్పత్తి శక్తిని ఇంకా ఇంకా పెంచడమే వాళ్ళకి మార్గంగా కనపడుతుంది. 'ఉత్పత్తి శక్తిని ఎప్పటి దాకా పెంచాలి? ఎక్కడ ఆపాలి?' అనే ప్రశ్నలే, ఆ దృష్టే, వాళ్ళ దగ్గిర వుండదు. ఇతర కంపెనీల దగ్గిర వున్న ఉత్పత్తి శక్తి కన్నా ఎక్కువ శక్తిని సంపాదించాలి, అంతే. అదే ప్రతీ పెట్టుబడిదారుడికీ లక్ష్యం!


ఒక శాఖలో ఉత్పత్తి శక్తి పెరిగిందంటే, దానికి ముడి పదార్థాలు గతంలో కన్నా త్వరత్వరగా అందుతూ వుండాలి. ఆ ముడి పదార్థాల్ని అందించే శాఖల్లో కూడా ఉత్పత్తి శక్తుల్ని పెంచవలసి వస్తుంది. సహాయక పదార్థాల శాఖల్లో కూడా అదే జరగాలి. అన్ని శాఖల ఉత్పత్తులూ, ఒక దానితో ఒకటి లంకెలు పడి వుంటాయి. ఒక శాఖలో ఉత్పత్తి శక్తి పెరిగితే, ఇతర శాఖలు, పాత స్థాయిలోనే చలనం లేకుండా ఉండిపోవు. అన్ని చోట్లా ఉత్పత్తి శక్తులు పెరుగుతూనే వుంటాయి ; అవి మళ్ళీ పాతబడిపోతూ వుంటాయి ; మళ్ళీ అంత కన్నా పెరుగుతూ వుంటాయి.




సూది పాత్ర ఏమిటి? ఇది, కుట్టు శ్రమలో పనిముట్టు.




విమానం పాత్ర ఏమిటి? ఇది, రవాణా శ్రమలో పనిముట్టు.



తక్కువ ఉత్పత్తి శక్తి గల పనిముట్టు



ఎక్కువ ఉత్పత్తి శక్తి గల పనిముట్టు.



కంప్యూటరు

ఇది ఏమిటి? సమాచారాన్ని దాచిపెట్టే, వేరే చోటుకి పంపే శ్రమలో, ఎక్కువ ఉత్పత్తి శక్తి గల పనిముట్టు.

ఒక పెట్టుబడిదారుడి పని స్థలంలోకి కొత్త భారీ యంత్రం వచ్చింది. ఆ యంత్రాన్ని నడపగల కార్మికులే వచ్చారు. ఉత్పత్తి శక్తి పెరిగింది. అక్కడ లాభం పెరిగింది. ఆ పెరిగిన లాభానికి కారణం, ఆ కొత్త యంత్రమా? - కాదు. యంత్రం కూడా 'సూది' లాంటి, 'కత్తెర' లాంటి నిర్జీవ పనిముట్టే. సూది - శ్రమ చెయ్యదు. కత్తెర - శ్రమ చెయ్యదు. అలాగే, ఎంత భారీ యంత్రం అయినా శ్రమ చెయ్యదు.

శ్రమ చేసేది యంత్రం కాదు. శ్రమ చేసేది ఎప్పుడూ మనుషులే. యంత్రాన్ని మనుషులు తిప్పితే తిరుగుతుంది ; ఆపితే ఆగుతుంది. అది ఎంత భారీ పనిముట్టు అయినా, అది, పాతబడిపోయేటప్పటికి, తన విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వదు. సూదికి వర్తించే సూత్రమే భారీ యంత్రానికి కూడా వర్తిస్తుంది. ఉత్పత్తి శక్తి పెరగడానికి అయితే, మెరుగైన పనిముట్టూ, ఆ మెరుగైన శ్రమ శక్తి గల కార్మికులూ - రెండూ కారణమే. కానీ, 'లాభం' రావడానికి, ఆ లాభం పెరిగినా తగ్గినా, దానికి కారణం, శ్రమ పరికరం కాదు. మనుషుల అదనపు శ్రమే.

పెట్టుబడిదారీ విధానంలో, ఉత్పత్తి శక్తుల్ని మళ్ళీ మళ్ళీ పెంచడం కోసం, కొత్త కొత్త యంత్రాల్ని కనిపెట్టడం, ఒక ప్రత్యేక లక్షణం అయిపోతుంది. యంత్రాల వల్ల, చిత్ర విచిత్ర చర్యలు జరుగుతూ వుంటాయి. కానీ, 'శ్రమ చేసేది పనిముట్లు కాదు' అనే విషయం సరిగా అర్థం చేసుకోకపోతే, భారీ యంత్రాల్ని చూడగానే, 'యంత్రమే శ్రమ చేస్తుంది. యంత్రం ఎంత పని చేస్తోందో' అన్నట్టు కనపడుతుంది. కానీ అది పొరపాటు. బస్సులూ, రైళ్ళూ, విమానాలూ, కంప్యూటర్లూ, అన్నీ యంత్రాలే. 'శ్రమ చెయ్యడం' అనే విషయంలో, యంత్రం, సూది కన్నా వేరు అయినదేమీ కాదు.

విలువని ఇవ్వడంలో, ఎంత భారీ యంత్రమైనా, తన విలువనే తిరిగి ఇస్తుంది గానీ, దాని కన్నా తక్కువగా గానీ ఎక్కువగా గానీ ఇవ్వదు.

ఉత్పత్తి శక్తిని పెంచుకున్న పెట్టుబడిదారుడికి కొంత కాలం వరకూ ఎక్కువ లాభం వస్తుంది కదా? ఆ 'ఎక్కువ లాభం' కూడా కార్మికుల అదనపు శ్రమ వల్ల వచ్చేదే గానీ, కొత్త శ్రమ పరికరాల వల్ల వచ్చేది కాదు. ఆ లెక్కలన్నీ ఇక్కడ చూడలేము.

ఉత్పత్తి శక్తి పెరగడానికి కారణం, కొత్త రకం పనిముట్లే గాక ఇంకా కొన్ని కారణాలు ఉన్నాయి. ఉత్పత్తి తయారీ కోసం అవసరమయ్యే కాలాన్ని తగ్గించడానికి అనేక మార్గాల్లో ప్రయత్నాలు జరుగుతాయి. మొక్కలూ, పశువులూ చేపలూ వంటి సజీవ ఉత్పత్తుల్ని పెంచే శ్రమల్లో అనేక రకాల రసాయనాల వాడకాలు జరుగుతాయి. ప్రకృతి సహజంగా అయితే 2, 3 సంవత్సరాల్లో పెరిగే గొర్రె లాంటి జంతువు, రసాయనాల ప్రయోగాల వల్ల 6 నెలల్లోనే పెరుగుతుంది. దాని పెంపకానికి పట్టే శ్రమ కాలం తగ్గి, దాని వల్ల ఎక్కువ లాభం దొరుకుతుంది. నాలుగు నెలల కాలంలో సహజంగా పెరిగే కూరగాయల మొక్కల మీద రసాయనాలు ప్రయోగిస్తే, అవి 2 నెలల లోపలే, సహజమైన బరువుల కన్నా నాలుగేసి రెట్లు పెరుగుతాయి.

పాలల్లో, పప్పుల్లో, మందుల్లో, ప్రతీ ఉత్పత్తి లోనూ కల్తీలు చెయ్యడం వల్ల, లాభాలు పెరుగుతాయి.

కేవలం లాభమే లక్ష్యంగా వుండే పెట్టుబడిదారీ విధానంలో, దాని వ్యాపారంలో, నీతినీ, ఆరోగ్యాన్నీ, సహజత్వాన్నీ ఊహించడం సాధ్యం కాదు. అవి అక్కడ అర్థం లేని మాటలు.

ఎక్కడ ఏ పద్ధతిలో లాభం పెరిగినా, అది పెరిగినా తగ్గినా, దానికి కారణం శ్రమే.

ఒక సరుకుని అమ్మగా వచ్చే ధరలో నించి ఉత్పత్తి సాధనాల భాగాన్ని తీసివేస్తే, ఇంకా మిగిలేది, అది ఎంత వున్నా, తక్కువగా వున్నా - ఎక్కువగా వున్నా - ఎంత ఎక్కువగా వున్నా - అది సజీవ శ్రమదే. అందులో నించి జీతాల భాగాన్ని తీసివేస్తే, మిగిలినది అదనపు విలువ.

"లాభం అనేది, తక్కువైనా, ఎక్కువైనా, అదనపు శ్రమ వల్లే వస్తుంది" అనే విషయం ఎప్పుడూ మర్చిపోకూడదు.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. చేతితో కుట్టడం పోయి, మిషనుతో కుట్టడం వచ్చింది. కుట్టు శ్రమలో ఉత్పత్తి శక్తి పెరిగింది. దానికి కారణం, కుట్టు మిషనే కదా?

**జ** : కుట్టు మిషనే కాదు. 'ఉత్పత్తి శక్తి' అన్నప్పుడు, పనిముట్లనీ, శ్రమ చేసే మనుషుల్నీ కలిపి చూడాలి. అందులో ఒక్క అంశాన్నే విడిగా చూడకూడదు. కుట్టు మిషను వుంటే, మిషను మీద కుట్టడం తెలిసిన మనుషులు ఉండొద్దూ? మిషన్‌ని తయారుచేసేది, యంత్ర శాస్త్రం తెలిసిన కార్మికులు. మిషను మీద పనిచేసేది, కొత్త శ్రమ శక్తి తెలిసిన కార్మికులు. ఉత్పత్తి శక్తి పెరగడానికి శ్రమ చేసే మనుషులే అసలు కారణం.

**2**. ఒక చొక్కాని చేతి కుట్టుతో కుట్టినప్పుడు చేతి పనిముట్టు అయిన సూది ద్వారా చేరే విలువని 'పైస' అనుకుందాం. అదే రకం చొక్కాని మిషను మీద కుట్టినప్పుడు, ఆ కొత్త పనిముట్టు ద్వారా చేరే విలువ పైసే ఉంటుందా, ఎక్కువ ఉంటుందా?

**జ** : తప్పకుండా ఎక్కువగా ఉంటుంది. సూది తయారీ కోసం కన్నా మిషను తయారీ కోసం వేల, లక్షల రెట్ల ఎక్కువ శ్రమ పడుతుంది. అయితే, సూది ద్వారా 1, 2 చొక్కాలు మాత్రమే తయారైతే, మిషను ద్వారా వందల, వేల చొక్కాలు తయారవుతాయి. ఈ లెక్కలన్నీ చూస్తే, ఒక చొక్కాకి, సూది ద్వారా చేరే శ్రమ కన్నా, మిషను ద్వారా చేరే శ్రమ తప్పనిసరిగా ఎక్కువగా ఉంటుంది.

**3**. చేతి కుట్టుతో చొక్కాని కుట్టడానికి 10 గంటల కాలం పడుతుంది. మిషను మీద కుట్టడానికి 2 గంటలే పడుతుంది. అయితే, చేతి కుట్టు మనిషి శ్రమకి 10 గంటల విలువ ఉంటే, మిషను కుట్టు మనిషి శ్రమకి 2 గంటల విలువే ఉంటుందా?

**జ** : అలా కాదు. ఒకే రకం శ్రమ అయితే, ఎక్కువ గంటల శ్రమకి ఎక్కువ విలువా, తక్కువ గంటల శ్రమకి తక్కువ విలువా, ఉంటాయి. కానీ, చేతి కుట్టు శ్రమా, మిషను కుట్టు శ్రమా - రెండూ ఒకే రకం శ్రమలు కావు. వాటి విలువలు ఒకే రకంగా ఉండవు. తేడాగా ఉంటాయి. అంతే కాదు, ఒక శ్రమ, ఏ రూపంలో జరుగుతుందో, ఎన్ని గంటలు జరుగుతుందో, అది విలువగా మారినప్పుడు, అన్ని విలువ గంటలుగానే లెక్కకు రాదు. 10 గంటల చేతి కుట్టు శ్రమ, విలువ లెక్కలో 10 విలువ గంటలుగా ఉండదు. తగ్గడమో, హెచ్చడమో జరుగుతుంది. ఇక్కడ ఏదో ఒక ఉదాహరణని పెట్టుకోవాలి. 10 చేతి కుట్టు శ్రమ గంటలు, విలువ లెక్కలో, 4 విలువ అవుతుంది అనుకుందాం. అలాగే, మిషను కుట్టు గంటల్ని కూడా మార్చాలి. 2 మిషను కుట్టు గంటలు, ⟶

విలువగా, 3 విలువ అనుకుందాం. చేతి కుట్టు చొక్కా విలువ కన్నా, మిషను కుట్టు చొక్కా విలువ తగ్గాలి. మిషను కుట్టు చొక్కాకి పనిముట్టు నించి చేరే విలువ పెరిగి, కొత్త శ్రమ విలువ తగ్గుతుంది. రెండూ కలిసి, మొత్తం విలువ తగ్గుతుంది.

**4**. తక్కువ ఉత్పత్తి శక్తి వున్నప్పుడు, ఒక మీటరు బట్ట విలువ 6. అందులో అదనపు విలువని 2 అనుకుందాం. ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు అదే బట్ట విలువ 5. బట్టని 5 విలువకే అమ్మితే, అందులో కూడా 2 అదనపు విలువ వుంటుందా?

**జ** : కొన్ని సందర్భాల్లో ఉంటుంది ; కొన్ని సందర్భాల్లో వుండదు. పెట్టుబడిదారుడు ఉత్పత్తి శక్తిని పెంచేది వెనకటి లాభం కన్నా ఎక్కువని సంపాదించాలనే గానీ, తక్కువని సంపాదించాలని కాదు. కొత్త ఉత్పత్తి శక్తితో ఖర్చుని తగ్గించినా, ఆ సరుకుని పాత ధరకే అమ్మి, లాభాన్ని ఎక్కువగా సంపాదిస్తాడు. ఆ సరుకుని కొత్త ధరకి ( తగ్గిన ధరకే ) అమ్మితే లాభం ఎలా వుంటుంది - అనేది, అనేక లెక్కల మీద ఆధారపడి వుంటుంది. లాభం గతం కన్నా తగ్గడం మాత్రం జరగదు. ఎందుకంటే, ఆ సరుకులోకి చేరే సజీవ శ్రమ కొంత తగ్గినా, అందులోనే ' అవసర శ్రమ కాలం' తగ్గడం అనే కారణంతో, ' అదనపు శ్రమ కాలం' పెరుగుతుంది. ఆ రకంగా పాత లాభం, ఎప్పటి లాగే నిలబడడం గానీ, కొంచెం పెరగడం గానీ జరుగుతుంది.

**5**. కంప్యూటర్లు వచ్చేశాయి. ఇక, కార్మికులు చేసే శ్రమ ఏం ఉంటుంది?

**జ** : కంప్యూటర్‌ని పనిముట్టుగా అర్థం చేసుకుంటే ఈ సందేహం రాదు. కంప్యూటరు మీద పనిచేసే కార్మికుడు, రోజూ పని స్థలంలో 10 గంటలు వుంటే, అతను రోజూ 10 గంటల కాలం పని చేస్తున్నట్టు అర్థం. కంప్యూటరు లేనప్పుడూ అతని పని కాలం అదే; కంప్యూటరు ఉన్నప్పుడూ అతని పని కాలం అదే.

**6**. ' లాభ శాతం' అంటే?


**జ** : 100 పెట్టుబడికి 5 లాభం వస్తే, లాభ శాతం 5. 100 కి, 6 లాభం వస్తే, లాభ శాతం 6. లాభ శాతం అనే మాటకి ఇంకో పేరు - లాభం రేటు.



7. ఈ చాపా, దుప్పటీ ఏమిటి? పనిముట్లా?

**జ** : ఏదైనా ఒక శ్రమ జరిగేటప్పుడు ఉపయోగపడేవే పని ముట్లు. నిద్ర పోవడం, శ్రమ చెయ్యడం కాదు. కాబట్టి, ఆ చాపా, దుప్పటీ, పనిముట్లు కావు.

ఈ యంత్రాలన్నీ పనిముట్లే



H

# 77. నిరుద్యోగం పెట్టుబడిదారీ విధానం సృష్టి!

ఒక శాఖలోకి మెరుగైన శ్రమ పరికరాలు ప్రవేశించి అక్కడ ఉత్పత్తి శక్తి పెరిగిందంటే, అక్కడ అనేక మంది కార్మికులు నిరుద్యోగు లయ్యారని అర్థం. పెట్టుబడిదారీ విధానం వల్ల ఏర్పడే ప్రత్యేక దుర్లక్షణాల్లో ఒకటి - నిరుద్యోగం! ఇది వెనకటి సమాజాల్లో లేదు. బానిసల్లో ఎవరూ నిరుద్యోగులుగా వుండరు. కౌలు రైతుల్లో కూడా ఎవరూ నిరుద్యోగులు అవరు. వాళ్ళకి పని వుంటుంది. దాని వల్ల, తిండి వుంటుంది. పెట్టుబడిదారీ విధానంలోనే నిరుద్యోగం కొత్త సృష్టి. దీన్ని అర్థం చేసుకోవడానికి కొన్ని లెక్కలు చూడాలి.

ఏదో ఒక శ్రమని తీసుకోవాలి. 'నేత'నో, 'కుట్టు'నో, ఏదో ఒక శ్రమని. ఆ శ్రమని, చేతి పనిముట్టు తోనూ చెయ్యవచ్చు ; యంత్రం తోనూ చెయ్యవచ్చు. భూమిని దున్నే పని నాగలి తోనూ చెయ్యవచ్చు ; ట్రాక్టర్ తోనూ చెయ్యవచ్చు.

నాగలిని తయారు చెయ్యడానికి పట్టే శ్రమ కన్నా, ట్రాక్టర్ని తయారుచెయ్యడానికి ఎక్కువ శ్రమ కావాలి. నాగలిని తయారు చెయ్యడానికి కావలసిన మొత్తం శ్రమ 2 గంటలు అయితే, ట్రాక్టర్ని తయారు చెయ్యడానికి కావలసిన మొత్తం శ్రమ, 12 గంటలు అనుకుందాం. ( ఇక్కడ విషయాన్నే అర్థం చేసుకోవాలి. ఈ సంఖ్యల్నే యధాతథంగా తీసుకోకూడదు. ) నాగలి కోసం కన్నా, ట్రాక్టర్ కోసం అవసరమయ్యే 'ఎక్కువ శ్రమ' 10 గంటలు. అంటే, నాగలిని తయారుచెయ్యడానికి అవసరమయ్యే ఉద్యోగాల కన్నా, ట్రాక్టర్ని తయారుచెయ్యడానికి అవసరమయ్యే ఉద్యోగాలు ఎక్కువ. అది నిజమే. కానీ, అంత వరకే చూస్తే చాలదు.

నాగలి కన్నా 10 గంటల ఎక్కువ శ్రమతో తయారై వచ్చిన ట్రాక్టరు, అది పని స్థలంలో వున్నంత కాలంలో, తన ద్వారా ఎంత శ్రమని తగ్గిస్తుంది? అంటే, నాగలి పోయి ట్రాక్టర్ రావడం వల్ల, దున్నే పనికి గతంలో పట్టే శ్రమ కాలంలో ఎంత కాలం తగ్గుతుంది? ట్రాక్టరు, 10 గంటల శ్రమనే తగ్గిస్తుందా? ట్రాక్టరు తయారయ్యే చోట 10 గంటల శ్రమ పెరిగి, అది వచ్చిన చోట 10 గంటల శ్రమే తగ్గితే, ట్రాక్టర్ వల్ల ఉత్పత్తి శక్తి పెరిగినట్టు అవదు. ఉత్పత్తి శక్తి పెరగడం అంటే, ఒక చోట పెరిగిన శ్రమ కాలమే ఇంకో చోట తగ్గడం కాదు. పెరిగే శ్రమ కన్నా, తగ్గే శ్రమ ఎక్కువగా వుండాలి. నాగలి కన్నా 10 గంటల ఎక్కువ శ్రమతో తయారైన ట్రాక్టర్ వల్ల, దాని జీవిత కాలంలో, కనీసం 11 గంటల కాలం తగ్గాలి. అలా జరిగితేనే, కొత్త శ్రమ పరికరం వల్ల ఉత్పత్తి శక్తి పెరిగినట్టు అవుతుంది. అలాంటి శ్రమ పరికరమే పని స్థలంలోకి రాగలుగుతుంది.

భారీ యంత్రాలు, అవి తయారవడానికి పట్టే ఎక్కువ కాలంతో, అవి తగ్గించ

గలిగే కాలాన్ని పోలిస్తే, అవి వచ్చిన పని స్తలాల్లో, వందల రెట్ల కాలాన్ని తగ్గించి వేస్తాయి. అవి తయారయ్యే చోట ఎక్కువ శ్రమ అవసరం అయినా ( అక్కడ ఎక్కువ ఉద్యోగాలు దొరికినా ), ఆ యంత్రాలు వచ్చిన పని స్తలాల్లో అనేక రెట్ల ఉద్యోగాలు ఆగిపోతాయి. నాగలి తయారయ్యే చోట కన్నా, ట్రాక్టరు తయారయ్యే చోట 10 మందికి ఎక్కువగా ఉద్యోగాలు దొరుకుతాయి అనుకుంటే, ఆ ట్రాక్టరు వచ్చి పని చేసే చోట 50 మంది శ్రమని అనవసరం చేస్తుంది. పెట్టుబడిదారులు, యంత్రాల్ని తెచ్చేది, కార్మికుల్ని ఎప్పటిలాగే వుంచడానికి కాదు ; తగ్గించి వెయ్యడానికే.

ప్రశ్న : అయితే, ఉత్పత్తి శక్తులు పెరగడం మంచిది కాదా?

**జవాబు** : ఒక విషయం మంచిదో కాదో చూడాలంటే, అది ఎలాంటి సంబంధాల్లో వుందో, ఎలాంటి సందర్భంలో వుందో, దాన్ని బట్టి చూడాలి. ' ఉత్పత్తి శక్తులు పెరగడం' అనే విషయాన్ని విడిగా చూస్తే, అది చాలా మంచిది. ఎంతో మంచిది. ధాన్యాన్ని రోకలితో దంచడం కన్నా యంత్రంతో దంచితే, శ్రమ చేసే మనుషుల శరీరాలకు కష్టం తగ్గుతుంది. శ్రమ చెయ్యవలసిన కాలం తగ్గుతుంది. బట్టల్ని చేతితో కుట్టడం కన్నా మిషన్‌తో కుడితే, కష్టం తగ్గుతుంది, శ్రమ కాలం తగ్గుతుంది. కాబట్టి, ఏ శ్రమలో అయినా, ఉత్పత్తి శక్తి పెరగడం ఎంతో మంచిది. చాలా మంచిది. అయితే, ఉత్పత్తి శక్తి పెరగడం, ' యజమానీ శ్రామిక సంబంధాల్లో జరిగితే', అది యజమాని ఆధీనంలో వుంటే, దాని వల్ల ( ఉత్పత్తి శక్తి పెరగడం వల్ల ) వచ్చే మంచి ఫలితాలు, శ్రామికులకు అందవు. అవి, యజమానికే అనుకూలంగా వుంటాయి.

ఒక పెట్టుబడిదారుడి పని స్తలంలో 10 మంది కార్మికులు పని చేస్తున్నారు. పని దినం - రోజూ 10 గంటలు. అక్కడికి మెరుగైన శ్రమ పరికరాలు వచ్చాయి. గతంలో జరిగినంత పనే జరగాలంటే, ఆ కొత్త శ్రమ పరికరాల మీద 10 మందీ చేస్తే, ఆ పని సగం పని దినంతోనే అయిపోతుంది. కాబట్టి, అప్పుడేం జరగాలి? ఆ 10 మంది కార్మికులకూ కొత్త ట్రయినింగులు ఇవ్వాలి. అందరూ ఎప్పటిలాగే ఉద్యోగాల్లో వుండాలి. కానీ అందరికీ పని గంటలు తగ్గాలి. అలా జరిగితే, ఉత్పత్తి శక్తి పెరగడం వల్ల, శ్రమ చేసే వారికి మేలు జరుగుతుంది. కానీ, అది పెట్టుబడిదారులకు మేలు కాదు. - ఇక్కడ మనం, ' వైరుధ్యం' అనే ఒక కొత్త మాటని నేర్చు కోవాలి.

**' వైరుధ్యం'** అంటే, విరోధం ; వ్యతిరేకత. ఇక్కడ శ్రమ దోపిడీ చేసే యజమాని వర్గమూ, ఆ దోపిడీకి గురి అయ్యే శ్రామిక వర్గమూ వున్నాయి కదా? ఒక వర్గానికి మేలైన విషయం, ఇంకో వర్గానికి హాని అవుతుంది. అంటే, ఆ వర్గాల పరిస్తితులు వైరుధ్యంతో వున్నాయని అర్థం. పని స్తలంలో ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు, కార్మికులకు పని కాలం తగ్గితే, యజమానికి అదనపు శ్రమ రాదు కాబట్టి, అది యజమాని వర్గానికి హాని. లేదా, ఉత్పత్తి శక్తి పెరిగినా పని కాలం తగ్గకపోతే, అది కార్మిక వర్గానికి హాని. ' మేలు' గానీ, ' హాని' గానీ, శ్రమ చేసే వారికి జరిగేవే. యజమాని వర్గానికి జరిగే మేలు, నిజమైన మేలు కాదు ; ఆ హాని, నిజమైన హాని కాదు. శ్రామికుల పని

కాలం తగ్గితే, "అయ్యో, యజమానికి హాని జరుగుతోందే" అనడం కుదరదు. కానీ, యజమాని దృష్టిలో అది హానే.

పెట్టుబడిదారుడి పని స్థలంలో ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు, ఆ యజమాని, కార్మికుల్లో నించి కొందర్ని తీసేస్తాడు. మిగతా వాళ్ళకి కొత్త ట్రయినింగులు ఇప్పించడం గానీ, పూర్తిగా కొత్త కార్మికుల్ని తీసుకు రావడం గానీ, చేస్తాడు. అంటే, యజమాని పని స్థలంలో ఉత్పత్తి శక్తి పెరగడం వల్ల, కార్మికుల్లో చాలా మందికి ఉద్యోగాలు పోతాయి. ఉద్యోగాల్లో వున్న వాళ్ళకి, పని చెయ్యవలసిన కాలం ఏ మాత్రమూ తగ్గదు ; అది ఎప్పటిలాగే వుంటుంది. వెనకటి ఉత్పత్తి శక్తి వున్నప్పుడు ఎంత కాలం పని చేశారో, ఉత్పత్తి శక్తి పెరిగినా అలాగే చెయ్యాలి. అది ఎంత పెరిగినా కూడా పని గంటలు ఎప్పుడూ అలాగే వుంటాయి. పనిలో వున్న కార్మికులు, 'ఫుల్ టైమ్' పనిలోనే వుంటారు. మరి ఉత్పత్తి శక్తి పెరిగితే, కార్మికులకు ఏం ప్రయోజనం? యజమానీ శ్రామిక సంబంధాల్లో, ఉత్పత్తి శక్తులు 100 రెట్లు పెరిగినా, దాని వల్ల యజమానులకే లాభం గానీ, కార్మికులకు ప్రయోజనం వుండదు.

యజమానుల 'లాభాలు పెరగడం' దగ్గిర కూడా ఒక సమస్య వస్తుంది. కార్మికుల సంఖ్య తగ్గిపోతూ వుంటే, తగ్గిపోయిన కార్మికుల నించి వచ్చే 'అదనపు శ్రమ' కూడా తగ్గిపోతూ వుంటుంది. అసలు, లాభం రావలసింది, అదనపు శ్రమలో నించే కదా? భారీ యంత్రాల్ని తెచ్చి, ఉత్పత్తి శక్తిని పెంచుతోంటే, లాభం రేటు ఎందుకు తగ్గుతుందో పెట్టుబడిదార్లకి అర్థం కాదు. వాళ్ళ దృష్టిలో, 'అదనపు శ్రమ' అనేది వుండదు కాబట్టి, ఆ దృష్టితో వాళ్ళు ఆలోచించరు. లాభం తగ్గగానే మళ్ళీ ఉత్పత్తి శక్తిని పెంచుతారు. సమస్యని ఇంకా పెద్దది చేసుకుంటారు.

ఉత్పత్తి శక్తులు పెరిగేకొద్దీ, అన్ని శాఖల్లోనూ నిరుద్యోగ సమస్య పెరిగిపోతూ వుంటుంది. అయితే, కార్మికులు, ఉత్పత్తి శక్తులు పెరగడాన్ని వ్యతిరేకిస్తూ వుండాలా? పని స్థలాల్లోకి వచ్చే మెరుగైన శ్రమ పరికరాల్ని ధ్వంసం చేస్తూ వుండాలా?- ఇది చాలా తప్పు ఆలోచన. వెనకటి కాలంలో, యంత్రాలు రావడం ప్రారంభమైన కొత్తలో, చాలా చోట్ల కార్మికులు, మేలైన యంత్రాల్ని ధ్వంసం చేసే తెలివి మాలిన పనులే చేశారు. అసలు చెయ్యవలసిందేమిటంటే, పెట్టుబడిదారీ విధానాన్నే తీసివేసే దృష్టితో కార్మికుల ఉద్యమాలు సాగాలి. పెట్టుబడిదారీ విధానాన్ని తీసివెయ్యడం వెంటనే జరగదు కాబట్టి, భారీ యంత్రాల ప్రవేశాన్ని కొన్ని సందర్భాల్లో అడ్డుకోవడం కూడా అవసరమవుతుంది. లేదా, అందర్నీ ఉద్యోగాల్లో వుంచి, పని గంటల్ని తగ్గించాలనే ఉద్యమాలు వుండాలి. కానీ, వీటి వల్ల తాత్కాలికంగా కూడా కార్మికులకు మంచి ఫలితాలు రావు. నిరుద్యోగాలు తప్పవు. అందుకే పెట్టుబడిదారీ విధానాన్ని తీసివెయ్యడం మీదే అసలైన ఉద్యమాలు వుండాలి.

ఉత్పత్తి శక్తుల్ని పెంచుతూ పోవడం, పెట్టుబడిదార్లకు ఇంకో కొత్త సమస్యని తెచ్చిపెడుతుంది. కుప్పతెప్పలుగా పెరిగిపోయే సరుకుల గుట్టల్ని అమ్ముకోవలసిన మహా సమస్యని! ప్రతిరోజూ గతం కన్నా

ఎక్కువ సరుకు తయారవుతూ వుంటుంది. రోజూ 100 మీటర్ల బట్టని తేలిగ్గా అమ్మగలిగే పెట్టుబడిదారుడు, ఉత్పత్తి శక్తిని రెట్టింపు చేసి రోజూ 200 మీటర్లని అమ్ముకోవలసిన పరిస్తితి తెచ్చుకుంటాడు. అది ఇంకా ఇంకా రోజుకి వెయ్యి మీటర్ల దాకా, 2 వేల మీటర్ల దాకా పెరుగుతుంది. పెట్టుబడిదారీ విధానంలో సరుకుల్ని ఉత్పత్తి చేసేది, సమాజానికంతటికీ వుండే ' నిజ అవసరం' దృష్టితోనూ కాదు ; మార్కెట్లో ఎంత సరుకు అమ్ముడు పోతుందో ఆ 'మార్కెట్ అవసరం' దృష్టి తోనూ కాదు. లాభాన్ని ఇంకా ఇంకా పెంచుకోవాలనే దృష్టితో మాత్రమే!

సరుకుని ఉత్పత్తి చేయించడంలో, పెట్టుబడిదారీ విధానానికి వుండే ప్రత్యేక లక్షణం, అమ్మగలిగినంత సరుకుని ఉత్పత్తి చేయించడం కాదు; ఉత్పత్తి చేయించగలిగినంత సరుకు రాసిని అమ్మాలని చూడడం! అవసరాన్ని బట్టి ఉత్పత్తి కాదు ; ఉత్పత్తిని బట్టి, కృత్రిమ అవసరాన్ని సృష్టించడం!

ఈ నిరుద్యోగ సమస్య, వెనకటి సమాజాలలో వుండదు. యజమానీ బానిస సంబంధాల్లో, ప్రతీ బానిసకీ యజమాని వుంటాడు. బానిసతో పని చేయిస్తాడు, తిండి పెడతాడు. ఆ తిండితో బానిసకి కడుపు నిండదనేది వేరే సంగతి.

భూస్వామ్య విధానంలో, ప్రతీ కౌలు రైతుకీ కొంత భూమి వుంటుంది. శ్రమ చేసే అవకాశమూ, దాని వల్ల ఆకలి తీరే మార్గమూ, ఉంటాయి.

కానీ, చెయ్యడానికి పనీ, తిండీ లేని కొత్త సమస్య, పెట్టుబడిదారీ విధానంలోనే ప్రారంభమవుతుంది. అంటే, పెట్టుబడిదారీ విధానం కన్నా వెనకటి సమాజాలే మంచివి - అని దీనికి అర్థం తీసుకోకూడదు. పెట్టుబడిదారీ విధానంలో, ప్రారంభమయ్యే కొత్త సమస్యలేమిటో, అవి ఎందుకు ఏర్పడుతున్నాయో, ఆ రకంగా అర్థం చేసుకోవాలి.

ఉత్పత్తి శక్తులు పెరగడం చాలా మంచి సంగతి. అవి, మనుషుల శ్రమ కాలాన్ని తగ్గిస్తాయి. కానీ, ఆ మంచి సంగతి, పెట్టుబడిదారుల ఆధీనంలో వుండడం వల్ల, దాని మంచి ఫలితం పెట్టుబడిదారులకే గానీ శ్రమ చేసే వారికి అందదు.

ఉత్పత్తి శక్తులు పెరగడానికీ, నిరుద్యోగానికీ వున్న సంబంధం ఏమిటో అర్థం చేసుకోకపోతే, పెట్టుబడిదారీ విధానానికి వున్న స్వభావమే అర్థం కాదు. ఆ స్వభావం ఇంకా ఎలాంటి సమస్యలకు దారి తీస్తుందో అర్థం కాదు.

ఉత్పత్తి శక్తులు పెరిగిపోయి, సరుకులు గుట్టలు గుట్టలుగా పేరుకుపోతూ వుంటే, ఆ గుట్టల్ని అమ్మడానికి, ఎప్పుడూ అమ్మే ప్రాంతం చాలదు. స్వదేశం అంతా కూడా చాలదు. అక్కడి జనాభా, ఆ సరుకునంతా కొనలేరు. ఇక అప్పుడు, పెట్టుబడిదారుడికి కనపడే మార్గం, ఆ సరుకుల గుట్టల్ని ఓడల మీద ఎక్కించుకుని విదేశాల మార్కెట్లని వెతుక్కుంటూ పోవడం! ఆ విదేశాల్లో కూడా, అక్కడి స్వదేశీ పెట్టుబడిదారులు వుంటారు. లేదా, ఆ దేశపు స్వతంత్ర ఉత్పత్తిదారులైనా వుంటారు. వాళ్ళు కూడా అదే రకం సరు కుని ఉత్పత్తి చేసి అమ్ముతూ వుంటారు. అక్కడికి వచ్చే విదేశీ పెట్టుబడిదారులు, అక్కడి స్వదేశీ పెట్టుబడిదారులతో పోటీ లకు దిగి, తమ

సరుకుల్ని తక్కువ ధరలతో అమ్ముతారు. అక్కడ వున్న స్వదేశీ పెట్టుబడిదారుల దగ్గిర గానీ, స్వతంత్ర ఉత్పత్తి దారుల దగ్గిర గానీ, ఎక్కువ ఉత్పత్తి శక్తులు వుండవు. అక్కడి సరుకులు, తక్కువ ఖర్చుతో తయారవవు. కానీ, విదేశీ సరుకులతో పోటీ కోసం, వాళ్ళు కూడా తమ సరుకుల్ని తక్కువ ధరలతోనే అమ్ముకోవలసి వస్తుంది. క్రమంగా అక్కడి పరిశ్రమలు నష్టాలపాలై నాశనం అయిపో తాయి. అక్కడి స్వతంత్ర ఉత్పత్తిదారులు, అక్కడి పెట్టుబడిదారుల కన్నా ముందు నాశనం అవుతారు. ఈ రకం పరిస్థితుల వల్ల, వేరు వేరు దేశాల పెట్టుబడిదారుల మధ్య కలహాలూ, తీవ్ర నిబంధనలూ ప్రారంభమై, చివరికి అవి 'యుద్ధాల' దాకా పోతాయి! లేదా, స్వదేశీ పెట్టుబడి దారుల లొంగు బాట్ల దాకా!

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. నాగలి విలువతో పోలిస్తే, ట్రాక్టరు విలువ 100 రెట్లు అనుకుందాం. దున్నే పనిలో నాగలి ఉపయోగపడే కాలానికీ, ట్రాక్టరు ఉపయోగపడే కాలానికీ, తేడా, వాటి విలువల్లో తేడా లాగే, 100 రెట్లే ఉంటుందా?

**జ**: ఒకే పని కోసం తయారైన పనిముట్లలో, ఎక్కువ విలువ గల ( ఎక్కువ శ్రమతో తయారైన ) పనిముట్టు, తక్కువ విలువ గల పనిముట్టు కన్నా ఎక్కువ కాలం మన్నుతుంది అనేది నిజమే. అయితే, ఆ మన్నికల్లో తేడా, వాటి విలువల్లో తేడా లాగే, అన్ని రెట్లుగానే ఖచ్చితంగా ఉండదు. 'విలువ' అనేది, శ్రమ ఖర్చుని బట్టి ఏర్పడే విషయం. 'మన్నిక' అనేది, ఆ పనిముట్టు తయారైన పదార్థాల ధర్మాల్ని బట్టి ఏర్పడే విషయం. కాబట్టి, మన్నికల్లో తేడా, విలువల్లో తేడా మీదే ఆధారపడి, ఖచ్చితంగా అదే లెక్కన ఉండదు.

**2**. పెట్టుబడిదారుడి పని స్థలంలో ఎన్ని భారీ యంత్రాలు ఉన్నా, వాటి ద్వారా పని ఎంత త్వరగా జరుగుతోన్నా, కార్మికుల పని కాలం, గతంలో లాగే, ఫుల్ టైమ్ గానే ఉంటుంది. యంత్రాలు వచ్చినా, కార్మికుల పని కాలం తగ్గదు. స్వతంత్ర రైతు దగ్గిర ట్రాక్టర్ లాంటి యంత్రం వుంటే, ఆ రైతు పనిచేసే కాలం తగ్గుతుందా?

**జ**: తప్పకుండా తగ్గుతుంది. స్వతంత్ర రైతు కుటుంబానికి, 4 ఎకరాల భూమి వుందనుకుందాం. దాన్ని నాగళ్ళతో దున్నాలంటే, 10 రోజులు పడుతుందనుకుందాం. దాన్ని ట్రాక్టర్‌తో దున్నితే, 2 రోజులే పడితే, ఆ రైతు, కావాలంటే తర్వాత విశ్రాంతిగా ఉంటాడు. లేదా, కొంత సేపు పని చేసి, కొంత సేపు మానేస్తాడు. అతని పని కాలానికి, 'పోషణ అవసరానికి తగినంత పని' అనే నిబంధన తప్ప, వేరే నిబంధన ఉండదు.

**3**. స్వతంత్ర రైతు దగ్గిర స్వంత ట్రాక్టరు వుంది. అతను ఇతర రైతుల పొలాన్ని తన ట్రాక్టర్‌తో దున్ని, దాని విలువని తీసుకుంటాడు. అప్పుడు కూడా ఆ రైతు, స్వతంత్ర రైతుగానే ఉంటాడా?

**జ**: ట్రాక్టరు - ఒక పనిముట్టు. దాన్ని నడిపే శ్రమ, ఆ స్వతంత్ర రైతే చేస్తాడు. ట్రాక్టరు ఖర్చు అంతా అతనికి వస్తుంది. అందులో తగ్గేదేమీ వుండదు. అదే గాక, అతని శ్రమ విలువ అంతా కూడా అతనికి వస్తుంది. కాబట్టి, అతను ఆ ట్రాక్టర్ని నడిపిన ⟶

విషయంలో, స్వతంత్ర శ్రామికుడిగా వుంటాడు. అయితే, అతని శ్రమ విలువ అంతా అతనికి రాకుండా కొంత తగ్గితే, అప్పుడు అతను ఒక వ్యవసాయ కూలీ లాగ శ్రమ చేసినట్టు అవుతుంది. అప్పుడు, కొంత శ్రమని పోగొట్టుకున్నట్టు అవుతుంది.

**4**. ప్రజల్లో ఎవరికీ నిరుద్యోగం లేకుండా చూడవలసిన బాధ్యత పెట్టుబడిదారులదా?

**జ**: పెట్టుబడిదారులదీ కాదు ; భూస్వాములదీ కాదు ; వాళ్ళ ప్రభుత్వానిదీ కాదు. అదే పెట్టుబడిదారీ విధానంలో వున్న బ్రహ్మాండమైన లోపం. ప్రజలందరికీ ఉద్యోగాలు చూపించవలసిన బాధ్యత పెట్టుబడిదారుడిది కాదు. తన డబ్బుని పెంచుకోవడమే అతని బాధ్యత. మనుషులు, రెండు పూటలా తిని జీవించాలంటే, భూమి అయినా ఉండాలి ; నెల నెలా జీతం వచ్చే ఉద్యోగం అయినా ఉండాలి. ఏదీ లేకనే ఆ జనం నిరుద్యోగులై పోతారు. ఒక పెట్టుబడిదారుడు, తన పని స్తలంలో ఉత్పత్తి శక్తిని పెంచి అనేక మంది కార్మికుల్ని బైటికి తోలెయ్యడం, పెట్టుబడిదార్ల ప్రభుత్వంలో ఏ చట్టం ప్రకారమూ నేరం కాదు. ‘ అందరికీ పనులు ( ఉద్యోగాలు ) చూపించాలి’ అనే చట్టం, పెట్టుబడిదారీ విధానంలో వుండదు. ప్రైవేటు పెట్టుబడిదారీ విధానంలో గానీ, పెట్టుబడిదారీ ప్రభుత్వ విధానంలో గానీ, నిరుద్యోగం అనేక రెట్లు పెరిగిపోతూ వుంటుంది. కార్మిక జనాభాలో చాలా మందికి, భూమీ వుండదు, ఉద్యోగాలూ వుండవు. బతకడానికి మార్గాలే వుండవు. అయినా, వాళ్ళ బతుకుదెరువులు వాళ్ళ బాధ్యతే. వాళ్ళే బతకాలి ఎలాగో!

**5**. నిరుద్యోగం అన్ని దేశాల్లోనూ వుంటుందా? నిరుద్యోగం లేని దేశం ఏదీ లేదా?

**జ**: ఏదీ లేదు. పెట్టుబడిదారీ విధానం వున్న ప్రతీ దేశంలోనూ నిరుద్యోగం వుంటుంది. ఇప్పుడు అన్ని దేశాల్లోనూ ఆ విధానమే వుంది కాబట్టి, అన్ని దేశాల్లోనూ నిరుద్యోగం వుంది. ఆఖరికి, ‘సోషలిస్టు దేశం’గా తనను తను చెప్పుకునే చైనాలో కూడా! ప్రతీ దేశంలోనూ పెట్టుబడిదారీ కంపెనీలు, తమ దేశంలో వున్న జనాభాకి ఉద్యోగాలివ్వడం తగ్గించి, ఆ కార్మికులకు ఇవ్వవలసిన జీతాల కన్నా తక్కువ జీతాలతో పని చేసే వారిని విదేశాల నించి తెచ్చుకుంటారు. వాళ్ళ బిజినెస్ వాళ్ళ ఇష్టం. వాళ్ళు ఎలా చేసుకున్నా వాళ్ళ ఇష్టమే. స్వదేశీ జనాభాకి ఉద్యోగాలు ఇవ్వకపోతే వాళ్ళు ఎలా బతుకుతారనే ప్రశ్న పెట్టుబడిదారులకు వుండదు. ‘అందరికీ ఉద్యోగాలు కల్పించాలి’ అనేది, ప్రైవేటు పెట్టుబడిదారుల బాధ్యత కాదు. ఆ బాధ్యత పెట్టుబడిదారీ ప్రభుత్వానికి కూడా వుండదు. “ప్రతీ కుటుంబానికీ భూమి అయినా వుండాలి. ఉద్యోగం అయినా వుండాలి. ప్రజలకు బతుకుదెరువు చూపించవలసిన బాధ్యత సమాజానిదే. ఆ సమాజాన్ని పాలించే ప్రభుత్వానిదే” అనే చట్టాలు, శ్రమ దోపిడీ సాగించే సమాజాల్లో వుండవు.

పెట్టుబడిదారీ ప్రభుత్వాలు, చాలా కాలం నించీ, శ్రామికుల్ని, ‘శ్రామికులు’ అని గానీ, ‘కార్మికులు’ అని గానీ, అనడం లేదు. “మానవ వనరులు” అంటున్నాయి. అంటే, ముడి పదార్థాలూ, యంత్రాలూ, ఎలాంటి వనరులో, శ్రమలు చేసే జనాభా కూడా అలాంటి ‘వనరు.’ అది, ఆ మనుషుల్ని ఎంత అవమానం చెయ్యడమో, ఆ ప్రభుత్వాలకు పట్టదు. తమ దేశంలో జనాభా, పనులు లేక మల మల మాడుతూ వున్నా, విదేశాల శ్రామిక వనరుల్ని చవగ్గా తెచ్చుకునే పని, ప్రతీ దేశమూ చేస్తుంది. ఆ విదేశాల ⟶

శ్రామికులు, ఇక్కడికి ఎందుకు వస్తారంటే, వాళ్ళకు అక్కడ పనులు లేక! సోషలిస్టుగా కనపడే చైనా శ్రామికులు కూడా ఏ స్తితిలో వున్నారో ఈ వార్త చూడండి!

## "దేశం లోకి, చైనా దండు"

చైనా, చవక ధరలకే శ్రమ శక్తిని అమ్ముకునే చైనీయులను, ఇతర దేశాలకు ఎగుమతి చేయడం ప్రారంభించింది. అభివృద్ధి కార్యకలాపాలు అధికంగా జరిగే దేశాలను ఎంపిక చేసుకొని, చాప కింద నీరులా అక్కడి మార్కెట్లకు చైనీయులను భారీగా తరలించి, తమ దేశంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలన్నదే చైనా వ్యూహం.......... నైపుణ్యం ఉన్న మానవ వనరులకు ప్రపంచంలో ఎక్కడైనా కొరత ఉంటుంది. ఇండియాలోనూ ప్రత్యేక నైపుణ్యం కలిగిన నిపుణుల కొరత తక్కువేమీ కాదు. దీనిని దృష్టిలో పెట్టుకొని భారత ప్రభుత్వం, చైనీయులు దేశంలో పనిచేయడానికి బిజినెస్ వీసాలు జారీ చేస్తుంది. ఇటీవల చైనా నుంచి వీసాలు సంపాదించి భారత్‌లోకి అడుగుపెట్టే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. వీరందరూ సాంకేతికంగా నైపుణ్యం అంతగా లేని వారు మాత్రమే............ బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లోని పారిశ్రామిక వాడలను సందర్శిస్తే, చైనీ కార్మికుల సంఖ్య ఎక్కువగా కనపడుతుంది. ఈ పారిశ్రామిక వాడల్లో వేలాది కార్మికులు ఉపాధి పొందుతూ స్థానికులకు ఉద్యోగావకాశాలు లేకుండా చేస్తున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా గ్రూప్, రిలయన్స్ పవర్, ఎస్సార్ పవర్ వంటి ఇండియన్ కంపెనీలెన్నో చైనీ పర్కర్లను ఉద్యోగాల్లో నియమించుకుంటున్నాయి............. 2007 లో భారత ప్రభుత్వం 1.6 లక్షల బిజినెస్ వీసాలను చైనీయులకు జారీ చేసింది. ఇందులో 30,000 వీసాలు దుర్వినియోగమయ్యాయనీ, నిపుణులు కానివారే ఈ మార్గంలో అడుగుపెడుతున్నారనీ విదేశీ వ్యవహారాల శాఖ గుర్తించింది........... వీరంతా నిర్మాణ కార్యకలాపాలు అధికంగా జరిగే ప్రాంతాలకు తరలిపోయి ఉపాధిని వెతుక్కుంటున్నారు. నిజానికి మన దేశంలో చైనీయుల అవసరం అంతగాలేదు. ఒకవేళ వీరి నైపుణ్యం తప్పనిసరి అని భావించినా, స్థానికులకు శిక్షణ ఇస్తే సరిపోతుంది. కానీ, భారత కంపెనీలు ఈ విషయాన్ని అంతగా పట్టించుకోవడం లేదు. దీనితో భారతీయులకే ఉపాధి అవకాశాలు కరువై, చైనీయులు దర్జాగా ఉపాధిని పొందే పరిస్థితి నెలకొంది........ దేశంలో చైనా కార్మికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఈ సంవత్సరం జూన్ నాటికి 30,000 మంది చైనా కార్మికులు దేశంలోకి ప్రవేశించినట్టు తెలుస్తోంది. రానురాను ఇదో ప్రమాద పరిస్థితిగా మారే సరికి ప్రభుత్వంలో కదలిక వచ్చింది. చైనీయులకు బిజినెస్ వీసాలను నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.......... దేశాల మధ్య మానవ వనరుల రాకపోకలపై ఆంక్షలుండరాదని ఒక వైపు భారత్ కోరుతోంది. మరో వైపు ఇదే సమస్యతో చైనాతో పోరాడాల్సి వస్తోంది. ( ఆంధ్రజ్యోతి, 4-10-2009; పేజీ 6 )

మొత్తం ప్రపంచంలో నిరుద్యోగం లేని దేశం ఎక్కడా లేదు. పెట్టుబడిదారీ విధానంలో, ఉత్పత్తి శక్తులు పెరిగే కొద్దీ ఈ సమస్య ఇంకా పెరుగుతుంది గానీ తగ్గదు. పెట్టుబడిదారీ విధానం సృష్టించే ఇతర సమస్యల వల్లా, కరువుల వల్లా, యుద్ధాల వల్లా, శ్రామిక జనాభాలో కొంత భాగం నాశనమైపోతూ వుంటుంది. జీవించి వున్న జనాభాలో, కొంత భాగమే ఉద్యోగాల్లో వుంటుంది. మిగిలిన భాగం, నిరుద్యోగాల్లోనూ, నేర జీవితాల్లోనూ! ఈ శ్రమ దోపిడీ ప్రపంచాన్ని కార్మిక వర్గం ఆపలేకపోతే, ఇక ఈ నీచ పెట్టుబడిదారీ లాభ విధానమే కొనసాగుతూ, కొంత కాలానికి అది భూమండలాన్నే సర్వ నాశనం చేస్తుంది. **H**

# 78. ప్రతీ జీతమూ 'శ్రమ శక్తి విలువ' కాదు!

భూస్వాముల దగ్గిర గానీ, ఉత్పాదక - వర్తక - వడ్డీ పెట్టుబడిదారుల దగ్గిర గానీ, ప్రభుత్వంలో గానీ, ఇళ్ళల్లో గానీ, ఎక్కడో అక్కడ, ఏదో ఒక యజమాని దగ్గిర, శ్రమ చేస్తూ 'జీతం' మీద బతికే పురుషులూ స్త్రీలూ అందరూ - కార్మికులే. ఆ కార్మికుల్లోనే ఉత్పాదక - అనుత్పాదక తేడాలూ, శారీరక శ్రమల - మేధా శ్రమల తేడాలూ, ఉంటాయి. చేసే శ్రమని బట్టి, ఏ 'శ్రమ శక్తి విలువ' ఆ కార్మికుడి ( కార్మికురాలి ) జీతం.

శారీరక శ్రమ శక్తి విలువకీ, మేధా శ్రమ శక్తి విలువకీ, 'కొంత తేడా' వుండడం, విలువ సూత్ర తర్కం ప్రకారం సరియైనదే. కానీ, ఆ తేడా ఎంత తక్కువగా వుండాలో, ఎంత ఎక్కువగా వుండకూడదో, దానికీ ఒక తర్కం వుంటుంది. ఏ శ్రమ చేసే మనిషికైనా నిత్యమూ కడుపు నిండాలి ; అవసరాలన్నీ తీరాలి. శారీరక శ్రమ చేసే మనిషి, అర్ధాకలితోనే జీవించాలని విలువ సూత్రం చెప్పదు. ఆ ప్రకారంగా అయితే, వేరు వేరు శ్రమల విలువల మధ్య 'తేడా' చాలా తక్కువగానే వుండాలి.

కానీ, భూమి మీద ఇంత వరకూ నడిచిన, నడుస్తూ వున్న సమాజాలన్నీ, శ్రమ దోపిడీ చేసే యజమానుల ఆధీనంలో వున్న సమాజాలే. ఆ సమాజాలకు మేధా శ్రామికుల, కళాకారుల సమర్ధన, ప్రధానంగా, అత్యవసరంగా కావాలి. కాబట్టి, ఉన్నత మేధా శ్రమలకు ఆ సమాజాల్లో జీతాలు ఎక్కువగా ఉంటాయి.

పెట్టుబడిదారీ సమాజంలో, ఒక బస్సు డ్రైవర్‌కో, పోస్ట్ మేన్‌కో వుండే జీతం కన్నా, ఒక యూనివర్సిటీ ప్రొఫెసర్ జీతం, 20, 30 రెట్లు ఎక్కువగా ఉంటుంది. జీతాల సంగతే కాదు. ఆ భారీ జీతాలతో పాటు, ప్రత్యేక సౌకర్యాలు అనేకం వుంటాయి. కానీ, ఏ శ్రమ చేసే మనిషికైనా కావలసింది ఒకే రకం ఆహారం, ఒకే రకం నివాసం. పోస్టు మేన్ ఆహారానికీ, ప్రొఫెసర్ ఆహారానికీ వుండే తేడా, దోపిడీ సమాజాల తర్కానికి తప్ప, ఇంకే తర్కానికీ పనికిరాదు.

పెద్ద పెద్ద జీతాలు గల ఉన్నత మేధా శ్రమల వారి దృష్టి ఎలా వుంటుందంటే, "మేము పెద్ద చదువులు చదివాం. పెద్ద మేధావులం. ఒక వ్యవసాయ కూలీ ఆదాయం కన్నా మా ఆదాయం వంద రెట్లు ఎక్కువ విలువైనదిగా వుండాలి" అన్నట్టు వుంటుంది. వారు, అలాగే అంటారు; అనుకుంటారు.

జీతాల్లో, ఇంకో వింత వుంది. రాజ్యాంగంలో ప్రెసిడెంట్లూ, గవర్నర్లూ, ముఖ్య మంత్రులూ, ప్రధాన మంత్రులూ, ఇతర మంత్రులూ, కలెక్టర్లూ, డైరెక్టర్లూ - వంటి వాళ్ళ జీతాల్లో వింత అది! ఆ జీతాల్నీ, వారికి అందే ప్రత్యేక సౌకర్యాల విలువల్నీ లెక్క కడితే, ఆ 'విలువ రాసుల' కూ, వారి 'శ్రమ శక్తి విలువల' కూ ఏమీ సంబంధం

వుండదు. - వారు 'శ్రమ' అనేది ఏదైనా చేస్తే, అది 'అనుత్పాదక శ్రమ.'

ఒక మంత్రి, "నేను రోజూ 18 గంటలు పని చేస్తాను" అని చెప్పుకుంటే, ఆ 18 గంటల్లో, కనీసం అనుత్పాదక శ్రమ అణువులైనా వుండవు. 'శ్రమ' కానిదీ, 'పని' కానిదీ ఏదైనా వుంటే, అదే వుంటుంది అన్ని గంటల్లోనూ. రోజూ 18 గంటలు పనిచేసే మనిషి ఎవడూ, ప్రెసిడెంటో, గవర్నరో, ఆ మంత్రో, ఈ మంత్రో, ఏ మంత్రో, అవలేడు. రోజుకి, 18 గంటలు పనిచేసే శ్రామికుడు, గనుల్లోనో, మరల్లోనో, వరసగా 2 డ్యూటీలు చేసే శారీరక శ్రమల కూలీ అవుతాడు. కాబట్టి, రోజూ 18 గంటలు పనిచేసే మహా మంత్రులకు అందే జీతాలన్నీ, ఉత్పాదక కార్మికుల అదనపు విలువ రాసిలో భాగం తప్ప ఇంకేమీ అవవు.

పాలు, తెల్లగా ఉంటాయి. కానీ, తెల్లగా కనపడేవన్నీ పాలు కావు.

'జీతం' అనేది, శ్రమ శక్తి విలువే. కానీ, జీతం పేరుతో కనపడే ప్రతీదీ, శ్రమ శక్తి విలువ కాదు.

కార్మికుల జీతాలు మాత్రమే 'జీతం' అనదగ్గ జీతాలు. పెట్టుబడిదారుల జీతాలూ, ప్రెసిడెంట్ల - గవర్నర్ల జీతాలూ, 'జీతం' అనే మారు పేరుతో వున్న అబద్ధపు ఆదాయాలు. నెల నెలా జీతం తీసుకునే ప్రెసిడెంట్ చేసే కార్యక్రమంలో, శారీరక శ్రమా వుండదు, మేధా శ్రమా వుండదు. మంత్రులు కూడా, అలాంటి వాళ్ళే. వాళ్ళు, విరగబడి శ్రమలు చేస్తున్నట్టు కనపడతారు, అంతే.

పెట్టుబడిదారీ విధానం, తన ధోరణితో తను ఉత్పత్తి శక్తుల్ని పెంచుకుంటూ పోతోన్నకొద్దీ, 'నిరుద్యోగ సమస్య' అంచెలంచెలుగా పెరిగిపోతూ వుంటుంది. ఆ సమస్య పరిష్కారానికి, ఆ విధానంలో కనపడే మార్గం - 'నిరుద్యోగ భృతి'! నిరుద్యోగులకు బిచ్చం పడెయ్యడం! ఎన్ని రకాల శ్రమలైనా చెయ్యడానికి సిద్ధంగా వున్న లక్షల, కోట్ల జనం, ఏ పనీ లేక, నిరుద్యోగులుగా మారి, తమకు అందే బిచ్చాలతో, అర్ధాకలితో, తెగుళ్ళతో, అవమానాలతో, అర్ధాంతరంగా చావాలి! లేకపోతే పిచ్చివాళ్ళుగా, దొంగలుగా, హంతకులుగా మారాలి!

ప్రభుత్వం పంపిణీ చేసే నిరుద్యోగ భృతి ఎక్కడిది? - పన్నుల్లోదే. ఆ పన్నులు ఎక్కడివి? ఉత్పాదక కార్మికుల అదనపు విలువ! అంటే, పనులు పోయిన ఆ నిరుద్యోగ కార్మికులకు తిండి దొరికేది, పనుల్లో వున్న కార్మికుల శ్రమలలో నించే.

నిరుద్యోగులు కూడా ఏదో ఒక రకంగా జీవిస్తూనే వుంటారు. కానీ, ఇతరుల శ్రమలతో!

'సమాజం' అనేది, ప్రతి మనిషికీ శ్రమ చేసే అవకాశం కల్పిస్తే, ఎవరి శ్రమతోనే వాళ్ళు జీవిస్తారు. జీవించడం అనేది, స్వంత శ్రమతో జరగాలి ; ఆత్మ గౌరవంతో జరగాలి. కానీ అది, ఏ దోపిడీ సమాజంలోనూ సాధ్యం కాదు.

పెట్టుబడిదారీ విధానం ఏర్పడే దాకా స్వతంత్ర ఉత్పత్తిదారులు ( స్వతంత్ర చేతి వృత్తుల వారూ, స్వతంత్ర రైతులూ ), ఎంతో కొంత నిశ్చింతతో జీవించేవారు. కానీ పెట్టుబడిదారీ విధానంలో క్రమంగా జరిగే ఉత్పత్తి శక్తుల పెరుగుదల వల్ల, స్వతంత్ర

ఉత్పత్తిదారులకు కూడా సమస్యలు మొదలవుతాయి. వారు, తమ సరుకుల అమ్మకాల్లో, పెట్టుబడిదారులతో పోటీ పడలేరు. ధాన్యమూ, కూరగాయలూ, పాలూ, కుట్టూ, వడ్రంగమూ - వంటి కొన్ని రకాల సరుకులు, పెట్టుబడిదారుల దగ్గిరా, స్వతంత్ర శ్రామికుల దగ్గిరా కూడా తయారవుతాయి. కానీ అవి, పెట్టుబడిదారుల దగ్గిర తక్కువ శ్రమతో తయారైతే, స్వతంత్ర శ్రామికుల దగ్గిర ఎక్కువ శ్రమతో తయారవుతాయి.

అయితే, సరుకులు ఎవరి దగ్గిర తయారైనా, వాటి ధరలు ఒకే రకంగా వుండాలి. పెట్టుబడిదారుడు, 1 లీటరు పాలని, 2 గంటల మొత్తం శ్రమ కాలంతో తయారుచేయించ గలిగితే, అదే ఉత్పత్తి కోసం స్వతంత్ర రైతుల దగ్గిర 10 గంటల కాలం పట్టవచ్చు. అలాగే, 1 మీటరు బట్ట తయారీ కోసం, పెట్టుబడిదారుల దగ్గిర పట్టే శ్రమ కాలం కన్నా, స్వతంత్ర నేత పని వారి దగ్గిర పట్టే కాలం 4 రెట్లు ఎక్కువగా వుండవచ్చు. అంటే, పెట్టుబడిదారుల సరుకులు తక్కువ విలువతో తయారైతే, అదే రకపు సరుకులు, స్వతంత్ర ఉత్పత్తిదారుల దగ్గిర ఎక్కువ విలువలతో తయారవుతాయి. కానీ, స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా తమ సరుకుల్ని పెట్టుబడిదారీ సరుకుల ధరలతోనే అమ్మి తీరాలి. లేకపోతే, ఆ సరుకుల్ని ఎవ్వరూ కొనరు. ఆ రకంగా స్వతంత్ర ఉత్పత్తిదారులు, తమ శ్రమలో ఎంతో భాగాన్ని వృథాగా పోగొట్టుకుంటారు. 10 గంటలు శ్రమ చేసినా, దానికి, 2, 3 గంటల విలువనే పొందుతారు.

పెట్టుబడిదారీ సరుకులతో పోటీలో, స్వతంత్ర ఉత్పత్తిదారుల ఆదాయాలు, కార్మికులకు దొరికే కనీస పోషణని కూడా ఇవ్వలేని స్థాయికి దిగజారిపోతాయి. క్రమక్రమంగా స్వతంత్ర రైతులూ, స్వతంత్ర చేతివృత్తుల వారూ, స్వతంత్ర వర్తకులూ, స్వతంత్ర బతుకు దెరువులు పోయి, పెట్టుబడిదారుల యాజమాన్యాల కింద కార్మికులుగా మారిపోతారు. ఆ రకంగా, స్వతంత్ర ఉత్పత్తిదారులు, కార్మిక జనాభాని పెంచుతారు. కానీ, అక్కడా నిలకడలేని ఉద్యోగాలలో, నిరుద్యోగాలలో చిక్కుకుంటారు.

కానీ, ఏ శ్రమ అయినా, వ్యక్తిగత స్థాయిలో గానీ, కుటుంబ స్థాయిలో గానీ జరగడం, ఆ శ్రామికులకు క్షేమం కాదు. దాని కన్నా, ఆ శ్రమ, పది మందీ కలిసిన, పది కుటుంబాలు కలిసిన స్థాయిలో జరగడమే తార్కికంగా అందరికీ క్షేమ కరమైన పద్ధతి.

10 మంది స్వతంత్ర రైతుల్ని తీసుకుంటే, అందరూ కష్ట జీవులే కావచ్చు ; అందరి వ్యవసాయ భూములూ రెండేసి ఎకరాలే కావచ్చు. కానీ, శ్రమలు ఎంత సమానంగా చేసినా, ఒకరి పంట ఎక్కువా, ఒకరి పంట తక్కువా అవుతాయి. ఒక్కో ఏడాది, ఒకరికి ఎంతో కొంత పండుతుంది ; ఒకరికి పూర్తిగా ఎండుతుంది. ఎవరి కష్ట సుఖాలు వారివే అవుతాయి. ఇక అప్పుడు అందరూ అదృష్ట - దురదృష్టాల్ని నమ్ముకుంటూ బతకడమే మార్గం అవుతుంది. అలా గాక, ఆ 10 కుటుంబాలూ, తమ పొలాల్ని కలిపేసుకుని, ఆ కుటుంబాల మనుషులందరూ డ్యూటీల ప్రకారం శ్రమలు చేసుకుంటే, పంటలు తగ్గినా పెరిగినా, పండినా ఎండినా, ఆ కష్ట సుఖాలు

అందరికీ ఒకటే అవుతాయి. అందరి పరి స్తితులూ సమానం అవుతాయి.

పెట్టుబడిదారీ విధానం కింద, కార్మిక జీవితాలు ధ్వంసం అయినట్టే, స్వతంత్ర ఉత్పత్తిదారుల జీవితాలు, అంత కన్నా అధమ స్థాయికి చేరతాయి. ఎవరు ఎంత శ్రమ చేసినా, ఆ శ్రమలు ఎవరికీ సుఖ శాంతుల్ని ఇవ్వలేవు.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. మేధా శ్రమల వారికీ, శారీరక శ్రమల వారికీ, ఆహారంలోనూ, నివాసంలోనూ, తేడాలు వుండాలా?

**జ** : ఉండకూడదు. శ్రమలు నేర్చుకోవడానికీ, వాటిని నిలబెట్టుకోవడానికీ సంబంధించిన ఖర్చుల విషయంలో తేడాలు వుంటాయి కాబట్టి, జీతాల్లో తేడాలు, ఆ కారణాలతోనే వుండాలి.

**2**. ఏ శ్రమ చేసేటప్పుడైనా శరీరంలో కొంత శక్తి ఖర్చవుతుంది. దాన్ని 'కేలరీస్' తో కొలవవచ్చు కదా? శ్రమని టైము లెక్కతో కొలవడం ఎందుకు? 1 గంట సేపు పొలం దున్నే పనికీ, ఒక గంట సేపు చదువు చెప్పే పనికీ, ఎన్నేసి కేలరీస్ ఖర్చవుతాయో సగటున లెక్క చూడాలి. కేలరీస్ ఖర్చుని బట్టి విలువల్ని నిర్ణయించవచ్చు కదా?

**జ** : ఒక మేధా శ్రమనీ, ఒక శారీరక శ్రమనీ, ఒకే టైమ్ ప్రకారం తీసుకుంటే, మేధా శ్రమలో కన్నా శారీరక శ్రమ చేసేటప్పుడే ఎక్కువ కేలరీస్ ఖర్చవుతాయి. అంటే, శ్రమ చేసేటప్పుడు ఖర్చయ్యే కేలరీస్ లెక్కనే తీసుకుంటే, వైద్యం శ్రమ కన్నా పొలం దున్నే శ్రమకే ఎక్కువ విలువ వుండవలసి వుంటుంది. పొలం దున్నే శ్రమకి వుండే విలువ కన్నా, వైద్యం శ్రమకి తక్కువ విలువ వుంటే, వైద్యులుగా తయారయ్యే వాళ్ళెవరూ వుండరు. వైద్య విద్య నేర్చుకోవడం సాధ్యం కాదు. ఏ శ్రమకి అయినా విలువ ఏర్పడడానికి ప్రధాన కారణం, ఆ శ్రమని నేర్చుకోవడానికి అవసరమయ్యే అంశాల్ని బట్టీ, అవసరమయ్యే కాలాన్ని బట్టీ వుంటుంది. భూమిని దున్నే శ్రమని నేర్చుకోవాలంటే, నాగలీ ఎద్దులూ కావాలి. ( భూమి కూడా కావాలి. భూమి, ఏ శ్రమని నేర్చుకోవడానికైనా కావాలి. మనుషులూ, పనిముట్లూ అన్నీ భూమి మీదే వుండాలి. ) వైద్యం శ్రమని నేర్చుకోవాలంటే, అనేక సంవత్సరాల కాలమూ; అనేక పుస్తకాలూ - టీచర్లూ - ప్రయోగాల పరికరాలూ వంటివి అనేకం కావాలి. వీటినన్నిటినీ కేలరీస్ ఖర్చుల ప్రకారమే లెక్కలు కడితే, భూమి దున్నే శ్రమని నేర్చుకోవడానికి అవసరమయ్యే కేలరీస్ కన్నా, ఏ మేధా శ్రమని నేర్చుకోవడానికైనా అనేక వేల రెట్ల కేలరీస్ ఎక్కువగా అవసరమవుతాయి. వేరు వేరు శ్రమల్ని నేర్చుకునే వాళ్ళందరికీ, ఆహారమూ, నివాసమూ, అన్నీ ఒక్క లాగే కావాలి. కానీ, శ్రమల్ని నేర్చుకునే అంశం ఒక్కటే చాలా తేడా అవుతుంది. ఈ తేడాల వల్ల, శ్రమల విలువలు, తక్కువ - ఎక్కువలతోనే ఏర్పడతాయి. ఒక మేధా శ్రమనీ, ఒక శారీరక శ్రమనీ, ఒకే టైము ప్రకారం తీసుకున్నా, కేలరీస్ ప్రకారం తీసుకున్నా, శారీరక శ్రమ విలువ కన్నా, మేధా శ్రమ విలువ తప్పనిసరిగా ఎక్కువగా వుంటుంది. ⟶

అది మరీ ఎక్కువగా వుండకూడదు - అనేదే ఆలోచించవలసిన విషయం.

**3**. స్వతంత్ర ఉత్పత్తిదారులు, పెట్టుబడిదారీ సరుకులతో పోటీలో, తమ 10 రోజుల శ్రమతో తయారయ్యే సరుకుల ద్వారా, 2 రోజుల శ్రమ విలువనే పొందుతారనుకుందాం. ఆ ఉత్పత్తిదారులు చేసిన మిగతా 8 రోజుల శ్రమ ఏమవుతుంది? అది పెట్టుబడిదారులకు చేరుతుందా?

**జ** : ఆ 8 గంటల శ్రమ, వృథా అయిపోతుంది. ఆ శ్రమ, పెట్టుబడిదారులకు అందేదేమీ వుండదు. స్వతంత్ర ఉత్పత్తిదారుల శ్రమతో, పెట్టుబడిదారులకు సంబంధం ఉండదు. అప్పుడే తయారైన ఒక కుండ గానీ, ఒక పలక గానీ, చేతిలో నించి కింద పడి బద్దలైపోతే, ఆ వస్తువుని తయారుచేసిన శ్రమ ఏమవుతుంది? అంతా వృథా అయిపోయినట్టే కదా? అలాంటి వృథాయే ఇది కూడా. దాని ఫలితం, ఎవరికీ అందకుండా పోతుంది.

**4**. నిరుద్యోగులు కూడా జీవిస్తూనే వుంటారు. అంటే, ఏదో ఒకటి తింటూనే వున్నారని అర్థం కదా? శ్రమ చెయ్యకుండా తినగలుగుతున్నారంటే, శ్రమ దోపిడీతో జీవిస్తున్నారని అర్థమా?

**జ** : కాదు. నిరుద్యోగులు జీవించేది, కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలతో కాదు. వాళ్ళ కుటుంబాల్లో ఇంకా ఉద్యోగాలు చేస్తూ వున్న వారి డబ్బు ద్వారా గానీ, ప్రభుత్వం ఇచ్చే భృతి ద్వారా గానీ, జీవిస్తారు. ఆ రెండు మార్గాలూ లేకపోతే, దొంగతనాల వంటి తప్పుడు మార్గాలతో. ఇవి ఆత్మ గౌరవంతో జీవించే మార్గాలు కావు.

**5**. మనుషులు, దొంగతనాల వంటి నేరాలు చెయ్యడం, వాళ్ళ స్వభావాల్ని బట్టా, కాదా?

**జ** : 'స్వభావం' అనేది, భావాలే. మనుషులకు భావాలు ఏర్పడేది, సమాజ పరిస్తితుల్ని బట్టే. అంటే, పెంపకాల్ని బట్టీ, చదువు సంధ్యల్లో నేర్పేదాన్ని బట్టీ, ఇంటా బైటా కనపడే పెద్ద వాళ్ళ ప్రవర్తనల్ని బట్టీ, చిన్నతనం నించీ దొరికే జీవన పరిస్తితుల్ని బట్టీ! ఒక బిడ్డ పుట్టినప్పుడు, ఆ శిశువులో ఏ భావాలూ వుండవు. మందగొడితనాలూ, చురుకుదనాలూ, తెలివితేటల్లో తేడాలూ - అనేవి వేరు. సమాజంలో వైరుధ్యాలు లేని సరైన పరిస్తితులు వుంటే, ఆ రకం తేడాలు కూడా తగ్గిపోతాయి. చురుకులూ, మందగొడులూ వంటి తేడాలు వున్నా, అవి 'భావాలు' కావు. నేరాల భావాల్ని సృష్టించేది, శ్రమ దోపిడీ సమాజమే.

**6**. స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా శ్రమలు చేస్తారు కదా? కాబట్టి, వారు, 'శ్రామిక వర్గం'లో భాగం అవుతారా?

**జ** : సమాజంలో మొత్తం ఎంత ఉత్పత్తి తయారవుతోంది - అని చూస్తే, ఆ ఉత్పత్తుల్ని తయారుచేసే శ్రామికుల్లో, స్వతంత్ర ఉత్పత్తిదారులందరూ భాగమే. కానీ, వారు యజమానులు గల కార్మికులు కారు కాబట్టి, వారు 'కార్మిక వర్గం' కాలేరు. అయినా, పెట్టుబడిదారీ విధానం వల్ల వారు కూడా నిరుపేదతనంలోకి దిగజారిపోతారు. వారి పేదతనం, కార్మికుల పేదతనం లాంటిదే అవుతుంది. దాని కన్నా మించి పోతుంది కూడా. కాబట్టి, స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా పెట్టుబడిదారీ సమాజంలో దొరికే జీవితం కన్నా మంచి జీవితాన్ని కోరుకుంటారు. పెట్టుబడిదారీ విధానానికి ⟶

వ్యతిరేకులవుతారు. క్రమంగా వారు కూడా కార్మిక వర్గంలో భాగం అవుతారు.

**7**. స్వతంత్ర ఉత్పత్తిదారుల్లో శ్రమ దోపిడీ వుండదు కాబట్టి, సమాజానికి ఆ విధానమే మంచిదా? అందరూ స్వతంత్ర ఉత్పత్తిదారులుగానే వుంటే?

**జ** : కాదు. అందులో కూడా బోలెడు వైరుధ్యాలు వుంటాయి. ముఖ్యంగా ఎవరి 'పరిస్తితి' వారిది అయిపోతుంది. వాళ్ళు కూడా సరుకుల్ని అమ్ముకోవాలి. కొందరు అమ్ముకోగలరు, కొందరు అమ్ముకోలేరు. అది చాలా సమస్యలు తెస్తుంది.

**8**. పెట్టుబడిదారుల జీతాలు శ్రమ శక్తి విలువలు కాకపోతే, వాటిని ఎలా అర్థం చేసుకోవాలి?

**జ** : తర్వాత పాఠంలో వచ్చే కొన్ని వార్తలు చూస్తే, ఆ ఆదాయాల్ని శ్రమ శక్తి - విలువలు అనాలో, శ్రమ - విలువలు అనాలో, శ్రమ దోపిడీ అనాలో, మీకే తెలుస్తుంది.

తర్వాత పాఠంలో వున్న వార్తలు చూడండి! **H**

# పెట్టుబడిదార్ల ఆదాయాల్ని చూపించే 79. కొన్ని మచ్చు తునకలు!

**[** ఈ పాఠంలో వార్తలు, పత్రికల నించి తీసినవి. **]**

ఇలాంటి వార్తలు బోలెడు సార్లు పత్రికల్లో కనపడుతూ వుంటాయి. ఈ మధ్య వచ్చిన కొన్ని వార్తలు చూడండి. కార్మికుల ఆదాయాలతో పోలిస్తే, పెట్టుబడిదార్ల ఆదాయాలు ఎలా వుంటాయో వీటి వల్ల తెలుస్తుంది.

ఈ మచ్చు తునక చూడండి!

**సాలరీ మేజిక్!**

**[** సాలరీ అంటే, జీతం. ఈ వార్తలో కనపడేది జీతమే కాదు. ఇంకో రకం ఆదాయం కూడా! మీరే చూడండి! **]**

న్యూ ఢిల్లీ : అనిల్ అంబానీ, పొదుపు చర్యల్లో భాగంగా, తన గ్రూప్ కంపెనీల నుంచి ఎటువంటి వేతనం, కమిషన్లను, అందుకోలేదు. అయితే ఈయన వేతనం తీసుకోకపోయినా, అందిన ప్రతిఫలం మాత్రం భారీగానే ఉంది. సిట్టింగ్ ఫీజులు, అంతకు ముందు సంవత్సరానికి కమిషన్ల రూపంలో, ఈయన 50 కోట్ల రూపాయలకు పైగా ప్రతిఫలాన్ని అందుకున్నారు. 2007-08 కాలంలో అనిల్ తన అన్ని గ్రూపు కంపెనీల నుంచి 43.43 కోట్ల రూపాయల వేతనాన్ని అందుకోగా గత ఏడాది మూడు కంపెనీల నుంచి కమిషన్ల రూపంలో 52 కోట్ల రూపాయలను తీసుకోవటం గమనార్హం. 2007-08 కాలంలో అనిల్ వేతనం 18 రెట్లు పెరగగా గడచిన ఆర్థిక సంవత్సరంలో 24 శాతం పెరిగింది. (ఆంధ్రజ్యోతి, 28-9-2009)

ఈ వార్తలో, అనిల్ అంబానీ అనే పెట్టుబడిదారుడి ఆదాయంలో కొంత భాగం కనపడుతోంది. ఈ పెట్టుబడిదారుడు, 5 లిస్ట్ అయిన కంపెనీలకు చైర్మన్. ( లిస్ట్

అవని కంపెనీలు కూడా కొన్ని వుంటాయి. వాటి సంగతి ఇక్కడ లేదు.) ఒక్కొక్క కంపెనీలో 8 గంటలు పని చెయ్యాలి కదా? 5 కంపెనీల్లోనూ కలిసి ఒక రోజుకి, 5 × 8 = 40 గంటలు పని చేస్తాడా? ఇతనికో సోదరుడు కూడా వున్నాడు.

వీళ్ళిద్దరి ఆదాయాలూ కొంత కొంత ఈ వార్తలో కనపడుతున్నాయి.

ఈ అనిల్ అంబానీ, 2007-08 సంవత్సరంలో, కంపెనీ మీటింగులకు హాజరై, మెత్తని కుర్చీలో కాస్సేపు, కాస్సేపు కూర్చున్నందుకు, ఆ ఫీజుల కింద వచ్చింది 50 కోట్ల రూపాయలు! ఆ తర్వాత, 2008-09 సంవత్సరంలో, అదే రకం మీటింగుల్లో అదే కుర్చీలో మళ్ళీ కాస్సేపు కూర్చున్నందుకు, కొత్త ఫీజుల కింద వచ్చింది 52 కోట్లు!

కానీ, పాపం ఈయన, 2008-09 సంవత్సరానికి తీసుకోవలసిన జీతం 30 కోట్లు తీసుకోలేదట! మాంద్యం కారణంగా అట! అంటే, సరుకు అమ్ముడు పోలేదన్నమాట! అంతా సవ్యంగా అమ్ముడుపోయి వుంటే, 30 కోట్ల వేతనం అందేదన్నమాట! అయితే, 2007-08 సంవత్సరంలో అందిన వేతనం అయితే, 43 కోట్ల, 43 లక్షలు!

ఇక, ఇతగాడి సోదరుడైన ముఖేష్ అంబానీకి, 2007-08 సంవత్సరానికి అందిన జీతం అయితే, 44 కోట్ల, 2 లక్షలు. ఇతగాడికి, 2008-09 సంవత్సరంలో అందిన జీతం ఎంతో, ఆ వార్త ఇంకా బైటికి రాలేదు.

ఇక్కడ ఇంకా 'లాభాలు' కనపడడం లేదు. ఈ ఆదాయాలు - జీతాలూ, మీటింగుల్లో కూర్చున్న కష్టానికి అందే ఫీజులూ మాత్రమే. ఈ ఆదాయాలకు లాభాల్ని కూడా కలపాలి. అంతే కాదు. ఈ పెట్టుబడిదార్ల పెట్టుబడులు బ్యాంకుల నించి అప్పు తెచ్చినవి కాకపోతే, దానికి వచ్చే వడ్డీలన్నీ కూడా కొన్ని లక్షలు వుంటాయి. అవి బైటికి పోకుండా వాళ్ళకే వుంటాయి. మొత్తం ఈ ఆదాయాలన్నీ కలిపి, ఆకాశానికి అందేటన్ని కోట్లు వుంటాయి. ఒక్క పెట్టుబడిదారుడికి, ఒక్క సంవత్సరంలో, వేల కోట్ల రూపాయల ఆదాయం! ఇదంతా ఏమిటి? అతని శ్రమ శక్తి విలువేనా? లేకపోతే, అతని అదనపు విలువతో కూడా కలిసి వచ్చిన శ్రమ విలువా?

ఏ పెట్టుబడిదారుడైనా, ఒక్క కంపెనీకే కాదు. డజన్ కంపెనీలకు డైరెక్టరుగా వుంటాడు. ఏ మనిషి అయినా, రోజుకి 8 గంటలు పని చెయ్యాలంటే, ఈ మనిషి, డజన్ కంపెనీల్లో రోజూ, ఎలా పని చేస్తాడు? - అన్ని గంటలు కాదు, ఒక్క గంట కూడా పని వుండదు. చేసే పని అంతా, సరుకుల్ని ఎక్కడ అమ్మాలో, ఏ కంపెనీలతో పోటీలు పడాలో, కార్మికుల్ని ఇంకా ఎలా భయ భక్తుల్లో వుంచాలో - వంటి విషయాల మీద, మీటింగుల్లో సమాలోచనలు జరపడమే.

ఇప్పుడు ఇంకో వార్త చూడండి! ఇందులో, అనేక మంది పెట్టుబడిదారుల జీతాలు కనపడుతున్నాయి. ఇందులో, లాభాలూ, వడ్డీలూ, సిట్టింగ్ అలవెన్సులూ, ప్రత్యేక సౌకర్యాలూ, కనపడవు. వాటి నన్నిటినీ కూడా వీటికి కలుపుకోవాలి.

## 'కోటి బాబు'లు కోకొల్లలు!

దేశంలో కొందరు సీఈవోల జీత భత్యాలు ఏటా 40-50 కోట్ల రూపాయల పైమాటే. ఇక, ఏటా కోటి రూపాయల పైబడి జీత భత్యాలు తీసుకుంటున్న టాప్ ఎగ్జిక్యూటివ్‌లు, డైరెక్టర్లు, కొల్లలుగా ఉన్నారు. లిస్టెడ్ కంపెనీల్లో కోటి రూపా యల పైగా జీత భత్యాలు తీసుకుంటున్న డైరెక్టర్లు 640 మంది ఉన్నారనీ, ప్రైవేట్ కంపెనీలను కూడా లెక్కలోకి తీసుకుంటే ఈ సంఖ్య 3000 పైగా ఉంటుందనీ, అంచనా. కొన్ని బడా కంపెనీల్లో కోటి రూపాయలపైనే వేతనం వస్తున్న ఉద్యోగులు డజన్ల సంఖ్యలో ఉన్నారు. ఐటీ సంస్థల్లో జీతాలు దండిగానే ఉన్నప్పటికీ, కోట్ల రూపాయల స్థాయిలో ఉన్నవారి సంఖ్య తక్కువగానే ఉంది. బీమా, టెలికామ్, బ్యాంకింగ్, ఎంఎస్‌సి కంపెనీల్లో, కోట్ల రూపాయల జీతాల్లో ఉన్నవారు ఒక్కో కంపెనీలో డజన్ల సంఖ్యలో ఉన్నారు. ఉత్పత్తి రంగంలోని కంపెనీల్లో వివిధ స్థాయిల్లోని ఉద్యోగుల జీత భత్యాల మధ్య అంతరం అపరిమితంగా ఉంటుందనీ, ఐటీ కంపెనీల్లో ఈ అంతరం తక్కు వని, పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. దేశీయ మార్కెట్‌లో, కోట్లలో వేతనం ఉన్న కొందరు సీఈవోల వివరాలు, ఈ విధంగా ఉన్నాయి. →

→ దేశీయ మార్కెట్లో, కోట్లలో వేతనం వున్న కొందరు సీఈవోల వివరాలు ఇలా ఉన్నాయి :

2008 సంవత్సరానికి

భారత, అమెరికా అగ్ర శ్రేణి కంపెనీల అధినేతల సాలుసరి వేతన వివరాలు ఇవి.

| పేరు | హోదా | కంపెనీ | వేతనం రూ.కోట్లలో |
|---|---|---|---|
| ముఖేష్ అంబానీ | సీఎండీ | ఆరెఎల్‌ఎల్ | 44.02 |
| మల్వీందర్ సింగ్ | ఎండీ సీఈవో | రాన్‌బాక్సీ లేపరేటరీస్ | 19.59 |
| సునీల్ మిట్టల్ | సీఎండీ | భారతి ఎయిర్‌టెల్ | 19.55 |
| సజ్జన్ జిందాల్ | వీసీ, ఎండీ | జేఎస్‌డబ్ల్యూ స్టీల్ | 16.73 |
| ఓంకార్ కె కన్వార్ | సీఎండీ | అపోలో టైర్స్ | 15.54 |
| పంకజ్ పటేల్ | సీఎండీ | క్యాడిలా హెల్త్‌కేర్ | 14.43 |
| కేఎం బిర్లా | చైర్మన్ | గ్రాసిమ్ ఇండస్ట్రీస్ | 11.25 |
| నిఖిల్ మెస్వాని | ఐడీ | ఆర్‌ఐఎల్ | 11.12 |
| హితల్ మెస్వాని | ఐడీ | ఆర్‌ఐఎల్ | 11.12 |
| కమల్ సింగ్ | ఐసీ,ఎండీ | రోల్టా ఇండియా | 10.64 |

( ఆంధ్రజ్యోతి, 6 అక్టోబరు 2009 )

పెట్టుబడిదారుల జీతాలు, ఒక సంవత్సరంలో, ఎలా వున్నాయో చూశారా? ఇవి జీతాలు మాత్రమే. ఈ జీతాలు, ఒక్క కంపెనీ నించి వచ్చేవి మాత్రమే. డజన్ కంపెనీలకు డైరెక్టరుగా వుండే పెట్టుబడిదారుడికి, ఆ అన్ని కంపెనీల నించీ వేరు వేరు ఆదాయాలు వస్తాయి. అన్నీ ఒకే పేరుతో కాదు. వేరు వేరు పేర్లతో! వేరు వేరు శ్రమలు చేసినట్టు! డజన్ జీతాలు! డజన్ సిటింగ్ అలవెన్సులు! డజన్ కంపెనీల నించీ ప్రత్యేక సౌకర్యాలు!

ఈ రెండో వార్తలో, కోట్ల డబ్బుని జీతాలుగా తీసుకునే ఉద్యోగులు కూడా కనపడుతున్నారు. వీళ్ళు, మేనేజర్లూ, సైంటిస్టులూ లాంటి వాళ్ళు. వీళ్ళ జీతాల్లో, వీళ్ళ అదనపు విలువ అంతా వీళ్ళకి అంది, ఇతర శాఖల కార్మికుల అదనపు విలువ కూడా వుంటుంది. వీళ్ళు క్రమంగా పెట్టుబడిదారులుగా స్వంత పరిశ్రమలు ప్రారంభిస్తారు.

**ఇప్పుడు కొన్ని కంపెనీల నికర లాభాలూ, ఆదాయాలూ, చూడండి!**
**ఈ లాభాలు, 3 నెలల్లో ( జూలై, ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో ) వచ్చినవి!**



ఎన్‌టిపిసి లాభం 2,152 కోట్లు

క్యూ2 2009-10

బిహెచ్‌ఇఎల్ లాభంలో 36 వృద్ధి

బిఎన్‌కె లాభం 60 కోట్లు

ఐటిసి ఆదాయం 4,414 కోట్లు

ఇండియన్ బ్యాంక్ లాభంలో 31% వృద్ధి


టివిఎస్ ఆదాయం 1,130 కోట్లు

( ఆంధ్రజ్యోతి, 25-10-2009 )

ఎన్‌టిపిసి లాభం 2,152 కోట్లు. బిహెచ్ఇఎల్ లాభంలో 36% వృద్ధి. బిఎన్‌కె లాభం 60 కోట్లు. ఐటిసి ఆదాయం 4,414 కోట్లు. ఇండియన్ బ్యాంకు లాభంలో 31% వృద్ధి. టివిఎస్ ఆదాయం 1,130 కోట్లు.

ప్రతీ కంపెనీ, ప్రతీ 3 నెలలకీ ఒక సారి లాభాల్ని లెక్క కడుతుంది. లాభం గతం కన్నా పెరిగితే, మరింత గర్వంగా ప్రకటించుకుంటుంది. ఎందుకంటే, లాభ రహస్యం కార్మికులకు తెలీదు కాబట్టి. అందుకే, ప్రతీ పెట్టుబడిదారుడూ కార్మికుల ముందు కోట్ల కోట్ల ఆదా యాలు తీసుకుంటూ కూడా నిర్భయంగా వుంటాడు.

ఇప్పుడు, మరి కొన్ని కంపెనీల
3 నెలల లాభాలు చూడండి!



ఎస్‌బిఐ లాభం 2,490 కోట్లు

నవభారత్ నికర లాభం 120 కోట్లు

సెంట్రల్ బ్యాంకు లాభంలో భారీ వృద్ధి

స్వల్పంగా పెరిగిన ఎన్‌సిసి లాభం

రిలయన్స్ ఇన్‌ఫ్రా లాభం 307 కోట్లు

ఆర్‌కామ్ లాభంలో 52శాతం తగ్గుదల

ఆంధ్రజ్యోతి, 1-11-2009

చిట్ట చివరి కంపెనీకి, గత 3 నెలల లాభంలో నించి ఇప్పుడు 52 శాతం తగ్గింది. అంటే, లాభం రాలేదని కాదు. తగ్గింది. అంతే!

అసలు, ఈ లెక్కలన్నీ పెద్ద పెద్ద అబద్ధాలు! పెద్ద పెద్ద జీతాలూ, వడ్డీలూ, భూమి అద్దెలూ అన్నీ తీసేసీ, పెట్టుబడిదార్ల అలవెన్సులన్నీ తీసేసీ, మిగిలిన దాన్ని నికర లాభంగా చెపుతారు. తీసేసిన వాటిని కలిపి తేనే, అసలు అదనపు విలువ తెలుస్తుంది.

ఇప్పుడు, ఈ వార్తలో, ఒక బ్యాంకుకి, 9 నెలల కాలంలో వచ్చిన లాభాల సంగతి చూడండి!


రెండవ త్రైమాసికంలో...
ఎస్‌బిహెచ్ నికరలాభం
రూ.234 కోట్లు

**ఎస్‌బిహెచ్ నికర లాభం**
**రూ.234 కోట్లు** (2వ త్రైమాసికంలో)

స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బిహెచ్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2009-10 సెప్టెంబర్‌తో ముగిసిన రెండవ త్రైమాసికంలో 234.36 కోట్ల రూపాయల నికర లాభం ఆర్జించింది. అలాగే, ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 43 శాతం వృద్ధితో, 345 కోట్ల రూపాయల నికర లాభం ఆర్జించినట్లు, బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ రేణు రెల్లు మంగళవారం విలేఖరుల సమావేశంలో చెప్పారు. రిజర్వు బ్యాంకు ఇచ్చిన లక్ష్యాలను, తమ బ్యాంకు, మొదటి ఆరు నెలల్లోనే 75 శాతం అధిగమించిందన్నారు. వ్యవసాయ రుణాలు 163 శాతం పెరిగాయనీ, అలాగే చిన్న, మధ్య తరహా పరిశ్రమల రుణాలు 35 శాతం, హౌసింగ్ రుణాలు 87 శాతం, పర్సనల్ 82 శాతం పెరిగాయని, ఆమె తెలిపారు. (ఆంధ్రప్రభ, 21 అక్టోబరు 2009)

ఈ బ్యాంకుకి, మొదటి 6 నెలల కాలంలో వచ్చిన లాభం - 345 కోట్లు! తర్వాత, 3 నెలల కాలంలో వచ్చిన లాభం - 234 కోట్లు! మొదటి 6 నెలల కాలంలో వచ్చిన లాభాల్ని, 2 భాగాలు చేస్తే, అప్పటి 3 నెలలకు వచ్చిన లాభాలు తెలుస్తాయి. ఆ 3 నెలల లాభం,

$$\frac{345}{2} = 172\frac{1}{2} \text{ కోట్లు.}$$

ఆ 3 నెలల కాలంలో వచ్చిన లాభం కన్నా, తర్వాత 3 నెలల కాలంలో వచ్చిన లాభం ఇంకా ఎక్కువ. ఇవి, 234 కోట్లు! ఇప్పటికి 9 నెలలు అయ్యాయి. చివరి 3 నెలలకు రాబోయే లాభం లెక్క, డిసెంబర్లో తెలుస్తుంది. అది గతం కన్నా ఎక్కువ కోట్లుగా వుంటుంది. మొత్తం సంవత్సరంలో, ఆ బ్యాంకుకి, దాదాపు 1,000 కోట్లు లాభాలు వస్తాయి!


బ్యాంకుకి వచ్చే లాభాల్లో, ప్రధాన భాగం - వడ్డీలు.

బ్యాంకుకి వడ్డీలు ఎక్కడి నించి వస్తాయి? - పెట్టుబడిదారులందరూ తమ డబ్బుని బ్యాంకుల్లో దాచుకుంటారు. ఒక పెట్టుబడిదారుడికి, పెట్టుబడిగా పెట్టడా

నికి, తన డబ్బు కన్నా ఎక్కువ డబ్బు కావాలంటే, బ్యాంకు నించే అప్పు తీసుకుంటాడు. ప్రతీ బ్యాంకూ, అనేక మంది ఉత్పాదక, వర్తక పెట్టుబడిదారులకు అప్పులు ఇస్తుంది. అప్పులు తీసుకున్న వాళ్ళు, ఆ డబ్బుతో సరుకు రాసుల్ని తయారుచేయించి, అమ్మి, అదనపు విలువని సంపాదిస్తారు. దాన్ని పంచుకుంటారు. అందులో నించే వాళ్ళు, అప్పుల మీద వడ్డీలు కడతారు.

అసలు, చాలా సార్లు పెట్టుబడిదారులు, ప్రభుత్వ బ్యాంకులకు, అప్పులూ, వడ్డీలూ అన్నీ, ఎగ్గొడతారు. అయినా, ప్రభుత్వం వాళ్ళని ఏమీ చెయ్యదు. 'పోనీలే, ఇక కట్టక్క ర్లేదులే' అని వదిలేస్తుంది. ఆ డబ్బు ఇక లేనట్టుగా కొత్త లెక్కలు రాసుకుంటుంది.

ఈ వార్త చూడండి, ఎంత భయంకరంగా వుందో!


'గ్రేటర్' బకాయిలు!

• ఆస్తిపన్ను బకాయిదారుల్లో అంతా ప్రముఖులే • నందమూరి బాలకృష్ణ, రాఘవేంద్రరావు అదే జాబితాలో • బ్యాంకులు, బడా పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ బిల్డర్లు కూడా బకాయిదారులే! • కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల భవనాలపై పేరుకుపోతున్న ఆస్తిపన్ను • స్టార్‌హోటళ్ళ యజమానులు, రాజకీయ నాయకులు, సంపన్నులూ ఎగవేతదారులే! • ఏటా వందల కోట్ల రూపాయల్లో మొండి బకాయిలు • నిధులు సమకూరక నీరసిస్తున్న 'గ్రేటర్'

(ఆంధ్రప్రభ, 26-10-09)

ఏటా వసూలు కాకుండా పోయే పన్నులు - వందల కోట్లు! ప్రభుత్వం ఎలా ఊరుకుంటుంది? ప్రభుత్వం, ఆ ఆస్తిపరులదే కదా? పెద్ద అధికారులూ, మంత్రులూ, లంచాలు తినేసి, ఆ పన్నుల లెక్కలన్నీ తారుమారు చేసేస్తారు! ఇది, ఒక్క సంవత్సరంలో జరిగేది కాదు. ప్రతీ ఏటా! ఆస్తిపరులు పన్నులు ఎగ్గొట్టినందుకే కాదు, ఇళ్ళల్లోనే హత్యలు చేసేసి, శవాల్ని బహిరంగంగా వదిలేసినా, దాని మీద కనీస విచారణ అయినా లేకుండా ఊరుకుంటుంది ప్రభుత్వం! - ఇదంతా ఆస్తిపరుల, యజమానుల పరిపాలన. ఇది, గత కాలంలోనూ ఇలాంటిదే. ఇప్పుడూ ఇలాంటిదే.

ఇలా జరిగే కేసులు కొన్ని వుండగా కూడా ఆ బ్యాంకుకి లాభాలు కోట్లలో వస్తూ వుంటాయి.

ప్రైవేటుగా బ్యాంకులు పెట్టే పెట్టుబడిదారులందరికీ లాభాలే కోట్లలో! ఏ కంపెనీ అయినా, ఏ బ్యాంకు అయినా, 'నికర లాభం ఇంత' అని లెక్కలు చూపిస్తే, లాభం అంతే కాదు. అది పెద్ద అబద్ధం! లాభం ఇంకా చాలా ఎక్కువగా వుంటుంది. పెట్టుబడి దారులు తీసుకునే భారీ జీతాలూ, ఇతర అలవెన్సులూ, అన్నీ పోయాకే లాభాన్ని చెపుతారు. కానీ అవి అన్నీ కూడా లాభాలే. అంటే అదనపు విలువలో భాగాలే. అవి అన్నీ కలిసిన మొత్తాన్నే నికర లాభంగా చూడాలి.

ఏ పెట్టుబడిదారుణ్ణి తీసుకున్నా, జీతాల పేరుతో వచ్చేది కోట్లు! లాభాలుగా కోట్లు! సిటింగ్ రాబడులు కోట్లు! ప్రత్యేక సౌకర్యాల కోసం కోట్లు! కొందరికి వడ్డీలుగానూ, భూమి రెంటులుగానూ కూడా

కోట్లు! అన్ని కోట్లూ కలిసిందే వాళ్ళ నెలసరి ఆదాయం! ఇదంతా తమ కష్టార్జితమే అని వాళ్ళు నమ్ముతారు. అలాగే చెప్పుకుంటారు. అదంతా కార్మికుల్ని కూడా నమ్మమంటారు.

ఈ శ్రమ దోపిడీ చేసే వాళ్ళల్లో, మొగ వాళ్ళే గాక, - ఆడవాళ్ళు కూడా కంపెనీల్లో డైరెక్టర్ల స్థానాల్లో వుంటారు.

వీళ్ళ కోట్ల కోట్ల ఆదాయాలన్నీ ఏమిటి? శ్రమ దోపిడీ అంటే ఏమిటో ఇప్పటికైనా అర్థమవుతోందా? పెట్టుబడి దార్ల ఆదాయాలుగా అందే ఈ కోట్ల కోట్ల డబ్బు అంతా ఎవరి శ్రమ? ఈ డబ్బు రాసులతో వీళ్ళు ఏం చేస్తారు?

ఇంకా ఇంకా కొత్త కంపెనీలు పెడతారు. ఆ సరుకుల రాసుల అమ్మకాల కోసం విదేశాల మీద పడతారు. విలాసాలు ఇంకా ఇంకా పెంచుకుంటారు. పెళ్ళాలకీ, ప్రియురాళ్ళకీ, ఉంగరాల బహుమతులు ఇచ్చినట్టుగా, షిప్పుల్నీ, విమానాల్నీ, బహుమతులుగా ఇస్తారు. భోజనాల టేబుళ్ళని బంగారంతో, వజ్రాలతో చేయించుకుంటారు.

పెట్టుబడిదార్ల సంగతి ఇలా వుంటే, వీళ్ళ ప్రభుత్వ పెద్దలైన గవర్నర్లూ, ప్రెసిడెంట్లూ తినే ఖర్చులు కూడా కోట్లే! వాళ్ళు చేసే శ్రమలు సంతకాలు పెట్టడం! దాని కోసం వాళ్ళకి, మహా భవంతులూ, ఆఫీసులూ, ఎప్పటి కప్పుడు వాటి అలంకారాలూ, దానికి ఉద్యోగులూ, అదంతా కోట్లు కోట్లు!

ఈ వార్త చూడండి!
మనల్ని పాలించే వాళ్ళు ఎలా వున్నారో తెలుస్తుంది.

### యడియూరప్ప పడక గది అలంకరణకు
## రూ.35 లక్షల ఖర్చు!

బెంగళూరు, నవంబర్ 13 ( కెఎన్ఎన్ ): ప్రజా సేవే పరమార్థమని పదే పదే వల్లించే నాయకులు ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుంటారు. ఆర్థిక మాంద్యం నేపథ్యంలో వృథా ఖర్చులను తగ్గించుకోవాలని మంత్రులకు, అధికారులకు సూచనలిచ్చిన ముఖ్య మంత్రి మాత్రం, తన పడక గది నవీకరణకు ఏకంగా రూ.35 లక్షలు ఖర్చు చేయించిన విషయం వెలుగుచూసింది. ముఖ్య మంత్రి యడ్యూరప్ప తాను నివాసముండే ప్రభుత్వ బంగళా ఆధునీకరణకు రూ.1.70 కోట్లు ఖర్చు పెట్టించిన సంగతి సమాచార హక్కు ద్వారా బయటపడింది. దీంతో ముఖ్య మంత్రి వల్లించే ఆదర్శాలన్నీ వట్టివేనని తేలిపోయింది. రేస్ కోర్స్ రోడ్డులో వున్న ముఖ్య మంత్రి బంగళా నవీకరణకు మొత్తం రూ.1.70 కోట్లు ఖర్చయిందని, బాత్ రూం అలంకరణకే రూ.10 లక్షలు ఖర్చయ్యిందని, బంగళాలో పాలరాతి ఫ్లోరింగ్‌కు రూ.10 లక్షలు, ఫాల్స్ రూఫింగ్‌కు రూ.4.40 లక్షలు, జిప్సం బోర్డ్, గోడల ప్యానలింగ్‌కు రూ.10.15 లక్షలు ఖర్చు చేశారు. ఇదే సందర్భంగా అడిగిన మరో ప్రశ్నకు బదులుగా మరిన్ని ఆశ్చర్యకర సంగతులు వెలుగుచూశాయి. ఇటీవల గుల్బర్గాలో నిర్వహించిన క్యాబినెట్ సమావేశానికి కోటి రూపాయలు ఖర్చు చేశారని, అందులో పుష్పాలంకరణకే రూ.28 లక్షలు ఖర్చయ్యింది! ఇదండీ.. మన నేతల పొదుపు మంత్రం. ఎంతైనా సలహాలు వినే వారికి మాత్రమే కదా? చెప్పే వారికి అవి వర్తించవు! ( ఆంధ్రప్రభ, 14-11-2009 )

వార్త, చాలా వివరంగా, విమర్శతో కూడా వుంది. అర్థం చేసుకోవడం చాలా తేలిక. ఈ లక్షల, కోట్ల ఖర్చులు, ఆ భవనాల అలంకరణలకు! ఇది, ఒక్క సారి కాదు. ఫేషన్లు మార్చినప్పుడల్లా! ఉద్యోగం నించి రిటైర్ అయిన వృద్ధ ఉద్యోగికి, పెన్షన్ ఇవ్వడానికి కనీసం పదేళ్ళు చేస్తారు. కొందరు ఉద్యోగులు (కార్మికులు) పెన్షన్లు దొరక్కుండానే చచ్చిపోతారు. కానీ, మనల్ని పాలించే పాలకులు, నిత్యం విలాసాల్లో తేలుతూంటారు. ఈ విలాసాలు, వెనకటి రాజుల, చక్రవర్తుల విలాసాలే! రాజులే, ఈ రూపాల్లోకి మారారు, ప్రజాస్వామ్యం పేరుతో!

అమెరికా ప్రెసిడెంట్ వైభోగం చూడండి!

మైకేల్ పెరంటీ అనే అమెరికన్ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్, 1985 లో రాసిన, "డెమాక్రసీ ఫర్ ది ఫ్యూ" (కొద్ది మందికే ప్రజాస్వామ్యం) అనే పుస్తకం నించి ఈ సమాచారం.

## అధ్యక్షుడి నివాసం వైట్ హౌస్!

132 విశాలమైన గదులు గల భవనం అది. 18 ఎకరాల ఎస్టేట్‌తో వుంటుంది అది. దాన్ని నిర్వహించే ఖర్చుల కోసం, నెలకి, 20 లక్షల డాలర్లు కేటాయించారు. (ఈ లెక్కలన్నీ 1985 నాటివి. ఈ నాటికి ఇవి, 100 రెట్లు పెరిగి వుంటాయి.) అధ్యక్షుడి కోసం, 6 గురు బట్లర్లతో సహా, 83 మంది గృహ సేవకులు వుంటారు. మద్యం నిల్వలు బాగా వున్న వెల్ స్టాక్డ్ వైన్ సెల్లార్ వుంటుంది. ప్రెసిడెంట్ కుటుంబం మాత్రమే ప్రైవేట్‌గా చూసే సినిమా హాలూ, ప్రైవేటు వ్యాయామ శాలా, ప్రైవేట్ టెన్నిస్ కోర్టులూ, వెచ్చదనం ఏర్పాటు గల ఈత కొలనూ, ఉచిత వైద్యులూ, అనేక మంది డ్రైవర్లున్న విలాసవంతమైన కార్లూ, అనేక హెలికాప్టర్లూ, ప్రత్యేక విమానాలూ, ప్రత్యేక ఎయిర్ ఫోర్స్ విమానం, (దీని ఖర్చు, 1 గంటకి, 5221 డాలర్లు.) గ్రామీణ ప్రాంతాల్లో విశ్రాంతి భవనాలూ, అక్కడ సేవకులూ, అక్కడ కార్లూ, ఉచిత సెలవలూ, చేతి ఖర్చుల కోసం సంవత్సరానికి 50 వేల డాలర్ల అలవెన్సూ! ఇవన్నీ గాక, ప్రెసిడెంటు చేసే శ్రమకి, 2 లక్షల డాలర్ల సంవత్సర జీతం. (ఈ జీతంతో ఏం కొంటాడు?) పదవి తర్వాత, కంఫర్టబుల్ పెన్షన్!

నిక్సన్ అధ్యక్షుడిగా వున్న కాలంలో, అతను చెల్లించవలసిన ఆదాయం పన్నుల్లో, కనీసం 4 లక్షల డాలర్లని ఎగ్గొట్టినట్టు తేలింది. కానీ ఏమీ జరగలేదు అతనికి. తన స్నేహితులైన వ్యాపారస్తుల ఆదాయాల్ని తణిఖీలు చెయ్యవద్దని, ప్రెసిడెంటు నిక్సన్, ఇన్‌కమ్ టాక్సు వాళ్ళని లోపాయికారీగా ఆజ్ఞాపించాడు.

పాలకులు ఎలా వుంటారో తెలిసిందా? వీళ్ళని చూస్తే, కడుపు మండడం లేదూ?

ఈ ఆర్భాటం అంతా శ్రామిక ప్రజల్ని భయ భక్తుల్లో ఉంచడానికి! ప్రభుత్వం అనేది గొప్ప శక్తి లాగ జనాలకు కనపడే లాగ చెయ్యడానికి! దాని కోసం కోట్లు కోట్లు ఖర్చు! సైన్యాల ఖర్చు ఎలాగూ వుంది!

మొత్తం సమాజంలో, ఉత్పాదక కార్మికుల అదనపు విలువ రాసి ఎంత వుంటుందో చూడాలంటే, ఇలాంటి ఆదాయాలన్నిటినీ కలపాలి.

ఈ కోట్ల రాసులన్నీ ఎక్కడివి? శ్రామిక వర్గం నించి లాగినవి. అవి, శ్రామిక వర్గానికే అందితే, వాళ్ళకేమైనా సమస్య వుంటుందా? మానవ సమాజంలో పేద తనాలూ, బిచ్చాలెత్తడాలూ, దొంగ తనాలూ వుంటాయా?

పెట్టుబడిదార్ల కోట్ల కోట్ల ఆదాయాల్నీ, పాలకుల భయంకర విలాసాల్నీ చూస్తే, శ్రామిక ప్రజలకు కడుపులు ఉడికిపోవాలి. కానీ, ఈ సంగతులేవీ, మేధా శ్రామికుల్లో గుప్పెడు మందికి తప్ప, అధిక జనాభాకి తెలీవు. అధిక జనాభాకి చదువే వుండదు. పేపర్లూ పుస్తకాలూ ఏమీ వుండవు. వాళ్ళు అలా వుండడమే దోపిడీ వర్గానికి హాయి!

'జీతం' అనే విషయంలో, పెట్టుబడిదార్ల జీతాల గురించీ, వాళ్ళ ఇతర ఆదాయాల గురించీ, పాలకుల విలాసాల గురించీ తెలియకపోతే, పెట్టుబడిదారీ విధానం గురించి ఇక ఏమీ తెలిసినట్టు కాదు. H

# 80. భారత దేశపు కులాలు 'దోపిడీ శ్రమ విభజన' ఫలితాలు!

భారత దేశపు జనాభా, పెద్ద కులాల వారి గానూ, చిన్న కులాల వారి గానూ, రక రకాల ఎక్కువ తక్కువ స్థాయిల్లో విడి పోయి వుంటారు. ఇది, ప్రకృతి సహజంగా ఏర్పడ్డ లక్షణం కాదు. సామాజికంగా ఏర్పడ్డ లక్షణమే. భారత దేశంలో దోపిడీ శ్రమ సంబంధాల్లో ఏర్పడే అనేక క్రూరత్వాల్లో ఇది మొట్ట మొదటిది.

ఈ తక్కువ ఎక్కువ కులాల జీవనా ధారాల్ని పరిశీలిస్తే, తేడా అంతా, ఆ కులాల శ్రమ సంబంధాల్లో కనపడుతుంది. వెనకటి కాలంలో, చిన్న కులాల వారం దరూ నూటికి నూరు పాళ్ళూ శ్రమ జీవులే. ఉత్పత్తి సాధనాలు లేని వారే. యజమాను లకు సేవకులే. పెద్ద కులాల వారిలో అత్య ధికులు యజమానుల స్థాయిలో వుండగల ఆస్తి పరులు. భూములన్నీ ఆక్రమించు కున్న భూస్వాములు.

కులాల మధ్య ఈ తేడా, ఈ నాడు కొంత తగ్గినా, ఇంకా మిగిలి వున్న తేడాయే అత్యధికం.

"అసలు, కులాలు ఎందుకు ప్రారం భమై వుంటాయి?" అనే ప్రశ్నని, హేతు బద్ధతతో తార్కికంగా చర్చిస్తే, వెనకటి కాలంలో వున్న శ్రమ విభజనే కారణంగా కనపడుతుంది. కానీ 'శ్రమ విభజన' అనేది, ప్రపంచంలో ఏ దేశంలో అయినా వుంటుంది. కానీ, భారత దేశంలో ఏర్పడ్డ 'కులాల' వంటి లక్షణాలు, ఏ దేశంలోనూ లేవని, అన్ని కులాల పరిశీలకులూ చెపు తారు. ఎక్కువ తక్కువ కులాల మధ్య, భోజన సంబంధాలూ, వివాహ సంబం ధాలూ లేకపోవడం, కులాల ప్రత్యేక లక్ష ణాలు. 'అస్పృశ్యత' వంటి నీచ లక్షణాలు కూడా ఈ సమస్యలో ప్రత్యేకం!

మానవ సమాజాన్ని ఆటవిక కాలాల నించీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే, శరీరాల మీద బట్టలే లేని, శ్రమలే తెలి యని, ఆ జంతు ప్రాయపు దశలోనే మను షుల మధ్య 'కులాలు' వున్నాయని భావించ లేము. ఆ తేడాలు, తర్వాత కాలం లోనే ప్రారంభమై వుంటాయని భావించాలి. ఒక నాటి శ్రమ విభజనలో నించే ఎక్కువ తక్కువ కులాల వంటి తేడాలు ప్రారంభ మయ్యాయి. - అని ఏ పరిశీలకులైనా అన్న ప్పుడు, అది హేతుబద్ధంగానే, కనపడు తుంది. కానీ, దాని మీద ఇంకో ప్రశ్న తలెత్తుతుంది.

"శ్రమ విభజన అన్ని చోట్లా వుంది. భారత దేశంలోనే ఇలా ఎందుకు జరి గింది?" అనే ప్రశ్న. అది మంచి ప్రశ్నే. దానికి జవాబు కావాలంటే, ఆ వెనకటి కాలం నాటి భారత దేశపు ప్రత్యేక పరిస్తితు లేమిటో తెలియాలి. వేల సంవత్సరాల నాటి శ్రమ సంబంధాల ప్రత్యేకతలు తెలియాలి. అవి, పరిశీలనలకు అందలేదు కాబట్టీ, ఆ నాటి చరిత్రలకు ఈ కోణంలో ఆధారాలు దొరకలేదు కాబట్టీ, " ఆ ప్రత్యేక

పరిస్తితులేమిటి?'' అనే ప్రశ్నకు జవాబు లేదు.

చిన్న కులాల మేధావి అయిన అంబేద్కరు సైతం, ఎన్ని మత గ్రంధాలు పరిశీలించినా, భారత దేశపు కులాల మూలాల గురించి చెప్ప గలిగిందేమీ లేదు.

ఆయన, " కుల వ్యవస్థ, శ్రమ విభజనే కాదు; శ్రామికుల విభజన కూడా'' అంటారు. కులాలు ఏర్పడడానికి 'శ్రమ విభజన' అనే కారణాన్ని ఆయన తిరస్కరించలేదు. దాన్ని ఒప్పుకుంటారు. కానీ, 'ఇక్కడ వున్నది అది ఒక్కటే కాదు. శ్రామికులు ఎక్కువ తక్కువలుగా విడిపోయి వుండడం కూడా ('శ్రామికుల విభజన' కూడా ) ఇక్కడ వుంది' అంటారు. కులాల మధ్యే ఎక్కువ తక్కువలు ఉన్నప్పుడు, ఆ కులాల శ్రామికులు ఎక్కువ తక్కువలుగా వుండడంలో వింత ఏముంది?

ఒక కులం ఎక్కువదీ, ఇంకో కులం తక్కువదీ అయినప్పుడు, ఎక్కువ కులం మనిషి ఎక్కువ వాడిగానూ, తక్కువ కులం మనిషి తక్కువ వాడిగానూ, ఉంటారా, ఉండరా?

'ఇక్కడ కులాలు వున్నాయి. శ్రామికులు విడిపోయి వున్నారు' అనడంలో, కులాలు ఎందుకు పుట్టాయో కారణం కనపడుతోందా? 'శ్రామికుల విభజన' అందరికీ నిత్యమూ కనపడే వాస్తవమే. దాని వల్ల కులాల మూలం తెలిసినట్టేనా? - కాదు.

మానవ జాతి పుట్టి పెరుగుతోన్న ప్రారంభ దశలో, కులాలు ఉండవు. తర్వాతే అవి ప్రారంభమవుతాయి. ఎందుకు ప్రారంభమై వుంటాయో కారణం దొరికినా, దొరకక్క పోయినా, 'అవి మధ్యలో ఎప్పుడో పుట్టాయి' అని గ్రహించాలా, కులాలు మొదటి నించీ ఉన్నాయి అనుకోవాలా? - మధ్యలోనే పుట్టాయి అని గ్రహించినా, అలా ఈ దేశంలో ఎందుకు జరిగిందో ఆ పరిస్తితులు తెలియవు.

భారత దేశంలో, శ్రమ విభజనని కులాలుగా గడ్డ కట్టించిన ప్రత్యేక పరిస్తితులేమిటో తెలిసినా, ఆ కారణానికే కట్టుబడి ఇప్పుడు కులాల్ని కొనసాగించేదేమీ వుండదు. కులాల్ని తీసి వెయ్యాలి. సమానత్వాన్ని ఏర్పర్చుకోవాలి. దానికే మార్గాన్ని అన్వేషించుకోవాలి.

పెద్ద కులాల్లో ఆస్తిపరులు, ఏ శ్రమా చెయ్యడం వుండదు. వారు భూస్వాములుగా పెట్టుబడిదారులుగా, రక రకాల వ్యాపారులుగా, దోపిడీ ఆదాయాలతో జీవిస్తూ వుంటారు.

అదే పెద్ద కులాల్లో అధిక సంఖ్య అనేక శ్రమలు చేసినా, దాదాపుగా అవి అన్నీ మేధా శ్రమలే. కొందరు శారీరక శ్రమలు చేసినా, అవి వ్యవసాయ శ్రమల వంటివే గానీ, అంత కన్నా తక్కువ స్థాయి మురికి శ్రమలుగా వుండవు.

కానీ, చిన్న కులాల వారు చేసే శ్రమలు అలాంటివి కావు. వీరిలో మేధా శ్రమల వారు చాలా తక్కువ. ఈ నాడు, రిజర్వేషన్ల ద్వారా చిన్న కులాల్లో కొందరు, డాక్టర్లూ ఇంజనీర్లూ లెక్చెరర్లూ అవగలుగుతున్నారు. కానీ ఈ అవకాశాలు, చిన్న కులాల్లో అధిక జనాభాకి అందేవి కావు. రిజర్వేషన్లు, చిన్న ఉపశమనం లాంటిది మాత్రమే. అవి, చిన్న కులాల్లో అధిక జనాభా సమస్యల్ని పరిష్కరించవు. ఆ జనాభా అట్టడుగు శారీరక

శ్రమల్లో ఇరుక్కుపోయి వున్నారు. మరణించిన జంతువుల్ని పూడ్చిపెట్టడం, పాయిఖానాల్లో మలాలు ఎత్తడం, డ్రయినేజీలు కడగడం, రోడ్లు ఊడ్చడం, బళ్ళు తోలడం లాంటివే వారి ప్రధాన శ్రమలు. ఆ జనాభాలో ఈ నాటికీ కొంత మంది, పాయిఖానాల్లో మలాన్ని ఎత్తే పనితోనే జీవిస్తున్నారు. పాయిఖానాలు ఎంత నాగరీకమైనవి అయినా, మలాలన్నీ చేరే టాంకుల్నీ, డ్రయినేజీల్నీ ఖాళీ చెయ్యవలసిన పని చిన్న కులాలవారే చేస్తున్నారు. పెద్ద కులాల్లో ఎంత పేద వారైనా, ఏ మురికి పనీ చెయ్యరు. చిన్న కులాల సమస్య అట్టడుగు శారీరక శ్రమలు చెయ్యవలసిన సమస్య కూడా. చిన్న కులాల్లో ఎక్కువ మందికి యజమాని కింద సేవకత్వం ఉంటుంది. పెద్ద కులాలకూ, చిన్న కులాలకూ మధ్య కొనసాగుతూవున్న సమస్య, శ్రమ దోపిడీ సమస్య. దానితో పాటు శ్రమ విభజన సమస్య కూడా. అది, యజమానితనాల - సేవకత్వాల సమస్య. శ్రమదోపిడీ సమస్యకు ఏది పరిష్కారమో, ఆ పరిష్కారం వేపు తలలు తిప్పకుండా, కులాల సమస్యని పరిష్కరించడం ఎవరికీ సాధ్యం కాదు.

కులాలు పోవాలంటే, భోజన సంబంధాలూ, వివాహ సంబంధాలూ నిరాటంకంగా ఏర్పడాలి. అటువంటి ఒక వంద కులాంతర వివాహాల్ని పరిశీలిస్తే, అవి 2 రకాలుగా కనపడవచ్చు.

1) పెద్ద కులాల మధ్య జరిగిన కులాంతర వివాహాలే ఎక్కువ భాగం ఉంటాయి.

2) చిన్న కులాలకూ, పెద్ద కులాలకూ మధ్య జరిగిన వివాహాలు చాలా తక్కువగా ఉండవచ్చు. ఈ తక్కువ వివాహాలు కూడా ఎలాంటి పరిస్తితుల్లో సాధ్యమై వుంటాయంటే, చిన్న కులాల్లో రిజర్వేషన్ల వల్ల గానీ, ఇతర కారణాల వల్ల గానీ, మేధా శ్రమలకు అవసరమైన చదువులు చదివిన యువకులనే, పెద్ద కులాల యువతులు ఇష్టపడిన వివాహాలై వుంటాయి. అంతే గానీ, చిన్న కులాల్లో రోడ్లు ఊడ్చే మనిషినో, డ్రయినేజీలు కడిగే మనిషినో, పెద్ద కులాల యువతీ యువకులు, తమ జీవితాల్లోకి తీసుకోరు.

అంటే, కులాలు పోవాలంటే, చిన్న కులాల జీవన పరిస్తితుల్లో చిట్టి పొట్టి సంస్కరణలతో చాలదు. శ్రమ దోపిడీ సంబంధాల నించి బయటపడే మార్గంలో పోరాటాలు అవసరమవుతాయి.

'కార్మికులు' అన్నప్పుడు, ఇస్త్రీ బట్టలతో, మెడలో గొలుసుతో, స్కూటర్ మీద ఫ్యాక్టరీకి పోయే టెక్నీషియన్‌నో, సూపర్‌వైజర్‌నో, అలాంటి ఉద్యోగుల్ని మాత్రమే దృష్టిలో పెట్టుకోకూడదు. అట్టడుగు శారీరక శ్రమల వారినే ప్రధానంగా దృష్టిలో పెట్టుకోవాలి. అలాంటి శ్రామికులందరూ చిన్న కులాల వారే అయి వుంటారు. గ్రామాల్లో అయితే వ్యవసాయ కార్మికులూ, మురికిని శుభ్రం చేసే కార్మికులూ, చిన్న కులాల వారే. పట్టణాల్లో అయితే, మురికివాడల్లో వుండే వారందరూ చిన్న కులాల వారే. ఇలాంటి కార్మికులు, నెలకోసారైనా కడుపు నిండా తినే సందర్భాలు వుండవచ్చు గానీ, వీరి నివాసాలు మాత్రం తర తరాలుగా గుడిసెలే, పాకలే; మహా అయితే, కిట కిటలాడే మురిగి సందుల్లో రేకుల షెడ్లులే.

పది కుటుంబాలకు కలిసి ఒక్కటే స్నానాల గూడు! శారీరక శ్రమల కార్మికుల్లో 3, 4 గదులూ, స్నానాల గదులూ, నీళ్ళూ, చిన్న పెరడూ గల ఇళ్ళు ఏ కుటుంబానికీ వుండవు. సదుపాయంగా వుండే నివాసమూ, నీళ్ళూ వుంటే తప్ప, అది మానవ జీవితం అవదు. భూమి మీద లక్షల, లక్షల ఎకరాల స్థలం వుంది. ఎన్ని కోట్ల మంది సుఖంగా నివసించడానికైనా అది సరిపోవడమే కాదు, ఎక్కువైపోతుంది. భూమి అంతా యజమానుల ఆధీనంలోనే వుంటుంది కాబట్టి, చిన్న కులాలకు గుడిసెలే గతి అవుతున్నాయి.



ఇది వరదలో మునిగిన చింపిరి గూడు. ఇందులో కూడా జనం నివసిస్తున్నారు.

దేశం నిండా వున్నవి ఇలాంటి గుడిసెలే. పాకలే. ఇవి కూడా మానవుల నివాసాలే!

చిన్న కులాల్లో కూడా ఒక చిన్న భాగం, శ్రమ దోపిడీ మీద జీవించే యజమానులుగా మారుతోన్నా, అత్యధిక భాగం ఈ నాటికీ శారీరక శ్రమల కార్మికులే. వారు 'కార్మిక వర్గం'లోకి చేరే భాగమే. కాబట్టి, వేల సంవత్సరాలుగా అట్టడుగు శారీరక శ్రమలకు మాత్రమే పరిమితమై వున్న చిన్న కులాలు, 'శ్రమ దోపిడీ' నించీ, 'దోపిడీ శ్రమ విభజన' నుంచీ కూడా బైట పడాలి. శారీరక శ్రమతో పాటు మేధా శ్రమ కూడా ; మేధా శ్రమతో పాటు శారీరక శ్రమ కూడా చెయ్యవలసిన విధంగా, అందరికీ శ్రమ విభజన మారాలి. అప్పుడు, అట్టడుగు శ్రమల భారం, చిన్న కులాల జనాభా మీద మాత్రమే పడడం తప్పుతుంది. అది అందరికీ బాధ్యత అవుతుంది. 'శ్రమ దోపిడీ' మీదా, 'దోపిడీ శ్రమ విభజన' మీదా పోరాటాలే, దేశాన్ని కుల సమస్య నించి విముక్తి చేసే మార్గం.

కానీ, చిన్న కులాల మేధావులకు, అగ్ర కులాల మీద వ్యతిరేక దృష్టి తప్ప, రిజర్వేషన్లు శాశ్వతంగా వుండాలనే దృష్టి తప్ప, ఇక ఏ దృష్టీ వుండదు. పెట్టుబడిదారీ విధానం మీద ఆగ్రహం వుండదు. అసలు శ్రమ దోపిడీ జరుగుతోందనే నమ్మకమే వుండదు. ఎందుకంటే, దాన్ని, వాళ్ళ గురువులు చెప్పలేదు కాబట్టి! శిష్యులు, గురువులు చెప్పని దాన్నీ, చెప్ప లేనిదాన్నీ కూడా నేర్చుకోవచ్చు. కానీ, అది ఈ శిష్యులకు అంగీకారం కాదు. ఎందుకంటే, వాళ్ళకి కూడా పెట్టుబడిదారులుగా ఎదగాలని అసలు కోరిక. కాబట్టి, శ్రమ దోపిడీని, తమ జనాభాకి నేర్పాలనుకోరు. రిజర్వేషన్లనే పెంచుకోవాలి! కులాలు వుంటేనే రిజర్వేషన్లు వస్తాయి కాబట్టి, కులాలు చక్కగా ఇలాగే వుండాలి! దళిత పెట్టుబడిదారులుగా ఎదగాలి!

వీరు ఈ పద్ధతిలోనే కొనసాగితే, వెయ్యి సంవత్సరాలకైనా, శ్రమ దోపిడీనే ప్రధాన సమస్యగా తీసుకోక తప్పదని గ్రహించక తప్పని దశకి చేరతారు. అది అనివార్యం అయి తీరుతుంది. సమస్యల కారణం అదే గనక.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ఎక్కువ తక్కువ కులాలు వున్న దేశంలో, మొదట ఆ కుల భేదాలు పోకుండా, ఆ కులాల శ్రామికులు వర్గ పోరాటాల కోసం కలుస్తారా? అది ఎలా సాధ్యం?

**జ**: కుల భేదాలు పోవడానికి ఏకైక మార్గం - కులాంతర వివాహాలు. అవి ఇక్కడొకటీ అక్కడొకటీ జరగడం కాదు. ఒకే కులంలో జరిగినట్టే, అభ్యంతరాలు లేకుండా కులాంతరాలు కూడా జరగాలి. అటువంటి వివాహాలు ఎక్కువగా జరగకుండా, కులాల మధ్య ఎన్ని రకాల మార్పులు జరిగినా, అది కుల భేదాలు పోవడం కాదు. అయితే, కులాంతర వివాహాలు నిరభ్యంతరంగా జరగాలంటే, చిన్న కులాల ఆర్థిక పరిస్తితులు అభివృద్ధి చెందాలి. అది జరగాలంటే, ఇప్పటి శ్రమ విభజన మారాలి. అట్టడుగు శారీరక శ్రమలూ, మురికి శ్రమలూ, చిన్న కులాల బాధ్యతగానే ఇప్పుడు సాగుతోంది. ఇది మారి, మొత్తం జనాభాలో పెద్ద కులాలు కూడా, ఆ శ్రమలు కూడా చేసే విధానం ఏర్పడాలి. ఇది జరగాలంటే, ఇప్పుడు వున్న ఉత్పత్తి సంబంధాల పద్ధతి మారాలి. కులాలు లేని దేశాల్లో కూడా శ్రమ దోపిడీ ద్వారా ఏర్పడిన శ్రమ విభజన మారాలంటే, అక్కడైనా ఉత్పత్తి సంబంధాల పద్ధతి మారవలసిందే. కులాలు వున్న చోట, కులాంతర వివాహాలు నిరభ్యంతరంగా జరగడమూ, కుల భేదాలు మాసిపోవడమూ - అనేది, చిన్న కులాల ఆర్థిక స్థాయి మారకుండా జరిగే వ్యవహారం కాదు. ఒకే కులంలో వివాహాలు జరగడానికి కూడా ఆర్థిక సమానత్వాలే మూల కారణంగా వుంటాయి. ఇప్పటి వరకూ జరిగిన కులాంతర వివాహాల్ని పరిశీలిస్తే, చిన్న కులాల ఆర్థిక స్థాయీ, దానివల్ల విద్యా స్థాయీ, ఉద్యోగాల స్థాయీ పెరిగిన సందర్భాల్లోనే, ఆ చిన్న కులాల యువతీ యువకులకు పెద్ద కులాల వారితో వివాహాలు జరగడం కనపడుతుంది. చిన్న కులాల్లో జనాభా మొత్తానికి ఆర్థిక స్థాయీ, విద్యా స్థాయీ పెరగడం, ఉత్పత్తి సంబంధాల మార్పు ద్వారానే సాధ్యం. అది, శ్రమ దోపిడీని తీసివేసే వర్గ పోరాటాల ద్వారానే సాధ్యం. కుల భేదాలు వుండగా కూడా వర్గ పోరాటాలు సాధ్యమే అనడానికి చరిత్రలో కనపడే అనేక సంఘటనలే సాక్ష్యం. ఒక పని స్తలంలో సమ్మె జరిగినప్పుడు, దానికి కుల భేదాలు ఆటంకం అవడం లేదు. తమ డిమాండ్ల కోసం ఏ కులం శ్రామికులైనా కలిసే సమ్మె చేస్తారు. ఒక దేశంలో, ఒక ప్రాంతంలో శ్రామికులు నేర్చుకోవలసిన వర్గ చైతన్యంలో ( నూతన భావాల్లో ), ఆ ప్రాంతపు ప్రత్యేక సమస్యల స్పృహ కూడా వుంటుంది. ఎక్కడి పోరాటాలు, అక్కడి ప్రత్యేక పరిస్తితులకు తగిన విధంగా సాగుతాయి. భారత దేశపు ప్రత్యేక పరిస్తితి కుల భేదాలు కాబట్టి, దాన్ని వ్యతిరేకించే భావాలన్నీ, ఆ కార్యక్రమాలన్నీ వర్గ పోరాటాల్లో భాగం అవుతాయి. 'వర్గ పోరాటాలు' అనేవి, ఆ యా ప్రాంతాల ప్రత్యేక సమస్యలతో సంబంధం లేకుండా సాగితే, అవి వర్గ పోరాటాలు కాలేవు. కుల భేదాలు వుండగా వర్గ పోరాటాలు సాధ్యమా - అనేది అర్థం లేని మాట. కుల భేదాల సమస్యా, పురుషాధిపత్యం సమస్యా, మత మూఢత్వాల సమస్యా - అన్నీ ఉత్పత్తి సంబంధాల్లో బానిసత్వం నించి తలెత్తిన సమస్యలే. ఆ బానిసత్వాన్ని నిర్మూలించుకోగలిగే మార్గంతో, అన్ని సమస్యల పరిష్కారాలూ లంకెలు పడి వుంటాయి. కుల భేదాల్ని వ్యతిరేకించేవారు, వర్గ భేదాల్నీ, శ్రమ దోపిడీనీ గ్రహించకపోవడం అంటే, తమకు తామే హాని చేసుకుంటున్నారని అర్థం.

కుల భేదాలు ఏ శ్రమ విభజన వల్ల తలెత్తాయో ఆ శ్రమ విభజనని మార్చుకోకపోతే, కుల భేదాలు పోవడం ఎప్పటికీ జరగదు.

H

# 81. పెట్టుబడిదారీ ధర

ఈ పుస్తకంలో, వడ్డీ వ్యాపారం చేసే 'బ్యాంకుల' గురించి ఏమీ చూడలేదు. షాపుల్లో నిల్వలు పడి వుండే 'సరుకు పెట్టుబడి' గురించి చూడలేదు. 'షేర్ల పెట్టుబడి' గురించీ, షేర్ల బిజినెస్ చేసే స్టాక్ ఎక్స్ఛేంజీల గురించీ చూడలేదు. 'పని దినం' గురించి వివరంగా చూడలేదు. 'నైట్ షిఫ్టు' గురించి గానీ, 'పార్ట్ టైమ్' ఉద్యోగాల గురించి గానీ, చూడలేదు. ఎగుమతులూ - దిగుమతులూ చూడలేదు. ఒక దేశపు డబ్బుని అమ్మి దానితో ఇంకో దేశపు డబ్బుని కొనే మారకాల గురించి చూడలేదు. ఇలాంటివి ఎన్నో చూడలేదు.

'పునరుత్పత్తి' గురించి చాలా పై పైన చూశాం. ఒక 'ఉత్పత్తి క్రమం' ముగిసి, సరుకు తయారై, దాని అమ్మకం జరిగి, ఆ పెట్టుబడి వెనక్కి వచ్చి, దానితో మళ్ళీ కొత్త సరుకు తయారైతే, అది 'పునరుత్పత్తి'.

ఒక సంవత్సరపు పునరుత్పత్తి, గత సంవత్సరపు స్థాయిలోనే జరిగితే, అది - 'సింపుల్ ( సాధారణ ) పునరుత్పత్తి.' అలా గాక, గతంలో కన్నా ఎక్కువ పెట్టుబడితో, ఎక్కువ స్థాయిలో పునరుత్పత్తి జరిగితే అది - 'విస్తరించిన పునరుత్పత్తి'.

పెట్టుబడిదారీ విధానంలో, ప్రతీ పునరుత్పత్తి క్రమమూ, దాని వెనకటి క్రమం కన్నా పెద్ద స్థాయిలో జరుగుతుంది. ఎందుకంటే, ఉత్పత్తి సాధనాల శాఖల్లో తయారయ్యే మొత్తం ఉత్పత్తి అంతా, మళ్ళీ ఉత్పత్తి సాధనాలుగా వాడవలసినదిగానే ఉంటుంది. ఆ మొత్తం ఉత్పత్తి 2 భాగాలుగా ఇలా వుంటుంది : ( 1 ) అన్ని శాఖలలోనూ ఖర్చయిన ఉత్పత్తి సాధనాలన్నీ, తిరిగి తయారై వుంటాయి. ( 2 ) వాటితోపాటు తయారయ్యే అదనపు ఉత్పత్తి కూడా, ఉత్పత్తి సాధనాల రూపంలోనే వుంటుంది. - మొత్తం, 2 భాగాల్నీ, ఉత్పత్తి సాధనాలుగానే వాడాలి. వీటి పరిమాణం, గత ఉత్పత్తి సాధనాల కన్నా ఎక్కువగా వుంటుంది.

అందుకే పెట్టుబడిదారీ విధానంలో, ప్రతీ ఉత్పత్తి క్రమమూ గతం కన్నా పెద్దదిగా ఉంటుంది. అది, గతం కన్నా ఎక్కువ అదనపు ఉత్పత్తిని ఇస్తుంది. ఉత్పత్తి సాధనాల శాఖల్లో ప్రతీ సారీ అదనపు ఉత్పత్తి సాధనాలు తయారవుతాయి కాబట్టి, వాటి వల్ల, మొత్తం సమాజంలో జరిగే ఉత్పత్తి క్రమం, గతం కన్నా పెద్దదిగా వుంటుంది.

ఉత్పత్తి క్రమం సైజు పెరగడం ప్రతీ ఒక్క పెట్టుబడిదారుడి దగ్గిరా జరగకపోయినా, అన్ని శాఖల్నీ కలిపి చూస్తే, మొత్తం 'సామాజిక పెట్టుబడి' విషయంలో, ప్రతి ఏటా పెట్టుబడి పెరిగిపోతూ, ఉత్పత్తి రాని పెరిగిపోతూ వుంటుంది. ఆ ఉత్పత్తి, 'అమ్మకాల' అవసరాలతో సంబంధం లేని స్థాయికి పెరిగిపోతూ, అమ్మకాలు ఆగిపోయే 'సంక్షోభానికి' దారితీస్తుంది.

**దోపిడీ సంబంధాల పునరుత్పత్తి :**

'పునరుత్పత్తి క్రమం' లో జరిగే పని,

ఉత్పత్తులు పునరుత్పత్తి అవడం ఒక్కటే కాదు ; పాత ఉత్పత్తి సంబంధాలు పునరుత్పత్తి అవడం కూడా. ఒక ఉత్పత్తి క్రమం ముగిసిన తర్వాత కూడా పెట్టుబడిదారుడు, మళ్ళీ పెట్టుబడిదారుడే. కార్మికులు, మళ్ళీ కార్మికులే. శ్రమ దోపిడీ, మళ్ళీ శ్రమ దోపిడీయే. పెట్టుబడిదారీ విధానం సాగినంత కాలమూ, ప్రతీ సరుకు పునరుత్పత్తి తోనూ, యజమానీ శ్రామిక సంబంధాలు కూడా పునరుత్పత్తి అవుతూనే వుంటాయి. కార్మిక వర్గం దాన్ని అడ్డుకుని ఆపే దాకా అది అంతే! - ఇక్కడ చూడని విషయాలన్నీ " కాపిటల్ పరిచయం" లో చూడవలసిందే.

' ధర ' గురించి వెనక పాఠాల్లో మనం చూసింది, చాలా తక్కువ. ఇక్కడ చూసేది కూడా తక్కువే. దీన్ని ' కాపిటల్ పరిచయం' లోనే వివరంగా చూడాలి. ' విలువే-ధర ' అని చెప్పుకున్నాం. కానీ, పెట్టుబడిదారీ ధర, అలా వుండదు. అది, విడి సరుకుల విషయంలో, విలువ కన్నా కొంత పైకో, కొంత కిందకో, వుంటుంది. ఇక్కడ పెట్టుబడుల మధ్య పోటీ, చాలా పెరిగిపోయి తీవ్రంగా వుంటే అది, ' జనరల్ లాభం రేటు' సూత్రాన్ని తెచ్చిపెడుతుంది. ఆ సూత్రం, శాఖల లాభం రేట్లు దాదాపు సమానం అవడానికి వీలైన ధరల్ని ఏర్పరుస్తుంది. ప్రతీ శాఖలోనూ విలువే ధరగా వుంటే, శాఖల లాభం రేట్లు ఎక్కువ తేడాలతో అయిపోతాయి. అలా జరిగితే, పెట్టుబడులు, ఎక్కువ లాభం రేట్లు వున్న శాఖల్లోకి మారిపోతూ, తక్కువ లాభం రేట్లు వున్న శాఖల్లో తగ్గిపోతూ వుంటాయి. ఆ పరిస్తితే, సమాన లాభం రేటుకి దారి తీస్తుంది. దీని వల్ల, కొన్ని శాఖల్లో ధర, విలువ కన్నా పైకీ ; కొన్ని శాఖల్లో ధర, విలువ కన్నా కిందకీ, ఏర్పడతాయి. దాని వల్ల, ఏ శాఖలో అదనపు విలువ, ఆ శాఖకే అందడం గాక, మొత్తం అన్ని శాఖలలోనూ ఉత్పత్తి అయ్యే ' మొత్తం అదనపు విలువ రాసి' అన్ని శాఖల మధ్యా పంపకాలయ్యే మార్గం ఏర్పడుతుంది.

పెట్టుబడిదారుడు, తన సరుకు కోసం నిర్ణయించే ధర, దాని విలువ కాదు. అసలు, పెట్టుబడిదారుడికి విలువ సంగతి తెలియదు. పెట్టుబడిదారుడు నిర్ణయించే ధర పేరు - ' ఉత్పత్తి ధర.' సరుకుని ఉత్పత్తి చేసి, సమాన లాభం సంపాదించడానికి అవసరమయ్యే ధర అది.

' ధర ' సంగతి అప్పుడే కాదు. ' ఉత్పత్తి ధర ' ని నిర్ణయించి సరుకుని బజార్లోకి పంపిన తర్వాత, దానికి, సప్లై - డిమాండ్ల ఆటంకాలు ఎదురవుతాయి. వాటి వల్ల, ఉత్పత్తి ధర కూడా, మళ్ళీ పైకో కిందకో మారవచ్చు ; లేదా మారకపోవచ్చు.

ఏ సరుకు అయినా, మార్కెట్లోకి వచ్చినప్పుడు, ' ఉత్పత్తి ధర ' నే చెప్పుకుంటుంది. మార్కెట్ పరిస్తితుల వల్ల, అది కొంచెం మారనూ వచ్చు ; మారక పోనూ వచ్చు. అంటే, ' విలువ' అనేది, మొదట జనరల్ లాభం రేటు సూత్రం ద్వారా ' ఉత్పత్తి ధర ' గా మారితే ; ఆ ఉత్పత్తి ధర, సప్లై డిమాండ్ల సూత్రం వల్ల ' మార్కెట్ ధర ' గా మారుతుంది.

మనం ఏదైనా సరుకుని బజార్లో కొన్నామంటే, అది ' మార్కెట్ ధరే '. అది,

' ఉత్పత్తి ధర ' తో సమానమైనది అయితే కావచ్చు ; ' విలువ ' తో సమానమైనది మాత్రం అవదు. ' విలువే - ధర ' అనే ' విలువ సూత్రానికి, ఇది వ్యతిరేకమే. కానీ, పెట్టుబడిదారీ పోటీల పునాది మీద, విలువ సూత్రం పనిచేసే తీరు ఇదే.

అయితే, ఒక్కొక్క విడి సరుకునీ చూడడం కాదు. సమాజంలో ఉత్పత్తి అయ్యే మొత్తం పెట్టుబడిదారీ సరుకుల రాసిని చూడాలి. దాని మార్కెట్ ధరల మొత్తం అంతా కలిసినది - దాని విలువల మొత్తం. ఆ ' మొత్తం విలువ ' లో వున్న ఉత్పత్తి సాధనాలే, అన్ని శాఖలలోనూ ఖర్చయిన ఉత్పత్తి సాధనాలు. ఆ రాసిలో వున్న జీతాలే, అన్ని శాఖల జీతాలు. ఆ రాసిలో వున్న అదనపు విలువే, అన్ని శాఖల అదనపు విలువ. విడి విడి శాఖల ధరల్ని చూసినప్పుడు, అవి, అసలు విలువ కన్నా కొన్ని పైకీ, కొన్ని కిందకీ వుంటాయి. మొత్తం రాసికి మాత్రం, ధరల మొత్తమే - విలువల మొత్తం. ఇలా ఏర్పడే ధరల పద్ధతి వల్ల, కార్మికులకూ పెట్టుబడిదారులకూ వుండే సంబంధాలు, ఎక్కడి కక్కడ విడి విడి సంబంధాలుగా గాక, వర్గ సంబంధాలుగా మారిపోతాయి.

వెనకటి కాలపు బానిస యజమానుల సమాజాన్ని తీసుకుంటే; ఒక యజమాని దగ్గిర తయారయ్యే ఉత్పత్తిలో ఎక్కువ భాగం, అమ్మకాలలోకి వెళ్ళకుండా, ఆ యజమాని కుటుంబం కోసమే ఖర్చయి పోతుంది. కాబట్టి, ఒక యజమాని దగ్గిర వున్న బానిసల అదనపు ఉత్పత్తి, ఆ యజమానికే అందుతుంది. అది ఇతర యజమానులకు వెళ్ళదు. ఇతర యజమానుల నించి కొంత ఉత్పత్తి ఈ యజమానికి రాదు - ( వడ్డీలు సంపాదించినప్పుడు తప్ప ).

భూస్వాముల సమాజంలో కూడా సరుకుల అమ్మకాలు అతిగా వుండవు కాబట్టి, అక్కడ కూడా అంతే. ఒక భూస్వామి దగ్గిర వున్న కౌలు రైతుల అదనపు ఉత్పత్తి, ఆ భూస్వామికే అందుతుంది.

కానీ, పెట్టుబడిదారీ విధానంలో అలా కాదు. మొత్తం పెట్టుబడిదారులందరి సరుకుల రాసులూ అమ్మకాల్లో నించే నడుస్తాయి. అందరికీ దాదాపు సమాన లాభం రేట్లు వచ్చే లాగ ధరలు ఏర్పడతాయి. ఒక పెట్టుబడిదారుడి దగ్గిర పనిచేసే కార్మికుల అదనపు విలువలో కొంత భాగం, బైటి శాఖల పెట్టుబడిదారులకు కూడా అందవచ్చు. లేదా, బైటి కార్మికుల అదనపు విలువల్లో కొన్ని భాగాలు, ఈ పెట్టుబడిదారుడికి అందవచ్చు.

వేరు వేరు దేశాల మధ్య కూడా సరుకులు ఇటూ అటూ అమ్మకాలవుతాయి. ఒక దేశపు కార్మికుల అదనపు విలువలో కొంత భాగం విదేశీ పెట్టుబడిదార్లకు అందవచ్చు. అటు నించి ఇటు కూడా. అందుకే, అన్ని దేశాల కార్మికులకూ సంబంధాలు ఏర్పడతాయి.

బానిస యజమానుల కాలంలో కన్నా, భూస్వాముల కాలంలో కన్నా, పెట్టుబడిదారుల కాలంలో, వర్గాల సంబంధాలు, మరింత పటిష్టమైన లంకెలతో అల్లుకు పోతాయి. ఈ వివరాలన్నీ ' కాపిటల్ - పరిచయం ' లో చూడాలి.

**[ ఈ పాఠంలో ప్రశ్నలు లేవు. ]**

# 82. పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు, 'లాభం' గురించి ఏం చెపుతారు?

**ఆ ప్రశ్నకి జవాబు :**

ఆ ఆర్థిక వేత్తలు, ' పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలే ' అయితే, వాళ్ళు ' లాభం' గురించి ఏం చెపుతారనే ప్రశ్న ఏమిటి? ఇంకేం చెపు తారు? " లాభాలూ వడ్డీలూ - పెట్టుబడి హక్కు" అని చెపుతారు. " కౌలు - భూమి హక్కు" అని చెపుతారు.

**రెండో** ప్రశ్న : " హక్కులు సరే ; ఆ లాభాలూ అవీ, ' సరుకు' లో నించి ఎలా వస్తాయని చెపుతారు?"

**వాళ్ళ జవాబు :** " ఎలా వచ్చేదేమిటి? వడ్డీలూ కౌళ్ళూ, సరుకు కోసం అయ్యే ఖర్చులే. ఆ ఖర్చులు, ఆ పేర్ల తోటే సరుకు లోకి చేరతాయి. ఆ పేర్ల తోటే బైటికి వస్తాయి. ఇక, లాభమా? దాని కోసం, ' ఖర్చుల' మీద కొంత వేసుకుంటే, అదీ వస్తుంది. లాభం రాకపోతే పెట్టుబడి ఎవరు పెడతారు? లాభం కోసం ' కొంత వేసు కుంటే ', అది రాకేం చేస్తుంది?"

**మూడో** ప్రశ్న : " 'లాభం' కోసం ఆ ' కొంత'ని ఏ లెక్కతో వేసుకుంటారు? ఊరికే వేసుకునేదాన్ని ' కొంతే' ఏమిటి? వెయ్యి రెట్లు ఎందుకు వేసుకోరు?"

"................................"

జవాబు రాదు.

**నాలుగో** ప్రశ్న : "ఉత్పత్తి సాధనాల విలువ అయితే, సరుకుకి బదిలీ అయి ఆ సరుకుని అమ్మెయ్యగానే వెనక్కి వచ్చే స్తుంది. ఆ వెనక్కి వచ్చిన విలువతో, కొత్త ఉత్పత్తి సాధనాలు వస్తాయి. వాటి కోసం, మళ్ళీ కొత్త విలువని పెట్టనక్కరలేదు. ఆ విలువని ఒక్క సారి పెడితే చాలు. ఆ పాత విలువ తోనే కొత్త ఉత్పత్తి సాధనాల్ని మళ్ళీ మళ్ళీ కొంటూ వుండవచ్చు. మరి, కౌలూ - వడ్డీ లాభాలూ కూడా సరుకు కోసం ఖర్చ యినవే అయితే, వాటి కోసం, ఒక్క సారి చెల్లిస్తే ఎందుకు చాలదు? వాటి కోసం, ప్రతీ సారీ కొత్త విలువల్ని ఎందుకు చెల్లిస్తూ వుండాలి?"

"................................"

ఇక జవాబులు రావు.

" లాభం ఎలా వస్తుంది?" అనే ఒక్క ప్రశ్నకి మాత్రమే పెట్టుబడిదారీ మేధావులు, ఉద్వేగంగా, " వేసుకుంటే రాదా?" అంటారు. " లాభం రాకపోతే పెట్టుబడి ఎవరు పెడతారు?" అని కూడా అంటారు మళ్ళీ మళ్ళీ, జవాబులు ఇవ్వలేని ప్రశ్నలు వేసినట్టు!

" లాభం ఊరికే వేసుకుంటే వచ్చేదే అయితే, అది 50 శాతమో, 100 శాతమో మాత్రమే రావడం ఏమిటి? ఒక లక్ష శాతం లాభం ఎందుకు వేసుకోరు?" అని మళ్ళీ అడగండి!

జవాబులు పూర్తిగా ఆగిపోతాయి. దానికి వంకర టింకరగా అయినా చెప్ప లేరు కాబట్టి, ఇక ఆ మేధావులు తర్కం లోకి దిగరు.

' శ్రమ దోపిడీ' గురించి ఎవరికీ

తెలియని కాలంలో, విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎలాంటి ఆర్థిక పాఠాలు చెప్పేవారో అచ్చు అలాగే, ఈ నాటికీ అవే పాఠాలు చెబుతున్నారు.

ఈ నాటికీ ఉపాధ్యాయులు, "భూమికి కౌలూ, పెట్టుబడికి వడ్డీ - లాభాలూ" బోధిస్తున్నారు. 2 వ తరగతి పాఠాల నించే 'వడ్డీ' ల మీదా, 'లాభాల' మీదా, లెక్కలు ఉంటాయి. అంత చిన్న తరగతిలో ప్రారంభమయ్యే ఆ బోధన, ఆ విద్యార్థులు పీ.హెచ్‌డీ లు పూర్తి చేసే వరకూ అదే పద్ధతిలో సాగుతుంది.

చివరికి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్లు పొందిన విద్యార్థులు, కౌళ్ళనీ వడ్డీ లాభాల్నీ గొప్ప హక్కులుగా భావిస్తూ విద్యలు పూర్తి చేస్తారు. ఇక వారు, ఆ విద్యలనే కొత్త విద్యార్థులకు బోధించే టీచర్లుగా, లెక్చెరర్లుగా, ప్రొఫెసర్లుగా తయారవుతారు. ఆ క్రమం, ఏటా అలా సాగిపోతూనే వుంటుంది.

ఆ మేధావుల్లో ఎవ్వరూ, 'శ్రమ దోపిడీ' అనే మాట విని వుండరు. ఏ పాఠంలో అయినా, ఒక్క సారి, "మార్క్స్ అనే ఒకాయన ఏదో చెప్పాడు" అని ఒక్క ముక్క చదివి వుంటే, ఆ ముక్కని ఆ పూటే వదిలేస్తారు. మళ్ళీ వారి మేధస్సుల్ని కౌళ్ళే, వడ్డీ లాభాలే, పరిపాలిస్తాయి.

తక్కువ డబ్బుని ఎక్కువ డబ్బుగా మార్చే లక్ష్యం పెట్టుకున్న పెట్టుబడిదారీ విధానంలో, ఏ పెట్టుబడిదారుడి సరుకుల అమ్మకాలకూ, ఏ ప్రాంతమూ సరిపోదు. తక్కువ సరుకులనే అమ్ముకుని, తక్కువ లాభాన్నే సంపాదించడం, పెట్టుబడిదారుల లక్ష్యం కాదు. డబ్బు రాసులు కుప్ప తెప్పలుగా రావాలి. దాని కోసం, ప్రతీ పెట్టుబడిదారీ కంపెనీకీ, ఒక్క దేశమే కాదు, అన్ని దేశాలూ కావాలి. మొత్తం ప్రపంచమే కావాలి. భూగోళమే కాదు, సూర్యుళ్ళూ చంద్రుళ్ళూ, నక్షత్రాలూ, సమస్త ప్రకృతీ కావాలి. ఆకాశంలో కూడా, చంద్రుళ్ళో కూడా, నక్షత్రాల్లో కూడా, వ్యాపారాలు చెయ్యాలి. లాభాల రాసులు మితి మీరి అందుతూ వుండాలి.

భూమి మీద లక్ష సమస్యలు వున్నాయి.

జనాలకు మంచి నీళ్ళే లేవు. కానీ, పెట్టుబడిదారులు, చంద్రుడి మీదకి టూరిస్టుల్ని తీసుకువెళ్ళే బిజినెస్‌ల కోసం సైన్సు ప్రయోగాలు చేయిస్తున్నారు. పేద జనాలకు మంచి నీళ్ళు ఇవ్వడం వల్ల వచ్చే లాభం కన్నా, ధనవంతులకు చంద్రుణ్ణి చూపించడం వల్ల వచ్చే లాభం రేటు చాలా ఎక్కువ కదా? క్రమంగా, చంద్రుడి మీద కూడా వేరు వేరు పెట్టుబడిదారీ కంపెనీల మధ్య యుద్ధాలు జరుగుతాయి.

వెనకటి కాలపు రాజులు, నిష్కారణంగా, దుర్మార్గంగా, పక్క రాజ్యాల మీద పడి, అక్కడి జనాల్ని చంపి, ఆ భూముల్ని ఆక్రమించినట్టు, పెట్టుబడిదారీ రాజులు చేసే పని కూడా అదే. వెనకటి రాజుల సైనికులు కర్రలతో, కత్తులతో యుద్ధాలు చేస్తే, పెట్టుబడిదారీ రాజుల సైనికులు, తుపాకుల నించీ అణుబాంబుల దాకా, కర్రల్ని మించిన అనాగరిక ఆయుధాలతో ప్రకృతినే సర్వ నాశనం చేస్తూ వుంటారు.

'లాభం' కోసమూ, దాని పెరుగుదల కోసమూ, తప్పనిసరి అయ్యే ఆ మార్గం, పెట్టుబడిదారుల అదుపుల్ని కూడా దాటిపోయి, వాళ్ళని కూడా నిస్సహాయుల్ని చేస్తుంది. సరుకు ఉత్పత్తి విధానంలో, ఆ

లాభం రేటు విధానంలో, ఆ శ్రమ దోపిడీ విధానంలో, అక్కడ వున్న సూత్రం, పెట్టు బడిదారులకు కూడా అర్థం కానిదై పోతుంది.

ఏ అమాయక పెట్టుబడిదారుడైనా, "నా కీ చిన్న వ్యాపారం చాలు. తక్కువ లాభం చాలు" అని పోటీ ప్రయత్నాలన్నీ విరమించుకుంటే, ఆ శాఖలోనే నిత్యం పోటీలతో విజృంభించే ఇతర పెట్టుబడి దారులు, ఉత్పత్తి శక్తుల్ని పెంచి, సరుకు గుట్టల్ని పెంచి, పెద్ద పెద్ద ప్రకటనలు గుప్పించి, తమ సరుకులనే చవగ్గా అమ్ముకోగలుగుతారు. వ్యాపార జిత్తుల్ని వదిలేసిన అమాయక పెట్టుబడిదారుడు, కొన్నాళ్ళకి క్రమంగా తన పరిశ్రమనే మూసు కోవలసి వస్తుంది. లాభం సంపాదించే వృత్తి ప్రారంభించిన వాళ్ళకి పోటీ సూత్రాన్ని పాటించడం అనివార్యం అయిపోతుంది. లేకపోతే, వెనకబడిపోవచ్చు కూడా. వాళ్ళు తవ్వుకున్న గొయ్యే అది.

లాభ సూత్రం, పెట్టుబడిదారుణ్ణి, నిత్యం మరింత దోపిడీ కోసం, మరిన్ని పోటీల వేపూ, మరిన్ని ఆక్రమణల వేపూ, మరిన్ని యుద్ధాల వేపూ, లాక్కుపోతూ వుంటుంది.

ఇతరుల శ్రమని దోచే తప్పుడు మార్గం, దోపిడీదారుల్ని, అజ్ఞానులుగా, క్రూరులుగా, హక్కుల చోరులుగా, ప్రకృతి విధ్వంసకులుగా, స్వంత శ్రమతో జీవించలేని అసమర్థులుగా, ఆత్మాభిమాన హీనులుగా, చరిత్ర నిండా ఇప్పటికే చిత్రించి వుంచింది. పెట్టు బడిదారులు, చరిత్ర చేత, ఇంకా ఇంకా ఆ పాత చిత్రాలే మళ్ళీ మళ్ళీ నగిషీలతో గీయించుకుంటున్నారు.

ఈ పుస్తకంలో మనం ఇప్పటి దాకా, ఇన్ని పాఠాల్లో చూసిన విషయాల్లో ఒక్కటి కూడా, పెట్టుబడిదారీ పుస్తకాలు చెప్పే ఆర్థిక పాఠాల్లో కనపడదు. ఈ పుస్తకంలో చదివిన విషయాలు తీసుకుపోయి పరీక్షల్లో రాస్తే, ఆ విద్యార్థులు, తప్పకుండా ఫెయిలయి తీరతారు. వాళ్ళు కమ్యూనిస్టులై పోయారనే అనుమానంతో, వాళ్ళ వెనకాల పోలీసులు కూడా పడతారు. కాబట్టి, పరీక్షల్లో చక్కగా పేసవ్వాలంటే, నేర్చుకో వలసిన పెట్టుబడిదారీ పాఠాలు వేరే వున్నాయి. వాటినే పరీక్షల్లో దించండి! "పనిముట్లే పనులు చేస్తాయి. యంత్రా లైతే మొత్తం శ్రమ అంతా అవే చేస్తాయి. పెట్టుబడిదారులందరూ దేశానికి ఉత్పత్తులు అందించే సేవలు చేసే మహానుభావులు. పని వాళ్ళందరూ రోజువారీ కూలి డబ్బుల తోటీ, నెలవారీ జీతాల తోటీ, చాలా సుఖంగా జీవిస్తూ వుంటారు. శ్రామికులకు బతుకు దెరువులు చూపించి, వారిని దయతో పోషించేది యజమానులే. అసలు ఈ రాజ్యాంగం, శ్రామిక ప్రజల్ని కన్న బిడ్డల్లా పాలిస్తూ వుంటుంది. శ్రామికులే పనులు ఎగ్గొడుతూ, యజమానుల్ని అశాంతి పాలు చేస్తూ, వారికి శాంతి భద్రతలు లేకుండా చేస్తూ వుంటారు. యజమానులు, ఉత్తములుగా, ఉదారులుగా, గంభీరులుగా, దానకర్ణులుగా, దయాశీలురుగా ఉంటారు. వెనకటి కాలంలో రాజ్యాలు పాలించిన రాజులందరూ ఉత్తమోత్తములు. ఈ కాలం నాటి పెట్టుబడిదారీ రాజ్యాల్ని పాలించే మంత్రులందరూ మహా కష్ట జీవులు". - ఈ రకంగా, దోపిడీ సమాజాల ఆర్థిక శాస్త్ర సారాంశాల నించి పుట్టుకొచ్చిన తత్వ

శాస్త్రాల్ని కూడా కంఠతా పట్టేసి, పరీక్షల పేపర్లు నింపెయ్యండి! ముందు పేసవడం చూసుకోండి! తర్వాత, ఆ పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రాల్నీ, తత్వ శాస్త్రాల్నీ అవతల పారెయ్యండి!

అసలు జ్ఞానం వేరే వుంది. బానిస యజమానుల కాలం నించీ ఈ నాటి దాకా, ప్రపంచంలో ఎటు చూస్తే అటు, మానవ సంబంధాలు, శ్రమ దోపిడీ సంబంధాలుగా, లాభాల యుద్ధాల సంబంధాలుగా, యజమానీ శ్రామిక సంబంధాలుగా, వికృత ఆధిపత్య సంబంధాలుగా, ఎక్కడి కక్కడ శత్రు వైరుధ్యాలతో నిండి పోయి వున్నాయి.

అమెరికా వేపు చూడండి!
ఇంగ్లాండ్ వేపు చూడండి!
ఆఫ్రికా వేపు చూడండి!
ఇండియా వేపు చూడండి!
ఎటూ చూస్తే అటే!
ఎక్కడ చూస్తే అక్కడే!
ఆధిపత్యమూ, సేవకత్వమూ!
సిరుల రాసులూ, బికారితనాలూ!
ఆనందమూ, విషాదమూ!
అజ్ఞానమూ, అంధకారమూ!
అవే మళ్ళీ మళ్ళీ!
ప్రతీ చోటా అవే!
ప్రతీ ఏటా అవే
ప్రపంచ చిత్రం అదే!

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. మార్క్సుని, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు చదవరా?

**జ**: చదవకుండానే, మార్క్సు ఏం చెప్పాడో వాళ్ళకి తెలుసు. మార్క్సు చెప్పింది వాళ్ళకి చదవకపోయినా నచ్చదు; చదివితే అసలే నచ్చదు.

**2**. 'న్యాయం' అనేది వాళ్ళకి పట్టదా?

**జ**: ఎందుకు పట్టదు? వర్గ సమాజంలో, ప్రతీ భావానికీ వర్గ - స్వభావం వుంటుంది. దోపిడీదారులకు వాళ్ళ లాభమే వాళ్ళ న్యాయం. వాళ్ళ న్యాయం, వాళ్ళకి చక్కగానే పడుతుంది.

**3**. "వాళ్ళ న్యాయం, వీళ్ళ న్యాయం" అని కాదు. అసలు న్యాయం ఒకటి ఉండదా?

**జ**: పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, అసలు న్యాయం వేపు చూస్తే, వాళ్ళకి ధర రాసులూ, అవార్డులూ, సన్మానాలూ, నోబెల్ ప్రైజులూ ఎలా వస్తాయి? అసలు న్యాయం వాటిని ఇస్తుందా? పైగా అది, " లేచి నీ కోసం నువ్వు పని చెయ్యి" అంటుంది కదా?

**4**. ఏడిసినట్టే వుంది. అయితే పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు ప్రపంచానికి ఏమీ నేర్పలేరా?

**జ**: ఎందుకు నేర్పలేరు? వాళ్ళ ప్రపంచానికి వాళ్ళు చాలా నేర్పుతారు. వాళ్ళ ప్రపంచం వాళ్ళకి వుంది.

**5**. ఈ శ్రమ దోపిడీ నిజాన్ని ఒక పెట్టుబడిదారుడు, నిజంగానే అర్థం చేసుకున్నాడనుకుందాం. 'ఇంత కాలం నించీ శ్రమ దోపిడీ మీద జీవిస్తున్నానా?' అని అతనికి చాలా బాధ కలిగిందనుకుందాం. అతని కుటుంబం అంతా అతని పరిశ్రమ ⟶

మీదే ఆధారపడి వుంటుంది. అప్పుడు అతనేం చెయ్యాలి? తన ఆస్తిని ప్రభుత్వానికి ఇచ్చెయ్యాలా?

**జ :** ఆ పెట్టుబడిదారుడు నిజంగానే శ్రమ దోపిడీని అర్థం చేసుకున్నవాడైతే, ఆ రకంగా జీవిస్తున్నందుకు బాధ పడుతున్నవాడైతే, ఆ తర్వాత ఏం చెయ్యాలో అతనికే తెలుస్తుంది. అది తెలియకపోతే, అతను శ్రమ దోపిడీని అర్థం చేసుకున్నట్టు అవదు. అయినప్పటికీ అతను తక్షణమే పరిశ్రమని మూసివెయ్యలేడు. ఆ పరిశ్రమలో తను కేవలం పెత్తనం చెయ్యడమే కాకుండా, సరుకు ఉత్పత్తి కోసం అవసరమయ్యే శ్రమల్లో ఏదో ఒక శ్రమని నేర్చుకోవడం ప్రారంభించాలి. తను కూడా రోజూ కొన్ని గంటలైనా ఆ శ్రమ చెయ్యాలి. ఒక జీతం తీసుకోవాలి. కార్మికుల పని పరిస్తితులన్నీ సవ్యంగా వున్నాయో లేదో పరిశీలించి, అలాంటి ఏర్పాట్లన్నీ చెయ్యాలి. కార్మికులకు మంచి జీతాలు ఇవ్వాలి. తన కార్మికులు పెట్టుకున్న సంఘానికి ఆటంకాలు కల్పించకుండా దాన్ని ప్రోత్సహించాలి. ఇతర పరిశ్రమల్లో కార్మిక సంఘాలకు కూడా ప్రోత్సాహం ఇవ్వాలి. ఇలాంటివి ఎన్ని చేసినా, లాభాలూ వడ్డీలూ మిగులుతాయి, కొంత తగ్గినా. తన పిల్లల్ని, తన పరిశ్రమకు వారసులుగా తయారుచెయ్యడం కాకుండా, వాళ్ళూ ఉద్యోగాలు చేస్తూ జీతాల మీద జీవించే వాళ్ళుగా తయారుచెయ్యాలి. రేపు జరగబోయే సోషలిస్టు విప్లవంలో, రెండో మాట లేకుండా తన స్వంత ఆస్తి హక్కుల్ని వదులుకోవడానికి ఈ నాటి నించీ ఉత్సాహంతో వుండాలి. శ్రమ దోపిడీని నిజంగా గ్రహించుకున్న ఆస్తి పరుడు, దాని నించి బయటపడే మార్గాల్ని అనుసరించాలి. ఆస్తిని కూడబెట్టే ప్రయత్నాలూ, వడ్డీ లెక్కలూ, విలాస జీవితాలూ, వంటివి వదులుకోవాలి. దోపిడీ సమాజంలో వున్న ప్రభుత్వం కూడా ఒక పెట్టుబడిదారుడే. తన చేతిలో వున్న ఆస్తిని దానికి అప్పజెపితే, దాన్ని ఇంకో పెట్టుబడిదారుడికి ఇచ్చినట్టే అవుతుంది. దాని వల్ల నిజంగా అవసరాలు గల వాళ్ళకి ఏ మేలూ జరగదు. ఆస్తిని సమాజానికి అప్పగించే పరిస్తితి ఇంకా లేనప్పుడు, దాన్ని సంఘ సంస్కరణల కోసం ఉపయోగించడమే మంచి మార్గం. తన కుటుంబ అవసరాలు కనీసంగా తీర్చుకుంటూ, ఇక మిగిలిన లాభంతో తనకు ఏది సాధ్యమో అది చెయ్యడానికి ప్రయత్నించాలి.

**6**. శ్రమ దోపిడీ రహస్యాన్ని తెలుసుకున్న కార్మికులు ఏం చెయ్యాలి?

**జ :** మొదట పని స్తలాల్లో సంఘాలు పెట్టుకోవాలి. ఆ సంఘాల నాయకులు ఆ కార్మికుల్లో నించే వుండాలి. ఆ పని స్తలంలో కార్మికుడు కాని ఏ మనిషీ, నాయకుడిగా వుండ కూడదు. పని స్తలంలో వచ్చే సమస్యల మీద యజమానితో మాట్లాడవలసింది కార్మికులే. వాళ్ళ సమస్యలు వాళ్ళకి తెలుస్తాయి కాబట్టి, కార్మికులు ఆ వ్యవహారాలు చూసుకోగలరు. తమకు కావలసిన సలహాలు తమకు నమ్మకస్తులైనవారి నించి తీసుకోగలరు. రోజువారీ సమస్యల మీద, తమ కార్మిక సంఘంలో చర్చలు చేసుకోవడం ఒక వేపూ, సిద్ధాంత విషయాలు నేర్చుకోవడం ఇంకో వేపూ జరుగుతూనే ⟶

వుండాలి. చదువురాని కార్మికులకు చదువు నేర్పడాన్ని సంఘం ప్రధాన అంశంగా తీసుకోవాలి. ప్రతీ కార్మికుడూ తమ సంఘ కర పత్రాల్నీ, రోజువారీ పత్రికల్నీ, చదువుకో గలిగే స్థాయిలో వుండాలి. సంఘంలో తప్పనిసరిగా చాలా తరుచుగా అధ్యయన తరగతులు వుండాలి. వెనకటి కాలంలో బానిసలు అనే వాళ్ళు వుండే వారని ఈ నాటి మేధా శ్రమల కార్మికులకు కూడా తెలీదు. వెనకటి నించీ వున్న యజమానీ శ్రామిక సంబంధాల గురించి ఈ నాటి కార్మికులకు తెలియాలి. చదువు సరిగా రాని వారికి, రోజువారీ పత్రికలు చదివి వినిపిస్తూ, పెట్టుబడిదారీ పార్టీల్నీ, వాళ్ళ రాజకీయ ఎత్తుగడల్నీ వివరిస్తూ వుండాలి. ఒక వేపున రోజువారీ సమస్యల మీద కార్యక్రమాలు నిర్వహించు కుంటూనే, శ్రమ సంబంధాల గురించిన విషయాలన్నీ నేర్చుకోవాలి. ఆ రకంగా కొత్త భావాలు నేర్చుకునే కార్మికులకు, తర్వాత వాళ్ళ కార్యక్రమాలు వాళ్ళకే తెలుస్తాయి.

**7**. ఇంజనీరూ, ప్రొఫెసరూ వంటి మేధా శ్రామికులు ఉంటారు. అటువంటి ఒక ఉత్పాదక శ్రామికుడికి మంచి జీతమే వుంది, అతను కొంత అదనపు విలువని పోగొట్టుకున్నప్పటికీ. స్వంత ఇల్లు వుంది. రోజువారీ అవసరాలకు ఏమీ లోటు లేకుండా వుంది. నెల నెలా కొంత ఆదాయం మిగులుతూనే వుంది. ఆ మిగులుతో ఏం చెయ్యాలి? కొంత భూమిని కొని దాన్ని కౌలుకి ఇచ్చి, కౌలు సంపాదించాలా? లేక, ఆ డబ్బుతో ఒక ఇల్లు కొని దాన్ని అద్దెకి ఇచ్చి, అద్దె సంపాదించాలా? అలాంటి పని ఏది చేసినా, అది కార్మిక చైతన్యం గల వ్యక్తి చెయ్యదగ్గ పని కాదు గదా? మరి, ఆ వ్యక్తి, తన పొదుపుల్ని ఏం చెయ్యాలి? అతను కార్మిక జీవితం ఎలా గడపాలి?

**జ :** శ్రమ దోపిడీని వ్యతిరేకిస్తూ, కార్మిక చైతన్యంతో జీవించదల్చుకున్న మనిషి, కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ సంపాదించే మార్గాల్ని, ఆ ఆదాయాలు ఎంత చిన్నవి అయినా, ఆ మార్గాల్ని ఎన్నడూ అంగీకరించకూడదు. జీతాల్లో నించే పొదుపులు మిగిలితే, వాటిని జాగ్రత్తగానే వుంచుకోవాలి. డబ్బుని ఇళ్ళల్లో దాచుకునే పరిస్తితి వుండదు కాబట్టి, ఆ పొదుపుల్ని బ్యాంకుల్లోనో, పోస్టాఫీసుల్లోనో పెట్టుకోవలిసిందే. వాటి ద్వారా కూడా వడ్డీలు వస్తాయి. అయినా, అది నేరం కాదు. డబ్బుని రక్షించుకోవడానికి అంత కన్నా మార్గం వుండదు కాబట్టి. అనారోగ్య పరిస్తితులు వస్తాయి. వృద్ధాప్యం వుంటుంది. వాటి కోసం డబ్బు అవసరం. అయినా, పొదుపుల్లో నించి వీలైనంత తీసి, చాలా పనులు చెయ్యవచ్చు. ముఖ్యంగా, మంచి సమాజం కోసం కృషి చేస్తోన్న సంఘాలతో సహకరించవచ్చు. అనేక మంది నిరుపేద విద్యార్థులు వుంటారు. వారిని ఆదుకోవచ్చు. ఇలాంటి మార్గాలేవో ఆలోచించుకోవాలి. స్వంత పిల్లలు వుంటే, వాళ్ళని చదివిస్తే వాళ్ళ ఉద్యోగాలతో వాళ్ళే జీవిస్తారు. వాళ్ళ కోసం ఆస్తులు కూడబెట్టి ఇవ్వనక్కరలేదు. మేధా శ్రామికులందరూ ఆస్తులు సంపాదించి, ‘ చిన్న బూర్జువాలుగా’ జీవిస్తూ వుంటారు. ‘అది తప్పు’ అని గ్రహించిన వాళ్ళు ఆ దారి పట్టలేరు.

★

# 83. పెట్టుబడిదారీ సృష్టి సంక్షోభాలు!

పెట్టుబడిదారీ విధానం, మొత్తం సమాజానికి తెచ్చిపెట్టే ప్రత్యేక విపత్తు - 'సంక్షోభాలు.' ఇది, సరుకుల అమ్మకాలు మందగించే, ఆగిపోయే పరిస్తితి! ఇది, సరుకుల్ని అమ్ముకోలేని పరిస్తితి! ఈ పరిస్తితి ఎందుకు ఏర్పడుతుందంటే, అనేక కంపెనీల్లో సరుకుల గుట్టలు, మార్కెట్ అవసరాల్ని మించిపోయి ఆకాశం ఎత్తున పెరిగిపోవడం వల్ల. ఈ గుట్టలు పెరగడం ఎందుకు జరుగుతుందంటే, ఆ ఉత్పత్తుల్ని తయారుచేయించే వాళ్ళ మధ్య సమిష్టి ప్లాను లేకపోవడం వల్ల. ఆ సమిష్టి ప్లాను లేకపోవడం ఎందుకు జరుగుతుందంటే, వాళ్ళందరూ ప్రైవేటు పెట్టుబడిదారులు అవడం వల్ల. ప్రభుత్వం కూడా ఒక ప్రైవేటు పెట్టుబడిదారుడే. కానీ ప్రభుత్వం, మొత్తం శ్రమ దోపిడీ వర్గాన్ని నిలబెట్టి, దానికి అనుకూలించే సంఘం.

పెట్టుబడిదారులందరికీ ఎవరి ప్లాను వాళ్ళకి వుంటుంది. కానీ ఒకళ్ళ ప్లాను రహస్యం ఒకళ్ళకి తెలీదు. అందరూ ఒకటై ఆలోచించే సమిష్టి ఉత్పత్తి విధానం వుంటే తప్ప, వ్యక్తిగత లాభాల రంధితో నడిచే వాళ్ళ మధ్య సమిష్టి ప్లాను ఎలా సాధ్యం? పెట్టుబడిదారులందరికీ ఆదర్శం - ఎక్కువ లాభం రేటు! ఇతరుల కన్నా ఎక్కువ రేటు!

ఎక్కువ లాభం అంటే, ఎక్కువ డబ్బు! ఆ పెరిగే డబ్బుతో, ఇతర శాఖల్లో కూడా కంపెనీలు పెట్టడం! ఆ శాఖల నించి కూడా లాభాల రాసులు, ఎక్కువ లాభాల రాసులు, రావాలి! ఈ ప్రయత్నాలు చేసేది పెద్ద పెద్ద పెట్టుబడిదారులందరూ! పెట్టుబడిదారుడు అభివృద్ధి చెందడం అంటే, ఎక్కువ లాభం రేటూ, ఎక్కువ పెట్టుబడీ! అలాంటి పెద్ద పెద్ద పెట్టుబడులు వున్న దేశం, అభివృద్ధి చెందిన దేశం!

పెట్టుబడిదారీ జన్మ ప్రారంభమైన తర్వాత, ఆ జన్మకి లక్ష్యం లాభం రేటే! లాభాన్ని పెంచాలనే లక్ష్యానికి ఒక పరిమితీ, ఒక హద్దూ, ఒక నీతీ, ఏదీ ఉండదు. ఆఖరికి, మార్కెట్ అవసరాల్ని గమనించుకోవాలనే తెలివి అయినా ఉండదు.

లాభం రేటుని పెంచుకునే ప్రయత్నాలు మొదట కొన్ని శాఖల్లో వున్న పెద్ద పెట్టుబడిదారుల మధ్య పోటీతో ప్రారంభమవుతాయి. క్రమంగా, ఇతర శాఖల లాభం రేట్లతో కూడా పోటీ! ఇంకా తర్వాత, ఇతర దేశాల లాభం రేట్లతో కూడా!

పోటీలో నిలబడడానికి ఏకైక మార్గం - ఉత్పత్తి శక్తుల్ని పెంచడం! సరుకుల్ని తక్కువ ఖర్చులతో తయారుచేసి, వెనకటి ధరలతోనే అమ్మాలని ప్రయత్నం! అది కొంత కాలం సాగిన తర్వాత, ఆ పెరిగిన ఉత్పత్తి శక్తి, ఆ శాఖలో అందరికీ అందుతుంది. పెరిగిన లాభం రేటు, వెనకటి దశకే చేరుతుంది. తర్వాత, ఆ పాత లాభం రేటుని నిలబెట్టుకోవడం కూడా కష్టమై పోతుంది. ఆ కష్టంలో నించి బైట పడే

మార్గం, ఉత్పత్తి శక్తుల్ని మళ్ళీ పెంచడం!

ఆ రకంగా కొంత కాలం జరిగిన తర్వాత వెనక్కి తిరిగి చూస్తే, కంపెనీల నిండా సరుకుల గుట్టలు పేరుకుపోయి కనపడతాయి. అమ్మకాలు మందగించిన ప్రమాద సంకేతాలు ఎదురవుతాయి. దాన్ని గమనించుకున్న కంపెనీ యజమాని, పునరుత్పత్తి క్రమాల్ని తగ్గించెయ్యడం గానీ, ఆపెయ్యడం గానీ చేస్తాడు.

ఉత్పత్తిని తగ్గించేసినప్పుడు, ఉత్పత్తి సాధనాల్ని కొనడం తగ్గిపోతుంది. ఆ ఉత్పత్తి సాధనాల్ని తయారుచేసే శాఖల్లో అమ్మకాలు మందగిస్తాయి. లేదా, పూర్తిగా ఆగిపోతాయి.


ఉత్పత్తి క్రమాల్ని తగ్గించేసిన కంపెనీలో, కార్మికులతో అవసరం తగ్గిపోతుంది. ఆ కంపెనీ నించి, ఒక పిడికెడు మంది కార్మికులు తప్ప, మిగతా అందరూ ఉద్యోగాలు పోయి వీధుల్లో పడతారు.


అంతే కాదు. సరుకుల గుట్టలు పెరిగిన కంపెనీల ప్రభావం, ఆ కంపెనీలకు ఉత్పత్తి సాధనాల్ని అందించే అనేక కంపెనీల మీద పడుతుంది కాబట్టి, ఆ అనేక కంపెనీల నించి కూడా కార్మికులు వీధుల్లో పడతారు.

అనేక కంపెనీల నించి కార్మికులు వీధుల్లో పడ్డారంటే, దాని ఫలితం ఎలా ఉంటుంది? ఆ కార్మికుల్లో కొందరికి కొత్త ఉద్యోగాలు దొరికితే దొరకవచ్చు, కానీ, అందరికీ అది జరగదు. నిరుద్యోగులైపోయిన వాళ్ళు, తమ పాత పొదుపులతో, 1, 2 నెలలు ఎలాగో అర్ధాకలితో గడుపుతారు. ఇక అప్పటి నించీ పోషణ వస్తువుల్ని కొనే పరిస్తితి ఉండదు. కార్మికుల పోషణ వస్తువుల అమ్మకాలు తగ్గిపోతే, ఆ పోషణ వస్తువుల్ని ఉత్పత్తి చేసే శాఖల్లో కూడా పునరుత్పత్తి క్రమాలు తగ్గిపోతాయి. ఆ శాఖల నించి కూడా కార్మికులు బైట పడడం మొదలవుతుంది. - ఈ రకంగా, కొన్ని శాఖల్లో పునరుత్పత్తి క్రమాలు ఆగిపోతే, ఉత్పత్తి సాధనాల శాఖల్లోనూ, పోషణ వస్తువుల శాఖల్లోనూ కూడా ఉత్పత్తి క్రమాలు మందగించిపోతాయి. ప్రారంభంలో ఒకటి రెండు భారీ కంపెనీల్లో మాత్రమే జరిగిన అమ్మకాల తగ్గుదలలు, క్రమంగా మొత్తం అన్ని శాఖల్నీ పెనవేసుకుపోతాయి. - ఇదంతా కలిసి 'సంక్షోభం!'

సంక్షోభం వల్ల పెట్టుబడిదారీ వర్గానికి జరిగే నష్టం ఏమీ ఉండదు. సరుకుల అమ్మకాలు మందగిస్తాయి కాబట్టి లాభాలు తగ్గడమే జరుగుతుంది. కొన్ని కంపెనీల్లో పెట్టుబడులకు కూడా కొన్ని నష్టాలు జరగవచ్చు. అంత మాత్రాన వాళ్ళ ప్రాణాలు పోవు.

అసలైన కష్టాలన్నీ నష్టాలన్నీ కార్మిక వర్గానికే. అసలు కార్మిక వర్గంలో, కొంత జనం ఎప్పుడూ నిరుద్యోగంలోనే వుంటారు. కానీ, సంక్షోభాల కాలాల్లో ముంచుకువచ్చే నిరుద్యోగాల పరిస్తితి, అలాంటిది కాదు. ఒక కంపెనీలో, నిన్నటి దాకా 100 మంది కార్మికులు వుంటే, ఇవ్వాల్టికి, కనీసం 90 మంది నిరుద్యోగులైపోతారు. ఇది, ఒక్క శాఖలోనే కాదు, అనేక శాఖల్లో జరుగుతుంది. శారీరక శ్రమల్లోనూ, మేధా శ్రమల్లోనూ కూడా ఇది జరుగుతుంది. సరుకుల పునరుత్పత్తి క్రమాలే తగ్గిపోయి, యంత్రాలే ఆగిపోయినప్పుడు, ఇక కార్మికులతో, ఏం అవసరం ఉంటుంది?





అయితే, ఆ కార్మికులందరూ ఏమై పోతారు? రెగ్యులర్‌గా జీతాలు అందుతూ వున్నప్పుడే కార్మిక కుటుంబాలు, సమస్యల వలయాల్లో కూరుకుపోయి వుంటాయి. అలాంటి కుటుంబాలకు జీతాలే ఆగిపోతే, తిండే ఉండదు. అద్దె ఇళ్ళు ఖాళీ చేసి చెట్ల కిందకి చేరవలసి వస్తుంది, చెట్లయినా వుంటే! పిల్లల్ని స్కూళ్ళు మానిపించవలసి వస్తుంది. ఆకలి - జబ్బులు మొదలవుతాయి. వైద్యం ఉండదు. చావులు ప్రారంభం! బతికి వుంటే, పిచ్చెత్తడాలూ, ఆత్మహత్యలూ, నేరాలూ, పెరిగిపోతాయి. కార్మిక జనాలు పిట్టలు రాలినట్టు రాలి పోతారు.

అదే కాలంలో, బ్యాంకులకు కూడా కష్టాలు మొదలవుతాయి. బ్యాంకులు, వడ్డీ వ్యాపారాలు చేసే పెట్టుబడిదారీ సంస్థలే కాబట్టి, అవి కూడా చిక్కుల్లో పడతాయి. బ్యాంకుల నించి అప్పులు తీసుకున్న పెట్టుబడిదారులు, సరుకుల్ని అమ్మలేక, బ్యాంకులకు అప్పులు చెల్లించలేరు. బ్యాంకుల్లో తమ డబ్బుని దాచుకున్న డిపాజిటర్లు (వీళ్ళు పెట్టుబడిదారులూ, భూస్వాములూ, మేధా శ్రమల కార్మికులూ), బ్యాంకుల నించి తమ డబ్బుని వెనక్కి తీసుకోవాలనుకుంటే, బ్యాంకుల దగ్గిర డబ్బే వుండదు. డిపాజిటర్లు తమ డబ్బుని బ్యాంకుల్లో వుంచకుండా వెనక్కి తీసేసుకోవడానికి ప్రయత్నిస్తారు. కానీ బ్యాంకులు, "మేము ఇచ్చిన అప్పులు వసూలవడం లేదు. ఇప్పుడు డబ్బు లేదు. కొన్నాళ్ళ దాకా మీ డబ్బు మీకు ఇచ్చేది లేదు" అంటాయి. 'కొన్నాళ్ళు' అంటే ఎన్నాళ్ళో వాళ్ళు చెప్పరు. బ్యాంకుకి ఈ దశ వచ్చిందంటే, ఆ బ్యాంకు, దివాళా తీసిందని అర్థం. సంక్షోభ కాలంలో, బ్రహ్మాండమైన బ్యాంకులు కూడా టపటపా దివాళాలు తీస్తాయి.

సరుకులు అమ్ముడు కాకపోతే, బట్టలూ, కుర్చీలూ - లాంటి వాటిని దాచి వుంచవచ్చు. కానీ, వెంట వెంటనే వాడుకోవలసిన సరుకుల్ని దాచి వుంచడం సాధ్యం కాదు. సంక్షోభాల కాలాల్లో, పెట్టుబడిదారులు, పాల ఉత్పత్తుల్ని సముద్రాల్లో పోసెయ్యడమూ, బంగాళాదుంపల గుట్టల మీద కిరసనాయిలు జల్లించడమూ, (కార్మికులు వాడడానికి వీల్లేకుండా), పొలాల్లో పంటల్ని ట్రాక్టర్లతో తొక్కించెయ్యడమూ, ఇళ్ళ అద్దెలు కట్టలేని కార్మిక కుటుంబాల్ని ఇళ్ళల్లోంచి తోలెయ్యడమూ - వంటి దురంతాలు అనేకం చేయించారు. ఒక వేపున లక్షలాది కార్మికులు కొంపా గోడూ లేక, తిండి లేక, మల మల మాడి

రాలిపోతోంటే, పెట్టుబడిదారులు తమ సరుకుల రాసుల్ని కార్మిక జనాలకు అందనివ్వకుండా నాశనం చేయించే సంఘటనలు, సంక్షోభాల చరిత్రలో అనేకం జరిగాయి.

అదే కాలంలో దోపిడీదారుల సెక్షన్లలో విలాసాలూ వ్యసనాలూ పెచ్చు పెరిగిపోతాయి. వాళ్ళ దగ్గిర ఉత్పత్తుల రాసులు అతిగా ఉంటాయి కాబట్టి, వాటిని ఎంత అధికంగా అయినా వాళ్ళు వాడుకోగలుగుతారు. సంక్షోభ కాలంలో వాళ్ళకి ఏ లోటూ ఉండదు. పైగా వాళ్ళకి భోగాలు పెరుగుతాయి.

క్రమంగా కొంత కాలానికి సరుకుల గుట్టలు సన్నబడతాయి. సంక్షోభం సర్దుకుంటుంది. మళ్ళీ ఉత్పత్తి క్రమాల ఉత్సాహం ప్రారంభమవుతుంది. కొత్త ఉత్పత్తి శక్తుల కోసం పరిశోధనలు ఊపందుకుంటాయి. ఉత్పత్తి శాఖలన్నీ కోలాహలంతో నిండిపోతాయి.

కార్మిక జనంలో అధిక భాగం అప్పటికే నాశనమైపోగా, మిగిలిన జనాభాలో కొంత భాగానికి కొత్త ఉద్యోగాలు ప్రారంభమవుతాయి. వెనకటి ఉత్పత్తి శక్తుల ద్వారా తయారైన సరుకుల రాసులనే అమ్ముకోలేని కంపెనీల వాళ్ళు, మరింత మెరుగైన ఉత్పత్తి శక్తుల కోసం వేటాడతారు. పని స్థలాల్లో సైంటిస్టులూ ఇంజనీర్లూ, యజమానుల ఆజ్ఞల ప్రకారమే వాటిని సాధిస్తారు. కొత్త ఉత్పత్తి శక్తుల్ని మొట్ట మొదట సాధించిన వాళ్ళకి లాభం రేట్లు పెరగడం ప్రారంభమవుతుంది. అది, ఆ పెట్టుబడిదారుల్ని మళ్ళీ కలల్లో తేలుస్తుంది.

మళ్ళీ కొన్నేళ్ళకి, ఆ కొత్త కలలు కరిగిపోతాయి. లాభం రేటులో తగ్గుదల నిరాశలో ముంచేస్తుంది. మళ్ళీ కొత్త ఉత్పత్తి శక్తుల వేట! అది సాగి సాగి, సరుకుల గుట్టలు పెరిగి పెరిగి, అమ్మకాలు తగ్గి తగ్గి, మళ్ళీ ఇంకో సంక్షోభం ముంచు కొస్తుంది. అంతా వెనకటి లాగే!

[ సంక్షోభాల గురించి తర్వాత పాఠం కూడా చూడండి. ] ★

# 84. సంక్షోభాల గురించిన మరి కొంత

ఈ సంక్షోభాలు అనేవి, వెనకటి సమాజాల్లో లేవు. అక్కడ, అమ్మకాల కోసమే సరుకుల్ని ఉత్పత్తి చేయించే విధానాలు లేవు. అక్కడ, సరుకుల రాసులు గుట్టల కొద్దీ పేరుకోవడమూ, అమ్మకాలు ఆగిపోవడమూ వంటి ఉపద్రవాలు లేవు. ఇది పెట్టుబడిదారీ విధానంలోనే ప్రారంభమైంది.

ఒక సమస్య గురించి చూసేటప్పుడు, " ఈ సమస్య వెనకటి సమాజాల్లో లేదు" అని చెప్పినప్పుడల్లా, " వెనకటి సమాజాలే మంచివి" అని చెప్పినట్టు అర్థం చేసుకోకూడదు. వెనకటి సమాజాలు కూడా దోపిడీ సమాజాలే. ఆ సమాజాల కన్నా, పెట్టుబడిదారీ దోపిడీ సమాజం, కొన్ని విషయాల్లో మంచిదీ; కొన్ని విషయాల్లో చెడ్డదీ. మనం

జీవిస్తున్న సమాజం ఇదే.

ఈ పెట్టుబడిదారీ విధానంలో, మొట్ట మొదటి సంక్షోభం 1825 కి వెనకటి నించీ ప్రారంభమైంది. అది అన్ని దేశాల్నీ ముంచెత్తిన సంక్షోభమే. అప్పటి నించీ కొన్నేళ్ళకు ఒక సారి సంక్షోభాలు వస్తూనే వున్నాయి. ఉత్పత్తుల గుట్టలు ఎవరికీ ఉపయోగ పడకుండా నాశనమవుతూనే వున్నాయి. ఉత్పత్తిదారులైన కార్మిక జనాలు, సరుకుల కన్నా ముందే నాశనమైపోతూనే వున్నారు.

పెట్టుబడిదారీ చరిత్రలో ఇప్పటి వరకూ వచ్చిన సంక్షోభాల్లో అమెరికాలో 1929 లో ప్రారంభమై నాలుగేళ్ళ పాటు సాగిన సంక్షోభం అతి పెద్దది.

[ దీన్ని గురించి నేను రాసిన ' కాపిటల్ పరిచయం' లో, ' సంక్షోభాలు' చాప్టర్‌లో చూడాలి. అక్కడ సంక్షోభాల గురించి అనేక వింత విషయాలు తెలుస్తాయి.]

ప్రస్తుతం 2009 లో కూడా ఒక సంక్షోభం ప్రపంచం అంతటా సాగుతోంది. ఇది ఏడాది నించీ వుంది. ఇది, ఎన్నేళ్ళకి సర్దుకుంటుందో ఎవరూ చెప్పలేరు. ఈ సంక్షోభంలో కూడా భారీ కంపెనీలూ, భారీ బ్యాంకులూ, అన్నీ దివాళాలు తీసిన ఘటనలు సాగుతున్నాయి. కార్మిక జనాల్లో పిల్లల్ని చంపుకోవడాలూ, ఆత్మహత్యలూ, ఎక్కడి కక్కడ సాగుతూనే వున్నాయి.

ఇక్కడ బార్టరు మారకాల విధానాన్ని ఒక సారి గుర్తు చేసుకోవాలి.

బార్టరు మారకంలో, అమ్మడమూ - కొనడమూ కలిసిపోయి ఒకే చర్యతో జరుగుతాయి. కుండని ఇచ్చి చెప్పుల్ని తీసుకుంటే, కుండని అమ్మడమూ, చెప్పుల్ని కొనడమూ, ఒకే సారి జరిగిపోతాయి. కుండ విలువతో చెప్పుల్ని తీసుకోవడం అంటే, ఆ విలువలో నించి కొంత భాగాన్ని దాచిపెట్టినట్టు కాదు. బార్టరు విధానంలో, విలువని కూడబెట్టడానికి అవకాశమే ఉండదు.

కానీ డబ్బుతో జరిగే మారకాల్లో అమ్మడమూ కొనడమూ కలిసి వుండవు. విడిపోతాయి. కుండని ఇచ్చి రూపాయి తీసుకుంటే, కుండని ' అమ్మడం' మాత్రమే జరుగుతుంది. ఆ డబ్బు ఇచ్చి చెప్పుల్ని తీసుకుంటే, అప్పుడు కుండ విలువతో ఇంకో వస్తువుని ' కొనడం' కూడా జరుగుతుంది.

డబ్బు విధానంలో, ఒక వస్తువుని అమ్మగా వచ్చిన డబ్బునంతా ఇతర వస్తువుల కోసం ఖర్చు పెట్టెయ్యనక్కరలేదు. కొంత డబ్బుని దాచడానికి సాధ్యమవుతుంది. డబ్బుతో జరిగే మారకాల విధానం, డబ్బుని పోగు చెయ్యడానికి వీలు నిస్తుంది. అంతేగాక, అమ్మడమూ కొనడమూ విడిపోయే డబ్బు విధానంలో, సరుకుల రకాల మధ్య సమిష్టి ప్లాను లేకపోతే, సరుకుల మారకాల్లో సమన్వయం తప్పిపోతుంది. అమ్మకాల వల్ల వచ్చిన విలువ అంతటి తోటీ కొనడాలు జరిగినప్పుడే మారకాల్లో సమన్వయం కొనసాగుతుంది. ఎన్ని అమ్మకాలు జరిగితే, అన్ని కొనడాలు జరగాలి. లేకపోతే, సరుకుల మారకాల్లో వైరుధ్యాలు పుట్టుకొస్తాయి. దాని తీవ్ర పరిణామాలే - సంక్షోభాలు.

' అసలే కోతి ; అది కల్లు తాగింది' అన్నట్టు, ' అసలే డబ్బు విధానం ; అది పెట్టుబడిదారీ లాభం రేటులో చిక్కుకుంది.' ఇక అది ఎలాంటి సమస్యలైనా సృష్టిస్తుంది. డబ్బు విధానంలో, అమ్మడా

లకూ కొనడాలకూ పొంతన లేని పరిస్తితి ఏర్పడి, అది, పెట్టుబడిదారీ విధానంలో, సంక్షోభాల రూపంలో బయటపడుతుంది.

పెట్టుబడిదారులకు ఇదంతా అర్థం కాదు. వాళ్ళ ఆర్థిక వేత్తలకు అసలే అర్థం కాదు. ఎందుకంటే, ఆర్థికవేత్తల గురువులు పెట్టుబడిదారులే కదా? పెట్టుబడిదారులు చెప్పని విషయాలు ఆర్థిక వేత్తల కెలా తెలుస్తాయి? వాళ్ళు, అదనపు విలువనే అర్థం చేసుకోరు. కాబట్టి, వాళ్ళల్లో ఎవ్వరూ సంక్షోభాల కారణాల్ని అర్థం చేసుకోలేరు, అందుకే వాటిని పట్టించుకోరు. "అంత అవసరమైతే, పునరుత్పత్తుల్ని కొన్నాళ్ళు ఆపుదాం. కార్మికుల్ని తీసేద్దాం. అంతే కదా?" అనుకుంటారు. వాళ్ళకి తోచే మార్గం అదే.

పెట్టుబడిదారుల ఆలోచనలన్నీ, సరుకు గుట్టల్ని ఎలా అమ్మాలా - అని! సరుకుల్ని ఎలా అమ్మాలో, ఆ కొత్త మార్గాల కోసమే అన్వేషిస్తారు. సరుకుల్ని అప్పులుగా ఇచ్చే మార్గాలూ, వాటి మీద వడ్డీలూ! ఆ మార్గలేమీ పనిచెయ్యవు. "అసలీ సంక్షోభాలు ఎందుకు వస్తున్నాయి? పాత ఉత్పత్తి శక్తులనే వాడుకోలేక పోతున్నాం. వాటిని ఇంకా పెంచడం ఎందుకు? ఇంత ఎక్కువ సరుకుల్ని ఉత్పత్తి చేయించడం ఎందుకు?" అనే ఆలోచనే వాళ్ళకి ఉండదు. కొన్ని కంపెనీల్ని కలిపేసి, సమిష్టి ప్లానులు నిర్వహించాలని చిట్టి పొట్టి సంస్కరణల కోసం కూడా కొంచెం ప్రయత్నిస్తారు. కానీ, కొన్ని చిన్న కంపెనీలు కలిసి భారీ కంపెనీలు తయారైనా, వాటి మధ్య కూడా మళ్ళీ పోటీలే. మళ్ళీ లాభం రేటు పోరాటాలే. ఆ పోరాటాలు, యుద్ధాల దాకా పోతాయి!

[ ప్రపంచంలో ఇప్పటికి "ప్రపంచ యుద్ధాలు" అనదగ్గవి 2 జరిగాయి, 1 వదీ, 2 వదీ. ఆ యుద్ధాలు ఎందుకు జరిగాయో, ఎలా జరిగాయో, 'కాపిటల్ పరిచయం' లో చూడండి! అనేక ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి.]

పెట్టుబడిదారీ విధానంలో ఇక కొత్త మార్పులూ, కొత్త చరిత్రలూ ఏవీ ఉండవు. సరుకు గుట్టల అమ్మకాల కోసం విదేశాలతో యుద్ధాలూ, అది కుదరనప్పుడల్లా సంక్షోభాలూ! ఇవే, మార్చి మార్చి సాగుతాయి.

ఈ సంక్షోభాలు, పెట్టుబడిదారీ వర్గానికి చేసే హాని ఏమీ ఉండదు, లాభాల్ని తగ్గించడం తప్ప! అది వాళ్ళకు గుండెలు బద్దలయ్యే నష్టమే. కానీ, అసలైన నష్టం, కార్మిక జనాభాకి.

ఇక పెట్టుబడిదారీ విధానం ఇంతే. దాని దోపిడీ లక్ష్యాలతో అది ఇలాగే సాగుతుంది.

పెట్టుబడిదారీ విధానం, శ్రామికులకు జీతం పద్ధతినీ, పని గంటల పద్ధతినీ, ఏర్పర్చింది కాబట్టి, అది వెనకటి విధానాల కన్నా అభివృద్ధి కరమైనదిగానే కనపడుతుంది. కానీ, ఆ అభివృద్ధి కూడా ఒక పరిమితితో ఆగిపోయింది. అది, వెనకటి కన్నా కొత్త సమస్యల్ని తెచ్చిపెట్టింది; ఇంకా భయంకర సమస్యల్ని కూడా తీసుకొస్తుంది. దాని స్వభావమే - మారకం విలువ స్వభావం. అసహజ స్వభావం. అది, 'లాభం' కోసం, ఎన్ని కౄర మార్గాలైనా కనిపెడుతుంది.

పెట్టుబడిదారీ విధానం అంటే, దాన్ని కేవలం ఒక దోపిడీ విధానంగా మాత్రమే చూస్తే, దాన్ని ఏమీ అర్థం చేసుకున్నట్టు

కాదు. దాని లాభం రేటు పోటీలూ, దాని ఉత్పత్తి శక్తుల పెంపకాలూ, దాని సరుకు గుట్టలూ, ప్రకృతిని ధ్వంసం చేసే దాని వికృత మార్గాలూ, దాని సంక్షోభాలూ, దాని కార్మిక జనాభా నాశనాలూ - వంటి, దాని ప్రత్యేక లక్షణాలతో కలిపే దాన్ని చూడాలి. ఈ లక్షణాలన్నీ వెనకటి కాలంలో లేనివే. ఇవే గాక, దీనికి ఇంకా అనేక ప్రత్యేక దుర్గుణాలు ఉన్నాయి.

పెట్టుబడిదారుడు, తనకు కావలసిన శ్రామికుల్ని తను నిర్ణయించుకోవడం గాక, ఒక కాంట్రాక్టర్‌ని పిలిచి, " నాకు కొందరు కూలీలు కావాలి, సప్లై చెయ్యి" అంటాడు. దాని కోసం కాంట్రాక్టర్‌కే డబ్బు చెల్లిస్తాడు. ఆ కాంట్రాక్టరు, ఆ డబ్బులో నించి, కూలీలకు జీతాలు ఇచ్చి, మిగిలినది తన లాభంగా తీసుకుంటాడు.

కాంట్రాక్టరే శ్రామికులకు యజమాని. అతను ఇచ్చేదే కార్మికుడి జీతం. కాంట్రాక్టర్‌కి అందే లాభమూ, సరుకుల్ని తయారు చేయించే పెట్టుబడిదారుడికి అందే లాభమూ, అన్నీ కలిసినదే శ్రామికుల అదనపు విలువ. అంటే, సరుకుల్ని తయారుచేయించేవాడు, తనకు మిగిలే లాభంలో నించి కొంత భాగాన్ని కాంట్రాక్టర్‌కి వదులుతాడన్నమాట!

ఈ రకం కొత్త కొత్త మార్పులతో, యజమానీ కార్మిక సంబంధాలు, గతం కన్నా వేరు రూపాలలోకి మారుతూ వుంటాయి. కానీ అసలు సారాంశం, ఏ రూపంలో అయినా ఒకటే.

పెట్టుబడిదారీ విధానం ఎప్పుడూ, కార్మికుల్ని చీల్చడానికీ, కార్మికులు సంఘాలు పెట్టుకోకుండా చెయ్యడానికీ, ప్రయత్నిస్తూ వుంటుంది.

పెట్టుబడిదారుడు, బానిస యజమాని వారసుడే. కానీ, బానిస యజమాని కన్నా మరింత గడసరి నాగరిక వారసుడు.

కార్మిక జనాభా, పెట్టుబడిదారీ విధానానికి వున్న ప్రత్యేక దుర్గుణాల్ని అర్థం చేసుకోకపోతే, కార్మిక వర్గం ఇంకా వేతన బానిసత్వంలోనే ఉండిపోతుంది.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. సంక్షోభాలు ఎందుకు వస్తాయని పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు చెపుతారు?

**జ** : వాళ్ళు ఏమీ చెప్పరు. వాళ్ళు అసలు సంక్షోభాలు ఏర్పడుతున్నాయని చాలా కాలం వరకూ ఒప్పుకోలేదు. ' సరుకులన్నీ అమ్మకం అయిపోతాయి; సంక్షోభం ఎందుకొస్తుంది' అని దబాయించారు చాలా కాలం. కానీ, 1929 లో వచ్చిన సంక్షోభం లాంటి దాన్ని చూసి, ఇక వెనకటి దబాయింపులు కట్టిపెట్టారు. కానీ, ఆ తర్వాతైనా, సంక్షోభాలు ఫలానా కారణాల వల్ల ఏర్పడుతున్నాయని, వాళ్ళు ఏ కారణమూ చెప్పరు. మౌనం వహిస్తారు. జవాబు చెప్పలేనప్పుడే మౌనం వుంటుంది. ఈ సమస్యకే కాదు, ఏ సమస్యకీ వాళ్ళు ఏమీ చెప్పరు. యుద్ధాల్ని తీసుకోండి! సరుకుల అమ్మకాల కోసమే, మార్కెట్ల కోసమే, విదేశాల నించి ముడి పదార్థాల్ని లాగడం కోసమే యుద్ధాలు వస్తాయి - అని వాళ్ళు చెపుతారా? - చెప్పరు. దేశంలో జనం అంతా యుద్ధాన్ని సమర్థించాలని, ' దేశ భక్తి, దేశ భక్తి' అని మత్తు ఎక్కిస్తారు. ఇరుగు పొరుగు దేశాలన్నీ శత్రువులే - ⟶

అని చెపుతారు. తుఫానుల్లాంటి, వరదల్లాంటి ప్రమాదాల గురించైనా అసలైన కారణాలు చెపుతారా? నదుల నీటి ప్రవాహాన్ని నియంత్రించే పద్ధతులు లేక, అధిక జనాభాకి గుడిసెలు తప్ప, సరైన ఇళ్ళు లేక, జనం ఇబ్బందుల పాలవుతున్నారని చెప్పరు. 'ప్రకృతి ఆగ్రహించింది, వరుణుడు ఆగ్రహించాడు' అని చెపుతారు. దాన్నే జనం నమ్ముతారు. ప్రతీ దానికీ ఇలాగే. గట్టిగా వాన కురిస్తే, గట్టిగా ఎండలు కాస్తే, వందల కొద్దీ జనం పోతారు. ప్రభుత్వం, కొందరికి డబ్బు పడేస్తుంది. అది బిచ్చం. అందులో నించి బోలెడు మందికి లంచాలు పోగా మిగిలిందే అసలు వాళ్ళకి దొరుకుతుంది.

**2**. 2009 లో కూడా అన్ని దేశాల్లోనూ సంక్షోభం నడుస్తోంది అంటున్నారు. దీని వార్తలు, పత్రికల్లో ఏం వస్తున్నాయి?

**జ** : అనేకం వస్తున్నాయి.

[ దీని కోసం తర్వాత పాఠం చూడండి! ] ★

# 85. సంక్షోభాల వార్తలు కొన్ని!

2008 సంవత్సరం నించి కూడా ఒక సంక్షోభం నడుస్తోంది.
ఈ సంక్షోభంలో వచ్చిన వార్తలు ఇవి.

ఈ వార్త చూడండి :

### వంద కోట్ల ఆకలి కేకలు!



ప్రపంచంలో 102 కోట్ల మందికి పైగా ఆకలితో విల విల లాడుతున్నా రనీ, వీరిలో వర్ధమాన దేశాల ప్రజలే అధికంగా ఉన్నారనీ, ఐక్య రాజ్య సమి తికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) పేర్కొంది. అత్యధిక సంపన్న దేశమైన అమెరికాలోనూ 1.5 కోట్ల మంది పస్తులుంటున్నా రని తెలిపింది. తీవ్రమైన ఆహార కొరతకు ప్రపంచ ఆర్థిక సంక్షోభం తోడవడంతో వివిధ దేశాల నుంచి అందే ఆహార సహాయం బాగా తగ్గిపోయి ఆకలితో అలమటించేవారి సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని, 'వార్షిక ఆకలి నివేదిక - 2009'లో, ఎఫ్ఏఓ వెల్లడించింది. ఈ నెల 16న ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఈ నివేదికను ఎఫ్ఏఓ బుధవారం విడుదల చేసింది.

( ఆంధ్రజ్యోతి, అక్టోబరు 15, 2009 )

ఈ నాడు కూడా ఇంకా ఆకలితోనే జనం వుంటున్నారంటే, ఈ సమస్యకి కారణం ఏమిటి? అసలు, పెట్టుబడిదారీ విధానంలో ఈ సమస్య పరిష్కారం అవుతుందా? సంక్షోభాలు లేని కాలంలో కూడా జనం ఆకలి తోనే వుంటున్నారు. సంక్షోభాల వల్ల ఆ సమస్య మరింత పెరిగిందని ఈ వార్త చెపుతోంది. ఈ వార్తలో, 102 కోట్ల మందే ఆకలితో వున్నట్టు చెప్పారు గానీ, అది నిజం కాదు. శారీరక శ్రమల వాళ్ళందరూ సరైన తిండీ, సరైన నివాసాలూ, లేకుండా వుంటున్నవాళ్ళే. అన్ని దేశాల్లోనూ భూమి వుంది. నదులు వున్నాయి. శ్రమలు చేసే మనుషులు వున్నారు. అయినా, కోట్ల మందికి ఆకలి కూడా తీరడం లేదు. వేల సంవత్సరాల నించీ ఇదే సమస్య.

★ ★ ★

ఈ వార్త చూడండి! ఇలాంటి వార్తలు ఇప్పటికి అనేక డజన్లు వచ్చాయి.



అమెరికాలో

డెల్ ప్లాంట్ మూసివేత

905 మంది ఉద్యోగులకు ఉద్వాసన

న్యూయార్క్: అమెరికాకు చెందిన కంప్యూటర్ దిగ్గజం డెల్, ఉత్తర కాలిఫోర్నియాలోని తన డెస్కుటాప్ కంప్యూటర్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను మూసివేయనున్నట్లు ప్రకటించింది.

వచ్చే ఏడాది జనవరిలో ఈ ప్లాంట్‌ను మూసివేయనుండగా... ఇందులో పని చేస్తున్న 905 మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారు. కంపెనీ భవిష్యత్ ప్రణాళికలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్లాంట్‌ను మూసివేయాలని నిర్ణయించినట్లు డెల్ వైస్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ మిల్లర్ తెలిపారు. ఇటీవలి కాలంలో డెల్ లాభాలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో 2011 ఆర్థిక సంవత్సరంలో 400 కోట్ల డాలర్ల వ్యయాన్ని తగ్గించుకోవాలని కంపెనీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే తన ప్లాంట్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. డెల్ కంప్యూటర ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో అతిపెద కంపెనీ.

( ఆంధ్రజ్యోతి, 9-10-2009 )

న్యూయార్క్ : అమెరికాకు చెందిన కంప్యూటర్ దిగ్గజం డెల్, ఉత్తర కాలి ఫోర్నియాలోని తన డెస్కుటాప్ కంప్యూటర్ మాన్యుఫాక్చరింగ్ ప్లాంటను మూసివేయనున్నట్లు ప్రకటించింది.

వచ్చే ఏడాది జనవరిలో ఈ ప్లాంట్‌ను మూసివేయనుండగా... ఇందులో పని చేస్తున్న 905 మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారు. కంపెనీ భవిష్యత్ ప్రణాళికలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్లాంట్‌ను మూసివేయాలని నిర్ణయించినట్లు డెల్ వైస్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ మిల్లర్ తెలిపారు. ఇటీవలి కాలంలో డెల్ లాభాలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో 2011 ఆర్థిక సంవత్సరంలో 400 కోట్ల డాలర్ల వ్యయాన్ని తగ్గించుకోవాలని కంపెనీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే తన ప్లాంట్ మూసి వేత నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. డెల్, కంప్యూటర్ల ఉత్పత్తిలో ప్రపంచంలోని రెండో అతి పెద్ద కంపెనీ.

ఈ వార్తలో, ఉద్యోగాలు పోయిన వాళ్ళు 905 మందే కనపడుతున్నారు. కానీ, ఇది ఒక్క కంపెనీ. అన్ని కంపెనీలూ, అన్ని దేశాల్లోనూ, ఇదే పని చేస్తున్నాయి. నిరుద్యోగులైపోయిన వాళ్ళు, లక్షల మీద వున్నారు. శ్రమలు చేసే అవకాశాలు లేకపోతే, మనుషులు ఎలా బతుకుతారు? వాళ్ళకి భూమి వుండదు. ఇతర ఉత్పత్తి సాధనాలు వుండవు. ఏదో ఒక యజమాని దగ్గిర పని ఇవ్వమని అడగాలి. ఇచ్చినప్పుడు ఇస్తాడు, తీసేసినప్పుడు తీసేస్తాడు. "నాకు ఎక్కువ మంది కార్మికులతో అవ సరంలేదు" అంటాడు పెట్టుబడి దారుడు. కానీ, మొత్తం, భూమి అంతా, ఉత్పత్తి సాధనాలన్నీ వుండేది వాళ్ళ దగ్గిరే. అవి, వాళ్ళ ఆస్తులుగా వుంటాయి.

కానీ, అవి వాళ్ళ నిజమైన ఆస్తి కాదు.

కాబట్టి, కార్మిక జనాభా ఏం చెయ్యాలంటే, ఆ ఉత్పత్తి సాధనాలన్నిటినీ (భూమినీ, ఫ్యాక్టరీల్నీ) వాళ్ళ ఆధీనం నించీ, వాళ్ళ హక్కుల నించీ, బైటికి లాగాలి. వాళ్ళని కూడా, కార్మికులతో సమానంగా పనుల్లోకి దింపాలి. అన్ని శాఖల మధ్యా, ఒక సమిష్టి ప్లానుతో ఉత్పత్తి క్రమాలు వుండాలి. అప్పుడు, నిరుద్యోగం అనే సమస్య వుండదు.

★ ★ ★

పునర్వ్యవస్థీకరణ పేరుతో

**ఐదు వేల ఉద్యోగాలు హుష్ కాకి**

హ్యూస్టన్, నవంబర్ 2: మాంద్యం కారణంగా బలహీనంగా ఉన్న ఆర్థిక వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ పేరుతో రాయల్ డచ్ షెల్ కంపెనీ ఐదు వేల మంది ఉద్యోగులను ఇంటికి పంపనుంది. తృతీయ త్రైమాసిక ఫలితాల్లో లాభాలు తగ్గిపోవడంతో ఉత్పత్తిని తగ్గించుకోవాలని ఈ సంస్థ నిర్ణయించింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి సంస్థ పునర్వ్యవస్థీకరణ చేపట్టిన ఈ ఆంగ్లో డచ్ ఆయిల్ అండ్ గ్యాస్ గ్రూప్‌లో ట్రాన్సిషన్ - 2009 ప్రోగ్రామ్ నిర్వహిస్తున్న ఐదు వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకాలని గత జూలైలో సంస్థ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన పీటర్ వోసర్ నిర్ణయించారు. ఇది సంస్థలో పనిచేస్తున్న 1.02 లక్షల మందిలో 4.9 శాతం. ప్రస్తుత పోటీ వాతా వణంలో భవిష్యత్‌లో మరింత పురోగతి సాధించేం దుకు పటిష్ట చర్యలు చేపట్టామని వోసర్ తెలి పారు. ప్రస్తుతం ఇంధనం డిమాండ్‌తో పాటు ధర కూడా పెరుగుతున్నా, పూర్తిగా అనిశ్చితి వాతావరణం నెలకొందని వోసర్ తెలిపారు. ఇప్పటి కిప్పుడు మాంద్యం ప్రభావం నుంచి బయట పడతామని భావించలేమని వోసర్ పేర్కొన్నారు. ఈ ఏడాది చివరికల్లా సంస్థను పూర్తిగా పునర్వ్యవస్థీకరిస్తామని ఆయన వివరించారు.

( ఆంధ్రప్రభ, 3-11-2009 )

ఆ కంపెనీని, మళ్ళీ వ్యవస్థీకరిస్తారట! అంటే, దాన్ని తిరిగి ఏర్పర్చడం! దాని కోసం కార్మికుల్ని తగ్గిస్తారు. ఆ కంపెనీలో పనిచేసే మొత్తం కార్మికులు, 1 లక్షా 2 వేల మంది. అందులో నించి, ప్రస్తుతం 5 వేల మందిని తీసేశారు. "లాభాలు తగ్గిపోవడంతో, ఉత్పత్తిని తగ్గించుకోవాలని, ఈ సంస్థ నిర్ణయించింది." - లాభాలు ఎందుకు తగ్గాయి? సరుకుల అమ్మకాలు తగ్గి. అమ్మకాలు ఎందుకు తగ్గాయి? - ఆ సరుకుతో మార్కెట్‌కి అంత అవసరం లేదు. కానీ, సరుకు రాసుల్ని తయారు చేసేశారు. అది కదలడం లేదు. కాబట్టి ఉత్పత్తిని తగ్గిస్తారు. కార్మికుల్ని తగ్గిస్తారు. మరి, వాళ్ళు ఎలా బతకాలి? - అది పెట్టుబడిదారుడి బాధ్యత కాదు. అవసరమైనప్పుడే ఎక్కువ మంది కార్మికుల్ని పెట్టుకుంటారు. అవసరం లేకపోతే తగ్గిస్తారు. కార్మికులు శ్రమలు చెయ్యడానికి దారి దొరకడం అనేది, పెట్టుబడిదారుల అవసరాల్ని బట్టే గానీ, కార్మికులు బతకడానికి కాదు. సంక్షోభం ఎంత తీవ్రంగా వున్నా, ఉత్పత్తి ఎంత తగ్గినా, పెట్టుబడిదార్లకేం నష్టం? నష్టం అంతా కార్మికులకే. వాళ్ళకి భూమి వుండదు. ఇతర ఉత్పత్తి సాధనాలు వుండవు. ఉద్యో గాలు ఇచ్చే అవకాశాలన్నీ పెట్టుబడిదార్ల చేతుల్లో వుంటాయి. కానీ వాళ్ళకి, ఎక్కువ మంది కార్మికులతో అవసరం వుండదు. తక్కువ మందితో ఎక్కువ గంటలు పని చేయిస్తేనే వాళ్ళకి లాభం గానీ, అందరికీ ఉద్యోగాలిస్తే, వాళ్ళకేం లాభం?

మరి, ఉద్యోగాలు లేని కార్మికులు ఎలా బతకాలి? - వాళ్ళసలు బతకడం ఎందుకు? వాళ్ళతో ఏం అవసరం వుంది? - వాళ్ళతో పెట్టుబడిదార్లకు అవసరం వుండదు గానీ, వాళ్ళు బతకడం వాళ్ళకి అవసరం కదా? - ఈ విషయం అర్థం చేసుకుంటే, పెట్టుబడిదారీ విధానం వల్ల ఎలాంటి సమస్యలు ఏర్పడతాయో అర్థమవుతుంది. ఉత్పత్తుల్ని తయారుచేయించే అవకాశాలూ, ఉద్యోగాలు ఇచ్చే అవకాశాలూ, పెట్టుబడిదారుల చేతుల్లో వుండడం ఏమిటి? ఎవరి బతుకుదెరువు వాళ్ళ చేతుల్లోనే ఎందుకు లేదు? - ఇవీ అసలు ప్రశ్నలు. ఈ సంక్షోభ వార్తలు, అసలు విషయాన్ని ఎంతో తేటతెల్లంగా చూపిస్తున్నాయి. అర్థం చేసుకోగలిగే జ్ఞానం కార్మిక జనాభాకి ఇంకా లేదు.

★ ★ ★

**సంక్షోభ కాలంలో కార్మికులకు ఏం జరుగుతుందో ఈ వార్తలో చూడండి :**

కార్మికుల కత్తిరింపులు, వేతన స్తంభనలు, వేతనాల కోతలు, పని గంటల పెంపు, ఓవర్ టైం రేట్ల తగ్గింపు, బోనస్, పెన్షన్, ఇతర సౌకర్యాల కత్తిరింపులు, రెగ్యులర్ వుద్యోగాలను రద్దు చేసి, లేక తగ్గించి, క్యాజువల్, కాంట్రాక్టు, తదితర రూపాల తాత్కాలిక కార్మికులను నియమించుకోవటం, సంఘ నిర్మాణ హక్కును, సమ్మె హక్కును కాల రాయటం, యూనియను నాయకులపై, కార్యకర్తలపై భౌతిక దాడులు, హత్యలు చేయటం, అన్ని దేశాల లోనూ నిత్యకృత్యంగా మారింది. 2007 చివరి నుండి అమెరికానూ, 2008 సెప్టెంబరు నుండి ప్రపంచాన్నంతానూ ముంచెత్తిన ఆర్థిక సంక్షోభం కార్మిక వర్గంపై దాడులను పతాక స్థాయికి కొనిపోయింది. వారి జీవన పరిస్థితులనూ, పని పరిస్థితులనూ, దయనీయంగా మార్చి వేసింది.


2008 లో ప్రపంచ వ్యాపితంగా సుమారు కోటి మంది వుద్యోగాలు కోల్పోయారు. 2009లో ప్రతి నిముషమూ 5 గురు కార్మికులు వుద్యోగాలు కోల్పో తున్నారని అంచనా. 2009జనవరి 26 న ఒక్క రోజే 80 వేల మంది పనులు కోల్పో యారు. అత్యధిక కంపెనీలు వేతనాల స్తంభనను అమలు చేస్తున్నాయి.

మన దేశం పైనా ఈ ఆర్థిక సంక్షోభ ప్రభావం తీవ్రంగా వుంది. ఎగుమతి ఆధారిత పరిశ్రమలలో ఆర్థిక సంక్షోభం ప్రారంభమైనప్పటి నుండి ప్రత్యక్షంగా 25 లక్షల మందీ, పరోక్షంగా మరో 25 లక్షల మందీ పనులు కోల్పోయారు. ఇతర రంగాలలోనూ ప్రత్యక్ష, పరోక్ష పద్ధతుల్లో వేతనాల స్థంభనా, వేతనాల కోతలు అమలు జరుగు తున్నాయి.

మరి, ఈ సంక్షోభ కాలంలో కార్మిక జనాభా ఏం చేస్తోంది?

అనేక కంపెనీలలో వేతనాల కోతకూ, పని భారం పెంపునకూ సంబంధించి యాజమాన్యానికీ, కార్మిక సంఘాలకూ మధ్య ఒప్పందాలు జరుగుతున్నాయి. తమ జీవన పరిస్థితులనూ, పని పరిస్థితులనూ తీవ్రంగా దెబ్బతీసే ఈ దాడులకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాపితంగా కార్మికులూ, వుద్యోగులూ పోరాటాలకు పూనుకుంటున్నారు.

('ప్రజా పంథా' వార పత్రిక, 15-10-2009, పేజీ 5.)



అమ్మకం లేకుండా పడి వున్న
తన సరుకుల గుట్టల్ని పెట్టుబడిదారుడు
ఆశ్చర్యంతో చూస్తున్నాడు.

పెట్టుబడిదారులు, బ్యాంకుల నించి అప్పులు తీసుకుని సరుకుల గుట్టల్ని తయారు చేస్తారు. కానీ వాటిని అమ్మలేరు. వాటి మీద పెట్టిన డబ్బు వెనక్కి రాదు. బ్యాంకుల అప్పుల్ని తీర్చలేరు. బ్యాంకుల దగ్గిర డబ్బే లేకుండా ఖాళీ అవుతుంది.


అమెరికాలో...
నేలరాలిన బ్యాంకులు నూరు
తాజాగా మరో మూడు బ్యాంకులకు తాళం

అమెరికాలో...

## నేలరాలిన బ్యాంకులు నూరు

### తాజాగా మరో మూడు బ్యాంకులకు తాళం

అమెరికాలో తాజాగా మరో మూడు బ్యాంకులు దివాలా ప్రకటించాయి. దీంతో ఈ ఏడాది దివాలా ప్రకటించిన బ్యాంకుల సంఖ్య 98కి చేరింది. ఈ దెబ్బతో సబ్ ప్రైమ్, మాంద్యం దెబ్బకు నేలరాలిన బ్యాంకుల సంఖ్య, సెంచరీ పూర్తయినట్టేనని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. పద్దు పుస్తకాల నిండా దాని బకాయిలు, ఖజానాలో అడుగంటిన నిధులతో వ్యాపారం సాగించలేక చేతులెత్తేస్తున్న బ్యాంకులను ప్రభుత్వం మూసివేస్తున్నది.

తాజాగా మూతపడిన మూడు బ్యాంకుల్లో మిషగన్‌లోని వారెన్ బ్యాంక్, మిన్నెసొటాలోని జెన్నింగ్స్ స్టేట్ బ్యాంక్, సదరన్ కొలరాడొ నేషనల్ బ్యాంక్ ఉన్నాయి. వారెన్ బ్యాంకుకు రావల్సిన బకాయిలు 53.8 కోట్ల డాలర్లు, డిపాజిట్ల మొత్తం 50.1 కోట్ల డాలర్లు ఉన్నాయి. డిపాజిట్లను పాంటిగ్టన్ నేషనల్ బ్యాంక్ ఆఫ్ ఒహియోకు అప్పగించినట్లుగా ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ప్రకటించింది. 5.63 కోట్ల డాలర్ల రుణాలు, 5.24 కోట్ల డాలర్ల మేర డిపాజిట్లు ఉన్న జెన్నింగ్స్ స్టేట్ బ్యాంక్ డిపాజిట్లను మిన్నెసొటా సెంట్రల్ బ్యాంక్ స్వాధీనం చేసుకుంటున్నది. సదరన్ కొలరాడొ నేషనల్ బ్యాంక్ డిపాజిట్లను కూడా అదే రాష్ట్రానికి చెందిన బ్యాంకుకు అప్పగించారు. ఈ మూడు బ్యాంకుల దివాలాలో ఫెడరల్ డిపాజిట్ ఇన్యూరెన్స్‌పై అదనంగా మరో 26.3 కోట్ల డాలర్ల భారం పడింది. ఇప్పటికే ఈ సంస్థ ఆస్తులు మొత్తం హరించుకుపోయి నష్టాల్లో పడింది. 2009-2013 మధ్య బ్యాంకుల దివాలా కారణంగా తమపై పడే బీమా భారం 10,000 కోట్ల డాలర్లు ఉంటుందని ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ చెబుతున్నది. ( ఆంధ్రజ్యోతి, 4-10-2009 )

ఇంజనీర్ల వంటి కార్మికులు కొందరు, ఉద్యోగాలు పోయాయనే నిరాశతో, పిల్లల్ని చంపేసి, ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా జరుగుతూ వుంటాయి. ఈ వికృతమైన ఆలోచన, శారీరక శ్రమల కార్మికుల్లో కనపడదు.


ఈ వార్త చూడండి! కోట్ల కోట్ల జనాభా తిండి లేక మల మల మాడుతోంటే, ఇక్కడ ఏం జరుగుతోందో చూడండి!



## పాల పారబోత

ఫొటో చూశారా? ట్యాంకుల కొద్దీ పాలతో నేల తల్లిని తడుపుతున్నారు. ఇదేదో వర్షాల కోసం రైతులు చేస్తున్న యజ్ఞమో, యాగమో అనుకుంటే పొరపాటే. పాల ధరలు విపరీతంగా తగ్గిపోవడాన్ని నిరసిస్తూ బెల్జియంలోని పాల రైతులు ఓ పొలంలో 30లక్షల లీటర్ల పాలను ఇలా పారబోశారు.
( ఆంధ్రజ్యోతి, 17-9-2009 )

కొంత కాలానికి సంక్షోభం తగ్గు ముఖం పడుతుంది.
ఒక కంపెనీలో జరిగిన మార్పు చూడండి!


టెక్స్‌టైల్ రంగంలో
మళ్లీ కళకళ
■ కొత్తగా 9 ప్రాజెక్టులు
న్యూఢిల్లీ :
ఆర్థిక వ్యవస్థలు కోలుకుంటున్న సూచనలు కన్పిస్తుండటంతో భారత టెక్స్‌టైల్ కంపెనీలు విస్తరణ పథకాలు సిద్ధం చేసుకుంటున్నాయి. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కొత్తగా 9 టెక్స్‌టైల్ ప్రాజెక్టులు ప్రకటించిట్లు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) తన నివేదికలో వెల్లడించింది.2010 మార్చి నాటికి సింథటిక్ ఫైబర్ ఇండస్ట్రీ సామర్థ్యం 1789 కిలోలకు విస్తరిస్తుందని సిఎంఐఇ అంచనా వేస్తోంది. 2007-08 చివరి నాటికి ఈ పరిశ్రమ సామర్థ్యం 1659 మిలియన్ కిలోలుగా ఉంది. మాంద్యంతో 3,500 కోట్ల రూపాయల విలువైన 11ప్రాజెక్టులు ఆగిపోయాయి. 2.91 లక్షల కోట్ల రూపాయల విలువైన భారత టెక్స్‌టైల్ పరిశ్రమలో చేనేతరంగం వాటా 40 శాతం పైనే ఉంది.

## టెక్స్‌టైల్ రంగంలో మళ్లీ కళకళ

### కొత్తగా 9 ప్రాజెక్టులు

న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థలు కోలుకుంటున్న సూచనలు కన్పిస్తుండటంతో భారత టెక్స్‌టైల్ కంపెనీలు విస్తరణ పథకాలు సిద్ధం చేసుకుంటున్నాయి. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కొత్తగా 9 టెక్స్‌టైల్ ప్రాజెక్టులు ప్రకటించినట్లు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) తన నివేదికలో వెల్లడించింది. 2010 మార్చి నాటికి సింథటిక్ ఫైబర్ ఇండస్ట్రీ సామర్థ్యం 1989 కిలోలకు విస్తరిస్తుందని సిఎంఐఇ అంచనా వేస్తోంది. 2007-08 చివరి నాటికి ఈ పరిశ్రమ సామర్థ్యం 1659 మిలియన్ కిలోలుగా ఉంది. మాంద్యంతో 3,500 కోట్ల రూపా యల విలువైన 11 ప్రాజెక్టులు ఆగిపోయాయి. 2.91 లక్షల కోట్ల రూపాయల విలువైన భారత టెక్స్‌టైల్ పరిశ్రమలో చేనేత రంగం వాటా 40 శాతం పైనే ఉంది.

( ఆంధ్రజ్యోతి, 19-10-2009 )

ఈ వార్తలో ఏం వుంది? సంక్షోభం రాక ముందు, ఈ పరిశ్రమలో, 1659 మిలియన్ కిలోల సరుకుని ఉత్పత్తి చేసే సామర్థ్యం వుండేది. ఆ సరుకునే అమ్మలేక చచ్చారు. 'మాంద్యం కాలంలో, 3,500 కోట్ల రూపా యల విలువైన 11 ప్రాజెక్టులు ఆగిపోయాయి' అని వాళ్ళే చెప్పుకున్నారు. అలా జరిగినా బుద్ధి రాలేదు. ఉత్పత్తి సామర్థ్యాన్ని ఇంకా పెంచదలిచారు. "2010 మార్చి నాటికి, సింథటిక్ ఫైబర్ ఇండస్ట్రీ సామర్థ్యం, 1789 మిలియన్ల కిలోలకు విస్తరిస్తుందని" అంచనా వేశారు! అంటే, ఉత్పత్తిని ఇంకా పెంచాలని! సంక్షోభాల్ని ఎదుర్కోడానికి వాళ్ళకి కనపడే మార్గం అదీ!

ఈ సంక్షోభాల వల్ల పెట్టుబడిదారుల కేమీ నష్టం వుండదు. వాళ్ళు ఇంకా మితి మీరిపోతారు.

అసలైన నష్టాలన్నీ కార్మిక జనాభాకే. ఈ విషయాలన్నీ కార్మికులు తెలుసుకోక పోతే, వాళ్ళకి దాస్యాల నించి విముక్తి వుండదు.

## బ్యాంక్ ఆఫ్ ఇండియా లాభం 323 కోట్లు

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికానికి గాను 5165 కోట్ల రూపాయల మొత్తం ఆదాయంపై 323 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. ఇదే కాలంలో బ్యాంకు నికర వడ్డీ ఆదాయం 3.37 శాతం వృద్ధి చెంది 14.09 కోట్ల రూపాయలకు చేరుకుంది. కాగా నిర్వహణ లాభం 1206 కోట్ల రూపాయలుగా ఉంది. ( ఆంధ్రజ్యోతి, 7-11-2009 )

ఇది, 3 నెలల లాభం! అందులో, వడ్డీల ద్వారా వచ్చింది కొంతా, నిర్వహణ ద్వారా వచ్చింది కొంతా. రెండూ కలిసి, 3 నెలల్లో, 323 కోట్లు!




## ఆర్ బి ఐ ' బంగారం'

ఐఎంఎఫ్ నుంచి 6.7 బిలియన్ డాలర్ల విలువైన 200 మెట్రిక్ టన్నుల బంగారం కొనుగోలు

వాషింగ్టన్, నవంబర్ 3: అంతర్జాతీయ ద్రవ్యనిధి ( ఐఎంఫ్ ) నుంచి 6.7 బిలియన్ డాలర్ల ( సుమారు 32,160 కోట్ల రూపాయలు ) ఖరీదు చేసే 200 మెట్రిక్ టన్నుల బంగారాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేసింది. బంగారం అమ్మకాలు జరపడం ద్వారా నిధులు సేకరించి పేద దేశాలకు మరిన్ని రుణాలివ్వాలని ఐఎంఎఫ్ చేపట్టిన కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందని ద్రవ్యనిధి మేనేజింగ్ డైరెక్టర్ డొమినిక్ స్టారస్ ఖాన్ వ్యాఖ్యానించారు. మొత్తం 403.3 మెట్రిక్ టన్నుల బంగారాన్ని విక్రయించనున్నామని ఆయన తెలిపారు. ఐఎంఎఫ్ లక్ష్యాలను చేరుకోవడానికి బంగారం విక్రయాలు ముఖ్యమైన అడుగని ఆయన అభివర్ణించారు. ఈ నిధుల ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలతో పాటు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న దేశాలకు దీర్ఘకాలంలో ఎంతో సహకారం అందనుందని ఆయన తెలిపారు. అక్టోబర్ 19 నుంచి 30 వ తేదీ వరకూ రోజువారీ విక్రయాల్లో ఆ రోజు మార్కెట్ ధరను బట్టి గోల్డ్ ధరను నిర్ణయించి విక్రయాలు సాగించామని భారత్ 6.7 బిలియన్ డాలర్లు లేదా 4.2 బిలియన్ ఎస్‌డిఆర్‌ల విలువైన బంగారం కొనుగోలు చేసిందని ఆయన తెలిపారు. అంతకు ముందు సెప్టెంబర్ 18 న జరిగిన ఐఎంఎఫ్ బోర్డు డైరెక్టర్ల సమావేశంలో ద్రవ్యనిధి చేతుల్లోని బంగారంలో ఎనిమిదవ వంతు విక్రయించేందుకు నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

### రికార్డు స్థాయికి గోల్డ్ ఫ్యూచర్స్

ముంబై : ఐఎంఎఫ్ నుంచి 200 మెట్రిక్ టన్నుల బంగారాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేసిందన్న వార్తలు దేశీయ బులియన్ మార్కెట్లో ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మరింత పెంచాయి. ఫ్యూచర్స్ మార్కెట్లో బంగారం ధర రికార్డు స్థాయికి పెరిగింది. మంగళవారం నాటి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ బులియన్ సెషన్‌లో డిసెంబర్ కాంట్రాక్టులో 10 గ్రాముల బంగారం ధర 16,248 రూపాయలకు చేరింది. సోమవారం నాడు ఇదే కాంట్రాక్టుకు పలికిన ధర 16,173 రూపాయలు. ఐఎంఎఫ్ నుంచి భారత్ భారీ ఎత్తున బంగారం కొనుగోలు చేయడమే ధరలు పెరగడానికి కారణమైందని, సమీప భవిష్యత్‌లో ఈ ధర మరింత ఎత్తునకు చేరే అవకాశాలున్నాయని ఆనంద్ రాఠీ కమోడిటీస్ వైస్ ప్రెసిడెంట్ కిషోర్ నార్నే వ్యాఖ్యానించారు. ( ఆంధ్రప్రభ, 4-11-2009 )

ఫొటోలో కనపడుతున్నది ఏమిటి? - బంగారం దిమ్మలు. ప్రతీ దేశంలోనూ, కేంద్ర బ్యాంకుల్లో, రహస్య స్టోరుల్లో వుండేవి, ఆ దిమ్మలే.

[ ఈ వార్త పిల్లలకు అర్థం కాదు ఇప్పుడు. ఈ పుస్తకంలో, బ్యాంకుల విషయాలు చూడలేదు. అయినా, దీన్ని ఒక సారి చదివి వదిలెయ్యండి. బ్యాంకుల గురించి నేర్చుకున్నప్పుడు ఇది అర్థమవుతుంది. ]

ఐఎంఎఫ్ అంటే - అంతర్జాతీయ ద్రవ్య నిధి. ఆర్ బి ఐ అంటే - భారత దేశపు కేంద్ర బ్యాంకు. ఈ వార్త చెప్తున్నది ఏమిటంటే, భారత బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి నించి కొంత బంగారాన్ని కొన్నది.

అంతర్జాతీయ ద్రవ్య నిధి దగ్గిర బంగారం ఎందుకు వుంటుంది? అది, దాన్ని ఎందుకు అమ్మింది?

డబ్బు వున్న వాళ్ళు, కొంత డబ్బుని బ్యాంకుల్లో దాచుకుంటారు కదా? ఆ బ్యాంకు, ఆ డబ్బుతోనే వడ్డీ వ్యాపారం చేసి, అలా వచ్చిన వడ్డీల్లో నించి, డబ్బు దాచుకున్న వాళ్ళకి కూడా కొంత వడ్డీని ఇస్తుంది కదా?

అంతర్జాతీయ ద్రవ్య నిధి చేసే పని కూడా పెద్ద వడ్డీ వ్యాపారమే. ఆ వ్యాపారం చెయ్యాలంటే, ఆ సంస్థకి డబ్బు కావాలి కదా? ప్రపంచ దేశాలన్నీ కొంత కొంత డబ్బుని ఆ సంస్థలో పెట్టాలి. 'డబ్బుని' అంటే, ఆ దేశాల 'కాయితం డబ్బుని' కాదు. బంగారాన్నే పెట్టాలి. బంగారమే ప్రపంచ ధనం కదా? - ఆ రకంగా, ఆ సంస్థలో, బంగారం దిమ్మలు వుంటాయి. ఐదో, ఆరో కిలోలు కాదు. వేల టన్నులు టన్నులు వుంటాయి. అవి అన్నీ, ఆ బ్యాంకుకి డిపాజిట్లు.

ఆ దిమ్మల బంగారం విలువకి తగినట్టుగా కాయితం డబ్బు తయారవుతుంది. ఏ దేశానికి అప్పు ఇవ్వాలంటే, ఆ దేశానికి కావలసిన కాయితం డబ్బు. అన్ని దేశాలూ, అంతర్జాతీయ ద్రవ్య నిధి నించి అప్పులు తీసుకుంటూ, వడ్డీలు చెల్లిస్తూ, అసలు కూడా చెల్లిస్తూ, మళ్ళీ అప్పులు తీసుకుంటూ వుంటాయి. ఆ రకంగా ఆ సంస్థ చక్కగా, ప్రపంచ దేశాలతో వడ్డీ వ్యాపారం చేస్తూ వుంటుంది.

ఇప్పుడు సంక్షోభాల కాలం కదా? అన్ని దేశాల్లోనూ, సరుకుల అమ్మకాలు మూలబడి, పెట్టుబడిదారులు బ్యాంకులకు అప్పులు చెల్లించలేక, బ్యాంకుల దగ్గిర డబ్బు లేకుండా పోయింది కదా? కాబట్టి ఇప్పుడు, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థకి, వడ్డీ వ్యాపారాన్ని పెంచుకునే మంచి అవకాశం దొరికింది. తన దగ్గిర డిపాజిట్లుగా వున్న బంగారంలో నించే కొంత బంగారాన్ని అమ్మేసి, ఆ డబ్బుని అప్పులు ఇస్తే, దేశాలు ఎక్కువ అప్పులు తీసుకుంటాయి. వాటిని అవి, తమ పెట్టుబడిదారులకు అప్పులుగా ఇస్తాయి. వాళ్ళు, అర్జంటుగా బ్యాంకులకు చెల్లించవలసిన వాటిని చెల్లిస్తారు. ఈ మొత్తం కార్యక్రమంలో, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ దాకా వడ్డీలు అందుతాయి.

ఆ సంస్థ ఆ బంగారం అమ్మడం ఎందుకంటే, అలా అమ్మగా వచ్చిన డబ్బుని, "పేద దేశాలకు మరిన్ని రుణాలివ్వాలని" అట! ఎప్పుడూ ఇచ్చే రుణాలే గాకుండా 'మరిన్ని రుణాలు' ఇవ్వాలని! మరిన్ని రుణాలు ఇస్తే, చక్కగా 'మరిన్ని వడ్డీలు' వస్తాయి కదా?

ఆ పేద దేశాలు ఎలాంటివి అంటే, "దారిద్ర్య రేఖకు దిగువన వున్న దేశాలు!" దరిద్రంలో వుండేది కొందరు మనుషులే కాదు; మొత్తం దేశాలే! కానీ, అక్కడి పెట్టుబడిదారులు కాదు దారిద్ర్యంలో వుండేది. అలాంటి దేశాలకు మరిన్ని అప్పులు ఇచ్చి, వాటి నించి 'మరిన్ని వడ్డీలు' లాగడానికన్న మాట, ఆ బంగారం అమ్మింది!

403.3 మెట్రిక్ టన్నుల బంగారాన్ని అమ్మేసి, ఆ డబ్బుని అప్పులు ఇవ్వాలని, సంస్థ డైరెక్టర్ల బోర్డు నిర్ణయించింది. సంస్థ చేతిలో వున్న మొత్తం బంగారంలో, అది 8 వ వంతు. అంటే, ఆ సంస్థలో మొత్తం ఎన్ని టన్నుల బంగారం వుందో లెక్క కట్టండి! 403.3 × 8 = 3,266.4 టన్నులు!

అయితే, ఇప్పుడు అమ్మింది

200 టన్నులే. ఆ బంగారం ధర ఎలా వుందో కూడా ఆ వార్తలోనే కనపడుతోంది. సోమవారం ధర కన్నా, మంగళవారం ధర పెరిగిందట! మంగళవారం అమ్మడం వల్ల, మంచి ధర గిట్టిందని ఆ సంస్థ వాళ్ళు సంతోషపడుతున్నారు. (బుధవారం అమ్మితే ఇంకా మంచి ధర పలికేదిగా? ఆ మాత్రం తెలివి లేదా ఆ సంస్థకి?)

సరే, మరి భారత దేశపు కేంద్ర బ్యాంకు వాళ్ళు ఆ బంగారాన్ని ఎందుకు కొన్నారు? 'ఎవరు ఏ పని చేసినా ఏదో లాభం కోసమే చేస్తారు' అనే పెట్టుబడిదారీ సూత్రాన్ని మర్చిపోకుండా వుంటే, ఏ సందేహానికైనా జవాబు దొరుకుతుంది.

ద్రవ్య నిధి అయితే, బంగారాన్ని ఎందుకు అమ్మిందో ఒక కారణం చెప్పకుంది కాబట్టి, ఆ కారణం మనకు తెలిసింది, 'మరిన్ని' అప్పులు ఇవ్వడానికి అమ్మింది' అని. కానీ, భారత రిజర్వ్ బ్యాంకు అయితే, ఆ బంగారాన్ని ఎందుకు కొన్నదో ఏ కారణమూ చెప్పలేదు. కాబట్టి, ఆ కారణాన్ని మనమే ఊహించాలి.

భారత బ్యాంకు, మరింత మరింత కాయితం డబ్బుని ప్రింటు చెయ్యదల్చుకుందేమో! దాని కోసం కొంత బంగారాన్ని ఆధారంగా పెట్టాలి కదా? ఆ బంగారాన్ని బ్యాంకులో పెట్టి, కోట్ల కోట్ల కాయితం డబ్బుని ప్రింటు చేసి, దానితో మరిన్ని అప్పులు ఇస్తే, మరిన్ని వడ్డీలు వస్తాయి కదా? అందుకే ఆ బంగారాన్ని కొన్నదేమో!

లేకపోతే, కాయితం డబ్బు కోసం ఆధారంగా వుంచిన విదేశీ బాండ్లని వేటినైనా తగ్గించేసి, బంగారాన్నే ఆధారంగా వుంచదల్చిందేమో!

భారత బ్యాంకు, 'ఫలానా అవసరం కోసం బంగారాన్ని కొన్నాను' అని చెప్పలేదు కదా? కాబట్టి, దాని అవసరం ఏమిటో మనకు ఖచ్చితంగా తెలీదు. అయినా, ఈ బ్యాంకుల సమాచారాలు మనకు రెగ్యులర్‌గా తెలుస్తూ వుంటే, దేన్ని అయినా అర్థం చేసుకోవచ్చు.

మొత్తానికి, భారత రిజర్వ్ బ్యాంకు, ఆ బంగారాన్ని ఎందుకో అందుకు కొన్నది. అయితే, ఆ బంగారానికి బదులుగా, భారత బ్యాంకు, అంతర్జాతీయ సంస్థకి, ఏం ఇస్తుంది? కాయితం డబ్బు ఇస్తే పనికి రాదు కదా? మళ్ళీ బంగారమే ఇవ్వాలా? - బంగారానికి బదులు, బంగారం ఇవ్వడం ఏమిటి? - అలా కాదు. భారత రిజర్వ్ బ్యాంకు ఎక్కౌంట్‌లో, ఈ దేశం, చాలా ఇతర దేశాలకు తన సరుకుల్ని అమ్మగా సంపాదించిన విదేశీ మారకం విలువ వుంటుంది. ఆ లెక్కలన్నిటినీ ద్రవ్య నిధికి బదలాయిస్తుంది.

ఇదంతా మనకు అక్కరలేదు గానీ, ఈ సందర్భంలో ఒక్క విషయం అర్థం చేసుకుంటే చాలు. ఇది సంక్షోభాల కాలం కాబట్టి, ద్రవ్య సంస్థ, మరిన్ని వడ్డీలు సంపాదించడం కోసం, ఆ బంగారాన్ని అమ్మింది.

అసలు పెట్టుబడిదారీ దోపిడీ గురించి సరిగా తెలిస్తే, 'బంగారం' అనే మాట వినగానే కడుపులో వికారం పుట్టాలి.

ఈ 10 వార్తలూ చూసిన అవగాహనతో, పత్రికల్లో అప్పుడప్పుడూ కనపడే ఇలాంటి వార్తల్ని శ్రద్ధగా చూడండి! ★

## మానవులందరూ వర్గ మానవులే

# 86. 'వర్గం' అనేది ఏక శిల కాదు!

ఆటవిక దశల్ని వదిలేస్తే, ఆ నాటి నించీ ఈ నాటి దాకా వున్న సమాజాలు, వర్గ సమాజాలే. పెట్టుబడిదారీ సమాజాన్ని మార్చే దృష్టితో రేపు ప్రారంభమయ్యే సమాజం కూడా, వర్గ సమాజమే. రేపు తర్వాత స్థిరపడే సమాజమే వర్గాలు లేని సమాజం!

ఈ వర్గాల గురించీ, ఈ సమాజాల గురించీ, ఈ పుస్తకంలో చూసింది చాలా చాలా తక్కువ. ఈ విషయాలు ఇంకా వివరంగా చూడడం, మార్క్సు 'కాపిటల్'లోనే సాధ్యమవుతుంది. కానీ అది చాలా కఠిన గ్రంథం. కొన్ని చాప్టర్లు చక్కగానే అర్థమవుతాయి, కొన్ని చాప్టర్లు కష్టంగా అర్థమవుతాయి. ఆ ఇంగ్లీషు ఒరిజినల్ గ్రంథానికి తెలుగు అనువాదాలు కూడా ఉన్నాయి. వాటిని అక్కడక్కడా చదివి సంతోషించవచ్చు. దాని కన్నా ముందు, మార్క్సు 'కాపిటల్'కి నేను రాసిన 'పరిచయం' చదివితే, కష్టం కొంత తగ్గుతుంది. ఆ తర్వాతే ఒరిజినల్‌కి వెళ్ళవచ్చు.

**'వర్గం' అనేది ఏక శిల కాదు :**

ఏ వర్గంలో అయినా వేరు వేరు సెక్షన్లు (విభాగాలు) ఉంటాయి. కార్మిక వర్గంలో, శారీరక శ్రమలూ, మేధా శ్రమలూ - అనేవి ప్రధాన సెక్షన్లు. ఆ సెక్షన్లలో, శ్రమల రకాలూ, శ్రమల పరిస్థితులూ, శ్రమల విలువలూ, శ్రమ శక్తుల విలువలూ, జీవన పరిస్థితులూ అన్నీ, తక్కువ ఎక్కువలుగా, తేడాలుగా ఉంటాయి. శారీరక శ్రమల మీద, మేధా శ్రమల ఆధిపత్యం ఉంటుంది. ఈ కార్మిక సెక్షన్ల మధ్య కూడా వైరుధ్యాలు ఉంటాయి. అయితే, ఆ వైరుధ్యాల స్వభావం, మిత్ర వైరుధ్యాల స్వభావమే గానీ శత్రు వైరుధ్యాల స్వభావం కాదు. ఒక కార్మికుణ్ణి ఇంకో కార్మికుడు దోచుకుని లాభపడే దేమీ వుండదు. కార్మిక పోరాటాలు, విజయాలు పొందుతూ సాగాలంటే, ప్రధాన సూత్రాలు, - ప్రతీ కార్మిక సెక్షన్‌కీ తోటి కార్మిక సెక్షన్లను గురించిన స్పష్టతా, 'అందరమూ కార్మికులమే' అనే గ్రహింపూ, అన్ని సెక్షన్ల మధ్యా ఐక్యతా.

'దోపిడీ వర్గం' సంగతి చూస్తే, ఆ వర్గంలో, అదనపు విలువ ఎన్ని పేర్లతో పంపకాలవుతుందో అన్ని సెక్షన్లు ఉంటాయి. ఆ పంపకాల్లో, ఎక్కువ వాటాల కోసమే ఆ సెక్షన్ల మధ్య ఘర్షణలు సాగుతాయి. దోచుకునే 'అదనపు విలువ రాసి'ని పంచుకోవడంలో ఘర్షణలు అవి. దేశాల మధ్య యుద్ధాలకు కారణం కూడా దాని స్వాధీనాల కోసమే.

యుద్ధాలు, భూమి కోసమూ, భూమిలో దొరికే వనరుల కోసమూ జరుగుతున్నట్టు కనపడతాయి. కానీ అది నిజం కాదు. భూమి ఎంత దొరికినా, మొత్తం భూమండలం అంతా దొరికినా, దాని వల్ల, ఏ పెట్టుబడిదారుడికీ వచ్చేదేమీ ఉండదు. ఆ భూమి మీద శ్రమలు జరగాలి. వ్యవసా

యాలూ, పరిశ్రమలూ, వ్యాపారాలూ, అన్నీ జరగాలి. ఆ శ్రమలతో ఉత్పత్తుల రాసులు తయారవ్వాలి. ఆ రాసుల్లో నించి 'అదనపు ఉత్పత్తి' (అదనపు విలువ) మిగలాలి. అసలు కావలసింది అదీ! ఏ పోటీ అయినా, ఏ యుద్ధం అయినా, అదనపు శ్రమ కోసమే. లాభం కోసమే. అదనపు డబ్బు కోసమే. ఉత్త భూమి కోసం కాదు.

దోపిడీ వర్గంలో, శత్రు, మిత్ర వైరుధ్యాలు రెండూ ఉంటాయి. ఒక రాజు, ఇంకో రాజు మీదకి దండెత్తి, రెండో రాజుని చంపేసి, ఆ దేశాన్ని ఆక్రమిస్తాడు. పెట్టుబడిదారీ పాలకులు కూడా పూర్తిగా అదే పని చేస్తారు. అన్ని దేశాల పాలకుల్నీ చంపేసి, అన్ని దేశాల్నీ ఆక్రమిస్తే, అన్ని దేశాల అదనపు విలువ రాసుల్నీ పోగు చేసుకోవడం సాధ్యం. ఈ రకంగా, ఈ వర్గంలో, దోపిడీదారులందరి మధ్యా శత్రు వైరుధ్యాలే ఉంటాయి. కానీ, ఈ వర్గానికి, శ్రామిక వర్గంతో పోరాటాలు అవసరమైనప్పుడు, ఆ వర్గంలో శత్రు వైరుధ్యాలు తాత్కాలికంగా పోతాయి. కార్మిక పోరాటాల్ని అణిచే కార్యంలో ఈ దోపిడీ వర్గం అంతా ఏక శిలగా కలిసిపోతుంది.

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. మానవులందరూ వర్గ మానవులే - అంటే?

**జ** : ప్రతీ మనిషీ ఏదో ఒక వర్గానికి చెంది వుంటారు. శ్రమ చేసే వర్గానికి గానీ, చెయ్యని వర్గానికి గానీ. ఆ వర్గంలోనే, ఏదో ఒక విభాగానికి.

**2**. రాజమ్మ ఏ వర్గం?

**జ** : అలా చెప్పలేము. ఆమె ఏం శ్రమ చేస్తోందో, ఎక్కడ చేస్తోందో, ఏమీ శ్రమ చెయ్యడం లేదో, ఆ వివరాలు వుండాలి.

**3**. రాజమ్మ, కొన్ని ఇళ్ళ వాళ్ళకి బట్టలు ఉతికి పెడుతుంది రోజూ. ఆమె ఏ వర్గం?

**జ** : శ్రమ చేస్తోంది కాబట్టి, శ్రామిక వర్గంలో మనిషి. అయితే, ఆమె, ఒక యజమాని ద్వారా ఆ శ్రమ చేస్తోందా, తనే స్వతంత్రంగా చేసుకుంటోందా? అది కూడా తెలియాలి.

**4**. ఒక శాసన సభ్యుడు వున్నాడు. ఆస్తి లేదు. అతను ఏ వర్గం?

**జ** : ఇదీ అడగాలా? శాసన సభ్యుడు అవ్వాలంటే ఎన్నికల్లో నెగ్గాలి. దానికి బోలెడు డబ్బు కావాలి. అతనికి డబ్బు లేకపోయినా, పెట్టుబడిదారులెవరో అతనికి డబ్బు ఇచ్చి గెలిచేలాగ చేశారని అర్థం. అతను, శాసన సభ్యుడై, అసెంబ్లీలో ఏం చేస్తాడు? శ్రమ దోపిడీకి అనుకూలంగా వుండే చట్టాల్ని మార్చాలనే దృష్టితో వెళ్ళాడా? - కాదు. వాటిని సమర్థించాలనే దృష్టితోనే వెళ్తాడు. పరిపాలన అంతా భూస్వాములకూ, పెట్టుబడిదారులకూ, వాళ్ళ ఆస్తి ప్రయోజనాలకే అనుకూలంగా వుంటుంది. ఆ యంత్రాంగంలో అతను ఒక చిన్న మేకు. కాబట్టి, అతను కూడా ఆ వర్గం మనిషే అవుతాడు.

**5**. ఒక పోలీసు. ఏ వర్గం?

**జ** : అతను ఏం పని చేసే పోలీసు? రోడ్ల మీద బళ్ళు ఎటు పోవాలో జాగ్రత్తలు చెప్పే ట్రాఫిక్ పోలీసు అయితే, అతను రోడ్లు వూడ్చేటంత సాదా శ్రామికుడు. →

అలా గాక, సమ్మె చేసే కార్మికుల మీదకి తుపాకీ పట్టుకుని తిరిగే వాడైతే, ఆ పోలీసు, దోపిడీ వర్గ ప్రయోజనాలకు అనుకూలంగానూ, ప్రజలకు వ్యతిరేకంగానూ వుంటాడు.

**6**. ఒక వ్యక్తి వర్గాన్ని తెలుసుకునే మార్గం ఏమిటి?

**జ** : శ్రమ చేస్తున్నారా, లేదా? వాళ్ళ పోషణ, ఏ ఆదాయంతో సాగుతోంది? యజమానిగా వున్నాడా, శ్రామికుడిగా వున్నాడా? స్త్రీలకైనా, పురుషులకైనా ఈ ఆధారాల్ని బట్టే చూడాలి.

**7**. 'మధ్య తరగతి' అంటారు. అది ఏమిటి?

**జ** : 'మధ్య తరగతి' అంటే, మధ్యలో వుండే తరగతి. వేటి మధ్యలో? అత్యున్నత వర్గానికీ, అట్టడుగు వర్గానికీ మధ్యలో అనుకోవాలి. పై దానికీ, కింది దానికీ మధ్యలో. ఈ మధ్యలో వాళ్ళు కూడా శ్రమలు చేస్తారు. వీళ్ళు మధ్య స్థాయి మేధా శ్రమల వారు కావచ్చు. లేదా, కార్మికులతో పాటు తాము కూడా పని చేసే చిన్న స్థాయి పెట్టుబడిదారులు కావచ్చు. వీరు మరీ బీదలు గానూ, మరీ ధనికులుగానూ వుండరు. కానీ, వీరి లక్ష్యం అంతా, ధనికులుగా ఎదగాలనేదే! ★

# 87. యుగ యుగాల మకిలితో వున్న కార్మిక వర్గం

ప్రపంచ కార్మిక వర్గం ఇంకా ఈ నాటికీ సంపూర్ణమైన అజ్ఞానంలోనే వుంది. దీని పోరాటాలు 'జీతాల పెంపు' దగ్గిరే తచ్చట్లాడుతున్నాయి. ఈ కార్మిక వర్గం, యజమాని వర్గం నించి నేర్చుకున్న దుర్గుణాల్లో మొట్ట మొదటిది, ఈ 'డబ్బు' దృష్టి. 'మారకం విలువ' దృష్టి. కార్మికులకు పట్టిన ఈ డబ్బు దృష్టి, కేవలం బతుకు దెరువు కోసమే కాదు ; ఇది, డబ్బుకే విలువని ఇచ్చి, డబ్బుకే లొంగిపోయే దృష్టి. ఈ దృష్టిలో, యజమాని వర్గానికి వున్న దుర్గుణాలన్నీ కలగలిసి వుంటాయి.

కార్మిక వర్గం గురించి మార్క్సు, "యుగ యుగాల మకిలితో వున్న కార్మిక వర్గం" అన్నాడు. మార్క్సుకి కార్మిక వర్గం మీద ఎంత ప్రేమ వున్నా, అది కార్మిక వర్గ భావాల మీద విమర్శ.

కార్మిక వర్గానికి వున్న ఏకైక సద్గుణం - శ్రమ చెయ్యడం. మొత్తం సమాజాన్ని పోషించేది ఆ సద్గుణమే. ఈ వర్గం, తన శ్రమతోనే తను జీవిస్తుంది. కానీ, ఆ సద్గుణాన్ని తీసి పక్కన పెడితే, ఇక కార్మిక వర్గానికి వున్న భావ జాలం అంతా, యజమానుల వర్గ భావ జాలమే. పాలించే వర్గ భావాలే, ప్రజల భావాలు.

బానిసల్లో కూడా, యజమానులకు వత్తాసుదారులుగా పనిచేస్తూ, తామే యజమానులుగా మారిన బానిసలు వుంటే వుండవచ్చు.

కౌలు రైతుల్లో కూడా, ఆస్తి రంధితో,

తామే భూస్వాములుగా మారిన కౌలు రైతులు వుంటే వుండవచ్చు.

వేతన కార్మికుల్లో కూడా, పెట్టుబడి దారులుగా మారిన కార్మికులు వుండ వచ్చు. - ఇవన్నీ అక్కడక్కడా అరుదుగా జరిగే ప్రత్యేక సంఘటనలు.

కానీ, సాధారణ మెజారిటీ కార్మిక జనాభాని తీసుకుంటే, వారు జీవితాంతం శ్రమ జీవులే, కష్ట జీవులే. కానీ వారి జ్ఞానం, యజమానుల జ్ఞానం నించి ఏ మాత్రమూ భిన్నమైనది కాదు. శ్రమ సంబంధాల గురించి ఏ మాత్రమూ తెలిసినది కాదు. శారీరక శ్రమల జనాభాలో కూడా అనేక మంది, తాము కూడా ధనికులుగా మారా లనీ, తాము కూడా 'గొప్ప వారు' గా కీర్తి సంపాదించాలనీ, తాము కూడా సేవకుల్ని పెట్టుకోవాలనీ, కలలు కంటూ వుంటారు.

పని స్తలాల్లో, పై స్థాయి కార్మికులైన ఇంజనీర్లూ, డాక్టర్లూ, టీచర్లూ వంటి వాళ్ళకి, తామూ కార్మికులమే అనే సంగతే తెలియదు. తాము 'గొప్ప ఉద్యోగుల మ' నీ, శారీరక శ్రమలు చేసే వాళ్ళే కార్మికు లనీ, అనుకుంటారు. మేధా శ్రమల కార్మి కుల డిగ్రీల చదువుల జ్ఞానం, ఆ స్థాయిలో వుంటుంది.

తర తరాల నించీ పోగేసుకున్న ఈ మకిలికి, శారీరక శ్రమల వారా, మేధా శ్రమల వారా అనే తేడా లేమీ వుండవు. ప్రకృతి విషయాల్లోనూ, సమాజ విషయా ల్లోనూ, దాదాపు అందరూ ఒకే రకమైన తప్పు భావాలతో, తప్పు ప్రవర్తనలతో వుంటారు. యంత్రాల్ని చేసే వారూ, యంత్రాల్ని నడిపేవారూ అందరూ ఒక్క లాగే, యంత్రాలకు బొట్లు పెట్టి, హారతు లిచ్చి, దణ్ణాలు పెట్టి, తమకు బుర్రలు వుండడమే దండగ చేసుకుంటారు. పెద్ద పెద్ద డాక్టర్లు కూడా పేషెంట్లతో, "దేవుళ్ళకి మొక్కుకోండి" అంటూ, పేషెంట్లని దేవుళ్ళ పూజలకి అప్పజెపుతారు. కంప్యూటర్ల, రాకెట్ల నిపుణులు, ఇతర గ్రహాల సర్వేలకు పోతూ, చంకల్లో దేవుళ్ళ బొమ్మలు పెట్టుకు పోతారు. కూలి పని చేసే శ్రామికురాలైతే, పిల్లకి ఒళ్ళు వెచ్చబడితే మంత్రాలు వేయి స్తుంది. ఈ అజ్ఞానికీ, ఆకాశంలో తిరిగే ఆ విజ్ఞానికీ, ఏమిటి తేడా?

పై స్థాయి కార్మికులు, తమ ఆధీనంలో పని చేసే కింది స్థాయి కార్మికుల మీద, ఆధిపత్యాలు నెరుపుతారు. యజమానుల ధోరణిలోనే, యజమానుల స్వభావంతోనే, ప్రవర్తిస్తారు. పురుష కార్మికులు, స్త్రీ కార్మి కుల మీద ఆధిపత్యాలు నెరుపుతారు. కార్మిక వర్గంలో, స్త్రీ లైనా, పురుషులైనా, ఏ స్థాయి కార్మికులైనా, యజమాని వర్గ సంస్కృతితోనే జీవితాలు సాగిస్తారు. యజ మాని వర్గ విలాసాల కోసం, యజమాని వర్గ వ్యసనాల కోసం, అర్రులు చాస్తారు. - ఇదంతా యుగ యుగాల దోపిడీ సంస్కృతుల నించి జీర్ణించుకున్న మకిలి.

కార్మిక వర్గం, తన విముక్తి లక్ష్యాన్ని సాధించాలంటే, అది ఎంతో నేర్చుకోవాలి. మొదట శ్రమ దోపిడీ సిద్ధాంతాన్ని ఎరిగి వుండాలి. ఆ సంబంధాల్లో వున్న కౄర త్వాన్నీ, ఆ సంస్కృతిలో వున్న నీచత్వాన్నీ గ్రహించి, వాటి ఛాయలు తమ భావాల్లో, తమ ప్రవర్తనల్లో, లేకుండా చేసుకోవాలి.

యజమానుల భావ జాలంలోనే

మునిగి వుండి, జీతాల పెంపుని మాత్రమే తమ ఏకైక లక్ష్యంగా చేసుకునే కార్మికులు, తమ జీవితాల్ని దాస్యానికే అంకితం చేసుకుంటారు. జీతాల్ని ఎంత పెంచినా పెట్టుబడిదారుడికి పోయే దేమీ వుండదు. ఒక చేత్తో జీతాల్ని పెంచి, ఇంకో చేత్తో ఆ పెరిగిన జీతం మీదే లాభం వేసుకుని సరుకు ధరని పెంచుతాడు. అప్పుడేమవుతుంది? జీతాల పెంపు కార్మికుల్ని ఎంత విముక్తి చేస్తుంది?

కార్మికులు మార్క్సు రాసిన 'కాపిటల్' ద్వారా శ్రమ దోపిడీ గురించి తెలుసుకోవాలి. దాస్య విముక్తినే తమ లక్ష్యంగా చేసుకోవాలి. నూతన మానవ సంబంధాల నిర్మాతలుగా రూపొందడానికి, కార్మికులు తమని తాము అర్హులుగా చేసుకోవాలి. యజమాని వర్గం నించి అందే ప్రతీ తప్పు భావాన్నీ, ప్రతీ తప్పు సంకేతాన్నీ, గుర్తించగలిగే సమర్థులుగా తమ జ్ఞానాన్ని అభివృద్ధి పరుచుకోవాలి.

శ్రమ దోపిడీని రద్దు చెయ్యగలిగే నూతన జ్ఞానం, విప్లవ జ్ఞానం అవుతుంది. అటువంటి పోరాటం విప్లవ పోరాటం అవుతుంది.

ఆ పోరాటం హింసాత్మకంగా సాగుతుందా, అహింసాత్మకంగా సాగుతుందా అనేది, కార్మిక వర్గం మీద కాదు, దోపిడీ వర్గం మీదే ఆధారపడి వుంటుంది. దోపిడీ వర్గం, శ్రమ దోపిడీని అర్థం చేసుకుని, ఆ మార్గాన్ని తిరస్కరించి, స్వంత శ్రమలతోనే జీవించడానికి స్వచ్ఛందంగా అంగీకరిస్తే, ఏ పోరాటాలకూ, ఏ వర్గ హింసలకూ తావు వుండదు. కానీ, అది భ్రమ. అది అర్థ రహితమైన ఊహ! దోపిడీ వర్గం, కార్మిక పోరాటాల్ని అణచడానికే ప్రయత్నిస్తుంది గానీ, తనని సంస్కరించుకోవడానికి ప్రయత్నించదు. చరిత్ర, ఆ నిజాలనే చూపిస్తోంది. కాబట్టి, కార్మిక వర్గానికి, దాని విముక్తి పోరాటాలు దానికి తప్పవు.

విప్లవ పోరాటం అనేది, రాజ్యాధికారాన్ని సాధించే వరకే కాదు. ఆ రాజ్యాధికారం, మంత్రి పదవులతో ఆసనాలు అధిష్టించడానికి కాదు. ఆ క్షణం నించే, ఆస్తి సంబంధాల్లో, శ్రమ సంబంధాల్లో, మార్పులు ప్రారంభమవుతాయి. దోపిడీ వర్గం అధికారంలో లేకపోయినా, ఇంకా అది, సమాజంలో ప్రారంభంలో ఎప్పటి లాగే వుంటుంది. అది, కార్మిక వర్గ పరిపాలనని పడగొట్టే ఆలోచనతోనే వుంటుంది. కార్మిక వర్గం చెయ్యదల్చుకున్న ప్రతీ మార్పు దగ్గిరా ఆటంకాలు ఎదురవుతాయి. ప్రతీ దశ లోనూ దోపిడీ సంబంధాల్నీ, దోపిడీ సంస్కృతినీ, తీసివేసే విప్లవ పోరాటం సాగవలసి వుంటుంది.

కార్మిక జనాభా, ప్రతీ మార్పునీ, శ్రమ దోపిడీకి వ్యతిరేక దిక్కులో చెయ్యాలంటే, ఆ జనాభాలో అధిక సంఖ్యకి, అసలు శ్రమ దోపిడీ అంటే ఏమిటో తెలిసి వుండాలి. కౌళ్ళనీ, వడ్డీ లాభాల్నీ, యజమానితనాల్నీ, ఆధిపత్యాల్నీ, ఎందుకు వ్యతిరేకించాలో తెలిసి వుండాలి. బానిసల కాలం నించీ గడిచిన శ్రామిక వర్గాల చరిత్ర తెలిసి వుండాలి.

దోపిడీ ఆదాయ మార్గాల్ని తీసివెయ్యడానికి దోపిడీదారులు వ్యతిరేకించినట్టే, మేధా శ్రమల కార్మికులు, శారీరక శ్రమలు

చెయ్యడానికి వ్యతిరేకిస్తారు. అలాగే, పురుషులు, ఇంటి పనులు చెయ్యడానికి మొరాయిస్తారు. అలాగే, కుటుంబాల్లో స్త్రీలు, ఇంటి పనులు చేసే శ్రామికుల మీద, తమ ఆధిపత్యాలు నెరపడానికే ప్రయత్నిస్తారు. - ఈ తప్పుడు విధానాలన్నీ వెనకటి కాలం నించీ పుట్టుకొచ్చినవే. ఈ తప్పుడు సంబంధాలన్నిటినీ మార్చుకోవాలంటే, ఆ సంబంధాల్లో వున్న అన్యాయం ఏమిటో కార్మిక జనాభాకి తెలియాలి. ఈ నూతన జ్ఞానం రాకపోతే, మేధా శ్రమల కార్మికులు శారీరక శ్రమలు కూడా చెయ్యడానికి ఇష్టపడరు ; ఏ నాటి నించో శారీరక శ్రమలకే అంకితమైన సెక్షన్లని, తమతో సమానం కానివ్వరు. ఆ శారీరక శ్రమల కార్మికులు కూడా తమ స్త్రీలని తమతో సమానం కానివ్వరు.

కార్మిక జనాభా, భూస్వాముల మీదా, పెట్టుబడిదారుల మీదా పోరాటాలు చెయ్యడమే కాదు ; తమలోనే పేరుకు పోయి వున్న తప్పుడు భావాల మీద కూడా పోరాటాలు చేసుకోవాలి. ఏదో ఒక శ్రమ చేస్తూ వున్నంత మాత్రాన ఆ కార్మికుడు, ఉత్తముడై పోయినట్టూ, అతను ఇక మారవలసిందేమీ లేనట్టూ అర్థం కాదు. యజమాని వర్గం మీద పోరాటాల్లో కార్మిక జనాభా ఓడిపోయినప్పుడల్లా, దానికి కారణం, ఆ జనాభాయే అవుతుంది.

కార్మిక జనాభా, తమ పోరాటాల్ని ఎంత సవ్యమైన మార్గంలో, ఎంత ఐక్యతతో చెయ్యగలిగితే, అంత త్వరగానూ, అంత శక్తివంతంగానూ, యజమానీ శ్రామిక సంబంధాలు, సమిష్టి సంబంధాలుగానూ, సమానత్వ సంబంధాలుగానూ మారతాయి.

కార్మిక వర్గ పోరాటం, దాని విముక్తి కోసమే అయినా, అది యజమాని వర్గానికి కూడా విముక్తి అవుతుంది! దోపిడీ వర్గానికి, దోపిడీ హక్కులూ, దోపిడీ ఆదాయాలూ సాధ్యం కాకుండా పోయినప్పుడు, క్రమంగా ఆ వర్గం, శ్రమ దోపిడీ మీద జీవించే నీచ, కౄర మార్గాల్ని వదిలి, స్వంత శ్రమతో జీవించే ఆత్మ గౌరవ మార్గంలోకి మారుతుంది.

ప్రపంచం మారదా? - అనే సందేహం అక్కరలేదు. వెనకటి చరిత్రని చూడాలి. ప్రపంచం మారుతోంది. బానిసత్వాల కాలం నించీ ఈ నాటి దాకా మారిందంటే, శ్రమ దోపిడీ రహస్యం బైట పడిందంటే, ప్రపంచం మంచి వేపే మారుతోంది. ఆ మంచి, కార్మిక వర్గానికే కాదు ; దోపిడీ వర్గానికీ అది మంచే.

ఈ నాటి సమాజంలో కూడా శ్రమ దోపిడీ ఇంకా వుంది. అది సృష్టించే శత్రు వైరుధ్యాలు ఇంకా వున్నాయి. ఆ వైరుధ్యాలే పోరాటాలకు దారి తీస్తాయి.

న్యాయం కోసం జరిగే పోరాటాలు కూడా కొన్నిసార్లు బలహీనపడవచ్చు ; ఓడిపోవచ్చు; మౌనం వహించవచ్చు. కానీ, అదే శాశ్వత ముగింపు కాదు. శత్రుత్వాలు అంతరించకుండా పోరాటాలు అంతరించవు.

బానిసత్వం అంతరించినట్టే, వేతన బానిసత్వం కూడా అంతరిస్తుంది. బానిసల పోరాటాల లక్ష్యం కన్నా, వేతన బానిసల పోరాటాల లక్ష్యం - అత్యున్నతమైనది!

## ప్రశ్నలూ - జవాబులూ

**1**. మార్క్సు చెప్పే సిద్ధాంతం, విదేశీ సిద్ధాంతం కదా? అది, అన్ని దేశాలకీ పనికి వస్తుందా?

**జ** : మార్క్సు చెప్పింది - శ్రమ దోపిడీని తీసివెయ్యాలని. శ్రమ దోపిడీ వున్న ప్రతీ దేశానికీ అది పనికివస్తుంది. ఏ సైన్సు అయినా, ఎవరు ఎక్కడ కనిపెట్టినా, అది అందరికీ పనికివస్తుంది. భారత దేశంలో శ్రమ దోపిడీ వుందా? వర్గాలు వున్నాయా? కౌళ్ళూ, వడ్డీ లాభాలూ వున్నాయా? యజమానీ శ్రామిక సంబంధాలు వున్నాయా? అలాంటి శ్రమ దోపిడీ భారత దేశంలోనే కాదు, ప్రపంచం నిండా వుంది. దాన్ని తీసి వెయ్యగలిగే సిద్ధాంతం, అది వున్న ప్రతీ చోటా, మొత్తం ప్రపంచానికంతా అత్యవసరం.

**2**. యుగ యుగాల మకిలితో వున్న శ్రామిక జనం, సరైన భావాలు గల వాళ్ళుగా ఎలా మారుతారు?

**జ** : సంఘాల ద్వారానే అది జరగాలి. ఇళ్ళ దగ్గిరా, పని స్తలాల్లోనూ, ఎక్కడి కక్కడ ప్రజల సంఘాలు వుండాలి. ఆ సంఘాల్లో అవి దేని కోసం పని చెయ్యాలో చెప్పే ప్రణాళికలూ, సభ్యులు ఎలాంటి ప్రవర్తనలతో వుండాలో చెప్పే నిబంధనావళులూ, వుంటాయి. ఆ సంఘాల కార్యక్రమాల్ని సభ్యులు నిర్వహిస్తారు. అందులో తప్పు ప్రవర్తనలు వుంటే, సంఘంలోనే విమర్శలకు గురి అవుతారు. ఈ క్రమాల వల్లనే సరియైన భావాలూ, సరియైన ప్రవర్తనలూ, నేర్చుకుంటారు. పోరాటాలనేవి, శత్రు వర్గం మీద మాత్రమే కాదు.,. తమలో వున్న తప్పుడు భావాల మీదా, తప్పుడు ప్రవర్తనల మీదా కూడా. సంఘాల కార్యక్రమాలే, తప్పుల నించి విముక్తం చేస్తాయి. నిర్మలం చేస్తాయి. ★

---

# 88. ఈ దోపిడీ ప్రపంచం మారదా?

ఈ ప్రపంచం మారుతుందా, మారదా?

మారిస్తే మారుతుంది ; లేకపోతే లేదు.

ప్రకృతిలో మార్పులైతే, వాటికి మనుషుల ప్రయత్నాలతో సంబంధం ఉండదు. 'పౌర్ణమి' రావాలంటే, దాని కోసం మనుషులు సంఘాలు పెట్టి, దాన్ని తీసుకు రానక్కర లేదు. దానికై అదే వస్తుంది. గ్రహణాలూ, పౌర్ణములూ, అమావాస్యలూ అన్నీ, మనుషుల ప్రసక్తి లేకుండానే వస్తూ వుంటాయి, పోతూ వుంటాయి. అవి ప్రకృతి సహజత్వాలు.

కానీ సమాజంలో మార్పులైతే అలా కాదు. అవి, వాటికవే జరగవు. మనుషుల సమాజంలో ఏ మార్పు జరగాలన్నా, దాన్ని మనుషులే చేసుకోవాలి. మార్పు ఎవరికి కావాలో వాళ్ళు చేసుకోవాలి.

వెనకటి కాలంలో వుండే 'బానిసత్వం'

ఎలా మారింది? - బానిసలు బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడారు కాబట్టి మారింది. పోరాడకపోతే మారుతుందా? బానిసలం దరూ ప్రారంభంలో లాగే యజమానులకు అణిగి మణిగి వుంటూ, యజమానుల కిరాతకాలన్నీ భరిస్తూ వుండిపోతే, ఈ నాటికీ వెనకటి కాలపు బానిసత్వమే కొనసాగుతూ వుండేది. కానీ బానిసలు, బానిసత్వాన్ని భరించలేదు కాబట్టే అది మారింది.

ఆటవిక సమాజాన్ని వదిలేస్తే, ఇక తర్వాత కాలం నించీ ప్రతీ సమాజమూ శ్రమ దోపిడీ సమాజమే. ఏ సమాజంలో మార్పులైనా, అవి ఎవరికి కావాలో వాళ్ళ పోరాటాల వల్లే జరుగుతూ వస్తున్నాయి. కానీ, బానిసలూ, కౌలూ రైతులూ వంటి వెనకటి శ్రామిక వర్గాలు చేసిన పోరాటాల లక్ష్యాలకూ, శ్రమ దోపిడీ రహస్యం బైట పడిన తర్వాత కార్మిక వర్గం చెయ్యవలసిన పోరాటాల లక్ష్యానికీ, చాలా పెద్ద తేడా వుంది. మౌలికమైన తేడా వుంది.

బానిసల పోరాటాల లక్ష్యం, బాని సత్వాన్ని వదిలించుకోవడం మాత్రమే. బానిసలకు, వారు యజమాని ఆస్తిగా వుండే విధానం పోతే చాలు. ఆ మార్పు జరిగితే, యజమానుల అధికారం కింద ఇంకా శ్రామికులుగా పని చెయ్యడానికి బానిసలకు అంగీకారమే. వారికి శ్రమ దోపిడీ విషయం తెలియదు కాబట్టి, వారి పోరాటాల్లో, బానిసత్వం నుంచి విముక్తి చెందాలనే లక్ష్యం తప్ప ఇతర లక్ష్యాలేమీ వుండవు. బానిసత్వం పోతే, బానిసలు కౌలు రైతులవుతారు. ఎప్పటిలాగే శ్రమలు చేస్తూ, అదనపు శ్రమలు ఇస్తూ వుంటారు. రాజ్యాంగంలో, ''బానిసలు, యజ మానుల ఆస్తి కాదు'' అనే ఒక్క మార్పు తప్ప, ఆ సమాజంలో ఇతర మార్పులేమీ జరగవు. శ్రామికులకు భూమి రాదు. వారి మీద యజమానితనం పోదు. బానిసత్వాన్ని వదిలించుకున్న తర్వాత, ఆ శ్రామికులకు, తమ రాజ్యాంగాన్నీ, తమ పాలననీ, తమ కొత్త సమాజాన్నీ నిర్మించుకునే బాధ్యతేమీ వుండదు. బానిసత్వం పోయిన తర్వాత కూడా, ఆ సమాజం, యజమానుల సమా జమే. ఆ పరిపాలన, యజమానుల పరి పాలనే. ఉత్పత్తి సాధనాలన్నీ, యజమాని వర్గానివే. అంతా వెనకటి శతృ వర్గాల సంబంధాలే. అదంతా బానిసలకు తెలీదు.

అలాగే, కౌలు రైతుల పోరాటాల లక్ష్యం కూడా పరిమితమైనదే. అది, 'కౌళ్ళ భారాన్ని తగ్గించుకోవాలి' అన్నంత వరకే. కౌళ్ళు మరీ ఎక్కువగా కాకుండా, వాటిని తగ్గిస్తే, ఆ తగ్గిన కౌళ్ళని చెల్లించడానికి కౌలు రైతులకు అభ్యంతరం వుండదు. వీరికి కూడా శ్రమ దోపిడీ గురించి తెలి యదు కాబట్టి, వీరి పోరాటాల లక్ష్యం కూడా యజమానితనానికి వ్యతిరేకం కాదు. 'భూమి అంతా యజమానుల ఆస్తే' అని అంగీకరించడానికి వీరూ సిద్ధమే. కౌలు రైతుల పోరాటాల వల్ల, కౌళ్ళు తగ్గి, వారి లక్ష్యం కొంత నెరవేరినా, ఆ తర్వాత వున్న సమాజం కూడా దోపిడీదారుల సమాజమే. అది యజమానుల పరిపాలనే. అప్పుడు వుండేవి కూడా శతృ సంబంధాలే. అదంతా కౌలు రైతులకు తెలీదు.

కానీ కార్మిక వర్గ పోరాటాల లక్ష్యం,

పూర్తిగా వేరు. ఈ వర్గానికి ఇప్పుడు, ' శ్రమ దోపిడీ' విషయం తెలుసు. ( ప్రతీ కార్మికుడికీ తెలుసని కాదు. ) ఈ వర్గ లక్ష్యం - శ్రమ దోపిడీ నించి పూర్తిగా బైట పడడం. యజమానితనం నించి పూర్తిగా బైట పడడం. యజమానుల వర్గ పరిపాలనను తీసివేసి, శ్రామిక వర్గ పరిపాలన ప్రారంభించడం. క్రమంగా వర్గ భేదాలనే తీసివెయ్యడం. - ఈ లక్ష్యం, వెనకటి శ్రామికుల లక్ష్యాలంత తేలికైనదీ, పరిమితమైనదీ, కాదు.

ఈ కార్మిక వర్గం, శ్రమ దోపిడీ నించి విముక్తి చెందాలనుకోవడం, ఏదో 'ఆదర్శం' కోసం కాదు. అది ఎవరికో చేసే మేలు కాదు. అది కార్మిక వర్గానికే ఆత్మరక్షణ. అది, ఆ వర్గానికే దోపిడీ నించీ, తరతరాల దాస్యం నించీ, విముక్తి! - ఆ 'విముక్తి', ఏ వర్గానికి కావాలి? ఆ 'మార్పు', ఏ వర్గానికి కావాలి? - కార్మిక వర్గానికి కావాలి. ఆ వర్గం, ఆ మార్పు కోసం ప్రయత్నిస్తేనే ఆ మార్పు జరుగుతుంది. లేకపోతే లేదు.

శ్రమ దోపిడీని తీసివెయ్యాలంటే, దోపిడీదారులు, తమ 'స్వంత శ్రమ' లేకుండా ఏ ఆస్తి హక్కుల ద్వారా జీవిస్తున్నారో, ఆ ఆస్తి హక్కుల్ని తీసి వెయ్యాలి. భూమి, భూస్వామి శ్రమతో తయారైనది కాదు. మిల్లులూ ఫ్యాక్టరీలూ వంటి ఏ ఉత్పత్తి సాధనాలూ, పెట్టుబడిదారుల శ్రమతో తయారైనవి కావు. ఉత్పత్తి సాధనాలన్నీ, వెనకటి కాలం నించీ, శ్రామికుల శ్రమలతో తయారైనవే. కాబట్టి, భూస్వాముల ఆస్తి హక్కుల్నీ, పెట్టుబడిదారుల ఆస్తి హక్కుల్నీ తీసివేసి, ప్రతీ మనిషీ తన స్వంత శ్రమతో జీవించాలనే నిబంధన పెడితే, అందులో అన్యాయమూ, అక్రమమూ, దుర్మార్గమూ, ఆధిపత్యమూ, ఏమీ ఉండవు. పైగా, ఆ మార్పే - న్యాయమూ, సక్రమమూ, సన్మార్గమూ, సమానత్వమూ, అవుతాయి.

కార్మిక వర్గం చెయ్యవలసిన మార్పు, దోపిడీదారుల్ని సంస్కరించడానికో, ఉద్ధరించడానికో కాదు. అది, ఇతరుల మీద జాలితో చేసే 'సంఘ సంస్కరణ' కాదు. అది, తన ఆత్మరక్షణ కోసం, తన మీద వేలాది సంవత్సరాలుగా సాగుతోన్న అక్రమాన్ని అరికట్టడం కోసం, చేసుకోవలసిన మార్పు!

ఆ మార్పులు చేసే అధికారం కార్మిక వర్గానికి ఉండాలంటే, సమాజాన్ని పాలించే రాజ్యాధికారం ఆ వర్గానికి ఉండాలి. ఆ అధికారం ద్వారానే ఆ వర్గం తన నిబంధనలు అమలు చెయ్యగలుగుతుంది. కార్మిక వర్గం పరిపాలన చెయ్యడం, యజమానుల వర్గం చేసినట్టే చెయ్యడానికి కాదు.

భారత దేశపు కార్మిక వర్గంలో అత్యధిక సంఖ్య, చిన్న కులాల జనాభా. ఈ జనాభా ఇంకా, శ్రమ సంబంధాల్నీ, శ్రమ దోపిడీనీ గ్రహించుకోగలిగే దశ లోకి రాలేదు. కానీ, ఈ జనాభా కూడా రాజ్యాధికారాన్ని ఆశిస్తుంది. ఆ అధికారం ఎందుకంటే, కేవలం, శాసన సభ్యులుగా, మంత్రులుగా, యజమానుల సరసన కూర్చునే అవకాశాల కోసమే! యజమాని వర్గం నిర్మించిన ఆస్తి హక్కుల శాసనాల్ని మార్చడం చిన్న కులాల

లక్ష్యం కాదు. దోపిడీ ఆస్తి హక్కుల్ని తీసి వెయ్యాలనే లక్ష్యం వీరి ప్రణాళికల్లో ఎక్కడా లేదు. చిన్న కులాల మేధావుల లక్ష్యాల్లో ప్రధానమైనది, రిజర్వేషన్లని ఇంకా ఇంకా అన్ని రంగాల్లోకీ విస్తరించేలా చేసుకోవడం! రిజర్వేషన్ల జీవితాలు ఎంత కాలం? - శాశ్వతంగా! కులాలు అలాగే ఉండాలి. రిజర్వేషన్లూ ఉండాలి. చిన్న కులాల మేధావుల ప్రకారం, కుల భేదాలకు అదే గొప్ప విరుగుడు! చిన్న కులాల ప్రవక్తలు ప్రవచించే అసలైన మార్గం - చిన్న కులాల వారందరూ బూర్జువాలుగా ( పెట్టుబడిదారులుగా ) ఎదగాలి! బూర్జువాలుగా ఎదిగే ఆ చిన్న కులాల యజమానులకు కూడా శ్రామి కులు కావాలనీ, ఆ శ్రామికులు చిన్న కులాల వారే అవుతారనీ, చిన్న కులాల బూర్జువాలు చిన్న కులాల శ్రామికుల్ని దోపిడీ చేస్తారనీ - ఆ విషయాలేవీ ఆ ప్రవక్తలకు పట్టవు. ఎందుకంటే, వారు అప్ప టికే బూర్జువాలై ఉంటారు కాబట్టి. లేదా, వారి మెదళ్ళు యుగ యుగాల మకిలితో తుప్పు పట్టిపోయి వుంటాయి కాబట్టి.

చిన్న కులాల మేధావి ప్రవక్తలు, శ్రమ దోపిడీ సంబంధాల్ని చెవిన పడనివ్వరు. కులాల వల్ల వర్గాలా, వర్గాల వల్ల కులాలా - అనే ప్రశ్నని వారు సహించరు. వారికి కావలసిందంతా, దోపిడీ ఆస్తి సంబంధాలే. కౌళ్ళనీ, వడ్డీ లాభాల్నీ సంపాదించడానికి వీలునిచ్చే సంబంధాలే. వాటిని నిలబెట్టే చట్టాలతో సాగే యజమా నుల రాజ్యాం గమే వారికి కావాలి. ఆ రాజ్యాధికారంలోకి జొరబడి, అక్కడక్కడా పదవులు సంపా దించడమే వారి ఏకైక లక్ష్యం! తాము అధికారంలోకి వస్తే, " యజమానీ శ్రామిక సంబంధాల్ని రద్దు చేస్తాము; దోపిడీ హక్కుల్ని రద్దు చేస్తాము" అనే లక్ష్యాల్ని వారు ఎక్కడా ప్రకటించరు.

కానీ చిన్న కులాల జనాభా అసలు నేర్చుకోవలసింది వేరే వుంది. రిజర్వేషన్ల తాత్కాలిక ఉపశమనంతో పాటు, కుల భేదాల్ని, శ్రమ దోపిడీ సంబంధాల మారు రూపాలుగా వారు గ్రహించాలి. వర్గ పోరాటాల్ని అన్ని కోణాలలోనూ జరిగే విముక్తి మార్గాలుగా వారు గ్రహించాలి.

కార్మిక వర్గ పరిపాలన, మొదట 'సోషలిజం' దశ కోసం ప్రారంభమై, అనేక మార్పులతో క్రమంగా 'కమ్యూనిజం' స్థాయికి చేరి స్థిర పడుతుంది.

ఈ పరిపాలన ప్రారంభమైన రోజు నించే భూమి, భూస్వాముల ఆస్తిగా వుండదు. అది, రైతుల మధ్య పంపకాలవుతుందా, లేక 'సమిష్టి వ్యవసాయాలు' ప్రారంభ మవుతాయా అనేది, ఆ ప్రాంతాల పరి స్థితుల్ని బట్టి వుంటుంది. భూస్వామి కుటుంబ సభ్యులు కూడా భూమిలో స్వంత శ్రమ చేస్తారు ; లేదా, ఇంకో రకం శ్రమ చేస్తారు.

పెట్టుబడిదారుల ఫ్యాక్టరీలు కూడా ఇక పెట్టుబడిదారుల స్వంత ఆస్తులుగా వుండవు. పెట్టుబడిదారులు కూడా యంత్రాల ముందు నిలబడి శ్రమలు చేసేవారవుతారు.

యజమానులు యజమానులు కాన ప్పుడు, కార్మికులు కూడా కార్మికులు కారు. అందరూ శ్రమలు చేసే వారైనప్పుడు,

అందరూ ' ఉత్పత్తిదారులే'. ఆ ఉత్పత్తి దారుల్లోనే ప్రారంభంలో, ' శారీరక శ్రమలూ - మేధా శ్రమలూ' తేడాలు వుంటాయి.

ఏ ' ఉత్పత్తి' తయారవడానికైనా, ' పెట్టుబడి' పెట్టే వాళ్ళు అక్కరలేదు. సమాజంలో సిద్ధంగా వున్న ఉత్పత్తి సాధనాల తోనే నూతన సమాజం ప్రారంభమవుతుంది. ఆ సమాజంలో ఉత్పత్తి సాధనాలూ ఉంటాయి; శ్రమలు చేసే ఉత్పత్తి దారులూ ఉంటారు, కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ ప్రసక్తి లేకుండా! ఈ మార్పులన్నీ కార్మిక వర్గ పరిపాలనలో కొన్ని దశల మీదుగా జరుగుతాయి.

దోపిడీ ఆస్తి హక్కుల్నీ, దోపిడీ ఆదాయ మార్గాల్నీ రద్దు చెయ్యడానికీ ; ' ప్రతీ మనిషీ శ్రమ చెయ్యాలి' అనే నిబంధన విధించడానికీ, అవసరమైన రాజ్యాంగ రూపం - కార్మిక వర్గ నియంతృత్వం. ఆ నియంతృత్వం, దోపిడీ సంబంధాల్ని తీసివెయ్యడానికే. ఆ నియంతృత్వమే లేకపోతే, ఆ చట్టాలూ వుండవు; ఆ మార్పులూ వుండవు. అది మళ్ళీ యజమానుల రాజ్యమే అవుతుంది. కార్మిక వర్గ నియంతృత్వం, సక్రమంగా అమలు జరుగుతూ, దోపిడీ సంబంధాలు అంతరించిపోతూ వుంటే, ఆ నియంతృత్వం కూడా అంతరించి పోతుంది.

పెట్టుబడిదారీ పరిపాలనలో అయితే, ' యజమానులూ, కార్మికులూ, నిరుద్యోగులూ' అనే సంబంధాలే శాశ్వితం! ఈ విధానంలో, ఆ దోపిడీ సంబంధాల్ని కొనసాగిస్తూ పోవడం తప్ప, ఇక ఏ మార్పు తోటీ అవసరం ఉండదు. భూస్వాములూ, పెట్టుబడిదారులూ, వాళ్ళ సరుకు ఉత్పత్తులూ, కార్మికులతో జీతాల బేరాలూ, తమ కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ - లంచాలూ - ఉత్పత్తి శక్తుల పెంపకాలూ, సరుకుల గుట్టలూ, సంక్షోభాలూ, కార్మికుల దాస్యాలూ, నిరుద్యోగాలూ, హత్యలూ ఆత్మహత్యలూ, నేరాలూ, యుద్ధాలూ - అవే అవే! నిరంతరం అవే! ఆ సమస్యలే, ఆ సంబంధాలే, మళ్ళీ మళ్ళీ మళ్ళీ సాగుతూ వుంటాయి.

ఆడ వాళ్ళ శరీరాల మీద నించి బట్టలు వొలిచేసి, వాళ్ళని బోసిగా నించో బెట్టి, ఆ శరీరాల్ని చూపించే ప్రకటనలతో సరుకుల్ని అమ్ముకునే గతికి చేరింది ఈ నాటి పెట్టుబడిదారీ విధానం. ఆ ప్రకటనల్ని తిరస్కరించలేని స్తితి లోనే ఇంకా వుంది కార్మిక జనాభా! ఈ పెట్టుబడిదారీ విధానంలో, అంత కన్నా మార్పుగా, అందరికీ సుఖ శాంతుల్ని తెచ్చిపెట్టే భవిష్యత్తు ఏమీ వుండదు.

ఈ చీకటి ప్రపంచాన్ని మార్చుకోవలసిన బాధ్యత కార్మిక వర్గానిది. వెనకటి కాలపు శ్రామిక వర్గాలకు లేని బాధ్యత ఇది!

సంపూర్ణమైన మార్పుని సాధించవలసింది ఈ కార్మిక వర్గమే.

**[ ఈ పాఠంలో ప్రశ్నలు లేవు. ]** ★

# 89. వర్గాల మధ్య సామరస్యంతో ఐక్యత ఏర్పడదా?

అలా జరిగితే ఎంతో మంచిదే. జరగ వలసింది అదే. అలా జరగాలంటే, అది దోపిడీ వర్గం మీదే ఆధారపడి వుంటుంది. దోపిడీ వర్గం, శ్రమ దోపిడీ దుర్మార్గాన్ని అర్థం చేసుకుని, తమ తప్పుడు ఆస్తి హక్కుల్ని వదిలివెయ్యడానికి సిద్ధపడాలి. ఒక ఉద్యోగం చేస్తూ ( శ్రమ చేస్తూ ), జీతం తీసుకుంటూ, స్వంత శ్రమతో జీవించడాన్ని మానవ బాధ్యతగా అర్థం చేసుకోవాలి. భూస్వాములూ, పెట్టుబడిదారులూ దానికి అంగీకరిస్తే, వర్గాల మధ్య ఏ పోరాటాలూ అక్కరలేదు. సామరస్యంతోనే భేదాలు నశిస్తాయి.

కానీ, ఇది అర్థం లేని భ్రమ! ఇలా జరగదని చరిత్ర అనేక సార్లు రుజువు చేసింది. ఈ నాటి దోపిడీదారులు కూడా బానిస యజమానుల వారసులే. వారి తత్వశాస్త్రం వారిని, యజమానులుగానే కొనసాగమంటుంది. మరి అప్పుడు, కార్మిక వర్గానికి, పోరాటం తప్ప ఇంకో మార్గం ఏం ఉంటుంది?

ప్రశ్న : ఇప్పుడు వున్న వ్యవస్థలోనే, పోరాటాలు లేకుండా, ప్రజాస్వామ్య పద్ధతిలో, మంచి మార్పులు చేసుకోలేమా?

**జవాబు :** చేసుకోగలిగితే అలాగే చేసుకోవాలి. అదే చాలా మంచిది. కానీ, అలా చేసుకోలేము. ఇప్పుడు వున్న ప్రజాస్వామ్యం, యజమానుల మధ్య వుండే ప్రజాస్వామ్యం. వాళ్ళ సమస్యల కోసమే అది పనికివస్తుంది. " యజమాని వర్గం శ్రమ చెయ్యకుండా జీవిస్తోంది. అది తప్పు. అందరూ శ్రమ చెయ్యాలి. యజమానీ శ్రామిక సంబంధాలే వుండకూడదు" అని కార్మిక వర్గం అంటే, దానికి ఇప్పుడు వున్న ప్రజాస్వామ్యం ఒప్పుకుంటుందా? " మాది శ్రమ - దోపిడీ కాదు. కౌళ్ళూ, వడ్డీ లాభాలూ మా హక్కులు" అంటుంది యజమాని వర్గం. " ఈ ఆస్తి హక్కుల చట్టాలు, అక్రమ చట్టాలు" అని కార్మికులు మళ్ళీ అంటే, యజమానులు వింటారా? ఆ ఆస్తి హక్కుల్ని వదులుకుంటారా? - అలా చెయ్యరు. అలా మాట్లాడే కార్మికుల్ని వెంటనే ఉరికంబాలకు వేళ్ళాడతీస్తారు. లేకపోతే తుపాకులకు అప్పజెపుతారు. అలాంటి యజమాని వర్గంతో, కార్మిక వర్గం ఏం చెయ్యాలి?

వెనకటి బానిసలు ఏం చేశారు? " ఏ పోరాటాలూ లేకుండా, యజమానుల్ని బతిమాలుకుని కొంచెం మంచి పరిస్తితులు ఏర్పర్చుకుందాం" అని ఆలోచిస్తే, ఏమయ్యేది? ఈ నాటికీ ఆ సమాజమే వుండేది. ఈ నాటి కార్మికులందరూ ఆ నాటి బానిసలు గానే వుండేవారు. ఈ కార్మికులు కూడా వేతన బానిసలు కాబట్టి, ఇక్కడ కూడా పోరాటాలతోనే అవసరం వుంటుంది. దోపిడీ ఆగిపోయినప్పుడే పోరాటాలు ఆగిపోతాయి.

ప్రశ్న : ' పోరాటం' అనేది హింస కాదా?

జ : పోరాటాల్లో, న్యాయమైన పోరాటాలూ, అన్యాయమైన పోరాటాలూ వుంటాయి. న్యాయమైన పోరాటం - హింస కాదు. అది ఆత్మ రక్షణ. అది, తమకు జరిగే అన్యాయం నించి విముక్తి చెందే మార్గం. అయితే, ఆ ప్రయత్నాల్లో తప్పులు జరిగితే, అది హింసే అవుతుంది. జరగవలసిన పద్ధతుల్లో జరిగితే, అది హింస అవదు.

అసలు, హింసని ప్రారంభించేది యజమాని వర్గమే. హింసని బానిస యజమాని చేస్తాడా, బానిస చేస్తాడా? యజమానుల ప్రభుత్వం దగ్గిర పోలీసూ, సైన్యమూ కత్తులూ తుపాకులూ, జైళ్ళూ ఉరి కంబాలూ, ఎందుకు వుంటాయి? అవి, ప్రభుత్వం దగ్గిర వుంటాయా, శ్రామిక ప్రజల దగ్గిర వుంటాయా? 'హింస, హింస' అని మాట్లాడే వాళ్ళు, "ప్రభుత్వం దగ్గిర ఆయుధాలు ఎందుకు వుంటాయి?" అని మొదట ప్రశ్నించుకోవాలి. యజమాని వర్గం లక్ష్యం, శ్రామిక వర్గాన్ని అణచడం. అది హింస. యజమాని, శ్రామికుణ్ణి చెంప మీద కొడితే, అది హింస. శ్రామికుడు తిరిగి కొడితే, అది హింస కాదు. అది ఆత్మ రక్షణ. వర్గ పోరాటంలో ఒక వేపు అన్యాయమూ, ఇంకో వేపు న్యాయమూ, వుంటాయి. రెండు వేపులా అన్యాయాలే వుంటే కూడా పోరాటాలు వుంటాయి. రెండు వేపులా న్యాయం వుంటే, పోరాటాలు వుండవు.

అసలు 'శ్రమ దోపిడీ' గురించి అర్థం చేసుకుంటే, వర్గాల మధ్య సామరస్యంతో ఐక్యత ఏర్పడదా?" అనే ప్రశ్న రాదు. శత్రు వర్గాల మధ్య ఐక్యత ఏర్పడి, వర్గ భేదాలే పోవాలంటే, ఎవరు మారాలి? శ్రమ దోపిడీ చేసే వర్గం, ఆ అక్రమం మానుకోవాలి. కానీ అది మానుకుంటుందా? అందుకే దానితో, రెండో వర్గానికి పోరాటం అవసరం.



ప్రశ్న : ఈ బొమ్మలో వున్న సమస్య ఏమిటి? దాని పరిష్కారం ఏమిటి?

జ : ఇద్దరు మనుషుల్లో, ఒక్క మనిషే శ్రమ చేస్తున్నాడు. ఇంకో మనిషి శ్రమ చెయ్యడం లేదు - ఇదీ సమస్య.

పరిష్కారం : ఇద్దరూ శ్రమ చెయ్యాలి. అప్పుడు ఇద్దరూ సమానులవుతారు. శ్రమలు చేసే వర్గమూ, శ్రమలు చెయ్యని వర్గమూ అనే భేదాలు వున్నప్పుడు, ఆ వర్గాల మధ్య ఐక్యత సామరస్యంతో ఎలా ఏర్పడుతుంది?

[ ప్రశ్నలు పాఠంలోనే వున్నాయి. వేరే లేవు. ] ★

# 90. తల - ఆలోచించడానికి!

కళ్ళు - చూడడానికి.
కాళ్ళు - నడవడానికి.
చేతులు - పని చెయ్యడానికి.
తల - ఆలోచించడానికి.
ఎవరు ఏది చెప్పినా వినాలి.
కానీ, దాని మీద ఆలోచించాలి.
" భూమికి - కౌలూ,
పెట్టుబడికి - వడ్డీ లాభాలూ!"
- ఇది ఒక వాదం.
" కౌళ్ళూ, వడ్డీ లాభాలూ,
శ్రమ దోపిడీకి మార్గాలు!"
ఇది, మొదటి దాని వ్యతిరేక వాదం.

రెండూ వినాలి. ఆలోచించాలి. ఎక్కడే సందేహం వచ్చినా, ఇరు పక్షాల్నీ ప్రశ్నించాలి. సందేహాలు తీర్చుకోవాలి. ఆలోచించడం ఏళ్ళ తరబడీ కాదు. విరుద్ధ వాదనలు మన ముందు వున్నప్పుడు, ఆలోచించడం చాలా తేలిక. ఆ వాదాల్ని పరిశీలించడంతోనే ఆ ఆలోచన ముగుస్తుంది. ఆలోచన ముగించి, తర్కానికి సరిపోయే చివరి అభిప్రాయానికి రావాలి. అప్పటి నించీ, ఆ అభిప్రాయం ఏ పక్షానిదో, ఆ పక్షం వేపే వుండాలి.

మార్క్సు రాసిన 'కాపిటల్' (పెట్టుబడి) గ్రంధం, పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం మీద విమర్శా, తార్కికమైన ఆర్థిక శాస్త్ర జ్ఞానానికి ప్రారంభమూనూ.

పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు రాసిన గ్రంధాల్లో, ఎక్కడా 'విలువ' కనపడదు, 'ధర' తప్ప! ఆ ధరకి కారణం, ఖర్చులూ + లాభమూ. కౌళ్ళూ, వడ్డీలూ కూడా, ఖర్చులే. లాభం - చిట్ట చివరి ఖర్చు. అదీ రావలసినదే. ఈ ఆదాయాల మాట తప్ప, 'శ్రమ దోపిడీ' అనే మాటే అక్కడ ఉండదు. పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం ప్రకారం, యజమానీ శ్రామిక సంబంధాలన్నీ చాలా సహజం! చాలా ఉత్తమం. అది ఇక అంతే! మనుషుల్లో కొందరు యజమానులుగా, కొందరు శ్రామికులుగా, అలా ఉండవలిసిందే! అదే వారి ఆర్థిక శాస్త్రం.

ఆ ఆర్థిక శాస్త్రాన్ని విద్యార్థులకు నేర్పే లెక్చరర్లకీ ప్రొఫెసర్లకీ, అదే గొప్ప సైన్సు! 'కౌళ్ళూ - వడ్డీ లాభాలూ, వస్తువుల తయారీలో ఏం పాత్రలు నిర్వహిస్తున్నాయి?' అనే ప్రశ్న వారికి రాదు. అది వారికి పట్టదు.

ఇక, ఆర్థిక విషయాల మీద గ్రంధాలు మిడికే ఆర్థిక వేత్తలైతే, పెట్టుబడిదారీ విధానం ఎంత గొప్పదో, తమ గ్రంధాల నిండా మళ్ళీ మళ్ళీ బోధిస్తూ వుంటారు. ఇక, సమాజానికి చివరి గమ్యం అదేననీ, సమాజం 'లాభం రేటు' సూత్రంతో ఉన్నత స్థాయికి చేరిపోయిందనీ, అవాకులూ చవాకులూ గిలుకుతారు. దానికి ప్రతిఫలంగా, పెట్టుబడిదారుల నించీ, గొప్ప గొప్ప బహుమానాలూ సన్మానాలూ సంపాదిస్తారు. ఆ ఖర్చులన్నీ శ్రామికుల 'అదనపు విలువ రాసిలోవే' అని వేరే చెప్పాలా? అమర్త్యసేన్ లాంటి ఆర్థికవేత్తలైతే, ఏకంగా నోబెల్ ప్రైజులే సాధించగలరు.

అలాంటి 'మేధావులు', మార్క్సుని చదవలేదనే అనుకోవాలా? కానీ ఏదో కొంచెం చదివే వుండొచ్చు. మార్క్సుని

చదివిన తర్వాత కూడా, చదవక ముందు లాగే వున్నారంటే, అలాంటి మేధావులతో కార్మికులకు శుద్ధ దండగ. ఆలోచించమని చెప్పేది ఆ మేధావులకు కాదు. కానీ వాళ్ళూ ఆలోచిస్తారు. ఆలోచించే, వాళ్ళు ఆ దారి పట్టారు.

ఆలోచించడం రెండు రకాలుగా ఉంటుంది. పరస్పర విరుద్ధ వాదాల్లో, మొదటే ఏ వాదం వేపూ మొగ్గకుండా రెండు వాదాల్నీ పరిశీలించాలి. అది సరిగా వుందా, ఇది సరిగా వుందా? - అని, తర్కం మీదే ఆధారపడుతూ చర్చించాలి. యజమానులకైతే వాళ్ళ వాదం వాళ్ళకు సరైనదే. దాని వల్ల వాళ్ళకు సుఖాలూ, సిరి సంపదలూ వస్తాయి. అవి అన్నీ ఏ వాదం ద్వారా వస్తాయో ఆ వాదమే వాళ్ళకు కావాలి. అది వాళ్ళ వర్గ దృక్పథం.

మరి అలాగే, శ్రామికుల వర్గ దృక్పథం శ్రామికులకు ఉండొద్దూ? అది, నాలుగు జీతం రాళ్ళ పెంపు కోసమేనా? అసలు, యజమానులెవరు, జీతాలు ఇవ్వడానికి? శ్రామికుల శ్రమలో ముక్కలే శ్రామికుల జీతాలు కదా? ఆ సంగతి శ్రామికులు తెలుసుకోవద్దూ? ఆలోచించే ప్రయత్నమే లేకుండా, భూస్వాములూ పెట్టుబడిదారులూ చెప్పే దాన్నే ఒప్పుకుంటూ పోతే, శ్రామిక జనాలకు తలకాయ లుండడం ఎందుకు? అవి యజమానులకు మాత్రమే వుంటే చాలదూ? పని వాళ్ళకి కూడా తలలెందుకు, మోత దండగ?

'భూమికి కౌలా? పెట్టుబడికి వడ్డీ లాభాలా? ఊరికే వేసుకుంటే లాభం వస్తుందా?' లాంటి ప్రశ్నలెన్నో శ్రామికులకు రావద్దూ? రాకపోయినా, అవి ఎంత తప్పుడు ఆదాయాలో, వాటి వల్ల మొత్తం కార్మిక జనాభాకి ఏం జరుగుతోందో చెప్పిన పుస్తకాలైనా చదవొద్దూ? మనుషుల బతుకుల గురించి మనుషులు తెలుసుకోవద్దూ? ఎవరి బతుకులు వారు తెలుసుకోవద్దూ? ఆ 3 రకాల ఆదాయాలతో, ప్రపంచానికి ఎలాంటి ఘోరాలు జరుగుతున్నాయో తెలుసుకుని నిర్ఘాంతపోవద్దూ?

తెలుసుకోవలసిందంతా దోపిడీ చేసే వాళ్ళు కాదు ; దోపిడీకి గురి అవుతోన్న వాళ్ళు!

ఆర్థిక శాస్త్రం అనేది మొత్తం జనాభాలో ప్రతి ఒక్కరి కోసమూ అవసరం. 'వైద్య శాస్త్రం' ఉందంటే, అది ప్రతి ఒక్కరికీ కాదు, కొందరికే. దాన్ని వైద్యులు చదివి అందరికీ వైద్యాలు చేస్తారు. 'యంత్ర శాస్త్రం' ఉందంటే, అదీ కొందరికే. ఇంకే శాస్త్రం అయినా కొందరికే. అలాంటివి, ప్రకృతి సూత్రాల్ని చెప్పే శాస్త్రాలు. కానీ, ఆర్థిక శాస్త్రం సంగతి అలా కాదు. ఇది, మనుషుల సంబంధాల శాస్త్రం. పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రంలో పెట్టుబడిదారులూ కార్మికులూ కనపడతారు. జీతాలూ లాభాలూ అన్నీ. దాని వ్యతిరేక ఆర్థిక శాస్త్రంలో కూడా అవన్నీ కనపడతాయి. కానీ ఇందులో, మొత్తం మానవ సంబంధాలన్నీ కనపడతాయి. అవి అలా ఎందుకు వున్నాయో తెలుస్తుంది. అందులో, ప్రతి మనిషి స్థానమూ కనపడుతుంది.

ప్రతి మనిషీ, 'ఈ సమాజంలో నేను ఏ వర్గంలో ఉన్నాను? అందులో ఏ సెక్షన్‌లో ఉన్నాను? నేను నా స్వంత శ్రమ మీద బతుకుతున్నానా, దోపిడీ మీద బతుకుతున్నానా?' అని ఆలోచించి

చూడాలి. తను చేసే పని ఏమిటో, తన ఆదాయ మార్గం ఏమిటో, చూసుకోవాలి.

సమాజంలో వుండే మొత్తం జనాభాని, ఒకే సమయంలో చూస్తే, వాళ్ళు ఎక్కడెక్కడ వుంటారో ఆలోచించండి! పని స్తలాల్లో (ఉత్పాదక స్తలాల్లో గానీ, అనుత్పాదక స్తలాల్లో గానీ). ఇళ్ళల్లో, స్కూళ్ళల్లో, ఆస్పత్రుల్లో, రోడ్ల మీద, విహార స్తలాల్లో, వినోద స్తలాల్లో, ప్రయాణాల్లో, అనాథాశ్రమాల్లో, సంక్షేమ ఆశ్రమాల్లో, మత సంస్థల్లో, జెయిళ్ళలో - ఈ రకంగా, మొత్తం జనం ఎప్పుడూ అనేక స్తలాల్లో చెల్లా చెదురుగా వుంటారు. కాస్త బలిసిన పెట్టుబడిదారీ దేశాల్లో, స్వతంత్ర ఉత్పత్తిదారులు, పిడికెడు మంది కూడా ఉండరు. అది లెక్కలోది కాదు. మొత్తం జనాభాని 2 శతృ వర్గాలుగా విభజించ వలసిందే.

పిల్లలందరూ తల్లి దండ్రుల వర్గమే అవుతారు. తల్లిదండ్రులు ఏ వర్గమో పిల్లలూ అదే వర్గం. ఇప్పటి పిల్లలు, రేపటి కార్మికులో, రేపటి పెట్టుబడిదారులో, రేపటి భూస్వాములో, ఏదో ఒకటి అవుతారు. లాభాల మీదా, వడ్డీల మీదా బతికితే, ఉత్పాదక - వర్తక - వడ్డీ పెట్టుబడిదారుల్లో ఏదో ఒక రకం అవుతారు. కౌళ్ళ మీద బతికితే, భూస్వాములూ. ఇళ్ళ అద్దెల్లో కూడా భూమి కౌలు ఉంటుంది. 'అద్దె' అనే దాంట్లో బోలెడు దోపిడీ వుంటుంది. శ్రమ చేస్తూ జీతాల మీద బతికితేనే - కార్మికులు.

కొన్ని కంపెనీల వాళ్ళు చాలా దర్పంగా, "ఈ సంవత్సరం మాకు ఇన్ని వేల కోట్ల లాభం వచ్చింది" అని చెప్పుకుంటూ వుంటారు. అలా ఎందుకు చెప్పుకుంటారంటే, "అదంతా శ్రమ దోపిడీ" అని వాళ్ళకి తెలియక కాదు. మార్క్సు పుస్తకాల తర్వాత, శ్రమ దోపిడీ విషయం పెట్టుబడిదారులందరికీ తెలుసు. ఆ పుస్తకాలన్నీ వాళ్ళు చదివారని కాదు. చదవక పోయినా వినడం ద్వారా వాళ్ళకి తెలుసు. అన్ని కోట్ల లాభమూ దోచుకున్నదే అని వాళ్ళకి తెలుసు. అయినా వాళ్ళు దాన్ని సిగ్గు లజ్జలు లేకుండా ఎందుకు చెప్పుకుంటారంటే, 'ఆ లాభం అంతా శ్రమ దోపిడీయే' అనే సంగతి కార్మికులకు తెలియదు కదా - అని! అదంతా దోపిడీయే అని కార్మికులందరికీ తెలిసే విషయం అయితే, వాళ్ళు దాన్ని అలా బైట పెట్టరు. దాన్ని రహస్యంగానే వుంచుకుంటారు.

వాళ్ళు చెప్పే లాభం లెక్కలన్నీ అబద్దాల లెక్కలే. వాళ్ళ నిజమైన లెక్కలు తీస్తే, అవి, ఆ కోట్లకి ఇంకో వంద రెట్లు వుంటాయి!

"మా లాభాలు ఇన్ని కోట్లు!" అని ఒక కంపెనీ చెప్పుకున్నప్పుడు, కార్మికులకు ఏమనిపించాలి? "ప్రతి రోజూ పని చేసే కార్మికులం. మనకు జీతం తప్ప ఏమీ రావటం లేదే! యజమానికి అన్ని కోట్లు ఎక్కణ్ణించి వస్తున్నాయి?" అని పెద్ద ప్రశ్న రావాలి.

కానీ, రాదు. "కంపెనీ, అతనిది కదా? పెట్టుబడి పెట్టాడు కదా? లాభాలు రావాలి కదా? వస్తాయి కదా?" అనుకుంటారు కార్మికులు. అదేదో చాలా సహజమైన సమాచారం లాగే కనపడుతుంది. అందుకే మరి, ఆలోచించాలి.

"ఈ సమాజంలో నేను ఎవర్ని? నేను ఏ స్థానంలో ఉన్నాను? ఏ పాత్ర నిర్వహిస్తు

న్నాను?" అని ఎవరికి వారు తన స్థితిని అర్థం చేసుకోవాలి.

తల ఎందుకు? - ఆలోచించడానికా కాదా?

ప్రతీ తలా ఆలోచిస్తూనే వుంటుంది. ఆలోచన లేకుండా ఏ తలా వుండదు. మీ తల దేన్ని గురించి ఆలోచిస్తూ వుంటుంది? ఇవ్వాళ ఏ సినిమా చూద్దాం - అనా?

ప్రశ్న: తల ఎందుకు? జవాబు చెప్పండి! ★

# 91. స్వర్ణ యుగం, వెనక కాదు, ముందు ఉంది!

ఈ పెట్టుబడిదారీ సమాజంలో, మన నిత్య జీవితాల్లో కనపడుతోన్న డబ్బు సంబంధాలూ, సరుకుల బజార్లూ, నిరుద్యోగాలూ, సంక్షోభాలూ, ప్రపంచ యుద్ధాలూ - వంటి వాటిని చూసి, " ఈ కాలం కన్నా వెనకటి కాలం చాలా మంచిది" అనుకుంటాం చాలా సార్లు. కానీ సారాంశంలో, దోపిడీ సంబంధాలు సాగిన, సాగుతోన్న అన్ని కాలాలూ ఒకటే. శ్రామిక జనాభాకి కష్టాలూ దుఖ్ఖాలూఎప్పుడూ వున్నాయి. వెనకటికీ, ఇప్పటికీ, కొన్ని అంశాల్లో తేడాలు వున్నా, వెనకటి కాలాలు మరింత కౄర కాలాలు. ప్రకృతి శాస్త్ర జ్ఞానాలు గానీ, నాగరికతలు గానీ, కనీసపు హక్కులైనా గానీ, లేనివే వెనకటి కాలాలు. జంతు దశలో నించి మానవులుగా తయారైన మనం, ఇప్పటికి పెట్టుబడిదారీ శ్రమ సంబంధాల దశలోకి చేరి వున్నాం. ఈ సంబంధాలు కూడా దోపిడీ సంబంధాలే కాబట్టి, ఇవి కూడా మారాలి. ఈ జ్ఞానం, ఈ పెట్టుబడిదారీ సమాజంలోనే ప్రారంభమైంది. విముక్తి కావలసింది, వెనకటి బానిసత్వాల నించే కాదు, వేతన బానిసత్వాల నించి కూడా విముక్తి కావాలి. ఆ మార్గం దొరికిన దశ ఇది. శ్రామిక జనాభా, ఈ మార్గంలో చేసే ప్రయాణం, అందరికీ సుఖ శాంతుల్ని నెలకొల్పగల సమ సమాజానికి చేరుస్తుంది. కాబట్టి స్వర్ణ యుగం, వెనక కాదు; ముందు వుంది!

కార్మిక వర్గం, పెట్టుబడిదారీ రాజ్యాంగ యంత్రాన్ని ఓడించి, రాజ్యాధికారాన్ని తీసుకోగలిగిందని ఊహిద్దాం. కార్మిక వర్గ పాలన, దోపిడీ నించి విముక్తి చెందడానికి. దాని కోసం తక్షణం చెయ్యవలసిన మార్పులూ, క్రమ క్రమంగా దశల వారీగా చెయ్యవలసిన మార్పులూ, అనేకం ఉంటాయి.

కార్మిక వర్గ పాలనలో కూడా రాజ్యాంగ యంత్రం ఉంటుంది. అక్కడ కూడా పోలీసూ, సైన్యమూ, కోర్టులూ, జైళ్ళూ వంటి అంగాలన్నీ ఉంటాయి! ఆ పరిపాలన కూడా, ఒక వర్గ పరిపాలనే. అయితే, అది శ్రమ దోపిడీని సాగించడానికి కాదు ; దోపిడీనీ, యజమాని వర్గ ఆధిపత్యాన్నీ, నిర్మూలించడానికే.

కార్మిక వర్గ పాలనలో, వెనకటి దోపిడీ

సంబంధాలు, దోపిడీ వ్యతిరేక సంబంధాలుగా, సమానత్వ సంబంధాలుగా, స్థిర పడుతోన్నకొద్దీ, కార్మిక వర్గ రాజ్యాంగ యంత్రంతో కూడా అవసరం తగ్గిపోతూ, క్రమంగా అది అంతరించిపోతుంది. సమాజానికి అవసరం లేని ఏ అంశం అయినా నశించిపోతుంది. ఇక, ఉత్పత్తి క్రమాలూ, పంపిణీ క్రమాలూ, వాటి నిర్వహణ క్రమాలూ మాత్రమే మిగిలి వుంటాయి.

నూతన సమాజపు ప్రారంభ దశల్లో మాత్రం, కార్మిక వర్గానికి, ఆ వర్గ పాలన కోసం, ఆ వర్గ రాజ్యాంగ యంత్రం అత్యవసరం. ఆ రాజ్యాంగ యంత్రం సాగడానికి అవసర మయ్యే ఖర్చునంతా, ఆ సమాజపు ఉత్పత్తి దారులే భరించాలి. పెట్టుబడిదారీ విధానంలో 'పన్నులు' అనే భాగాన్ని, నూతన సమాజంలో 'సమాజ నిధి' అనవలసి వస్తుంది.

'విలువ సూత్రం' ఏ సమాజంలోనైనా ఒకటే. నూతన సమాజంలో కూడా ఉత్పత్తుల విలువ, పాత - కొత్త శ్రమలు కలిసినదే. ( ఉత్పత్తి సాధనాల నించి చేరే పాత శ్రమా, ఉత్పత్తి దారులు చేసే కొత్త శ్రమా కలిసినదే. )

కొత్త శ్రమ ఇక్కడ కూడా 2 భాగాలుగా చీలుతుంది. (1) జీతాల భాగం,
(2) సమాజ నిధి భాగం.

సమాజ నిధి, ప్రభుత్వం చేతికి చేరుతుంది. దాన్ని ఖర్చు పెట్టడంలో, సక్రమమైన మార్గమూ ఉండవచ్చు ; అక్రమమైన మార్గమూ ఉండవచ్చు.

**మొదటి విషయం** : అందరూ శ్రమ చెయ్యాలి - అనే సూత్రం అక్షరాలా అమలు జరగాలి. చిన్న పిల్లలూ, వృద్ధులూ, రోగులూ తప్ప, మిగిలిన స్త్రీ పురుషులందరూ శ్రమ చెయ్యాలి. మేధా శ్రమలూ, శారీరక శ్రమలూ కూడా డ్యూటీల ప్రకారం. అది ఎలా సాధ్యమో, అనేక చర్చల ద్వారా, అనుభవాల ద్వారా, సరైన మార్గాలు పట్టుకోవాలి. ఏడెనిమిది సంవత్సరాల పిల్లలు కూడా, ఇళ్ళల్లోనూ, పాఠశాలల్లోనూ, తేలికైన పనులు తక్కువ గంటలు చేసే విధానం ప్రారంభం కావాలి.

నూతన సమాజంలో జరగవలసిన మార్పు కోసం, కార్మిక వర్గ పార్టీ ( కమ్యూనిస్టు పార్టీ ) నాయకులు, పార్టీ పనులు చేస్తూ వుంటారు. కానీ అది, బతుకు దెరువు కోసం చేసే శ్రమ కాదు. కాబట్టి వారు, ఆ పార్టీ పనుల కోసమూ, పోషణకు అవసరమయ్యే శ్రమ కోసమూ కూడా, తమ కాలాన్ని విభజించుకోవాలి.

సమాజంలో అనేక ప్రజా సంఘాలు ఉంటాయి. ఆ సంఘాల నాయకులు, పోషణ శ్రమలు - చేస్తూనే, సంఘాల పనులు కూడా చూసుకోవాలి. సంఘంలో నాయకత్వం అనేది, నిర్వహణ బాధ్యత మాత్రమే. దాని కోసం ప్రత్యేక హక్కులూ, ప్రత్యేక సౌకర్యాలూ, ఉండకూడదు. కానీ సంఘాల పనుల కోసం కొన్ని గంటల సమయం కావాలి కాబట్టి, పోషణ శ్రమ గంటల్లో కొంత తగ్గడం తప్పనిసరి అవుతుంది. ఆ తగ్గవలసిన కాలం, ఆ పరిస్తితుల్ని బట్టి వుంటుంది. నాయకులకు, సాధారణ ప్రజల హక్కుల కన్నా ఎక్కువ హక్కులు ఉండవు. నాయకులు, పోషణ శ్రమ చెయ్యకపోతే, అది మళ్ళీ పాత సమాజం అయిపోతుంది.

కార్మిక వర్గ పాలనలో, ప్రభుత్వో

ద్యోగులూ, కార్మిక వర్గ పార్టీ నాయకులూ, పెద్ద పెద్ద జీతాలతో, ప్రత్యేక సౌకర్యాలతో, విలాసాలతో బతుకుతారా? - అలా జరిగితే, అది మళ్ళీ పెట్టుబడిదారీ విధానమే అవుతుంది. 'సమాజ నిధి' పేరుతో వెళ్ళేది, 'అదనపు విలువే' అవుతుంది.

**ఇంకో విషయం :** దోపిడీ సమాజాల్లో, అట్టడుగు శారీరక శ్రమ విలువకీ, ఉన్నత మేధా శ్రమ విలువకీ, 20, 30 రెట్ల తేడా ఉంటుంది. ఇది, శ్రామిక సెక్షన్లని చీల్చడానికి దోపిడీ వర్గానికి అత్యవసరం. కానీ ఇదే పద్ధతి నూతన సమాజంలో కూడా ఉంటుందా? అలా ఉంటే, అది నూతన సమాజం అవదు. శారీరక శ్రమ విలువకీ, మేధా శ్రమ విలువకీ తేడా, అత్యవసరమైన స్థాయిలో మాత్రమే ఉండాలి.

**శ్రమ విభజన విషయం :** ఒక మనిషి ఎప్పుడూ రోడ్లు ఊడ్చే శ్రమే, ఇంకో మనిషి ఎప్పుడూ స్కూల్లో పాఠాలు చెప్పే శ్రమే చేస్తూ వుంటే, అది, ఉపయోగపు విలువ కోణంలోనూ సమాన పరిస్తితి కాదు; విలువ కోణంలోనూ సమాన పరిస్తితి కాదు.

ఎప్పుడూ రోడ్లు ఊడ్చే మనిషికి, ఆ వృత్తి కోసం చదువు ఎందుకు? విజ్ఞానం ఎందుకు? అతను జీవితాంతం రోడ్లు ఊడుస్తూ వుండవలసిందే కదా? టీచరు పని చేసే వ్యక్తి, నాలుగు రోజులు నేర్చుకుంటే, రోడ్లు ఊడవడం కూడా చెయ్యలేడా? ఏ డాక్టరు అయినా, నాలుగు నెలలు నేర్చుకుంటే, బస్సులు నడపలేడా; పోస్టుమేన్ పని చెయ్యలేడా? ఒక ఇంజనీరు, కొన్నాళ్ళు నేర్చుకుంటే, క్షవరాలు చెయ్యలేడా? - మేధా శ్రమలు చేసే వారు, కొన్ని శారీరక శ్రమల డ్యూటీలు కూడా చేసే పద్ధతి లేకపోతే, సమాజంలో జరగవలసిన శారీరక శ్రమలన్నీ ఎవరు చెయ్యాలి? అవి, ఎప్పుడూ కొన్ని సెక్షన్ల వారి డ్యూటీలు గానే వుండాలా? మేధా శ్రమల వారందరూ ఉపయోగించుకునే పాయిఖానాల్ని కడిగే పని, ఎప్పుడూ కొన్ని సెక్షన్ల వారి డ్యూటీ గానే వుండాలన్నమాట! భారత దేశంలో అయితే, అట్టడుగు శారీరక శ్రమలూ, మురికిని శుభ్రం చేసే శ్రమలూ, ఎప్పుడూ చిన్న కులాల డ్యూటీలుగానే ఉంటున్నాయి. ఇది మారకపోతే, ఇక అది, నూతన సమాజం ఎలా అవుతుంది? సమ సమాజం ఎలా అవుతుంది?

పిల్లలకు స్కూళ్ళల్లో చిన్నతనం నించీ నేర్పితే, కొన్ని శారీరక శ్రమలూ, కొన్ని మేధా శ్రమలూ చెయ్యగల శ్రమ శక్తులు అలవడతాయి. ఏ ఇద్దరు వ్యక్తుల మధ్య అసమానత్వం అయినా, శ్రమ సంబంధాల్లో తేడాల వల్లనే పుట్టుకొస్తుంది. కులాల మధ్య గానీ, స్త్రీ పురుషుల మధ్య గానీ, అసమానత్వాల కారణాల్ని శ్రమ సంబంధాల్లోనే, శ్రమ విభజనల్లోనే వెతకాలి. అన్ని రకాల బాని సత్వాలకూ మూలం, శ్రమ సంబంధాల్లో వుండే బానిసత్వమే.

వర్గాల మధ్య తేడాలు గానీ, వర్గ సెక్షన్ల మధ్య తేడాలు గానీ, నశించాలంటే, అది ఎవరో ఒక రిద్దరు నాయకుల వల్ల జరిగే పని కాదు. శ్రమలు చేసే ప్రతీ శ్రామికుడికీ ఆ జ్ఞానం ఉండాలి. వాళ్ళ విముక్తి కోసం వాళ్ళు ప్రయత్నించాలి!

[ ఈ పాఠంలో ప్రశ్నలు లేవు. ] ★

# 92. సమ సమాజం ప్రారంభం!

ఆటవిక సమాజంలో తెగల మధ్య, శ్రమ దోపిడీ లేకుండానే శత్రుత్వాలు ఉండేవి. ప్రకృతి వనరుల కోసం, తెగల మధ్య జరిగే కొట్లాటల్లో, వేరే తెగ మనుషుల్ని చంపెయ్యడాలే ఉండేవి.

దొరికిన శత్రు తెగల మనుషుల్ని చంపెయ్యకుండా బానిసలుగా మార్చుకునే విధానంతో, 'బానిస విధానం' ప్రారంభమైంది. తెగల శత్రుత్వాల వల్ల చచ్చిపోవడం కన్నా బానిసగానైనా జీవించడం, ఆ మనిషికి అభివృద్ధే అయింది.

తర్వాత, భూస్వామ్య సమాజంలో, బానిసలు, బానిసత్వం నించి బైట పడి, కౌలు రైతులుగా మారడం, బానిసలకు అభివృద్ధే.

తర్వాత, పెట్టుబడిదారీ సమాజంలో, కౌలు రైతులు, వేతన శ్రామికులుగా మారడం, కౌలు రైతులకు అభివృద్ధే.

తర్వాత, సోషలిస్టు సమాజం!

'సోషలిజం' అన్నా, 'కమ్యూనిజం' అన్నా, వాటి అర్థం ఒకటే. సమ సమాజం. అయితే, ఆ సమ సమాజంలో, ప్రారంభ దశ - సోషలిజం. సమానత్వం పూర్తిగా ఏర్పడిన దశ - కమ్యూనిజం.

పెట్టుబడిదారీ సమాజంలో, కార్మిక వర్గం, రాజ్యాధికారాన్ని తీసుకోగానే అది 'సోషలిజం' అవదు. సోషలిజం కన్నా మొదటి దశ కూడా ఒకటి ఉండవచ్చు. అయినా అది, సోషలిజం మార్గంలోనే వుంటుంది.

ఇక్కడ ఇంకా వేతనాల పద్ధతే వున్నా, ఆ వేతనాలు, యజమాని ఇచ్చే కనీస వేతనాలుగా వుండవు. ఇక్కడ మొత్తం జనాభా అంతా శ్రమలు చేస్తారు. గత కాలమంతా యజమానుల కింద దాస్యంలో వుండే వేతన శ్రామికులకు, యజమానులు లేని శ్రమ సంబంధాలలో వుండడం, ఎన్నో రకాలుగా అభివృద్ధి. ఏ అభివృద్ధి అయినా, అక్కడ వున్న శ్రమ సంబంధాల్లో కూడా ఇంకా శత్రు వైరుధ్యాలు వుంటే, ఆ అభివృద్ధి కూడా ఇంకా మారవలసి వుంటుంది.

సోషలిజంలో ఖచ్చితమైన 'పని దినం' ఉంటుంది. పని దినంలో సహజంగా అవసరమయ్యే క్రమశిక్షణ వుంటుంది. "పని స్థలంలోకి అందరూ ఒకే సమయానికి రావాలి; ఇన్ని గంటలు పని చెయ్యాలి" అనే క్రమశిక్షణే లేకపోతే, పనే జరగదు. ఉత్పత్తుల అమ్మకాల ( మారకాల ) విధానం ఇంకా ఉంటుంది. జీతాలు పొందే విధానం చేసిన శ్రమని బట్టే వుంటుంది. ఇంకా డబ్బు చలామణీ వుంటుంది.

పాత శ్రమ విభజనలో మార్పులు జరుగుతూ వుంటాయి.

క్రమ క్రమంగా కొన్ని అవసరాలు ప్రభుత్వం ద్వారా 'ఉచితంగా' తీరడం ప్రారంభమవుతుంది. చిన్న స్థాయి

చదువులు ఉచితం. ప్రయాణాల కోసం రవాణాలు ఉచితం. వైద్యం ఉచితం. లైబ్రరీలూ, సినిమాలూ, ఉచితం. ఇస్త్రీలు ఉచితం. క్షవరాలు ఉచితం. టూత్ బ్రష్‌లూ, పేస్టులూ, సబ్బులూ ఉచితం. - ఇలా, ఉచితాలు క్రమంగా పెరుగుతాయి. మనుషుల సంబంధాల్లో మారకాలూ, డబ్బు లెక్కలూ, తగ్గుతూ వుంటాయి.

అయితే, ' ఉచితం' అనేది ఏదీ నిజమైన ఉచితం కాదు. ఒక కుటుంబంలో వున్న భార్యా భర్త లిద్దరూ ఉద్యోగాల్లో ఉంటారు. వాళ్ళ పిల్లల చదువుల కోసం నెలకి 20 డబ్బు ( అంత విలువ గల ఉత్పత్తి ) ఖర్చవుతుందనుకుందాం. ఆ ఖర్చు, ఆ పిల్లల తల్లిదండ్రుల చేతుల ద్వారానే జరగాలంటే, ఆ 20 కూడా, ఆ తల్లిదండ్రులకు అందే జీతాల లోనే కలిసి వుండాలి. లేదా, ఆ ఖర్చు ప్రభుత్వం ద్వారా జరగాలంటే, ఆ 20, ఆ తల్లిదండ్రుల శ్రమ విలువలలో నించి ప్రభుత్వానికి అందే ' సమాజ నిధి' భాగం లోకి చేరి వుండాలి. అంటే, పిల్లల చదువు ఖర్చుల్ని భరించేది, ఆ పిల్లల తల్లిదండ్రులే గానీ, ఇతరులెవరూ కాదు ; ప్రభుత్వం కాదు. ఆ తల్లిదండ్రుల శ్రమ విలువలో నించే, ఆ 20 డబ్బు, ప్రభుత్వానికి అందకపోతే, అది ప్రభుత్వానికి ఎక్కణ్ణించి వస్తుంది? అది ఆకాశంలో నించి ఊడిపడదు. సమాజంలో వున్న మొత్తం పిల్లల చదువు ఖర్చుల్ని భరించేది, మొత్తం తల్లిదండ్రులే. ఎవరి పిల్లల కోసం వాళ్ళే శ్రమ చేసుకుంటారని అర్థం.

అలాగే మిగతా ఖర్చులన్నీ కూడా! వైద్యం ఖర్చు సంగతి అయినా అంతే, రవాణా సంగతి అయినా అంతే, క్షవరాలు అయినా అంతే, ఇస్త్రీలు అయినా అంతే, ఏ ఒక్క ఖర్చు అయినా అంతే.

ఒక వ్యక్తికి, రోజువారీగా, 10 రకాల ఖర్చులు జరగాలనుకుందాం. ఆ వ్యక్తి శ్రమ విలువ, 2 భాగాలుగా చీలేటప్పుడు, ' జీతాల' భాగం ఎంత ఉండాలీ, ' సమాజ నిధి' భాగం ఎంత ఉండాలీ - అనేది, ఎలా నిర్ణయమవుతుంది? అతని కోసం అవసరమయ్యే 10 ఖర్చుల్లో, ఏ ఖర్చులు అతని ద్వారా జరగాలీ ; ఏ ఖర్చులు ప్రభుత్వం ద్వారా జరగాలీ - అనేదాన్ని బట్టి, ఆ విభజన ఉంటుంది. అతని ద్వారా జరగవలసిన ఖర్చే ఎక్కువ అయితే, జీతాల భాగమే ఎక్కువగా వుండాలి ; లేదా, ప్రభుత్వం ద్వారా జరిగే ఖర్చులే ఎక్కువ అయితే, సమాజ నిధి భాగమే ఎక్కువగా వుండాలి.

వ్యక్తులు, వాళ్ళ చేతుల ద్వారా ఖర్చు పెట్టేదీ, ప్రభుత్వం ద్వారా ఖర్చు పెట్టేదీ అంతా, ఆ వ్యక్తుల శ్రమే. వ్యక్తుల శ్రమ లేకుండా ప్రభుత్వంలోకి ఏదీ రాదు.

ఒక వ్యక్తికి అవసరమయ్యే ఏ ఖర్చు అయినా, ఆ వ్యక్తి శ్రమలో నించి గాక, నిజంగానే ' ఉచితంగా' అందిందనుకుందాం. అది, ఎక్కడి నించి వచ్చి వుంటుంది? ఆ వ్యక్తి శ్రమలో నించి గాక, ఇతరుల శ్రమలో నించి వచ్చి వుంటుంది. అది ఇతరుల శ్రమ అయితే, అది శ్రమ దోపిడీ అవదూ? అటువంటి ' ఉచితం' అయినది ప్రతీదీ శ్రమ దోపిడీయే అవు

తుంది. కాబట్టి, ఇక్కడ 'ఉచితం' అని చెప్పుకునేది ఏదీ నిజమైన ఉచితం కాదు. ప్రభుత్వం ద్వారా జరిగే ఉచితాలన్నీ, దేశ జనాభా శ్రమలే. ఒక వ్యక్తి కోసం అవసర మయ్యే ఏ ఖర్చు అయినా, ఆ వ్యక్తి శ్రమ ఫలితమే. జనాల శ్రమల్లో భాగాలే ప్రభుత్వా నికి అందే సమాజ నిధి. ప్రతీ వ్యక్తికీ ఎవరి ఖర్చు, వారి శ్రమ ద్వారా జరగవలిసిందే.

మార్క్సు కన్నా పూర్వమే, 'సోషలిజం, కమ్యూనిజం' అనే మాటలు వున్నాయి. ఆ కొత్త సమాజాన్ని నిజంగా కోరుకున్న మంచి మనుషులు కొందరు ఉన్నారు. కానీ వారికి శ్రమ దోపిడీ గురించి తెలియదు. అదనపు విలువ గురించి తెలియదు. అసలైన కారణం తెలియని వాళ్ళు, సమస్యకు సరైన పరిష్కారం ఏం చెప్పగలరు? వారికి సోష లిజం కావాలి. కానీ, దానికి మార్గం చెప్పలేక పోయారు. వారు, చిట్టి పొట్టి సంస్కరణ మార్గాలే చూపించారు. ఆ సంస్కరణల్లో, పెట్టుబడిదారులూ, కార్మికులూ, ఎప్పటి లాగే వుంటారు. కానీ వాళ్ళు అన్న దమ్ముల్లా కలిసిపోతారు! సోషలిజాన్ని ఆ మార్గంలో ఊహించినందుకు, వారు, 'ఊహాజనిత సోషలిస్టులు' అని పేరు పడవలసి వచ్చింది.

[ 'విలువ' గురించి, 2 వేల సంవత్స రాల కిందటి వాడైన అరిస్టాటిల్ నించీ మార్క్సు దాకా జరిగిన పరిశోధనని చెప్పే పుస్తకం ఒకటి వుంది. దీని పేరు, **"మార్క్సు పూర్వపు అర్థ శాస్త్రం."** ఇందులో ఊహా జనిత సోషలిస్టుల చరిత్రలు కూడా వున్నాయి. ఈ పుస్తకం, **అనీకిన్** అనే రష్యన్ రచయిత రాసినది. దీన్ని నిడమర్తి ఉమా మహేశ్వర్రావు అనే ఆయన తెలుగు లోకి అనువాదం చేశారు. దీన్ని 'ప్రగతి ప్రచు రణలు' పేరుతో, కొందరు పాఠకులు పెట్టుకున్న డబ్బుతో మేము, ప్రచురిం చాము. దీన్ని చదివితే, సోషలిజం గురిం చిన ఊహలు కొన్ని తెలుస్తాయి. విలువని అర్థం చేసుకోవడానికి ఎందరు మేధావులు ఎన్ని ప్రయత్నాలు చేశారో తెలుస్తుంది. కానీ అప్పటికీ శ్రమ దోపిడీ సంగతి బైట పడ లేదు. ఇదంతా మార్క్సుకి ఉపకరించిన చరిత్ర. ఈ పునాది మీదే మార్క్సు శ్రమ దోపిడీని గ్రహించగలిగాడు. "మార్క్సు పూర్వపు అర్థం శాస్త్రం" కూడా తర్వాత రోజుల్లో చదవండి! ]

భారత దేశంలో 'మహాత్మాగాంధీ' వంటి సంస్కర్తలైతే, మార్క్సు ద్వారా 'శ్రమ దోపిడీ' రహస్యం బైట పడిన తర్వాత ఉద్భవించినవారే. కానీ వారు శ్రమ దోపి డీనే అక్కున చేర్చుకుని, దాని వ్యతిరేక సిద్ధాంతాన్నే తిరస్కరిస్తారు. పెట్టుబడి దారులు, కార్మికుల్ని, కొంచెం దయగా చూస్తే చాలంటారు! ఆ రకంగా, ఆ మహా త్ములు, పెట్టుబడిదారుల రక్షకులు అవుతారు.

ఇలాంటి ఏ తప్పుడు ప్రభావాలనూ చేరనివ్వకుండా కార్మిక వర్గ పరిపాలన, దోపిడీ శ్రమ సంబంధాల్ని తీసివేసే లక్ష్యం తోనే సోషలిస్టు మార్పులు ప్రారంభించాలి. - ఆ మార్పులన్నీ సక్రమంగా సాగుతూ వుంటే, ముఖ్యంగా శ్రమ విభజనలో ప్రధానమైన మార్పులు జరిగితే, ఏ ఇద్దరు

వ్యక్తులు చేసే శ్రమ విలువ అయినా సమానం అవుతుంది. అప్పుడు, జీతాల విధానంతో అవసరం వుండదు. ప్రతీ మనిషీ తన డ్యూటీల ప్రకారం శ్రమ చేసి, తన అవసరాలకు కావలసిన ఉత్పత్తులన్నీ వాడుకోవచ్చు. వాటికి లెక్కలు అక్కరలేదు. ప్రతి మనిషీ, పని దినంలో తన బాధ్యతతో శ్రమ చెయ్యడమూ, తన అవసరాల కొద్దీ ఉత్పత్తుల్ని వాడుకోవడమూ, జరుగుతాయి.

శత్రు వర్గాలు అంతమై, వర్గ పోరాటాలు ఆగిపోయి, ప్రతి మనిషీ, శారీరక - మేధా శ్రమలు చెయ్యడం తన బాధ్యతగా గ్రహించినప్పుడు ; మనుషుల నూతన భావాలు ( నూతన చైతన్యం ) ఆ స్థాయికి చేరినప్పుడు ; అప్పటి నించీ 'మారకాలు' ఉండవు. 'జీతాల' విధానం ఉండదు. డబ్బు చలామణీ వుండదు. ఉత్పత్తుల తయారీ కోసం అవసరమయ్యే శ్రమ లెక్కలు, ఉపయోగపు విలువ దృష్టితోనే ఉంటాయి. అప్పుడు కూడా వ్యవసాయాలూ, పరిశ్రమలూ, రవాణాలూ, అన్ని రకాల శ్రమ క్రమాలూ, అన్ని అవసర ఉత్పత్తులూ, ఎప్పటి లాగే ఉంటాయి.

గుర్రప్పందాల లాంటి వ్యసనాలూ, ప్రతి రంగంలోనూ పోటీలూ, డబ్బు దృష్టితో జరిగే వికృత సంస్కృతులూ, అంతర్ధానమవుతాయి.

ఉత్పత్తి శక్తుల పెరుగుదలలు, సమాజ అవసరాలకూ, ఉత్పత్తిదారుల క్షేమాలకూ తగిన ధోరణిలోనే జరుగుతాయి. మానవ సంబంధాల క్షేమానికీ, ఉపయోగపు విలువ దృష్టికీ పనికిరాని సైన్సు, అనవసరమవుతుంది ; అర్థ రహిత మవుతుంది.

సమాజంలో జనాభా అంతా శ్రమ చెయ్యడం వల్ల, ఈ నాడు వున్న పని దినం పొడవు తగ్గుతుంది. సమాజంలో అన్ని శాఖల లోనూ ఉత్పత్తి శక్తులు కావలసిన విధంగా పెరగడం వల్ల, పని దినం మరింత తగ్గుతుంది.

ఇదంతా, 'తర్కం' మీద ఆధారపడే ఊహ! శ్రమ దోపిడీ సంబంధాల నించి బయటపడే తర్కం మీద! ఇది ఆదర్శాల కోసం కాదు. మానవ శ్రమ సంబంధాల్లో శత్రు వైరుధ్యాలు లేని ఔన్నత్యం కోసం!

'సోషలిజం, కమ్యూనిజం' అనే మాటలు, మార్క్సు కన్నా పూర్వం నించే వున్నాయి. వెనకటి సంస్కర్తలు కూడా కొందరు, సమ సమాజం కావాలని కలలు కన్నారు. తమకు తోచిన మార్గాలు చెప్పారు. కానీ, 'శ్రమ దోపిడీ'ని గ్రహించక పోవడం వల్ల, సమ సమాజం ఎలా ఏర్పడుతుందో, ఏ వర్గం ద్వారా ఏర్పడుతుందో, చెప్పలేక పోయారు. అదంతా మార్క్సు, మానవ సమాజం గురించి సరిగా గ్రహించి చెప్పగలిగాడు కాబట్టి, మార్క్సు చెప్పింది, సరియైన సమాజ శాస్త్రం అయింది. మార్క్సు చెప్పింది - మార్క్సిజం. ఇది, శ్రమ సంబంధాల సైన్సు!

సోషలిస్టు దశ, కమ్యూనిస్టు దశగా మారితే, ఆ సమాజం, మారకం విలువ దృష్టితో కాదు, ఉపయోగపు విలువ దృష్టితో సాగు తుంది. మరి, కమ్యూనిజం తర్వాత ఏమిటి?

# ప్రశ్నలూ - జవాబులూ

**1**. ప్రభుత్వం ద్వారా 'ఉచితంగా' అందేవి కూడా వ్యక్తుల శ్రమలో నించి వచ్చేవే - అనేది అర్థమైంది. కానీ, ఉచితంగా ఇచ్చేవాటిని, అందరూ ఎక్కువెక్కువగా తీసేసుకోరూ? ఒక వ్యక్తి, తన శ్రమలో నించి ' సమాజ నిధి'లోకి 10 విలువని వదిలాడనుకుందాం. తర్వాత ఆ వ్యక్తి ఉచితంగా తీసుకునేదంతా 10 విలువతోనే సమానంగా వుంటుందా? ఇచ్చేది తక్కువగానూ, తీసుకునేది ఎక్కువగానూ వుండదా?

**జ**: అన్నిటికీ ఒక ప్లాను వుంటుంది. సమాజ నిధి లోకి చేరే విలువకీ, తిరిగి అది ఖర్చు అవవలసిన దానికీ, తప్పనిసరిగా సమన్వయం వుండాలి. వస్తువులు ఎంత ఉచితంగా దొరికినా, కొన్నిటిని ఎక్కువగా వాడడం సాధ్యం కాదు. నిద్ర లేవగానే అవసరమయ్యే టూత్ బ్రష్షూ, పేస్టూ సంగతి చూడండి. వాటిని ఒక వ్యక్తి రెండు పూటలూ వాడితే, అవి 3 నెలల దాకా వస్తాయనుకుందాం. ఉచితంగా దొరుకుతాయి కదా అని, నెలకి 4 బ్రష్షులూ పేస్టులూ తీసుకుని ఏం చేసుకుంటారు? వాటిని అమ్మి, డబ్బుగా మార్చుకునే మార్గం వుండదు కదా? సబ్బుల సంగతి చూడండి. చర్మ వ్యాధుల వంటి ప్రత్యేకమైన జబ్బులకూ, పిల్లలకూ, వేరే రకాల సబ్బులు వుంటాయి. అవి గాక, సాధారణంగా అందరికీ నాణ్యమైన రకాల సబ్బులే వుంటాయి. ఏ రకం అయినా తీసుకోవచ్చు. ఒక మనిషికి, 2 పూటలా స్నానం చేస్తే, నెలకో సబ్బు సరిపోతుందనుకుందాం. ఆ లెక్కనే అవి అందరికీ అందుతాయి. ఉచితంగా దొరుకుతాయి కదా అని, ఒక్కరి కోసం నెలకి 4 సబ్బులు వాడగలరా ఎవరైనా? తిండి సంగతి చూడండి. స్కూళ్ళ దగ్గిరా, పని స్తలాల దగ్గిరా, భోజన శాలల్లో, ఉచితంగా తినవచ్చు అనుకుందాం. ఏ మనిషి అయినా కడుపునిండా తిని ఆపేస్తాడా, 2 కడుపులతో తింటాడా? సంవత్సరానికి 2 జతల చెప్పులు చాలు. ఒక మనిషికి, సంవత్సరానికి 6 చేతి రుమాళ్ళు చాలు. డ్రాయర్లూ, బనీన్లూ, దుప్పట్లూ వంటివి అన్నీ ఫలానా ఫలానా లెక్కలతో చాలు. రోజూ 1, 2 దిన పత్రికలు, ప్రతి ఇంటికీ ఉచితంగా వచ్చి పడతాయి. లైబ్రరీల్లో పుస్తకాలు ఉచితం. చదివి ఇచ్చెయ్యాలి. రవాణా ఉచితం కదా అని రోజంతా బస్సుల్లోనూ, రైళ్ళల్లోనూ తిరుగుతూ వుంటారా? మందులు ఉచితం అని ఎన్ని మందులు తింటారు? ఉచితాలు ప్రారంభమైన కొత్తల్లో, కొన్ని రకాల అస్తవ్యస్తతలు వుండవచ్చు. క్రమ క్రమంగా కొత్త విధానాల్లో, కొత్త భావాలూ, కొత్త సంస్కృతీ, కొత్త ప్రవర్తనా, అలవాటైపోతాయి.

కొత్త సమాజం ప్రారంభమైన దగ్గిర్నించీ, కొత్త శ్రమ సంబంధాల్నీ, దానికి తగిన భావాల్నీ, దానికి తగిన సంస్కృతినీ వివరించే, బోధించే కళలు ప్రారంభమవుతాయి. ఉచితాలు ప్రారంభమయ్యాక, అందరికీ అదే జీవిత విధానం అయిపోతుంది. మొదట్లో ఇది చిన్న చిన్న ఉచితాలతోనే ప్రారంభమవుతుంది. సమాజ నిధి లోకి చేరే విలువని బట్టే, ఈ ఉచితాల ఏర్పాటు సాధ్యమవుతుంది. ఇది ఇలా ప్రారంభం →


కావాలంటే, (1) అందరూ శ్రమ చెయ్యాడమూ, (2) పాత శ్రమ విభజన కొంత వరకైనా మారడమూ - ప్రారంభం కావాలి. అందరికీ ఉద్యోగాలూ, అందరికీ సదుపాయంగా వుండే ఇళ్ళూ, మొదట వుండాలి. ప్రతీ నెలా ఏ యే వస్తువులు కావాలో వాటిని బజార్లలో కొనడం కాకుండా, రేషన్ పద్ధతిలో నెలకో సారి తెచ్చుకునే విధానం వుంటే, భూమి నిండా మార్కెట్లు అనవసరం.

**2**. సోషలిస్టు సమాజంలో రచయితల, కళాకారుల పరిస్తితి ఎలా వుంటుంది? ప్రస్తుత సమాజంలో, రచయిత, పుస్తకాల్ని ప్రైవేటు ప్రచురణ కర్తలు ప్రచురిస్తారు. లేదా, కొందరు రచయితలు, స్వయంగా ప్రింటు చేయించుకుంటారు. మరి, కొత్త సమాజంలో, ప్రైవేటు పబ్లిషర్లు వుండకపోతే, రచయితల పుస్తకాల సంగతి ఏమవుతుంది?


**జ**: ఇక్కడ, ప్రైవేటు ప్రచురణ కర్తలు మాత్రం, ప్రతీ రచయిత రాసిన ప్రతీ పుస్తకాన్నీ ప్రింటు చేస్తారా? తమ అంచనా ప్రకారం, అది అమ్ముడవుతుందో లేదో చూసి అలాంటి వాటినే ప్రింటు చేస్తారు. అలాగే, రేపటి సమాజంలో, దాని అంచనాలు దానికి వుంటాయి. ప్రతీ కళకీ సంబంధించి, ఆ అవగాహన వున్న వారితోనే కమిటీలు వుంటాయి. రచయితలు, తమ రచనల్ని ఆ కమిటీలకు పంపుకోవచ్చు. అక్కడ సెలక్టయినవి బైటికి వస్తాయి. అయినా, అనేక చర్చలతో, అనేక అనుభవాలతో, సరైన కొత్త మార్గాలు దొరుకుతాయి. శ్రమ దోపిడీని తీసివెయ్యగలిగే సమాజం, అన్ని కోణాలలోనూ సరైన మార్గాలు పట్టుకోగలుగుతుంది. అలాంటి సరైన ఆచరణలు లేకపోతే, అది సమ సమాజం అవదు.

**3**. దోపిడీ సమాజాన్నీ, దోపిడీ లేని సమాజాన్నీ బొమ్మలతో చూడగలమా?

**జ**:



భూస్వామీ, భూస్వామినీ. దూరంగా శ్రామికులూ.



అందరూ కలిసి పనులు చేస్తున్నారు.

★

## సోషలిజం తర్వాత కమ్యూనిజం

# 93. కమ్యూనిజం తర్వాత కమ్యూనిజమే!

ఇది కమ్యూనిస్టు సమాజం! జనాభా అందరూ సమాన శ్రమ సంబంధాలు గల ఉత్పత్తిదారులే. శక్తి ని బట్టి శ్రమ చేసి, అవసరాన్ని బట్టి వాడుకోవడం - దీని సూత్రం. ' శక్తి ని బట్టి శ్రమ చెయ్యడం' అంటే: ' శ్రమ చెయ్యడం మానవుల విధి; అది ఆత్మ గౌరవం' అని గ్రహిస్తే, ఆ మనుషులు, శ్రమని తప్పించుకోవడానికి ప్రయత్నించరు. తమ డ్యూటీ తాము నిజాయితీగా చేస్తారు. ఆ డ్యూటీ కాలంలోనే తాము చెయ్యగలిగే పనిని, బాధ్యతతో చేస్తారు. అలాగే, ' అవసరాన్ని బట్టి తీసుకోవడం' అంటే : అవసరాన్ని మించి తీసుకోరు. ఈ 2 కోణాలే పాత మనుషుల్ని, నూతన మానవుల్ని చేస్తాయి. ఈ నూతన సంబంధాలే, మానవుల జీవిత విధానం అయిపోతుంది. దీని వల్ల, వేతనాల, మారకాల సంబంధాలు పూర్తిగా మారిపోతాయి. శ్రమ సంబంధాల్లో ఇది, అత్యున్నత స్థాయి.

ఇక, కమ్యూనిస్టు సమాజం తర్వాత ఏమిటి? - కమ్యూనిజం అంటే, శత్రు వైరుధ్యాలు లేని సమాన శ్రమ సంబంధాలు గల సమాజం. సంబంధాలు ఆ స్థాయికి చేరినప్పుడే అది కమ్యూనిజం! సమ సమాజం! దాని కన్నా ఉన్నతమైన మార్పు ఇంకెలా సాధ్యమో ఆలోచించండి! అది ఇంకా మారాలంటే, ఎలా మారాలి?

' సమానత్వం' ఏర్పడిన తర్వాత అది మారిందంటే, అది అసమానత్వం అవుతుంది. అక్కడ, అసమానత్వం ఏదైనా ప్రారంభమైతే, అది మళ్ళీ సమానత్వంగా మారవలసి వుంటుంది. సమానత్వం చెదిరిందంటే, అది మళ్ళీ సమానత్వం అవలసిందే. సమానత్వం చెదరకపోతే, అదే కొనసాగుతూ వుంటుంది. అంటే, కమ్యూనిజం తర్వాత వుండేది కమ్యూనిజమే. మానవ సమాజానికి, వైరుధ్యాలు లేని సమాన శ్రమ సంబంధాలే అత్యున్నత స్థాయి. ఆ సంబంధాలే కొనసాగుతాయి.

" పదార్థంలో ఎప్పుడూ చలనం వుంటుంది, అది మారిపోతూ వుంటుంది" అనే సూత్రం, ప్రకృతి పదార్థాలకే ఎప్పుడూ వర్తిస్తుంది. సామాజిక సంబంధాల్లో, శత్రు వైరుధ్యాలు ఉన్నంత వరకే, ఆ వైరుధ్యాలు పోయే మార్పులు జరుగుతాయి. శత్రు వైరుధ్యాలు పోయిన తర్వాత ఇక మౌలికమైన మార్పుతో అవసరం వుండదు.

ఏ పదార్థానికైనా, ఏ సంబంధానికైనా, ' రూపమూ - గుణమూ' అనే అంశాలు ఉంటాయి.

ఆటవిక దశ నాటి ఒక తెగలో వున్న సమాజానికి, ఒక రూపమూ ఒక గుణమూ ఉన్నట్టు ఊహించాలి. రూపం - అనాగరిక రూపం. గుణం - సమాన శ్రమ సంబం

ధాలు. ఆ సమానత్వం, ఉన్నత చైతన్యంతో, శ్రమలకు సంబంధించిన గ్రహింపుతో, ఏర్పడిన సమానత్వం కాదు. ప్రకృతిలో క్రూర జంతువుల నించి రక్షణ కోసం, ఆ నాటి అవసరాల కోసం సాగిన సమానత్వం అది.

ఆ ఆటవిక సమాజం, బానిస సమాజంగా మారినప్పుడు, ఆటవిక సమాజపు రూపమూ గుణమూ కూడా మారిపోతాయి. గుణం - దోపిడీ శ్రమ సంబంధాలు. రూపం - ఆటవిక సమాజంలో లేని శ్రమ పరిస్తితులూ, కొరడాలూ!

బానిస సమాజం భూస్వామ్య సమాజంగా మారినప్పుడు, రూపం కొంత మారుతుంది. గుణం - వెనకటిదే. బానిసల కాలం నాటిదే.

భూస్వామ్య సమాజం పెట్టుబడిదారీ సమాజంగా మారినప్పుడు, రూపమే మారుతుంది. గుణం - వెనకటిదే. బానిసల కాలం నాటిదే.

పెట్టుబడిదారీ సమాజం దాకా చూస్తే, సమాజంలో ఈ మార్పులూ, ఈ దశలూ, అన్ని దేశాల్లోనూ వెనకటి కాలం నించీ ఒకే రకంగా జరుగుతూ వున్నట్టు భావించ కూడదు. ఏ దేశపు చరిత్రల్ని బట్టి, ఆ దేశపు వర్గాల్నీ, శ్రమ సంబంధాల్నీ, అర్థం చేసుకోవాలి. కానీ, ఆటవిక సమాజాల తర్వాత, ఏ దేశంలో అయినా క్రమ క్రమంగా ఏర్పడ్డవి యజమానీ శ్రామిక సంబంధాలే. వాటిలోనే కొన్ని తేడాలు ఉండవచ్చు.

ఈ నాడు అన్ని చోట్లా అమలులో వున్న పెట్టుబడిదారీ విధానాన్ని చూస్తే, అది గొప్ప నాగరిక విధానంగా కనపడుతుంది. కానీ దాని నాగరికత అంతా, నగరాలూ - యంత్రాలూ పుట్టుకు రావడమే ; సరుకులు రక రకాలుగా తయారవడమే. నిజానికి, బానిస యజమానుల సంస్కృతికి కొనసాగింపే పెట్టుబడిదారీ సంస్కృతి! యజమానులు బానిసల శరీరాల నిండా బిగించిన తాళ్ళూ, కంటెలూ, సంకెళ్ళూ, పట్టీలూ అన్నీ - ఈ నాటికీ ఆభరణాలుగా స్త్రీ పురుషుల శరీరాల నిండా పెనవేసుకుని వున్నాయి! అంతా, రూపంలోనే మార్పు! గుణం అంతా వెనకటిదే!

కార్మిక జనం తమ ఆశలన్నీ సోషలిజం మీద పెట్టుకోవాలి.

పెట్టుబడిదారీ సమాజం, సోషలిస్టు సమాజంగా మారినప్పుడు, గుణంలో, సమానత్వానికి దారితీసే మార్పులు జరుగుతాయి. దానికి తగ్గట్టే రూపంలో కూడా మార్పులు జరుగుతాయి. కానీ ఆ మార్పులన్నీ ఇంకా అసంపూర్ణంగానే వుంటాయి.

సోషలిస్టు సమాజం, కమ్యూనిస్టు సమాజంగా మారినప్పుడు, గుణమూ, రూపమూ, సమాన శ్రమ సంబంధాలకు తగిన సంపూర్ణత్వంలోకి మారతాయి.

కమ్యూనిజం కొనసాగుతూ వున్నప్పుడు, గుణంలో ఇక మార్పులు జరగవలసిందేమీ వుండదు. రూపంలో మార్పులు జరుగుతూనే వుండవచ్చు.

కమ్యూనిజంలో కూడా మిత్ర వైరుధ్యాలు వుంటాయి. అవి, నూతన ఉత్పత్తి శక్తులకు సంబంధించీ, నిర్వహణలకు సంబంధించీ, వాదోపవాదాల రూపంలో, చర్చల రూపంలో, వుంటాయి. సరైన అంశాన్ని పట్టుకోగలగడంతో, ఆ వైరుధ్యాలు సమసిపోతాయి. ఆ మర్నాడే ఇంకో విషయం మీద ఇంకో సందేహం రావచ్చు. దాని మీద, దానికి తగిన వాదాలు జరగవచ్చు. అదీ సమసిపోతుంది. ఆ వాదాలు, నిరంతరం వుంటాయి. అవి, ప్రకృతి జ్ఞానాన్ని పెంచుతాయి.

ఇప్పుడు ప్రపంచంలో మానవ సమాజం అంతా, పెట్టుబడిదారీ విధానం లోనే వుంది. ఇది, సోషలిజం వేపు మారాలి. మారడం తప్పనిసరి - అని జరిగిపోయిన చరిత్ర చూపిస్తోంది.

జరిగిపోయిన చరిత్ర, శ్రామిక వర్గానికి విజయాలనే కాదు, అపజయాల్ని కూడా చూపిస్తోంది. రష్యా, చైనాల్లో సోషలిజం, ఇలా ప్రత్యక్షమై అలా అంతర్ధానమై పోయింది! అది, ఇలా జయించి, అలా ఓడిపోయింది! దానికి కారణాలు పరిశీలించదలిస్తే, అవి తప్పకుండా కనపడతాయి. అదంతా స్పష్టంగా కనపడే చరిత్రే.

శ్రామిక వర్గానికి ఎదురయ్యే ఏ అపజయంలో అయినా, సాధారణ ప్రజల నేరం ఏదీ వుండదు. శ్రమ దోపిడీ నించి విముక్తి చెందాలని చెప్పే సిద్ధాంతం తప్పు అసలే వుండదు. ఇక, తప్పులు వుండేది, నాయకత్వాల లోనే. తప్పుల కోసం ఎప్పుడూ నాయకత్వాలలోనే వెతకాలి.

సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవడం లోనూ, ఆచరించడం లోనూ, నాయకులు చేసే తప్పులే అపజయాలకు కారణాలవుతాయి. కానీ ఆ నాయకత్వాల ద్వారానే అనేక అద్భుత విజయాలు కూడా జరిగాయి. భూస్వామ్య విధానాన్ని తీసివెయ్యడం జరిగింది. ప్రైవేటు పెట్టుబడిదారీ విధానాన్ని తీసివెయ్యడం జరిగింది. చైనాలో అయితే, పాత శ్రమ విభజనని మార్చడంలో విప్లవకరమైన మార్పులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే ఆ మార్పులన్నీ మళ్ళీ వెనక్కి తిరిగాయి అంటే, కార్మిక వర్గం ప్రస్తుతానికి ఓడిపోయి వుందని అర్థం.

విజయాలకు అయితే, కారకులు నాయకులు మాత్రమే కాదు ; సాధారణ జనం కూడా కలిస్తేనే విజయాలు సిద్ధిస్తాయి. కానీ అపజయాలకు కారకులు సాధారణ జనం కాదు, ఎప్పుడూ నాయకులే. నాయకుల సిద్ధాంత అజ్ఞానాలూ, పదవీ కాంక్షలూ, వెనకటి కాలపు తప్పుడు సంస్కృతుల్ని వదలలేని తనాలూ - వంటివే అనివార్యంగా అపజయాల పాలు చేస్తాయి.

నాయకత్వం, శ్రామిక జనాలకు, శ్రమ దోపిడీ గురించి వివరించ లేక పోవడం వల్లనే ఆ జనం, పాత భావాలలోనే వుండిపోతారు. ' బూర్జువా సమాజాన్ని ఎందుకు

తిరస్కరించాలి? ఈ సంబంధాల వల్ల శ్రామిక జనాలకు జరిగే హాని ఏమిటి? దీన్ని ఎలా మార్చుకోవాలి? దాని కోసం ఏం చెయ్యాలి? నూతన సమాజంలో ఎలాంటి మార్పులు జరగాలి?'' ఇలాంటి విషయాలు, శ్రామిక జనాభాకి, ఈ నాటి నించే, ఎంతో స్పష్టంగా తెలుస్తూ వుండాలి. రేపు ఏం చెయ్యాలో అందరికీ ఈ నాడే తెలిసి వుండాలి. కమ్యూనిస్టు పార్టీ, శ్రామిక జనాభాకి, ఈ సిద్ధాంత జ్ఞానం నేర్పగలగాలి. రాజ్యాధికారం తీసుకున్న తర్వాత, జనాలకు, శ్రమ దోపిడీని అర్థం చేసుకోగలిగే, దాన్ని వ్యతిరేకించగలిగే జ్ఞానం ఇవ్వాలి. ఈ ప్రయత్నాలు రష్యా చైనాల్లో తగినంతగా జరగక పోవడమే కనపడుతుంది.

రష్యా, చైనా దేశాల అపజయాల్ని చూసి, ఇతర దేశాల కార్మిక జనాభాకు అనేక సందేహాలు కలుగుతాయి. " రష్యా చైనాలే, సోషలిజాన్ని వదిలి పెట్టి, పెట్టుబడి దారీ విధానాన్నే ఆలింగనం చేసుకుంటే, ఇక ఏ దేశానికైనా సోషలిజం కోసం ప్రయత్నాలు ఎందుకు? పోరాటాల ద్వారా ఇక్కడ కూడా సోషలిజాన్ని ప్రారంభించినా, ఇక్కడా మళ్ళీ అది పోయేదే కదా? పెట్టుబడిదారీ విధానం తప్పదు కదా?'' - ఈ రకం సందేహాలు, శ్రామిక ప్రజల్ని నిరుత్సాహంలో ముంచేస్తాయి.

కానీ, <u>సోషలిజం కోసం ప్రయత్నాలు, ఇతర దేశాల్లోనే కాదు, ఓడిపోయిన రష్యా, చైనాల్లో కూడా మళ్ళీ మళ్ళీ అవసరం.</u> ఆ దేశాల్లో దోపిడీ విధానాన్ని ఆలింగనం చేసుకున్నది, శ్రామిక వర్గం కాదు ; దోపిడీ రుచుల్ని మరిగి వున్న పాత దోపిడీ వర్గమే. అది జయించింది కాబట్టి, దాని జయానికే శ్రామిక వర్గం జోహార్లు పలకనక్కరలేదు. శ్రామిక వర్గానికి తన విముక్తి లక్ష్యం తనకు ఎప్పుడూ వుండాలి. వెనకటి శ్రామిక వర్గాలు కూడా వందల సంవత్సరాల పాటు ఓటములతోనే కాలం గడిపాయి. కానీ, వాటి లక్ష్యాల్ని అవి వదిలి పెట్టలేదు. రష్యా చైనాల శ్రామిక వర్గాలకు కూడా మళ్ళీ భవిష్యత్తు వుంటుంది. అవి పాత అనుభవాల నించి కొత్త జ్ఞానం నేర్చుకుంటాయి. గతంలో జరిగిన తప్పుల్ని వదిలేసి, ఒప్పుల్ని అభివృద్ధి పరుచుకుంటాయి.

మానవ సమాజం అభివృద్ధి వేపే సాగుతోందని చరిత్ర చూపిస్తోంది. ' స్వర్ణయుగం' వెనక కాదు, ముందు ఉంది!

**[ ప్రశ్నలు లేవు. ఇంత ఆఖరి పాఠంలో కూడా ప్రశ్నలా? ఇంకా సందేహాలా? ఇక ప్రశ్నలు లేనంతగా అర్థం అయిపోవాలి.]**

★

# 94. కార్మిక వర్గం సాధించవలసింది ఏమిటి?

కార్మిక వర్గం సాధించవలసింది ఏమిటో మార్క్సు చెపుతున్నాడు.
విందామా? ముందు ఈ మాటలు వినండి!



" మొత్తం 'జీతాల వ్యవస్థ'లో వున్న బానిసత్వాన్ని అలా వుంచుదాం. ఈ దైనం దిన పోరాటాలు చివరికి ఎలా పరిణమిస్తా యనే విషయంపై కార్మిక వర్గం మరీ అతి శయ భావాలకు పోకూడదు. తాము పోరాడుతున్నది ఫలితాలకు వ్యతిరేకంగా మాత్రమేననీ, వాటికి గల కారణాలకు వ్యతిరేకంగా కాదనీ, వారు మరిచిపో కూడదు.... తాము పరిస్తితుల్ని దిగ జార కుండా నిరోధిస్తున్నామే గానీ, అసలు మార్గాన్ని మార్చడం లేదనీ, వ్యాధి ఉగ్ర తను తగ్గించడానికి ప్రయత్నిస్తున్నామే గానీ వ్యాధిని నిర్మూలించడం లేదనీ, వారు గ్రహించాలి. కాబట్టి, పెట్టుబడి దారులు నిరంతరం చేసే దాడుల నుంచీ, లేదా మార్కెట్టు ఎగుడు దిగుడుల నుంచీ, ఉత్పన్నమయ్యే అనివార్యమైన గెరిల్లా పోరాటాల లోనే వారు పూర్తిగా నిమగ్నులై వుండకూడదు .... 'న్యాయమైన పని దినా నికి న్యాయమైన జీతం' అనే మిత వాద నినాదం స్థానే, వారు, తమ పతాకం మీద 'జీతాల పద్ధతే రద్దు' అనే విప్లవకర నినా దాన్ని చిత్రించుకోవాలి! ...... ట్రేడ్ యూని యన్లు, పెట్టుబడిదారుల దాడుల్ని ప్రతిఘ టించే కేంద్రాలుగా పనిచేస్తాయి. అవి, తమ శక్తిని సరిగా వినియోగించకపోతే, కొంత వరకూ పరాజయం పొందుతాయి. నేటి ఆర్థిక వ్యవస్థ యొక్క దుష్ఫలితాలకు వ్యతిరేకంగా గెరిల్లా పోరాటాలు సాగిం చడంతోనే అవి సంతృప్తి చెందితేనూ; ఆ పోరాటాలను నిర్వహిస్తూనే మొత్తం వ్యవ స్థను మార్చేందుకు కూడా పోరాడక పోతేనూ; తమ అంతిమ విముక్తిని సాధిం చేందుకై, అంటే ఉత్తరోత్తరా 'జీతాల వ్యవ స్థనే కూల దోసేందుకై' తమ సంఘటిత శక్తిని ఉపయోగించక పోతేనూ - ట్రేడ్ యూనియన్లు, సాధారణంగా పరాజయం పొందుతాయి." **["జీతాలూ, ధరా, లాభం"]**

“ పెట్టుబడిదారీ సమాజం నుంచి అప్పు డప్పుడే బయటపడిన ‘కమ్యూనిస్టు సమాజ ప్రథమ దశ’లో, ఈ లోపాలు అని వార్యం. ‘హక్కు’ అనేది, సమాజ ఆర్థిక వ్యవస్థనూ, అందు మూలంగా నిర్ణయ మయ్యే సాంస్కృతిక అభివృద్ధినీ, తలదన్ని మీరిపో జాలదు. వ్యక్తులు, ‘శ్రమ విభ జన’కు బానిసలై ఎటువంటి పరాధీన స్తితిలో వున్నారో ఆ స్తితి అదృశ్య మవ డంతో పాటుగా, శారీరక, మేధా శ్రమల మధ్య గల వైరుధ్యం కూడా అదృశ్యమై, ‘శ్రమ’ అనేది వట్టి బ్రతుకుదెరువు గానే గాక, ప్రధాన జీవితావసరంగా పరిణ మించి; సర్వతోముఖమైన వ్యక్తి అభి వృద్ధికి తోడుగా, ఉత్పత్తి శక్తులు కూడా పెంపొంది; సహకారాత్మక సంపద సెల యేళ్ళన్నీ మరింత నిండుగా మెండుగా ప్రవహించగల కమ్యూనిస్టు సమాజ ఉన్నత దశలో మాత్రమే, అప్పుడు మాత్రమే, బూర్జువా హక్కుకి గల సంకు చిత దిజ్మండలాన్ని పూర్తిగా దాటి, ‘ఎవ రెవరి శక్తుల్ని బట్టి వారి నుంచీ, ఎవరెవరి అవసరాల్ని బట్టి వారికీ’ అనే మాటలను, సమాజం, తన మహాధ్వజం మీద లిఖించుకోగలదు.”

**[** “ గోథా కార్యక్రమంపై విమర్శ” **]**

మార్క్సు మాటల్లో, ‘గెరిల్లా పోరాటాలు’ అనే మాటల్ని,
‘ చాటు మాటు పోరాటాలు; తాత్కాలిక, చిన్న స్థాయి పోరాటాలు’
అనే అర్థంతో తీసుకోవాలి.
కార్మిక వర్గం సాధించవలసింది ఏమిటో, మార్క్సు మాటల్లో,
చాలా క్లుప్తం గానూ, స్పష్టంగానూ వుంది.

మానవులకు మధ్య శ్రమ సంబంధాలు వైరుధ్యాలు లేని విధంగా వుండడానికి ఎలా మారాలంటే, “ ఎవరెవరి శక్తుల్ని బట్టి వారి నుంచి, ఎవరెవరి అవసరాల్ని బట్టి వారికి!” - ఇదే, మానవ సంబంధాల్లో వైరు ధ్యాలు లేని అత్యున్నత స్థాయి!

ఈ స్థాయి ఏర్పడాలంటే, అది ఎలా జరగాలి?

శ్రామిక జనం, యజమానుల పని స్తలాల్లో జీతాల పెంపు కోసమూ, పని పరి స్తితుల్లో కొన్ని సదుపాయాల కోసమూ, అటువంటి వాటి కోసం రోజువారీగా పోరాటాలు చేస్తూనే, అసలు శ్రమ దోపిడీ సంబంధాల నించే బైటపడే సిద్ధాంత జ్ఞానంతో, ఆ ప్రయత్నాలతో కూడా వుండాలి. శ్రమ దోపిడీని తీసివేసే సిద్ధాం తాన్ని నేర్చుకోవాలి.

ఆ ప్రయత్నాలు లేకపోతే, జీతాల బానిస సంబంధాలే శాశ్వతంగా వుండి పోతాయి.

జీతాల విధానంలో వున్న బానిసత్వం, శ్రామిక జనాభాకి అర్థం కావాలి. అసలు యజమానులు ఎవరు? ఇతరులకు ఉద్యో గాలు ఇచ్చే ఆధిక్యత వాళ్ళకు ఎలా వచ్చింది? ఉత్పత్తి సాధనాలన్నీ వాళ్ళ దగ్గిర ఎందుకు వున్నాయి? “ఉద్యోగం ఇయ్యి” అని ఇంకో మనిషిని యాచించే పరిస్తితి శ్రామికులకు ఎందుకు వచ్చింది? - ఈ విషయాలు అర్థమైతే, యజమానులం దరూ శ్రామికులతో సమానులుగా మారా

లనేది అర్థమవుతుంది. 'జీతాల పద్ధతే రద్దు' అనేది, ఎంత విప్లవకరమైన మార్పో అర్థమవుతుంది.

అలాంటి మార్పు జరగాలంటే, "శారీరక, మేధా శ్రమల మధ్య వైరుధ్యం కూడా అదృశ్య'' మవ్వాలని చెపుతున్నాడు మార్క్సు. ఒక మనిషి ఎప్పుడూ పాకీ పని చేస్తూ, ఇంకో మనిషి ఎప్పుడూ చదువు చెప్పే పని చేస్తూ వుంటే, ఆ ఇద్దరి జీవన పరిస్థితులూ సమానం ఎలా అవుతాయి? అందుకే, దోపిడీ సమాజాలలో సాగే శ్రమ విభజన కూడా మారాలి.

శ్రమ చెయ్యడం మానవ ధర్మం. మానవ బాధ్యత. శ్రమ చెయ్యని మనిషి, కూడా జీవించగలుగుతున్నాడంటే, ఇతరుల శ్రమని దోచుకుంటూ జీవిస్తున్నాడని అర్థం. మార్క్సు చెప్పిన ఆ మాటల్లో ఈ విషయాలన్నీ వున్నాయి.

**మార్క్సు నించి ఇంకో రెండు మాటలు:**

> "... ఉత్పత్తి సంబంధాల మొత్తమే సమాజపు ఆర్థిక నిర్మాణ చట్రం. అదే, సమాజపు నిజమైన పునాది. ఆ ఆర్థిక పునాది మీదనే చట్టబద్ధ, రాజకీయ, ఉపరి నిర్మాణం లేస్తుంది.''
>
> ఇది, మార్క్సు సిద్ధాంతానికంతటికీ వెన్నెముక. ఇది, ఈ తత్వ శాస్త్రం.

మనుషులు తాము జీవిస్తూ వున్న సమాజాన్ని అర్థం చేసుకోవాలంటే, ఆ సమాజానికి వున్న 'పునాది'ని అర్థం చేసుకోవాలి. మనుషులు జీవించడానికి ఉత్పత్తులు కావాలి. వాటి కోసం శ్రమలు జరగాలి. ఆ ఉత్పత్తుల్ని తయారుచేసే శ్రమ సంబంధాలే, సమాజానికి పునాదిగా వుంటాయి. ఉత్పత్తి సంబంధాలు అంటే, శ్రమ సంబంధాలే. ఏ మాట అయినా ఒకటే.

ఉత్పత్తి సంబంధాలు, ఏ రకంగా, ఏ స్వభావంతో వుంటాయో, ఆ సంబంధాలకు తగినట్టుగానే, ఆ సమాజపు రాజ్యాంగమూ, దాని చట్టాలూ, దాని విద్యలూ, దాని కళలూ, దాని సంస్కృతీ, అన్నీ వుంటాయి.

బానిస సమాజంలో చట్టాలు ఎలా వుంటాయి? 'బానిసలు, యజమాని ఆస్తి' అని చెప్పే రకంగా వుంటాయి. అక్కడి విద్య, ఆ సంబంధాలనే బోధిస్తుంది. అక్కడి కథలూ, పాటలూ, నాట్యాలూ వంటి కళలన్నీ, ఆ సంబంధాలనే సమర్థించే విధంగా ఏర్పడతాయి.

అలాగే, పెట్టుబడిదారీ సమాజాన్ని తీసుకుంటే, ఇక్కడి చట్టాలు ఎలా వుంటాయి? కార్మికులు, పెట్టుబడిదారుల దగ్గిర ఉద్యోగాలు చేసి, జీతాలు తీసుకుని కొంపలకు పోవాలనీ; పెట్టుబడిదారులు లాభాలు సంపాదించుకుంటూ భవనాల్లో నివసించాలనీ, చెపుతాయి, ఇక్కడి చట్టాలు.

సమాజంలో వున్న ఉత్పత్తి సంబంధాలు, యజమానీ శ్రామిక సంబంధాలా, సమానత్వ సంబంధాలా? - ఇదీ, సమాజ పునాదికి వున్న స్వభావాన్ని తెలిపే ప్రశ్న. ఈ స్వభావాన్ని బట్టే ఇతర విషయాలన్నీ వుంటాయి.

మార్క్సు చెప్పిన ఆ నాలుగు మాటల్లో, ఈ విషయాలన్నీ వున్నాయి.

ఇక్కడే ఇంకో మాట చెప్పుకోవాలి.

పిల్లల కోసం రాసిన ఈ పుస్తకం,


మార్క్సు 'కాపిటల్'కి పూర్తిగా ప్రత్యామ్నాయం (బదులు) కాదు. ఈ పుస్తకంలో పాఠాలు, ప్రారంభ పాఠాలు మాత్రమే. ఇవి చదివితే, 'కాపిటల్'లో వున్న విషయాలన్నీ నేర్చుకున్నట్టు కాదు.

కాబట్టి, ఈ పిల్లలు గానీ, ఈ పెద్దలు గానీ, ఈ పుస్తకంతోనే సరిపెట్టుకోకూడదు. 'కాపిటల్' కూడా చదవాలి. 'కాపిటల్ పరిచయం' అయినా చదవాలి. లేకపోతే, 'మార్క్సిజం' అంటే ఏమిటో, శ్రమ దోపిడీ నించి విముక్తి చెందడం ఎలాగో, సరిగా తెలుసుకోలేరు.

మార్క్సు, 'కాపిటల్'ని, జర్మన్ భాషలోనే రాశాడు. అదే, ఇతర భాషల్లోకి వచ్చింది. ఇంగ్లీషు కాపిటల్‌కి, తెలుగు అనువాదాలు కూడా వున్నాయి.




జర్మన్ కాపిటల్‌కి ఇది ముఖ చిత్రం




'కాపిటల్ పరిచయం' ముఖ చిత్రం

ఈ **"పిల్లల కోసం...."** పుస్తకాన్ని ఒక సారి చదివిన పిల్లలు, ఎప్పుడూ పిల్లల్లాగే వుండరు. వాళ్ళు ఇంకా పెద్ద వాళ్ళయ్యాక, 'శ్రమ దోపిడీ' గురించీ, దాన్ని తీసివేసే మార్గాల గురించీ, నేర్చుకుంటూ వుండాలి. ఈ పిల్లల్లో అనేక మంది, కార్మిక వర్గంలోకి చేరతారు.

కార్మిక వర్గం, తమ విముక్తి కోసం, ఐకమత్యంతో పోరాడడానికి అవసరమైన సంఘం, 'కమ్యూనిస్టు పార్టీ'. కార్మిక వర్గం, తన విప్లవం ద్వారా రాజ్యాధికారాన్ని తీసుకునే సమయానికి సమాజం ఇంకా దోపిడీ సమాజంగానే వుంటుంది. భూస్వాములూ, పెట్టుబడిదారులూ, ఇంకా శ్రమ ఎరగని సుకుమారులుగానే వుంటారు. అలాంటి సమాజం నించి శ్రమ దోపిడీని తీసివేసే మార్పులు ఆ మొదటి రోజు నించే ప్రారంభం కావాలి. ఆ సిద్ధాంత జ్ఞానం అంతా, కార్మిక జనాభాకి అప్పటికే వుండాలి. ఆ సిద్ధాంతాన్ని నేర్చుకోవడం అప్పుడు మొదలు పెట్టడం కాదు.

కార్మిక వర్గం పెట్టుకున్న పార్టీలో (కమ్యూనిస్టు పార్టీలో) సభ్యులు, భావాల విషయంలో రక రకాల స్థాయిల్లో వుంటారు. ఆ సభ్యుల్లో, శ్రమ దోపిడీ మీద ఆగ్రహంతో విప్లవకరంగా ఆలోచించే వాళ్ళూ వుంటారు; అంత సరియైన మార్పుల్ని ఇష్టపడని వాళ్ళూ వుంటారు. అంటే, ఆ సభ్యుల్లోనే, 'విప్లవ పంథా' వుంటుంది; 'బూర్జువా పంథా' కూడా వుంటుంది. "కార్మికుల్లో బూర్జువా పంథా ఏమిటి? అది ఎందుకు వుంటుంది?" అని ఆశ్చర్యపోకూడదు. కార్మికుల సిద్ధాంత జ్ఞానం అంత అర కొరగా వుండవచ్చు. లేదా, రేపు పాత శ్రమ విభజనలో మార్పులు జరగాలి కదా? మేధా శ్రమల వాళ్ళు, కొన్ని శారీరక శ్రమ కూడా డ్యూటీల ప్రకారం చెయ్యాలి కదా? అది నచ్చని మేధా శ్రామికులు అనేక మంది వుంటారు. వాళ్ళకి, తమ మీద యజమాని తనాలు లేకపోవడం నచ్చుతుంది గానీ, తాము, శారీరక శ్రమల కార్మికుల మీద యజమానులుగా లేకపోవడం నచ్చదు. తాము

కూడా శారీరక శ్రమలు చెయ్యడం నచ్చదు. తర తరాల నించీ శారీరక శ్రమలకే అంకితమై వుండిపోయిన శ్రామికుల విముక్తి గురించి, మేధా శ్రమల వారికి పట్టదు. సమానత్వానికి జరగవలసిన మార్పుల్లో, తమకు అనుకూలమైనవే వారికి నచ్చుతాయి గానీ, మిగతావి నచ్చవు. స్త్రీల విముక్తికి జరగవలసిన మార్పులు పురుషులకు నచ్చవు. ఈ రకంగా, శ్రామిక జనాభాలో కూడా అనేక వైరుధ్యాలు వున్నాయి. ఇవన్నీ సమానత్వం వేపు సాగనివ్వకుండా అడ్డు పడుతూ వుంటాయి. కాబట్టి, 'సమానత్వం' అంటే, ఎన్ని రకాల వైరుధ్యాలు నశించాలో, అది ఎంత న్యాయమో, రేపు చేసుకోవలిసిన మార్పులు ఏమిటో, ఆ సిద్ధాంతం, ఈ నాటి నించీ శ్రామిక జనాభాకి తెలుస్తూ, దాని మీద చర్చలు జరుగుతూ వుండాలి.

కార్మిక వర్గ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీలో, బూర్జువా భావాలు గల వాళ్ళు చేరితే, ఇక అది కొంత కాలానికి బూర్జువా పార్టీగానే మారి తీరుతుంది.

అందుకే, ఈ నాటి నించీ కార్మిక జనాభాకి, మార్క్సిజం అంటే ఏమిటో ఎంతో క్షుణ్ణంగా తెలిసి వుండాలి.

"కార్మికులందరికీ యజమానులు, జీతాలు ఇచ్చేస్తారుగా? ఇంకా శ్రమ దోపిడీ ఏమిటి?'' అంటారు యజమానులు. దానికి జవాబు, ప్రతి కార్మికుడికీ తెలిసి వుండాలి.

పెద్ద పెద్ద ప్రొఫెసర్లకే, శ్రమ దోపిడీ గురించి ఏ మాత్రమూ తెలీదు. తెలుసుకోవలిసింది ఏదో వుందని కూడా వాళ్ళు అనుకోరు.

ఒక డాక్టర్‌కి గానీ, ఒక టీచర్‌కి గానీ, తను కూడా కార్మికుడిగా వున్నాడో లేదో తెలీదు.

ఇళ్ళల్లో పనిచేసే వాళ్ళందరూ కార్మికులే అని, ఏ ఇంటి వాళ్ళకీ తెలీదు.

కార్మిక జనాభా జీవితాంతమూ అనేక సమస్యల్లోనే వుంటారు. దోపిడీ దారులు కూడా ఇంకో రకం సమస్యల్లో వుంటారు. అయినా, ఎవ్వరికీ ఆ సమస్యల కారణాలూ, పరిష్కారాలూ పట్టవు.

కార్మిక జనాభా, తమ బాధల్నీ సమస్యల్నీ పరిష్కరించుకునే పని ఎవరికి వారు వంటరిగా చేసుకోలేరు. ఆ సమస్యలే అందరికీ సంబంధించిన సమిష్టి సమస్యలు. వాటి కోసం, సమిష్టి పోరాటాల ద్వారానే చేసుకోవాలి. దానికి శ్రమ దోపిడీ నించి విముక్తి చెయ్యగల సిద్ధాంతం అవసరం. దాన్ని బోధించిన మార్క్సిజం అవసరం. ఆ సిద్ధాంతమూ, దాన్ని ఆచరణలోకి తీసుకు రావలసిన సంఘమూ - ఈ 2 విషయాలూ, శ్రమ దోపిడీ నించి విముక్తి చెందడానికి అత్యవసరం.

సంఘం, సరియైన సిద్ధాంత జ్ఞానంతో నడిచినప్పుడు, అది కార్మిక జనాభాని, అనేక తరాల పాత, తప్పుడు భావాల నించి, తప్పుడు ప్రవర్తనల నించి, తప్పుడు సంస్కృతుల నించి, విముక్తం చేస్తుంది; నిర్మలం చేస్తుంది.

ఇదంతా శ్రమ దోపిడీని తీసివేసే క్రమం!

కార్మిక వర్గం, ఏం సాధించాలి? - తన విముక్తిని సాధించాలి.

అది, దోపిడీ వర్గానికి కూడా, దోపిడీ నించి విముక్తి అవుతుంది! ★

# 95. భ్రమల్ని వాస్తవాలు ఓడించి తీరుతాయి!

ఇన్ని పాఠాలు చూశాం కదా? అయినా, పెట్టుబడిదారీ విధానం గురించి అసలేం చూశాం? - అనిపిస్తోంది. దాన్ని గురించి అసలైన విషయం ఏదో చెప్పుకో లేదు - అనిపిస్తోంది.

'సమాజం' అన్నప్పుడు, అది ఏ దేశం అయినా, అక్కడ కోట్ల మంది మనుషులు ఉంటారు కదా? వాళ్ళు ఎలా జీవించాలి? సమాజంలో వున్న మనుషులందరూ సుఖంగా జీవించే ఏర్పాట్లు, ఆ సమాజంలోనే ఉండాలి కదా? కానీ, అలాంటి ఏర్పాట్లు, ఏ దోపిడీ సమాజంలోనూ ఉండవు, నిజమే; కానీ, పెట్టుబడిదారీ సమాజంలో, ఆ పరిస్తితి మరీ వికృత స్థాయికి చేరుతుంది.

పెట్టుబడిదారులందరూ, ప్రైవేటు వ్యాపారస్తులు. వేల సంవత్సరాల నించీ శ్రమల వల్ల తయారై, పోగుపడుతూ వున్న ఉత్పత్తి సాధనాలన్నీ, ఆ వ్యాపారస్తుల దగ్గిరే, వాళ్ళ స్వంత ఆస్తులుగా ఉంటాయి. ఆ ఉత్పత్తి సాధనాల్ని నిజంగా తయారు చేసిన జనం, అవి లేక, పెట్టుబడిదారుల దగ్గిరికి పోయి పనులు ఇమ్మని అడగాలి. వాళ్ళు ఇస్తే చెయ్యాలి, లేకపోతే ఊరుకోవాలి. ఆ ఇచ్చే పనులు, ఎంత తప్పుడు పనులు అయినా, ఎంత కుళ్ళు పనులు అయినా, అవే నోరెత్తకుండా చెయ్యాలి. సారాలు చెయ్యమంటే చెయ్యాలి, కత్తులు చెయ్యమంటే చెయ్యాలి, బాంబులు చెయ్యమంటే చెయ్యాలి, కల్తీలు చెయ్యమంటే చెయ్యాలి, యుద్ధాలు చెయ్యమంటే చెయ్యాలి. పత్రిక లన్నిటినీ బూతు బొమ్మలతో నింపెయ్యమంటే, అదే చెయ్యాలి. పనులు చేసే వాళ్ళ ఇష్టాయిష్టాలతో, వాళ్ళ అభిప్రాయాలతో, అక్కడ సంబంధం ఉండదు.

పనులు చేసే వాళ్ళు అంత నోరెత్తకుండా చెయ్యడానికి సిద్ధమై వున్నా, అడిగిన వాళ్ళందరికీ పనులు ఇవ్వవలసిన బాధ్యత పెట్టుబడిదారులకు ఉండదు. తమకు కావలసినంత మందికి మాత్రమే వాళ్ళు పనులు ఇస్తారు; వాళ్ళకి అవసరాలు తగ్గినప్పుడు, పనుల్లో వున్న వాళ్ళని కూడా తీసేస్తారు! అది వాళ్ళ హక్కు! అందరికీ పనులు చూపించవలసిన బాధ్యత, ప్రైవేటు వ్యాపారస్తులది కాదు. ఆ ప్రభుత్వానిదీ కాదు, ఆ సమాజానిదీ కాదు. ప్రజలు, ఎవళ్ళ బతుకు వాళ్ళే బతకాలి. "ఎలా బతకాలి?" అనే ప్రశ్న వెయ్యొద్దు, అంతే!

ప్రభుత్వం, ప్రజల్ని కన్న బిడ్డల్లా పాలిస్తుందనీ, ఆ పాలించే పని శాసన సభ్యులూ మంత్రులూ చేస్తారనీ, ప్రజలందరూ అనుకుంటారు. కానీ, నిజానికి పరిపాలన చేసేది, ప్రభుత్వంలో వున్న మనుషులెవరూ కాదు, పాలించేది యజమానుల ఆస్తే. పెట్టుబడిదారీ సమాజంలో అయితే, పరిపాలన చేసేది - పెట్టుబడే! ఏ దేశంలో అయినా, గవర్నర్లూ, ప్రెసిడెంట్లూ, ప్రధాన మంత్రులూ,

ముఖ్య మంత్రులూ అందరూ, పెట్టుబడి చెప్పినట్టు ( పెట్టుబడిదారులు చెప్పి నట్టు ) వినాల్సిందే, నడవాల్సిందే! పెట్టు బడి ప్రయోజనాల్ని నిలబెట్టకపోతే, ప్రెసి డెంట్లూ, గ్రసిడెంట్లూ కూడా ఆ పదవుల్లో ఉండలేరు. అసలు, వాళ్ళు కూడా పెద్ద పెద్ద ఆస్తిపరులే! వాళ్ళ ప్రయోజనాలు వాళ్ళకి తెలుసు.

అసలు, ఒక మనిషి, తనకు శ్రమ చేసే అవకాశం ఇవ్వమని ఇంకో మనిషిని యాచించడం ఏమిటి? ఇతరులకు పనులు ఇచ్చే, పనులు ఇవ్వని, పనుల్లో నించి తీసివేసే అధికారాలు, ఆ ఇంకో మనిషికి వుండడం ఏమిటి? ఆ మనిషికి ఆ అధికారాలు ఎలా వచ్చాయి? - ఈ ప్రశ్నలు, శ్రామికుల తలల్లో ఇంకా ఈ నాటికీ పుట్టలేదు.

ఒక నాటి ఆటవిక సమాజం, ఈ నాటికి ఈ దశకు చేరి వుంది. ఈ సమా జంలో, ప్రభుత్వ ప్రెసిడెంటు స్థానంలోకో, ప్రధాన మంత్రి స్థానంలోకో, ఒక అగ్ర కులం మనిషి వస్తే ఏం చేస్తాడో, ఒక చిన్న కులం మనిషి వచ్చినా, ఒక నీగ్రో జాతి మనిషి వచ్చినా, ఏ జాతి మనిషి వచ్చినా, అదే చేస్తున్నారు. ఎందుకంటే, వాళ్ళు శ్రమ దోపిడీకి వ్యతిరేకులు కారు కాబట్టి. వాళ్ళు కూడా పెట్టుబడిదారీ విధానాన్ని శాశ్వితం చెయ్యడానికి కంకణాలు కట్టు కున్న వాళ్ళు కాబట్టి.

ఈ దేశంలోనే, ఒక దళిత స్త్రీ ముఖ్య మంత్రి అయ్యి సమాజానికి ఇచ్చిన బహుమతి, వీధి వీధినా తన విగ్రహాల్ని దర్శించుకోమనడం! తన విగ్రహాల కోసం ప్రభుత్వాదాయాన్నే ఖర్చుపెట్టి! సమస్యల బాధలతో తలకిందులవుతోన్న ప్రజలు, ముఖ్య మంత్రిణి విగ్రహాల ముందు మోకరిల్లి, సేద తీరాలి!

ఆ దళిత పాలకురాలి ప్రవర్తన మీద, దళిత మేధావులకు కించిత్తయినా ఆగ్రహం లేదు. తక్షణం ఆమె నించి బైట పడి, ఆ పార్టీని ఖాళీ చేసే ఆలోచనే వారికి లేదు. ఎందుకంటే, ఆ మేధావుల ఆశయం కూడా, పెట్టుబడిదారులు గానూ, మంత్రులు గానూ, ప్రభుత్వాదా యాన్ని కొల్లగొట్టే నేర్పరులు గానూ, ఎదగాలనేదే!

కాబట్టి, సమాజం గురించి నేర్చుకో వలసిన అసలు విషయం ఏమిటంటే - పరిపాలకులు పెద్ద కులాలా, చిన్న కులాలా; తెల్ల వారా, నల్ల వారా - అనేది కాదు. ఆ పరిపాలన, శ్రమ దోపిడీకి అను కూలమా, వ్యతిరేకమా - అనేది అసలు విషయం. పరిపాలన చేపట్టినవారు, శ్రమ దోపిడీ గురించి ఏం చెయ్యబోతున్నా రనేదే అసలు విషయం.

శ్రమ దోపిడీ అనేది ఈ నాడు, పెట్టు బడిదారీ విధానం రూపంలో వుంది. అందుకే దాని మీద కూడా పోరాటం ఉండాలి.

ఈ పెట్టుబడిదారీ విధానం, తన ప్రారంభ కాలంలో, శ్రామిక వర్గం కోసం, కొన్ని అభివృద్ధికర అంశాల్ని ప్రవేశ పెట్టింది. మానవ చరిత్రలో అది ఒక దశ. ఆ దశ ప్రత్యేకత ముగిసిపోయింది.

పెట్టుబడిదారీ విధానం ఈ నాడు, కోట్ల కోట్ల ప్రజలకు తిండి దొరకని దశని తెచ్చిపెట్టింది. రాజుల, చక్రవర్తుల కాలాల నించీ, ఈ బూర్జువా రాజుల పరి పాలనలు కూడా ప్రజలకు కనీసం తిండి

అయినా ఇవ్వలేవు. ప్రపంచం నిండా ఈ నాడు బీదరికం పెరిగిపోయింది. ఈ విధానంలో ఇప్పుడు అన్నం దొరకక పోవడమే కాదు, గడ్డి అయినా దొరకని దుస్తితికి జనం చేరారు. గడ్డి మొలిచే భూమి అంతా సిమ్మెంటు రాసులతో కప్పడి పోతోంది. గ్రామ గ్రామానా వ్యవసాయం మాయమవుతోంది. ఇంకో పదేళ్ళ కాలంలో పుట్టుకురాబోయే వికృతాలేమిటో తెలుసుకోవడానికే శ్రామికులు తమ ఊహలకు పదును పెట్టుకోవాలి. అణు యుద్ధాల కోసం ఎదురు చూడాలి.

కాబట్టి, పెట్టుబడిదారీ విధానం ఇక ఈ నాడు అభివృద్ధికరమైనది కాదు. ఇది ఇక కాల గర్భంలో కలిసిపోవాలి.

పెట్టుబడిదారీ విధానం ఇంకా కొన సాగితే, అది శ్రామిక వర్గానికి ఘోరమైన హాని. శ్రామిక వర్గానికే కాదు, మొత్తం మానవ సమాజానికే, భూ మండలానికే, సమస్త ప్రకృతికే మహా విధ్వంసం!

శ్రమ దోపిడీ ఎప్పటిలాగే అల రారుతూ వుండగా, అదే స్వభావం గల పరిపాలనని సాగించే ఒక దళిత వ్యక్తో, ఒక నీగ్రో వ్యక్తో, అందలం ఎక్కితే, శ్రామికుల జీవితాల్లో వెన్నెల విరుస్తుందని భ్రమల్లో తేలితే ప్రయోజనం ఉండదు.

భ్రమల్ని, వాస్తవాలు, ఓడించి తీరుతాయి!

★

# చివరి మాట

## పిల్లలూ!

చదివేశారా చివరి దాకా? అన్ని పాఠాలూ చదివారా?

ప్రశ్నలకు జవాబులు చెప్పుకోగలిగారా?

ఒక్క సారి చదివారు, అంతే కదా? అది చాలదు. మళ్ళీ మొదటి పాఠం దగ్గిరికి వెళ్ళండి. మళ్ళీ చదివితే, అప్పుడు ఎంత తేలిగ్గా వుంటుందో చూడండి!

ఈ పుస్తకం చదవడం అంటే, మీరు మార్క్సిజం నేర్చుకోవడం మొదలు పెట్టారన్నమాట!

మీ రందరూ ఇప్పుడు పిల్లలే గానీ, రేపటికి పెద్ద వాళ్ళే. రేపటికి మీలో చాలా మంది కార్మికులు అవుతారు. రక రకాల ఉద్యోగాలు చేసే వాళ్ళవుతారు. మిగిలిన వాళ్ళల్లో కొందరు, రక రకాల పెట్టుబడి దారులవుతారు. రక రకాల బిజినెస్‌లు చేసే వాళ్ళవుతారు. ఇంకా మిగిలిన వాళ్ళు - నిరుద్యోగులవుతారు.

అంటే, రేపటికి మీలో కొందరు ఉద్యోగాలు అడిగే వాళ్ళయితే, కొందరు ఉద్యోగాలు ఇచ్చే వాళ్ళవుతారన్నమాట!

ఉద్యోగాలు ఇచ్చే వాళ్ళకి కూడా, సమాజంలో తాము ఏమిటో తెలుసుకోవడానికి, మార్క్సిజం అవసరం. వాళ్ళు ఎలాంటి తప్పులో కూరుకుని వుంటారో తెలుసుకోవడానికి మార్క్సిజం అవసరం.

మార్క్సిజం నేర్చుకోవడం అంటే, మనం జీవిస్తోన్న సమాజం ఎలా వుందో, అందులో మన సంబంధాలు ఎలా వున్నాయో, కళ్ళారా చూడడం!

ఇది తెలుసుకున్న తర్వాత, మన తప్పు భావాల్లోనూ, మన తప్పు ప్రవర్తనల్లోనూ, తల్లకిందులైపోయేటంత మార్పులు రావాలి. తక్షణం మారడం సాధ్యమైన విషయాల్లో, తక్షణం మారాలి. మార్పులు క్రమ క్రమంగా సాధ్యమయ్యే విషయాల్లో, క్రమ క్రమంగా మారాలి.

మనం భారత దేశంలో వున్నాం. ఈ దేశంలో '**కులాలు**' అనే దుర్మార్గపు విషయం ఒకటి వుంది. కొందరి పేర్లతో కులాల్ని మోసే గుర్తులు కూడా వుంటాయి. శాస్త్రీ, శర్మా, రెడ్డీ, చౌదరీ, ఆచారీ - లాంటి వికృత గుర్తులు!

**పిల్లలూ! కొన్ని సూచనలు చూడండి!**

**1.** మీ పేర్లలో కులాల గుర్తులు వుంటే, అది ఎంత తప్పో ఆలోచించండి! ఆ తప్పుకి బాధ్యులు మీరు కాదు. మీ పెద్ద వాళ్ళు మీకా పేర్లు పెట్టారు. కానీ, ఆలోచించడం మొదలైన తర్వాత, ఆ తప్పుని అలాగే సాగనిస్తే, అందులో మీకూ బాధ్యత వుంటుంది. "నాది ఫలానా అగ్ర కులం" అని చాటుకుంటూ తిరగడం ఎంత అన్యాయమో, సమానత్వానికి ఎంత వ్యతిరేకమో, ఆలోచించండి! న్యాయం వేపూ, సమానత్వం వేపూ మారడం, ఎంత మంచి సంగతో అర్థం చేసుకోండి!

**2.** ఈ పుస్తకం చదివే పిల్లల్లో, చిన్న కులాల పిల్లలు కూడా అనేక మంది వుంటారు. చిన్న కులాల జనాభా కూడా తమ కులాల పేర్లు మొయ్యడం, ఆత్మ గౌరవంగా ఇప్పుడు భావిస్తున్నారు. అది ఎంత ఆత్మ ద్రోహమో ఆలోచించలేక పోతున్నారు. చిన్న కులాలు వుంటేనే రిజర్వేషన్లు వుంటాయి - అనుకుంటున్నారు. రిజర్వేషన్లతో అవసరం లేని పరిస్తితులు ఎలా ఏర్పడాలో, కుల భేదాలే లేని పరిస్తితులు ఎలా ఏర్పడాలో, ఆ విషయాలు ఆలోచించడం లేదు. రిజర్వేషన్లు కావాలంటే చిన్న కులాలే వుండాలి కాబట్టి, చిన్న కులాల వారిగా వుండడమే మంచి సంగతి అయినట్టు, ఆ కులాల పేర్లనే మోసుకోవడం కనిపెట్టారు. కానీ, రిజర్వేషన్లు తీసుకోవడం అవసరమే; కానీ, కులాల పేర్లు ధరించడం, కుల నిర్మూలనకు వ్యతిరేక చర్య. చిన్న కులాల వారందరూ, ఆ కులాలకే అంకితమై వుండి పోవడానికి ఇష్టపడితే, పెద్ద కులాల వాళ్ళకి కావలసింది

అదే. దీని మీద ఇంత కన్నా ఇక్కడ అనవసరం. చిన్న కులాల పిల్లలు, ఈ విషయం ఆలోచించుకోవాలి.

**3.** ఎంత సేపూ క్లాసు పుస్తకాలే చదవడం కాదు. మార్కులూ, ర్యాంకులూ రంధే కాదు. అది బతుకు దెరువుకి అవసరమే కాబట్టి, దాని పని చేసుకుంటూనే, సాహిత్యంగా వుండే పుస్తకాలు రోజూ చదువుకోవాలి. ఇప్పటి దాకా పిల్లలందరూ ఇంకా రాజులూ - రాణులూ కధలే చదువు తున్నారు. వాటితో పాటు జమీందార్ల విలాసాల కధలు కూడా. ఇంకా వాటితో పాటు దేవుళ్ళూ, దెయ్యాలూ, మంత్రాలతో - తంత్రాలతో నిండి వుండే కధలూ! ఇంటా బైటా పెద్ద వాళ్ళు చెప్పే కధలు, పిల్లల్ని బాల్యం లోనే వృద్ధులుగా తయారుచేస్తాయి. ఆ చెప్పే వాళ్ళకి అవే తెలుసు. వాళ్ళకి, వెనకటి కాలపు బానిసల సంగతులేమీ తెలీవు. వాళ్ళకి తెలిసిన పిచ్చి నమ్మకాల కధలే వాళ్ళు చెపుతారు. వాటినీ చదవండి! కానీ, ప్రతీ చోటా ప్రశ్నించడం నేర్చుకోవాలి. తలకాయని ఉపయోగించడం నేర్చు కోవాలి.

**4.** " గుడికి వెళ్ళండి, కొబ్బరి కాయలు కొట్టండి, దేవుళ్ళకి దణ్ణాలు పెట్టి రండి; ఎక్కువ మార్కులు వస్తాయి" అని చెపుతారు పెద్ద వాళ్ళు. వెంటనే అటు బైల్దేరడం కాదు. " దేవుడికి కొబ్బరి కాయలెందుకు? ఎలా తింటాడు? అసలు దేవుణ్ణి మీరు చూశారా? ఎవరన్నా చూశారా? మాకు చూపిస్తారా? బోలెడు మంది జనాలకు కొంపలే లేవు. మనకే సుఖంగా తిరిగే ఇళ్ళు లేవు. ఆ రాతి బొమ్మలకి భవనాలెందుకు? ఆ గుళ్ళ కోసం స్తలాలు ఖర్చు పెట్టడం ఎందుకు?" అని చాలా ప్రశ్నలు అడగాలి. పెద్ద వాళ్ళు చెప్పే మాటల్లో నించి మీకు సరైన జవాబులు దొరకాలి. కానీ, వాళ్ళ ద్వారా అలాంటి జవాబులు ఎప్పటికీ రావు. గుళ్ళకి పోవడం టైము దండగ కాదూ? అది ఒక్కటే కాదు. ఎవరికీ ఏమీ తెలియని దేవుళ్ళ కోసం, లక్షల ఎకరాల స్తలాలూ, కోట్ల ఖరీదులతో గుళ్ళూ, నగలూ, పట్టు బట్టలూ, - ఇదంతా ఎంత అజ్ఞానం! ఇదంతా పెద్ద వ్యాపారం! పిల్లలు, ఇలాంటి అజ్ఞానంలో వుంటే, వాళ్ళకు వాళ్ళే హాని చేసుకున్నట్టు కాదూ? మీ కొబ్బరి కాయలతో ఇంట్లో కమ్మటి పచ్చళ్ళు చేసుకోండి. గుళ్ళ వెంట తిరిగే టైములన్నీ, రాళ్ళకి దణ్ణాలు పెట్టే టైములన్నీ, చదువుల మీదే పెడితే, మీ తెలివి ఎంతో పెరుగుతుంది.

**5.** దేన్ని అయినా చదివినప్పుడు, అది ఒప్పుగా వుందో, తప్పుగా వుందో తెలియాలంటే, దాని మీద ప్రశ్నలు వేసుకుంటూ తర్కించాలి. తర్కించడం అంటే, ప్రశ్నలు వస్తే, వాటికి జవాబులు కూడా తెలియాలి.

సరైన జవాబు దొరికితే, ప్రశ్నలు ఇక వుండవు. ఆగిపోతాయి. ప్రశ్నించడం లేకపోతే దేన్నీ నేర్చుకోవడం సాధ్యం కాదు. జంతువులు ఆలోచించవు కాబట్టి అవి ప్రశ్నించవు. మనుషుల పద్ధతి అది కాదు. పెద్ద వాళ్ళకి భయపడడమో, వాళ్ళు చెప్పేదంతా గుడ్డిగా నమ్మడమో, చెయ్యకూడదు.

**6.** మనుషుల విధి, 'శ్రమ చెయ్యడం' కదా? అది, ఇంటి పనుల్లో నించే ప్రారంభం కావాలి. పిల్లలు కూడా ఇంట్లో పనులు చెయ్యాలి కొన్ని. 'పెద్ద వాళ్ళకు సహాయం కోసం' అని కాదు. అది తమ బాధ్యత అని గ్రహించుకుని చెయ్యాలి.

**7.** మీరు ఏదైనా ఒక వస్తువుని కొంటారనుకోండీ. ఒక పెన్నో, పెన్సిలో, నోట్ పుస్తకమో, ఏదో. ఆ వస్తువుని చూసి, 'ఇది ఎంత బాగుందో' అనుకున్నప్పుడు, దానితో పాటే, 'దీన్ని ఏ కార్మికులు చేశారో! ఎలాంటి శ్రమలతో చేశారో!' అని కూడా అనుకోవాలి. ఏ వస్తువుని చూసినా, 'శ్రమ' విషయం గుర్తు చేసుకోవాలి. పల్లెటూళ్ళల్లో, మంచి కూరగాయలు కనపడ్డప్పుడు, "ఎంత బాగున్నాయో! వీటిని ఏ రైతు పండించాడో!" అంటారు. అలాగే, ఏ వస్తువుని చూసినా, దాన్ని తయారు చేసిన మనుషుల శ్రమల్ని గుర్తు చేసుకోవాలి.

**8.** సెలవల్లో, పిల్లలు, ఇతర ఊళ్ళు చూడ్డానికి పోతూవుంటారు కదా? అలా వెళ్ళినప్పుడు, ఇతర ప్రాంతాల్లో ఏం చూస్తారు? గుళ్ళూ గోపురాల చుట్టూ తిరుగుతారు. వాటిని ఏ రాజు కట్టించాడో చెప్పు కుంటారు. అక్కడ, సినిమా హాళ్ళకి పోతారు. జూ లకో, మ్యూజియమ్ లకో పోతారు. అంతే గానీ, ఉత్పత్తులు తయారయ్యే ఒక్క ఫ్యాక్టరీని కూడా చూడరు. ఈ సారి నించీ కార్మికులు పనిచేసే మిల్లులూ ఫ్యాక్టరీలూ కొన్ని చూడండి. సబ్బుల ఫ్యాక్టరీనో, ఆయిల్ ఫ్యాక్టరీనో, బిస్కట్ల ఫ్యాక్టరీనో, దేనికి అవకాశం దొరికితే అది చూడండి! మనం వాడుకునే ఉత్పత్తులన్నీ ఎలా తయారవుతూ వుంటాయో, ఎవరు చేస్తూ వుంటారో, చూడండి. అక్కడ కార్మికుల్ని చూసినప్పుడల్లా, ఆ ఫ్యాక్టరీ పెట్టుబడి దారుడు కూడా ఆ పని స్థలంలో ఉన్నాడో లేడో కూడా చూడండి! పని స్థలంలో అంటే, ఆ యంత్రాల దగ్గరే వున్నాడా అని చూడండి!

**9.** సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, కుప్ప తెప్పల సిద్ధాంతాలు కనపడతాయి. కొందరు 'అవినీతి పోవాలం'టారు, అది ఎందుకు వుందో, ఎలా పోతుందో చెప్పరు. కొందరు, 'పర్యావరణ శుద్ధి జరగా లం'టారు. ఆ శుద్ధి ఎందుకు పోతోందో, అది ఎలా వస్తుందో, చెప్పరు. కొందరు, 'మానవత్వం నిలబడాలం'టారు. దాన్ని ఎవరు నాశనం చేస్తున్నారో,

ఎందుకు నాశనం చేస్తున్నారో, చెప్పరు. అవన్నీ కూడా సమస్యలే. కానీ, సమస్యల మీద మాట్లాడే వాళ్ళు, వాటి కారణాల్ని చూడడానికి ఇష్టపడరు. కారణాల జోలికి పోతే, 'శ్రమ దోపిడీ'నీ, పెట్టుబడిదారీ విధానాన్నీ, తిరస్కరించవలసి వస్తుంది కదా? అది నచ్చదు, ఆ సంఘ సంస్కర్తలకి. వాళ్ళు, అదంతా తెలుసుకోవడానికి ఇష్టపడరు. ఆ రకం సిద్ధాంతాలన్నీ, జనం, మార్క్సిజం వేపు పోకుండా చూసేవే. కాబట్టి, ఎవరేది బోధిస్తోన్నా, దాన్ని వినాలి. కానీ అది శ్రమ దోపిడీ గురించి చెపుతోందో లేదో చూడాలి. దాన్ని ఎంత వరకూ తీసుకోవచ్చో అంత వరకే తీసుకోవాలి. దానికి, అంత విలువే ఇవ్వాలి.

**10.** మనం జీవిస్తూ వున్న సమాజంలో ఎన్నెన్నో చెడ్డ విషయాలు వున్నాయి. ఎన్నో కోట్ల జనాభాకి కడుపు నిండా తిండి లేని, ఇల్లూ వాకిలీ లేని పరిస్థితులు వున్నాయి. ఎటు చూస్తే అటు నేరాలు! ఎటు చూస్తే అటు కలహాలు! యుద్ధాలు ఎందుకు? ప్రతీ దేశంలోనూ లక్షల మంది జనం, సైనికులుగా యుద్ధాలు చేస్తూ చావడం ఎందుకు? దేని కోసం ఇదంతా? ఏ వర్గ ప్రయోజనాల కోసం? తమ ప్రయోజనాల కోసం యుద్ధాల్ని కూడా తెచ్చిపెట్టే వర్గం, ఎలాంటి వర్గం? - ఎన్ని విషయాలు వున్నాయో, ఆలోచించడానికీ, తెలుసుకోవడానికీ!

మీకు ఎలాంటి సమాజం కావాలి? బికారి తనాలు లేని, బిచ్చ మెత్తడాలు లేని, నేరాలు లేని, కలహాలు లేని, యుద్ధాలు లేని - అంత మంచి సమాజం కావాలా, అక్కర లేదా? మానవ సంబంధాల్నీ, మానవ సమాజాన్నీ తెలుసుకోవ డానికి, ఆర్థిక శాస్త్రం ఎంత అవసరమో ఇప్పటికి అర్థమైందా? వైద్య శాస్త్రమో, వృక్ష శాస్త్రమో తెలిసి, ఈ ఆర్థిక శాస్త్రం తెలియకపోతే, మనుషులు ఎలాంటి సంబంధాలతో వున్నారో తెలుస్తుందా?

ఈ పుస్తకం మళ్ళీ చదవండి! కొంచెం పెద్దయ్యాక, **'కాపిటల్ పరిచయం'** కూడా చదవండి! తర్వాత, మీ మార్గం మీరు ఎంచుకోండి, మీరు ఉద్యోగాలు చేసే వాళ్ళు అవుతారో, ఇచ్చే వాళ్ళు అవుతారో! యుద్ధాలు చేసే వాళ్ళు అవుతారో, చేయించే వాళ్ళు అవుతారో!

పిల్లలు కూడా తల్లిదండ్రుల వర్గమే. తల్లి దండ్రుల బోధనలే, పిల్లలకు ఎక్కుతాయి. అయినా - పిల్లలు, వాళ్ళ జ్ఞానంతో కూడా వాళ్ళు వుండాలి!

పిల్లలూ! ఎప్పుడూ 3 విషయాలు ఆలోచించండి!
(1) న్యాయం, (2) న్యాయం, (3) న్యాయం. ★

# ఈ పుస్తకం ధర గురించి

ఈ పాఠాల్లో, విలువా - ధరా - వర్తక కమిషన్ - లాంటి విషయాల గురించి చదివి వున్నారు కాబట్టి, ఇప్పుడు ఈ పుస్తకం ధర అర్థమవుతుంది.

ఈ పుస్తకం తయారవడానికి, దీన్ని రాసిన శ్రమ విలువ దగ్గిర్నించీ, తయారీ వరకూ జరిగిన శ్రమ లన్నీ కలిసే దీని విలువ అవుతుంది.

కంపోజింగూ, బొమ్మలూ, ఫిల్ములూ, పేపరూ, ప్రింటింగూ, టైటిల్ కవరూ, బైండింగూ - ఈ ఖర్చులన్నీ కలిసి, 1 లక్షా, 5 వేలు అయింది. ఇది, 1500 కాపీల కోసం అయిన ఖర్చు. ( ఏడాదిన్నర పాటు ఈ పుస్తకం రాసిన శ్రమ కోసం, కనీసం 10 వేలు కలిపితే, అది కూడా ఖర్చులోకి చేరి, ఖర్చు పెరుగుతుంది. కానీ, రాసిన విలువని నేను తీసుకోవడం లేదు కాబట్టి, ఆ ఖర్చుని కలపడం లేదు. ఆ ఖర్చుని కలపకపోయినా, ఆ శ్రమ కూడా జరిగింది కాబట్టి, పుస్తకానికి ఆ విలువ కూడా వుంటుందని అర్థం. అయినా, మొదట చూసిన లక్షా 5 వేలని మాత్రమే దృష్టిలో పెట్టుకోవాలి. )

1500 పుస్తకాల కోసం, లక్షా 5 వేలు ఖర్చు కాబట్టి,

ఒక్కొక్క పుస్తకానికీ, ఖర్చు =

$$\frac{1,05,000}{1500} = 70 \text{ రూ.లు.}$$

కాబట్టి, పుస్తకం ధర ని 70 గా పెట్టాలా?

'లాభం' కూడా శ్రమల విలువలో భాగమే. కాబట్టి, లాభం కోసం కొంత కలిపితే, ధర పెరుగుతుంది. కానీ, ఇక్కడ, లాభాన్ని కలిపే సంగతి వదిలేద్దాం. లాభాన్ని కలపకపోయినా, పుస్తకం తయారీలో, ఆ విలువ కూడా వుందని అర్థం.

లాభాన్ని వదిలేసినా, ' వర్తక కమిషన్ ' ని వదిలెయ్యడం సాధ్యం కాదు. పుస్తకాలు పాఠకులకు చేరాలంటే, వాటిని అమ్మే పని జరగాలి. దాని కోసం, కొంత ఖర్చు అవుతుంది. ఆ ఖర్చు కూడా ఆ సరుకు విలువలో నించే రావాలి. కాబట్టి, వర్తక కమిషన్ గా ఎంత ఇస్తామో, దాన్ని పుస్తకం ధరలోకి కలపక తప్పదు.

ప్రస్తుతం, నా పుస్తకాల మీద, సోల్-డిస్ట్రిబ్యూటర్‌కి కమిషన్‌గా ఇస్తున్నది 50%. కాబట్టి, పుస్తకం ధర ని, దాని తయారీ ఖర్చుకి రెట్టింపుగా పెట్టాలి. పుస్తకం తయారీ ఖర్చు 70. కమిషన్ ఇంకో 70. రెండూ కలిసి 140.

పుస్తకం ధర ని 140 గా పెడితే, అందులో నించి కమిషన్ కోసం 70 పోయి, మిగిలిన 70 వెనక్కి వస్తుంది. అంటే, తయారీ కోసం పెట్టిన

ఖర్చుని వెనక్కి తీసుకున్నట్టు అవుతుంది. లాభం వుండదు, నష్టం వుండదు.

కానీ, ఈ పుస్తకం ధర ఎంత? - 100 రూ.లు. అంటే, అర్థం ఏమిటి? ఈ ధరలో నించి వర్తక కమిషన్‌గా 50 పోయి, ఇంకో 50 మిగులుతుంది.

| | |
|---|---|
| కానీ, పుస్తకం కోసం ఖర్చు | - 70 |
| తిరిగి వచ్చింది | - 50 |
| నష్టం | - 20 |

ప్రతీ పుస్తకానికీ 20 నష్టం చొప్పున,

1500 పుస్తకాలకి నష్టం = 1500 × 20 = 30,000.

కనీసం 140 విలువ గల పుస్తకాన్ని 100 తో ఇవ్వడం అంటే, దాన్ని కొనే వ్యక్తికి 40 విలువని ఉచితంగా ఇస్తున్నట్టు అర్థం.

ధరని ఎందుకిలా నష్టంతో పెట్టాం? - ఎక్కువ ధరతో కొనడం కన్నా, తక్కువ ధరతో కొనడం, తేలిక. అసలు, ఈ రకం పుస్తకాల్ని చదవవలసిన వాళ్ళు ఎక్కువ డబ్బు వున్న వాళ్ళు కాదు. డబ్బు ఎక్కువగా లేని వాళ్ళే. పుస్తకాలు అలాంటి పాఠకులకు కొంచెం అందుబాటులో వుండాలి.

ఇదే పుస్తకం, రెండో ముద్రణకు వస్తే, అప్పుడు కంపోజింగ్ ఖర్చులూ, ఫిల్ము ఖర్చులూ వుండవు గానీ, ఇతర ఖర్చులన్నీ వుంటాయి. ఆ ఖర్చులు పెరుగుతాయి కూడా. అంటే, ఈ పుస్తకం రీ ప్రింటు అయినప్పుడల్లా, ప్రతీ సారీ 30 వేలు నష్టపోవలసి వస్తూవుంటుంది.

ఇలా జరిగేది, ఈ ఒక్క పుస్తకానికే కాదు, స్వీట్ హోమ్ ప్రచురణల్లో వున్న దాదాపు 45 పుస్తకాల్లో ప్రతీ ఒక్క పుస్తకానికీ కూడా. తొందరగా అమ్ముడయ్యే పుస్తకాల వల్ల, ఎక్కువ రీ ప్రింట్ల వల్ల, ఎక్కువ నష్టం, తక్కువగా అమ్ముడైతే తక్కువ నష్టం! అంతా తల్లకిందుల వ్యవహారం!

" మీకు ఎవరైనా సాయం చేస్తారా? లేకపోతే, ఈ నష్టాలెలా భరిస్తారు?" అని అడుగుతారు కొందరు.

మా ఇంట్లో, ముగ్గురు మనుషుల జీతాలు, ఉన్నత మేధా శ్రమల వాళ్ళ జీతాలు. ప్రొఫెసర్‌కి, నెలకి 90 వేల జీతం అవసరమా? కంప్యూటర్ కంపెనీలో పెట్టుబడిదారుడికి వచ్చేది వేల కోట్లు కాబట్టి, అక్కడి జీతం లక్ష దాటి వుంటుంది. ఈ జీతాలు ఇలా పెరగడానికి వేరే కారణాలు వుంటాయి. ఇవి దుర్మార్గపు జీతాలు. వీటిని ఖర్చుపెట్టే మార్గాలే లేవు మా దగ్గిర. ఆస్తులు కూడబెట్టే దృష్టి లేదు. ఇల్లు వుంది. పోషణ జరుగుతోంది, చాలు. పిల్లలు చదువుకుంటారు. ఉద్యోగాలతో బతకాలి, ఆస్తులతో కాదు. ఇంట్లో వెండి బంగారాలు వుండకూడదు. హఠాత్తుగా మందు లోకి, నల్ల పూసంత వెండో బంగారమో కావాలంటే, దొరకదు ఇక్కడ. విలాస యాత్రలూ, వినోద

ప్రయాణాలూ, లేవు. ఈ రోజుల్లో సినిమాలు రోతగా ఉంటున్నాయి కాబట్టి, ఆ ఖర్చు కూడా లేదు. బహుమతులు ఇవ్వడాలూ తీసుకోడాలూ లేవు. ఆఖరికి బట్టలు కూడా ఏడెనిమిది శాల్తీలకు మించి వుండవు, పిల్లలకు కూడా.

ఖర్చు అయ్యేది, తిండికీ, పుస్తకాలకీ, అవసరమైన చందాలకీ, సహాయాలకీ, వైద్యాలకీ, అంత తప్పనిసరి వాటికే. ఇంకా మిగిలే డబ్బుని ఏం చేస్తాం? డబ్బుని కూడబెడితే, అది 'పాపం' పెరిగినట్టు పెరుగుతుంది. దాన్ని ఏదో ఒక మంచి పనికి ఖర్చు పెట్టెయ్యాలి. అసలు, అవసరాన్ని మించినంత డబ్బు ఒక చోటకు చేరిందంటే, ఎక్కడెక్కడో అత్యవసరమైన చోట్ల నించి అది ఇటు వచ్చిందన్నమాట! ఇదంతా తెలిసిన తర్వాత కూడా ఇంకా డబ్బుని పెంచడమా? దాన్ని వదిలించుకునే ఒక మార్గం ఇది. నష్టాల్ని తెచ్చే పుస్తకాల మార్గం! అవకాశం వుంది కాబట్టి చెయ్యగలుగుతున్నాం. అవకాశం లేకపోతే ఎవరైనా ఎలా చెయ్యగలరు? కానీ, అవకాశాలు కూడా మన దృష్టిని బట్టి ఏర్పడతాయి. పట్టు చీరల పిచ్చీ, ఆభరణాల పిచ్చీ, అనవసరపు ఆడంబర వస్తువుల పిచ్చీ వంటివి లేకపోతే, జీతాల నించి కూడా డబ్బుని మిగల్చడం సాధ్యమవుతుంది. ఇది ఎన్నాళ్ళు నడిస్తే అన్నాళ్ళు నడుస్తుంది. బహుశా, మా వాళ్ళకి ఉద్యోగాలు పోయే వరకూ. ఇద్దరి ఉద్యోగాలైతే పోయేవి కావు. మూడోది పోతే పోవచ్చు.

పుస్తకం ధర సంగతి మళ్ళీ చూద్దాం. ఇక్కడ వర్తక కమిషన్ గురించి ఒక అద్భుతమైన ప్రశ్న రావాలి. వర్తక కమిషన్, సరుకు విలువలో భాగమే కదా? ఈ ఉదాహరణలో, ఒక పుస్తకంలో, 50 రూ.లు, వర్తక కమిషన్ కదా? ఈ 50 విలువ, ఈ పుస్తకం తయారీలోకి ఎవరి ద్వారా చేరింది? పేపరు విలువనీ, ప్రింటింగ్ విలువనీ, బైండింగ్ విలువనీ, అన్నిటినీ చెల్లించేశాం కదా? ఆ సరుకుల్ని అమ్మిన పెట్టుబడిదారులు, ఆ విలువల్లో నించే అదనపు విలువలు తీసుకుంటారు కదా? మరి, వర్తక కమిషన్‌గా వున్న 50 అదనపు విలువ ఎవరి శ్రమలది?

పుస్తకం ధరలో తయారీ ఖర్చుని 50 అనుకుంటే, ఆ ఖర్చు అంతా అదనపు విలువగా వుండదు. అందులో ఉత్పత్తి సాధనాల భాగం కూడా వుంటుంది. కానీ, వర్తక కమిషన్‌ని 50 అనుకుంటే, ఇది అంతా పూర్తిగా అదనపు విలువే. ఇంత అదనపు విలువ ఏ కార్మికుల నించి వచ్చింది? కంపోజింగ్ కార్మికుల నించా? ప్రింటింగ్ కార్మికుల నించా? బైండింగ్ కార్మికుల నించా?

అదనపు విలువ రావలసింది, సజీవ శ్రమలలో నించే. కమిషన్ కూడా, ఆ శ్రమలలో నించి వచ్చే భాగమే. అంటే, ఈ ఉదాహరణలో కమిషన్‌గా

వున్న 50 అదనపు విలువ కూడా, ఈ పుస్తకం కోసం రక రకాల శ్రమలు చేసిన శ్రామికులదే నన్నమాట! పుస్తకాన్ని రాసిన శ్రమ చేసిన మనిషి దగ్గిర్నించీ, చివరికి పుస్తకాన్ని బైండ్ చేసిన శ్రమ వరకూ చూడాలి. అన్ని స్తలాల్లో జరిగిన శ్రమల్లో నించి వచ్చిందే, ఈ 50 అదనపు విలువ. ఈ 50 అదనపు విలువ కూడా, పుస్తకం కోసం శ్రమలు చేసిన వారికి అందవలసిందే.

ఒక పుస్తకానికి సంబంధించిన ప్రింటింగు ఖర్చు కోసం, 10 రూపాయలు చెల్లించాలనుకుందాం. అందులో నించి కూడా ఆ పెట్టుబడిదారుడికి అదనపు విలువ వస్తుంది. కానీ, అక్కడ ఉత్పత్తి అయిన అదనపు విలువ అంతే కాదు. వర్తక కమిషన్‌గా వున్న 50 లో కూడా కొంత భాగం, ప్రింటింగ్ శ్రమలోది. అలాగే, కొంత భాగం, బైండింగ్ శ్రమలోది. కొంత భాగం, రచన చేసిన వ్యక్తి శ్రమ విలువలోది. ఈ రకంగా, అన్ని శ్రమల నించీ కొన్ని కొన్ని భాగాలు కలిసినదే వర్తక కమిషన్‌గా చేరుతుంది.

అంటే, ప్రింటింగు పని కోసం ఆ పెట్టుబడిదారుడికి అందిన డబ్బు, నిజంగా అందవలసిన దాని కన్నా తక్కువ అన్నమాట! అక్కడ అందని దాని వల్ల, పెట్టుబడిదారుడికి నష్టం కాదు; అక్కడి కార్మికులకు నష్టం. ఇతర శ్రమల విషయంలోనూ అంతే. ప్రతీ చోటా అలా జరగకపోతే, వర్తక కమిషన్ అనేది ఏర్పడడం సాధ్యం కాదు.

కమిషన్‌ని తీసుకునే వర్తకుడు, అది అంతా తాను ఒక్కడే తీసుకోడు. అతని దగ్గిర ఆ సరుకుని ఇతర వర్తకులు కొనేటప్పుడు, వాళ్ళకి కూడా ఆ సరుకుని కొంత కమిషన్‌తో ఇస్తాడు. ఆ రకంగా, ఆ 50% కమిషను, కొందరు వర్తకుల మధ్య పంపకాలవుతుంది. వాళ్ళు, ఆ కమిషన్‌లో నించే, వర్తకం ఖర్చుల్ని పెట్టి, చివరికి లాభాలు తీసుకుంటారు. ( వర్తక కమిషన్, ఎవరెవరి శ్రమల నించి వస్తుంది? - అనే ఈ విషయం, వెనకటి పాఠాల్లో ఇంత వివరంగా చూడలేదు. అందుకే ఇక్కడ చెప్పవలసి వచ్చింది. )

ఒక పాఠకుడు, పుస్తకాల షాపుకి వెళ్ళి పుస్తకం కొంటే, దాని తయారీ ధరతోనే అది వస్తుంది. అదే పుస్తకాన్ని పోస్టులో తెప్పించుకుంటే, అసలు ధరకి, ఆ రవాణా ధర కూడా కలుస్తుంది.

ప్రింటయిన పుస్తకాలు, అమ్మకాలు లేకుండానే లైబ్రరీలకూ, ప్రజా సంఘాలకూ అందితే చాలదా?

అదనపు విలువ అంటే, 'అదనపు ఉత్పత్తే' కదా? అమ్మకాలే లేకపోతే, కమిషన్‌గా పోయే ఉత్పత్తి అంతా, శ్రమలు చేసిన వారికే అందుతుంది. కమిషన్ల పేరుతో మొత్తం సమాజంలో ఎంత ఉత్పత్తి పోతోందో ఆలోచించండి!

అమ్మకాలు లేని, కమిషన్లు లేని ప్రపంచాన్ని ఊహించుదాం! ఊహించడం నేర్చుకుందాం! అప్పటి వరకూ ఇదంతా ఇంతే! ★

# పదాల పట్టిక (ఇండెక్స్)

## అ


అడ్వర్టయిజింగ్ శ్రమ 250
అదనపు ఉత్పత్తి 173
అదనపు విలువ 168, 173
అదనపు శ్రమ 120, 164, 173
అనుత్పాదక ఖర్చులు 169
అనుత్పాదక శ్రమలు 220, 223, 227, 229, 237
అప్పులు 128
అభివృద్ధి 141
అరిస్టాటిల్ 212


## ఆ


ఆడవాళ్ళు : వాళ్ళల్లో వర్గాలు 262
ఆదాయం 120
ఆస్తి 113, 115, 125


## ఇ


ఇంజనీర్లు 269
ఇంటి పనులు 262


## ఉ


ఉత్పత్తి క్రమం 154
ఉత్పత్తి శక్తి 269, 282
ఉత్పత్తి సాధనాలు 153, 183, 232
ఉత్పాదక లాభం 245
ఉత్పాదక శ్రమలు 220, 227, 242
ఉపయోగపు విలువ 41


## ఎ


ఎద్దులు : అవి పనిముట్లే 31


## క


కంప్యూటర్లు 281
కమ్యూనిజం 362
కాంట్రాక్టరు 254
కాయితం డబ్బు 85
కార్మిక వర్గం 339
కుటుంబ శ్రమలు 261
కులాలు 307
కొత్త శ్రమ 50
కౌలు 243
కౌలు రైతులు 144


## గ


గత శ్రమ 50
గాలి : అది వస్తువా? 10
గృహ శ్రామికులు 228


## జ


జంతువులు : అవి పనిముట్లా, పని చేస్తాయా? 93
జమీందారు 147
జీతం 179, 187, 217, 294


## ట


టీచరు 230


## డ


డబ్బు : అంటే ఏమిటి? 8, దాని పుట్టుక 69, దాంతో ఏం చేస్తారు? 72, దానికీ మామూలు వస్తువుకీ తేడా 73, అది ఎవరి కైనా ఎలా వస్తుంది? 74, దానికున్న వింత

లక్షణం? 75, అది మారకాలకు మధ్య వర్తా, సాధనమా? 80, విలువ రూపంగా డబ్బు 82, దాన్ని కూడబెట్టడం 91, రూపం లేని శ్రమగా డబ్బు 106, దానికున్న ప్రత్యేక లక్షణం 108, దాని గుణానికీ, పరిమాణానికీ వున్న వైరుధ్యం 109.

## త

తత్వ శాస్త్రం 37

## ద

దొంగతనం : అది శ్రమ దోపిడీయేనా? 122
దోపిడీ ప్రపంచం : అది మారుతుందా? 343
దోపిడీ సంబంధాలు : వాటి పునరుత్పత్తి 312

## ధ

ధర 158, 204

## న

నిర్జీవ శ్రమ 50
నిరుద్యోగం 287

## ప

పని 34
పని దినం 175
పని మనిషి 230
పనిముట్లు 13, 16, 48, 281
పన్నులు 168, 245
పరికరాలు 13
పరిశ్రమ 150
పర్యావరణం 216
పాత శ్రమ 50
పాలక వర్గ భావాలు 274
పెట్టుబడి 151, 154
పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు 315
పెట్టుబడిదారీ కౌలు రైతు 194
పెట్టుబడిదారుడు 150, 169, 299
పెట్టుబడిదారీ ధర 311
పెట్టుబడిదారీ విధానం 148
పేద - ధనిక తేడాలు 120, 122
పోటీ 267
ప్రకృతి 11
ప్రజల భావాలు 274
ప్రజాస్వామ్యం 169
ప్రపంచ ధనం 90
ప్యాకింగ్ శ్రమ 250
ఫ్యూడల్ కౌలు 191

## బ

బంగారం 89
బానిసత్వం 115
బానిస యజమానులు 116, 117
బార్టరు పద్ధతి 41, 66
బైటి పనులు 262

## భ

భారీ యంత్రాలు 281
భూమి : అది వస్తువా? 10,
అది ఎవరి ఆస్తి? 113
అది ముడి పదార్థమా, పనిముట్టా, సహాయక పదార్థమా? 19, 154
భూమి కౌలు 142, 168
భూస్వాముల సమాజం 140
భూస్వామ్య కౌలు 189

## మ

మత గ్రంథాలు 134
మానవ వనరులు 292
మానవ సంబంధాలు 110
మారకం ఖర్చు 238
మారకం విలువ 44
మారకం శ్రమలు 256

మారకాలు 38, 39, 122
ముడి పదార్థం 13, 19, 26
మేధావులు 214

## ర

రవాణా శ్రమ 31, 249
రాజ్యపాలన 132
రాజ్యాంగం 169
రికార్డ్లో 212
రూపం లేని శ్రమ 101, 106
రూపం వున్న శ్రమ 101

## ల

లంచాలు 169
లాభం 185, 255, 315

## వ

వడ్డీలు 128, 168, 245
వర్తకం 128
వర్తక కమిషన్ 153, 168
వర్తక కార్మికులు 237
వర్తకం ఖర్చు 238
వర్తక లాభం 128, 248
వర్తక శ్రమలు 237
వర్గాలు 124, 337
వస్తువు 10, 12, 22, 42
వస్తువులూ, సరుకులూ 65
విలువ : మారకం విలువకి పొట్టి పేరు 46, అది వస్తువుకి ఏర్పడే విధానం 49, దాని సూత్రం 51, దాన్ని ఎలా చూడగలం? 53, అది వస్తువు బయట ఎందుకు వుంటుంది? 55, దాని అసహజత్వం 58, అది అంతా శ్రమదే 60, శ్రమతో దాని సంబంధం 99, దాని గురించిన పరిశోధన 211.
విమానాలు 281
విలువ రూపం 84
వ్యవసాయ పెట్టుబడి 196

## శ

శత్రు వర్గాలు 123
శ్రమ : దాని అర్థం 28-30, వస్తువుల్ని తయారు చెయ్యని శ్రమలు 31, ప్రతీ పనీ శ్రమ కాదు 34, పాత శ్రమా, కొత్త శ్రమా 50, గత శ్రమ 50, నిర్జీవ శ్రమ 50, సజీవ శ్రమ 50, శ్రమ కనబడుతుందా? 62, శ్రమల స్వభావంలో తేడాలు 96, వాటి విలువల్లో తేడాలు 97, విలువతో దాని సంబంధం 99.
శ్రమ క్రమం 154
శ్రమ దోపిడీ : దాని అర్థం 113, దాని గురించి బానిసలకూ, వాళ్ళ యజమానులకూ తెలుసా? 122, దాన్ని గ్రహించడం ఎప్పుడు సాధ్యం? 148, దాని రహస్యాన్ని కనిపెట్టిం దెవరు? 217.
శ్రమ విలువ 177
శ్రమ శక్తి విలువ 177, 294
శ్రమ సంబంధాలు 110, 264

## స

సజీవ శ్రమ 50
సమ సమాజం 355
సరుకు విలువ 155, 248
సరుకులు 65
సహాయ పదార్థాలు 24 - 28
సాధనాలు 13
స్వంత ఆస్తి : దానిలో రకాలు 126
స్వతంత్ర ఉత్పత్తిదారులు 125
స్వతంత్ర వర్తకులు 244
స్వతంత్ర శ్రామికులు 125
స్టోరు శ్రమ 249
సైంటిస్టులు 269

★